వాడ్రేవు చినవీరభద్రుడు

నన్ను వెన్నాడే కథలు

దేశవిదేశ సాహిత్యాలనుంచి

వాడ్రేవు చినవీరభద్రుడు

నన్ను వెన్నాడే కథలు

దేశవిదేశ సాహిత్యాలనుంచి

குமார
KUMARAP
Anna
Karenina

వాడ్రేవు చినవీరభద్రుడు

నన్ను వెన్నాడే కథలు

దేశవిదేశ సాహిత్యాలనుంచి



NANNU VENNADE KATHALU

An anthology of short stories from across the globe, compiled with an introduction by
Vadrevu Chinaveerabhadrudu

January 2026

Front cover image and interior illustrations generated with Google Gemini.

Back cover photography: A.Gangareddy

Cover design, typesetting and lay-out
Chinaveerabhadrudu Vadrevu

e-book released by
Vadrevu Ch Veerabhadrudu
First Floor, 56, Navodaya Colony
Mehdipatnam, Hyderabad
Telangana state, 500 028

chinaveera@gmail.com
+9194909 57129

For more resources please visit
www.chinaveerabhadrudu.in

పుస్తకప్రేమికుల పెన్నిధి

బంగారు రామాచారికి

వరసగా

ప్రతి ఒక్క కథా ఒక పాఠం 9

1 కమలేశ్వర్

వేసవికాలం 11

డా.జె.భాగ్యలక్ష్మి

2 అరవింద గోఖలే

మంజుల 24

సోమంచి యజ్ఞన్నశాస్త్రి

3 కె.సదాశివ

కొళాయిలో నీళ్ళు వచ్చినవి 42

గడియారం రామకృష్ణశర్మ

4 రవీంద్రనాథ టాగోరు

పోస్ట్ మాష్టరు 53

మద్దిపట్ల సూరి

5 చెహోవ్

కుక్కను వెంటబెట్టుకున్న మహిళ 65

రాచమల్లు రామచంద్రారెడ్డి

6 శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ

మహేశం 90

పురిపండా అప్పలస్వామి

7 టాల్ స్టాయి
కోడిగుడ్డంత గోధుమగింజ 108
భమిడిపాటి కామేశ్వరరావు

8 కర్తార్ సింగ్ దుగ్గల్
మహత్యం 117
అరిగపూడి రమేశ్ చౌదరి

9 కు.ఆళగిరి స్వామి
కుమారపురం స్టేషను 127
చల్లా రాధాకృష్ణశర్మ

10 వ్యంకటేశ మాడ్గూళ్కర్
ఆంజనేయస్వామివారు 149
సోమంచి యజ్ఞన్నశాస్త్రి

11 మక్సీం గోర్కీ
మానవుని జననం 158
రాచమల్లు రామచంద్రారెడ్డి

12 లూసన్
ప్రతీకారం 177
వాడ్రేవు చినవీరభద్రుడు

13 ప్రేమ్‌చంద్
సాల్టు యినస్పెక్టరు 182
వాడ్రేవు చినవీరభద్రుడు

14 ఫ్రాంజ్ కాఫ్కా
తీర్పు 196
పాలగుమ్మి పద్మరాజు తదితరులు

15 మేరీ లూయీ కాష్నిట్జ్
దుక్కపిల్ల 215
కొడవటిగంటి కుటుంబరావు

16 జయశంకర ప్రసాద్
గుండా 226
వేమూరి రాధాకృష్ణమూర్తి

17 గంగాధర గాడ్గిల్
మొహంలేని సాయంకాలం 245
సోమంచి యజ్ఞన్నశాస్త్రి

18 నొరైర్ ఆదాల్యాన్
ఒంటెలు వెళ్ళిపోతాయి,
పర్వతాలు ఉండిపోతాయి 256
నిడమర్తి ఉమారాజేశ్వరరావు

19 మపాసా
బెడ్ నెంబరు 29 269
వాడ్రేవు చినవీరభద్రుడు

20 ఓ హెన్రీ
పూర్తికాని కథ 290
వాడ్రేవు చినవీరభద్రుడు

ప్రతి ఒక్క కథా ఒక పాఠం

నలభయ్యేళ్ళ కింద తెలుగు కథాసంపుటాలు చదివే కొద్దీ, భారతీయ సాహిత్యాల్లోంచీ ప్రపంచ సాహిత్యాల్లోంచీ కూడా కథలు చదవాలనిపించేది. అదృష్టవశాత్తూ, నేషనల్ బుక్ ట్రస్టు, సాహిత్య అకాదెమీలతో పాటు దక్షిణభారత పుస్తక సంస్థవారు ప్రచురించిన చాలా కథాసంపుటాలు నా చేతుల్లోకి వచ్చాయి. ముఖ్యంగా రాజమండ్రిలో ఉన్న రోజుల్లో, ఎక్కడెక్కడి అనువాద పుస్తకాలూ, ఎవరో దేవదూత నాకోసం పంపిస్తున్నట్టుగా, నాకు అందుతూండేవి. విశ్వకథావీథితో పాటు, టాల్‌స్టాయి, గోర్కీ, చెకోవ్, లూసున్, ప్రేమ్‌చంద్, టాగోర్‌ల కథలు అప్పుడే చదివాను.

అప్పుడప్పుడే నేను కథలు రాయడం మొదలుపెట్టాను కూడా. అయితే, ఎవరేనా కథలు ఎలా రాయాలో తెలుసుకోవాలనుకుంటే, గొప్ప కథలు చదవడానికి మించిన అభ్యాసం మరొకటి లేదని తొందరలోనే అర్థమైంది. తర్వాత తర్వాత ప్రపంచ కథకుల కథాసంపుటాలు నాకు అందుబాటులోకి వచ్చాక, ప్రపంచకథావికాసం గురించి పెద్ద పుస్తకం రాయాలని ఒక ప్రాజెక్టు మొదలు పెట్టాను. అందులో మొదటిభాగంగా 'కథలు ఎలా పుట్టేయి' (2025) ఇప్పటికే వెలువరించాను కూడా.

రాజమండ్రిలో చదివిన పుస్తకాలు, చాలాకాలంగా అందుబాటులో లేకుండా పోయినవి, డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా వారి పుణ్యమా అని ఈ మధ్య మళ్ళా

అందుబాటులోకి వచ్చాయి. అవి చేతుల్లోకి రాగానే ఆ కథల్లో ఇన్నేళ్ళుగా నాకు ఏవి గుర్తున్నాయో వాటికోసం వెతుక్కున్నాను. వాటిని మళ్ళా చదువుతుంటే, అవి మళ్ళా అంతే కొత్తగా, అంతే ఫ్రెష్‌గా, అంతే ఆసక్తికరంగా కనిపించాయి. అందుకని వాటిని ప్రతి వారం నా బ్లాగులో మిత్రుల్తో పంచుకుంటూ వచ్చాను.

మొత్తం ఇరవై కథలు. చీనానుంచి అమెరికా దాకా, కాకసస్ నుంచి ఇడైసేవల్ దాకా, మానవజీవితాన్ని చిత్రించిన కథలు. ఇందులో నాలుగుకథలు నేనే అనువదించాను కూడా. వీటినిలా పుస్తకరూపంలో పంచుకుంటున్నందుకు మరీ సంతోషంగా ఉంది. కొత్తగా కథలు రాసేవాళ్లకి ఇందులో ప్రతి ఒక్క కథా ఒక పాఠం.

ఇందులో పదహారు కథల్ని ఆయాభాషలనుంచి తెలుగులోకి అనువదించిన అనువాదకులకూ, వాటిని తమ సంపుటాల్లో ప్రచురించిన సాహిత్య అకాడెమీ, నేషనల్ బుక్ ట్రస్టు, దక్షిణభారత పుస్తకసంస్థ, ప్రగతి ప్రచురణాలయం, అద్దేపల్లి అండ్ కో, కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు సమర్పించుకుంటున్నాను.

ఈ పుస్తకంలో కొన్నికథలకేనా బొమ్మలుంటే బాగుంటుందనిపించింది. అందుకని గూగుల్ జెమిని ద్వారా కొన్ని బొమ్మలు వేయించాను. ఏ.ఐ లో గొప్ప సుగుణ-మేమిటంటే, అది విసుక్కోదు. అందుకని, నేననుకున్నట్టుగా బొమ్మలు వచ్చేదాకా, మళ్ళీ మళ్ళీ ఎన్నిసార్లు గీయించినా విసుక్కోకుండా గీసిపెట్టింది. ముఖచిత్రం కూడా అది గీసిందే.

ఈ కథలు మళ్ళీ నాకు అందుబాటులోకి తెచ్చినందుకు బంగారు రామాచారికి, ఆదిత్య కొర్రపాటికి, అనిల్ బత్తులకు, అన్నమయ్య గ్రంథాలయం వారికి ఎన్ని ధన్యవాదాలు చెప్పినా చాలదు. మరీ ముఖ్యంగా బంగారు రామాచారి పుస్తకప్రేమికుల పెన్నిధి. అందుకని, చంద్రునికో నూలుపోగులాగా, ఈ పుస్తకం ఆయనకి కానుక చేస్తున్నాను.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**

29-1-2026

1

నేషనల్ బుక్‌ట్రస్టు వారు ప్రచురించిన 'కథాభారతి: హిందీ కథలు' నా చేతుల్లోకి మొదటిసారి వచ్చింది, 1979 లో. అందులో ఫణీశ్వరనాథ్‌వర్మ 'రేణు' 'మూడో ఒట్టు' కథ నన్నెట్లా వెన్నాడిందీ, ఇంతకు ముందు మీతో పంచుకున్నాను. 'ఆ వెన్నెల రాత్రులు' నవల రాయాలనుకోవడం వెనక ఆ కథ కూడా ఒక స్ఫూర్తి.

ఆ కథాసంకలనంలోనే 'వేసవికాలం' అనే కథ కూడా ఈ నాలుగు దశాబ్దాలుగానూ నన్ను వదిలిపెట్టకుండానే ఉంది. ఆ కథకుడు ఎవ్వరో అప్పుడు నాకు తెలీదు. కథతో పాటే ఆ కథకుడి పేరు కూడా పుస్తకంలో చదివి ఉంటానుగాని, కథకుల పేర్లమీదకి దృష్టి పోయే వయసు కాదది. నేను రాజమండ్రిలో ఉన్నప్పుడు, కథలు రాయడం మొదలుపెట్టాక, ఈ కథలో 'వేసవికాలం' గురించి రాసినట్టు వర్షాకాలం గురించి రాయాలనే ఒక కోరిక చాలా బలంగా ఉండేది. రాజమండ్రి వదిలిపెట్టినా కూడా ఆ కోరిక నన్ను వదిలిపెట్టలేదు.

చివరికి రెండేళ్ళ కిందట, 'రెండు ప్రపంచాలు' అనే కథ రాసినదాకా, ఆ బరువు నన్ను పీడిస్తూనే ఉంది. ఇప్పుడు మీరు ఈ కథ చదివి, 'రెండు ప్రపంచాలు' కథ చదివితే, మీకెలాంటి పోలికా కనిపించదు. ఆశ్చర్యం లేదు, ఎందుకంటే, ఆ కథని స్ఫూర్తిగా తీసుకున్నాను తప్ప, యథాతథంగా అనుకరించలేదు కాబట్టి.

ఈ కథా రచయిత కమలేశ్వర్ (1932-2007) ఇరవయ్యవ శతాబ్దపు హిందీ రచయితల్లో అగ్రశ్రేణి రచయిత. ఉత్తరప్రదేశ్‌లో మైనీపూరులో పుట్టిన కమలేశ్ నవయవ్వనపు రోజుల్లో రివల్యూషనరీ సోషలిస్టు పార్టీలో చేరాడు. మార్క్సిస్టుగా జీవితం మొదలుపెట్టాడు. విప్లవ కార్యకలాపాల్లో వార్తాహరుడిగా పనిచేసాడు. ఆ తర్వాత ఢిల్లీలో, ముంబైలో చాలా పత్రికల్లో పనిచేసాడు.

హిందీ సాహిత్యంలో 50 ల్లో తలెత్తిన 'నయీ కహానీ' ప్రభంజనంలో మోహన్ రాకేశ్, నిర్మల వర్మలతో పాటు కమలేశ్వర్ కూడా ప్రధాన పాత్ర వహించాడు. నెమ్మదిగా హిందీ ఫిల్మురంగం ఆయన్ని అక్కున చేర్చుకుంది. 'ఆంధీ', 'మౌసమ్' లాంటి సినిమాలకి కథకుడు, 'సారా ఆకాశ్', 'ఛోటీ సీ బాత్', 'బర్నింగ్ ట్రెయిన్' లాంటి సినిమాలకు సంభాషణలు రాసాడు.

దేశ విభజన నేపథ్యంగా రాసిన 'కిత్నే పాకిస్తాన్' నవల ఇంగ్లిషులోకి కూడా అనువాదమయ్యింది. రెండేళ్ళ పాటు దూరదర్శనుకు అడిషనలు డైరక్టరు జనరలుగా పనిచేసాడు. ఆ కాలంలోనే దూరదర్శన్ నెట్‌వర్కు దేశమంతా విస్తరించింది. భారతప్రభుత్వం ఆయన్ని పద్మభూషణ్ గౌరవంతో సత్కరించింది.

కమలేశ్వర్ రాసిన 'గర్మియోం కే దిన్' కథని జె. భాగ్యలక్ష్మిగారు 'వేసవికాలం' అని చేసారు. దాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన సతీష్ వర్మ, కుష్వంత్ సింగులు Summer Days అని



చేసారు. కాని నేనైతే 'ఉక్కపోస్తున్న దినాలు' అని పేరుపెట్టి ఉండేవాణ్ణి.

'గర్మియోం కే దిన్' కమలేశ్వర్ తొలిదశలో, అంటే 1952-59 మధ్యకాలంలో, రాసిన కథ. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దపు రోజులనాటి కథ. ఆ రోజుల్లో తననీ, తన కథల్నీ, తన కథల్లోనీ పాత్రల్నీ నడిపించింది జీవితం పట్ల disagreement (అసహమతి) అని చెప్పుకున్నాడాయన.

'మేరీప్రియ కహానియాఁ' (1976) సంపుటానికి రాసుకున్న ముందుమాటలో Stories are basically a medium of disagreement for me అని చెప్పుకున్నాడు. అంతేకాదు, తాను రాసిన కథలు తాను ఎప్పటికప్పుడు తీసుకుంటూ వస్తున్న నిర్ణయాలకు సంబంధించిన కథలని కూడా చెప్పుకున్నాడు.

కథని 'సౌందర్యాత్మక', 'సాహిత్యశాస్త్ర' దృక్పథం తో చూడటం తనకిష్టం లేదనీ, తాను రాసిన కథలు తానెలా రాసాడో తనకు తెలియదనీ చెప్తూ, ప్రతి ఒక్క కథా ఒక 'నిర్ణయకేంద్రిత ప్రక్రియ' అనీ, అది ఎప్పటికప్పుడు మారిపోతూ వస్తున్నదని కూడా చెప్పుకున్నాడు.

కాబట్టి సాధారణమానవుడి జీవితప్రయాణంలో అతడికి తోటియాత్రీకుడుగా నడవడమొక్కటే నేటికాలపు కథకుడు చెయ్యవలసింది అని కూడా అన్నాడు.

ఆ ముందుమాటలో చివర ఈ వాక్యం రాసుకున్నాడు:

'నాకు పాత్రలెప్పుడూ కథలనివ్వలేదు. అవి ఏ స్థితిలో ఉన్నాయో ఆ స్థితులే నాకు కథల్ని ప్రసాదించాయి.'

వేసవికాలం అటువంటి 'స్థితి' గురించిన కథ. అందులో వైద్యజీ, అతడికి సైన్ బోర్డు రాసిపెట్టిన చందర్, ఆ దుకాణానికి మెడికల్ సర్టిఫికెటు కోసం వచ్చిన కోసన్ స్టేషన్ కూలీ, అతణ్ణి పంపిన సోబరన్ సింగ్, తాయెత్తు కట్టించుకోడానికి వచ్చిన పాండురోగి, బచ్చన్‌లాల్ లాంటి పక్క దుకాణదారులూ, కొంతసేపు ఆ దుకాణంలో పెట్టమని ఒక పెద్ద డబ్బా పంపిన ఠాకూరుసాబ్, ఆ ముందురోజే గుర్రబ్బండి కొన్న సుఖదేవ్‌బాబు– అసలు ఉత్తరప్రదేశ్‌లో అప్పుడప్పుడే పట్టణంగా మారుతున్న ఆ బస్తీ మొత్తం, ఆ వేసవికాలం మధ్యాహ్నం, ఒక పరిస్థితిలో ఉంది. ఆ పరిస్థితి ఒకరకంగా స్వతంత్రభారతదేశపు పరిస్థితి కూడా. సరుకులో నాణ్యత కన్నా సైన్‌బోర్డు ముఖ్యమని భావించే కొత్త జాగృతి ఒకటి ఆవరిస్తూ ఉన్న కాలం.

ఆ కథ ఒక 'స్థితి'ని చిత్రిస్తున్నట్టు ఉన్నప్పటికీ, అందులో చాలా చలనం ఉంది. చాపకింద నీరులాగా కాలం గతిశీలకంగా ప్రవహిస్తూ ఉంది. ప్రతి ఒక్క పాత్రా ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితిలో మనకి కనబడుతుంది. అయిదు రూపాయలు ఖర్చుపెట్టి సయ్యద్ ఆలీతో బోర్డు రాయించుకోలేక, అణా అణా ఆదా చేసి బోర్డు రాయించుకున్న వైద్యజీకి, నాలుగు రూపాయల ఆదాయాన్నివ్వగల మెడికల్ సర్టిఫికెటు క్లయింటు చేతుల్లోంచి జారిపోడం కథలో ముఖ్య సంఘటన. ఆ కూలీ మళ్ళా వస్తాడనే నమ్మకంతో, ఆ ఎండవేళ, ఇంటికి భోజనానికి కూడా పోకుండా, ఆ ఉక్కలోనే, ఆ వేడిలోనే వైద్యజీ ఎదురుచూస్తుండటంతో కథ ముగుస్తుంది.

నేను మొదటిసారి చదివినప్పుడు, ఈ కథ నన్ను ఆకట్టుకున్నప్పుడు, ఈ కథలో ఇంత లోతు ఉందని నాకు తెలీదు. ఈ కథ రాసిందొక చేయి తిరిగిన కథకుడని కూడా తెలీదు. అయినా కూడా ఈ కథ నన్ను పట్టుకుంది. గొప్పకథలకుండే ప్రాథమిక లక్షణం అదేననుకుంటాను.

కమలేశ్వర్

వేసవి కాలం

జె. భాగ్యలక్ష్మి

టాక్సు ఆఫీసు హడావిడిగా ఉంది. దాని గుమ్మం వద్ద ఇంద్రధనుస్సు రంగులలో బోర్డులున్నాయి. సయ్యద్ అలీ ఈ బోర్డులను చాల శ్రమపడిచక్కగా పెయింటు చేశాడు. ఆ ఊర్లో చూస్తూ ఉండగానే దుకాణాలు పెరిగిపోయాయి. అన్నిటికీ సైన్‌బోర్డులు వ్రేలాడుతున్నాయి. సైన్‌బోర్డు తగిలిస్తే షాపుకు గొప్పతనం వస్తుంది. చాలా రోజుల క్రితం దీనానాథ్ తన హల్వా దుకాణానికి సైన్‌బోర్డు పెట్టించగానే అక్కడ పాలు త్రాగేవాళ్ల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. బోర్డుల వెల్లువ ప్రారంభమయింది. 'ఓం-జైహింద్' బోర్డులతో ప్రారంభించి 'ఒకసారి తప్పకుండా పరీక్షించండి', 'కల్తీ ఉందని ఋజువు చేస్తే వంద రూపాయలబహుమానం' అనే బోర్డుల వరకూ వచ్చింది.

టాక్సు ఆఫీసు పేరు మూడు భాషలలో వ్రాశారు. ఛేర్మెన్ చాలాతెలివైనవాడు. అతని తెలివితేటలను అందరూ పొగుడుతుంటారు. అందుకే సైన్‌బోర్డులు హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో వ్రాయించారు. దూరదూరంనుండి నాయకులు ఉపన్యాసాలివ్వటానికి వస్తుంటారు. దేశవిదేశాలనుండి ఎంతోమంది ఆగ్రాలోని తాజ-మహల్ చూసి తూర్పుదేశానికి ప్రయాణిస్తూ ఈ దారినే వెళ్తారు. వాళ్ళపై ఈ సైన్‌బోర్డుల ప్రభావం ఉంటుంది. ఇక సైన్‌బోర్డులపై ఋతువుల ప్రభావం, సంతలు, తిరునాళ్ళు జరిగే రోజుల్లో మిఠాయి అంగళ్ళవారు, జూలై, ఆగస్టు నెలలో పుస్తకాలు, కాగితాలు

అమ్మేవారు, పండుగ పబ్బాలకు బట్టల దుకాణాలవారు, వర్షాకాలంలో వైద్యులూ, హకీంలూ వారి వారి సైన్ బోర్డులకు క్రొత్త రంగులు పూస్తుంటారు. మంచి నెయ్యి అమ్మేవాళ్ళు, వాళ్ళ గుడిసెలగోడలపైనే ఇటుకలతోనో ఇంకేదైనా రంగుతోనో వ్రాసుకొని పని గడుపుకొంటారు. ఇది లేకుండా పని జరుగదు. అన్నీ తెలిసినవాడిలా వైద్యమహాశయుడన్నాడు. 'పోస్టరు లేకుండా సినిమావారి పని కూడా జరుగదు. పెద్ద పెద్ద పట్టణాల్లో కిరసన్ అమ్ముకునే వాళ్ళు కూడా సైనుబోర్డులు పెట్టుకొంటారు. సైన్ బోర్డులు చాలా అవసరం. పిల్లా పాపలకుకూడా సైన్ బోర్డులున్నాయి. లేకపోతే పేరు పెట్టడం దేనికి ? సైన్‌బోర్డు పెట్టుకునే సుఖదేవ్ బాబు కాంపౌండరునుండి, డాక్టరయి బ్యాగ్ పట్టుకుని తిరుగుతున్నాడు.'

దగ్గరే కూర్చున్న రామచరణ్ మరో విచిత్రకరమైన విషయం చెప్పాడు : 'నిన్ననే సుఖదేవ్ బాబు బుధాయివాలా ఇక్కాను గుఱ్ఱంతోసహా కొన్నాడు.'

'దాన్ని తోలేదెవరు?' అని రేకు కుర్చీమీద ప్రాణాయామ ముద్రలో కూర్చున్న పండిత్ అడిగాడు.

'ఇదంతా జేబు కొట్టే వేషాలు' అని వైద్య మహాశయుడు అన్నాడు. ఆయన ధ్యాసంతా ఇక్కా బండిమీదే ఉంది. 'రోగుల దగ్గర నుంచే కిరాయి వసూలు చేస్తాడు. పెద్ద పెద్ద ఊళ్లల్లో డాక్టర్లు ఇప్పించినట్లు బండితోలేవానికి కూడా బక్షీష్ ఇప్పిస్తాడు. దీనివల్లే వైద్య వృత్తికి చెడ్డపేరొస్తుంది. రోగుల బాగోగులు చూడాలా లేక తన గొప్పదనం ప్రకటించాలా? ఇంగ్లీషు వైద్యమంటూ రోగి ప్రాణం సగం ముందే తీసేస్తాడు–ఆయుర్వేద వైద్యుడయితే నాడి చూడకుండానే మొహం చూసి రోగం కనుక్కుంటాడు. ఈ వృత్తిలో ఇక్కా బండితో ఒరిగేదేముంది? ఈలాగేచూస్తూ వుండు. కొన్నాళ్ళకు బండి తోలేవాడు కూడా కాంపౌండరు అవుతాడు..' మాట మధ్యలోనే వైద్యజీ జీవంలేని నవ్వు నవ్వాడు. 'ఎవరేమి చెప్పగలరు? డాక్టరీ తమాషా అయిపోయింది. వకీళ్ల, ముక్తార్ల కొడుకులందరు డాక్టర్లయి పోతున్నారు.'

అది అసలు వంశపారంపర్యంగారావాలి. వైద్యుని కొడుకు వైద్యుడవుతాడు. సగం విద్య చిన్నతనంలోనే మూలికలు, ఇతర సరంజామాలు నూరటంతోనే నేర్చుకుంటాడు. తులము, మాసము, రత్తి అన్ని కొలతలూ తూచకుండానే అందాజుగా తెలుసుకొంటాడు. ఔషధం అశుద్ధమయ్యే మాటే లేదు. ఔషధం తయారుచేసే తీరులోనే

దాని గొప్పదనం ఉంది... ధన్వంతరి. ..' ఎవరో దుకాణంలోకి రావడం చూసి వైద్యజీ మాట ఆపేశాడు. అక్కడ కూర్చున్న వారితో తను బాతాఖానీ పెట్టుకున్నట్టుగాక వాళ్ళందరూ తన రోగులైనట్టు మొహం పెట్టాడు.

ఆ మనిషి దుకాణంలోకి రావటంతోనే, ఎందుకొచ్చాడో గ్రహించేశాడు వైద్యజీ. చాలా నిర్లక్ష్యంగా చూచాడు. కాని ఈ లోకంలో పై పైమెరుగులకు ఎంతో విలువుంది. వీడే రేపు జబ్బు పడొచ్చు, లేకపోతేవీళ్ళింట్లో ఎవరైనా జబ్బు పడొచ్చు. అందుకే కొంచెం జాగ్రత్తగా హుందాగా వ్యవహరించాలి. తనని తాను సంబాళించుకుని 'ఏమిటి, అంతా బాగున్నారా?' అని అడిగాడు. అతను సమాధానమిస్తూ తల పైనున్న ఒక పెద్ద డబ్బాను క్రిందకు దించి 'ఠాకూరు సాబ్ ఇక్కడపెట్టమన్నారు. ఒంటిగంటా ఒంటిగంటన్నర ప్రాంతంలో మార్కెట్ నుండి తిరిగి వస్తూ దీనిని తీసుకుపోతారు.'

'అప్పటికి దుకాణం మూసేస్తాము.' కొంచెం చికాగ్గా అన్నాడు వైద్యజీ. 'హకీమ్, వైద్యుల దుకాణాలు రోజంతా తెరిచి ఉండవు. మేమేమీవ్యాపారం చేసుకునే వాళ్ళం కాదు.' ఇంకెప్పుడైనా వీడి అవసరమొస్తుందేమోననే ఆశతో కొంచెం సర్దుకొని 'సరే, ఆయనకేం ఇబ్బందికలుగదులే. మేము లేకపోతే మా ప్రక్క దుకాణంలో పెట్టిస్తానులే' అన్నాడు.

ఆ వ్యక్తి వెళ్ళగానే వైద్యజీ అన్నాడు: 'మద్యనిషేధంతో ఒరిగేదేముంది? ఇది అమల్లోకి వచ్చినప్పటినుంచీ, ఇంటింటా బట్టీలు తయారయ్యాయి. సారాయి నెయ్యిలా అమ్ముడు పోతుంది. ఇక డాక్టర్ల సంగతిచెప్పాలా? ..వారి దుకాణాలు సారా దుకాణా-లయ్యాయి. మందులా వాడటానికి అనుమతి దొరుకుతుంది. కాని బాహాటంగా జింజరులా అమ్ముతున్నారు. ఏం లాభంలేదు. మాకు భంగు, నల్లమందు చిన్న పొట్లం కావలసి వచ్చినా ఎన్నో వివరాలు అడుగుతారు.'

'బాధ్యతగల విషయం మరి' అన్నాడు పండిత్.

'ఇప్పుడు బాధ్యతంతా వైద్యుడిదే అయినట్లుంది. అందరి రిజిష్టరీ అయిపోయింది. ఎవరుబడితే వాళ్ళు వైద్యం చేసే కాలం పోయింది. ఇప్పుడు రిజిష్టరయిన వాళ్ళే వైద్యం చెయ్యాలి. చూర్ణం అమ్ముకొనే వాళ్ళు కూడా వైద్యులుగా చలామణి అయ్యేవారు. ఇప్పుడంతా సాగదు.. లక్నోలో సర్కారువాళ్ళు పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత అంతా చక్కబడింది.'

వైద్యజీ మాటలేమీ రుచించక పోవటంతో పండిత్ పైకి లేచాడు.వైద్యజీ లోపలికి అడుగేసి బోర్డు వ్రాస్తున్న చందర్ నుద్దేశించి, 'దీనిలో తెల్లరంగు చిక్కగా ఉంది. కొంచెం టర్పెంటయిన్ కలుపు' అంటూ ఒక సీసా తనే తెచ్చాడు. దాని మీద అశోకారిష్ట లేబిల్ ఉంది.

ఇదే విధంగా ఏయే మందుల శరీరాలలో (సీసాలలో) ఏయే (పదార్థాల) ఆత్మలున్నాయో మరి, ఎదురుగా అలమార్లో పెద్ద పెద్ద సీసాలున్నాయి. వాటి మీద రకరకాల అరిష్టాల, ఆసవాల పేర్లు అంటించి ఉన్నాయి. మొదటి వరుసలో ఈ సీసాలున్నాయి. వాటి వెనుక అవసరమైన ఇతరసామగ్రి ఉంది. బల్ల మీద తెల్ల సీసాల వరుస ఉంది. వాటిల్లో ఏవో స్వాదిష్టచూర్ణాలు.. భాస్కరలవణం ఇత్యాది వస్తువు–లున్నాయి. తక్కిన సీసాలలో ఏముందో కేవలం వైద్యునికే ఎరుక.

టర్పెంటయిన్ కలిపి చందర్ మరలా వ్రాస్తున్నాడు– 'ప్రొఫెసర్ కవిరాజ్. నిత్యానంద్ తివారి.' పై పంక్తిలో 'శ్రీ ధన్వంతరీ ఔషధాలయం.' అని వైద్యజీ స్వయంగా వ్రాశాడు. ఆ తెల్లటి అక్షరాలు దూదిపింజల్లా ఉన్నాయి. పైన ఖాళీ స్థలం చూసి వైద్యజీ అన్నాడు: 'బాబూ, పైన జైహింద్ అని వ్రాయి.. ఇక్కడ మిగిలిన స్థలంలో ఒక ప్రక్క ద్రాక్షాసవం సీసా, ఇంకో వైపు పింగాణి కల్వం బొమ్మ వేయి.. ఆర్టు మాకు ఎనిమిదో తరగతి వరకే ఉండేది. కాకపోయినా ఇదంతా అభ్యాసంతో వచ్చేస్తుంది.'

చందర్‌కు ఓపిక సన్నగిల్లుతోంది. అనవసరంగా ఇక్కడ చిక్కుకున్నాడు. తన చేతి వ్రాత బాగున్నందుకు తనకు పట్టిన గతి ఇది. 'ఎవరైనా పెయింటరుకు యిస్తే బాగా వ్రాసేవాడు' చెమట తుడుచుకొంటూ కుంచె క్రింద పెట్టాడు చందర్.

'వాడికయితే అయిదు రూపాయలివ్వాలి నాయనా.. రెండు లైన్లు వ్రాసినందుకే. నేను శ్రమపడినందుకు పది పన్నెండు అణాలలోనే తయారయింది. ఈ రంగులు కూడా మా పేషెంటు ఒకడు ఇచ్చిపోయాడు. ఎలక్ట్రిక్ కంపెనీ పెయింటరుకు అజీర్ణ రోగం ఉండేది. రెండు డోసుల మందిచ్చేను. డబ్బులు తీసుకోలేదు. వాడు రెండు మూడు రంగులు, కొంచెం వార్నిష్ ఇచ్చిపోయాడు. రెండుపెట్టెల రంగుతో ఈ బోర్డు తయారయింది. ఒకటో, ఆరో కుర్చీకి కూడా రంగు సరిపోతుంది.. నీవు ఆ మాత్రం వ్రాయి చాలు. ఎర్రరంగు షేడ్ నేనిస్తాను.. బార్డరు మూడు రంగుల్లో ఉంటే బాగుంటుందా?' అని వైద్యజీ అడిగి తనకు తానే సమాధానపడ్డాడు.

చందర్‌కు చాలా ఉక్కగా ఉంది. మధ్యాహ్నం అయ్యే కొద్దీ, రోడ్డు పైన దుమ్మూ, వడగాలీ ఎక్కువవుతున్నాయి. మొహమాటం కొద్దీ చందర్ కాదనలేకపోయాడు. విసనకర్రతో తన వీపు గోక్కుంటూ, కరణాల రిజిష్టర్లు, పెద్ద పెద్దవి, తన ముందేసుకు కూర్చున్నాడు వైద్యజీ.

ఎండ వేడికి తాళలేక దుకాణం తలుపు రెక్క మూసి ఖాళీ రిజిస్టర్లలో కౌలుదార్ల పట్టా వివరాలు నకలు చేస్తూ కూర్చున్నాడు. చందర్ 'ఇదంతా ఏమిటి వైద్యజీ' అని అడిగాడు.

వైద్యజీ తలెత్తి చూశాడు. 'ఊరికే కూర్చుంటే లాభమేముంది? ఏదైనా పని చూసుకుంటే మేలు. క్రొత్తగా వచ్చే ఈ గవర్నమెంటు గ్రామాధికార్లకు లెక్కా-పక్కా రాదు. ప్రతి రోజూ రెవెన్యూ ఇనస్పెక్టర్లూ, డిప్యూటీ తాసిల్దార్లు మందలిస్తూనే ఉంటారు. విధిలేక వాళ్ళందరూ ఎవరెవరికో డబ్బిచ్చి పని చేయించుకొంటున్నారు. మునుపటి కరణాలు ఇప్పుడెక్కడున్నారు? గ్రామ వివరాలన్నీ వాళ్ళ నోట్లోనే ఆడుతుండేవి. పాపం వాళ్ళ నోటి దగ్గరి తిండి లాక్కున్నారు. నిజం చెప్పాలంటే ఇప్పుడు కూడా వాళ్ళే ఈ పనులన్నీ చేస్తున్నారు. క్రొత్త వాళ్ళ జీతం డబ్బులన్నీ ఈ పనులు చేయించుకున్నందుకే అర్పణమయిపోతున్నాయి. వాళ్ళకు కడుపు నిండాలి కదా.. రైతుల నుండి రెండు, మూడు రూపాయలు వసూలు చేస్తుంటారు. వసూలు చేయకపోతే ఏం తింటారు మరి? ఇద్దరు, ముగ్గురు గ్రామాధికార్లు నాకు తెలుసు. వాళ్ళ దగ్గర నకలు చేయటం రిజస్టర్లు నింపటం వంటి చిన్నా పెద్దా పనులు దొరుకుతుంటాయి.'

బయట జనం పలుచబడి పోతున్నారు. ఆఫీసుల్లో పని చేసేవాళ్ళు వెళ్ళిపోయారు. ఎదురుగా టాక్సు ఆఫీసు వద్ద వట్టి వేర్ల తడకలపై నీళ్ళు చల్లుతున్నారు. దూరంగా రావి చెట్టు ఆకుల గలగల వినిపిస్తుంది. అప్పుడే ఒక వ్యక్తి తలుపులో నుండి లోపలికి తొంగిచూశాడు. వైద్యజీ మాటలు ఆగిపోయాయి. అతని కళ్ళు ఆగంతకుని పరీక్షగా చూశాయి. మనిషి గంభీరంగా మారిపోయాడు. 'ఒక బోర్డు ఆగ్రాలో తయారవుతోంది. అది వచ్చే వరకు దీనితో పనిసాగుతుంది. వీటన్నిటినీ పట్టించుకునేంత తీరుబడి ఎక్కడుంది?..' అంటూ ఒకేసారిగా వ్యవహారంలోకి దిగుతూ వచ్చిన వ్యక్తిని అడిగాడు: 'ఏమిటయ్యా?' 'డాక్టరు సర్టిఫికెట్ కావాలి.. కోస్మా టేసన్లో పోర్టరుగా పని చేస్తున్నాను' రైల్వేపోర్టర్ల నీలం యూనిఫారంలో ఉన్న అతను అన్నాడు.

వైద్యజీ వాడి అవసరాన్ని పూర్తిగా అంచనా వేసుకుంటూ 'ఏ తారీఖు నుండి ఏ తారీఖు వరకు కావాలి?' అని అడిగాడు.

'పదిహేను రోజుల కోసం ముందే వచ్చాను. ఇంకా ఏడు రోజులకు.'

ఏదో లెక్కలు గట్టి వైద్యజీ అన్నాడు: 'నీకు మంచి సర్టిఫికెటు ఇస్తాను. సర్కారు వాళ్ళ రిజిస్టరు నంబరు కూడా ఇస్తాను. అంతటికీ నాలుగు రూపాయలు తీసుకొంటాను.' వాడు వెనక్కి తగ్గుతాడేమోననే భయంతో 'వెనకటిది తీసుకోకపోతే, రెండు రూపాయల్లోనే పనయిపోతుంది' అన్నాడు.

పోర్టరు నిరాశ చెందాడు. వాడికంటె ఎక్కువ హతాశుడయ్యాడు వైద్యజీ. ఏమీ పట్టనట్లు పోర్టరు అన్నాడు: 'సోబరన్ సింగ్ మీ దగ్గరకు పంపాడు.' వీడు చెప్పే ధోరణి చూస్తే అదేదో సోబరన్ సింగ్ పనిలా అనిపించింది. వైద్యజీ అర్థం చేసుకున్నాడు. 'ఇది నాకు ముందే తెలుసు. ముఖపరిచయం లేకుండా మేము సర్టిఫికెట్టు ఇవ్వము. పరువుకు సంబంధించింది కదా! నువ్వెక్కడ ఉంటావో, ఏమి చేస్తుంటావో నాకేం తెలుసు? ఇదంతా ఆలోచించాలి. .. విశ్వాసం మీద పని చెయ్యాల్సి ఉంటుంది. పదిహేను రోజుల క్రితంనుండి నీ పేరు రిజిష్టరులో ఎక్కించాలి. రోగమేమిటో వ్రాయాలి. ప్రతిరోజు నీవు వస్తున్నట్లు నీ పేరు వ్రాయాలి. అప్పుడే పని అవుతుంది.. అంతా కట్టుదిట్టంగా చేయాలి. ..' చందర్ తనను సమర్థించాలన్నట్టు చూశాడు వైద్యజీ. చందర్ అందుకున్నాడు, 'నీకు నిజంగా చేసిందో, ఇంకేదైనా దోపిడీలో ఉన్నావో వీరికేం తెలుసు. ..గవర్నమెంటుతో పని' అన్నాడు.

'ఐదు రూపాయలకు తక్కువయితే ఏ డాక్టరు సర్టిఫికెట్టు ఇవ్వడు. ..' ఈ విధంగా అంటూ వైద్యజీ కరణాల రిజిష్టరు ప్రక్కకు జరుపుతూ నొక్కి చెప్పాడు. 'ఊపిరి పీల్చుకునే సమయం కూడా లేదు. చూడు. ..కనిపిస్తూందా పేరు.. రోగులను వదిలేసి గవర్నమెంటు వాళ్ళకు చూపించటానికి వివరాలతో ఈ రిజిష్టరు తయారు చెయ్యాలి. ప్రతి పేషంటు పేరూ, రోగము, ఆదాయమూ. ..అన్నీ వ్రాయాలి. దీనిలోనే నీ పేరు వ్రాయాలి. నువ్వే చెప్పు రోగులకు మందులివ్వడం ముఖ్యమా లేక నీలాంటి వాళ్ళకు రెండు మూడు రూపాయలకు సర్టిఫికెట్లిచ్చి సర్కారు వాళ్ళ దగ్గర చిక్కుకోవడం మంచిదా?' తహసీల్ ఆఫీసు రిజిష్టరు ఠక్కున మూసేసి, ఏదో ఉపకారం చేస్తున్నవాడిలా మొహం పెట్టి కలంతో చెవి కెలకసాగాడు.

రైల్వే పోర్టరు ఒక నిముషం ఆలోచిస్తూ నిలబడ్డాడు. వైద్యజీ తలవంచుకొని ఏదో పని చేసుకోవటం చూసి, దుకాణంనుండి వెళ్ళిపోయాడు. వైద్యజీ ఒక్కసారిగా తన తప్పు తెలుసుకున్నాడు. విషయాన్ని తెగేవరకూ లాగాడు. అది తెగి ఊరుకుంది. ఏం చెయ్యాలో తోచలేదు. వెంటనే పోర్టర్ని కేకేశాడు. 'ఇదిగో ఇలారా. ..ఠాకూర్ సోబరన్ సింగ్‌కు– నా నమస్కారాలు చెప్పు. ఆయన పిల్లా పాపా అంతా క్షేమమేనా?'

పోర్టరు ఆగి 'ఆ– అంతా బాగున్నారు' అన్నాడు.

వాడు వినేటట్టు చందర్ వైద్యజీ అన్నాడు. 'పది గ్రామాలూ, పట్టణాలు వదిలి ఠాకూర్ సోబరన్ సింగ్ నా దగ్గరికే వైద్యానికి వస్తాడు. నేను కూడా ఆయన పని చేయడానికి సిద్ధంగానే ఉంటాను'. ..చందర్ బోర్డుమీద ఆఖరి అక్షరం వ్రాస్తూ 'వెళ్లిపోయాడా?' అని అడిగాడు.

'తిరిగి తిరిగి వాడే వస్తాడు..' తనకు తాను చెప్పుకొంటున్నట్లుగా– వైద్యజీ అన్నాడు: వాడు రావటం తప్పనిసరి అయినట్లు భావిస్తూ. 'పల్లెటూర్ల వైద్యులూ, వకీళ్ళూ, ఒకేలాగే ఉంటారు. సోబరన్ సింగ్ నా పేరు చెప్పి ఉంటే వాడు తప్పక తిరిగి వస్తాడు. పల్లెటూరి వాళ్ళ బుర్ర కొంచెం మందంగా పని చేస్తుంది. ఎక్కడో కూర్చుని ఆలోచించి వాడే వస్తాడు.'

'ఇంకెవరి దగ్గరనుండయినా వాడు తీసుకుంటే..' అని చందర్ అనబోతుంటే వైద్యజీ మధ్యలోనే కలుగజేసుకొన్నాడు. 'ఉహు – అలా ఎన్నటికీ కాదు..' అంటూ బోర్డువైపు చూసి ప్రశంసాత్మకంగా 'వహ్వా .. చందర్‌బాబూ! సైన్‌బోర్డు బలేగా కుదిరింది.. పని జరుగుతుంది. ఈ అయిదు రూపాయలూ పెయింటరుకు ఇచ్చి, రోగుల నుంచి వసూలు చేయవలసి వచ్చేది. దీనికితోడు ఇక్కా బండి ఖర్చు కూడా పెట్టుకోవలసి వచ్చేది. ముక్కును ముందు నుంచి పట్టుకున్నా, వెనుక నుండి పట్టుకున్నా దానిలో తేడా ఏముంది? సయ్యద్ ఆలీ వ్రాసిన బోర్డుతో రోగుల రోగాలేమీ నయమవ్వవు కదా! అంతా మనలో ఉంది' అంటూ మెల్లగా నవ్వాడు. తన మాటలకే తనకు నవ్వొచ్చిందో ఇతరుల గురించి నవ్వొచ్చిందో తెలీదు.

అప్పుడే ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు. పోర్టరే వచ్చాడనుకున్నాడు వైద్యజీ. అయితే వీడు పాండురోగంవాడు. వాడిని చూడగానే వైద్యజీ మొహం వికసించింది. తను లోపలికి వెళ్ళి ఒక తాయెత్తు తెచ్చాడు.

'ఇక దీని ప్రభావం చూడు. ఇరవై, ఇరవైఐదు రోజుల్లో దీని మహత్తు నీకు తెలుస్తుంది.' అంటూ పాండురోగి చేతికి దానిని కట్టాడు. వాడు ఇచ్చిన చిల్లర జేబులో వేసుకొని గంభీరంగా కూర్చున్నాడు. రోగి వెళ్లగానే 'ఈ విద్య మా తండ్రిగారి దగ్గర నుంచి నేర్చుకున్నాను. ఆయన వ్రాసిన పుస్తకాలెన్నో ఉన్నాయి.. వాటిని నకలు చేద్దామని ఎన్నోసార్లు అనుకుంటూ ఉంటాను.. దానిలోవన్నీ అనుభవంతో వ్రాసినవే. విశ్వాసం ఉండాలి బాబూ. చిటికెడు ధూళితో మనిషి ఆరోగ్యవంతుడవుతాడు. హోమియోపతి వైద్యమంటే ఏమిటనుకున్నావు? చిటికెడు చక్కెర. దేనిమీదయినా విశ్వాసం ఉంటే చాలు' అన్నాడు.

చందర్ వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ 'ఔషధాలయం మూసే సమయమయింది. మీరు భోజనానికి వెళ్ళరా?' అని అడిగాడు.

'నువ్వు వెళ్ళు. నేను పది నిముషాలు ఆగి వస్తాను.' వైద్యజీ తహసీలు రిజిస్టరు ముందుకు లాక్కున్నాడు. దుకాణం తలుపు బార్లా తీశాడు. బయట ఎండకు కళ్ళు జిగేలుమన్నాయి. ప్రక్క దుకాణం బచ్చన్‌లాల్ తన కొట్టు మూసి ఇంటికి వెళ్తూ వైద్యజీ ఔషధాలయం ఇంకా తెరిచే ఉండటం చూసి 'ఇంకా భోజనానికి వెళ్ళలేదా?' అని అడిగాడు.

'లేదు. కొంచెం ముఖ్యమైన పనుంది. అది పూర్తిచేసి వెళ్తాను.' వైద్యజీ నేలపై చాప పరిచాడు. కాగితాలు, రిజిస్టరు బల్లపైనుండి తీసి చాపమీద పరిచాడు. కాని ఎండ ఎండే. చెమట కారిపోతోంది. ఉండుండి విసురుకొంటూ నకలు చెయ్యడం మొదలుపెట్టాడు. కొంచెంసేపు పట్టుదలగా పనిచేశాడు. ధైర్యం సన్నగిల్లింది. లేచి పాత సీసాల మీద దుమ్ము తుడిచి, వరుసగా పెట్టాడు. కాని మండు వేసంగి మధ్యాహ్నం. కాలం ఆగిపోయినట్లనిపించింది. ఒకసారి తలుపులో నుండి వీధి కేసి చూశాడు. రోడ్డు మీద ఒకరిద్దరు కనిపించారు. వచ్చే పోయే జనం తనకు బాసటగా నిలిచినట్లయింది. లోపలికి వచ్చాడు. బోర్డు తీగ సరిచేసి, దుకాణం ముందు వ్రేలాడదీశాడు. దుకాణం మెడకు తాయెత్తు కట్టినట్టు ఆ బోర్డు అమిరింది.

ఇంకొంచెం సమయం గడిచింది. కొంచెం ఉత్సాహం వచ్చింది. చెంబెడు నీళ్ళు త్రాగాడు. పంచె పైకి కట్టి మరలా పని చెయ్యడానికి కూర్చున్నాడు. బయట ఏదో అలికిడి అయింది. ఎవరో అని చూశాడు.

'విశ్రాంతి తీసుకోవటానికి ఇంటికి వెళ్ళలేదా వైద్యజీ' తనకు తెలిసిన ఒక దుకాణదారుడు ఇంటికి వెళ్తూ అడిగాడు.

'వెళ్ళాలనే అనుకొంటున్నాను. కొంచెం పని మిగిలిపోయింది. అది పూర్తి చేసి వెళ్లామనుకొంటున్నాను' గోడకు వీపు ఆనించి కూర్చున్నాడు. చొక్కా తీసి ప్రక్కన పెట్టాడు. రేకుల కప్పు అగ్గిలా మండుతోంది. వైద్యజీ కళ్ళకు నిద్ర కూరుకొస్తూంది. కునుకు పట్టింది. ..సమయం గడిచింది కూడా. ఇక ఉండలేక రిజిస్టర్లను తలగడగా వేసుకొని పడుకొన్నాడు. నిద్ర పట్టినట్టు ఉంది. ..పట్టనట్టూ ఉంది. ..ఎందుకో మరి.

బయట అలికిడికి ఉలికిపడ్డాడు. కళ్ళు తెరిచి లేచి కూర్చున్నాడు. బచ్చన్‌లాల్ ఇంటినుండి తిరిగి దుకాణానికి వచ్చాడు.

'అరె. మీరింకా వెళ్ళనేలేదా?'

వైద్యజీ గట్టిగా విసురుకోసాగారు. బచ్చన్‌లాల్ వెళ్తూ 'ఎవరి కోసమయినా చూస్తున్నారా?' అన్నాడు.

'ఒక పేషంటు వస్తానని చెప్పి వెళ్ళాడు. ..ఇప్పటివరకూ. ..' బచ్చన్‌లాల్ వెళ్ళిపోవటం వైద్యజీ చూశాడు. మాట ఆపేశాడు, తన చెమట ఒత్తుకోసాగాడు.

◆

అలాగే, తొక్కిడిలో, అంధేరి చేరే దాకా నించుంది. ..

2

తెలుగు కాకుండా ఇతర భాషల్లోని కథలతో నాకు పరిచయం కలిగింది సాహిత్య అకాదెమీ, నేషనలు బుక్‌ట్రస్టు వారి కథాసంకలనాల వల్లనే. కాబట్టి కథాసాహిత్యం వరకూ అవి నాకు ప్రాథమిక వాచకాల కింద లెక్క. నలభయ్యేళ్ళ కిందట నా చేతుల్లోకి వచ్చిన ఆ సంకలనాలు ప్రతి ఒక్కటీ పదేపదే చదివేవాణ్ణి. కథలు రాయడానికి కావలసిన మెలకువలు చాలావరకూ ఆ పుస్తకాలనుంచే గ్రహించానని చెప్పినా అతిశయోక్తి కాదు.

అటువంటి సంకలనాల్లో సాహిత్య అకాదెమీ వెలువరించిన 'మరాఠీ కథాసంగ్రహం' (1981) కూడా ఒకటి. అచ్యుత్ కేశవ్ భాగవత్ అనే ఆయన చేసిన ఈ సంకలాన్ని అకాదెమీ కోసం సోమంచి యజ్ఞన్నశాస్త్రి తెలుగుచేసారు. యజ్ఞన్న శాస్త్రి ముంబై మునిసిపల్ కార్పొరేషనులో చాలా పెద్ద ఉద్యోగమే చేసారు. ముంబై ప్రవాసాంధ్రులకి ఆయన ఒక పెద్ద దిక్కుగా ఉండేవాడని చెప్పుకునేవారు. యజ్ఞన్న శాస్త్రి కథలు రాసినప్పటికీ నాటకరంగంలో ఆయన చేసిన కృషికి ఎక్కువ గుర్తింపు లభించింది.

మరాఠీ కథాసంగ్రహం వెలువడిన వెంటనే రాజమండ్రి బుక్‌ఫెయిర్‌లో 83 లోనో 84 లోనో కొనుక్కున్నట్టు గుర్తు. అందులో ప్రతి ఒక్క కథా నన్ను ఆకట్టుకున్నప్పటికీ,

మూడు కథలు మాత్రం నాకు మరవలేనివిగా మిగిలిపోయాయి. ఒకటి, గంగాధర్ గాడ్గిల్ రాసిన 'మొహం లేని సాయంకాలం', రెండవది వ్యంక్యటేశ మాడ్గూళ్కరు రాసిన 'ఆంజనేయ స్వామి', మూడవది–

ఇప్పుడు నన్ను వెన్నాడే కథల్ని పరిచయం చేద్దామనుకున్నప్పుడు ఆ పుస్తకం కావాలని ఆదిత్యని అడిగాను. ఆయన వెంటనే అంద– చేసాడు. నలభయ్యేళ్ళ తరువాత తెరిచాను ఆ పుస్తకం. తెరవగానే ముందు గాడ్గిల్ కథ చదివాను. కాని, కాదు, మరో కథ ఉంది, ఏమిటది? ఆతృతగా పేజీలు తిప్పాను.

ఆశ్చర్యం. ఆ కథ 'మంజుల', ఇప్పుడు మళ్ళా చదువుతుంటే, ఆ పేజీలు మొత్తం, దాదాపుగా మొత్తం వాక్యాలన్నీ నా హృదయంలో ఎప్పుడో స్కాన్ అయిపోయాయని తెలిసొచ్చింది. ఆ పుస్తకంలో నా కళ్ళు పరుగెడుతున్నాయిగాని, హృదయంలో నలభయ్యేళ్ళుగా స్కాను చేసి ఉన్న ఆ పేజీలు నా మనోనేత్రం ముందు తెరుచుకుంటూనే ఉన్నాయి.

అందుకని, ఈ మరాఠీ కథాసంగ్రహం నుంచి ముందు ఆ కథనే పరిచయం చేస్తున్నాను. ఈ రాసిన అరవింద్ గోఖలే (1919-1992) అగ్ర శ్రేణి మరాఠీ కథకుల్లో ఒకరు. వృత్తిరీత్యా వ్యవసాయ శాస్త్రజ్ఞుడు. చాలా కాలం పూణేలో వ్యవసాయ కళాశాలలో పనిచేసాడు. ఒక సాహిత్యపత్రికకి కొన్నాళ్ళు సంపాదకత్వం కూడా వహించాడు.

అరవింద్ గోఖలే

మంజుల

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

రైలుబండి. మధ్యమధ్య ఆగుతోంది. అటూ యిటూ వూగుతోంది. ఒగరుస్తూ పరుగెడుతోంది. ప్రతిపెట్టెలోనూ మనుష్యులు కిక్కిరిసిపోయి కూర్చున్నారు. కూర్చునే బెంచీలు, మధ్య మనుష్యులు నడిచేవారి, అంతా ప్రయాణీకులతో నిండిపోయి, ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కిటికీ, తలుపులు, బుష్ కోట్లతో, చీకలతో, టోపీలతో, ముడుచుకుపోయి కూర్చున్న అవయవాలతో నిండిపోయింది. పెట్టె బయటకూడా ప్రయాణీకులు వేళ్లాడుతున్నారు. చీమలు ఆక్రమించేసుకున్న పాము ఏవిధంగా, మెల్లి మెల్లిగా, బాధతో పాకుతుందో, ఆ విధంగా, పాకుతోంది రైలుబండి. ఈ రైలుబండి వానపాములా రెండువైపులా నడవగలదు. స్టేషను దగ్గిర ఒక్కక్షణం రైలు ఆగితే, లోపలినించి నెట్టుకుంటూ మనుష్యులు బైటపడతారు. దిగిన జనంకంటె ఎక్కువమంది లోపలికి జొరబడడానికి ప్రయత్నిస్తారు.

ఒకటే జనం. ఇళ్ళల్లోనించి, ఫుట్‌పాత్ మీదికి, దానినించి ట్రాములోకి, ఆ తరవాత రైలు ప్లాటుఫారమ్, అక్కడినించి లోకల్ రైలుబళ్ళు. లోకర్ రైళ్లలో జనసమ్మర్దం, అంత్యస్థాయి అందుకుంటుంది. ప్రతి మనిషి, రోజుకి రెండుమార్లు లోకల్ రైలుబండిలో ప్రయాణం చెయ్యాలి. పొద్దున్న ఆఫీసుకి వెళ్లడానికి, సాయంకాలం తిరిగి ఇంటికి చేరడానికి. రెండుమార్లు నరకయాతన అనుభవించాలి. రైలుపెట్టెలో, నించోడానికి

చోటుదొరకడం కష్టం. శరీరం ఎంత కుదించుకు నించున్నా ఎవరికో ఒకరికి తగలక మానదు. కొందరికి అవతలవాడు పెట్టుకున్న హోటు అంచు తగిలేది. ఒక్కొక్కప్పుడు భుజానికి తగిలేది. గట్టిగా ఎవరివో తెలియనివేళ్లు శరీరానికి తగిలేవి. కాలిమీద బూట్లుపడి నొక్కేసేవి. వొళ్లంతా మాలిష్ చేసినట్టు నలిగిపోయేది. అటూ యిటూ దృష్టిపరపి చూడడానికి వీలేలేకుండా, మధ్యన ఇరుక్కుపోవడమే మామూలు. ఒకవేళ దృష్టిని నిగుడించిచూసినా, కనిపించేవేమిటి ? ఓ బట్టతల, మాసినగడ్డం. చెమటతో తడిసిపోయిన పవుడరు చెంపలు, మొహం ఎటూ తిప్పకుండా కిందచూపుతోనే నించుందామన్నా, మనిషి వాసనతో, ముక్కూ నోరూ, నిండిపోయి, కడుపులో తిప్పేస్తుంది. వంటి యెదుట, ముక్కు ముందర లెక్కలేనంతమంది మనుష్యులు, శరీరంలో ప్రతి రంధ్రం నుంచి, చచ్చిన మనసులతో, వాంతిపుట్టించే, మనుష్యులు. కాని సాయంకాలపు ప్రయాణం కొంచెం సుఖంగా వుంటుంది. పొద్దున్న ఎలాగో అలాగ కడుపులో తిండి పడేసుకుని, వెంటనే రైలెక్కాలి. పెట్టెలో అటూ యిటూ తోపులు తింటూ, విసుగ్గా నించుని ప్రయాణం చెయ్యాలి. ఆ తరవాత స్టేషను నుంచి, ఆఫీసుదాకా నడవాలి. ఈగొడవల్లో, పొద్దున్న చేసిన స్నానమూ, ఆ తరవాత చేసుకున్న సింగారమూ వృథా అయిపోతాయి. అంతా పాడయిపోతుంది. సహం సహం నమిలిన చపాతీ కడుపులో అల్లరిపెడుతుంది. ఆ మీద ఆఫీసుగొడవ. సాయంకాలం బండిలో తొక్కిడివున్నా, ప్రయాణం గడబిడగా జరిగినా, ఇంటికెళ్ళి, మొహం కడుక్కుని హాయిగా భోజనంచేసి, విశ్రాంతిగా పడుకోవొచ్చువని ఆశ. ఆరున్నర గంటలబండిలో చచ్చి చెడి బయటపడ్డ మనుష్యులు, తమతమ పాపురాలగూడులలాటి యిళ్లకి ప్రయాణ-మవుతారు. టై వొదులుచేసుకుని, చేతులో సాయంకాలపు పత్రిక పట్టుకున్న మొగాళ్లు. మాసిపోయిన జేబురుమాలుతో ఆఖరిమాటు మొహం తుడుచుకుంటున్న ఆడవాళ్ళు. చేతుల్లోంచి జారిగాని వూడిగాని పడిపోతాయేమోనన్నట్టు వున్న చేతిబాగులు ఎలాగో ఓలాగు పట్టుకుని ప్రయాణం చెయ్యాలి మహిళలు. నిట్టూర్పులు, ఆవలింతలు, తమతమ స్టేషన్లు త్వరత్వరగా రావాలని చూస్తున్న అలసిపోయిన కళ్ళు, బండి ఆగగానే, మిగిలిన శక్తి అంతా కూడదీసుకుని బండినించి ఒక్కతోపుతో బయట పడడము.

అంధేరిస్టేషను చేరుతూవుండగానే మంజుల పెట్టెలోంచి కిందికి దిగడానికి ప్రయత్నం ప్రారంభించింది. చర్చిగేటు స్టేషనులో ఎక్కినప్పుడు ఎలా, ఒక సీటుకి పక్కగా నించుందో, అలాగే, తొక్కిడిలో, అంధేరి చేరే దాకా నించుంది. సీటుమీద కూర్చున్న లావు గుజరాతీ గృహస్థు వొళ్ళు తగిలేలా ఆవిడ పక్కకి జరిగాడు. కొంచెం

జాగా చూపించి, కూర్చోమని తన పక్కకి ఆహ్వానించాడు కూడాను. కాని మంజుల అలాగే నిలుచుండి పోయింది. ఆవిడని పట్టుకుని మరో తరుణి నించుంది. ఆ అమ్మాయీ, ఎక్కడో వుద్యోగం చేస్తోంది. మంజుల యెదురుగుండా, పాలభాండంతో ఓ భయ్యా కూర్చున్నాడు. మిగతా రెండుపక్కలా, అనేకమంది కిక్కిరిసి నించున్నారు. మంది దిగుతున్నారు. జరుగుతున్నారు. కావి, ఎప్పుడూ తగ్గలేదు. అంధేరిస్టేషను బండిచేరిన తరువాత, దిగడం చాలా కష్టమయింది. భయ్యా, గుజరాతీ సేట్జీ, ముదుచుకు నించున్న తరుణి. రెండు పక్కలా, గోడలావున్న మనుష్యులు. చివరికి మంజుల చెంగు బిగించి, బాగు గట్టిగా పట్టుకుని, కళ్ళుమూసుకుని, దిగేవైపు తోసుకుంటూ బయలు దేరింది. చాలా తోపుడులు. భుజాలు నొక్కడం, అల్లరిగా గిల్లడం, జుట్టు ముడిలాగడం. చివరికి మంజుల బయటపడింది. మంజుల ప్లాటుఫారము నించి బయటికి వొచ్చి, గబగబ నడక ప్రారంభించింది, రోడ్డుమీద. జుట్టు ఎగురుతోంది. రాసిన నూనె ఎండి పోయింది. పెదిమలు ఆరిపోయాయి. కళ్ళు అలిసిపోయాయి. చంకలకింద, పొట్టమీద, చెమటతో తడిసి, బట్టలు అంటుకుపోయాయి. మధ్యాహ్నమంతా టైపు కొట్టి, కొట్టి వేళ్ళు నెప్పులు పెట్టేస్తున్నాయి. ఈ స్థితిలో, నడక ప్రారంభించక మునుపే పాదాలు నొప్పి పెట్టడం ప్రారంభించాయి. 'మంజులా! మిసెస్ భార్కర్' మంజుల వెనక్కి తిరిగి చూసింది. ఆగింది. కాశీకులకర్ణి, పర్సు ఆడించుకుంటూ వొస్తోంది, మంజుల పని చేస్తున్న ఆఫీసు పక్క ఆఫీసులో ఆ అమ్మాయి పని చేస్తుంది. పొద్దున్న ఇద్దరూ ఒకే బండిలో వెళతారు కాని, సాయంకాలం తిరిగి వొచ్చేటప్పుడు ఎప్పుడూ మంజులని కలియదు. ఇద్దరూ రోడ్డు చివరగా నడుస్తున్నారు. మంజుల అడిగింది, 'రోజూ ఈ ట్రెయినులోనే వొస్తారా!'

'ఛీ. ఇవాళే వొచ్చాను, ఈ బండిలో. రోజూ ఏడున్నరబండి పట్టుకుంటాను.'

'ఇంత లేటవుతుందా, ఆఫీసులో.'

'లేదు. ఆరుగంటలకే అయిపోతుంది ఆఫీసు. కాని ఇంటికోసం వెతుకుతూ తిరుగుతున్నాను. ఎవరో ఎక్కడోవుంది, అద్దెకి, యిల్లు అని చెబుతారు. వెళతాను, ఫలితమేమీ వుండదు. మీకేమన్నా తెలిస్తే. ..'

ఇంటికోసం పడుతున్న కష్టాలు చెప్పడం ప్రారంభించేసరికి మంజులకి విసుగెత్తి–పోయింది. ఓ సంవత్సరం క్రితం మంజులకూడా, ఈ సంకటంలోనే చిక్కుకుంది.

రోజూ, పొద్దున్నా, సాయంత్రం. జాగా దొరకడం ఎంతకష్టంగావుందో, వెదకడానికి ఎంత కష్టపడుతున్నారో, ఎవరో ఒకరు, ఎక్కడో ఒకచోట చెప్పగా విని విని విసుగెత్తి–పోయింది. కొంచెంసేపయిన తరవాత, ఆకస్మాత్తుగా అంది. 'మీరు పెళ్ళిచేసుకోండి.' నా పెళ్ళి స్థిరమయింది. అందుకే ఇంటికోసం వెతుకుతున్నాను. సంవత్సరమున్నర అయింది పెళ్ళి స్థిరమయి. మేమిద్దరమూ వారంలో ఆరురోజులు బొంబాయంతా ఇంటికోసం గాలిస్తాము. ఏడోరోజున పై వూరు ఎక్కడికైనావెళ్ళి, ఇల్లు దొరకలేదని, మాడిన మొహంతో, ప్రేమ ఆస్వాదించడానికి ప్రయత్నిస్తున్నాము.'

మంజుల మొహం వాడింది. 'కాశీ' కథ విని కాదు. మంజుల ప్రేమించింది. ఇల్లు దొరికింది. పెళ్ళయింది కాని . ..'

'నే కూరలు కొంటాను. ఒక్క నిమిషం ఆగుతారా' అని మంజుల కూరలబండి ఆపింది. రుమాలులో ఉల్లిపాయలు మూటకట్టుకుంది. బాగులో మిరపకాయలు, కొత్తిమిరి వగైరా పెట్టుకుంది. చేతిలో ఓ కొబ్బరికాయ పుచ్చుకుని నడక ప్రారంభించింది. కాశీ కులకర్ణి మంజులకేసి అసూయతో చూస్తోంది. వూరుకోలేక అంది. 'మిసెస్ భార్కర్. మీరు చాలా అదృష్టవంతులు.'

'మీకూ దొరుకుతుంది ఇల్లు. నేను కూడా మీ కోసం వాకబు చేస్తాను. మా ఆఫీసులో సుబ్రహ్మణ్యానికి తెలుస్తుంది.'

ఇద్దరూ పొడిపొడిగా నవ్వారు. కులకర్ణి మరోదారిని వెళ్ళింది. మంజుల గబగబ నడక ప్రారంభించింది. ఇంకా చాలాదూరం వెళ్ళాలి. ఇంటికి వెళ్ళి వంటచెయ్యాలి. నీళ్ళు పట్టుకుని, నింపుకోవాలి. స్నానం చెయ్యాలని అనిపిస్తోంది. ఆకలేస్తోంది. శరత్ ఇంటికి వొచ్చుంటే, అతనికి టీ కూడాచేసి ఇవ్వాలి. శరత్ జ్ఞాపకం రాగానే ఉలిక్కిపడింది మంజుల. పొద్దున్న ఇంటినించి బయటపడిన తరవాత టికెట్ చెకర్, రైలుబండిలో తోపుడు, ఆఫీసులో, పై 'బాస్', సుబ్రహ్మణ్యం, అక్కౌంటెంటు కావళే, మేరీ డి సూజా, సరళ సాటే, టీ ఇచ్చే భట్టు, చర్చిగేటు స్టేషనులో కన్నుగొట్టే ముసిలాడు, రైల్లో గుజరాతీ సేట్జీ, కాశీ కులకర్ణి, కూరలమ్మే మనిషి, ఈ గొడవల్లో శరత్ ఎక్కడా జ్ఞాపకానికే రాలేదు. ఏ శరతుని ప్రేమించి సంసారం ప్రారంభించిందో . .. జ్ఞాపకం రాగానే, ఆవేగంతో, అతని ఆకర్షణకి తిరిగి గురిఅయింది. కాని మరో క్షణంలో మనసు స్తంభించింది. కాళ్లు, మెల్లిమెల్లిగా నడక ప్రారంభించాయి.

పక్కనించి వెళుతున్న మోటారు కారులో అలూ బిలిమోరియా కనిపించింది. కారు వేగం తగ్గించి, ఆలూ ఆడిగింది 'లిఫ్టు'.

'వొద్దు. వొచ్చేసింది ఇల్లు' అంది మంజుల. ముందుకి సాగింది. అలూ గురించి, ఆలోచనలు, మంజుల మనసుని, ఆక్రమించేశాయి. ఆలూ కూడా ఉద్యోగం చేస్తోంది: ఏదో విమానాల సర్వీసు నడిపే ఆఫీసులో. కాని ఆనందంతో కాలం గడుపుతుంది. మొగుడిని ఎప్పుడో వొదిలేసింది. రోజూ ఓ కొత్త మిత్రుడితో తిరుగుతుంది. వాళ్ళ మోటారు, వాళ్ళసొమ్ము. వేసుకున్న ఫ్రాకులు, రాసుకున్న లిప్‌స్టిక్ కూడా మిత్రులు ఇచ్చినదే. లోకమంతా కోడై కూసింది. లోకమంతా ఆడిపోసుకుంది. కాని ఆలూకి ఫరవాలేకపోయింది. కాలేజీలో, పూర్వపు స్నేహితులతో కలిసి గోడ్‌బందరుకి పిక్ నిక్‌కి వెళ్ళినప్పుడు, అలూ తన గోడు చెప్పుకుంది మంజులకి, మనసు విప్పి. 'పెళ్ళి సరిపడలేదు నాకు. మొగుడు ఏమీ సంపాదించేవాడుకాదు. నే మజాచెయ్యడం ఆపు కోలేను. మొగుడి తాలూకు బంధువులతో ఇల్లు నిండిపోయేది. కాని నా చిన్ననాటి స్నేహితులెవరన్నా ఇంటికొస్తే మాత్రం, అందరికీ సందేహాలే!'

ఆలూ బిలిమోరియా ఎదురు తిరిగింది. బందిఖానా నించి బయటపడింది. బయటపడినట్టు, అథవా అనుకుంది. కాని వేళ్ళతో పెకలించబడిపోయినట్టు, స్వేచ్ఛగానే కాక, విచ్చలవిడిగా ప్రవర్తించటం ప్రారంభించింది.

ఆలూ జ్ఞాపకాలు, ఎక్కువ అవగానే మంజులకి భీతి పట్టుకుంది. మంజుల భర్త శరత్ సంపాదిస్తున్నాడు. ఇంటికి ఎవరినీ చుట్టాలని తీసుకు రావడంలేదు. తనకి స్వయంగా మొగస్నేహితులూ అక్కర్లేదు. స్వాతంత్ర్యమూ అవసరంలేదు. అలూ కూడా, 'నువ్వు ఆనందగృహిణివి' అంటూ వుండేది. అయినా. ..మంజుల ఇంటిదగ్గరకొచ్చేసింది. మంజుల నివాసం ఓ చాళ్‌లో. చీకటిపడింది ఇల్లు చేరేసరికి, దీపాలు వెలిగాయి. అప్పుడే చీకటిపడిపోయిందని మంజుల మొహం ముడుచుకుంది. తమ తమ గదుల ముందు మొగవాళ్లు, చొక్కాలు విప్పేసి, కూర్చున్నారు. బాతాఖానీ కొడుతున్నారు. పిల్లల్ని ఆడిస్తున్నారు. చొక్కాలులేని మొగాళ్ళనీ, అసంఖ్యాకమైన పిల్లల్నీచూసి, మంజులకి కడుపు తిప్పేసి, వాంతి వొచ్చిన పర్యంతమయింది. రేడియో, గ్రామఫోనులు గట్టిగా మోగి చెవులు బద్దలు కొట్టేస్తున్నాయి. సినీ సంగీతాల రికార్డులు. సంగీతంమీద ఏమాత్రం మోజువున్నా, దానిని నాశనంచేసే, ఈ రణగొణధ్వని విని విసుగెత్తిపోయింది.

మెట్లెక్కి తన గదిదగ్గిర కొచ్చింది. శరత్ ఇంటికి వొచ్చేశాడు. పడకకుర్చీలో విశ్రమిస్తున్నాడు. మంజుల అడిగింది 'ఎప్పుడొచ్చావు.'

'ఇప్పుడే.'

'నాకు ఆరుంబావు ట్రెయిను కొంచెంలో తప్పిపోయింది. టేబులు మీద బాగ్సు, కూరలు పడేసి లోపలి గదిలోకి వెళ్ళింది, బాల్టీలో నీళ్ళులేవు. పొద్దున్న వెళ్ళేటప్పుడు బాల్టీ నింపివెళ్ళింది. శరత్ నీళ్ళన్నీ ఉపయోగించేసి వుండాలి. మంజులకి కొంచెం కోపమొచ్చింది. నీళ్లు పోసేసుకుంటే పోసుకున్నాడు. తిరిగి పట్టి పెట్టి వుండవలసింది. పొద్దున్న ఆఫీసుకి వెళ్లినప్పుడు విడిచిన పైజామా ఇంకా అలాగే పడివుంది. తాను విడిచిన చీరా అక్కడే వుంది. మంజుల, కాలితోనే చీర, పయిజామా, పక్కకి తోసేసింది. శరత్, బయట గదినించి అరిచాడు 'ఏం చేస్తున్నావు? అలా తిరిగొద్దాం, రా!'

'వొస్తాను. ఇప్పుడే వొచ్చాను కదా.' బాల్టీ పట్టుకుని బయటి కొచ్చింది. 'మొహం కడుక్కుంటాను. తరవాత వెళదాము' శరత్ కేసి చూస్తూ అంది. వరండామీదవున్న కొళాయిదగ్గిరకి వెళ్ళింది. నే తెచ్చి పెట్టనా అని అడగనన్నా అడగలేదు, శరత్. మంజులకి దుఃఖమొచ్చింది. ఇంకేం చెయ్యలేక నీటి కొళాయిదగ్గిర నించుంది. ఎవరో బాల్టీతో నీళ్లు పట్టుకుంటున్నారు. ఎవరో మొహం కడుక్కోవాలి. మంజుల తన బాల్టీ సహం నింపుకుంది. పూర్తిగా బాల్టీ నింపుతే, అది మొయ్యడానికి బలమేదీ!

మొహం తుడుచుకుని, బట్టలు మార్చుకున్న తరవాత కొంచెం హాయనిపించింది. తేలికగావుంది. ఫ్రెష్, పరిశుభ్రంగా అద్దంలో తన వికసించిన మొహం చూసుకుని కొంత సేపు, తరవాత అంది సంతోషంగా 'శరత్, పద.'

శరత్ అలాగే కుర్చీలో కదలకుండా కూర్చున్నాడు. చిరుకోపంతో అన్నాడు. 'ఇప్పుడెక్కడికి వెళతాము. ఎనిమిదయిపోయింది. ఓ గంట తయారయావు!'

మంజులకి వొళ్లు మండింది. కోపంతో, ఏదో అనబోయింది కాని, అనే లోపల శరత్ అన్నాడు. 'నీ సంగతి నువ్వు చూసుకోడం తప్ప, ఇతరుల సంగతి పట్టించుకోడమే లేదు. 'టీ' కావాలా అని నన్ను అడగనన్నా లేదు. దానితో మంజుల మొహం వాడిపోయింది. ఏం చెప్పాలో, ఏమనాలో, చాలాసేపు తోచలేదు. చివరికి ఎలాగో అలాగ అంది.

'సారీ! నే ఎంతో అలిసిపోయాను. నువ్వు అడిగితే ఏం పోయింది? ఉండు నీళ్లు పెడతాను. కోపగించకు.'

శరత్ ఉదాసీనంగా వుండిపోయాడు. మంజులని తోసేస్తూ అన్నాడు. 'వొద్దులే. హోటల్లో తాగుతాను. నిజంగా టీ చెయ్యకు.'

అతను లేచి నించోడం చూసి, మంజుల అంది. 'మరి, మనం బయటకి వెళదామా!'

'వొద్దు. నాకు విసుగెత్తిపోయింది. కొంచెం నాలుగడుగులు వేసేసరికి, ఇంటికి తిరిగివెళిపోదామని నీ గోల. వంటచెయ్యాలి. నీళ్ళు పట్టుకోవాలి!!'

'అయితే మనం భోజనం బయటచేద్దాం. నీళ్లు పొద్దున్నే పట్టుకుందాం.'

'బయటి భోజనమంటే నీకు చాలా ఇష్టంగావుందే. డబ్బెక్కడుంది? టీ తాగడం కోసం కేవలం రెండణాలు మిగిలాయి నా దగ్గిర.'

మంజులకి నిజంగా వొళ్లు మండిపోయింది. టేబులుమీదున్న కొబ్బరికాయ గట్టిగా నేలకేసికొట్టి, బద్దలుకొట్టింది. కొబ్బరినీళ్లు తాగాలని బుద్ధి పుట్టింది కాని ఆ కోపంలో, నీళ్ళన్నీ అక్కడే కార్చేసింది. రుమాలులో వున్న ఉల్లిపాయలు, బాగులోవున్న మిరప-కాయలు, తీసుకుని కోపంతోనే లోపలికి వెళ్ళిపోయింది. శరత్ సిగరెట్టు వెలిగించి పొగ వొదలడం ప్రారంభించాడు, పడకకుర్చీలోనే కూర్చుని.

మంజుల స్టవ్ వెలిగించింది. ఉల్లిపాయలు మిరపకాయలు తరిగింది. కూరగిన్నె కుంపటిమీద పెట్టింది. దింపేసింది. టీకి నీళ్లు పెట్టింది. ఆ నీళ్ళలో ఉల్లిపాయముక్కలు పడేసింది. తీసేసింది. మళ్ళీ టీకి నీళ్ళు పెట్టింది. శరత్ వొచ్చి, మంజుల వెనక నించున్నాడు. మృదువుగా అన్నాడు 'మంజూ.'

మంజుల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. భుజంమీద శరత్ చెయ్యి వేశాడు. ఆ చెయ్యితీసి, తనచేతిలో పెట్టుకుంది.

'అయింది టీ.'

'నిజంగా అక్కర్లేదు. ఎందుకు చేశావు. మనం బయటే భోంచేద్దాం!'

'అయిపోయింది. టీ కప్పులోపోస్తూ అంది మంజుల, తరువాత పోపు పెడుతూ అంది, 'బయట తినడమెందుకు? నీకు ఇష్టమయిన కూర చేశాను, చూడు.'

శరత్ ప్రేమతో మంజులని నిమిరాడు. టీ తాగాడు. తరవాత అన్నాడు. 'ఇంకేమీ చెయ్యకు!'

'చపాతీలు చేస్తాను.'

'వొద్దు. చేతులు నెప్పెడుతూ వుండాలి ఇప్పటికే. బ్రెడ్ తీసుకొస్తాను.'

'కొంచెం బ్రెడ్. రెండు చపాతీలు వున్నాయి, ఏమన్నా తీసుకురావాలంటే, ఎదురుగుండా సింధీ దుకాణం కొత్తగా తెరిచారు. అక్కడినించి కొంచెం మిఠాయి తీసుకురా.'

విప్పారిన మంజుల మొహంకేసి చూస్తూ శరత్ అన్నాడు.

'మిఠాయి తినాలని కోరికగా వున్నట్టుంది. నెల తప్పలేదు కద!'

దానితో మంజుల మొహం నల్లబడింది. కూర మళ్ళీ స్టవ్ మీద పెట్టి కలపడం ప్రారంభించింది. శూన్యదృష్టితో శరత్ బయటగదిలోకి, అక్కడి నించి, వరండాలోకి వెళ్ళిపోయాడు. మంజులకి కన్నీరు ధారగా ప్రవహించింది. అపుకోకుండా ప్రవహించ–నిచ్చింది. 'నీ కళ్లు జాగర్త' అని డాక్టరు ఇదివరలో ఇచ్చిన సలహా జ్ఞాపకమొచ్చింది. ఇంకా ఎక్కువ కన్నీరు కారింది. డాక్టరు, ఆరోగ్యంకోసం, కొన్నాళ్ళు వాతావరణం మార్చమన్నాడు. మంజులకి వేళ్ళన్నీ నెప్పులెడుతున్నాయి. నడిచినా, లేచి నించున్నా కాళ్లు పీకుతున్నాయి. అయినా నాలుగయిదు గంటలు ఏకధాటిన టైపు కొట్టాలి. ఠణఠణమన్న ధ్వని చెవుల్లో గింగురుమంటోంది. బుర్ర వేడెక్కిపోయి, నొప్పి పెడుతోంది. వంట ముగించుకుని ముందుగదిలో కొచ్చింది. తలుపు బార్లాగా తెరిచివుంది. మూలనున్న పడకకుర్చీ, టేబులు, మంచం, పుస్తకాలు, ఈ సంసారమంతటినీ, మంజుల శూన్యదృష్టితో చూసింది. ఒక్కొక్కవస్తువునీ చేకూర్చుకుంటున్నప్పుడు ఎంత ఆనందం కలిగింది. ఓ సంవత్సరమున్నర క్రితమే! కాని ఇప్పుడు ఎందుకిలా అయింది. ఇంత శీఘ్రంగా ఉత్సాహమంతా ఎందుకిలా తగ్గిపోయింది. ఇదివరకూ కష్టాలుండేవి. కాని, ఇతరులకంటే ఎంత అదృష్టవంతులు తాము, నిజానికి! కాశీకులకర్ణికి వుండడానికి ఇల్లు దొరకలేదు. బిలిమోరియాకి, మొగుడు డబ్బు సంపాదించేవాడుకాదు. తన

సంసారం వుండటానికి రెండు గదులున్నాయి. ఇద్దరూ నౌకరీ చేసుకుంటున్నారు. అయినా తగువులు. ఏదీ తిన్నగా, నడవడంలేదు. ఏమి తప్పుతోందో ఎక్కడ తప్పుతోందో! గదిలో కాస్సేపు నించుంది. తరవాత వరండాలోకి వెళ్ళింది. మళ్లీ గదిలోకొచ్చింది. వరండాలో శాంతంగా వుండడానికి వీల్లేదు. అక్కడ అంతా రణగొణధ్వని. శాంతంగా ఎక్కడా నించోడాని కన్నా వీలులేని పరిస్థితి. వంటింటినించి పొగ, వాసన. సినీమా పాటల సంగీతం. ఇరుగుపొరుగుతో మాట్లాడాలని బుద్ధిపుట్టదు. ఎక్కడికి వెళితే అక్కడ గడబిడ. గదిలో వున్నా సుఖంగాలేదు. రాత్రి తొమ్మిదిన్నర అయినా శరత్ తిరిగి రాలేదు. వొస్తే బాగుండునని ఓమారు. పోనీ, రాకపోతే రాకపోనీ అని మరోమారు అనిపిస్తుంది. అతను వొస్తేనే వంటగది శుభ్రం చెయ్యడానికి వీలవుతుంది. అతను రావాలి. భోజనం చేసిన గది శుభ్రం చెయ్యాలి. మంజులకి ఏడుపొచ్చింది.

శరత్ వొచ్చాడు. అతన్ని చూశాక మంజుల శాంతపడింది. అతను మిఠాయి తెచ్చాడు. నిజంగా ఆనందమేసింది. శరత్‌కి వొడ్డించింది. భోజనానికి కూర్చున్నారు. శరత్‌కి మారు వొడ్డించింది. తరవాత తను తింది. ఆఫీసులో సుబ్రహ్మణ్యం సంగతి చెప్పింది. ఇద్దరూ నవ్వుకున్నారు. భోజనం ముగిసిన తరవాత శరత్‌ని పైగదిలో కూర్చోమని, కంచాలు తీసేసి, గది శుభ్రం చేసింది.

మంజుల ముందుగదిలో కొచ్చేసరికి, శరత్, పక్కపరిచి, పడక కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు. పరిచినపక్క, సిగరెట్టుపొగ చూచేసరికి మంజులకి భయం పట్టుకుంది. కడుపులో తిప్పింది. అసహ్యమేసింది. మంజుల అంది. 'నిద్రపోయేముందు సిగరెట్టు ఎందుకుతాగుతావు!'

'అప్పుడే నిద్రపోయే టైమెక్కడయింది.'

'పది అయిపోయింది.'

'అయితే నువ్వు పడుకో.'

'దీపం వెలుగుతూవుంటే నిద్దుర రాదు నాకు.'

శరత్‌కి కోపమొచ్చింది. సిగరెట్టు ఘాటుగాపీల్చి, తరవాత ఆర్పేశాడు, అన్నాడు. 'నీకు దీపంవుంటె కష్టం. సిగరెట్టుతాగితే కష్టం!'

మంజుల మాట్లాడలేదు. పక్కమీద నడుంవాల్చి, చేత్తో కళ్లుమూసుకుని పడుకుంది, ఓ నిమిషంలో శరత్ లేచాడు తలుపుమూసి దీపం ఆర్పేసి, పక్కమీద పడుకున్నాడు.

అంతా నిశ్శబ్దంగా, శాంతంగావుంది.

మెల్లిగా శరత్ అన్నాడు 'ఏయ్.'

మంజులకి శరీరంలో వెయ్యిసూదులు గుచ్చుకున్న వేదన కలిగింది.

'వొద్దు, నన్ను పడుకోనీ!'

దీపం ఆరిపోయి గదంతా చీకటి అయినా కళ్ళమీదనించి చెయ్యి తీసెయ్యలేదు మంజుల. చెయ్యితీసి, శరత్ భుజంమీద వేద్దామా అనిపించింది. కాని వొంట్లో త్రాణే లేదు. పక్కమీద వీపు. కళ్లు పై కప్పుమీద. ఎందుకిలా అవుతోందా అని మనసులో ఆలోచన.

'నిద్రాదేవత నీ నెత్తెక్కి సవారీ చేస్తోంది. పో. నిద్రపో.'

శరత్ కోపంతో అన్నమాటలు వినగానే మంజులలేచి కూర్చుంది. కంపితస్వరంతో అంది. 'ఎంతకోపం! నీకేకాదు కోపం. నాకూను. లే, బాతాఖానీకొడదాం, చదరంగం ఆడుకుందాం. లేకపోతే షికారెళదాము వస్తావా?'

'వొద్దు. మేలుకుంటె నీ ఆరోగ్యం పాడవుతుంది.'

'ఏమొచ్చిపడిందో నాకు.'

'అదే నాకర్థం కావడంలేదు.'

శరత్ మాటల వెనకవున్న ఉద్రేకం మంజులకి అర్థమయింది. అసహాయదుఃఖంతో గొంతుక బిగుసుకుపోయింది. శరీరమంతా కంపించింది. కంపితస్వరంతో అంది, 'చాలా కోపంగావుందికాదు నీకు. నాకు తెలుస్తూనే వుందిలే. కాని వొట్టుపెట్టి చెబుతున్నాను. నాకేమీ కోరికలేకుండావుంది. ఉత్సాహం లేకుండావుంది!'

'ఇదివరకు అన్నీ వుండేవి. ఈమధ్య నీకు కోపం ఎక్కువయింది. స్నేహం చచ్చి–పోతోంది. నేనంటె అయిష్టంపుట్టి కాదుగద.'

'దానికి నేనేం చెప్పను' అన్నట్టు మొహంపెట్టి, మంజుల అంది.

'బుర్రలో వెర్రిబుద్ధులు పుట్టనీకు. నన్ను అర్థంచేసుకో.'

'అంతా అర్థం. ...'

'నే అలిసిపోయానురా! వంటచేసి అలిసిపోతున్నాను. నీళ్లుపట్టుకుని అలిసి-పోతున్నాను. ఆఫీసుకు వెళ్లి వొచ్చే ఆ కిటకిటలో అలిసిపోతున్నాను. టైపుచేసి అలిసి-పోతున్నాను.'

'నేను అలవడంలేదూ! నే పనిచెయ్యడంలేదూ! లోకంలో అందరు ఆడవాళ్ళూ పనిచేస్తూనేవున్నారు. ఎందుకు చదువుతావు ఓ పెద్ద జాబితా. నౌకరీచెయ్యడం మానుకోవొచ్చు. కాని, అలా చెయ్యమని నేనెలా చెప్పగలను! నా దారిద్ర్యం, దౌర్బల్యం బయటపడిపోతాయి.' మంజుల గాభరాపడింది. శరత్‌కి ఎలా చెప్పాలో, నిజానికి తన మనసుకి ఎలా చెప్పుకోవాలో అర్థంకాలేదు మంజులకి. చివరికి ఓ నిర్ధారణకొచ్చి, లేచి పెదిమలు కొరుక్కుంటూ. ..

'కిటికీ ముయ్యకు' శరత్ కోపంగా అరిచాడు. అప్పటికే శరీరమంతా ఉడికిపోయి గాభరావుంది. మంజుల ఉలిక్కిపడింది. కిటికీకిదూరంగా వెళ్లి అంది, 'పక్కింటికొచ్చిన చుట్టం, వాళ్లింట్లో చోటులేదని, ఈ కిటికీదగ్గిరే పక్కేసుకు పడుకుంటున్నాడు.'

'ఉండనీ. ప్రతిరోజూలాగే పడుకో నువ్వు ఇవాళకూడా!"

మంజులకి వొళ్లు మండింది. పడకకుర్చీలో కూలబడిపోయింది. భయానక నిశ్శబ్దం భరించలేకపోయింది మంజుల. 'వొచ్చేనెలలో, మొట్టమొదట మనం ఫాను కొనుక్కుందాం.'

శరత్ వికటంగా నవ్వుతూ అన్నాడు, 'అంటే, ఓనెల శలవన్న మాట.'

మంజుల మొహం ముడతలుపడిపోయింది.

'ఏమంటున్నావు శరత్' అంది మాటలో కటుత్వం కనుపింపచేస్తూ.

శరత్, ఇంకా రెండింతలు కటువుగా అన్నాడు 'అబద్ధమేముంది. భార్యాభర్తల సంబంధం మనకి మిగలలేదు. ఇందులో అబద్ధమేముంది?'

'శరత్, శరత్' మంజుల కోపంతో అందికాని, కొంచెంసేపటిలోనే ధైర్యం కోలు–పోయింది. ఏడుపు ప్రారంభించింది. మళ్ళీ అంతా నిశ్శబ్దం, గదిలో మటుకు బయట రణగొణధ్వని, సినీమా సంగీతపు అరుపులు, తిరిగి ప్రారంభమయాయి. గదిలో శాంతతకి బయట దరువు.

శరత్ పక్కమీదనించి లేచి కుర్చీ చేతిమీద కూర్చున్నాడు. మంజుల అతని నుదుటి మీద ప్రేమతో నిమిరింది. శరత్ మృదువుగా అన్నాడు. 'ఇలా ఎందుకు చేస్తున్నావు మంజూ! ఇంతకి ముందు ఎంత మజాగా వుండేదానివి. అంతా మరిచిపోతున్నావా? పెళ్ళయిన తరవాత మీ గ్రామంలో గడిపిన ఆ వారంరోజులూ జ్ఞాపకంలేదూ, రాత్రి రాత్రి అంతా మేలుకునే వుండేవాళ్ళం. తెల్లవారినా, గదివిడిచి బయటకి రావడానికి ఒప్పుకునేదానివి కావు. ఇక్కడకూడా, సాయంకాలం ఇంటికొచ్చినతరవాత నన్ను కరుచుకునే తిరిగేదానివి.'

మంజుల ఆపుకోలేక వెక్కివెక్కి ఏడుస్తూ అంది, 'జ్ఞాపకముంది. అంతా జ్ఞాపకముంది, శరత్ నువ్వంటె నాకు అపారమైన ప్రేమ, నువ్వంటె చాలా ఇష్టం.' శరత్ ఉద్వేగంతో దగ్గిరకి జరిగాడు. తెలియజెప్పే స్వరంలో అన్నాడు, 'నేను నీ వాడినే. నువ్వు పిచ్చిగా ప్రవర్తిస్తున్నావు. మిగిలినవాళ్ళకి ఈ మాత్రమైనా ఏకాంతం దొరకడం లేదు. పదిమంది మనుష్యులున్న ఇంటిపరిస్థితి కనిపెట్టు ఒక్కమారు. కూలి, నాలి చేసుకు బతికేవాళ్ళని చూడు. ఎందుకిలా ప్రవర్తిస్తావు. కొత్త తీరిన తరవాత పూర్వమంత ఆకర్షణ వుండకపోవచ్చును. అయినా. ..'

అతనిచేతులు గట్టిగా పట్టుకుని ఏడుస్తూ, మంజుల అంది. 'కొత్త తీరిపోయినా, నువ్వంటె ఇష్టం తీరిపోలేదు. చాలా ఇష్టం. కాని ఈ చెమట సంసారం, ఓ యంత్రంలాటి బతుకు, నే సహించలేకపోతున్నాను. శరత్ మనం ఇక్కడినించి పోదాం. ఎక్కడికో అక్కడికి, ఎక్కడికైనా, తీసుకుపో నన్ను. ఇప్పుడే తీసుకుపో.'

మంజుల మాటలు, ఆవిడ హృదయావేగమూ, గాలిలోనే అల్లల్లాడి పోయాయి. చాలాసేపు వూరుకున్నతరవాత శరత్ అన్నాడు, 'నీకు విసుగెత్తిపోయింది. నేనను–కుంటున్నాను, నీకో కొడుకు పుట్టాలి. నువ్వు కావాలనుకుంటున్నావు.'

'కాబోలు, కాని నాకు పిల్లలే కావాలనుకుంటె, ఇక్కడ అసలు వుండను. పోన్లెద్దు. ఎందుకు వృథా చర్చ!'

మంజుల కన్నీరు ఎండిపోయింది. శరత్ ఉద్వేగంకూడా అదుపులోకొచ్చింది. కొంచెం కోపంతో అన్నాడు. ఉన్న పరిస్థితితో రాజీపడి గడుపుకోకపోతే మనం దుఃఖపడుతాము. నాకు మాత్రం ఈ కష్టజీవితం, ఆకర్షణీయంగావుందా! కాని ఏంచెయ్యను. రోజంతా కష్టపడి అలిసిపోతే ఆ అలసట తీర్చుకోడానికి నాకు ఒకటేమార్గం. అది నువ్వు.'

శరత్ మాటలు వినగానే మంజుల మనసు మండిపోయింది. కోపమొచ్చింది. అసహ్యమేసింది.

శరత్ అలా ప్రవర్తించకూడదు. తనమీద ఈ విధమైన ఇష్టం చూపించవలసిన అవసరం లేదనిపించింది. ఎక్కడికో వెళిపోతే. చాలాదూరంగా . ..ఎక్కడికో . ..శరత్, మంజులని, కుర్చీనించి బయటకి తన వైపుకి లాక్కున్నాడు. కోపంతో మాట్లాడడం ప్రారంభించాడు.

'ఓ నెల, నెలంతా సహించాను. చాలా చమత్కారంగావుంది నీ ప్రవర్తన.'

మంజుల కిందికి జారిపోయింది. అతని కౌగిలిలో సుఖం కనిపించలేదు. ఉక్క మూలాన ఇంకా ఎక్కువ ఉక్కిరిబిక్కిరి అయింది. శరత్ కౌగిలి, లోకలుబండిలో, నాలుగు మూలల నించి మనుష్యులుతోసే తోపుళ్లలా అనిపించింది. జనసమ్మర్దంలో ఎవరో గిల్లినట్టు అనిపించింది, అతను పెట్టుకున్న ముద్దు.

శరత్, కోపంతో, మంజులని దూరంగాతోసి, 'చావు' అన్నాడు.

మంజులకి 'నిజంగా చచ్చిపోతే హాయిగా వుంటుంది' అనిపించింది. తనభర్త, తన ప్రియుడు. కాని అతనితో సహకరించడానికి తగిన శక్తి సామర్థ్యాలుకూడా మిగలలేదు తనకి. మంజులకి స్వతహాగా తనమీదే తనకి ఏవగింపుకూడా కలగడం ప్రారంభించింది. ఏ యితర విషయాలలో మాత్రం, తన ఆలోచనలు, తన యిష్టానిష్టాలు శిథిలమైపోకుండా నిలిచివున్నాయా. ఈ విషయంలో మాత్రం ఎందుకు తనకీ పట్టుదల. వేలమంది స్త్రీలు, తమ యిష్టాయిష్టాలతో ప్రసక్తిలేకుండా, మనసులో ఎలావున్నా, తమ భర్తలతో సహకరించడంలేదా! తన శరతుకూడా మిగిలిన భర్తలలాగే ప్రవర్తించగా, ఆశ్చర్యమేముంది. వ్యాకులతతో సతమతమౌతూ మంజుల అంది.

'రా. దగ్గిరకి తీసుకో.'

'ప్రేతాలతో శృంగారం చెయ్యడం నాకు చేతకాదు' అంటూశరత్ కోపంతో లేచాడు. 'ఇవాళిటినించీ, నీకూ నాకూ సంబంధం తీరిపోయింది. నువ్వు స్వయంగా నన్ను దూరం చేశావు. నువ్వు ఇలావుండగలవు. నాకు అలా వుండడం శక్యం కాదు. నేను నా సుఖం సాధించుకోవాలి. నీ దబాయింపు నా కక్కర్లేదు. నువ్వులేకుండానే వుండగలను. నే వెళ్ళిపోతున్నా!'

మంజుల కన్నీరు ఆగిపోయింది. మొహం ముడతలు పడిపోయింది. కోపంతో అంది 'వెళ్ళు, నీ యిష్టమొచ్చినచోటికి వెళ్లు.'

'వెళతాను. మీ నాన్న భయమేమన్నావుందా నాకు!'

'తీసుకో, ఆ పర్సులోంచి డబ్బు తీసుకో, కావాలంటే మంజులకి ఆపుకోలేని కోపమొచ్చింది. బుర్ర పగిలిపోతోంది. శరీరం దహించుకుపోతోంది. కాని ఏదో భయ-మావరించింది ఆకస్మాత్తుగా! అలసటవల్ల, దుఃఖం మూలాన్ని కళ్లుతిరిగి పడి పోబోతున్నట్టు అనిపించింది. కోపమూ, దుఃఖమూ మంజులని ఇరువైపులా లాగ-జొచ్చాయి. చెప్పుకోలేనంత సంతాపం కలిగింది. చాలా కష్టంమీద తనని సంబాళించు కుంది. పాకుకుంటూ, వెతుక్కుంటూ శరత్ పాదాలు పట్టుకు అంది, 'క్షమించు. నన్ను దగ్గిరకి తీసుకో. నన్ను అర్థంచేసుకో. నువ్వంటె నాకు ఇష్టం, కాని. ..'

శరత్ విసుగుతో పడకకుర్చీదగ్గిరకి వెళ్లాడు. ఆ కుర్చీలో, ఓ రాయిలా, కూర్చుండి పోయాడు. సిగరెట్టుకాల్చడం మొదలెట్టాడు. మంజుల నిస్సహాయురాలై అతనివైపు జరిగింది. చాలా దీనస్వరంతో చెప్పడం ప్రారంభించింది.

'ఏమని చెప్పను. నా ఆలోచనలు మరోవిధంగా వున్నాయి. మనసు ప్రసన్నంగా వుంటే, శరీరం పరిశుభ్రంగావుంటే, వాతావరణం స్వచ్ఛంగా, సుందరంగావుంటె, అప్పుడే నా ప్రవృత్తి వికసిస్తుంది. ఇక్కడ చుట్టు పక్కల గడబిడ, వొచ్చేపోయేవాళ్ళు హమేషా వుంటున్నారు. ఏడుపులు. అరుపులు. తిట్లు. దీవనలు. ఇవన్నీ వింటూవుంటె, వొళ్లు ఎలాగో అయిపోతోంది. ఎప్పుడూ చెమటే. దోమలు కుడుతూవుంటాయి. శరీరమంతా కుదించుకుపోయింది. ఆలిసిపోయింది. తలనొప్పిపెడుతోంది. తిన్న పాత బ్రెడ్ ముక్కలు, లోకలుబండిలో మిడిగుడ్ల చూపులు, టైపురైటరు టకటక, ఎప్పుడూ బుర్రలో తిరుగుతూనే వుంటాయి. మనసుని కష్టపెడుతూనే వున్నాయి. మనసు చచ్చిపోతోంది. శరీరం ఉత్సుకత చూపించదు. ఈ పని తలుచుకుంటె వాంతిపుట్టే

పరిస్థితి వొచ్చింది. పశువులాగ, ఆలోచనలు లేకుండా ప్రవర్తించవొచ్చునేమో. కాని నే పశువునవడానికి ఇష్టంలేదు. నా భావనలు, నా కోరికలు, పవిత్రమైనవని ఊహించుకుని వాటిని కాపాడుకుంటాను: జాగర్తగా! ఇదైనా నన్ను కాపాడుకోనీ. నన్ను కించపరచకు శరత్!'

మంజుల మాటలు ఎప్పుడు ముగించిందో, తనకే తెలియదు. ఆ మాటలు వెక్కి వెక్కి ఏడ్చిన ఏడుపులో విలీనమైపోయాయి. కళ్ళు మండిపోతున్నాయి. వీపు పీక్కు పోతోంది.

లోకలుబండిలో మనుష్యులు అటూ యిటూ తోస్తున్నారు. కామదృష్టితో ఆవిడకేసి చూస్తున్నారు. రోడ్డుమీద అశ్లీలాలైన మాటలు, చాళ్‌లో అసంఖ్యాకమైన పిల్లల సముదాయాలూ, చుట్టుముట్టేస్తున్నారు. దోమలు కుడుతున్నాయి. చెమట ప్రవహిస్తోంది. శరత్ ఒడిలో తలపెట్టుకుని, మంజుల నిద్రలోకి జారిపోయింది.

◆

ఎదురుగా ఉన్న కొళాయి 'కొర్' అని కూసెను.

3

సాహిత్య అకాదెమీ తీసుకొచ్చిన కథాసంకలనాల్లో ‘కన్నడ కథానికలు’ (1979) కూడా ఒక విశిష్ట సంకలనం. ఎల్.ఎస్.శేషగిరిరావు సంకలనం చేసిన ఈ పుస్తకంలో 22 కథలున్నాయి. ఆ రచయితలెవ్వరో సరే, ఆ అనువాదకుడెవరో కూడా తెలియని వయసులో నేనా పుస్తకం చదివాను. నలభయ్యేళ్ళ కింద చదివిన ఈ పుస్తకం మళ్ళా ఇన్నేళ్ళకు ఇదే తెరవడం. కానీ ఆ చిన్నవయసులోనే నా మనసుకు హత్తుకు పోయిన కథ ‘కొళాయిలో నీళ్ళు వచ్చినవి’ ఇప్పుడు చదివినా అంత ఫ్రెష్‌గానూ, అంత ప్రభావశీలంగానూ ఉండటం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉన్నది.

ఈ కథారచయిత కె.సదాశివ 28 ఏళ్ళ వయసుకే ఇటువంటి కథ రాసి ఉండటం ఆశ్చర్యం కాగా, ఆయన రాసిన మొత్తం కథలు ఇప్పటికి కూడా ఇరవైకన్నా మించి లేవని విన్నాను. కాని రాసిన ప్రతి ఒక్క కథా కన్నడపాఠకుల హృదయాల్లో పొడిచిన పచ్చబొట్టులాగా నిలిచిపోయిందని కూడా విన్నాను. ఈ సంకలనానికి ముందుమాట రాస్తూ శేషగిరిరావుగారు ఈ కథ గురించి ఇలా రాసారు:

‘నల్లియల్లి నీరు బందితు’ అను కథ శ్రీ సదాశివగారిని మొదట వెలుగునకు తెచ్చినది. చిన్నకథకు వస్తువు ఇంతకంటె సామాన్యము, సూక్ష్మము ఉండదు. మహానగర

వాసులకు ప్రతిదిన జీవనభాగమైన చిరపరిచిత అనుభవమొకదానిని గ్రహించి కథారచయితలు ఒక నూతనజగత్తును సృష్టించెదరు. ఇద్దరు వ్యక్తుల మనస్సులలోని ఆందోళనలను చాల సహజముగ చిత్రించెదరు. కథ చివరలో వచ్చు కొళాయి నీరు మానవీయతకు కరుణాధారయై పాఠకులకు రోమాంచము కలిగించును.'

ఆశ్చర్య మేమిటంటే, ఈ కథ మాత్రమే కాదు, ఈ కథ గురించిన పైన రాసిన చివరి వాక్యం కూడా ఇన్నేళ్ళుగానూ నా మనస్సులో చెక్కు చెదరకుండా ఉండటం.

ఇప్పుడు నాకు మరో మాట కూడా స్ఫురిస్తూ ఉంది. మనం చిన్నప్పటినుంచీ ఎటువంటి కథల్ని ఇష్టపడుతూ ఉంటామో ఆ కథలే మనల్ని కూడా నిర్మిస్తూ ఉంటాయని. ఒక 'సాల్ట్ ఇన్స్పెక్టర్' కథలాగా, ఒక 'ఎందుకు పారేస్తాను నాన్నా' కథలాగా ఈ కథ కూడా ఆ చిన్నవయసు లోనే నేను చదవడం నా భాగ్యమనుకుంటాను. నా ఆత్మస్వభావాన్ని పోల్చుకోడానికి ఇటువంటి కథలే నాకు అభిజ్ఞగా నిలబడుతూ వచ్చాయి.

మరో మాట కూడా చెప్తాను. చరిత్రకారులు భారతదేశచరిత్రని యుగయుగాల దండ యాత్రల చరిత్రగా అభివర్ణిస్తూ ఉంటారు. అది పాక్షికసత్యం మాత్రమే. నిజమైన భారతదేశ చరిత్ర సర్దుబాట్ల చరిత్ర, సమన్వయాల చరిత్ర, సమాధానపడటాల చరిత్ర. దానివల్ల మాత్రమే ఇంత బహుళతాసంకీర్ణమైన ఉపఖండం ఇన్ని యుగాలుగానూ మనగలుగుతూ వస్తున్నది.

కె. సదాశివ

కొళాయిలో నీళ్ళు వచ్చినవి

గడియారం రామకృష్ణ శర్మ

ఆరు ఇండ్లు ఉన్న కాంపౌండులో సీతమ్మా, రంగమ్మల ఇండ్లు ఒక గోడకు ఆవల ఈవల ఉన్నవి. సీతమ్మ ఇంట్లో కూర్చున్న రంగమ్మ లోకాభిరామాయణము సాగిస్తుండెను. ఎఱ్ఱని మబ్బు పడమట ఏనుగు రూపముదాల్చి రెండు గంటల వీరి మాటల ధోరణిలో కనపడీ కనపడనట్లు మాయమై ఉండెను.

సీతమ్మ గర్భములోని జీవము కదలాడెను. ఈదినమో రేపో అనేట్టు ఉండెను.

'చాలా దిగులవుతుందండీ, రంగమ్మా.'

పదిమందిని కన్న రంగమ్మతో ఈమాట సిగ్గుతో అన్నది.

'ఇట్లంతా దిగులు పెట్టుకోరాదు తల్లీ.'

కనిన పదిమందిలో ఏడుగురిని మిగుల్చుకొన్న ఆమె ధైర్యపు మాటలు చెప్పెను. చీకటి కోణములో రెప్పలాడించని ప్రాణి పొరలినందున తల్లిదేహమునకు నొప్పి కలిగెను. ఎఱ్ఱబారిన ముఖమును వంచుకొనెను. సిగ్గువచ్చి పెదవులను రెండు కానీలేదు.

ఎండిపోయిన అన్నముపాత్రను నానబెట్టడానికి సీతమ్మ వంటయింటికి మెల్లగా లేచిపోయెను. నీటికొరకు కొళాయి త్రిప్పి ఆశ్చర్యము పొందెను.

నీళ్ళు దారమువలె పడుతున్నవి. గంటలో ఇవి కూడ నిలిచిపోవచ్చు.

'నీళ్ళు నిలిచేట్టుంది రంగమ్మ.'

చెడ్డవార్త సోకినట్లు కూర్చున్న స్థలానికి ఎండవచ్చినట్లు రంగమ్మ లేచిపోయెను. ఆమె ఇంట్లో కొళాయి క్రింద కుండను పెట్టి త్రిప్పెను. తాడుమందముతో పడుతున్న నీటిధారను చూచి ధైర్యము పొందెను.

అట్లా రంగమ్మ కొళాయి తిప్పినందువలన సీతమ్మ ఇంటి కొళాయి కోప గించుకొనెను, 'కొర్' అని కూత పెట్టెను. సీతమ్మ చూచినది. వెనక బ్రతికి ఉండిన తాత మరణశయ్యమీదినుండి ఉబ్బసవ్యాధితో బాధపడినప్పుడు అతని ముక్కునుండి ఇట్టి స్వరమేవెడలి ఉండెను. దారమువలె ఉండిన నీరు చుక్కలుగా మారెను. చివరకు అదీ నిలిచిపోయెను.

ఎప్పుడూ ఇట్లే ఆమె ఇంట్లో కొళాయి తిప్పితే ఈమె ఇంట్లో కొళాయి 'గుర్' కొట్టి హఠము పడుతుంది. పాపమని ఆమె వదిలితే ఇక్కడ నీరువస్తుంది.

తాను నీళ్ళు నింపడము మరచిపోయింది. అది ఇప్పుడు కష్టమయింది. నిలిచిన కొళాయినే దీపము వెలుగులో చూస్తుండిన సీతమ్మకు రంగమ్మ ఇంట్లో బుడబుడమని నీరు కుండలో పడుతుండుట వినపడుతూనే ఉన్నది. బిందె ముక్కాలు నిండి కంఠము వరకువచ్చిన శబ్దము విని ఇంక ఆమె చాలిస్తుందని తలచెను. కాని బిందె నిండుతూనే హండాకు పోసి మళ్ళీ కొళాయికింద పెట్టడము విని తన తలపు తప్పని గ్రహించెను. గర్భభారముతో నిలబడలేక అక్కడే కూర్చుండెను. నొప్పి అప్పుడొకసారి ఇప్పుడొకసారి కనబడుతుండెను.

'త్రాగడానికి చుక్కనీరులేదు. విడుస్తారా రంగమ్మ.'

రంగమ్మకు వినబడేట్లు గట్టిగా అరచెను. రంగమ్మ బిందెలు ఎంచుకుంటూ నిలబడినది. 'హండాకు నాలుగు, పెద్ద తపెలకు రెండు, బానకు రేపు నీళ్ళు పోస్తావా' అనిన భర్త మొగమును ఆశ్చర్యముతో చూచెను 'ఏ దేవుడు మీకు ఈ బుద్ధి పుట్టించెనో సంధ్య పోసుకోండి.'

పతిరాయడు ఉదయము హండాకు నీరు పడుతున్నప్పుడు అన్న మాట జ్ఞాపకము–నకు వచ్చెను. హండాకు తపెలకు నిండేట్లు నీళ్ళువస్తే తెల్లవారి అయనకు నీళ్ళు పోయవచ్చు. పాడుకొళాయి ఇప్పుడే నిలిచి పోవలెనా?

'ఏమండి రంగమ్మ కొంచము నీరు విడవండి త్రాగడానికి చుక్క లేదు' తారస్థాయిలో సీతమ్మ అరవటము నీటిచప్పుడును మించి వినపడెను. (అబ్బా ఎంత గట్టిగా కొట్టు–కుంటుంది గయ్యాళిది.)

'విడుస్తా ఉండండి' ఈమె అంతే గట్టిగా బదులు చెప్పెను. చివరకు వినబడింది కదా. అబ్బా. కొంచెం నీళ్ళు వదలమంటే ఎంత బాధపడుతుంది. తలమీద కొట్టుకొంటుందా.

కొళాయి గొట్టము మీద కూర్చున్న సీతమ్మ నాలుగు సార్లు అరచిన తర్వాత ఆమె బదులు చెప్పినందుకు ఆలోచించెను. మళ్ళీ మూడు నిమిషాలైనది.

చిన్నగా నొప్పివచ్చెను. ముఖమంతా చెమటపట్టెను. వెంట వెంటనే భయమూ అయినది. భర్త వూళ్ళోలేరు. ప్రొద్దున్నే పెద్ద దొరగారితో దూరస్థలానికి ఇన్‌స్పెక్షనుకు పోయినారు. వారు ఉన్నప్పుడే నొప్పులు వచ్చిఉంటే ప్రయాణము తప్పిపోయేది అని అలోచిస్తూ తెప్పరిల్లి మళ్ళీ అరచెను. 'ఏమండీ. కొంచెం నీళ్ళు వదలండి' ఆమె పేరుపెట్టి పిలిచే ఓపిక కూడా లేకుండెను.

'సరే. ఉండేదె. ఇంక మూడు కడవలయిన తర్వాత మహారాణివలె నీళ్ళన్నీ ఆమే త్రాగనీ. ఎవరు వద్దంటారు. నేనేమి తలమీద కొట్టుకొనిపోతానా' గొణకొడుతూ రంగమ్మ మళ్ళీ చెప్పెను.

'అయిందమ్మా విడుస్తాను' అయ్యో ఎందుకొట్టుకుంటావు అనే ధాటితో.

ఆమె చెప్పుతూ వుండగానే చిన్నధారతో పడుతున్న ఆ నీళ్ళు ఆగి పోయెను. కొళాయి 'గొర్' అని కూత పెట్టెను.

'తథ్ ఇంక రెండు అయితే సరిపోయేది, పాడయిపోను' కొళాయి పనివాళ్ళను కలిపి రంగమ్మ మనసారా శపించెను.

నీరు నిలిచిపోవడము సీతమ్మ వినెను. చివరకైనా నిలిపినారు కదా అని కొళాయి త్రిప్పెను. నీరు రాలేదు. సీతమ్మకు బాధకలిగెను. ఏడుపు వచ్చెను. ఛ ఆమెకు అంతమాత్రం దయ రాలేదు. తాగడానికి నీళ్ళు లేవన్నా నిలపలేదు. ఒకటి రెండు చెంబులైనా నరిపోయేవి. ఆలోచిస్తూ మళ్ళా అరచెను. 'కొంచెం వదలండీ.' సహనము మీరి దుఃఖము ఎదనుంది ఉబికివస్తున్నా, కోపము వళ్ళంతా నిండి ఉన్నా అణుచుకొని అరిచింది.

'నిలిపినానండి.'

సీతమ్మ భయపడెను. అనుకున్నంతా అయింది నీరు పూర్తిగా అయింది. 'అబ్బా చివరి వరకు ఆమె హఠము సాధించింది. ఎంత మందిని కంటే ఎమి ఇంత కరుణ లేకపోతే' అనుకొనెను కంటిలో చుక్క తొణికెను.

నొప్పి మళ్ళీ వచ్చెను. ఆకలి పోటీ పడెను. మెల్లగా లేచి కంచము పెట్టుకొన్నది. పగలు చెంబులో నీళ్ళు పెట్టి ఉండడము జ్ఞప్తికి వచ్చెను. మూలలో ఉన్న చెంబును చూడగా ముక్కాలు నీళ్ళు ఉండెను. కొద్దిగా ధైర్యము వచ్చెను. సగము తినెనో లేదో మళ్ళీ నొప్పులు ఎక్కువైనవి. మొన్న వచ్చి పరీక్షించి పోతూ మంత్రసాని సుందరమ్మ 'ఎప్పుడైనా నొప్పులు వస్తే కొంచెము జీలకర్ర కషాయము త్రాగండి. అప్పటికీ నిలవకపోతే వచ్చి పిలవండి వస్తాను' అని చెప్పి ఉండెను'

'భయమేమీ లేదు కదా.'

'ఛ ఏమి భయం నేను లేనా' భర్త అడిగినప్పుడు ఆమె ఆ విధముగా చెప్పెను. పాపము ఆమె ఎంత మంచిది. తనకు తల్లిలేదు. పుట్టింట్లో కానుపు చెయ్యడానికి తండ్రికి శక్తి చాలదని తెలుసుకొని ఆమె కన్నతల్లి కంటె ఎక్కువ అంగలార్చి ఉండెను. ఆ జ్ఞాపకము రాగానే కషాయము చేసుకోవాలి. చేతకావడములేదు. రంగమ్మను పిలుస్తామా అనుకొనెను. వెంటనే స్వాభిమానము అడ్డు వచ్చినది. ఊహు వద్దు చెంబుడు నీళ్ళు విడువ లేదు, నేనయి ఎందుకు పోవాల అనిపించెను.

నొప్పితో అన్నము నోటికి పోలేదు. లేచి చెయ్యి కడుక్కొనెను. కుంపటి అంటించి రెండు లోటాల నీళ్ళు పోసి కషాయము కాచెను.

కొళాయిలో నీరు నిలిచి పోగానే రంగమ్మకు కోపము మితిమీరెను. ఇంకా రెండు బిందెలు కావలసి ఉండగా ఆగిపోవడము అంతలోనే సీతమ్మ అరవడము ఒళ్ళు మండించినది. 'ఓర్వలేనిది ఇప్పుడు చావనీ' అనుకొని నింపిన హండాకు పాత్రలకు మూత పెట్టి గుటికెడు నీళ్ళు త్రాగి దీపమార్చి వసారాకు వచ్చెను. అప్పటికే భర్త గురక పెడుతున్నాడు. పిల్లలు నిద్రపోతున్నారు. దీపము చేతికి, కళాయిలో నీళ్ళు వచ్చినవి, తీసుకొని రూముకు పోయి టైముకు చూచెను. పదకొండున్నర అయినది. మళ్ళీ వసారాలోకి వచ్చి పరువు పరచెను. అప్పుడనిపించెను.' ఆమె నీళ్ళు లేవని కొట్టుకున్నది చెంబుడు నీళ్ళు అడిగితే ఇవ్వనా. ఏమిలేక పోయినా జంభము మాత్రం ఉంది. హు ఎవరు వింటారు ఇవన్నీ. కోపపడి కూచుంటే కూర్చోనీలే. ఎవరికి నష్టం నీళ్ళు నిలిచిపోతే నా తప్పా.'

పరుపు పరిచి దుమ్ము దులిపెను. అంతలో పాలు మూసి పెట్టలేదని గుర్తుకు వచ్చి వంటింటి లోపలికి పోయెను. సీతమ్మ చేసుకొన్న కషాయము త్రాగి బయటికి వచ్చి పరుపు ఝాడించెను.

'నేనింకా నాలుగు రోజులు ఊర్లో ఉండనమ్మా. దయచేసి సీతను చూచుకొనే భారం మీదే. రాత్రి మా యింట్లోనే పడుకుంటే.'

'అయ్యో దానికేమి నాయనా. నేను మనిషిని కానా తప్పకుండా పండుకొంటాను నీవు నిరాటంకముగా నీ పనికి పోవచ్చు. మా పిల్లలో సీతమ్మా ఒకటి.' క్యాంపు పోయే ముందు తన భర్త రంగమ్మను పిలిచి చెప్పి తనకు ధైర్యము కలిగించి వెళ్ళడము తలుచుకొనెను. పాపం. వారు దూరములో ఉన్నా ఆయన మనస్సు ఇంటి విషయమే ఆలోచిస్తుండవచ్చు, అనుకొనెను. చీకట్లో తానొక్కతే ఉండవలసిన పరిస్థితిని తలుచుకుంటే గుండెల్లో భయము నిండెను. ఆమెను తోడుగా పిలుస్తామా అనిపించి మళ్ళీ ఊహుం. చూస్తాం ఆమే రావచ్చు. ప్రొద్దున తన భర్తకు ధైర్యమిచ్చింది కదా. అది జ్ఞాపకము రాకపోతుందా అనుకొనెను. భయమూ నడుమ వచ్చిన బిగుమానమూ భూతమైనది. కావాలనే మళ్ళీ రగ్గును ఒకసారి ఝాడించెను. ఆమెకు వినబడాలని, శబ్దము విని రావాలని.

ఒక వేళ రాకపోతే? అప్పుడు తానే పిలవవలెనా అస్పష్టసమాధానము భయంకరమై ఉండెను. గౌరవభంగమని పిలవడము వీలు కాదు. అట్లని ఒకతే పండుకోవడము

సాధ్యము కాదు. వస్తున్న నొప్పులు ఒక్కోసారి ఆమె నిశ్చయాన్ని నడలిస్తుండెను. ధైర్యమును జారుస్తుండెను. 'ఛూ, పాడు నొప్పి' అనుకొంటుండగానే నొప్పి తగ్గి ముందు తాను ఎదుర్కోవలసిన దృశ్యమును కల్పించుకొన్నపుడు వళ్ళంతా సిగ్గుతో ముడుచుకొని పోయెను. దీపము సన్నగా చేసి పరుపు మీద శరీరము వాల్చి మసక వెలుగుతో నెత్తురు గుడ్డును ఊహించుకొంటూ రంగమ్మ రాకనే కాచుకొని ఉండెను. రగ్గు ఝాడించడము రంగమ్మ కూడా విన్నది.

'ఏమండీ. వింటున్నారా?'

'ఏమి?'

'రాత్రి సీత ఇంట్లో పండుకొంటాను.'

'ఎందుకూ?'

'అతను ఊళ్ళోలేడు చెప్పి పోయినాడు. పాపం నెలలు నిండిన మనిషి.'

'సరే. కానీ. దానికేం.'

పగలు భోజన సమయములోనే ఆమె భర్తతో అనుమతి పొందినది. సీతమ్మ రగ్గు ఝాడించినపుడు అది గుర్తుకు వచ్చెను. అయినా ఊరకుండెను ఆమెకు కోపము వస్తే నేనేమి చేసేది. ఇంత చిన్న విషయాలకు కోపగించుకొంటే ఎవరైనా నవ్వుతారు. రేగి కూచుంటే కూచోని. నాకేమవసరము. ప్రాధేయపడి మాట్లాడడానికి. వ్రేలెడంత మనిషికి పదిమందిని కన్న తాను బెదరటమా?

దీపము పెద్దగానే వెలుగుతున్నది. దినమంతా పనిచేసి అలిసిన దేహము పరుపు కోసము త్వరపడుతున్నది. పరుపు మీద నిద్ర పోతున్న బిడ్డను ప్రక్కకు జరిపి దీపము దూరముగా పెట్టి వళ్ళు వాల్చెను. హాయి అనిపించినది.

దీపము పెద్దగా మండుతున్నది. నిద్ర ముంచుకొని వస్తున్నా మహా ప్రయత్నముతో ఆపుకొని ఆమె పిలుస్తుందేమో అని కాచుకొన్నది– నిద్ర పట్టినది.

'అయ్యో. చస్తిని.' బిడ్డను ఆడిస్తుండిన రంగమ్మ చెవి యొగ్గి వినెను.

'అయ్యో. .. అయ్యో.' ఇంటి చూరు వణికెను. భూమి కంపించెను. రూములో పొగనిండి ఊపిరి ఆడనీయలేదు. చుట్టూ పిల్లలు నవ్వుతున్నారు. హ్హా హ్హా హ్హా గడియకాలేదు. సీతమ్మ భర్త ఎదురు నిలిచి కండ్లలో నిప్పులు రాలుస్తున్నాడు.

నర్స్ తీక్షణముగా చూస్తున్నది.

తన మొగుడు మింగేట్లు చూస్తున్నాడు.

'ఏమండీ. గాడిద వలె ఉన్నారే కొంచెం చూచుకోలేక పోయినారా?'

'అంతమందిని ఎందుకు కన్నారు. తగలబెట్టండి.'

'అయ్యో రాక్షసి.'

రంగమ్మ చెయ్యివిసిరి వాళ్ళను కొట్టడానికి యత్నించెను. చెయ్యి పైకి లేవలేదు. సీతమ్మ పడిఉన్నది. రక్తపు మడుగులో రంగమ్మ ఈదుతున్నది. పుట్టిన శిశువు కండ్లు మిటకరిస్తూ ఏడుస్తున్నది. పైకప్పు కంపిస్తున్నది.

తటాలున రంగమ్మకు మెలుకువ వచ్చెను. కండ్లు తెరుస్తూనే పెద్దగా మండుతున్న దీపము భయంకరముగా కనబడినది. పక్క నున్న బిడ్డ ఏడుస్తున్నది. బిడ్డను తొడమీద ఉంచుకొని జోకొడుతున్నది. నిద్రమైకము జారి యథాస్థితికి వచ్చిన తరువాత ధైర్యము వచ్చెను. బిడ్డ నిద్రపోయినది. రూములోకి పోయి టైముచూచి తన కన్నులు తానే నమ్మలేకపోయెను. నాలుగున్నర అయిఉంది. బయట కాకి కూతలు వినవస్తున్నవి అప్పుడు రాత్రి జరిగినది జ్ఞాపకము వచ్చి గుండెలదిరెను.

'ఇంతకూ అమ్మాయి బలేమొండిది. నాకు వయసు వచ్చీదండగ. ఆడవాళ్ళకు అంతహఠము ఉండకూడదు' అనిపించెను. మెల్లగా లేచి హండా క్రింద నిప్పు వేసెను నీళ్ళు కాగే వరకు ఇంటి పనులు చేసుకొనెను. మాటి మాటికి సీతమ్మ ఇంటి వాకిలిని చూస్తుండెను. భర్త స్నానముచేసి బచ్చలినుండి వచ్చిరి. తడిసిన టవల్ ఉతకడానికి కంపొండులో సమిష్టగా ఉండిన కొళాయి దగ్గరకు పోయెను. ఇంకా నీళ్ళు రాలేదు లోపలి నుంచి తపెలతో నీళ్ళు తెచ్చుకొనెను.

బట్ట ఉతికిన చప్పుడుకు సీతమ్మకు మెలుకువ వచ్చినది. కనులు తెరచి చూస్తే దీపము చిన్నగా వెలుగుతున్నది. ఏదో గుర్తుకు వచ్చి వళ్ళు 'జుమ్' అనెను. సధ్య

నొప్పులు తగ్గినవి. మెల్లగా లేచి తలుపు తెరచి బచ్చలికి పోయెను. పోయేప్పుడు తిరిగిచూడగా రంగమ్మ కనపడెను. రాత్రి జరిగినది గుర్తుకు వచ్చి గుండె బరువయ్యెను. మౌనముతో లోపలికి పోయి హండాలో తొంగిచూచెను. అడుగు పట్టిన నీళ్ళలో తన ముఖము నగమే కనపడెను. వట్టిబిందెను నడుమున పెట్టుకొని మూడిండ్ల అవల ఉన్న బావినుంచి నీళ్ళు నీళ్ళు తేవడానికి కదిలెను. బయటకి వచ్చి రంగమ్మ ముందు నుంచి మౌనముగా తలవంచుకొని పోయెను.

'బిందె ఇక్కడియ్యి సీతమ్మా' రంగమ్మ అనెను.

చెవిటిదానివలె ఆమె అడుగు ముందు వేయగానె రంగమ్మ లేచి వచ్చి ఆమె చంకలోని బిందెను లాక్కొనెను.

ఎదురుగా ఉన్న కొళాయి 'కొర్' అని కూసెను. నీళ్ళు రభసముగా కొళాయి నుండి చిమ్మినట్లు పడుచుండెను. చిమ్మిననీరు ఇద్దరిముఖాలను తడిపెను. సీతమ్మ రంగమ్మ ముఖమును చూచెను. రంగమ్మ కళ్ళలో కనపడీ కనపడకుండా నీళ్ళు వచ్చి దృష్టి మందగించెను. ముఖమును ప్రక్కకు తిప్పుకొనెను.

◆

4

ఏ శాఖాగ్రంథాలయంలో దొరికిందో గాని రవీంద్ర కథావళి (1968) దొరికినరోజు నా జీవితంలో ఒక పండగరోజు. సాహిత్య అకాదెమీ కోసం మద్దిపట్ల సూరి అనువాదం చేసిన ఆ 21 కథలసంపుటం నాకు ఆ రోజుల్లో టాగోరు నా కోసం తెలుగులో రాసేడన్నట్టే ఉండేది.

అంతదాకా టాగోరుని ఒక కవిగానే ఎరిగి ఉన్న నాకు ఆయన కథలు కూడా రాసాడని తెలియడం ఒక ఆశ్చర్యం కాగా, ఆ కథల్లో కనిపించే జీవితం, సాధారణ రోజువారీ జీవితంగా, అత్యంత వాస్తవికంగా, చాలావరకూ నాకు తెలిసిన జీవితంగా కనిపించి నన్ను మరింత ఆశ్చర్యపరిచింది. కవితల్లో కనిపించే ఆ స్థలాలూ, ఆ జలాలూ, ఆ ఘాట్లూ, ఆ మబ్బూ, ఆ ఎండా కథల్లోనూ కనిపిస్తాయి. కాని కవితల్లో అవి ఆకాశానికి దారితీస్తుంటే, కథల్లో మన ఊళ్ళల్లోకీ, వీథుల్లోకీ, మన ఇళ్ళల్లోకీ దారితీస్తుంటాయి.

పుట్టి ముప్ఫై ఏళ్ళయినా కూడా ఏదో ఒక నిశ్చితమైన జీవనాధారాన్ని సముపార్జించుకోని కొడుకుని ప్రయోజకుణ్ణి చెయ్యాలనుకుని, మహర్షి దేవేంద్రనాథ టాగోరు, 1890 ల ప్రారంభంలో తూర్పు బెంగాల్లోని తమ ఎస్టేటు వ్యవహారాలు

చూసుకునే బాధ్యత అప్పగించడం టాగోరు జీవితాన్ని మలుపు తిప్పింది. మొదటిసారిగా ఆయన కలకత్తాని దాటిన ఒక గ్రామీణ ప్రపంచాన్ని చూసాడు. ఆ పద్మానది తీరంలో, ఆ ఇసుకతిన్నెల మధ్య, ఆ రెల్లుపొదల మధ్య, ఆ బావుల్ సంకీర్తనల మధ్య టాగోరుకి సర్వేశ్వరుడు సాక్షాత్కరించాడు. ఆ సాక్షాత్కార క్షణాలే గీతాంజలి గీతాలుగా రూపుదిద్దు-కున్నాయని మనకు తెలుసు. అదే సమయంలో ఆ గ్రామాల్లో, ఆ పొలాల్లో, ఆ రైతుల మధ్య, ఆ హిందూ-ముస్లిం నిరుపేద జీవితాల మధ్య కూడా ఆయన భగవంతుణ్ణి చూసాడు.

కవితల్లో లానే ఇక్కడ కూడా కనబడ్డ దేవుడు నిరాకారుడే. కాని మానవ సంబంధాల్లో, ఒంటరితనంలో, ఉద్వేగాల్లో, నిరుద్వేగంలో, భయాల్లో, అలౌకికప్రశాంతిలో- జీవితం అనుగ్రహించిన ప్రతి విలువైన క్షణంలోనూ ఆయన భగవంతుడి ఉనికిని కనుగొనగలిగాడు.



ఎస్టేటు వ్యవహారాలు చూసుకోడానికి 1891 లో సజద్‌పూరు వెళ్ళిన టాగోరు ఆ తర్వాత అయిదేళ్ళ కాలంలో దాదాపు 36 కథలు రాసాడు. అవన్నీ తమ కుటుంబం నడిపే సాధన పత్రిక కోసం రాయవలసిన అవసరం వల్ల రాసినవే. కాని అలా రాయడానికి తగిన ఒక విస్తారమైన పృష్ఠభూమి ఆయనకు తన ఎస్టేటు జీవితం వల్ల దొరికింది. ఆ కథలు ఒక కవి రాసిన కథలని మనకి తెలుస్తూనే ఉంటుంది గానీ, వాటిల్లో మనల్ని విభ్రాంతపరిచేది, ఆ

ఇతివృత్తాల్లోని వైవిధ్యమూ, ఆ కథకుడి నిశిత పరిశీలనలూనూ. ఇందులో 'శిథిలకుటీరం' పేరిట మద్దిపట్ల సూరి అనువదించిన 'నష్టనీడ్' ని నవలికగా కూడా లెక్కేస్తారుగానీ, టాగోరు కథల్లోంచి ఎంచమంటే ముందు ఆ కథనే ఎంచుతాను. తన జీవితానుభవమ్మీంచి రాసి–నందువల్ల మాత్రమే కాదు, పార్థివత్వపు ఒక విషాదసౌకుమార్యం ఆ కథపొడుగునా పరుచుకుని ఉంటుంది.

టాగోరు కథలన్నీ పూర్తిగా చదివేసాను అని అనుకున్న సమయంలోనే, ఒక రోజు మా మాష్టారు,'Hungry Stones కథ చదివేవా? మా కాటూరి మాష్టారు చదివించేరు నాతో' అని అంటే, ఆ కథ ఏమిటబ్బా అని మళ్ళా మరోసారి పుస్తకం తిరగేసాను. అది 'క్షుధితపాషాణాలు' కథ. ఇప్పటి మాటల్లో చెప్పాలంటే, మాజికల్ రియలిస్టు కథ. ఇలా ఒక్కొక్కసారి ఒక్కొక్క కథతో టాగోరు ఇన్నేళ్ళుగానూ నన్ను సంభ్రమపరుస్తూనే ఉన్నాడు.

కానీ, ఇప్పుడు నన్నో కథ ఎంచమంటే, ఆయన 1891 లో రాసిన 'పోస్ట్ మాష్టర్ 'కథ ఎంపిక చేస్తాను. ఆయన తూర్పుబెంగాల్లో సజద్ పూరులో ఉంటున్నప్పుడు, వాళ్ళ ప్రాంగణంలో ఒక పోస్ట్ మాస్టరు ఉండేవాడనీ ఆయన ఈ కథకి మూలం కావొచ్చునీ అంటారుగానీ, ఈ పోస్ట్ మాస్టర్ ఒక వ్యక్తి కాదు. తన స్వజనానికి దూరమైన ప్రతి ఒక్కడికీ ప్రతినిధి. తర్వాత రోజుల్లో ఈ పోస్ట్‌మాస్టర్ ఇతివృత్తం 'పోస్ట్

ఆఫీసు' నాటికగా మారినప్పుడు కూడా, ఇతివృత్తమైతే అదే, అదే బెంగ. అదే గృహోన్ముఖ ఆరాటం.

కాని ఇందులో అతడికొక ప్రాణి సాన్నిహిత్యం లభించడం ఈ కథని విషాద మధురంగా మార్చేసింది. తర్వాత రోజుల్లో విభూతి భూషణుడు 'పథేర్ పాంచాలి' (1928-29) రాసినప్పుడు దుర్గ, అపూ అనే అక్కాతమ్ముళ్ళు ఈ కథలోంచే ప్రవేశించారా అనిపిస్తుంది. అలానే ఆ తర్వాత మరొక పదేళ్ళకు ఆయన 'ఆరణ్యక' (1938-39) రాసినప్పుడు పూర్ణియా–ముంగేరు ప్రాంతంలో ఎస్టేటు మేనేజరుగా పనిచేసిన సత్యచరణ్ కూడా ఈ పోస్ట్ మాస్టరేనా అనిపిస్తుంది.

టాగోరు రాసిన 'గోరా', 'ఘరే–బైరే', 'శేషేర్ కొబిత' లాంటి నవలల గురించి లోతుగానూ, తాత్త్వికంగానూ చర్చించవచ్చు. కానీ పోస్ట్ మాస్టర్ చర్చించవలసిన కథ కాదు. పాతహిందీపాటలాగా గుర్తొచ్చినప్పుడల్లా మనసులో తీయని బాధనేదో మేల్కొల్పే కథ. అందుకనే ఈ కథని సత్యజిత్ రే సినిమాగా మలిచినప్పుడు ఆ interpretation నన్ను ఆకట్టుకోలేకపోయింది. టాగోరు కథ రాసిన దాదాపు తొంభై ఏళ్ళ తరువాత రే ఈ సినిమా తీసాడు. కానీ ఆయనకి ఆ కథలోని ఆత్మ అర్థం కాలేదనిపించింది. ఈ మధ్య మరొకరు కూడా ఈ కథని సినిమా తీసారని విన్నానుగాని, ఆ కథాసంగ్రహం విన్నాక ఆ సినిమా చూడకూడదనిపించింది.

నేను ఈ కథని సినిమాగా తీస్తే ఆ ఒంటరితనాన్ని పట్టుకోడానికి ప్రయత్నించి ఉండేవాణ్ణి. విస్తారమైన నదీమైదానం, ఆ గ్రామాలూ, ఆ నిర్జనపథాలూ, ఆ పడవలూ ఆ దృశ్యాల మధ్య, మధ్యలో ఆ చిన్న పిల్ల నేత్రాల్ని పదేపదే చూపించి ఉండేవాణ్ణి.

రవీంద్రనాథ టాగోరు

పోస్ట్ మాష్టర్

మద్దిపట్ల సూరి

ఉద్యోగంలో చేరగానే మొదట ఉలాపూర్ గ్రామానికి పోస్ట్‌మాస్టర్‌గా రావలసి వచ్చింది. ఉలాపూర్ చాలా చిన్న ఊరు. దగ్గరలో నీలిమందుకార్ఖానా ఒకటి ఉంది. కనుక ఆ కార్ఖానా దొర ఎంతో ప్రయత్నంచేసి, ఈ క్రొత్త పోస్టాఫీసు పెట్టించగలిగాడు.

మా పోస్ట్‌మాస్టర్ కలకత్తా బిడ్డ. నీళ్ళలోని చేపను ఒడ్డునపడేస్తే ఏమవుతుందో, ఈ కుగ్రామానికి వచ్చిన పోస్ట్‌మాస్టరు స్థితికూడా ఇంచుమించు అంతే అయింది. చీకటి కోణంగా ఉండే ఒక యింట్లో అతడి ఆఫీసు. దగ్గరలో నాచుతో కప్పి ఉండే చెరువు. దానికి నాలుగువైపులా అడవి. కార్ఖానాలో ఉండే గుమాస్తా మొదలైన ఉద్యోగులకెవరికీ ఇంచుమించు తీరికే ఉండదు. అదీకాక వాళ్లు పెద్ద మనుషులతో కలిసిమెలసి తిరగటానికి అర్హులు కారు.

ముఖ్యంగా కలకత్తా కుర్రవాళ్ళకి కలసిమెలసి ఉండటం తెలియదు. అపరిచితమైన చోటికి వెడితే, తల పొగరు వాళ్ళయినా అవుతారు. లేదా వెర్రివాళ్ళలాంటి వాళ్ళయినా అవుతారు. ఈ కారణంవల్ల స్థానికంగా ఉండేవారితో అతడు కలసిపోలేకపోయాడు. పైగా చేతికి ఎక్కువ పనిలేదు. అప్పుడప్పుడు ఒకటి అర కవితలు వ్రాయటానికి ప్రయత్నించేవాడు. రోజంతా తరుపల్లవాదుల కదలికలు– ఆకాశంలోని మేఘాల్ని

చూస్తూ కూచుంటే జీవితం సుఖంగా గడిచిపోతుంది– అన్నభావం వ్యక్తం అవుతూ వుంటుంది, కవితల్లో, ఒక వేళ అరేబియన్ అద్భుత నవలల్లోని ఏ దైత్యుడయినావచ్చి, ఒక్క రాత్రిలో శాఖాపల్లవాలతో సహా ఈ చెట్లనన్నీ నరికిపారేసి, గట్టిరాస్తా కనుక నిర్మిస్తే, అలాగే పెద్ద పెద్ద మేడలను ఆకాశంలోని మబ్బులు కనిపించకుండా ఉ ండేట్లు నిర్మిస్తే, ఏమవుతుందో అంతర్యామికే తెలియాలి. అలా అయితే ఈ సగం చచ్చిన మర్యాదస్తులబిడ్డ మళ్ళీ క్రొత్త జీవిగా జన్మించవలసిందే.

పోస్ట్ మాస్టర్ జీతం చాలా తక్కువ. తానే వంటచేసుకుని తినాలి. ఊళ్లో తల్లీ తండ్రీ లేని ఒక అనాథ బాలిక అతడి పనులు చేసిపెడుతూ ఉండేది. ఆమెకి నాలుగు మెతుకులు తినటానికి దొరికేవి. ఆ అమ్మాయి పేరు రతన్. పన్నెండు– పద మూడేళ్ళుంటాయి. పెళ్ళయే అవకాశం ఏమీ కన్పించదు.

సంజెవేళ పశువుల పాకల్లోంచి పొగలు పైకి వర్తులాకారంగా లేస్తూ ఉంటాయి. పొదల గుబురుల్లోంచి కీచురాళ్ళు కూస్తూంటాయి. దూరాన ఊళ్ళో త్రాగుబోతులైన దాసరివాళ్ళ ముఠా చప్పట్లు, డప్పులు మోగిస్తూ బిగ్గరగా పాటలు పాడుతూంటారు. చీకట్లో వసారాలో ఒంటరిగా కూర్చుని చెట్లు ఆకుల కదలికలు చూస్తూంటే, కవిహృదయంలో కూడా రవంత సంచలనం కలిగినప్పుడిహ ఇంట్లో మూల ఒక గుడ్డిదీపం వెలిగించి పోస్ట్ మాస్టర్ 'రతన్' అని పిలిచేవాడు. రతన్ గుమ్మంలో కూర్చుని ఈ పిలుపుకోసమే ఎదురుచూస్తూండేది. కాని ఒక్క పిలుపుతోనే ఇంట్లోకి వచ్చేదికాదు. 'ఏం బాబూ! ఎందుకు పిలుస్తున్నారు?' అని అడిగేది.

'ఏం చేస్తున్నావ్ నువ్వు?'

'ఇప్పుడే పొయ్యి వెలిగించటానికి వెళ్ళాలి. వంటింట్లో.'

'నీ వంటింటి పనుల తర్వాత చేసుకుందువుగాని ముందు ఒకమాటు చిలుంగొట్టం సిద్ధంచేసి ఇయ్యి'

కొంచెం సేపట్లోనే బుగ్గలు రెండు ఉబ్బించి చిలుంగొట్టం ఊదుకుంటూ రతన్ ప్రవేశించేది. ఆమె చేతిలోని గొట్టాన్ని అందుకుని, పోస్ట్ మాస్టర్ గబుక్కున 'అవును కాని రతన్, మీ అమ్మ జ్ఞాపకం వస్తూంటుందా?' అని అడిగేవాడు. చాలా సంగతులవన్నీ. కొన్ని జ్ఞాపకం వస్తాయి, కొన్ని జ్ఞాపకంరావు, తల్లికంటె తండ్రి ఆమెని ఎక్కువ అపేక్షగా

చూసేవాడు. తండ్రే కొంచెం లీలగా జ్ఞాపకం ఉన్నాడు. పగలల్లా కష్టపడి తండ్రి సంజెవేళకింటికి తిరిగివస్తూ ఉండేవాడు. అలాంటి రెండు సంజెవేళలు ఆమె హృదయంలో స్పష్టమైన చిత్తరువుల్లా హత్తుకుపోయాయి. ఈ మాటల్లోంచి క్రమంగా రతన్ పోస్ట్‌మాస్టరు కాళ్ళ దగ్గిర– కింద కూర్చుని చదువుకుంటూ ఉండేది. జ్ఞాపకాలు మెదిలేవి. ఆమె కొక తమ్ముడుండేవాడు. చాలా రోజులక్రితం ఒకనాడు వర్షంగా ఉన్న రోజున ఒక గుంటగట్టున ఇద్దరూ కలిసి, చెట్టున విరిగిన సన్నటి కొమ్మను గాలం చేసుకుని ఉత్తుత్తి చేపలుపట్టే ఆట ఆడుకున్నారు. చాలా ముఖ్యమైన సంఘటనల కంటే ఈ సంఘటనే ఆమె మనస్సులో బాగా మెదలుతూండేది. ఇలా మాటల్లో మధ్య మధ్య ఒకొక్క నాడు రాత్రి చాలా ప్రొద్దుపోతూ ఉండేది. అప్పుడిహ బద్ధకంకొద్దీ పోస్ట్ మాస్టర్ వంట చేసుకోటానికి ఇచ్చగించేవాడు కాదు. ప్రొద్దున వండుకున్న చప్పగా చల్లారిపోయిన కూరలవీ ఉండేవి. రతన్ గబగబా పొయ్యి వెలిగించి, కాసిని రొట్టెలుకాల్చి తీసుకువచ్చేది. వాటితోనే ఆరాత్రికిద్దరికీ తిండి వెళ్ళిపోయేది.

ఒకొకరోజున సంజెవేళ ఆ పెద్ద ఎనిమిదిదూలాల ఆఫీసు గృహంలో ఒక వైపున బల్ల మీద కూర్చుని పోస్ట్‌మాస్టర్ తన యింటి సంగతులు ఏకరువు పెట్టేవాడు. తల్లి, తమ్ముడు అక్కల సంగతులు– ప్రవాసంలో ఒంటరిగా ఇంట్లో కూర్చున్నప్పుడు మనస్సు ఎవరికోసం కొట్టుకుంటూ ఉంటుందో– వారి సంగతులు చెపుతూండేవాడు. ఎప్పుడూ మనస్సులో మెదలుతూండే సంగతులు, నీలిఫాక్టరీ గుమాస్తాలదగ్గిర తీసుకురావటానికి వీల్లేని సంగతులన్నీ చదువు సంస్కారంలేని ఆ చిన్నబాలికతో చెప్పుకునేవాడు. ఆసంగతమని అనిపించేదేకాదు. చివరకి– అతడా సంగతులన్నీ చెపుతున్నప్పుడు ఆ బాలిక వాళ్ళ యింట్లో వాళ్ళని అమ్మ, అక్క, అన్న అని వరసలు కలిపి మాట్లాడేదాకా వచ్చింది. అంతే కాదు తన చిన్నహృదయపటం మీద వారి ఊహారూపాలనుకూడా చిత్రించుకుంది.

వర్షకాలంలో– మబ్బులులేని ఒకనాటి మధ్యాహ్నవేళ చక్కని నులివెచ్చనిగాలి వీస్తోంది. ఆ గాలికి పచ్చిక మీదినుంచి, చిన్నచిన్న మొక్కల మీదినుంచి ఒక విధమైన వాసన వస్తోంది. అలసిపోయి ఉన్న ధరణి వేడినిట్టూర్పు ఒంటికి తగులుతున్నట్లుంది. ఎక్కడిదో మొండిపట్టు విడిచిపెట్టని పక్షి ఒకటి విరామమనేది లేకుండా ఒకే వరసన కూస్తూ, ఎదుటివారికెంతో జాలికలిగేట్లు ప్రకృతిదర్బారులో ఫిర్యాదుచేస్తోంది. పోస్ట్ మాస్టరుకి చేతిలో పనిలేదు. ఆనాటి వర్షంలో శుభ్రంగా కడిగివేసినట్లయి, ఒత్తుగా,

నిగనిగలాడుతున్న చెట్లచిగురుటాకుల కదలికలు, పరాజయం పొంది భగ్నావశిష్టాలై, ఎండలో తళతళలాడుతూ కుప్పలాగా ఉన్న మబ్బుతునకలు నిజంగా చూడతగి-నట్లున్నాయి. పోస్ట్‌మాస్టర్ వాటి కేసిచూస్తూ ఈ సమయంలో అత్యంతాత్మీయులెవరైనా దగ్గిరఉంటే- హృదయానికి హత్తుకునే అనురాగ పుత్తలియైన మానవమూర్తి సరసన ఉంటే- అని భావించుకోసాగాడు. క్రమంగా ఆ పక్షి కూడా మాటిమాటికీ ఈమాటే చెపుతున్నట్లు- ఎక్కడా ఒక్క మనిషయినా లేని ఈ మధ్యాహ్నపు చెట్లనీడల్లోని ఆకుల మర్మరధ్వనుల్లోని అర్థం కూడా చాలావరకు అదే అయినట్లు తోచసాగింది. ఒక చిన్న పల్లెటూరిలోని కొద్ది జీతం తెచ్చుకునే సబ్ పోస్ట్ మాస్టరు మనస్సులో- ఒక సెలవునాటి గభీరనిస్తబ్ధ మధ్యాహ్నవేళ ఇలాంటి భావాలు తలెత్తాయని అంటే- ఎవరూ నమ్మనూ నమ్మరు, అర్థమూ చేసుకోలేరు.

పోస్ట్‌మాస్టర్ పెద్ద నిట్టూర్పు ఒకటి విడిచి 'రత్నా!' అనిపిలిచాడు. రత్న అప్పుడు జామచెట్టుకింద, కాళ్ళు చాచుకుని పచ్చిజామకాయతింటూ కూర్చుంది. యజమాని గొంతు విన్పించగానే హడావిడిగా పరుగెత్తుకువచ్చి, రొప్పుతూ 'బాబుగారూ, పిలిచారా?' అన్నది. 'నీకు కాస్త చదువునేర్పుతాను' అని పోస్ట్‌మాస్టరు ఆ మధ్యాహ్నమంతా ఆమెకు 'అ' 'ఆ' లు నేర్పటం మొదలెట్టాడు. ఇలా కొద్దిరోజుల్లోనే ఆమెకి 'ఒత్తులు' కూడా వచ్చేశాయి.

శ్రావణమాసంలో వర్షాలకు అంతులేదు. కాలువలు, చెరువులు, దొరువులు నిండిపోయాయి. రాత్రింబగళ్ళు కప్పల బెకబెకలు- ఒకటే వర్షపుహోరు. గ్రామాల్లోని వీథుల్లో రాకపోకలు ఇంచుమించు నిలిచిపోయాయి. సంతలకి పడవలమీద వెళ్ళ వలసిందే.

ఒకనాడు ప్రొద్దునుంచి తెరపిలేకుండా కురుస్తోంది వర్షం. పోస్ట్ మాస్టరు శిష్యురాలు చాలాసేపటినుంచి గుమ్మందగ్గిర కనిపెట్టుకుని కూచుని ఉంది, కాని ఎప్పటిలాగా ఎంత సేపటికీ మామూలు పిలుపు రాకపోవటంతో తన పుస్తకాలు, కలం పెట్టుకున్న చిన్న పెట్టె తీసుకుని తానే లోపలికి వెళ్ళింది. పోస్ట్‌మాస్టరు తన మంచంమీద పడుకుని ఉన్నాడు. విశ్రాంతి తీసుకుంటున్నాడనుకుని, ఏం చప్పుడు కానీయకుండా మళ్ళీ మెల్లిగా గదిలోంచి బయటికి వెళ్ళబోయింది. చటుక్కున 'రత్నా' అని పిలుపు విన్పించింది. వెంటనే వెనక్కితిరిగి 'బాబుగారూ! నిద్రపోతున్నారా' అని అడిగింది. పోస్ట్‌మాస్టర్ భయభయంగా 'ఒంట్లో బాగున్నట్లు లేదు. నుదురు మీద

చెయ్యి వేసి చూడు' అన్నాడు. మరీ తోడు ఎవరూలేని ఈ ప్రవాసంలో, జోరుగా కురుస్తున్న వర్షంలో అస్వస్థతగా ఉన్న శరీరానికి కాస్త శుశ్రూష కావాలనిపించింది. కాలిపోతున్న నుదురుమీద గాజులచేతి కోమలస్పర్శ తలపుకు వచ్చింది. ఈ దుస్సహమైన ప్రవాసంలో రోగబాధలో స్నేహరూపిణులైన తల్లి, అక్క ప్రక్కన ఉండాలనిపిస్తుంది. ఇక్కడ ఈ ప్రవాసి మనస్సులోని అభిలాష వ్యర్థంకాలేదు. బాలిక అయిన రత్న ఇంక బాలికగా ఉండిపోలేదు. ఆ క్షణంలోనే ఆమె తల్లిస్థానాన్ని, అధికారాన్ని చేపట్టింది. వైద్యుణ్ణి పిలిపించింది. వేళకు మందు తాగించేది. రాత్రి అంతా తలంపిదిక్కున మేలుకుని కూర్చునేది. తానే పథ్యం వండిపెట్టేది. అంతేకాదు 'ఏం బాబుగారూ! కాస్త తేలిగ్గా ఉన్నట్లుందా?' అని ఒకటికి పదిసార్లు అడిగేది.

చాలారోజులకి పోస్ట్‌మాస్టరు చిక్కిశల్యమై రోగశయ్యమీదినుంచి లేచాడు. 'ఇహ లాభం లేదు. ఇక్కడినుంచి ఎలాగయినాసరే బదిలీచేయించుకోవాల'ని మనస్సులో నిర్ణయించుకున్నాడు. ప్రస్తుతపు అస్వస్థతను వ్యక్తంచేస్తూ తక్షణమే కలకత్తాలోని పై అధికారులకు, బదిలీ కోరుకుంటూ దరఖాస్తు పంపుకున్నాడు.

రోగి శుశ్రూషనుంచి బయటపడి, రత్న మళ్ళీ గుమ్మంబయట తన స్వస్థానాన్ని ఆక్రమించుకుంది. కాని వెనుకటిలాగా ఇప్పుడామెకి పిలుపురావటంలేదు. మధ్యమధ్య తొంగిచూస్తూ ఉండేది. పోస్ట్‌మాస్టరు మరీ పరధ్యానంగా బల్లమీద కూర్చునో, మంచం మీద పడుకునో ఉండేవాడు. రత్న తన పిలుపుకోసం ఎదురుచూస్తూ ఉన్నప్పుడు అతడు ఆదుర్దాగా తన దరఖాస్తుకి సమాధానం కోసం యెదురుచూస్తూ ఉండేవాడు. బాలిక గుమ్మంబయట కూర్చుని తన పాతపాఠాలు వెయ్యేసిసార్లు చదివేది. చటుక్కున ఎప్పుడు పిలుపు వస్తుందో, ఆ సమయానికి తనకు వచ్చిన ఒత్తులన్నీ ఎక్కడ తారు మారవుతాయో అని ఆమె కొక భయం ఉండేది. చివరకి వారంరోజులు పోయాక ఒకనాడు సంజెవేళ పిలుపు వచ్చింది. రత్న ఉద్వేలితహృదయంతో లోపలకు వచ్చి-

'బాబుగారూ! పిలిచారా నన్ను?' అని అడిగింది.

'రత్నా! రేపే నేను వెళ్లిపోతున్నాను' అని చెప్పాడు పోస్ట్‌మాస్టరు.

'ఎక్కడి వెడతారు బాబుగారూ?'

'ఇంటికి వెడుతున్నా.'

'మళ్లీ ఎప్పుడొస్తారు?'

'ఇంక రాను'

రత్న ఇంకేమీ అడగలేదు. పోస్ట్‌మాస్టరు తనంతట తానే తాను బదిలీకోసం దరఖాస్తు పెట్టుకున్నానని, దరఖాస్తు మంజూరు కాలేదని, అంచేత ఉద్యోగం వదిలేసి ఇంటికి వెళ్లిపోతున్నానని చెప్పాడు. చాలాసేపు ఇంక ఎవరూ ఏమీ మాట్లాడలేదు. మినుకు మినుకుమంటూ దీపం వెలుగుతోంది. ఒకచోట శిథిలమైపోయిన పైకప్పు చిల్లులలోనుంచి మట్టి మూకుడులో టప్ టప్‌మని వానబొట్లు పడుతున్నాయి.

కొంచెం సేపయాక రత్న మెల్లగా లేచి, రొట్టెలు చెయ్యటానికి వంటింట్లోకి వెళ్లింది. రోజూలాగా ఆ తొందరేమీలేదు. బహుశా మధ్య మధ్య మనస్సులోకి చాలా ఆలోచనలు వస్తున్నాయేమో అని తోస్తుంది. పోస్ట్‌మాస్టరు భోజనమయిన తర్వాత ఆ బాలిక అతణ్ణి 'బాబుగారూ! నన్ను మీ ఇంటికి తీసుకువెళ్లరాదూ?' అని అడిగింది.

పోస్ట్‌మాస్టరు నవ్వి 'అది యెలా సాధ్యమవుతుంది?' అన్నాడు. అసలు విషయ–మేమిటో– ఎందువల్ల సాధ్యం కాదో ఆ సంగతి బాలికకు నచ్చచెప్పటం ఆవశ్యకమని అనుకోలేదు.

రాత్రంతా మెలకువగా ఉన్నప్పుడు– కలలోనూ కూడా 'అది యెలా సాధ్యమ–వుతుంది?' అని నవ్వుతూ పోస్ట్‌మాస్టరు అన్నమాట ఆ బాలికకు చెవుల్లో ప్రతిధ్వనించ సాగింది.

పోస్ట్‌మాస్టరు తెల్లారకట్లనే లేచి, చూసేసరికి తన స్నానానికి నీళ్లు సిద్ధంగా పెట్టి ఉన్నాయి.

కలకత్తాలోని అలవాటు ప్రకారం– అతడు పట్టి ఉంచిన నీళ్లతోనే స్నానం చేస్తాడు. అతడు యెప్పుడు బయలుదేరుతున్నదీ బాలిక యెందుచేతనో అడగలేకపోయింది. ఒక వేళ ప్రొద్దున్నే ఎక్కడ అవసరమొస్తాయో అని రత్న క్రితం రాత్రే నదినుంచి స్నానానికి నీళ్ళు తీసుకొొచ్చి పెట్టి ఉంచింది. స్నానం అయాక రత్నకి పిలుపు వచ్చింది. రత్న నిశ్శబ్దంగా లోపలికి వచ్చింది. అతడి ఆదేశానికి ఎదురుచూస్తూ ఏం మాట్లాడకుండా ఒక్కసారి యజమాని ముఖంకేసి చూసింది. 'రత్నా! నా స్థానంలో వచ్చే అతడితో నేను చెప్పి వెడతాను. అతడు నిన్ను, నాలాగానే ఆదరిస్తాడు. నేను వెళ్ళిపోతున్నానని నువ్వేమీ

బెంగపెట్టుకోనక్కర్లేదు' అన్నాడు యజమాని. అతడి ఈ మాటలు ఆదరపూర్వక మయినవీ– దయార్ద్రహృదయంలోంచి వచ్చినవే. ఆ విషయంలో సందేహం యేమీలేదు. కాని స్త్రీ హృదయాన్ని ఎవరు తెలుసుకోగలరు ? రత్న ఎంతోకాలం యజమాని చివాట్లనెన్నో నోరెత్తకుండా సహించింది. కాని ఈ మెత్తని మాటలను మాత్రం సహించ లేక పోయింది. ఒక్కసారి బావురుమని యేడుస్తూ 'వద్దు వద్దు. మీరెవరికీ యేమీ చెప్ప నవసరం లేదు. నేనిక్కడ ఉండాలనుకోవటం లేదు' అన్నది.

రత్న ఇలా వ్యవహరించటం పోస్ట్‌మాస్టరు యెన్నడూ చూసి యెరుగడు. అంచేత చటుక్కున తెల్లబోయాడు.

క్రొత్త పోస్ట్‌మాస్టర్ వచ్చాడు. అతడికి చార్జి అంతా అప్పగించి, పాత పోస్ట్ మాస్టర్ ప్రయాణోన్ముఖుడయాడు. వెళ్లేప్పుడు రత్నను పిలిచి 'రత్నా! నీ కెప్పుడూ నేనేమీ యివ్వలేకపోయాను. ఇవాళ వెళ్లిపోతూ నీకు కొంచెం ఇచ్చి వెడుతున్నాను. దీంతో నీకు కొన్నాళ్లు గడుస్తుంది' అన్నాడు.

కొంచెం త్రోవ ఖర్చుకు పోను తనకు వచ్చిన జీతం పైకం మొత్తమంతా జేబులోంచి పైకితీశాడు. రత్న అప్పుడు అతడికి సాష్టాంగపడి, కాళ్లు రెండూ పట్టుకొని, 'బాబుగారూ! మీ కాళ్లు రెండూ పట్టుకుంటున్నా. మీ కాళ్లు రెండూ పట్టుకుంటున్నా. నాకేమీ యివ్వొద్దు. మీ కాళ్ళురెండూ పట్టుకుంటున్నా, నన్ను గురించి ఎవరూ ఏమీ దిగులు పెట్టుకోనఖ్కర్లేదు' అని, అక్కడినుంచి ఒక్క పరుగున పారిపోయింది.

పాత పోస్ట్‌మాస్టరు ఒక్క నిట్టూర్పు విడిచి, గళ్లసంచి చేతికి తగిలించుకుని గొడుగు పైన వేసుకుని, నీలం–తెలుపు చారల రేకుట్రంకు ఒకటి కూలివాడి నెత్తిన యెత్తి, మెల్లిగా పడవలరేవుకి బయలుదేరాడు. పడవయెక్కి, పడవ బయలుదేరేసరికి వర్షాల మూలంగా విస్తరించి ఉన్న నది– పొంగి పొరలిన ధరణి అశ్రురాశిలాగా నాలుగు వైపులా జలజలా ప్రవహిస్తోంది. అప్పుడతడి హృదయంలో అపరిమితమైన వేదన కలగసాగింది. ఒక సామాన్యగ్రామీణబాలిక ముఖచిత్రం. ఏదో విశ్వవ్యాప్తమైన అవ్యక్త మర్మవేదనను వ్యక్తం చేయసాగింది. 'తిరిగి వెడదాం, జగతి ఒడినుంచి జారిపోయిన ఆ అనాథను వెంట పెట్టుకు తీసుకువద్దాం' అని మరీ మరీ అనిపించిందొకసారి. కాని అప్పటికి తెరచాపకు గాలి బాగా అందుకుంది. నదీ ప్రవాహం చాలా వడిగా ఉంది. ఊరు దాటిపోయి, నది ఒడ్డున నుండే శ్మశానం కన్పిస్తోంది. నదీ ప్రవాహంలో

పయనిస్తున్న పథికుని ఉదాసీనహృదయంలో 'జీవితంలో ఇలాంటి ఎన్ని విచ్ఛేదాలు, ఎన్ని మృత్యువులున్నాయో? తిరిగి వెళ్లటంవల్ల లాభమేమిటి ? పృథివిలో ఎవరికి ఎవరు?' అన్న వైరాగ్యం ఉదయించింది.

కాని రత్న హృదయంలో ఎలాంటి వైరాగ్యం ఉదయించలేదు. ఆమె ఆ పోస్టాఫీసు నాలుగువైపుల్నీ కన్నీళ్లతో తడిపివేస్తూ అలాగే తిరుగుతోంది. బాబుగారొకవేళ తిరిగి వస్తారేమో' అన్న ఆశ మనస్సులో లీలగా తలెత్తి ఉంటుంది. ఆ బంధంలో చిక్కుకుని ఏమయినా అక్కడినుంచి కదలి దూరంగా వెళ్లలేకపోతోంది. ఎంత జ్ఞాన విహీనమైనది మానవ హృదయం! భ్రాంతి అనేది ఒక పట్టాన తొలగిపోదు. యుక్తి, వివేచన ఎంతో ఆలస్యంగా ప్రవేశిస్తాయి. మనస్సులో ప్రబలమైన ప్రమాణాలను సైతం విశ్వసించటం మాని, మిథ్య అయిన ఆశనే రెండుచేతులలో కౌగలించుకుని, శక్తి అంతనీ మోపి గుండెలకు గట్టిగా హత్తుకుని ఉంటుంది. చివరికెప్పుడో ఒకనాడది నాడులనన్నీ ఛేదించుకుని, హృదయంలోని రక్తాన్నంతనీ పీల్చివేసి పారిపోతుంది. అప్పుడు చైతన్యం కలుగుతుంది. కాని మళ్లీ మరో భ్రాంతిపాశంలో చిక్కుకోటానికి మనస్సు తహతహ లాడుతుంది. ..

◆

5

నలభై ఏళ్ళ కిందట నాకు దొరికిన చెహొూవ్ కథల పుస్తకం ప్రగతి ప్రచురణాలయం వారు ప్రచురించిన ‘ఎ.చెహొూవ్ కథలు’ (1973) మాత్రమే. అందులో ముందుమాటతో పాటు ఎనిమిది కథలున్నాయి. ఆ కథలు ఎన్నిసార్లు చదివానో చెప్పలేను.

చెహొూవ్ మొత్తం కథలన్నీ నాలుగు సంపుటాలూ (1988) రాదుగ ప్రచురణలు వారు వెలువరించినవి 1991 దాకా నా చేతికి రాలేదు. ఆ కథలు చదివాక, చెహొూవ్ కథల్లో మహిమాన్వితమైన కథలు చాలావరకూ తెలుగులోకి రాకుండానే ఉండి పోయాయని గ్రహించేను. (ఆ లోటు తీర్చడానికా అన్నట్టు కుమార్ కూనపరాజు గారు అరుణాప్రసాద్‌గారితో చెహొూవ్ కథలు అనువాదం చేయించి ఇప్పటికి రెండు సంపుటాలుగా వెలువరించారు.)

పగతి ప్రచురణాలయం అనువాదంలో ‘ద స్టెప్పీ’, ‘ద హౌజ్ విత్ ద మాన్సర్డ్’, ‘గూస్ బెర్రీస్’, ‘ఎ స్టోరీ ఆబౌట్ లవ్’, ‘ఎ స్టోరీ టోల్డ్ బై యాన్ అనానిమస్ మాన్’, ‘ద బ్లాక్ మాంక్’, ‘మై లైఫ్’ వంటి కథలు లేవుకానీ, ‘సీతాకోక చిలుక’, ‘ఇయోనిచ్’, ‘గుల్లలో జీవించిన మనిషి’, ‘పెండ్లి కూతురు’లతో పాటు ‘కుక్కను వెంటబెట్టుకున్న మహిళ’ వంటి మేలిమి కథలు చోటు చేసుకున్నాయి.

అందులో 'పెండ్లి కూతురు' కథని టాల్‌స్టాయి ఎంతో ప్రస్తుతించాడు. కాని ప్రపంచమంతా చెహోవ్‌ని మొదటిసారి చదివిన పాఠకులందరి లానే నేను కూడా 'కుక్కను వెంట బెట్టుకున్న మహిళ'తో ప్రేమలో పడిపోయాను.

ఆ కథ చెహోవ్ కథాశిల్పానికి పరిపూర్ణమైన నమూనా. అందుకనే రష్యను సాహిత్యం మీద తాను చేస్తున్న ప్రసంగాల్లో భాగంగా చెహోవ్ గురించి చెప్పేటప్పుడు వ్లదిమీరు నబకొవు ఈ కథ గురించే చాలా వివరంగా విశ్లేషించాడు.

ఈ కథ ఆధునిక కథాశిల్పానికి ఒక టెక్స్టుబుక్కు ఉదాహరణ. కథకి ఆద్యంతాలు లేకపోవడం, పాత్రలు ఎవరి పట్లా రచయిత తీర్పులివ్వక పోవడం, వివరాలు ఏ మేరకు ఇవ్వాలో ఆ మేరకే ఇవ్వడం, ప్రతి ఒక్క వివరమూ కథా గమనానికి తోడ్పడేదిగా ఉండాలనే పట్టుపట్టక పోవడం, కాని కథలో మెటఫర్లని ఆ కథలో భాగంగా పొదగడం- ఆధునికకథ ఎలా ఉండాలో ఈ కథని చూసే ప్రపంచవ్యాప్తంగా రచయితలు తమ శిల్పాన్ని సానబెట్టుకున్నారని చెప్పవచ్చు.

ఆ కథ చదివిన చాలాకాలం పాటు నేను అటువంటి కథ ఒకటి రాయాలని బలంగా అనిపించేది. చివరికి 'అమృతం' (1990) కథ రాయడం ద్వారా చెహోవ్ దగ్గర శిక్షణ పూర్తయిందనుకున్నాను. కాని ఏ కథ రాసినా దీన్ని చెహోవ్ అయితే ఎలా రాస్తాడనే ఆలోచన నన్నిప్పటికీ వదలదు.

ఆంటోన్ చెహోవ్

కుక్కను వెంటబెట్టుకున్న మహిళ

రాచమల్లు రామచంద్రారెడ్డి

యెవరో కొత్త మనిషి– కుక్కను వెంటబెట్టుకున్న మహిళ– విహారపథంలో కనిపించిందని జనం అనుకుంటున్నారు. ద్మీత్రి ద్మీత్రిచ్ గూరొవ్ యాల్టాకు వచ్చి పదైదు రోజులైంది. ఆ వూరి పద్ధతులకు అలవాటుపడి అతను కూడా కొత్త ఆగంతుకులలో ఆసక్తి కలిగించు– కోసాగినాడు. ఆతను వెర్నె ఆరుబయలు హొటల్‌లో కూర్చొని వుండగా, విహారపథంలో టోపీ పెట్టుకొని నడుస్తూ వుండిన యువతి కనిపించింది. ఆమెవెంట తెల్ల పొమెరేనియా కుక్క వుండింది.

తరువాత ఆమె మునిసిపల్ పార్కులోనూ, చౌకులోనూ అతనికి రోజూ పలుసార్లు యెదురైంది. ఆమె యెప్పుడూ ఒంటిగా వుండేది, అదే టోపీ పెట్టుకొని. ఆ కుక్క యెప్పుడూ వెంట వుండేది. ఆమె యెవరైందీ యెవరికీ తెలియదు. కేవలం 'కుక్కను వెంటబెట్టుకున్న మహిళ' గా జనం ఆమెను గురించి ప్రస్తావించేంచే వాళ్ళు.

'ఆమె యిక్కడ భర్త లేకుండా మిత్రులెవరూ లేకుండా వుంటే ఆమె పరిచయం చేసుకుంటే బాగనేవుంటుంది,' అనుకున్నాడు గూరోవ్.

అతనికింకా నలభై నిండలేదు. కానీ అతనికి పంద్రెండేండ్ల కూతురూ, యిద్దరు బడికి పోయే కొడుకులూ వుండినారు. కాలేజిలో రెండవ యేడులో వుండగా అతను

మాటలకు లోబడి పెండ్లి చేసుకున్నాడు. అతని భార్య యిప్పుడు దాదాపు తనంత రెండంతలు వయసు వున్నట్లు కనపడుతుంది. ఆమె నల్లని కనుబొమలతో, యెత్తుగా, నిటారుగా గంభీరంగా వుండేది, 'ఆలోచనాశీలి' నని తన్ను గురించి తాను చెప్పుకునేది. ఆమె యెక్కువగా పుస్తకాలు చదివేది, ఉత్తరాలలో వ్యావహారిక రూపాలు వాడేది, భర్తను ద్మీత్రీ అనకుండా దిమిత్రీ అనేది. ఆమె అజ్ఞురాలు అనీ, సంకులితమనస్క అనీ, అస్తవ్యస్తపు దుస్తుల మనిషి అనీ అతను మనసులో అనుకున్నా, ఆమెకు భయపడేవాడు, యింటివద్ద వుండడానికి అయిష్టపడేవాడు. అతను ఆమెను మోసగించడం ప్రారంభించి చాలా కాలమైంది. యిప్పుడతను పరస్త్రీలతో తిరిగేవాడు, అందువల్లనే స్త్రీలను గురించి నిరసనగా మాట్లాడేవాడు, వాళ్ళను అధమజాతి అనేవాడు.

బాధాకరమైన అనుభవంద్వారా నేర్చుకున్న గుణపాఠాల మూలంగా, వాళ్ళను తన యిష్టం వచ్చినట్టు అనే హక్కు తనకు వుందని అతను అనుకునేవాడు. కానీ యీ 'అధమ జాతి' లేకుండా అతను ఒక్క రోజు కూడా బతకగలిగేవాడు కాదు. పురుషుల మధ్య వున్నప్పుడు అతను యేమీ తోచక, యిబ్బందిపడేవాడు, వాళ్ళతో యెప్పుడూ ముభావంగా, నిర్లిప్తంగా వుండేవాడు. కానీ స్త్రీల మధ్య అతను చాలా సాఫీగా వుండేవాడు. వాళ్ళతో యేమి మాట్లాడవలసిందీ, యెలా ప్రవర్తించవలసిందీ అతనికి కచ్చితంగా తెలుసు. వాళ్ళ సాహచర్యంలో ఆవగింజంత యిబ్బందిపడకుండా అతను మౌనంగా కూడా వుండగలిగేవాడు. అతని వాలకంలోనూ, వైఖరిలోనూ యేదో అనిర్వచనీయమైన సమ్మోహనత్వం వుండేది. అది స్త్రీలను ఆకర్షించి, వాళ్ళ సానుభూతిని చూరగొనేది. యిది అతనికి తెలుసు. అతనే యేదో అదృశ్యశక్తిచేత వాళ్ళవైపు ఆకర్షితుడయ్యేవాడు.

ప్రతి కొత్త పరిచయమూ మొదట నిత్యజీవితంలోకి అంత ఆహ్లాదకరమైన వైవిధ్యం ప్రవేశపెట్టి, మనోహరమైన తేలిక ప్రణయకలాపంగా కనపడి, తరువాత, మర్యాదస్తుల మధ్య (ముఖ్యంగా, మనుషులు ఆంత అస్థిర మనస్కులుగా, అంత మందగమనులుగా వుండే మాస్కోలో) మహా జటిలమైన సమస్యగా అభివృద్ధి అయి, సహించరానంత సంకటకరమైన సన్నివేశానికి దారితీస్తుందని పదేపదే కలిగిన బాధాకరమైన ఆనుభవం అతనికి నేర్పింది. కానీ ఆకర్షణీయమైన స్త్రీ కనిపించిన ప్రతిసారీ అతను యీ అనుభవమంతా మరిచిపోయేవాడు, అతనిలో జీవితకాంక్ష ఉప్పొంగేది, హఠాత్తుగా ఆంతా సరళంగా, వినోదకరంగా కనిపించేది.

ఒక రోజు రాత్రి అతను పార్కులోని హెూటల్‌లో భోజనం చేస్తూవుండగా ఆ టోపీ స్త్రీ మెల్లగా అడుగులు వేసుకుంటూ లోపలికి వచ్చి, పక్క టేబుల్‌వద్ద కూర్చుంది. ఆమె వాలకమూ, నడకా, దుస్తులూ, కేశాలంకరణా, అన్నిటినీబట్టి ఆతనికి అర్ధమైంది, ఆమె ఉన్నత వర్గాలకు చెందినదనీ, వివాహిత అనీ, యాల్టాకు మొదటిసారి వచ్చిందనీ, అక్కడ ఒంటిగా వుందనీ, పొద్దుబోక అవస్థపడుతున్నదనీ . .. యాల్టాకు వచ్చేవాళ్ళ అవినీతిని గురించిన కథలలో అతిశయోక్తులు చాలా వుంటాయి. వాటిలో అధికభాగం, చేతనైతే సంతోషంగా నీతిని ఉల్లంఘించేవాళ్ళ కల్పితాలు అని అతనికి తెలిసినందున, అతను వాటిని లక్ష్యపెట్టలేదు. కానీ, ఆ స్త్రీ తనకు కొద్ది గజాల దూరంలో పక్క టేబుల్ వద్ద కూర్చున్నప్పుడు, యీ సులభవిజయాల కథలూ, కొండలలో షికార్ల కథలూ అతని మనసులో మెదలినాయి. సత్వర తాత్కాలిక ప్రణయం, తనకు పేరైనా తెలియని స్త్రీతో ప్రేమకలాపం, కలగవచ్చుననే భావం ఆతని మసస్సును హఠాత్తుగా లోబరచుకుంది.

కుక్కవైపు చూస్తూ అతను చిటిక వేసినాడు, ఆది తనదరికి వచ్చినప్పుడు చూపుడు వేలు ఆడించినాడు. పొమెరేనియా కుక్క మొరిగింది. గూరోవ్ మళ్ళీ వ్రేలు ఆడించినాడు.

ఆమె అతనివైపు చూసి, వెంటనే కండ్లు దించుకుంది.

'అది కరవదు,' అని ఆమె సిగ్గుపడింది.

'యెముక ముక్క యివ్వనా?' అని అడిగినాడు అతను. ఆమె ఆంగీకారంతో తల ఆడించగా, అతను హార్దికస్వరంతో అన్నాడు: 'మీరు యాల్టాకు వచ్చి చాలా రోజులైందా?'

'అయిదు రోజులైంది.'

'నేనిక్కడ రెండవ వారం యీడుస్తున్నాను.'

కొద్ది నిముషాల సేపు యెవరూ మాటాడలేదు.

'రోజులు త్వరగా గడుస్తాయి, కానీ యిక్కడ బొత్తిగా పొద్దుబోదు,' అన్నది ఆమె, అతనివైపు చూడకుండా.

'పొద్దుబోదనడం యిక్కడ మామూలు. బెలేవ్, జీబ్ద్ర లాంటి పాపిష్ఠివూర్లలో పొద్దుబోదని యెవరూ ఫిర్యాదు చేయరు. కానీ వాళ్ళు యిక్కడికి వచ్చి 'ఓ ఎంత

నిర్జీవం! ఓ ఎంత దుమ్ము' అంటారు. వాళ్ళు యే గ్రెనడానుండో వచ్చినట్టు మాట్లాడు-తారు.'

ఆమె నవ్వింది, తరువాత పూర్తిగా కొత్తవాళ్ళైనట్లు యిద్దరూ మౌనంగా భోంచేయ సాగినారు. కానీ భోజనం తర్వాత హొటల్‌నుండి యిద్దరూ కలిసి బయటికిపోయి స్వేచ్ఛా, సంతృప్తీ గలవాళ్ళు, ఫలానాచోటికి పోవాలని గానీ, ఫలానా విషయం మాట్లాడాలనిగానీ లేనివాళ్ళు మాట్లాడే తేలిక, హాస్యపూరిత సంభాషణ ప్రారంభించినారు. వాళ్ళు తీరికగా అడుగులు వేస్తూ, సముద్రం మీద కనపడే వింతకాంతిని గురించి మాట్లాడుకుంటూ వెళ్ళినారు. నీళ్ళు ఆహ్లాదకరమైన పూదారంగులో వుండినాయి, నీళ్ళమీద వెన్నెల బంగారుచారగా పడింది. పగలంతా వేడిగా వుండి, యిప్పుడు చాలా ఉక్కగా వుందని వాళ్ళు మాట్లాడుకున్నారు. గూరోవ్ తన్ను గురించి చెప్పినాడు, తాను మాస్కో వాసిననీ, నిజానికి తాను భాషాశాస్త్రవేత్త అయినా బాంకిలో పనిచేస్తున్నాననీ. ఒకప్పుడు తను సంగీతనాటకాల కంపెనీలో పాడడానికి సాధవచేసి, తరువాత ఆ అభిప్రాయం వదలిపెట్టినాననీ, తనకు మాస్కోలో రెండు యిండ్లు వున్నాయనీ. తరువాత ఆమెనుండి అతను తెలుసుకున్నాడు, ఆమె పీటర్స్‌బుర్గ్‌లో పెరిగిందనీ, యస్- పట్టణంలో పెండ్లి చేసుకుందనీ, రెండేండ్లుగా అక్కడ వుంటున్నదనీ, యాల్టాలో యింకా ఒక నెల వుంటుందనీ, తన భర్తకు కూడా విశ్రాంతి అవసరం గనుక అతను త్వరలో అక్కడికి రావచ్చుననీ. తన భర్త గుబెర్నియా కౌన్సిలు సభ్యుడైందీ, జెమ్‌స్త్వో బోర్డు సభ్యుడైందీ ఆమె బొత్తిగా చెప్పలేక, చెప్పలేనందుకు చాలా వినోదపడింది. ఆమె పేరు అన్నా సెర్గేయెవ్నా అని కూడా గూరోవ్ తెలుసుకున్నాడు.

తన గదికి తిరిగివచ్చిన తర్వాత అతను ఆమెను గురించి ఆలోచించినాడు, మరుదినం మళ్లీ ఆమెను కలుసుకుంటానని అతనికి నమ్మకంగా తోచింది. అది అనివార్యం. మంచం మీద పండుకుంటూ అతను అనుకున్నాడు, మొన్నమొన్నటిదాకా ఆమె తన కూతురులాగే బడికి పోతూ, పాఠాలు నేర్చుకుంటూ వుండిందని. ఆమె నవ్వులోనూ, కొత్తవానితో మాట్లాడే పద్ధతిలోనూ యెంత సిగ్గూ బిడియమూ వున్నదీ అతనికి జ్ఞాపకం వచ్చింది- ఆమె ఒంటరిగా వుండడమూ, ఆమె పసిగట్టకుండా వుండజాలని ఒక నిత్య, రహస్యలక్ష్యంతో పురుషులు ఆమెను అనుసరించి, గమనించి, ఆమెతో మాట్లాడే సన్నివేశంలో ఆమె వుండడమూ బహుశా యిది మొదటిసారి కావచ్చు.

ఆమె సన్నని, సుకుమారమైన మెడనూ, అందమైన ధూనరవర్ణపు కన్నులనూ అతను జ్ఞావకం చేసుకున్నాడు.

'అయినా ఆమెలో యేదో విషాదకరమైంది వుంది,' అనుకున్నాడు అతను నిద్రలో మునుగుతూ.

2

వాళ్ళకు పరిచయమై వారం గడిచింది. ఆ రోజు సెలవు దినం. యిండ్లలో ఉక్కగా వుండింది, కానీ బయట గాలికి దుమ్ము మేఘాలలాగా లేస్తూ వుండింది, తలలమీద టోపీలు కొట్టుకపోతూ వుండినాయి. ఆ రోజు దగగొలిపే దినం. అన్నా సెర్గేయెవ్నా కోసం పండ్ల రసాలూ, ఐస్‌క్రీమూ తేవడానికి గూరోవ్ ఆరుబయలు హోటల్‌కు పదేపదే పోతూవుండినాడు. వేడి దుర్భరంగా వుండింది.

సాయంత్రం, గాలి తగ్గినాక వాళ్ళు వచ్చే స్టీమర్‌ను చూడడానికి రేవుకు వెళ్ళినారు. ప్రయాణికులు దిగేచోట చాలామంది జనం వుండినారు. కొంతమంది, చేతులలో పూలతో, మిత్రులను కలుసుకుంటూ వుండినారు. నవనాగరికపు యాల్టాగుంపులో రెండు విశేషాలు స్పష్టంగా కనిపిస్తూ వుండినాయి – వయసుమళ్ళిన స్త్రీలు అందరూ వయసుకత్తెలలాగ దుస్తులు వేసుకోడానికి ప్రయత్నించినారు, మిలిటరీ జనరల్‌లు చాలామంది వున్నట్లుండింది.

సముద్రంలో అలలులేన్తూ వుండినందున స్టీమరు ఆలస్యంగా వచ్చింది, పొద్దు గుంకిన తర్వాత రేవు పక్కన వచ్చి నిలవడానికి అది కొంతసేపు అటూయిటూ మళ్ళవలసి వచ్చింది. అన్నా సెర్గేయెవ్నా తనకు తెలిసిన యెవరికోసమో వెతుకుతున్నట్లు బైనాకులర్ల గుండా స్టీమరునూ, ప్రయాణికులనూ కలయజూసింది. ఆమె గూరోవ్ వైపు మళ్ళినప్పుడు, అమె కన్నులు తడితో తళతళలాడినాయి. ఆమె చాలా యెక్కువగా మాట్లాడింది, పోలూ పొందూ లేని ప్రశ్నల వర్షం కురిపించింది, తాను తెలుసుకోగోరిందేమిటో వెంటనే మరిచిపోతూ వుండింది. తరువాత జనం రద్దీలో ఆమె తన బైనాకులర్లు పోగొట్టుకుంది.

నవనాగరికపు గుంపు విడిపోసాగింది, రూపురేఖలు గమనించడం ఆసాధ్యమైంది, గాలి బాగా తగ్గింది, స్టీమరులోనుండి యింకా యెవరి రాకకొరకో కాచుకున్నట్టు గూరొవూ, అన్నా సెర్గేయెవ్నా అక్కడ నిలుచుకున్నారు. అన్నా సెర్గేయెవ్నా మౌనంగా

వుండిపోయింది, సారిసారికీ తన చేతిలోని పూలు మూచూస్తూ, కానీ గూరొవ్ వైపు చూడకుండా.

'మంచి సాయంత్రంగా మారింది,' అన్నాడు అతను. 'యేం చేద్దాం?బండిలో షికారు వెళ్ళవచ్చు.'

ఆమె జవాబు చెప్పలేదు.

అతను ఆమెవైపు నిశ్చలంగా చూసినాడు, హఠాత్తుగా ఆమెను కౌగలించుకొని, పెదవులు ముద్దు పెట్టుకున్నాడు, పూల పరిమళమూ, తడీ ఆతన్ని చుట్టుముట్టినాయి, కానీ మరుక్షణం అతను భయంతో వెనక్కి తిరిగిచూసినాడు– తమనెవరైనా చూసినారా?

'మీ గదికి వెళ్దాం పద' అతను మెల్లగా అన్నాడు.

వడివడిగా యిద్దరూ కలిసి నడిచిపోయినారు.

ఆమె గది ఉక్కగా వుండింది, జపాన్ దుకాణంలో కొన్న యేదో సెంటువాసన వేస్తూవుండింది. గూరొవ్ ఆమెవైపు చూసి అనుకున్నాడు: 'జీవితంనిండా యెన్ని చిత్రమైన కలయికలు!' దిగులూ భయమూ లేని సహృదయలైన స్త్రీలు, కామక్రీడచేత ప్రహర్షచిత్తలై, యెంత స్వల్పకాలికమైనదైనా తానిచ్చిన ఆనందానికి తనకు కృతజ్ఞత చూపిన స్త్రీలు అతనికి జ్ఞాపకమున్నారు. యిక మరికొందరు వుండినారు– వాళ్ళలో తన భార్య ఒకతె– వాళ్ళ అలింగనాలు కపటంగా, కృత్రిమంగా, ఉన్మాదంగా, బోలెడు అనవసరపు మాటలతో కలిసి వుండేవి. యిదంతావట్టి కామక్రీడ కానట్టూ, మోహావేశం కానట్టూ, అంతకంటే ముఖ్యమైనదేదో అయినట్టూ వుండేది వాళ్ళ వాలకం.

తరువాత, యిద్దరు ముగ్గురు నిర్లిప్తలైన సుందరాంగులు వుండినారు. వాళ్ళ ముఖలక్షణాలలో యేదో ఘాతుకభావం తారాడుతూ వుండేది, జీవితం నుండి ఆది యివ్వగలిగినదానికంటే యెక్కువ పిండుకోవాలనే దీక్షను వ్యక్తంచేస్తూ. వాళ్ళు ప్రథమ యవ్వనం దాటిన వాళ్ళు, చపలచిత్తలు, పెత్తందారీ బుద్ధులు, బొత్తిగా మెదడు లేని వాళ్ళు, వాళ్ళపట్ల గూరొవ్ వ్యామోహం చల్లబడిన తర్వాత వాళ్ళ సౌందర్యం అతనికి యేవగింపు మాత్రమే కలిగించేది, వాళ్ళ లోపలి దుస్తుల లేసులు అతనికి చేపల పొలుసులను గుర్తుకు తెచ్చేవి.

కానీ యిక్కడ యవ్వనంలోనూ, అనుభవరాహిత్యంలోనూ వుండే పిరికితనమూ, అస్తవ్యస్తతా యింకా స్పష్టంగా వున్నాయి. ఆమె మనసులో ఆందోళన భావంవుంది, అకాలంలో యెవరో తలుపు తట్టినట్టు. అన్నా సెర్గేయెవ్నా 'కుక్కను వెంటబెట్టుకున్న మహిళ,' యీ వ్యవహారాన్ని యేదో మహా ప్రత్యేకమైనదిగా, మహాగురుతరమైనదిగా వరిగణిస్తున్నది, తాను పతిత ఆయినట్లు పరిగణిస్తున్నది. ఆ భావం అతనికి విడ్డూరంగా, మనశ్శాంతిహారిగా వుండింది. ఆమె ముఖలక్షణాలు విచారపూరితంగా వున్నాయి, ముఖానికి యిరువైపులా వెంద్రుకలు దుఃఖమయంగా వ్రేలాడుతున్నాయి. ఆమె విచారకర ధ్యానముద్ర ధరించింది, పాతకాలపు వర్ణచిత్రంలోని పశ్చాత్తప్త పాపిలాగ.

'యిది మంచిది కాదు,' అన్నది అమె, 'మీకు యిక నామీద గౌరవంవుండదు.'

టేబుల్‌మీద కర్బూజపండు వుండింది. గూరొవ్ ఒక ముక్క కోసుకొని నిదానంగా తినసాగినాడు. కనీసం ఒక అరగంట మౌనంగా గడిచింది.

అన్నా సెర్గేయెవ్నా అనుతాపజనకంగా వుండింది, జీవితాన్ని చాలా కొద్దిగా చూసిన నిష్కల్మష అమాయక స్త్రీ యొక్క స్వచ్ఛతను వ్యక్తం చేస్తూ వుండింది. టేబుల్‌మీద వున్న ఒకే ఒక కొవ్వొత్తి వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా కనపడలేదు, కానీ ఆమె హృదయం భారంగా వున్నట్టు స్పష్టంగా తెలుస్తూ వుండింది.

'నాకు నీమీద గౌరవం యెందుకు ఆగిపోతుంది?' అని అడిగినాడు అతను. 'నీవేమి మాట్లాడేదీ నీకే తెలియదు.'

'భగవంతుడు నన్ను క్షమించుగాక! యిది దారుణం! అన్నది ఆమె. ఆమె కండ్లలో నీళ్ళు నిండినాయి.

'అత్మసమర్ధన చేసుకోవలసిన ఆవసరం లేదు నీకు.'

ఆత్మసమర్థన యెలా చేసుకోగలను? నేను దుష్టురాలిని, పతితను. నామీద నాకే అనహ్యం కలుగుతున్నది, ఆత్మసమర్ధన చేసుకునే ఉద్దేశం నాకేమాత్రమూ లేదు. నేను మోసగించింది. నా భర్తను కాదు, నన్నే, యిప్పుడే కాదు చాలా కాలంగా నన్ను నేను మోసగించుకుంటున్నాను. నా భర్త నిజాయితీపరుడు, యోగ్యుడు, సందేహం లేదు, కానీ జోహుకుంగాడు. అతను అఫీసులో యేమిచేస్తాడో నాకు తెలియదు, కానీ అతను జోహుకుంగాడని నాకు తెలుసు. నేనతన్ని పెండ్లాడినప్పుడు నాకు యిరవై యేండ్లు

మాత్రమే, జీవితం యేమిటో తెలుసుకోవాలనే ఉత్సుకతతో నేను చచ్చిపోయినాను, నాకు మరింత ఉన్నతమైనదానిమీదకోరిక కలిగింది. యింతకంటె భిన్నమైన జీవితం మరొకటి వుండాలని మనసులో అనుకున్నాను, ఆ జీవితం నేను జీవించాలి. నేను ఉత్సుకతతో దహించుకపోయినాను. మీకెప్పటికీ అర్థం కాదది. ప్రమాణం చేసి చెప్తున్నాను, నన్ను నేను నిగ్రహించుకోలేకపోయినాను, నన్నేదీ అరికట్టలేకపోయింది, నాకు ఒళ్ళు బాగలేదని నా భర్తతో చెప్పి, యిక్కడికి వచ్చినాను. .. పిచ్చి పట్టినట్లు, దయ్యం పట్టినట్లు తిరగసాగినాను. .. యిక యిప్పుడు సాదా మనిషినైనాను, పనికిమాలిన మనిషినైనాను, ప్రతి వాళ్ళకూ యిప్పుడు నన్ను అసహ్యించుకొనే హక్కు వుంది.'

గూరొవ్ విన్నాడు, భరించరాని విసుగుతో. ఆ పసితనపు ఉచ్చారణా, పశ్చాత్తాపమూ, అంతా అంత అసందర్భంగా, అంత యెదురుచూడనిదిగా వుండింది. ఆమె కన్నులలో ఆ నీరు లేకపోతే ఆమె హాస్యమాడుతున్నదనో, నటన చేస్తున్నదనో అనుకోవచ్చు.

అతను మృదువుగా అన్నాడు: 'నాకు అర్థం కావడంలేదు. యేమిటి నీకు కావలసింది?'

ఆమె అతని రొమ్మున ముఖం దాచుకొని గట్టిగా అతనికి ఆనుకుంది.

'నన్ను నమ్మండి. నమ్మమని మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను,' అన్నది ఆమె, 'జీవితంలో నిష్కపటమూ, పరిశుద్ధమూ అయినదంతా నేను ప్రేమిస్తాను, చెడ్డపని నాకు అసహ్యం, నేనేమి చేస్తున్నానో నాకు తెలియదు. మామూలు జనం అంటుంటారు, తాము సైతాను వలలో చిక్కినామని, యిప్పుడు నేను కూడా సైతాను వలలో చిక్కినానని అనగలను.'

'ఛీఛీ యేమిటిది!' అని మెల్లగా అన్నాడు అతను.

నిశ్చలమైన, భయవిహ్వలమైన అమె కన్నులలోకి అతను నిలజూసినాడు, ఆమెను ముద్దు పెట్టుకున్నాడు, మెత్తని, ప్రేమార్ద్రమైన మాటలతో అమెను అనునయించినాడు. క్రమక్రమంగా ఆమె శాంతించి, తిరిగి ఉత్సాహం పొందింది. కాసేపట్లో మళ్లీ యిద్దరూ నవ్వుకుంటూ వుండినారు.

కొంతసేపు తర్వాత వాళ్ళు బయటికి వెళ్లినారు. విహారపథంలో మనుషులు ఒక్క పిట్ట లేరు, పట్టణమూ, పట్టణంలోని సైప్రస్ చెట్లూ మరణించినట్లుండినాయి, కానీ సముద్రం బీచిమీద యెగిరిపడుతూ యింకా గర్జిస్తూ వుండింది. ఏకాకి చేపల పడవ ఒకటి అలలమీద పడుతూ లేస్తూ వుండింది, పడవలోని దీపం నిద్రమత్తుతో మినుకుమినుకు మంటూ వుండింది.

వాళ్ళ కొక గుర్రపుబండి దొరకగా ఒరియాందకు పోయినారు.

'హాలులో యిప్పుడే నీ పేరు కనుక్కున్నాను,' అన్నాడు గూరొవ్ ఆమెతో, 'బోర్డు మీద రాసిపెట్టినారు. ఫన్ డీడెరిత్స్. నీ భర్త జర్మనా?'

'కాదు. వాళ్ళ తాత జర్మన్ అనుకుంటాను. కానీ నా భర్త ఆర్థడాక్స్ మతస్థుడు.'

ఒరియాందలో బండి దిగి వాళ్ళు చర్చికి కాస్త దూరంలో బెంచీమీద కూర్చున్నారు. వాళ్ళు మాటలు లేకుండా సముద్రం వైపు చూస్తూ వుండినారు. తెల్లవారు జాము పొగమంచులో యాల్టా లీలగా కనిపిస్తూ వుండింది, పర్వతశిఖరాలమీద తెల్లని మేఘాలు నిశ్చలంగా విశ్రమించినాయి. ఆకు అల్లాడలేదు, అకుతేళ్ళు కీచుకీచుమంటూ వుండినాయి, రోకటిపాటలాంటి సముద్రపు మందగర్జ వాళ్ళకు వినిపిస్తూ వుండింది, శాంతిని గురించి, మనందరి కోసమూ పొంచుకొనివున్న శాశ్వతశాంతిని గురించి, మాట్లాడుతూ, యాల్టాలూ, ఒరియాందలూ లేకముందు సముద్రం యిలాగే గర్జించింది, యిప్పుడూ గర్జిస్తున్నది, యిక ముందు మనం గతించిన తర్వాత కూడా యిలాగే నిర్లక్ష్యంగా మందంగా గర్జిస్తూ వుంటుంది. యీ అనుస్యూతిలో, జీవమరణాలపట్ల గల యీ పరమనిర్లక్ష్యంలో, మన అంతిమమోక్షంయొక్కా, మన గ్రహంమీది జీవస్రవంతి యొక్కా, పరిపూర్ణతవైపు దాని నిరంతరగమనంయొక్కా రహస్యం వుండవచ్చు. ప్రాతః–కాంతిలో అంత అతిలోకంగాకనపడే ఒక యువతి పక్కన కూర్చొన్న, సముద్రమూ, పర్వతాలూ, మేఘాలూ, అనంతమైన ఆకాశమూ, యీ అన్నింటి దివ్య సౌందర్యదర్శనం చేత ప్రశాంతుడై, సమ్మోహితుడై గూరొవ్ తనలో అనుకున్నాడు. లోతుగా ఆలోచిస్తే, ప్రపంచంలో ప్రతిదీ నిజంగా సుందరమైనదే – ఉన్నత జీవితలక్ష్యాలూ, మానవులంగా మన గౌరవమూ మనకు కనుమరుగైనప్పుడు మన ఆలోచనలూ, చేతలూ తప్ప ప్రతిదీ.

యెవరో వాళ్ళను సమీపించినారు – వాచ్‌మన్ కావచ్చు. వాళ్ళను చూసి అతను వెళ్ళిపోయినాడు. యిందులో కూడా నిగూఢమైనదీ, మనోహరమైనదీ యేదోవుండింది.

ఫియొదోసియానుండి వచ్చిన స్టీమరు, దీపాలు ఆరిపోయి, ఉషఃకాంతిలో రేవువద్దకు రావడం కనిపించింది.

'గడ్డిమీద మంచు వుంది,' అన్నది అన్నా సెర్గేయెవ్నా, మౌనం వదలిపెట్టి.

'అవును. యింటికి పోయే వేళ అయింది.'

వాళ్ళు పట్టణానికి తిరిగి పోయినారు.

ఆ తర్వాత వాళ్ళ ప్రతిరోజూ మధ్యాహ్నం విహారపథంలో కలుసుకునేవాళ్ళు. మధ్యాహ్నమూ, రాత్రీ కలిసి భోంచేసేవాళ్ళు, షికారు పోయేవాళ్ళు, సముద్రసౌందర్యాన్ని ఆస్వాదించేవాళ్ళు. ఆమె నిద్రపట్టడం లేదనీ, గుండెదడ వస్తున్నదనీ ఫిర్యాదులు చేసేది, మళ్ళీమళ్ళీ అవే ప్రశ్నలు అడిగేది, ఒకసారి అసూయకూ, మరొకసారి అతను తన్ను నిజంగా గౌరవించడం లేదనే భయానికీ మార్చి మార్చిలోనయ్యేది. తరుచుగా, చౌకులోనో, పార్కులోనో యెవరూ కనిపించనప్పుడు, అతను ఆమెను దగ్గరకు తీసుకొని, ఆవేశంతో ముద్దు పెట్టుకునేవాడు. బొత్తిగా యేమీపని లేకపోవడమూ, పట్టపగలు పెట్టుకునే యీ ముద్దులూ, వాటివెంట వుండే దొంగచూపులూ, యెవరికైనా తెలుస్తుందనే భయమూ, వేడీ, సముద్రపు వాసనా, పని లేని, కడుపు నిండిన, నవనాగరికపు మనుషులు నిత్యం వాళ్ళ దృష్టిపథంలోకి వస్తూపోతూ వుండడమూ యివన్నీ అతనికి కొత్త ఆయుస్సును యిచ్చినట్టుంది. ఆమె అందంగా వుందనీ, మహా ప్రలోభకరంగా వుందనీ ఆతను ఆమెతో చెప్పేవాడు, మహా ఆవేశంతో కామక్రీడకు పురికొనేవాడు, ఒక క్షణం వదలకుండా యెప్పుడూ ఆమె పక్కన వుండేవాడు. ఆమె యెప్పుడూ విచారంగా వుండేది, అతను ఆమెను గౌరవించడంలేదనీ, అణుమాత్రమూ ప్రేమించడంలేదనీ, ఆమెను సాదాస్త్రీగా పరిగణిస్తున్నాడనీ అతనినుండి ఒవ్వుదలను రాబట్టడానికి యెప్పుడూ ప్రయత్నించేది. దాదాపు ప్రతిరాత్రీ వాళ్ళు పట్టణంనుండి బయటికి బండిలో షికారు వెళ్ళేవాళ్ళు, ఒరియాందకో, జలపాతంవద్దకో, మరొక సౌందర్యస్థానం వద్దకో. ఈ యాత్రలు తప్పనిసరిగా కృతార్థంగా వుండేవి, ప్రతీదీ రాజనసౌందర్యపు కొత్త అనుభూతులు సమకూర్చేది.

యీ కాలమంతా వాళ్ళు ఆమె భర్త రాకను నిరీక్షిస్తూ వుండినారు. కానీ అతని కేదో కండ్లజబ్బు వచ్చిందని తెలుపుతూ ఆమెను సాధ్యమైనంత త్వరలో యింటికి

రమ్మని అభ్యర్థిస్తూ భర్త వద్దనుండి ఆమెకు ఉత్తరం వచ్చింది. అన్నాసెర్గేయెవ్నా బయలుదేరడానికి తొందర తొందరగా సన్నాహాలు చేసుకుంది.

'నే పోవడం మంచిది,' అన్నది ఆమె గూరొవ్‌తో. 'విధి జోక్యం యిది.'

ఆమె యాల్టా నుండి బండిలో బయలుదేరింది, రైలు స్టేషనుదాకా ఆతను వెంట పోయినాడు. బండి ప్రయాణం దాదాపు ఒకరోజంతా పట్టింది. ఆమె యెక్స్‌ప్రెస్ రైలు యెక్కి, రెండవ గంట మ్రోగిన తర్వాత యిలా అన్నది:

'యేదీ, మిమ్మల్ని మరొకసారి చూడనివ్వండి. చివరి చూపు. ఆఁ అదీ.'

ఆమె యేడ్వలేదు, కానీ దుఃఖపూరితంగా వుండింది, జబ్బు పడినట్టు కనపడింది, చెక్కిళ్ళమీది కండరాలు టకటకలాడుతూ వుండినాయి.

'మిమ్మల్ని అనుకుంటుంటాను. .. నిరంతరం అనుకుంటుంటాను,' అన్నది ఆమె. 'దేవుని దయవల్ల మీకు శుభం కలుగుగాక! నన్ను గురించి దయగా అనుకోండి. మనం శాశ్వతంగా విడిపోతున్నాము. అదే మంచిది. యెందుకంటే, మనమసలు కలుసుకొని వుండకూడదు. సెలవు– దేవుని దయవల్ల మీకు శుభం కలుగుగాక!'

రైలు వేగంగా స్టేషన్ దాటిపోయింది, రైలు దీపాలు త్వరలో అదృశ్యమైనాయి,– ఒక నిముషం తర్వాత దాని శబ్దం కూడా అంతరించింది యీ మధురమైన మైమరపును, యీ ఉన్మాదస్థితిని, వీలైనంత త్వరగా ముగించడానికి ప్రతిదీ కుట్రపన్నుతున్నట్టు. గూరొవ్ ప్లాట్‌ఫారంమీద ఒంటరిగా నిలబడి, అంధకారమయమైన దూరంలోకి చూపులు నిగుడించి, ఆకుతేళ్ళ కీచునాదమూ, టెలిగ్రాఫ్ తంతెల ఓంకారనాదమూ విన్నాడు – అప్పుడే మెలకువ వచ్చిన అనుభూతి పొందుతూ. అతను మనసులో అనుకున్నాడు, తన జీవితంలో కలిగిన అనేక ప్రణయకలాపాలలాంటిదే యిది మరొకటి అనీ, యిది కూడా ముగిసిందనీ, స్మృతి తప్ప యేమీ మిగలలేదనీ. .. అతనికి మనస్సు సంచలించింది, దుఃఖం కలిగింది, కించిత్తు పశ్చాత్తాపం కలిగింది. యెంతైనా మళ్లీ జీవితంలో తానెన్నడూ చూడబోని యీ యువతి తనతో నిజమైన సంతోషం పొందలేదు. ఆమెపట్ల తాను హార్దికంగా, అపేక్షగా వుండినాడు, కానీ తన మొత్తం ప్రవర్తనలో, తన కంఠస్వరాలలో, తన ఆలింగనాలలోనే ఒక వ్యంగ్యరేఖ వుండింది, అదృష్టవంతుడైన మగమహారాజుయొక్క అవజ్ఞాపూర్వకమైన ఆదరణ వుండింది. పైగా తాను వయసులో

ఆమెకంటె రెండింతలు పెద్దవాడు. తాను మంచివాడనీ, అసాధారణుడనీ, ఉదాత్తుడనీ ఆమెపట్టుబట్టి అనేది. అనగా తాను తన నిజమైన వ్యక్తిత్వంకంటే భిన్నంగా ఆమెకు కనపడినాడన్నమాట. ఒక్క మాటలో చెప్పాలంటే, తాను అనుకోకుండానే ఆమెను మోసగించినాడు. ..

గాలిలో హేమంతస్ఫూర్తి వుండింది, సాయంత్రం చలిగా వుండింది.

'నేను కూడా ఉత్తరాదికి వెళ్ళే సమయం వచ్చింది,' అనుకున్నాడు గూరొవ్, ప్లాట్‌ఫారంమీదనుండి బయటికి నడుస్తూ. 'సమయం పూర్తిగా వచ్చింది!'

3

ఆతను మాస్కో చేరేటప్పటికి చలికాలం ప్రారంభమౌతున్నట్లుండింది. స్టౌలు రోజూ వేడిచేస్తూ వుండినారు, పిల్లలు బడికి పోడానికి నిద్రలేచేటప్పటికి యింకా చీకటిగా వుండేది, అందువలన నర్సు కాసేపు దీపం వెలిగించేది. చలి ప్రవేశించింది. మొదటి మంచు పడితే, మొదటిసారి మంచుబండిమీద షికారు పోయినప్పుడు, తెల్లని నేలా తెల్లని మిద్దె కప్పులూ చూడడం హాయిగా వుంటుంది. స్వేచ్ఛగా, తేలికగా వూపిరి పీల్చుకుంటుంటే, యవ్వనపు రోజులు జ్ఞాపకం వస్తాయి. మంచుతో తెల్లగా వున్న పురాతనపు లైమ్‌చెట్లూ, బర్చ్‌చెట్లూ ప్రసన్నంగా కనపడతాయి, సైప్రస్ చెట్లకంటె, పామ్‌చెట్ల కంటె హృదయానికి సన్నిహితంగా వుంటాయి. వాటి కొమ్మలకింద పర్వతాల సముద్రాల స్మృతి మనిషిని వెంటాడదు.

గూరొవ్ యెప్పుడూ మాస్కోలో జీవించినవాడు. ఆతమ ఒక మంచి చలిరోజున మాస్కోకు తిరిగివచ్చి, ఫర్ లైనింగుగల చలికోటూ, మందం గ్లౌలూ ధరించి, పెత్రోవ్క వీథిలో తీరికగా అడుగులు వేస్తూ నడిచినప్పుడూ, శనివారం సాయంత్రం చర్చి గంటల గణగణ విన్నప్పుడూ, ఆతని యిటీవలి ప్రయాణమూ, అతను చూసిన స్థలాలూ వాటి ఆకర్షణ కోల్పోయినాయి. క్రమక్రమంగా అతను మాస్కో జీవితంలో మునిగిపోయినాడు, ఆబగా రోజూ మూడు వార్తాపత్రికలు చదివేవాడు, ఒకవైపున మాస్కో వార్తాపత్రికలు చదవకపోవడం తన నియమం ఆని చెప్పుకుంటూ. మళ్ళీ అతను రెస్టరెంటుల, క్లబ్బుల, విందుల, వినోదాల సుడిగుండంలో చిక్కుకున్నాడు. మళ్ళీ అతను సుప్రసిద్ధ న్యాయ-వాదులూ, నటులూ తన యింటికి వస్తారనీ, మెడికల్ క్లబ్బులో తాను ఒక ప్రొఫెసర్‌తో పేకాట ఆడుతాననీ అనే గర్వకారకమైన స్పృహతో ఉబ్బిపోయినాడు.

ఒక నెలలో అన్నా సెర్గేయెవ్నా పట్టి అస్పష్టస్మృతిగా వుంటుందనీ, ఆ కాంక్షాభారపు దరహాసంతో, ఆమెలాంటి యితర స్త్రీలలాగే, తనకు అప్పుడప్పుడు కలలో మాత్రం వస్తుందనీ అతను నమ్మినాడు. కానీ, యిప్పుడు నెల బాగా గడిచిపోయి చలి కాలం నడికొనింది. అయినా, నిన్ననే అన్నా సెర్గేయెవ్నా విడిపోయినంత స్పష్టంగా వుంది అతని మనసులో అంతా. అతని స్మృతులు అంతకంతకూ గాఢమైనాయి. అతను తన పఠనాగారంలో వుండగా సాయంత్రపు నిశ్చలత్వంలో, పాఠాలు చదువుకునే తన పిల్లల గొంతులు చెవులబడినప్పుడూ, రెస్టరెంటులో ఒక పాటో, జంత్రనాదమో వినపడి–నప్పుడూ, పొగగూట్లో గాలి గీపెట్టినప్పుడూ, అతనికి వెనకటివన్నీ తలపుకు వచ్చేవి. రేవువద్ద ప్రత్యూషఃకాలమూ, పొగమంచు చాటున పర్వతాలూ, ఫియొదోసియా నుండి వచ్చే స్టీమరూ, ముద్దులూ. చాలాసేపు అతను తన గదిలో అటూయిటూ పచార్లు చేస్తూ, తన స్మృతులను చూసి చిరునవ్వు నవ్వుకునేవాడు, తరువాత స్మృతి పగటికలగా మారేది, అతని ఊహలో జరిగిందీ జరగబోయేదీ కలగలిసి పోయేవి. అన్నా సెర్గేయెవ్నా అతనికి కలలో రాలేదు, ఆమెయెప్పుడూ అతని వెంట వుండింది, నీడలాగా, అతను యెక్కడికి పోయినా అనుసరిస్తూ. అతను కండ్లు మూసుకుంటే, ఆమె సాక్షాత్తుగా యెదుట నిలబడినట్లుండేది, వాస్తవంగా ఆమె వుండినంతకంటె మనోహరంగా, పడుచుదిగా, కోమలంగా. వెనక్కిచూసుకుంటే, అతనికి అతనే యాల్టాలో వున్నంతకంటె బాగా కనిపించేవాడు. సాయంత్రంపూట ఆమె బుక్ షెల్ఫులలోనుండీ, పొయ్యివద్దనుండీ, గది మూలల నుండీ అతనివైపు చూసేది. ఆమె వూపిరి తీసుకోవడమూ, ఆమె దుస్తుల శ్రావ్యమైన సవసవా అతనికి వినిపించేవి. వీధుల్లో అతను స్త్రీలను కలయజూసేవాడు. ఆమెలాంటి వాళ్ళెవరైనా కనిపిస్తారేమో అని . ..

తన స్మృతులు యెవరితోనైనా చెప్పుకోవాలని అతనికొక దుర్వారమైనకోరిక కలగ సాగింది. తన ప్రేమను గురించి అతను యింట్లో మాట్లాడలేదు, యిక బయట తన మనసు విప్పడానికి యెవరున్నారు? తన యింట్లో అద్దెకున్నవాళ్ళా, కాదు. బాంకిలో తన సహోద్యోగులా, కానేకాదు. యింతకూ చెప్పడానికి యేముందని? తనకు కలిగింది ప్రేమేనా? అన్నా సెర్గేయెవ్నాతో తనకు గల సంబంధాలలో అతిలోకసుందరమైనదేమైనా వుందా? కవితామయమైనదేమైనా వుందా? జ్ఞానదాయకమైనది గానీ, చివరకు వినోద–కరమైనదిగానీ యేమైనా వుందా? ప్రేమను గురించీ, స్త్రీలను గురించీ అతను అస్పష్టమైన సూత్రాలు మాత్రం మాట్లాడగలిగినాడు. అతని ఉద్దేశమేమిటో యెవరికీ అర్థం కాలేదు. కానీ అతని భార్య, తన నల్లని కనుబొమలు చిటచిటలాడిస్తూ యిలా అన్నది:

'షోకిల్లా పాత్ర నీకు బొత్తిగా సరిపడదు దిమీత్రీ.'

ఒక సాయంత్రం, ప్రభుత్యోద్యోగి అయిన ఒక పేకాట మిత్రునితో కలిసి మెడికల్‌క్లబ్బులోనుండి బయటికి వస్తూ, అతను వుండబట్టలేక యిలా అన్నాడు:

'యాల్టాలో నేను యెంత మనోహరమైన స్త్రీని కలుసుకున్నానో తెలుసా!'

ఉద్యోగి మంచుబండిలో యెక్కి, సరిగ్గా బయలుదేరేటప్పుడు కేకవేసినాడు.

'ద్మీత్రీ ద్మీత్రిచ్!'

'ఆc?'

'మీరన్నది నిజమే– చేప కాస్త కాటుబోయింది.'

యీ మాటలు అంత మామూలువైనా యెందువల్లనో గూరొవ్‌కు మంట పుట్టించినాయి, అవమానకరంగా అసహ్యంగా కనిపించినాయి. యెంత ఆటవిక మర్యాదలు, యేం మనుషులు! యెంత వృథా అయిన సాయంత్రాలు, యెంత విసుగు కలిగించే నిస్సారపు దినాలు! ప్రాణంమీదికి వచ్చినట్టు పేకాడడమూ, చెడ తినడమూ, చెడ తాగడమూ, ఒకే విషయం గురించి యెడతెగకుండా మాట్లాడడమూ. యెవరికీ అక్కరకురాని విషయాలలోనూ, చర్చించిన విషయాన్నే మళ్ళీమళ్ళీ చర్చించడంలోనూ మనిషికున్న కాలంలోనూ, శక్తిలోనూ అధికభాగం వ్యయమైపోతున్నాయి. వీటికన్నిటికీ ఫలితంగా దక్కింది యేమిటంటే, యిలకరుచుకున్న అవిటి బతుకూ, కొరగాని చిల్లరవిషయాల పరంపరా. వీటినుండి తప్పించుకొనిపోడానికి మరొకచోటులేదు. యిదంతా పిచ్చాసుపత్రిలోనో, జైలులోనో వున్నట్టుంది!

గూరొవ్‌కు ఆ వేడితో ఆ రాత్రంతా నిద్రపట్టలేదు, మరుదినం పగలంతా అతను తలనొప్పితో తిరిగినాడు. తరువాతి రాత్రిళ్లు కూడా అతనికి సరిగా నిద్రపట్టక, మంచంలో లేచి కూర్చొనేవాడు ఆలోచిస్తూ, లేదా గదిలో పచారు చేసేవాడు. అతనికి పిల్లలన్నా, బాంకన్నా వెగటు కలిగింది, యెక్కడికి పోవడానికీ, యేమి మాట్లాడడానికీ యిష్టం లేకపోయింది.

క్రిస్మస్ సెలవులు వచ్చినప్పుడు అతను సామాన్లు సర్దుకొని, ఒక యువకుని పనిమీద పీటర్స్‌బుర్గ్‌కు పోతున్నానని భార్యతో చెప్పి, యస్– పట్టణానికి బయలు–

దేరినాడు. యేం చెయ్యాలని? ఆతనికే సరిగా తెలియదు. అతనికి తెలిసిందల్లా తాను అన్నా సెర్గేయెవ్నాను చూడాలి, ఆమెతో మాట్లాడాలి, వీలైతే సమావేశం కుదిరించు–కోవాలి.

ప్రొద్దున్నే అతను యస్– చేరినాడు, హొటల్లోకెల్ల మంచి గది అద్దెకు తీసుకున్నాడు. దానిలో నేలమీద బూడిదరంగు రత్నకంబళి వుంది, టేబుల్‌మీద ధూళి నిండిన కలందాను వుంది, దానిమీద తల లేని ఆశ్వికుని బొమ్మ వుంది, చేతితో టోపీ యెత్తిపట్టుకొని ఆతనికి కావలసిన సమాచారం హొటల్ నౌకరు చెప్పినాడు. ఫన్ డీడెరిత్స్‌కు 'స్తారొ గొంచార్నయ' వీథిలో సొంత యిల్లు వుంది. అది హొటల్‌కు దూరం కాదు. అతను దర్జాగా, వైభవంగా జీవిస్తున్నాడు, అతనికి గుర్రపుబండ్లు వున్నాయి, పట్టణమందరికీ ఆతను తెలుసు. అతని పేరును నౌకరు 'ద్రిదిరిత్స్' అని ఉచ్చరించినాడు.

స్తారొ గొంచార్నయ వీథిలో గూరొవ్ మెల్లగా నడుచుకుంటూ వెళ్ళి ఆ యిల్లు కనుక్కున్నాడు. యింటికి యెదురుగా పొడవైన, బూడిద రంగు కంచె, కొయ్య పలకలది వుంది. పలకలమీద పదునుపాటు పైకి వుండేటట్లు మేకులు దిగగొట్టబడినాయి.

ఆ యింటి కిటికీలవైపూ, కంచెవైపూ చూస్తూ గూరొవ్ అనుకున్నాడు: 'యిలాంటి కంచె చాలు, యెవరికైనా పారిపోవాలనిపిస్తుంది.'

ఆరోజు సెలవు గనుక, ఆమె భర్త యింట్లో వుండవచ్చునని అతను తర్కించు–కున్నాడు. యేమైనా తాను ఆ యింట్లోకి పోయి ఆమెను యిబ్బంది పెట్టడం అనుచితంగా వుంటుంది. చీటీ పంపిస్తే, ఆమె భర్త చేతుల్లో పడి, సర్వనాశనం కలిగించవచ్చు. అన్నిటికంటె ఉత్తమమైన పని ఆమె కనిపించే అవకాశం కొరకు ఆ ప్రాంతంలో కాచుకోవడం. అతను అవకాశం కొరకు వీథిలో అటూయిటూ తిరుగుతూ, కంచెకు సమీపంలో తచ్చాడుతూ వుండినాడు. ఒక బిచ్చగాడు గేటులో ప్రవేశించినాడు, అతనిమీద కుక్కలు దాడిచేసినాయి. ఒక గంట తర్వాత మెల్లని అస్పష్టమైన పియానొ ధ్వనులు అతని చెవులబడినాయి. అన్నా సెర్గేయెవ్నా వాయిస్తూ వుండవచ్చు. హఠాత్తుగా తలవాకిలి తెరచుకొని, ఒక ముసలామె బయటికి నచ్చింది, పరిచితమైన తెల్ల పొమెరేనియా కుక్క ఆమెవెంట వుండింది. గూరొవ్ కుక్కను పిలవడానికి ప్రయత్నించినాడు, కానీ అతని గుండె తీవ్రంగా కొట్టుకొంది, ఆ ఆందోళనలో అతనికి దాని పేరు జ్ఞాపకం రాలేదు.

అతను నడుస్తూ ముందుకు సాగినాడు, బూడిద రంగు కంచెను అంతకంతకూ యెక్కువగా ద్వేషిస్తూ. కోపంగా అతను అన్నా సెర్గేయెవ్నా తన్ను మరచిపోయిందనీ, బహుశా యిప్పటికి మరొకణ్ని చూసుకొని వుంటుందనీ, పొద్దస్తమానం యీ పాపిష్ఠి కంచెను చూడవలసి వున్న యువతికి అంతకంటె సహజమైనది యేముంటుందనీ తనలో తాను అనుకోడానికి సిద్ధంగా వుండినాడు. ఆతను హొటల్‌కు తిరిగిపోయి తన గదిలో సోఫా మీద కొంతసేపు పండుకున్నాడు, యేమి చేయడానికీ తోచక. తరువాత అతను భోజనం చేసినాడు, భోజనం తరువాత చాలా సేపు నిద్రపోయినాడు.

నిద్ర లేచి చీకటిగా వున్న కిటికీలవైపు చూస్తూ అతను 'యెంత తెలివిలేని, శాంతి లేని వ్యవహారం,' అనుకున్నాడు. అప్పటికి సాయంత్రమైంది. 'నిద్రంతాతీరింది. యేం చెయ్యాలి రాత్రికి?'

అతను మంచంమీద లేచి కూర్చున్నాడు. ఆ మంచంమీద కప్పిన చౌక, బూడిదరంగు రగ్గు ఆస్పత్రి దుప్పట్లను గుర్తుకు తెచ్చింది. ఆ కలతలో అతను తన్నుతాను భంగించుకోసాగినాడు.

'నీవూ, నీ కుక్కను వెంటబెట్టుకున్న మహిళా. .. మంచి ప్రణయ వ్యవహారమే! నీ కష్టాలకు ప్రతిఫలమేమిటో చూడు.'

ఆ ఉదయం అతను స్టేషన్‌లో దిగినప్పుడు, స్థానిక నాటకశాలలో 'గెయ్‌షా ప్రథమప్రదర్శన' అని బ్రహ్మాండమైన అక్షరాలలో ప్రకటించే పోస్టర్ చూసినాడు. అది జ్ఞాపకం వచ్చి అతను లేచి, నాటకశాలకు దారితీసినాడు.

'ఆమె ప్రథమప్రదర్శనలకు పోవడం యెంతైనా ప్రాయికం,' అనుకున్నాడు అతను.

నాటకశాల నిండివుండింది. అది అచ్చం చిన్న పట్టణాల నాటకశాల, దీపాల చుట్టూ పొగమంచు చేరుతూ వుండింది, గాలరీలోని జనం అస్థిమితంగా గోలచేస్తూ వుండినారు.. ఫస్టుక్లాసులోని మొదటి వరుసలో స్థానిక షోకిల్లాలు తెర లేవడం కొరకు కాళ్ళమీద కాచుకొని వుండినారు. గవర్నర్ బాక్సు ముందు సీటులో గవర్నర్ కూతురు కూర్చొని వుంది, మెడలో బోవా ధరించి. బాక్సు తెరల చాటున గవర్నరు వినయంగా దాక్కున్నాడు, చేతులు మాత్రం బయటికి కనిపించేటట్లు. తెర కదిలింది, ఆర్కెస్ట్రా తమ వాద్యాలు శ్రుతి పెట్టుకోడానికి చాలాసేపు పట్టింది, లోపలికి వచ్చి, తమతమ

ఆసనాలలో కూర్చునే ప్రేక్షకులను గూరొవ్ కన్నులు ఉత్సుకతతో కలయజూస్తూ వుండినాయి. అన్నా సెర్గేయెవ్నా కూడా లోపలికివచ్చింది. ఆమె ఫస్టుక్లాసులోని మూడవ వరుసలో కూర్చుంది. గూరొవ్ చూపు ఆమెమీద పడినప్పుడు, అతని గుండె ఆగినట్లైంది, మెరుపులాగ అతనికి మనసుకు వచ్చింది, యావత్ప్రపంచంలోనూ తనకు యింతకంటె ఆత్మీయమైనవాళ్ళూ, ప్రియతమమైనవాళ్ళూ లేరని, తన ఆనందానికి యింతకంటె ముఖ్యమైనవాళ్ళు లేరని. యీ చిన్న స్త్రీ చిన్నపట్టణం జనంలో కలిసిపోయినది, యేవిధంగానూ అసాధారణమైనది కానిది, చేతిలో వెధవ బైనాకులర్స్ పట్టుకున్నది, యిప్పుడు తన జీవితమంతా ఆక్రమించింది, తన దుఖమూ, తన ఆనందమూ, తన సమస్తవాంఛా అయింది. దుర్బల, అపరిణత వయొలినిస్టులు గల దౌర్భాగ్యపు ఆర్కెస్ట్రా నుండి వచ్చే ధ్వనులచేత జోకొట్టబడి ఆమె యెంత అందంగా వుందా అని అతను అనుకున్నాడు. .. అనుకుంటూ, కలలలో మునిగిపోయినాడు. ..

అన్నా సెర్గేయెవ్నా వెంట గుండ్రని భుజాలూ, చిన్న పుస్తీలూ గల పొడవాటి యువకుడు వుండినాడు. ఆమె పక్కన కూర్చున్నాడు. అతను ఆడుగడుగునా తల ఆడిస్తూ, నిత్యం యెవరికో ఒకరికి నమస్కరిస్తున్నట్లు కనిపించినాడు. యితను ఆమె భర్త, అయివుండాలి – యాల్టాలో ఆమె, మంట పుట్టినప్పుడు, 'జోహుకుంగాడు' అన్న మనిషి. అతని జండాకర్ర లాంటి ఆకారంలోనూ, పుస్తీలలోనూ, నడినెత్తినవున్న కాస్త బట్టతలలోనూ నిజంగా సేవకుని దాస్యభావం కొంత వుండింది. అతను తియ్యని చిరునవ్వులు నవ్వుతూ వుండినాడు. కోటు కాజాలోవున్న యేదో విజ్ఞానశాస్త్ర సంఘపు బాడ్జి నౌకర్ల దుస్తులమీది నంబరు లాగ వుండింది.

మొదటి ఇంటర్వల్‌లో భర్త సిగరెట్టు కాల్చుకోడానికి బయటికి వెళ్ళినాడు. ఫస్టుక్లాసు సీటులో కూర్చొని వుండిన గూరొవ్ ఆమె వద్దకు వెళ్లి, కంపిస్తున్న కంఠంతో, బలవంతపు చిరునవ్వుతో 'నమస్తే', అన్నాడు.

ఆమె అతనివైపు కన్నులెత్తి, పాలిపోయింది, భయంతో మళ్లీ అతని వైపుచూసింది, తన కన్నులనే నమ్మలేకపోయింది, చేతిలోని విసనకర్రనూ, బైనాకులర్లనూ అణగ–బట్టుకుంది, స్మృతితప్పి పడిపోకుండా వుండడానికి ప్రయత్నిస్తున్నదని అర్ధమౌతున్నది. యెవరూ ఒక మాట కూడా మాట్లాడలేదు. ఆమె అక్కడే కూర్చొనివుంది. అతను ఆమె పక్కనే నిలబడి వున్నాడు, ఆమె యిబ్బంది వలన అస్థిమితుడై, కూర్చొనే సాహసం లేక. ఫిడేళ్ళూ, వేణువులూ వాటికి పెట్టిన శ్రుతులలో పాడేస్తున్నాయి. వాతావరణంలో

యేదో వ్యగ్రత వుండింది, అందరి కన్నులూ వాళ్ళమీదనే వున్నట్టు. చివరకు ఆమె లేచి వడివడిగా ఒక వాకిలి వైపు నడిచింది. అతను ఆమెను అనుసరించినాడు, యిద్దరూ లక్ష్యరహితంగా కారిడర్లలోనూ, నిచ్చెనలలో పైకీ, కిందికీ తిరిగినారు. న్యాయశాఖ ఉద్యోగుల, హైస్కూలు టీచర్ల సివిల్‌ఉద్యోగుల దుస్తులలో వున్న రూపాలు, అన్నీ బాడ్జీలు ధరించినవి, మెరుపుల్లా కనిపించి పోతున్నాయి. స్త్రీలూ, గుంజలకు వ్రేలాడే కోట్లూ మెరుపుల్లా కనిపించిపోతున్నాయి. బుస్సున గాలి వచ్చింది, సిగరెట్టు పీకల వాసనతో. గూరొవ్, గుండె ఉత్పాతంగా కొట్టుకుంటుండగా, అనుకున్నాడు:

'యీ మనుషులందరూ యీ ఆర్కెస్ట్రా దేనికోసం?. ..'

మరునిముషంలో అతనికి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది– ఆరోజు సాయంత్రం స్టేషన్‌లో అన్నాసెర్గేయెవ్నాను సాగనంపిన తర్వాత అతను అనుకున్నాడు, అంతా ముగిసిపోయిందనీ, తాము మళ్ళీ యెప్పటికీ కలుసుకోమనీ. ముగింపు యిప్పుడు యెంత దూరాన వున్నట్టు కనపడుతున్నది!

చీకటిగా వున్న ఒక యిరుకు నిచ్చెన మీద ఆమె నిలబడింది. ఆ నిచ్చెనమీద 'అప్పర్ సర్కిల్‌కు దారి' అనే బోర్డు వుంది.

'యెంతగా జడిపించినారు నన్ను!' అన్నది ఆమె, బరువుగా వూపిరి తీసుకుంటూ, యింకా పాలిపోయి, సగం కొయ్యబారి. 'ఓ, యెంతగా జడిపించినారు! నేను దాదాపు చచ్చిపోయినాను! యెందుకు వచ్చినారు. మీరు? యెందుకువచ్చినారు చెప్పండి?'

'మరి, అన్నా' అన్నాడు. అతను మెత్తగా, వడివడిగా మాట్లాడుతూ. 'మరి, అన్నా... నీవు అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. ..'

ఆమె అతనివైపు భయమూ, అభ్యర్థనా, ప్రేమా కలిసిన చూపు చూసింది, తరువాత నిశ్చలంగా అతనిమీద చూపు నిలిపింది, అతని రూపురేఖలు తన స్మృతిఫలకంమీద స్థిరంగా ముద్రించుకోడానికా అన్నట్లు.

'నేను చాలా బాధపడినాను' అంటూ ఆమె కొనసాగించింది, అతని మాటలు పట్టించుకోకుండా. 'ప్రతి నిముషమూ మనసులో మీరే మెదిలేవాళ్ళు, మరే ఆలోచనకూ తావు లేకుండా. మీ ఆలోచనలమీదనే. బతికినాను. మరిచిపోడానికి ప్రయత్నించినాను– ఓ, యెందుకు వచ్చినారు మీరు, యెందుకు చెప్పండి?'

నిచ్చెన వద్ద పై అంతస్తు మీద యిద్దరు స్కూలుపిల్లలు సిగరెట్లు తాగుతూ, కిందికి చూస్తూ వుండినారు. గూరొవ్ వాళ్ళను లక్ష్యపెట్టకుండా అన్నా సెర్గేయెవ్నాను దగ్గరకు లాక్కొని, ఆమె ముఖమూ, పెదవులూ, చేతులూ ముద్దు పెట్టుకోసాగినాడు.

'ఓ, యేమిటి మీరు చేసేది యేమిటి మీరు చేసేది?' అంటూ భయసంభ్రమంతో ఆమె వెనక్కి తగ్గింది, 'మనిద్దరికీ మతులు పోయినాయి. యీ రాత్రే వెళ్ళి పొండి, యీ క్షణమే వెళ్ళిపొండి. .. భగవంతుని తోడుగా చెప్తున్నాను, మిమ్మల్ని ప్రాధేయ పడుతున్నాను. .. ఓ, యెవరో వస్తున్నారు!'

యెవరో మెట్లెక్కుతుండినారు.

'మీరు వెళ్ళిపోవాలి' అంటూ అన్నా సెర్గేయెవ్నా గుసగుస చెప్పసాగింది. 'వినండి ద్మీత్రీ ద్మీత్రిచ్. నేను మాస్కోకు మీవద్దకు వస్తాను. నేనెప్పుడూ సుఖపడలేదు, యిప్పుడు బాధపడుతున్నాను, నా కెప్పుడూ సుఖం వుండదు, యెప్పుడూ వుండదు! నాకింకా బాధ కలిగించకండి! నేను మాస్కోకు వస్తాను, మీవద్దకు, ప్రమాణంగా వస్తాను! యిప్పుడిక మనం విడిపోవాలి! నా ప్రేమ పెన్నిధివి కదూ, నా కరుణామూర్తివి కదూ, మనం విడిపోక తప్పదు.'

ఆమె అతని చేయి నొక్కి, బిరబిర మెట్లు దిగిపోయింది, అడుగడుగునా వెనక్కి తిరిగిచూస్తూ. ఆమె నిజంగా బాధపడుతున్నదని ఆమె కన్నుల్లో కనపడింది. గూరొవ్ కొంచెం సేపు ఆక్కడే నిలబడినాడు, వింటూ. అంతా నిశ్శబ్దమైన తర్వాత, ఆతను తన చలికోటు కోసం పోయి, నాటకశాల నుండి వెళ్ళిపోయినాడు.

4

అన్నా సెర్గేయెవ్నా అతన్ని చూడడానికి మాస్కోకు పోవడం ప్రారంభించింది. రెండుమూడు నెలల కొకసారి ఆమె యన్– పట్టణంనుండి వెళ్ళిపోయేది. స్త్రీ వ్యాధుల నిపుణుని సంప్రదించడానికి పోతున్నానని భర్తతో చెప్పేది, భర్త నమ్మేవాడు, నమ్మక పోయేవాడు. ఆమె మాస్కోలో యెప్పుడూ 'స్లవ్యాన్స్కీ బజార్' హోటల్లో దిగి, దిగిన మరుక్షణమే, ఒక యెర్రటోపీ మనిషిని గూరొవ్ వద్దకు పంపేది. గూరొవ్ అమె వద్దకు వెళ్ళేవాడు. మాస్కోలో యెవరికీ యీ విషయం తెలియదు.

ఒక చలికాలం ఉదయం యథాప్రకారం అతను ఆమెను చూడడానికి పోయినాడు (వార్తాహరుడు ముందు రోజు సాయంత్రం అతని కోసం వచ్చినాడు, కానీ అతను యింట్లో లేడు). అతని కూతురు అతని వెంట వుండింది. ఆమె బడి ఆ దారిలోనేగనుక, అతను పనిలో పనిగా అమెను బడిదగ్గర వదలిపెట్టవచ్చుననుకున్నాడు. సగం మంచూ సగం చినుకులూ బాగా పడినాయి.

గూరొవ్ కూతురుతో అన్నాడు: 'సున్నకు పైన మూడు డిగ్రీలు వుంది, కానీ మంచు పడుతున్నది. యెందుకో తెలుసా? భూమికి ఆనుకొని మాత్రమే సున్నకు పైన వుంది, వాతావరణంలోని పై పొరలలో ఉష్ణోగ్రత భిన్నంగా వుంది.'

'చలికాలంలో ఉరుములైనా వుండవేం నాన్నా?'

యిది కూడా ఆతను వివరించినాడు. అతను ఒక వైపున మాట్లాడుతూ, మరొక వైపున జ్ఞాపకం చేసుకుంటూ వుండినాడు, ఒక్క ప్రాణికి కూడా తెలియని, బహుశా యెన్నటికీ తెలియబోని సమావేశానికి తాను పోతున్నానని. తాను ద్వంద్వజీవితం జీవిస్తున్నాడు– ఒకటి బహిరంగంగా, యెవరికి సంబంధించిందో వాళ్ళందరియెదుటా జీవించేది, సాంప్రదాయిక సత్యంతో, సాంప్రదాయిక వంచనతో నిండినది, సరిగ్గా తన మిత్రుల, పరిచితుల జీవితాలలాంటిది. మరొకటి రహస్యంగా ప్రవహించేది. యేదో వింత, బహుశా కేవలం యాదృచ్ఛికమైన పరిస్థితుల పరంపరచేత, ముఖ్యమైనదీ, ఆసక్తికరమైనదీ, సారభూతమైనదీ ప్రతీదీ, దేన్ని గురించి తాను చిత్తశుద్ధిగా వున్నాడో, దేన్ని గురించి తాను ఆత్మవంచన చేసుకోడో ఆ ప్రతీదీ, తన జీవితపు గుజ్జు అయిన ప్రతీదీ, రహస్యంగా జరుగుతున్నది. కానీ తనలో బూటకమైనది ప్రతీదీ, తానూ, తనలోని సత్యమూ దేనిలో దాక్కున్నారో ఆ పొట్టు అయిన ప్రతీదీ– బాంకిలో తన పనీ, క్లబ్బులో చర్చలూ, తన 'అధమజాతి' భార్యతో కలిసి వార్షికోత్సవాలకు హాజరు కావడమూ– ఉపరితలంలో జరుగుతున్నది. తనను బట్టి అతను యితర్లను అంచనా వేయనారంభించినాడు, కనపడేదాన్ని యిక యెంతమాత్రమూ నమ్మకుండా, ప్రతి వ్యక్తి యొక్కా నిజమైన, ఒకే ఒక ఆసక్తికరమైన జీవితం రాత్రి ముసుగులో, రహస్యంగా సాగుతుందని నిత్యం నమ్ముతూ. ప్రతి వ్యక్తి మనుగడా నిగూఢత చుట్టూ పరిభ్రమిస్తుంది. వ్యక్తిగతరహస్యాలకు ఉచితమైన గౌరవం గురించి సంస్కారవంతులందరూ అంత గట్టిగా పట్టుబట్టడానికి ప్రధానకారణం బహుశా అదే కావచ్చు.

బడి వాకిలివద్ద కూతురును వదలి, గూరొవ్ 'స్లవ్యాన్‌స్కీ బజార్' కు పోయినాడు. హాలులో అతను చలికోటు విప్పి, పై అంతస్తుకు పోయి, మెల్లగా తలుపు తట్టినాడు. అన్నా సెర్గేయెవ్నా ఆతనికి అత్యంతప్రీతికరమైన బూడిదరంగు దుస్తు ధరించి, ప్రయాణం చేతా, సందిగ్ధ మనస్కత చేతా నీరసించి, గత సాయంత్రంనుండి అతని కోసం నిరీక్షిస్తూ వుండింది. ఆమె పాలిపోయి వుండింది, చిరునవ్వు లేకుండా అతనివైపు చూపింది, కానీ అతను గదిలో అడుగు పెట్టీపెట్టకముందే అతని కౌగిట్లో వాలింది. వాళ్ళ ముద్దు దీర్ఘంగా, చాలా సేపు సాగింది, చాలా యేండ్లుగా వాళ్ళు కలుసుకోనట్లు.

'బాగున్నావా?' అని అతను అడిగినాడు. 'యేమైనా కొత్త సంగతులా?'

'ఆగు, ఒక నిముషంలో చెప్తాను. .. ఉహూఁ, చెప్పలేను. ..'

ఆమె మాట్లాడలేకపోయింది, యేడుస్తూ. పక్కకు తిరిగి చేతిగుడ్డ కండ్లకు అద్దుకుంది.

'యేడుపంతా యేడ్చేసిందాకా అగుతాను,' అనుకుంటూ అతను కుర్చీలో కూలబడినాడు.

అతను గంట నొక్కి టీ తెప్పించుకున్నాడు. అతను టీ తాగుతుండగా ఆమె యింకా అక్కడ నిలబడే వుంది, కిటికీవైపు ముఖం తిప్పి. ఆమె హృదయభారంచేత యేడ్చింది, తమ జీవితం యెంత దుఃఖభాజనమైందా అన్న బాధాకరస్పృహ చేత యేడ్చింది. తాము ఒకరినొకరు చూసుకునేది రహస్యంగా మాత్రమే, లోకానికి చాటుగా మాత్రమే, దొంగలైనట్లు. తమది భగ్నజీవితం కాదా?

'యేడవాకు' అన్నాడు అతను.

తమ యీ ప్రేమ త్వరలో అంతం కాదనీ, యెప్పుడంతమయ్యేదీ యెవరికీ తెలియదనీ అతనికి స్పష్టంగా వుంది. అన్నాసెర్గేయెవ్నా తనను అంతకంతకూ అపేక్షగా ప్రేమిస్తున్నది, తనను ఆరాధిస్తున్నది, యెప్పుడో ఒకనాడు యీ ప్రేమ అంతం కాక తప్పదని ఆమెతో చెప్పడంలో అర్థం లేదు. నిజానికి ఆమె తన మాట నమ్మదు.

అతను దగ్గరికి పోయి ఆమె భుజాలు పట్టుకున్నాడు, తేలిక మాటలతో ఆమెను లాలించే ఉద్దేశంతో. కానీ అప్పుడే అతనికి అద్దంలో తన రూపం కనపడింది.

అతని తల అప్పుడే తెల్లబడడం ప్రారంభమైంది. గత కొద్ది యేండ్లలో అంతగా తాను వయసెక్కడం అతనికి చిత్రమనిపించింది. తన చేతులకింద వున్న భుజాలు వెచ్చగా, జీవశక్తితో ప్రకంపిస్తూ వున్నాయి. యీ జీవం పట్ల, అంత వెచ్చగా, ఆంత అతిలోకంగా వున్న, కానీ తన జీవంలాగే బహుశా త్వరలో వాడి, వాలిపోనున్న యీ జీవంపట్ల, అతనికి అనుతాపం కలిగింది. యెందుకామె తన్నుఅంతగా ప్రేమించింది? స్త్రీలు యెప్పుడూ తనను తన నిజమైన వ్యక్తిత్వంకంటె భిన్నమైనవానిగా నమ్మినారు. వాళ్ళు తననుగాక, తన్ను గురించి తమ మనసులో ఊహించుకున్న వ్యక్తిని ప్రేమించి–నారు, తమ యావజ్జీవితాలూ తాము అన్వేషించిన మనిషిని. తరువాత వాళ్ళు తమ పొరపాటును కనుక్కున్నప్పుడు, యథాప్రకారం ప్రేమిస్తూనే వుండినారు. వాళ్లలో ఒక్కరూ తనతో సుఖపడలేదు. కాలంగడిచేకొద్దీ తాను ఒక స్త్రీ తరువాత మరొకరిని కలుసు–కున్నాడు, ప్రతివొకరితోనూ సన్నిహితుడైనాడు, ప్రతివొకరితోనూ విడిపోయినాడు, కానీ యెప్పుడూ ప్రేమించలేదు. వాళ్ళతో ఆతనికి నానా రకాల సంబంధాలు వుండినాయి, కానీ ప్రేమ యెప్పుడూలేదు.

యిప్పుడు మాత్రమే, తల వెంట్రుకలు తెల్లబడినప్పుడు, అతనికి చక్కగా, పూర్తిగా, జీవితంలో మొదటిసారి ప్రేమ కలిగింది.

అతనూ, అన్నా సెర్గేయెవ్నా గాఢసన్నిహితులలాగ, భార్యా భర్తలలాగ, ఆప్తమిత్రుల లాగ పరస్పరం ప్రేమించుకున్నారు. విధి వాళ్ళను ఒకరికోసమొకరిని ఉద్దేశించినట్టుంది, మరి ఆమెకొక భర్తా, ఆతనికొక భార్యా యెందుకుండవలసివచ్చిందో వాళ్ళ కర్థం కాలేదు. చలికాలంలో దేశాంతరాలకు వలసపోయే పక్షులు, పుంజూ, పెట్టా, పట్టుకొని వేరువేరు పంజరాలలో బంధింపబడినట్లుండినారు వాళ్ళు. గతంలోనూ, తమ వర్తమానం లోనూ వాళ్ళు ఒకరి మూలంగా ఒకరు సిగ్గుపడిన ప్రతిదానికీ ఒకరి నొకరు క్షమించు–కున్నారు. యీ ప్రేమ తమను యిద్దరినీ మార్చినట్లు వాళ్ళకు అనిపించింది.

యింతకు మునుపు, విచార సమయాలలో, తనకు యే వాదం మొదట తోస్తే ఆ వాదంతో తన్ను తాను ఓదార్చుకునేవాడు, కానీ యిప్పుడతనికి వాదాలు నిరుపయోగం, అతనికి ప్రగాఢమైన అనుతాపం కలిగింది, నిష్కపటంగా,ఆర్ద్రంగా వుండాలని కాంక్ష కలిగింది.

'యేడవాకు అన్నా,' అన్నాడు అతను. 'యేడుపంతా యేడ్చేసినావుగా, యిక ఆపు. .. యిక కాస్త మాట్లాడుకుందాం, యేం చెయ్యాల్నో ఆలోచిద్దాం.'

తరువాత వాళ్ళు చాలాసేపు తమ పరిస్థితిని చర్చించినారు. దాక్కోవడాలకూ, వంచనకూ, వేరువేరు వూర్లలో వుండడానికీ, అంత దీర్ఘకాలం కలుసుకోకుండా వుండడానికీ అవసరం లేకుండా చేసుకోవడం యెలాగని ఆలోచించినారు. తాము యీ దుర్భరమైన శృంఖలాలు విదలించుకోవడం యెలాగ?

'యెలాగ? యెలాగ?' మళ్ళీ మళ్ళీ అన్నాడు అతను చేతులతో తల పట్టుకొని.

నిర్ణయం వ్రేలెడు దూరంలో వున్నట్లూ, ఆ తరువాత అందమైన కొత్తజీవితం ప్రారంభం కానున్నట్లూ వాళ్ళకు అనిపించింది. అంతం యింకా చాలా చాలా దూరంలో వుందనీ, అత్యంత కష్టమైన, క్లిష్టమైన భాగం యిప్పుడే ప్రారంభమౌతున్నదనీ వాళ్ళిద్దరూ గుర్తించినారు.

◆

'మళ్ళీ ఇంటి చొప్పతీసేశావా బాబా!'

6

ఒకప్పుడు పురాణం సుబ్రహ్మణ్యశర్మ ఏదో ఇంటర్వ్యూ బోర్డులో కూచున్నారట. ఇంటర్వ్యూకి వచ్చిన ఒక అభ్యర్థిని నీ అభిమాన తెలుగు రచయిత ఎవరు అని అడిగారట. అతడు 'శరత్‌బాబు' అని చెప్పాడట. 'యూ ఆర్ సెలక్టెడ్' అన్నారట శర్మగారు.

తెలుగుసాహిత్యం చదవడం మొదలుపెట్టిన కొద్దిరోజులకే శరత్ నా అభిమాన తెలుగు రచయితగా మారిపోయాడు. మరీ ముఖ్యంగా నేను నాగార్జునసాగర్‌లో ఇంటర్మీడియేటు చదువుకున్న రోజుల గురించి తలుచుకుంటే, ఆ రోజుల్లో చదివిన 'శ్రీకాంత్', 'భారతి', 'చరిత్రహీన్', 'గృహదహనం', 'శేషప్రశ్న' ల్లో మనుషులూ, ఆ కుటుంబాలూ, ఆ ప్రశ్నలూ, ఆ చర్చలూ గుర్తొస్తాయి అన్నిటికన్నా ముందు. శరత్ జ్వరం నేను రాజమండ్రి వెళ్ళిన చాలాకాలందాకా కూడా నన్ను పట్టే ఉంది. అప్పటికి శరత్ వ్యాసాలూ, ఉత్తరాలూ, ఆయన జీవితచరిత్రా, ఆయన సాహిత్యం పైన చర్చలూ కూడా చదివేసి ఉన్నాను. ఆయన నవలల్లో ఏది గొప్పది– శ్రీకాంత్‌నా, లేక శేషప్రశ్ననా లేక పథేర్ దాభీనా అని నాలోనేనే వితర్కించుకుంటూ ఉన్న సమయంలో (నా రాజమండ్రి మిత్రులకి శరత్ పైన గొప్ప ఇష్టమేమీ ఉండేది కాదు, ఆ నవలలంతటా కన్నీళ్ళూ, పాదధూళీ తప్ప మరేమీ ఉండవని వేళాకోళమాడుతుండేవారు) సుబోధ్‌చంద్ర సేన్‌గుప్త

‘గృహదహనం’ అన్నిటికన్నా గొప్ప నవల అని రాసినప్పుడు, మళ్ళా ఆ నవల తీసి మరోసారి చదవకుండా ఉండలేకపోయాను.

అటువంటి రోజుల్లో ఒకసారి గోదావరి గట్టున ఉండే సరస్వతీ పవర్ ప్రెస్‌లో అడుగుపెట్టాను. అక్కడే ‘అమృతసంతానం’, ‘వనవాసి’, ‘జీవనలీల’, శ్రీపాద చిన్నకథలు వంటి అనర్ఘ రత్నాలతో పాటు ‘విశ్వకథావీథి’ ఆరు సంపుటాలూ కూడా నా చేతుల్లోకి వచ్చాయి. వాటిని నేను రీ–డిస్కవర్ చేసిన రోజులు నాకూ, తెలుగు సాహిత్యానికీ కూడా గొప్ప భాగ్యదినాలు. ఎందుకంటే, అప్పటికి శ్రీపాద చిన్నకథల గురించి చాలామందికి తెలిసి ఉన్నప్పటికీ, తక్కిన పుస్తకాల గురించి రాజమండ్రి కూడా మర్చిపోయింది. నాకొచ్చే చిన్నపాటి జీతం లోంచే ఆ పుస్తకాలు వీలైనన్ని కాపీలు కొని నా మిత్రులు ప్రతి ఒక్కరికీ పంచిపెడుతూ ఉండేవాణ్ణి.



‘విశ్వకథావీథి’ (1955-58) ఆరు సంపుటాల అనువాద కథలు. ఒక్కో సంపుటంలోనూ ఆరు కథల చొప్పున పురిపండా అప్పలస్వామిగారు ఎంపికచేసి అనువదించిన కథలు. ఆ ఎంపిక కూడా ఆయనదే అయి ఉండాలి. ఎందుకంటే ఆ పుస్తకానికి మాతృక అని చెప్పదగ్గ పుస్తకమేదీ ఇప్పటిదాకా నాకు ఇంగ్లిషులో కనిపించలేదు. అటువంటి ప్రపంచ కథకుల్నీ, ఆ కథల్నీ ఆయన ఎలా కనుగొన్నారో, ఏ మూలాలనుంచి అనువ–దించారో మనకి తెలియదుగానీ, ఆ కథలన్నీ

అప్పలస్వామిగారి magic touch తో తెలుగు కథలుగా మారిపోయేయి. అదుగో, ఆ సంపుటాల్లో, మొదటి సంపుటంలోనే, శరత్ బాబు రాసిన 'మహేశం' కథ చదివాను. అప్పుడు నాకు బహుశా ఇరవయ్యేళ్ళ వయసు. ఆ కథ చదవగానే నిశ్చేష్టుణ్ణైపోయాను. ఆ శరత్ నాకు తెలిసిన శరత్ కాదు.



'మొహేష్' (1922) శరత్ రాసిన కథల్లో అత్యంత విఖ్యాతి పొందిన కథ. ఇంగ్లిషులోనే రెండు ముఖ్యమైన అనువాదాలు వచ్చాయి. ఒకటి సాహిత్య అకాదెమీ కోసం శశధర్ సిన్హా అనే ఆయన చేసిన The Drought and Other Stories (2010) లో The Droughts పేరుమీద చేసిన అనువాదం. మరొకటి, రూపా సంస్థ కోసం అనిందిత ముఖర్జీ చేసిన Stories from Saratchandra, Innocence and Reality (2018) అనే సంపుటంలో పొందుపరిచిన అనువాదం. ఫ్రెంచిలో కూడా ఒక అనువాదం 1978 లో వచ్చిందని విన్నాను. కాని, అప్పలస్వామిగారు వీరందరికన్నా ఎన్నో ఏళ్ళు ముందే తెలుగువారి కోసం ఆ కథని అనువదించడం ఆయన ఔదార్యానికీ, మన భాగ్యానికీ గుర్తుగా మిగిలిపోతుంది.

శరత్ రాసిన కథలన్నిటిలోనూ 'మొహేష్', 'అభాగీర్ స్వర్గ' అనే రెండు కథలు చాలా ప్రత్యేకమైనవి. మొదటిది ముస్లిం జీవితాన్ని చిత్రించిన కథ అయితే, రెండోది దళితజీవితాన్ని

చిత్రించే కథ. దాదాపుగా అదే సమయంలో మున్షీ ప్రేమ్‌చంద్ 'సవాసేర్ గేహూ' (1924) కథ రాస్తున్నాడు. బెంగాలీ రచయితలు ఎంతసేపూ హిందూ సమాజాన్నే చిత్రిస్తూ ఉంటే బెంగాలీ హిందువుల భాషగా మిగిలిపోయే ప్రమాదం ఉందని భావిస్తూ, శరత్ 1936 లో జహానారా చౌధురీకి రాసిన ఉత్తరంలో (శరత్ ఉత్తరాలు, దేశి ప్రచురణ, 1954, పే.184) ఇలా అంటున్నాడు:

> కాని వంగ సాహిత్యంలో ఎంతమంది రచయితలు తమ గ్రంథాల్లో ముసల్మానుల జీవితగాథలను చిత్రించారు? వారి సుఖదుఃఖసమస్యలను చర్చించారు? వారితో సన్నిహిత సంబంధం ఎలా లభిస్తుంది? వారి హృదయాలు ఎలా తెలుసుకోగలగడం? వారి హృదయాలను తెల్సుకోలేక పోయారన్నమాట నేను అంగీకరిస్తున్నాను, అందువల్ల ఏర్పడిన దుష్ఫలితము కాస్తాకూస్తా కాదు. ఇందుకు ప్రతిక్రియ ఇప్పుడు ఆలోచించ-వలసి ఉంది.

కానీ ఒక్క మహేశం కథ చాలు, శరత్ తననీ, సమస్త బెంగాలీ సాహిత్యకారుల్నీ కూడా బయటపడేసాడని చెప్పడానికి. చదవండి. ఈ కథ ఇన్నేళ్ళుగానూ నా గుండెలో దిగబడ్డ ఇనుపములుకులాగా కలుక్కుమంటూనే ఉంది. మొదటిసారి చదివినప్పుడు దీన్ని ఒక బీద ముస్లింని చిత్రించిన కథగానే గుర్తుపెట్టుకున్నాను. కాని ఇప్పుడు ఈ కథని ఎన్నో పార్శ్వాలనుంచి చదవచ్చునిపించింది. ఉదాహరణకి, ఇది అమీనా కథ కూడా. ఈ కథలో అమీనా ఆడుకుంటున్నట్టు ఒక్కమాట కూడా కనిపించదు అని రాసింది అనిందితా ముఖర్జీ తన అనువాదాలకు ముందుమాటలో. ఒక బాలిక నష్టశైశవానికి సంబంధించిన కథ ఇది. అలాగే దీన్ని మహేశం అనే ఒక మూగజీవి వైపునుంచి కూడా చదవవచ్చు. ఇది వలస కథ కూడా. గ్రామాలు ఎట్లా ఆత్మహత్యకు పాల్పడుతూ వచ్చాయో చెప్పిన కథ కూడా. ఈ కథ వచ్చి పాతికేళ్ళు తిరక్కుండానే బెంగాల్లో హిందువులూ, ముస్లిములూ ఒకరినొకరు నరుక్కున్నారంటే ఆశ్చర్యం లేదు. అందువల్ల ఈ కథ హిందూ-ముస్లిం జీవితాల మధ్య కనిపించని అగ్నిపర్వతం కథ కూడా.

శరత్ ఈ రోజు జీవించి ఉండి, కలకత్తాలో ఈ కథ రాసి ఉంటే, అతడి ఇంటి మీద దాడి జరిగి ఉండేదనీ, తమ మనోభావాలు గాయపర్చేదని ఒక మతానికి చెందిన వారు అతణ్ణి జైలుకి పంపించేదాకా విశ్రమించి ఉండేవారు కారనీ ఒక బ్లాగరు రాసింది చదివాను. ఆ మాటల్లో అతిశయోక్తి లేదు.

శరత్ చంద్ర ఛటోపాధ్యాయ

మహేశం

పురిపండా అప్పలస్వామి

ఊరు పేరు కాశీపురం. గ్రామం చిన్నది. అక్కడి జమీందారుకూడా చిన్నవాడు. అయినా అతడి ప్రతాపం దొడ్డది. ఎవ్వరూ కిక్కురుమనడానికి వీలులేదు.

అవాళ జమీందారు చిన్నకొడుకు పుట్టినదినం. పూజలూ, పునస్కారాలూ అన్నీ పూర్తి చేసుకొని పురోహితుడు తర్కరత్నంగారు మిట్టమధ్యాహ్నవేళ ఇంటికి పోతున్నాడు. వైశాఖమాసం ముగియవస్తున్నా ఆకాశంలో మబ్బుపిసరనిపించడం లేదు. అగ్గి కురుస్తున్నట్టుంది. ఎదురుగుండా దిగంతవ్యాప్తమైన మైదానం ఎండి పగుళ్ళువారి పోయింది. లక్షలాది పగుళ్ళనుండి భూదేవిరక్తం పొగళ్ళరూపంగా పైకి వస్తూ ఉంది.

దాని పొలిమేర, దారిప్రక్క సాలె గఫూరుసాయిబు ఇల్లుంది. వాకిటి మట్టిగోడ పడిపోయి దారితో కలిసిపోయింది. లోపలి అంతఃపురం తన లజ్జా సంభ్రమాలను వ్యక్త పరుస్తూ పథికులముందు జాలిగ ఆత్మసమర్పణం చేస్తున్నది. పోతూ పోతూ ఆగి తర్కరత్నంగారు గట్టిగా అరిచాడు.

'ఒరేయ్, గఫూర్! ఇంట్లో వున్నావురా! ఒరేయ్!'

అతడి పదేళ్ళకూతురు ద్వారం దగ్గరకు వచ్చిచెప్పింది.

'మా బాబును పిలుస్తున్నారా? జ్వరంగా ఉంది.'

'జ్వరం గిరంనూ! పిలూ వెధవని.'

గఫూరు పైకి వచ్చాడు. జ్వరంతో వణకుతూ నిలబడ్డాడు. దాని పడిపోయిన గోడ ప్రక్కనే చిన్న తుమ్మచెట్టుంది. కొమ్మని ఒక ఎద్దు కట్టి ఉంది. తర్కరత్నంగారు దాన్నిచూపిస్తూ 'ఇదంతా ఏవిటో చెప్పూ. ఇది హిందువుల గ్రామమనీ, దీని జమీందారు బ్రాహ్మడనీ నీకు తెలుసంటావా లేదా?'

పురోహితుడి మొఖం ఎండవల్లా, కోపంవల్లా ఎర్రగా కంది పోయింది. అంచేత నోటవచ్చే ప్రతీమాటా వేడెక్కి అగ్గినిప్పులా ఉంది. గఫూరుకదేవీ అర్థం కాక తెల్లబోయి అతడి మొహం చూస్తున్నాడు.

'ఉదయం వెళ్ళేటప్పుడు చూశాను. ఈ ఎద్దు ఇక్కడే కట్టేసి ఉంది. ఇప్పుడు రెండు ఝాములు కావచ్చినా కూడా అలాగే కట్టి వుంది. ఒక వేళ గోహత్య జరిగి పోయిందంటే జమీందారు నిన్ను ప్రాణాలతో పాతి పెట్టేస్తాడు. అలాంటి ఇలాంటి బ్రాహ్మడు కాదతగాడు.'

'ఏం చేసేది బాబూ, నేను చాలా చిదికిపోయినాను. దీనికితోడు జ్వరం ఒకటి నన్ను తినేస్తూ ఉంది. తాడుపట్టుకు ఎలాగైనా మేపుకొద్దామనుకుంటాను. కాని తల తిరిగిపోతుంది, తూలిపోతున్నాను.'

'అయితే విప్పేయి దానంతట అదే మేసుకు వస్తుంది.'

'ఎక్కడ విప్పేది బాబయ్యా? ఇంకా ప్రజల ధాన్యం నూర్పు పూర్తి కాలేదు. కళ్లాల్లో గడ్డికుప్పలు తియ్యలేదు. మైదానంలో గడ్డి దుబ్బయినా లేదు. తమామూ మాడిపోయింది. ఎవరి ధాన్యంలో ఐనా, ఎవరి కళ్లంలో ఐనామూతి పెట్టిందంటే చెప్పండి బాబూ ఎలా దీన్ని విప్పేది?'

తర్కరత్నం గారు కొంచెం మెత్తబడ్డాడు.

'పోనీ ఎక్కడన్నా చల్లని చోటన్నా కట్టూ. రెండు పరకలన్నా దాని మొహాన తగలెయ్యి, నమల్నన్నా నములుతుంది. నీ కూతురింకా వంట చెయ్యలేదా! కొంచెం గంజయినా దానిముందు పొయ్యి, త్రాగుతుంది.'

గఫూరు జవాబు చెప్పలేదు. పెద్ద నిట్టూర్పు మాత్రం విడిచాడు.

'అదీ లేదనుకుంటాను. అయితే నీ ధాన్యం ఏం చేసినట్టూ నీవంతుకు దొరికిందంతా అమ్మేసి గుటకాయ స్వాహా చేసేశావూ! కసాయి వెధవా!'

ఎండిన పెదవులు చప్పరిస్తూ గఫూరు మెల్ల మెల్లగా అన్నాడు.

'పదిహేను మణుగుల గింజలు వంతుకి వచ్చాయి. అవన్నీ నిరిటి బాకీక్రింద లాక్కున్నారు జమీందారు బాబు. ఏడుస్తూ చేతులు జోడించుకు మనవి చేసుకున్నాను. కొండంత ప్రభువులు, మీ రాజ్యం విడిచి నేనెటు పోతాను గనుక. ఏమీ ఇవ్వకపోయినా పదికట్టలు గడ్డయినా ఇప్పించండి. ఇంటిమీద చొప్పలేదు. ఒక్కటే గది. అందులోనే తండ్రీ కూతుళ్ళం పడి ఉన్నాం. ఏతాటి కమ్మయినా కప్పుతాను. కాని గడ్డి పరకలు లేకపోతే నా 'మహేశం' చచ్చిపోతుంది అని–'

'వాః ! మజాగా పేరు పెట్టావ్ ! 'మహేశం'. నవ్వలేక నాకు ఊపిరెగిరిపోతున్నాది.'

'జమీందారుబాబుకు నా మీద జాలి కలగలేదు. ధాన్యం కొట్లో వేయించివేశారు. ఒక్క గడ్డి పరకయినా యిప్పించలేదు.'

ఇక మాటాడలేకపోయాడు. సాయిబు కళ్ళనీళ్లు తిరిగాయి. ఏడుస్తున్నాడు.

'అయితే నువ్వు బలేవాడిలా ఉన్నావు. తినేసి కూచుంటానంటావ్! వారిది ఇవ్వ–వలసింది ఇవ్వనంటావ్! జమీందారు తన ఇంటినుండి తెచ్చి నీకు తినిపిస్తాడేం! నీజాతి లక్షణమే అంతా! కాకపోతే రామరాజ్యంలో బ్రదుకుతూ ఆ మహారాజును నిందిస్తావా?'

'నిందించలేదు బాబయ్యా! ప్రభువును నిందించడమే! కాని మీరే చెప్పండీ, నేనెక్కడనుండి తెచ్చిచ్చేది? ఏదో నాలుగు సెంట్ల భూమి. దానిమీదే వ్యవసాయమంతాను. రెండు సంవత్సరాలు బొత్తిగా పంటలు పోయాయి. మడిలో సేను మడిలోనే మాడి పోయింది. తండ్రీకూతుళ్లకు కడుపునిండ తిండికి దొరకలేదు. ఇల్లు చూడండి, వర్షంలో రాత్రుళ్లు ఒక మూల ఇద్దరమూ కూచుంటున్నాం. కాళ్ళు చాపుకోవడానికి చోటులేదు. నా మహేశాన్ని చూడండి. లెక్క పెట్టిందికి వీలుగా ఉన్నాయి ఎముకలు. మీరైనా రెండు మానికలు ధాన్యం అప్పియ్యండి స్వామీ! పశువునైనా రెండుపూటలు మేపుకుంటాను.'

గఫూరు చేతులుజోడించుకుని పురోహితుడి పాదాల దగ్గర చతికిల బడ్డాడు. తర్కరత్నంగారు తటుక్కున రెండడుగులు వెనక్కు తప్పుకొని : 'అరి నీకక్కా గట్టా! ముట్టేస్తావేమిటీ?'

'లేదు బాబూ ! ముట్టను! నాకు తెలీదా! బాబూ, నాకీ సమయంలో రెండు మానికల గింజలు ఇప్పించండి. అవాళ మీయింటి దగ్గర నాలుగేసి కుప్పలు చూసివచ్చాను. నాకిప్పించడం మీకో లెక్క కాదు. నేను ఆకలికి చచ్చిపోతేపోతాను. కాని ఇది నోరులేని పశువు. ఊరికే నిలబడి చూస్తుంది. నోటితో చెప్పలేదు. కంటతడి పెడుతుంది."

'ఒరేయ్ సాయిబూ, అప్పుడుగుతున్నావు కదా ! ఎలా తీరుస్తావురా ! ముందీ మాట చెప్పు!'

'ఎలాగన్నా తీర్చేస్తాను బాబయ్యా ! దగా చెయ్యను.'

'దగా చెయ్యవు, ఊఁ, గడుసువాడివి, దగా చెయ్యవు ! లే, అడ్డుగాలే, పొద్దు తిరిగిపోతూ ఉంది, పోవాలి' వెక్కిరింపుగా అంటూ, మందహాసం చేస్తూ ముందుకు వేసిన అడుగు వెనక్కుతీసి తర్కరత్నంగారు, 'వెధవ, ఇది కొమ్ములూపుతూ మీదికి వస్తూ ఉంది. పొడిచి పారెయ్యదు కదా!' అతడి చేతిలో పళ్ళూ, కాయకూరలూ, తడిబియ్యం వగైరా మూటఉంది. 'వాసన తగిలి తినెయ్యాలనే చూస్తుందిరోయ్ ! రైతు ఎలాంటివాడో ఎద్దూ అలాంటిదేనోయ్ ! గడ్డిపరక నోటికి తగల్దుగానీ పళ్ళూ బియ్యం తినెయ్యాలని చూస్తుంది! వెళ్ళూ, దాన్ని దార్లోనుండి తప్పించు. దీని కొమ్ములు చూస్తే ఎపుడో ఒకర్ని పొడిచి చంపేస్తుంది. తప్పదు.' అరుస్తూ, గొణుగుతూ, అంగలు వేసుకొంటూ వెళిపోయాడు, తర్కరత్నంగారు.

గఫూరు చూపుత్రిప్పి మానంగా మహేశాన్ని చూస్తూ నిలబడి పోయాడు. లోతైన దాని నల్లనికళ్లు రెండూ వేదనతో, ఆకలితో నిండి ఉన్నాయి.

'ఒక పిడికెడైనా నీకిచ్చాడు కాడు. మూటలో అధికంగానే ఉంది. కాని అతడెవ్వరికీ ఇవ్వడు. పోనీ ! ఇవ్వకపోతే, ఏం చేస్తాము !!'

గఫూరు గొంతుక గద్గదికమై పోయింది. కళ్ళంబడి బొటబొట నీరు కారింది. మెల్లగా ఎద్దు దగ్గరకు వెళ్ళాడు. మెడా, తలా, వీపూ చేత్తోనిమురుతూ 'మహేశం!

బిడ్డా! ఎనిమిదేళ్ళు మమ్మల్ని పెంచి పోషించావు. ఇప్పుడు ముసలివై పోయావు. కడుపునిండా తిండి నీకు పెట్టలేకపోతున్నాను. అయినా నీకు తెలుసు కదూ, ఎంతగా నిన్ను ప్రేమిస్తున్నానో.'

ఎండ కూడా దుఃఖంతో చెమ్మగిల్లుతూ ఉన్నట్లుంది. మహేశం మెడ ముందుకు చాచి, కళ్లుమూసుకుని నిలుచుంది. గఫూరు కన్నీళ్ళు మహేశం వీపుమీద పడుతున్నా తుడిచి వేస్తూ మళ్ళీ అస్పష్టంగా అంటున్నాడు. 'నీ నోటి దానా లాక్కున్నాడు జమీందారు. స్మశానం దగ్గరి బంజరుకూడా అమరకం చేసేశాడు. నువ్వేచెప్పు, ఈ కరువు కాలంలో ఏమిచ్చి నిన్ను బ్రతికించగలనూ! పోనీ నిన్ను విప్పేశాననుకో పైవాళ్ళ కుప్పల్లో నోరు పెడతావు. ఏంచేసేదీ! నీ దేహంలోనా బలంలేదాయె. అంచేత ఎవ్వరూ నిన్ను కొనరు. లోకులు సంతలో అమ్మెయ్యమంటారు'– మరిన్ని కన్నీళ్లు బొటబొట రాలాయి. పడిపోయిన కొంప వెనక్కు వెళ్ళి, ఇంత పాత చొప్ప తెచ్చి దానిముందు వేశాడు. "ఇంద, వేగంకొంచెం తినేయ్. ఆలస్యంచేశావంటే మళ్ళీ.' ఇంతలో అతని కూతురు అమీనా పిలిచింది. 'బాబా! తిందువుగానిరా!' అమీనా బైటికి వచ్చి అంతా చూసింది.

'మళ్ళీ ఇంటి చొప్పతీసేశావా బాబా!'

గఫూరు భయపడినంతా ఐంది. సిగ్గుపడుతూ అన్నాడు. 'లేదమ్మా, పాతచొప్ప, పాడైపోయి దానంతట అదే క్రిందపడి ఉంటే–'

'బాబా, నేను లోపలినుండి వింటూనే ఉన్నాను. ఇపుడే మీదనుండి లాగావు.'

'లేదమ్మా, లాగలేదు. కాని'

'కాని బాబా, గోడ పడిపోతే'

గఫూరు మాట్లాడలేదు. ఈ చిన్నగది తప్ప తనకు ఉన్నదంతా ఐపోయింది. చొప్పపోతే వచ్చే వర్షాలకు ఇదికూడాఉండదు. అదీకాక ఇలాచేసి ఎన్నాళ్ళని గడుస్తుంది గనక !

'బాబా, చేతులు కడుక్కురా, వడ్డించేస్తాను.'

'కొంచెం గంజి పెట్టూ, ముందు దీనికి త్రాగించి వస్తాను.'

'ఇవాళ గంజిలేదే. అది కుండలోనే ఇగిరిపోయిందయ్యా!'

'గంజిలేదూ!–' గఫూరు మాటాడలేదు. ఆపదకాలంలో ఏమాత్రమూ నష్టపరచ రాదన్నమాట పదేళ్ళ పిల్ల అమీనాకు కూడ తెలిసిపోయింది. గఫూరు చేతులు కడుక్కొని లోపలికి వెళ్ళి నిలబడ్డాడు. చిన్న ఇత్తడి తబుకులో తండ్రికోసం శాకాన్నం వడ్డించి తనకోసం ఒక మట్టి మూకుడులో రెండు మెతుకులు వడ్డించుకుంది అమీనా. కొంచెం చూచి మెల్లగా అన్నాడు గఫూరు.

'అమ్మా, అమీనా? నాకు మళ్ళీచలి వేస్తున్నది. జ్వరంతో అన్నం తినమంటావా!'

'ఇందాకా ఆకలిగా ఉందన్నావుగా!'

'ఇందాకా, అవును. అప్పటికి జ్వరం లేదనుకుంటాను.'

'అయితే తీసి ఉంచేస్తాను. సాయంకాలం తిందువుగాని.'

'పాచి వంటకం తింటే జబ్బు మరింత అధికమవుతుందో ఏమో!'

గఫూరు ఏమాలోచించాడో – 'ఒక పనిచెయ్యి తల్లీ! ఈ అన్నం పట్టుకెళ్ళి మహేశం ముందు వెయ్యి. ఏమంటావు! రాత్రికి నాకోసం పిడికెడు వండెయ్యలేవూ?' అమీనా తల ఎత్తి తండ్రి మొహం చూసింది. కొంతసేపటికి మెల్లగా అంది.

'వండేస్తాలే.'

2

ఐదారు రోజుల తరవాత. విచారంగా, సుస్తీగా గఫూరు గుమ్మంలో కూర్చున్నాడు. అతడి మహేశం నిన్నటినుండీ ఇంటికి రాలేదు. మహేశం శరీరంలో బలమే లేదాయె. ఉదయం నుండీ అమీనా వెదుకుతూ తిరుగుతూనే ఉంది. రెండు ఝాముల వేళ అయాక చెమటలోడ్చుకుంటూ వచ్చి చెప్పింది: 'బాబా, బాబా, కరణంగారు మహేశాన్ని బందెల దొడ్డిలో వేశారు.'

'చుఫ్, నోరుముయ్.'

'నిజమేనయ్యా, వాళ్ళ నౌకరు చెప్పాడు.'

'ఏంచేసిందనీ?'

'వాళ్ళతోటలో చెట్లు పాడు చేసిందట!'

గఫూరు రాయిలా కదలలేదు. ఇంతవరకూ అనేకవిధాల శంకించాడు. కాని. ఇదిమాత్రం అతడికి తట్టలేదు. తానెంత దిక్కుమాలిన వాడో, అంత గర్భదరిద్రుడు కూడాను. అంచేత తనకు ఇలాంటి ఆపద ఎవరన్నా కలిగిస్తారని. అతడు ఊహించలేదు. అందులోనూ కరణంగారి లాంటి ఘరానా మనిషి నడవలేని మహేశంవంటి పశువును బందెలదొడ్డిలో!

'పొద్దు పోతున్నది. మహేశంకోసం వెళ్ళొద్దూ?'

'ఉహూఁ'

'మూడు దినాలు దాటితే సంతలో పోలీసు వాళ్ళు అమ్మేస్తారట!'

'అమ్మేయనీ.'

సంత అంటే ఏమిటో అమీనా ఎరగదు. కాని సంతలో మహేశాన్ని అమ్మడం అంటే తన తండ్రి భయపడడం అనేకమార్లు చూసింది. కాని ఇవాళ ఆ మాట విని కూడా అతడు ఏమీ ఇదవకపోవడం ఆమెకు అర్థం కావడం లేదు.

రాత్రి చీకటి కమ్ముకున్నాక గఫూరు సడిలేకుండా వంశిదుకాణానికి వెళ్ళాడు. దాచిపట్టుకున్న ఇత్తడి తబుకు బల్లమీద పెట్టి 'ఒక రూపాయి కావాలి బాబూ,' అన్నాడు. తబుకు తూకం వగైరా వంశికి చిరపరిచితం. ఈ రెండేళ్ళలో ఆ తబుకు ఐదుసార్లైనా తాకట్టు పట్టి ఉంటాడు. ఏమీ అభ్యంతరం చెప్పకుండా రూపాయి తీసి ఇచ్చాడు.

మర్నాడు మహేశం మళ్ళీ గఫూరు వాకిట కనపడింది.

అదే తుమ్మచెట్టు. అదేత్రాడు. అదే నిరాహారం. నీళ్ళు కారుస్తూ ఉన్న నల్లని జాలి కళ్ళు. ఒక ముసలి సాయిబువచ్చి నిఘాగా దాన్ని చూస్తున్నాడు. ప్రక్కని ముదుకులు ముడుచుకొని గఫూరు కూర్చున్నాడు. పరీక్షచేయటం పూర్తిచేసి ముసలిసాయిబు పచ్చడం కొంగునుండి ఒక పదిరూపాయల నోటు విప్పాడు. పదిసార్లు అటూ ఇటూ నలిపాడు. చివరికి గఫూరు చేతిలో పెట్టి 'దీన్ని మార్చదలచలేదు మరి. ఇంద. తీసుకో.'

గఫూరు అప్రయత్నంగా అందుకున్నాడు. మాట్లాడదు, కదలడు.

సాయిబు ఎద్దును విప్పబోయాడు. గఫూరు దభాలున లేచాడు.

'కబర్దార్ ! విప్పావంటే ఏమౌతుందో, చూసుకో!' ముసలిసాయిబు త్రుళ్ళిపడ్డాడు.

'ఏం??'

'ఏం లేదూ, గీం లేదూ. నావస్తువు నేను అమ్మను.' నోటు గిరవాటు వేశాడు.

'మాట ఇచ్చి బయానా కూడా పుచ్చుకున్నావు కదా!' ముందు పుచ్చుకున్న బయానా రెండు రూపాయలు కూడా గఫూరు విసిరికొట్టాడు. జట్టీ ఇష్టంలేక ముసలిసాయిబు ఇంకో రెండురూపాయిలు చేర్చి :

'ఇందుకోసమేనా, పోనీ పుచ్చుకో, అది ముందే చెప్పరాదూ!' అన్నాడు.

'ఊఁహూఁ'

'కాని ఇంతకు మించి దమ్మిడీ ఐనా ఎవ్వరూ ఇవ్వరు, తెలిసిందా!'

'ఊఁహూఁ"

'ఊఁహూఁ అంటే నాకర్థంకాదు. ఏమి వచ్చినా దీని చర్మంవల్లనేనా, దీని శరీరంలో మరేమైనా ఉంది గనకనా?'

గఫూరు తల గిర్రుమన్నది. ఏదో చెడ్డ మాటకూడా నోటంబడి వచ్చింది. వెర్రివాడిలా పారిపోయాడు ఇంటిలోకి.

'పొండి, ఈచుట్టుప్రక్కల కనబడ్డారా మాట దక్కదు. జమీందారుతో చెపుతాను. జాగ్రత్త!'

చేసేదిలేక వెళ్లిపోయాడు ముసలి సాయిబు.

మరికొంతసేపటికి జమీందారుగారి కచేరికి పిలువువచ్చింది గఫూరుకు. గఫూరు గ్రహించాడు సర్కారువారి చెవికి ఈ కబురెలాగో వెళ్లిందని. కచేరీలో చిన్నా పెద్దా ఉన్నారు. గఫూరును చూడగనే జమీందారు కళ్ళెర్ర చేస్తూ 'ఏంరా, గఫూర్ ! నిన్నేం చేయాలో తెలీకండా ఉంది. నువ్వెక్కడ బ్రతుకుతున్నావో తెలుసా!"

'చిత్తం, సర్కార్ ! గులాపోణ్ణి కాళ్ళకు మొక్కుతా. చేసిన తప్పుకి హుజూరువారు వేసే శిక్ష దాఖలు చేసుకుంటాను. కాని, సర్కార్ ! తిండికిలేక మాడిపోతున్నాను. మరెప్పుడూ అమ్మడానికి ప్రయత్నం చెయ్యను. క్షమించండి.'

గఫూరు ఏడుస్తున్నాడు.

అందరికీ ఆశ్చర్యం వేసింది. గఫూరు కరుకుతురక అనీ, పంతగొట్టనీ మాత్రం వాళ్ల నమ్మకం. పశువును కసాయివాడికి విక్రయించడం, అందులో బ్రాహ్మణ జమీందారు గ్రామంలో తప్పని అతడు వొప్పుకుంటున్నాడు. గఫూరు తన రెండుచెవులూ పట్టుకొని గుంజీలుతీసి నిలబడ్డాడు.

'సర్కార్' ! మరెప్పుడూ ఈపని చెయ్యను.'

జమీందారుగారు క్షమించారు. వారి క్షమాగుణాన్నీ, ధర్మపరిపాలననీ అందరూ ప్రశంసించారు. తర్కరత్నంగారు గోశబ్దం మీద శాస్త్రప్రమాణంతో వ్యాఖ్యానం వినిపించారు. ధర్మజ్ఞానహీనుడైన గఫూరు పూర్వజన్మంలో ఏపాపం వల్ల ఈజన్మ ఎత్తాడో, మ్లేచ్ఛజాతిని ఎంచేత గ్రామంలో ఉంచరాదో శాస్త్రప్రమాణాలతో రుజువుచేసి అక్కడివారి జ్ఞాననేత్రం వికసించేటట్టు చేశాడు. ఈ తిరస్కారానికి తాను అర్హుడే అనుకున్నాడు గఫూరు. ఈ అవమానం వల్ల తన హృదయం తేలికపడ్డట్టయింది. ఊళ్లో ఇంతగంజి అడిగి తెచ్చి మహేశానికి పెట్టాడు. తలమీదా, శరీరం మీదా చేతులు నిమురుతూ ఏవేవో గొణుగుకున్నాడు.

3

జ్యేష్ఠమాసం ఐపోవస్తున్నది. ఆకాశం మండిపోతూఉంది. ప్రపంచమంతా దగ్ధమయ్యే వరకూ ఈ మంట చల్లారదా ! మిట్టమధ్యాహ్నం, గఫూరు ఇంటికి తిరిగి వచ్చాడు. పై వాళ్ల దగ్గర కూలిచేసే అలవాటతనికి లేదు. జ్వరం విడిచి నాలుగైదురోజులయింది. దుర్బలంగా ఉన్న శరీరం మరింత అలిసిపోయి ఉంది. ఐనా కూలికోసమే ఇవాళ వెదికి వచ్చాడు. దుర్భరమైన ఎండ మాత్రం తన నెత్తిని మండించింది. వాకిట్లోనే నిలబడి పిలిచాడు.

'అమీనా! వంటయిందా?'

అమీనా పైకి వచ్చి మౌనంగా నిలబడింది.

'అరే, వంటైందా అంటా, ఏం? వండలేదూ! ఎంచేతా?'

'బియ్యం లేవు'

'పొద్దున్నే ఎందుకు చెప్పలేదు?'

'రాత్రే చెప్పాను కదా!'

'రాత్రి చెప్పిన మాట ఎలా జ్ఞాపకం ఉంటుందనుకున్నావ్ !'

తన వికారమైన గొంతుకవల్ల కోపం మరింత అధికమైంది.

మొహం మరింత వికృతం చేస్తూ-

'బియ్యం ఎలా ఉంటాయి! జబ్బుతో ఉన్న ముసలితండ్రి తిననీ తినక పోనీ, వయసు పిల్లకు నాలుగైదు సార్లు తిండికావాలి ! ఇక నుంచి బియ్యం తాళం వేసి ఉంచుతాను. దాంతో రోగం కుదురుతుంది. తే, ముంతెడు మంచినీళ్లు తే, దాహంతో కళ్లు పేలిపోతున్నాయి. ఊఁ, అవీ లేవని చెప్పేయ్.'

అమీనా అలాగే తల వేలేసుకు నిలబడ్డాది. ఇంట్లో మంచి నీళ్లు కూడా లేవని తెలిసిపోయింది.

అమాంతంగా ఉరికి అమీనా చెంప మీద ఒక్క దెబ్బవేశాడు.

'హరామ్ జాదీ ! రోజంతా ఏంచేస్తున్నావ్ ! ఇంతమంది చస్తున్నారు. నీకుమాత్రం చావు రాకండా ఉంది.'

అమీనా ఏమీ జవాబు చెప్పలేదు. మట్టికడవ ఎత్తుకొని, కళ్లుతుడుచుకుంటూ మండుటెండలో బైలుదేరింది. ఆ కళ్లమరుగు నుండి ఏదో ఒక బాణం వచ్చి గఫూరు గుండెల్లో తాకినట్టైంది. అమీనా తల్లి చనిపోయిన తరువాత ఆమెను ఎలాపెంచి పెద్ద చేసిందీ తనకే తెలుసు. ఇంట్లో ధాన్యం గింజలు ఐపోయిన నాటినుండీ రెండుపూటలు కడుపునిండ తిండికి లేదు. ఇవాళ ఒకపూట తింటే- రేపు దినమంతా పస్తు. కూతురు మీద తెలిసీకూడా ఊరికే నిందలాడాడు. నీళ్లు ఇంట్లో లేకపోవడానికికూడా కారణం

తనకు తెలుసు. గ్రామంలోని రెండు చెరువులూ ఎండిపోయాయి. జమీందారుగారి ఇంటి చెరువునీళ్లు అందరికీ లభ్యం కావు. పొరుగు ఊరు పొలిమేర రెండు గుమ్ములు త్రవ్వి వాటినుండి నీళ్లు తీస్తున్నారు. అక్కడ తీర్థమంత తోపులాట. అందులోనూ అమీనా తురకపిల్ల. గుమ్మిదగ్గరకు వెళ్లడానికి వీలులేదు. దూరంగా నిలబడి బ్రతిమిలాడితే ఎవరన్నా ధర్మాత్ములు ఇన్ని నీళ్లు ఎత్తి పోస్తే అవి తీసుకురావాలి. గంటల తరబడి బ్రతిమిలాడినా ఒక్కొక్కసారి పోసేవాళ్లుండరు. ఇదంతా గఫూరుకు తెలుసు. ఇవాళ ఒక వేళ అక్కడ నీళ్లు లేకపోయి ఉండవచ్చు. లేదా తమ తోపులాటలో అమీనా మీద ఎవరికీ దయ కలగకపోయీ ఉండవచ్చు. ఇదంతా స్ఫురించగానే అతడి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. సరిగా ఇదే సమయానికి జమీందారు గారి బంట్రోతువాకిట్లో గట్టిగా అరిచాడు.

'ఏయ్, గఫూర్ ! ఇంట్లో ఉన్నావూ!'

'ఏం?'

'హుజూర్ వారు రమ్మంటున్నారు.'

'నేనింకా ఏమీ తినలేదు. కొంచెం సేపటిలో వస్తాను.'

ఈ అవమానం బంట్రోతుకు దుర్భరమైంది. ఇక అశ్లీలసంబోధన చేస్తూ–

'చెప్పుతో దవడ ఊడగొట్టి ఈడ్చుకు రమ్మని హుకుం, తెలుసా?'

'జాబేజా ! చక్రవర్తి రాజ్యంలో ఎవడూ ఎవడికీ గులాంకాడు. నేను పన్ను కడుతూ ఇక్కడ ఉన్నాను. రాను వెళ్లు.'

గఫూరు వంటి క్షుద్రజీవి ఇలా అనడం ఎంత అనుచితం!– ఎంత ప్రమాదం! తరవాత ఏం జరిగిందీ విస్తరించనవసరంలేదు. కొన్ని గంటలయాక అతడు జమీందారుగారి కచేరీనుండి ఇంటికి వచ్చాడు. మాట్లాడకండా కూర్చున్నాడు.

కళ్లూ, మొహం వాచిపోయి ఉన్నాయి. ఈ శిక్షకంతకూ కారణం మహేశం. గఫూరు బైటికి వెళ్లాక త్రాడు తెంపుకొని జమీందారుగారి వాకిట్లో దూరింది. పూల మొక్క చివురు తినేసింది. ఇలా ఇదే తొలిసారికాదు. అనేకసార్లు జరిగింది.

గఫూరు బీదరికం అతణ్ణి రక్షించేది. ఈసారికూడా దండాలుపెట్టి బ్రతిమాలుకుంటే క్షమాపణ దొరికేది. కాని బంట్రోతుతో పెద్దమాటలాడడం తనకు ఇంతముప్పు వచ్చింది. జమీందారు కచేరీలో తనమీద పడిన దెబ్బలకూ, తిట్లకూ పల్లెత్తి మాటాడలేదు గఫూరు. తిరిగివచ్చి అలాగే మౌనంగా కూచున్నాడు. ఆకలీ, దప్పీ అతడి గుర్తులోలేవు. మిట్ట మధ్యాహ్నం ఆకాశంలాగే అతడి హృదయం దహించుకుపోతున్నది. ఇలా ఎంత సేపో గడిచింది. హటాత్తుగా వాకిట్లో కూతురు కేక వినపడింది. పైకివచ్చి చూశాడు. అమీనా క్రింద పడిపోయిఉంది. కడవ పగిలి చెక్కలైపోయిఉంది. నీళ్లు అటూ ఇటూ ప్రవహిస్తు–న్నాయి. మహేశం ఆ నీళ్లు త్రాగుతున్నాది. రెప్పపాటులో గఫూరు ఉరికాడు. ప్రక్కని ఉన్న నాగేటిపిడి రెండు చేతులా ఎత్తి బలంగా కొట్టాడు మహేశం నెత్తిమీద.

మహేశం వాల్చినతల పైకి ఎత్తాలని ప్రయత్నించింది ఓసారి. తిండిలేక జీర్ణించి పోయిన దాని శుష్కశరీరం నేలమీద పడి పొర్లడం ఆరంభించింది. కంటి కొనల నుండి చుక్కలు చుక్కలుగ చెవులవరకూ ప్రవహించాయి కన్నీళ్లు.

తలమీద రక్తంచుక్కలు కనిపించాయి. రెండుసార్లు గజగజవణికింది కళేబరం. తరవాత ముందు కాళ్లూ, వెనక కాళ్లూ చాపగలిగినంతగా చాపి వేసింది. చివరి ఊపిరి వదిలి వేసింది.

అమీనా ఏడుస్తూ 'బాబా! ఎంతపనిచేశావు! ఎంతపనిచేసావు బాబా! మన మహేశం చచ్చిపోయింది.'

గఫూరు నిలుచున్న చోటినుండి కదలలేదు. రెప్పలు వాల్చని కళ్లతో, మహేశం కళ్లను– రెప్పలు పడని ఆ నల్లనికళ్లను రెంటినీ చూస్తూ రాయిలా నిలబడిపోయాడు. గంటలో ఈ వార్త విని ప్రక్క ఊరినుండి చెమారవాళ్లు వచ్చి మూగారు. మహేశాన్ని నాలుగ్గుకాళ్లూ కలియగట్టిమోసుకుపోయారు. వాళ్ల చేతుల్లో దారైన కత్తులు మెరుస్తున్నాయి. గఫూరు నిలువునా వణికి పోతూ, రెండుకళ్లూ చేతులతో కప్పుకున్నాడు. అంతే. ఒక మాటైనా అనలేదు.

దీనికి చేయవలసిన ప్రాయశ్చిత్తం కోసం జమీందారు పురోహితుడికి కబురంపారని ఊళ్లో వాళ్లు చెప్పారు. ప్రాయశ్చిత్తం కోసం ఇల్లూ వాకిళ్లూ అమ్మేయవలసి వస్తుందేమో! గఫూరు దేనికీ జవాబు చెప్పలేదు. ముడుకుల్లో తల పెట్టుకొని ఎక్కడివాడక్కడే కూర్చుండి పోయాడు.

రాత్రి చాలా గడిచిపోయింది. చీకట్లో నక్షత్రాలు సూదుల్లా ఉన్నాయి. అర్ధరాత్రి కూతుర్ని లేపాడు.

'అమీనా, బేటీ! పద వెళ్లిపోదాం.'

ద్వారం దగ్గిర పడుకున్న అమీనా కళ్ళు నులుపుకుంటూ లేచింది.

'ఎక్కడి కెళదాం బాబా?'

'మిల్లులో పని చేసిందికి.'

అమీనా త్రుళ్ళిపడింది.

ఇంతకుముందు ఎంత కష్టంవచ్చినా మిల్లులోకి తండ్రి వొప్పుకునేవాడు కాదు. మర్యాదా ఉండదనీ, ఆడవాళ్ళమానం అసలే దక్కదనీ రకరకాల మాటలు చెప్పేవాడు.

'పద బేటీ ! ఆలస్యం చెయ్యకు. దూరం నడవాలి.'

నీళ్ళుత్రాగే చెంబూ, తండ్రి అన్నం తినే తబుకూ వెంట తీసుకుపోవాలనీ అమీనా చూసింది. కాని అతడు వద్దన్నాడు.

'ఇవన్నీ ఇక్కడే ఉండనీ తల్లీ ! వీటితో మన మహేశం ప్రాయశ్చిత్తం జరుగుతుంది.'

దరిద్రంకంటె నల్లగా ఉంది చీకటి, దుఃఖంకంటె గంభీరంగాఉంది. తాత ముత్తాతలు కట్టిన ఇంటి గుమ్మం వదిలి, కూతురు చేయి పట్టుకొని ఆ చీకటిలోకి నడిచాడు గఫూరు. వాకిట్లో తుమ్మచెట్టు దగ్గరికి వచ్చి చటుక్కున ఆగిపోయాయి కాళ్ళు. తరంగతరంగంగా దుఃఖం పొర్లి వచ్చింది. వెక్కి వెక్కి ఏడ్చాడు. చుక్కల నీలిఆకాశం వైపు తలఎత్తి అన్నాడు:

'యా అల్లా ! నన్ను నీ ఇష్టం వచ్చిన శిక్ష వెయ్యి. కాని, నా మహేశం దాహంతోనే చచ్చిపోయింది. మేయడానికి ఇంతభూమి ఎవరూ వదలలేదు. నువ్వు ప్రసాదించిన మైదానంనుండి ఇంతగడ్డి ఎవరైతే దాన్ని తిననివ్వలేదో, నువ్విచ్చిన నీళ్ళుకూడా ఎవరైతే దాన్ని త్రాగనివ్వలేదో వారిని– ఆ అపరాధాన్ని మాత్రం క్షమించకు! క్షమించకు?'

◆

వారది పుచ్చుగుని దాన్ని చేతులో తిరగా బోర్లావేసి చూశారు

7

ప్రసిద్ధ చలనచిత్ర దర్శకులు, కథకులు వంశీ ఒకసారి నాతో మాటల మధ్య స్టాన్లీ కుబ్రిక్ గురించి ఒక మాట చెప్పారు. చాలామంది దర్శకులు ఇప్పటికీ తాము సినిమాలు తీయబోయే ముందు స్ఫూర్తికోసం కుబ్రిక్ సినిమాలు వేసుకుని చూస్తూ ఉంటారట. నా విషయంలో కథారచన వరకూ నేను ఈ మాట టాల్‌స్టాయి గురించి చెప్పగలను.

చిన్నపిల్లలకు రాసిన కథలతోనే కథకుడిగా టాల్‌స్టాయి తొలిపరిచయం నాకు. God Knows the Truth, But Waits అనేది మా ఇంగ్లిషు నాన్–డిటెయిల్డులో ఉండేది. ఆ తర్వాత ఆయన బాలసాహిత్యం తెలుగు అనువాదాలు చదివాను. కాని 'విషాదసంగీతం' (1985) కథాసంపుటి నా చేతుల్లోకి వచ్చిన రోజు నేనెన్నటికీ మరవలేను. అందులో ప్రతి ఒక్క కథా నాకు హృదయస్థమై పోవడమే కాదు, ఆ ప్రతి ఒక్క కథకీ నేను కూడా మరొక ప్రతికృతి రాసుకోవాలని బలంగా అనుకునేవాణ్ణి కూడా.

అలాగని అనుకరణ కాదు. వాటిని నమూనాలుగా నా కథాశిల్పాన్ని మెరుగు పెట్టుకోడానికీ, జీవితానుభవాల పట్ల లోతైన దృక్పథం ఏర్పరచుకోడానికీ ఆ కథల్ని నా ఎదట పెట్టుకున్నాను. వాటిల్లో 'స్వామి సేర్గియ్' (1898) కథని బట్టే నా 'గోధూళి' (1986) కథ రాసానని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. తెలివైన తెలుగు పాఠకులు

కొందరు ఆ విషయం తమంతటతామే పట్టుకున్నారు కూడా. కాని రెండేళ్ళ కిందట నేను 'ఆ వెన్నెలరాత్రులు' రాసినప్పుడు, ఆ కథన శిల్పం వెనక 'సంసారసుఖం' కథ ఉందని ఎందరు పోల్చుకున్నారో నాకు తెలీదు.

అలాగే 'ఇవాన్ ఇల్యిచ్ మరణం' (1886) కథ చదవకపోయి ఉంటే నేను 'ప్రశ్నభూమి' (2002) కథ ఊహించగలిగేవాణ్ణి కూడా కాదు. ఇక పరిపూర్ణ కథాశిల్పానికి నమూనాగా చెప్పదగ్గ 'విందునాట్యం తరువాత' (1903) నన్నెంతగా వెంటాడిందంటే, ఆ కథని నేను కూడా అనువదించడమే కాక, 2023 లో 'విందు తరువాత' అని ఒక కథ రాసేకగానీ నేనా ఒత్తిడి నుంచి బయటపడలేకపోయాను.



ఇతిహాసాల్లాంటి అనాకెరినినా, వార్ అండ్ పీస్ రాసేక టాల్‌స్టాయి చాలాకాలం పాటు నీతికథల కథకుడిగా తనని తాను తీర్చిదిద్దుకుంటూ గడిపేడు. మళ్ళా పూర్వం రాసినట్టు కథలూ, నవలలూ రాయమని తుర్జెనీవుతో సహా ఎందరో ఆయన్ని బతిమాలుకున్నారు. కాని ఉన్నట్టుండి, తనకే, తన సృజనసామర్థ్యాలు సన్నగిల్లు తున్నాయేమో అని అనుమానం వచ్చినట్టుంది, టాల్‌స్టాయి, మళ్ళా కథలు రాసేడు. ఈ కథలు ఆయన అంతదాకా రాసిన సాహిత్యాన్ని మించిపోయిన కథలు. వాటిల్లో 'హాజీమురాద్' (1904) అనే నవలికనైతే హెరాల్డ్ బ్లూమ్ టాల్‌స్టాయి రచనలన్నిటిలోనూ సర్వోత్కృష్టమైన రచన అని ప్రస్తుతించాడు కూడా. Master and Man (1895), The Forged Coupon

(1904), Alyosha (1904), What For? (1906) వంటివి నేనెన్నటికీ మరవలేని కథలు. ఈ కథలకు వచ్చేటప్పటికి, టాల్‌స్టాయి, బొకాషియో, ఛాసరు, షేక్స్పియర్లతో సమానమైన కథకుడిగా మారాడు. The Forged Coupon కథ అయితే జాతక కథలతో సమానమైన కథ.



నలభయ్యేళ్ళుగా నన్ను వెన్నాడుతున్న కథల్లో 'విషాదసంగీతం' పుస్తకం లోంచి ఏ ఒక్క కథనేనా ఎంచి పరిచయం చేయవచ్చు, లేదా ఆయన చివరలో రాసిన కథలనుంచి కూడా ఏదైనా అనువదించి పంచుకోవచ్చుగానీ, వాటి నిడివి నన్ను ఆపేస్తున్నది. అందుకని ఆయన రాసిన చిన్నపిల్లల కథల్లోంచి 'కోడిగుడ్డంత గోధుమగింజ' కథని ఇక్కడ పరిచయం చేస్తున్నాను.

ఈ కథ ఒక్కటే ఒక చిన్నపుస్తకంగా, (ఆ ప్రచురణకర్తలు ఎవ్వరో గుర్తులేదు) తెలుగులో వెలువరించగా 81 లో చదివినట్టు గుర్తు. ఆ పుస్తకాన్ని అనువదించింది ఎవరో నాకు గుర్తులేదు. కానీ టాల్‌స్టాయి రాసిన చిన్నపిల్లల కథలు భమిడిపాటి కామేశ్వరరావు గారు అనువదించి వెలువరించిన మూడు సంపుటాలు ఇప్పుడు లభ్యమవుతున్నాయి. ఈ కథకి ఆయన చేసిన అనువాదం వాటిల్లో మొదటి సంపుటం నుంచి ఇక్కడ అందిస్తున్నాను.

నిజానికి దీన్ని చిన్నపిల్లల కథ అని చెప్పలేం. ఇది వయోవృద్ధుల కథ కూడా. ఇది మానవ

జాతి శైశవకాలానికి చెందిన ఒక కృతయుగం కథ. ఒక సత్యయుగం కథ. దీన్ని ఇలా చెప్పాలంటే టాల్‌స్టాయిలాగా ఒక జీవితకాలం పాటు కథారచన అభ్యాసం చేసి ఉండాలి. ఇటువంటి ఒక్క కథతో టాల్‌స్టాయి, ఈసోపు, పంచతంత్రకారుల స్థాయికి చేరుకున్నాడని చెప్పగలను.

ఇటువంటి సత్యయుగాల గురించిన ఒక మెలకువ తక్కినజాతుల్లోనూ, సంస్కృతుల్లోనూ కూడా కనిపిస్తుంది. వేదకాల మానవుడు ఉంఛవృత్తి అన్నిటికన్నా అత్యున్నత జీవనోపాధి అనుకున్నాడు. ప్రాచీనచీనాలో పంటలు పండేక తమ అవసరాలు తీరగా మిగిలినదాన్ని పట్టుకుపోయి పొలాల్లో పారబోసేవారనే ఒక ఐతిహ్యం చీనా కవుల్ని వెంటాడుతూనే ఉంది. ముఖ్యంగా చీనాకవుల్లో ఋషీశ్వరుడని చెప్పదగ్గ తావో యువాన్-మింగ్ అటువంటి సత్యకాలం కోసమే జీవితమంతా పరితపిస్తూ ఉన్నాడని ఆయన కవిత్వం ఎలుగెత్తి చాటుతున్నది. చారిత్రక భౌతికవాదులు కూడా ఇటువంటి ఒక కృతయుగాన్ని సంభావించారు. వారు దాన్ని ప్రిమిటివ్ కమ్యూనిజం అన్నారు.

ఈ కథని ఒక కల్పనగా కొట్టిపారెయ్యడం చాలా సులభం. కాని అలా కొట్టి పారేస్తున్నామంటే మనలోని శిశువు పూర్తిగా అదృశ్యమైపోయాడన్నమాట. చిన్నపిల్లలకి ఈ కథ వినిపించండి. వాళ్ళు దీన్ని కల్పన అనుకోరు. నిజంగానే మనుషులు తమ స్వీయకష్టం మీద తాము ఆధారపడ్డప్పుడు, తమ పంటలో మిగులుగింజల్ని సారాయిగా మార్చనప్పుడు గోధుమగింజలు కోడిగుడ్డంత ఉండేవనే నమ్ముతారు. అలా నువ్వూ నేనూ నమ్మగలిగితే, ఏదో ఒక మేరకు, ఆ సత్యకాలాన్ని తిరిగి తెచ్చుకోగలమనే టాల్‌స్టాయి నమ్మాడని ఆయన జీవితప్రయాణం మనకు వివరిస్తుంది.

ఈ అనువాదం గురించి కూడా ఒక మాట చెప్పాలి. ఈ కథలో ఉండే మౌఖికత టాల్‌స్టాయి రష్యన్లో ఎలా ఉండేదో మనకు తెలియదుగాని, కామేశ్వరరావుగారి కథనధోరణి, అచ్చం పూర్వకాలపు కుటుంబాల్లో ఉండే నాయనమ్మల, అమ్మమ్మల కథనధోరణిని పుణికి పుచ్చుకుంది. కాబట్టి ఈ కథని ఈ అనువాదంలో చదవడంలో ఒక అదనపు ఆహ్లాదం ఉందనిచెప్పవచ్చు.

టాల్ స్టాయి

కోడిగుడ్డంత గోధుమ గింజ

భమిడిపాటి కామేశ్వరరావు

ఒకనాడు కొందరు పిల్లలు ఒక లోయలో ధాన్యపుగింజవంటి రూపంలో ఒక వస్తువు చూశారు. దానికి మధ్య నిలువుగా ఒక గాడి ఉంది, కాని ఆ వస్తువు బాగా కోడిగుడ్డంత పెద్దదిగా ఉంది. దారిని పోతూండే బాటసారి ఒకడు అది వాళ్ళ దగ్గర్నించి ఓ కానికి కొన్నాడు. అతడు పట్టణానికి వెళ్ళగానే విచిత్రవస్తువుగా దాన్ని రాజుగారికి అమ్మేశాడు. రాజుగారు తన పండితులకి కబురంపి అదేమిటో తేల్చవలసిందిగా వాళ్ళని కోరాడు.

వారు ఎంతేనా ఆలోచించారుగాని దాన్ని గురించి తలా తోకా తేల్చలేకపోయారు. ఒకనాడు అది ఒక కిటికీ కమ్మి మీద ఉంటూన్న స్థితిలో ఒక కోడిపెట్ట ఆక్కడికి ఎగిరి ముక్కుతో పొడవగా దానికి చిల్లుపడింది. దాంతో అది ధాన్యపుగింజ అనే సంగతి అందరికీ విశదమైంది. పండితులు వెళ్ళి 'అది ధాన్యపుగింజేనండి' అని రాజుతో విన్నవించారు. రాజు మిక్కిలి ఆశ్చర్యపడిపోయాడు. అటువంటి ధాన్యం ఎక్కడ ఎప్పుడు పండేదో కనుక్కోవలిసిందిగా ఆ పండితుల్ని కోరాడు. పండితులు మళ్ళీ ఆలోచనలో పడి గ్రంథాలు తిరగెయ్యడం మొదలెట్టారు. దాన్ని గురించిన సంగతి ఎక్కడా దొరకలేదు. అప్పుడు వాళ్ళు రాజుదగ్గిరకొచ్చి, 'మీకు సమాధానం చెప్పడం మావల్లకాదు. పుస్తకాల్లో ఎక్కడా దీని ప్రమేయంలేదు. రయితులెవర్నేనా పిల్చి ఇంత పరిమాణంలో ఇటువంటి ధాన్యం ఎప్పుడుఎక్కడ పండేదో అడగండి, ఆ రయితులు వాళ్ళ తండ్రులు చెప్పగా,

వినేనా ఉండవచ్చును.' అన్నారు. ముసలి రైతునెవర్నేనా తన ఎదటకి తీసుకు రావాలని రాజు ఆజ్ఞాపించాడు. అటువంటివాణ్ణి వెతిగి నౌఖర్లు తీసుగువచ్చారు. ఆ ముసలివాడు నడుం వంగిపోయి పాలిపోయి దండమాన్యంగా ఉంటూ, రెండు కర్రలమీద ఆనుకుంటూ రాజు సమక్షంలోకి తూలుకుంటూ వచ్చాడు. అతడికి రాజు ఆ ధాన్యపు-గింజ చూపించాడు. దృష్టిలోపంవల్ల ఆ ముసిలాడు దాన్ని తిన్నగా చూడలేక పోయాడు. కాని, ఎల్లాగైతే అది పుచ్చుగుని ముట్టుగుని చూశాడు. రాజు, 'ఓ వృద్ధా, చెప్పగలవా ఇల్లాంటి ధాన్యం పూర్వం ఎక్కడపండేదో? ఇల్లాంటిదెప్పుడేనా కొన్నావా? ఇల్లాంటి విత్తులు నీ పొలంలో ఎప్పుడేనా చల్లి చూశావా?' అని అతణ్ణి అడిగాడు. ముసలాడికి చెముడు కూడానూ, కర్మం! అందుచేత రాజు ప్రశ్నలు అతడికి అవగాహన అయేసరికి చచ్చినంతపని జరిగింది. సమాధానం బ్రహ్మాండంమీద, చెబుతూ 'అబ్బెబ్బే! నా పొలాల్లో ఇల్లాంటిది ఎన్నడూ నేను చల్లలేదు. పండించ లేదు. ఇల్లాంటిది ఎన్నడూ నేను కొనాలేదు. మీరు మా నాన్నని కనుక్కోండి. ఇల్లాంటి ధాన్యం ఎక్కడ పండేదో అతడు వినుండవచ్చు' అన్నాడు. ఆ మట్టున రాజు అతడి తండ్రికి కబురు చెయ్యగా అయన్ని రాజు ఎదట హాజరు పెట్టారు. ఆయన ఒక్క కర్రమీదే ఆనుకుంటూ వచ్చాడు. రాజు ఆ గింజ ఆయనకి చూపించాడు. ఆ ముసిలి రైతుకి దృష్టి సరిగ్గానే ఉండడంవల్ల ఆ గింజని ఆయన పరిశీలనగా చూశాడు.

రాజు- 'ఓ వృద్ధా! చెప్పగలవా ఇల్లాంటి ధాన్యం పూర్వం ఎక్కడ పండేదో? ఇల్లాంటిదెప్పుడేనా కొన్నావా? ఇల్లాంటి విత్తులు నీ పొలంలో ఎప్పుడేనా చల్లి చూశావా?' అని ఆయన్ని అడిగాడు. ఈయనికీ చెముడు లేకపోలేదుగాని, కొడుకుకి వినపడేకంటే ఈయనకే బాగా వినిపిస్తుంది. ఆయన, 'అబ్బెబ్బే ! నా పొలాల్లో ఇల్లాంటిది ఎన్నడూ నేను చల్లలేదు. పండించాలేదు. కొన్నావా అంటారా. ఇల్లాంటిది కొనాలేదు. ఏమంటే నా కాలంలో ధనం అనేది ఆట్టే వాడుకలోకి రాలేదు. ఎవడి ధాన్యం వాడే పండించుకునే-వాడు. లోటొచ్చిన వాడికి అదనంగా పండించినవాడిచ్చేవాడు. ఇటువంటి ధాన్యం ఎక్కడ పండేదో నే నెరగను. మా నాటి ధాన్యం ఈ నాటి ధాన్యం కంటే పెద్దదిగా ఉంటూ ఎక్కువ పిండికూడా అయేదేకాని, ఇంత పెద్దగింజ మాత్రం నే చూడలేదు. కానైతే మా కాలంలో కంటే, తమరి కాలంలో గింజ పెద్దదనిన్నీ ఎక్కువపిండి అయేదనిన్నీ మా నాన్న చెబుతూండగా వింటూండే వాణ్ణి. ఆయన్ని పిలిపించి కనుక్కోండి,' అన్నాడు. అందు మీదట రాజు ఈ ముసలాయన తండ్రిగారికి కబురు చెయ్యగా, వార్ని కూడా ఎక్కడున్నారో వెతిగి పట్టుకుని రాజు సమక్షంలోకి రావించారు. వారు ఏ కర్రా గర్రా

అక్కర్లేకుండా స్వంత కాళ్ళతో నడుస్తూ సుళువుగా చక్కావచ్చారు. వారిచూపు సుబ్బరంగా ఉంది. వినికిడి చక్కగా ఉంది, మాట స్పష్టంగా ఉంది. రాజు ధాన్యపుగింజ వారిచేతి కిచ్చారు. వారది పుచ్చుగుని దాన్ని చేతులో తిరగా బోర్లావేసి చూశారు.

వారు– 'ఇంత చక్కటి గింజ చూసి చాలాకాలం అయింది', (అని అది కొరికి రుచి చూస్తూ) అవునవును, ఆ జాతిదే!

రాజు– తాతగారూ ! ఎప్పుడు ఎక్కడ పండేదీ ఇటువంటి ధాన్యం? ఇల్లాంటి దెప్పుడేనా మీరు కొనుకున్నారా? లేక మీ పొలాల్లో చల్లి చూశారా ?

వారు– ఇల్లాంటి ధాన్యం నా కాలంలో ప్రతీచోటా పండేది, నా చిన్నతనంలో ఇల్లాంటి ధాన్యమే మేం తిని ఇంకోళ్ళకికూడా పెట్టేవాళ్ళం. మేం ఇల్లాంటిదే చల్లి, పండించి, నూర్చేవాళ్ళం.

రాజు– తాతగారూ ! చెప్పండి. ఎక్కడేనా మీరు ఇల్లాంటి ధాన్యం కొనుక్కునేవారా. అంతా మీరే పండించుగునేవారా?

వారు– (కొంచెం నవ్వుతూ) నాకాలంలో ఎవడూ కూడా ఆహారం కొనుక్కోడమనే పాపమూ, ఆహారం అమ్మడమనే పాపమూ ఎరగడు. ధనం అంటే ఏమిటో మాకు తెలియదు. ఎవడిమట్టుకి సరిపడ ధాన్యం వాడికుండేది.

రాజు– అయితే, తాతగారూ, చెప్పండి చెప్పండి. మీ పొలం ఎక్కడ ఉండేదీ మీరెక్కడ పండించేవారిల్లాంటి ధాన్యం?

వారు– భగవంతుడిదైన ఈ భూమి నా పొలం. నేనెక్కడ దున్నితే, అదీ నా పొలం. నేల అప్పుడు స్వేచ్ఛగా ఉండేది. నేల తనదీ అని ఎవడూ అనుకునేవాడు కాడు. ఎవరేనా తమది అని చెప్పుకోతగ్గది ఒక్కటీ ఏమిటంటే, కాయకష్టం.

రాజు– మరి రెండు ప్రశ్నలకి సమాధానం చెప్పండి. మొదటి ప్రశ్న– అప్పట్లో ఇంత పెద్ద ధాన్యం పండే భూమి ఇప్పుడు మానేసిందేం? రెండో ప్రశ్న– మీ మనమడు రెండు కర్రలమీద ఆని కుంటుతూ రాగా, మీ కొడుకు ఒక్క కర్ర మీద ఆని రాగా, మీకు ఏ ఆసరా లేకుండా ఖరాగా వచ్చేశారే! పైగా మీ కళ్ళు ప్రకాశవంతంగానూ, మీ పళ్ళు గట్టిగానూ, మీ మాట స్పష్టంగానూ చెవికింపుగానూ ఉన్నాయే! మార్పులు ఎల్లా వచ్చాయి?

వారు– నా కొడుకు తరంలోనూ, నా మనమడి తరంలోనూ మార్పులు ఎందుకు వచ్చాయంటే, స్వకాయకష్టంవల్ల జీవించడం మానేసి, అన్యుల కాయకష్టం మీద ఆధారపడడం జనం మరిగారు గనక. పూర్వకాలంలో భగవంతుడి శాసనాల్ని అనుసరించి జనం జీవించేవారు. వారు తమ శ్రమఫలితమే తమ ఆస్తి అనుకుని, అన్యశ్రమవల్ల ఉద్భవించే వాటిని స్వంతానికి భుక్తం చేసుగోవాలని యెంచేవారు కారు.

◆

8

ఇప్పుడు తెలుగులో కథలు రాయడం ఒక ఉద్యమం. కానీ ఇప్పుడు కథలు రాస్తున్నవాళ్ళూ, కొత్తగా కథలు రాయడం మొదలుపెట్టినవాళ్ళూ తమకు స్ఫూర్తిగా ఎవరి కథలు చదువుతున్నారో తెలియదు. అసలు వారు వేరే ఎవరివన్నా కథలు చదువుతారో లేదో కూడా తెలీదు. వేరే వాళ్ల రచనలు చదివితే మనలో క్రియేటివిటీ తగ్గిపోతుందని కూడా కొందరు యువతీయువకులూ భావిస్తూ ఉండవచ్చు. లేదా వారెవరివైనా కథలు చదువుతుంటే, అవి బహుశా, గత పాతికముప్ఫై ఏళ్ళుగా తెలుగులో వస్తున్న వార్షిక కథాసంకలనాల్లోని కథలు కావొచ్చు.

కానీ కథకుడు తన పూర్వకథకుల్ని ఎంత విస్తృతంగా చదివితే అంత మంచిది. దానివల్ల మన సృజనాత్మకత ఏమీ అడుగంటిపోదు సరికదా, కథారహస్యాలు మరింత పట్టుబడతాయి. ఇప్పటి కథకుల దగ్గర తమదే అయిన ప్రత్యక్ష జీవితానుభవం విస్తారంగా ఉంది. ఇంతదాకా ప్రాతినిధ్యానికి నోచుకోని జీవితానుభవాన్ని ఎవరేనా కథలుగా చెప్పినప్పుడు ఆ కథలు మనల్ని తక్షణం ఆకట్టుకుంటాయి. విభ్రాంతి పరుస్తాయి. కానీ ఆ ఒక్కసారికే. రెండోసారి ఆ కథలు చదవాలనిపించదు. ఎందుకంటే, అందులో జీవితానుభవమేమిటో మనకి అప్పటికే తెలిసిపోయి ఉంటుంది. రెండోసారి మళ్లా

చదవాలనిపించే కొత్తదనమేదీ ఆ కథల్లో కనిపించదు.

అలాకాక, చలంగారి 'సుశీల', గురజాడ 'మెటిల్డా', శ్రీపాద 'గులాబీ అత్తరు', విశ్వనాథ 'ఏమి సంబంధము', చాసో 'రథయాత్ర', బుచ్చిబాబు 'నిరంతరత్రయం', కుటుంబరావు 'నువ్వులూ, తెలకపిండీ', రావిశాస్త్రి 'మామిడి చెట్టు ' సుబ్బరామయ్య 'పూర్ణాహుతి' లాగా ఒక కథ మళ్ళీ మళ్ళీ మనల్ని చదివించేలా చెయ్యాలంటే, అందులో శిల్పసౌష్టవమో, కథన నైపుణ్యమో, పాత్రచిత్రణనో లేదా తన జీవితా-నుభవం మీంచి కథకుడు సాగించే అంతర్మ-థనమో లేదా కథకుడి శైలినో- ఏదో ఒకటి ఉండాలి. లేదా అన్నిటికన్నా మించి ప్రేమ్‌చంద్ కథల్లోలాగా, చింతాదీక్షితులు గారి కథల్లోలాగా ఆ కథలు చదివిన ప్రతిసారీ మన హృదయాన్ని తాకే కథకుడి నిర్మలాంతరంగమో ప్రధానంగా ఉండాలి.



నన్ను వెన్నాడే కథలు అనే ఈ శీర్షిక ద్వారా నేను నలభయ్యేళ్ళ కిందట చదివిన కథల్లో కొన్ని కథలు నాకు ఇప్పటికీ ఎందుకు గుర్తున్నాయో పరిశీలించుకుంటున్నాను. వాటిల్లో నేను పైన చెప్పిన లక్షణాల్లో ఏదో ఒకటి ఉండి ఉండ వచ్చును. మరొకవైపు గత పదేళ్ళుగా, ఇరవయ్యేళ్ళుగా ఎందరు తెలుగు కథకుల కథలు చదివి ఉంటాను! కాని వాటిల్లో నన్ను వెన్నాడుతున్న కథలేవో చెప్పమంటే వెంటనే గుర్తురాక తడుముకుంటాను.

నలభయ్యేళ్ళ కింద ఇన్ని వనరులు అందుబాటులో లేవు. ఇన్ని అనువాదాలూ అందుబాటులో లేవు. కాని లభ్యమైన ఆ కొన్ని సంకలనాలూ, ముఖ్యంగా నేషనలు బుక్ ట్రస్టువారు కథాభారతి సిరీసు కింద తీసుకువచ్చిన సంకలనాలు, మాకు గొప్ప స్ఫూర్తినిచ్చాయి. ఇప్పటికే వాటిల్లో హిందీ సంకలనం నుంచి ఒక కథ పరిచయం చేసాను. ఇప్పుడు పంజాబీ కథ ఒకటి పరిచయం చేయ–బోతున్నాను. హర్‌భజన్ సింగ్ సంకలనం చేసిన ఆ సంపుటాన్ని ఎన్.బి.టి కోసం అరిగపూడి రమేష్ చౌదరి 'పంజాబీ కథలు' (1971) పేరిట తెలుగు చేసారు. అందులో కర్తార్‌సింగ్ దుగ్గల్ రాసిన 'మహత్యం' అనే చిన్న కథ ఈ రోజు అంది– స్తున్నాను. చూడండి.



కర్తార్‌సింగ్ దుగ్గల్ (1917-2012) ఆధునిక పంజాబీ సాహిత్యంలో అగ్రశ్రేణి రచయిత. దేశ విభజనని కళ్ళారా చూసినవాడు. ఆ వ్యథల్ని కథలుగా మలిచినవాడు. ఆయన ఏకకాలంలో శిఖ్ఖూ, భారతీయుడూ, ప్రపంచపౌరుడూ కూడా. చిన్నప్పణ్ణుంచీ హిందువుల్తో కలిసిమెలిసి తిరిగాడు, క్రిస్టియను మిషనరీ స్కూల్లో చదువుకున్నాడు. ముస్లిం యువతిని వివాహమాడాడు. నేషనలు బుక్ ట్రస్టుకి చాలాకాలం సెక్రటరీగా పనిచేసాడు. చిన్నప్పణ్ణుంచీ శిఖ్ఖుగురువుల బోధలు వంటపట్టించుకున్నాడు. అందుకని పెద్దయ్యాక 'గురుగ్రంథసాహెబ్' ఇంగ్లిషులోకి అనువాదం చేసాడు. తన పిల్లలకోసం The Sikh Gurus:Their Lives and Teach-ings (1980) అనే పుస్తకం కూడా రాసాడు.

ఆధునిక యూరోపు చరిత్రలో పోలాండుది ఎటువంటి స్థానమో తరతరాల భారతదేశ చరిత్రలో పంజాబుది అటువంటి స్థానం. ప్రకాశ్ టాండన్ రాసిన Punjabi Century, 1875-1947 (1961) చదివాక ఈ సంగతి నాకు మరింత బాగా అర్థమయింది. (ఆ పుస్తకం తెలుగు సంక్షిప్తానువాదం 'పంజాబీ శతాబ్ది' పేరిట దక్షిణ భారత పుస్తక సంస్థవారు ప్రచురించారు. ఇప్పుడది ఎక్కడ లభ్యమవుతుందో తెలియదు). నిరంతరయుద్ధాల మధ్య, నిరంతర అనిశ్చితి మధ్య జీవించడమంటే ఏమిటో నిజంగా మనకి తెలియదు. భారతదేశంలో అటువంటి జీవితం ఎలా ఉంటుందో పంజాబీలకన్నా బాగా తెలిసినవాళ్ళు మరొకరు ఉంటారనుకోను.

అటువంటి జీవితం మధ్య జీవించిన కథకుడు తమ జాతి అనుభవాల గురించి ఒక కథ రాస్తే ఎలా ఉంటుంది? ఇదుగో, ఈ 'మహత్యం' కథలాగా ఉంటుంది. విషాదం మధ్యలోనే విశ్వాసం నిలబడే కథలిలా ఉంటాయి.

మరొక మాట కూడా చెప్పవలసి ఉంటుంది. అసలు కథలు ఎందుకు చెప్పుకుంటారు? ఆమాటకొస్తే సాహిత్య ప్రయోజనం ఏమిటి? ఇప్పుడు కంప్యూటర్లలో మెమొరీ నిక్షిప్తమయినట్టుగా, తరతరాలుగా మనుషులు తమ జీవితానుభవాల స్మృతిని సాహిత్యంలో నిక్షిప్తం చేస్తారు. కంప్యూటర్లలో మెమొరీ static గా ఉంటుంది. దానికి మనం అదనంగా ఏదన్నా చేరిస్తేనో లేదా ఆ మెమొరీని ఏదో ఒక ప్రాసెస్‌లో పెడితేనో తప్ప అది నిశ్చలంగా ఉండిపోతుంది. కాని సాహిత్యం నిక్షిప్తం చేసిన మెమొరీ, తరం నుంచి తరానికి అందినప్పుడల్లా, కొత్త గతిశీలతను సంతరించుకుంటుంది. పూర్వానుభవాల మీంచి ఒక తరం తనకు అందించిన పాఠాలకు మరొక తరం మళ్ళా తన అనుభవాల్ని జోడించి, ఆ స్మృతిని మరింత నవీకరిస్తుంది. అలా ఆ స్మృతికి ప్రతి ఒక్క తరంలోనూ కొత్త ప్రాసంగికత సిద్ధిస్తుంది. ఈ కథలో దుగ్గల్ చేసింది అదే.

కర్తార్ సింగ్ దుగ్గల్

మహత్యం

అరిగపూడి రమేశ్ చౌదరి

ఆ తరువాత అలా పర్యటిస్తూ బాబా నానక్, హసన్ అబ్దుల్ ఫారెస్టు చేరాడు. ఎండ చాలా తీవ్రంగా వుంది. బాగా వుక్క పెడుతూంది. నలువైపుల నిర్మానుష్యం, అన్నీ రాళ్లు, అంతా ఇసుకమయం. ఎండిపోయిన పొదలూ చెట్లు. ఎటువైపుచూసినా మనిషి జాడే కన్పించటంలా.

'తరువాత ఏం జరిగిందమ్మా?' అన్నాను నేను.

'బాబా నానక్ ధ్యానమగ్నుడై నడుస్తున్నాడు. అంతలో మర్దానాకి దాహంవేసింది. కాని అక్కడ నీరెక్కడ దొరుకుతుంది? బాబా అన్నారు. 'మర్దానా. కాస్త ఓపికపట్టు, వచ్చే వూరు చేరగానే దాహం తీర్చుకుందువుగాని.' కాని మర్దానాకు భరించలేని దాహం వేసింది. ఇది విని బాబా చాలా బాధపడ్డారు. ఆ అడవిలో నీరు దొరకటం చాలా కష్టం. మర్దానా మొండికెత్తితే అందర్నీ యిబ్బంది పెడతాడు. బాబా మరల చెప్పిచూశారు. 'మర్దానా ఇక్కడ ఎక్కడా నీరుదొరకదు. నువ్వు కాస్త ఓపిక పట్టు. దైవేచ్ఛను నిరాకరించకు.' కాని మర్దానాఅక్కడినుండి ఒక్క అడుగు ముందుకు వేయలేదు. అక్కడే కూలబడ్డాడు. బాబా చాలా చిక్కులో పడ్డారు. మర్దానా పట్టుదలచూపి గురునానక్ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఆశ్చర్యపోయారు. ఎంతచెప్పినా మర్దానా

వినకపోయేసరికి చేసేదిలేక బాబా నానక్ ధ్యానంలో మునిగిపోయారు. గురునానక్ కళ్లుతెరచి చూసేటప్పటికి మర్దానా దాహంతో చేపలా కొట్టుకుంటున్నాడు. సద్గురు అతన్ని చూసి అన్నారు. మర్దానా ఆ కొండమీది కుటీరంలో వలీ కంఘూరీ అనే సాధు వొకడున్నాడు. నువ్వతనిదగ్గరకు వెళ్ళితే నీరు దొరకవచ్చు. ఈ ప్రాంతంలో ఒక్క అతని బావిలో తప్ప మరెక్కడా నీరు దొరికే ఆశ లేదు.'

'అప్పుడేమైందమ్మా?' మర్దానాకు పాపం నీరు దొరికిందో లేదో తెలుసుకోవాలనే ఆదుర్దా నా కెక్కువైంది.

'మర్దానాకు విపరీతమైన దాహం వేసిందికదూ! అందుకనే ఈ మాట వినగానే ఆ కొండవైపు దౌడు తీశాడు. మండు టెండ, ఒకవైపు దాహం, రెండవదికొండల్లో నడవటం, అతను అలసిపోయాడు. ఒళ్లంతా చెమట పట్టింది. ఎంతోకష్టపడి కొండపై కెళ్ళాడు మర్దానా.'

'వలీ కంఘూరీకి నమస్కరించి కాసిని మంచినీళ్లు యివ్వమని అర్థించాడు. వలీ కంఘూరీ బావి వైపు చూపించాడు. మర్దానా ఆ వైపు వెళ్ళేలోపు వలీ కంఘూరీ ఏమను–కున్నాడో ఏమో మర్దానాని వెనక్కి పిలచి అడిగాడు. 'అన్నట్లు నువ్వుఎక్కడనుంచి వచ్చావ్?'

మర్దానా జవాబిచ్చాడు. 'నేను నానక్ బాబా శిష్యుడను. మేము పర్యటిస్తూ యిలా వచ్చాం. నాకు చాలా దాహం వేసింది. ఇక్కడెక్కడా నీరు దొరకలేదు.'

'బాబా నానక్ పేరు వినగానే వలీ కంఘూరీకి చాలా కోపం వచ్చింది. వెంటనే మర్దానాని తన కుటీరంనుండి గెంటివేశాడు. అలసి సొలసి మర్దానా క్రిందకు దిగి బాబా నానక్‌తో విన్నవించాడు. అతని గోడంతా విని బాబా నానక్ లోలోన నవ్వుకుని అన్నారు. 'మర్దానా, మళ్లీ ఒకసారి వెళ్ళి అడిగిచూడు.'

'ఈసారి చాలా వినయంగా వంగి నమస్కరించి బాబా శిష్యుడనని దీనంగా విన్నవించమని బాబా నానక్ సలహా యిచ్చారు.' ఎంతో దాహం వేసినా మర్దానా. మరెక్కడా నీరు దొరకనందున విసుక్కుంటూ తనలో తానే తిట్టుకుంటూ మరలపైకెక్కాడు. అప్పుడు కూడా వలీ కంఘూరీ నీళ్లు యివ్వనే లేదు. 'కాఫిర్ అయిన అతని శిష్యునికి నేను గుక్కెడు నీరుగూడా యివ్వను' అని వలీ కంఘూరీ మర్దానాని తిరిగి తరిమేశాడు.

ఈసారి క్రిందకు దిగేసరికి మర్దానా స్థితి దయనీయంగా వుంది.(హృదయవిదారకంగా వుంది.) పెదాలు ఎండిపోయాయి. ముఖంనుండి చెమటకారిపోతూంది. అతనాట్టే బ్రతకడేమోననిపించింది. అంతా విని బాబా నానక్ 'ధన్యనిరంకార్' అంటూ మళ్ళీ మర్దానాను వలీవద్దకు పంపాడు. అజ్ఞాబద్ధుడయి మర్దానా మరల బయల్దేరాడు. దారిలోనే ప్రాణం పోతుందని మర్దానాకు తెలుసు. మర్దానా మూడవసారి కొండశిఖరం మీదికెక్కి వలీ కంఘారీ పాదాలపై పడ్డాడు. క్రోధాగ్నితో మండుతున్న వలీ కంఘారీ ఈసారిగూడా అతని ప్రార్థనను పెడచెవిని బెట్టాడు. 'నానక్ తానేదో గొప్ప సాధువునని చెప్పుకుంటాడే, తన శిష్యునికి ఒక్క గుక్క మంచినీళ్లు యివ్వలేకపోయాడా? ఇంకా ఎన్నోవిధాల పరిహసించాడు.'

'ఈసారి క్రిందకు దిగుతూనే దాహంతో విహ్వాలుడై బాబా పాదాలపై మూర్ఛ పోయాడు మర్దానా. గురుబాబా నానక్ మర్దానా వీపును ప్రేమగా నిమిరాడు. ధైర్యం చెప్పాడు. మర్దానా కళ్లు తెరిచాడు. ఎదురుగావున్న ఒక రాతినెత్తమనిచెప్పారు బాబా. మర్దానా రాతినెత్తాడో లేదో క్రిందనుండి ఒక నీటిజలం పైకుబికింది. చూస్తూండగానే నలువైపులా జలమయమైంది. అంతలో అక్కడ వలీకంఘారీకి ఎందుకో నీటితో అవసర–మొచ్చింది. బావిలోకి చూస్తే ఒక్క చుక్కగూడా నీరులేదు. వలీ కంఘారీ చాలా ఆశ్చర్య–పోయాడు. కాని కొండక్రింద నీరువరదకట్టి పోతూంది. చాలా దూరంగా ఒక తుమ్మచెట్టు క్రింద బాబా నానక్ తనశిష్యులతో కూర్చునివుండటం చూశాడు వలీ కంఘారీ. ఆగ్రహంతో వలీ కంఘారీ, ఒక పెద్ద బండను, తన శక్తినంతా కూడగట్టుకుని క్రిందకు దొర్లించాడు. అంత పెద్దబండ తనవైపే రావడంచూసి మర్దానా గట్టిగా అరిచాడు. నెమ్మదిగా 'ధన్యనిరంకార్' అనుకో మర్దనా అని చెప్పి బాబా తన దగ్గరగా వచ్చిన ఆ బండను తన అరచేతితో ఆపారు. హసన్ అబ్దుల్లో, పంజాసాహెబ్ అనేచోట నేటికీ ఆ బండమీద బాబా నానక్ చేతిగుర్తు వుంది.

నాకీ మహత్యం చాలా బాగా నచ్చింది. కాని చేత్తో కొండని ఆపారనే మాట వినగానే ఏదో చప్పగా వున్నట్లనిపించింది. ఇది ఎలా సాధ్యం? ఒక మామూలుమనిషి కొండను ఎలా ఆపగలడు? పైగా కొండమీద యింకా బాబా నానక్ చేతిముద్రలుకూడా వున్నాయట. నాకు ఏమాత్రం నమ్మకం కుదర్లా. 'తర్వాత యెవరయినా అలా చెక్కించి వుండవచ్చు' నేను మా అమ్మతో చాలాసేపు దీన్నిగురించి వాదించాను.

రాతిక్రిందనుండి నీరు వచ్చిందంటే నమ్ముతాను. ఫలానాచోట నీరుంది అని కనిపెట్టే విధానాలు ప్రస్తుతపు సైన్సుద్వారా బహుశా తెలుసుకోవచ్చును. కాని సాధారణ వ్యక్తి తనవైపు దొర్లివస్తూన్న ఒక కొండబండను ఒకచేత్తో ఆపాడనేది మాత్రం నమ్మ–శక్యంగాదు. నేనలా వాదిస్తూవుంటే అమ్మ నా మొఖం కేసి మౌనంగాచూస్తూ వుండిపోయింది.

'ఎవరయినా దొర్లుతూన్న కొండను ఆపగలరా?' ఆ విషయం జ్ఞాపకం వచ్చి–నప్పుడల్లా నాలో నేను నవ్వుకునేవాడిని. చాలాసార్లు ఈ కథ గురుద్వారాలో విన్నాను. కాని కొండను అరచేతితో ఆపాడు అనేది విన్నప్పుడల్లా నేను తల ఆడిస్తూనే వుండేవాడిని.

కొన్నాళ్ళతర్వాత పంజా సాహెబ్ దగ్గర ఏదో పర్వదినం జరుగుతూందన్నారు. ఆ రోజుల్లో అలాటివి చాలా జరిగేవి. అలాటివి జరిగినప్పుడల్లా మా యింట్లో వంట చేసేవారు కాదు. మేమంతా నేలమీదనే పడుకోవలసి వచ్చేది.

కాని అసలా పర్వదినం అంటే ఏమిటో నాకు తెలిసేది గాదు.

మా ఊరు పంజా సాహెబ్‌కు ఎక్కువదూరం లేదు. ఈ పండుగమాట విని మా అమ్మ పంజా సాహెబ్ అనేచోటుకి వెళ్ళింది. ఆమె వెంట నేనూ, మా చిట్టిచెల్లెలుగూడా వున్నాం. దారిపొడుగునా అమ్మకళ్లు చెమ్మగిల్లుతూనే వున్నాయి. అసలు ఈ పండుగ విశేషమేమిటో తెలియక మేము ఆశ్చర్యంగా చూసే వాళ్ళం.

పంజాసాహెబ్ వెళ్లాక మేం ఒక వింతకథ విన్నాం.

అచటికి కొద్దిదూరంలోని ఒక పట్టణంలో నిరాయుధులైన భారతీయులను ఒక తెల్లవాడు కాల్చి చంపాడు. చనిపోయినవారిలో యువకులూ, వృద్ధులుకూడావున్నారు. ప్రాణాలతోనున్నవారిని రైళ్లలో కెక్కించి మరోపట్టణపు జైలుకు పంపుతున్నారు. ఆకలి దప్పులతో దహించిపోయే ఖైదీల భోజనంకోసం దారిలో బండిఎక్కడా ఆపగూడదని ఆర్డర్సు వచ్చాయి. ఈ వార్త విని పంజాసాహెబ్‌లోని వాళ్లందరూ కోపంతో మండిపడ్డారు. తనశిష్యుడికి తానే బాబా నానక్ దాహంతీర్చిన ఆ పంజాసాహెబ్ ప్రక్కగా ఆకలిదప్పులతో మాడుతూ ఖైదీలబండి పోవడమా? ఏమైనాసరే బండిని ఆపివేయాలనే నిర్ణయానికొచ్చారు.

స్టేషన్ మాష్టారును అడిగారు. టెలిఫోన్లు గణగణమన్నాయి. తంతిగూడాయిచ్చారు. బండిని ఆపకూడదని ఇంగ్లీషువారి పటుతరమైన ఆజ్ఞ. బండిలోవున్నవారు స్వాతంత్ర్యం కోసం పాటుబడే భారతీయులు. ఆకలితో మ్రగ్గుతూ కూర్చుండిపోయారా బండిలో. కనీసం మంచినీళ్లుకూడా అందించే ఏర్పాట్లులేవు వాళ్ళకు. బండి పంజాసాహెబ్‌లో ఆగదన్నారు. కాని ఎలాగైనా బండినాపాలని పంజాసాహెబ్ వారు తీవ్రంగా పట్టుపట్టారు. పురవాసులంతా భోజనంపొట్లాలు, పూరీలపొట్లాలు స్టేషన్ వద్ద కుప్పగా పెట్టుకున్నారు. బండి ఏదో పెనుతుఫాన్‌లా దూసుకుపోతుంది. దాన్ని ఆపడం ఎలా?

ఆ తర్వాత మా అమ్మ స్నేహితురాలు మాకుచెప్పింది. 'ఆ పట్టాలమీద మావారు మొదట వెళ్ళి పడుకున్నారు. వారితోపాటు వారి స్నేహితులంతా పడుకున్నారు. ఆ తర్వాత ఆడవాళ్ళం అందరం కూర్చున్నాం. మాతోపాటే మా పిల్లలుకూడా. దూరంగా కూత వేసుకుంటూ, ఆరుస్తూ బండివచ్చేసింది. ఇంకా కొంచం దూరం ఉండగా దాని స్పీడు తగ్గింది. ఏమైనా రైలు ఒకసారే ఆగదుకదా! అలా ఆగుతూ ఆగుతూ ఆగింది. నేను చూస్తూండగానే రైలుచక్రాలు ఆయన గుండెపై కెక్కాయి. అలాగే వారి స్నేహితుల గుండెలపైకిగూడా. తీరా నేను కళ్లు తెరుద్దును కదా సరిగ్గా బండి నా నెత్తిమీదనే వుంది. నాతోపాటు వున్న స్త్రీల హృదయాలలో నుండి 'ధన్యనిరంకార్' 'ధన్యనిరంకార్' అనేనాదం విన్పిస్తూంది, అలా చూస్తూండగానే బండిఆగిపోయింది. దానిక్రింద పడ్డ వారంతా ముక్కలు ముక్కలయ్యారు.'

'రక్తపునది దూరానున్న వంతెనవరకూ ప్రవహించటం నేను కళ్ళారాచూశాను.'

నేను వుక్కిరిబిక్కిరయ్యాను. నా నోటినుండి మాట రావడంలేదు. ఆ రోజంతా గ్రుక్కెడు మంచినీళ్లుకూడా త్రాగలేకపోయాను.

సాయంత్రం తిరిగివచ్చేటప్పుడు అమ్మ పంజాసాహెబ్ కథ విన్పించటం మొదలెట్టింది. మర్దానాతో బాబా ఎలా ఈ దారినవచ్చారు. మర్దానాకు దాహం ఎలా వేసిందీ, వలీ కంధారీ మూడుసార్లు నీళ్ళివ్వకుండా త్రిప్పిపంపడం, బాబా మర్దానాని రాతిని ఎత్తమనటం, నీటిజల పైకి ఉబకటం, వలీ కంధారీ బావిలోని నీరంతా క్రిందకు వచ్చేయటం, వలీ కంధారీకి కోపంవచ్చి అప్పుడు ఒక బండను క్రిందకు త్రోయటం, అది చూసి మర్దానా భయపడిపోవటం, అప్పుడు బాబా నానక్

‘ధన్యనిరంకార్’ అంటూ ఆ బండను అరచేతితో ఆపి మర్దానాను రక్షించడం అంతా ఎలాజరిగిందో వివరించింది. అమ్మ మాకు దారిపొడుగునా.

‘కొండబండను ఎలాగమ్మా ఆపుతారు?’ అని వెంటనే మాచెల్లి ప్రశ్నించింది.

‘ఎందుకు ఆపలేరు?’ నేను మధ్యలోనే అందుకున్నాను. ‘పెనుతుఫానులావచ్చిన రైలుబండినే ఆపగలిగినప్పుడు, ఒక కొండబండను ఆపడం పెద్దలెఖ్ఖా??’

ప్రాణాలను సైతం లెక్కచెయ్యకుండా ఆగని బండిని ఆపి ఆకలిదప్పులతో మ్రగ్గుతూన్న దేశవాసులకు, తోటిసోదరులకు ఆహారం అందించినవారి సాహసకృత్యాన్ని తలచుకుంటూ నాకళ్లు అశ్రువులు రాల్చాయి.

◆

9

నేషనలు బుక్‌ట్రస్టు వారి కథాభారతి సిరీసులో 'తమిళ కథానికలు' (1971) పుస్తకం చేతుల్లోకి తీసుకోగానే అందులో చదువుకి సంబంధించిన ఒక కథ ఉండాలని గుర్తొచ్చింది. ఆ కథ ఏదై ఉండవచ్చు? పుస్తకంలో మొత్తం ఇరవై కథలు. ఆ కథ పేరు గుర్తు లేదు. రచయితల పేర్లు చూసాను: రాజాజి, పుదుమైపిత్తన్, జయకాంతన్, కల్కి, అఖిలన్– కాదు. 'బురదలో వికసించిన కెందమ్మి' అయి ఉండవచ్చునా? రెండు పేజీలు చదివాను. ఇది ఆ కథ కాదని తెలిసిపోయింది. మరే కథై ఉండవచ్చు?

మరోసారి నా జ్ఞాపకాల్ని తడుముకున్నాను. ఆ కథలో ఒక రైలు కూడా ఉంటుందని గుర్తొచ్చింది. మరోసారి విషయసూచిక చూసాను. 'కుమారపురం స్టేషన్'. ఈ కథ అయి ఉండవచ్చునా? దాదాపు పదహారు పేజీల కథ. సగం చదివేటప్పటికే తెలిసిపోయింది. అవును, ఈ కథే. ఇదే కథ. తాడికొండలో, నాగార్జున సాగరులో నా చదువు ముగించుకున్న రోజుల అనుభవాల గాలి ఇంకా వంటిని వీడకుండానే 80 ల మొదట్లో చదివాను కాబట్టే, ఈ కథ, రచయిత పేరు గుర్తులేకపోయినా, కథ పేరు గుర్తులేకపోయినా, ఒక పూర్వజన్మ జ్ఞాపకంలాగా నా అంతశ్చేతనలో భద్రంగా ఒదిగి–పోయి ఉంది.

ఈ 'కుమారపురం స్టేషన్' (1952) నన్నెందుకు వెన్నాడుతూ ఉందో మీకు కథ చదవగానే అర్థమై పోతుంది. మీలో చాలామందికి నాకులాంటి అనుభవాలే ఉంటాయి కాబట్టి ఈ కథ మిమ్మల్ని కూడా వెన్నాడటం మొదలుపెడుతుంది. ఉన్న వూళ్ళో ప్రైమరీ స్కూలు దాటి లేకపోవడం వల్ల దూరంలో ఉన్న హైస్కూలుకో, లేదా కాలేజీకో వెళ్ళి చదవవలసి వచ్చిన అనుభవాలు ఉన్న వారందరికీ ఈ కథ ఒక నమూనా. ఎందుకంటే మనందరమూ ఈ విశాల భారతదేశంలో ఏదో ఒక 'ఇడై సేవల్' నుంచి వచ్చినవాళ్ళమే కాబట్టి. నా వరకూ ఆ రైల్వేస్టేషనూ, ఆ రైలు ప్రయాణమూ, కూడా వచ్చిన ఆ వృద్ధుడూ చాలా ముఖ్యం.

నేను తాడికొండలో చదువుకున్న ఆరేళ్ళూ మా ఊరినుంచి స్కూలుకి వెళ్ళేటప్పుడూ, వచ్చే-టప్పుడూ మేము పయనించిన దారి కూడా ఇడై సేవల్ నుండి కోవెల్‌పట్టి పోయే రైలు దారి లాంటిదే కాబట్టి. యాభైఏళ్ళ కిందట మధ్య తరగతి విద్యార్థుల అనుభవాలు ఇవి. ఇప్పుడు దళితులు, గిరిజనులు, బాలికలూ, మైనారిటీ సమూహాలకు చెందిన పిల్లలూ ఈ దారమ్మటే నడుస్తున్నారు. కొద్దిగా అటూ ఇటూగా ప్రతి ఒక్కరి అనుభవమూ ఇలాంటిదే.

ఈ కథ నేను నా బ్లాగులో పోస్టు చేసినప్పుడు చాలా మంది పాఠకులు స్పందించారు. ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ఈ కథలో తమని తాము పోల్చుకోగల అనుభవాలో, సన్నివేశాలో ప్రతి ఒక్కరికీ ఉంటాయి.

నాకు ఈ కథ చదివినప్పుడు నా అనుభవాలే కాదు, నా చిన్నప్పుడు తాడికొండలో చదువు కున్నప్పుడు, నా తోటి విద్యార్థులు కూడా నాలాంటి చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు, వారిని తీసుకొచ్చి స్కూల్లో దిగబెట్టి వెళ్ళే వాళ్ళ తండ్రులూ, అన్నలూ కూడా నాకు గుర్తొచ్చారు. ఆ రోజు నాలాగా చిన్నపిల్లలుగా ఉన్నవాళ్ళు తర్వాతి రోజుల్లో ఎంత దూరం ప్రయాణించారో, తమ తమ జీవితాల్లో ఎన్ని శిఖరాలు అధిరో-హించేరో తలుచుకుంటే చాలా ఆశ్చర్యంగానూ, గర్వం గానూ కూడా అనిపిస్తుంది.



దళిత, గిరిజన కుటుంబాలనుంచి పిల్లలు ఇలా బడిబాట పట్టిన అనుభవాల్ని చిత్రించే కథలు తెలుగులో కూడా వచ్చాయి. ఒక బాలిక అయిదో తరగతి దాటి ఆరో తరగతిలో చేరడం లేదా ఏడో తరగతి పూర్తిచేసుకుని పక్క ఊళ్ళో హైస్కూల్లో చేరడమూ, పదో తరగతి పూర్తి చేసుకుని ఇంటర్మీడియేటులో చేరటమూ ఏవో మామూలు సంఘటనలు కావు. ప్రతి ఒక్క ప్రయాణమూ ఆమెకీ, ఆమె కుటుంబానికీ మాత్రమే కాదు, మొత్తం సమాజానికే ఒక విజయయాత్ర. కాని అటువంటి అనుభవాల్ని మనం నలుగురూ వినేలా పైకెత్తి చెప్పుకోవటం లేదనిపించింది.

ఇల్లు వదిలి, ఊరు వదిలి చదువుకోసం చేపట్టే ప్రతి కొత్త ప్రయాణంలోనూ నువ్వు కొత్తగా మారడమే కాదు, నీ చుట్టూ ఉన్న వాతా-వరణాన్ని కూడా కొత్తగా మార్చేస్తావు.

అందుకనే, ‘ఆ కుమారపురం స్టేషను దానికదే ఒక పాఠశాల’ అని అనుకున్నాడు కథలో సుబ్బరామ అయ్యర్.

ఈసారి ఈ కథ చదివినప్పుడు పిల్లలు ప్రవేశ పరీక్షలో ‘అన్ని సబ్జెక్టులూ బాగానే రాసాము, ఒక్క లెక్కలు తప్ప’ అన్నప్పుడు అది కూడా నా అనుభవమే అని గుర్తొచ్చింది.

72 నాటి మాట. తాడికొండ స్కూలు ప్రవేశపరీక్ష రాయడానికి మా అన్నయ్య నన్ను రాజవొమ్మంగి తీసుకువెళ్ళాడు. ఆ ప్రాంతం మొత్తానికి నేనొక్కణ్ణే పరీక్షకు హాజరయ్యాను కాబట్టి స్కూళ్ళ ఇన్స్పెక్టరు గారి ఇంట్లోనే పరీక్షకు కూచోబెట్టారు (అప్పట్లో ఆయనకు ఇల్లూ, ఆఫీసూ అదేననుకుంటాను). మా అన్నయ్య ప్రశ్నపత్రం చూసాడు. లెక్కలకి సంబంధించిన ప్రశ్నలు కష్టంగా ఉన్నట్టున్నాయే అని అన్నాడు. అవునన్నాను. తీరా చేస్తే అది అయిదోక్లాసుకి ఎంట్రన్సు పేపరు! కొంత సేపటికి వాడు కూడా బయటకి వెళ్ళిపోయాడు. సరే, మొత్తానికి పేపరు రాసి ఆ ఆన్సరు షీటు ఇచ్చేసి బయటకి వచ్చేటప్పటికి మా అన్నయ్య పరుగు పరుగున లోపలకి వస్తున్నాడు. ‘అప్పుడే అయిపోయిందా! పేపరు ఇచ్చేసావా! ఎంతపని చేసావు! నేను ఈ లెక్కలకి జవాబుల కోసం మా మౌలాలిగాడిదగ్గరికి వెళ్ళి వస్తున్నాను. అయ్యో! ఇప్పుడెలాగ?’ అన్నాడు. నాకు సీటు రాదనుకుని ఇంటిబాట పట్టాం. కాని ఆ పరీక్షలో నేను పాసయి తాడికొండలో చేరడం– అదో వింత నాకూ, మా అన్నయ్యకీ!

ఈ కథా రచయిత కు.అళగిరి స్వామి (1923-1970) కథారచయిత, పాత్రికేయుడు. మాక్సిం గోర్కీని విస్తృతంగా తమిళంలోకి అనువదించిన వాడు. ఇంతకీ ఆయన స్వగ్రామం కూడా ఇడైసేవల్‌నే!

కు. అళగిరి స్వామి

కుమారపురం స్టేషన్

చల్లా రాధాకృష్ణ శర్మ

కుమారపురం ఒక అడవి స్టేషను. దానికి అరమైలు పరిధిలో ఊరూ పల్లె ఏమీ లేదు. అయినా స్టేషను కట్టిన తర్వాత, పేరు పెట్టకపోతే ఎలా? ఏదో ఒక పేరు పెట్టాలి గదా! ఆ దృష్టితో దానికి కుమారపురం అనే పేరు పెట్టారు. కాని స్టేషనుకి తూర్పుగా ఒక మైలు కవతల వున్న కుమారపురం అనే గ్రామం సుమారు డెబ్బయి ఐదేళ్లుగా స్టేషన్ని బహిష్కరిస్తూ వచ్చింది. ధాత కరువు ఏర్పడ్డప్పుడు, పనిపాటులు కల్పించే వుద్దేశంతో తిరుచ్చిరాపల్లినుంచి తిరునెల్వేలి దాకా రైలు మార్గం వేసినట్లు చెపుతారు. ఆ మార్గంలో కోవిల్ పట్టికి దక్షిణంగా ఏడవ మైలులో ఉంది ఈ స్టేషను. ఆ చుట్టుపక్కల వుండే గ్రామస్థులు తమ జీవితకాలంలో ఒకసారో రెండుసార్లో గుడికని తీర్థానికని యాత్ర చేస్తారు. పదిమైళ్ల దూరంలో ఒక మారియమ్మ గుడో, పన్నెండు మైళ్ల దూరంలోనో ఒక కాలియమ్మన్ గుడో వుంటుంది. అక్కడికి వెళ్లి పొంగళ్లు పెట్టడం వారి కలవాటు. ఈ యాత్రలకు రైళ్లూ అక్కరలేదు. బస్సులూ అక్కరలేదు. కొన్ని సందర్భాలలో వాళ్లు వెళ్లవలసిన గ్రామం స్టేషనుకంటే దగ్గరలోనే వుంటుంది. అటువంటప్పుడు నడిచి వెళ్లకుండా, స్టేషనుకి వచ్చి రైలెక్కుతారా యెవరైనా?

ఈ స్టేషను చరిత్రలో మొట్టమొదటి సారిగా ఇక్కడ దిగిన ప్రముఖుడు సుబ్బరామ అయ్యర్ అని చెప్పవలసి వుంటుంది. కోవిల్ పట్టినుంచి మూడు రోజులకు క్రితమే

ఆయన అక్కడికి వచ్చాడు. కొత్తగా బదిలీ అయి వచ్చిన ఆ స్టేషనుమాస్టరుకి ఆయన బాల్యమిత్రుడు. కొంత కాలం పాఠశాలలో సహాధ్యాయుడు కూడా. దూరపు బంధువనీ చెప్పవచ్చు. తన మిత్రుణ్ణి యీ స్టేషనుకి ఆహ్వానించే సదవకాశం స్టేషనుమాస్టరుకి కలిగింది. ఆయన పిల్లవాడికి ఆరో యేడు నిండింది. దాన్ని పురస్కరించుకుని, మిత్రుణ్ణి ఆహ్వానించాడు. సుబ్బరామ అయ్యరు కూడా ప్రశాంత వాతావరణంలో మిత్రుడితో హాయిగా కాలక్షేపం చెయ్యవచ్చునని బయలుదేరి వచ్చాడు.

పుట్టినరోజు పండుగకు వచ్చిన ఒకే ఒక అతిథి సుబ్బరామ అయ్యరే. బాల్య మిత్రులిద్దరూ తమ తమ జీవితచరిత్రల్నీ ఒక వూరి నుంచి మరో వూరికి బదిలీ అయినప్పటి విషయాల్ని కుటుంబ వ్యవహారాలూ మొదలైన వాటిని గురించి సవిస్తరంగా మాట్లాడుకున్నారు ఆ రాత్రంతా. కోవిల్‌పట్టిలో సౌకర్యాలు ఎలా వున్నాయని స్టేషన్ మాష్టరు అడిగాడు. కుమారపురం స్టేషన్లో జీవితం ఎలా గడపగలుగుతున్నావని సుబ్బరామ అయ్యరు అడిగాడు. ఇలా ఒక రోజు గడిచింది.

మరునాడు స్టేషన్‌మాష్టరు మాటి మాటికి యింటికి వచ్చి తన విధ్యుక్తధర్మ నిర్వహణకు సెలవు తీసుకుని వెడుతూ వుండేవాడు. మధ్యాహ్నంవేళ, స్టేషన్‌మాస్టరు లేని సమయంలో ఆయన పిల్లవాడితో తమాషాగా మాట్లాడుతూ కాలక్షేపం చేసేవాడు సుబ్బరామ అయ్యరు. పిల్లలతో ఆటలాడడమో, పిల్లల సమూహంలో సంతోషంగా వుండడమో ఆయనకి అలవాటు లేదు. బహుశః ఆయన వృత్తి అందుకు అడ్డు తగిలేదేమో! కాని ఆ పిల్లవాడు తప్ప మాట్లాడేందుకు అక్కడ మరెవ్వరూ లేరు. మధ్యాహ్నం ఎలాగో అతనితో కాలక్షేపం చేసేవాడు. భోజనానంతరం సుమారు రెండు గంటలు నిద్రపోయేవాడు. మూడూ మూడున్నరకల్లా లేచి, తన వెంట తెచ్చుకున్న పుస్తకం తీసుకుని స్టేషనుకి వెళ్లేవాడు.

ప్లాట్ ఫారం మీద అయిదారు వేపచెట్లు ఉన్నాయి. అది వేసవి కావడం వల్ల, చెట్లు బాగా పూశాయి. వేప పూలు ఎన్నో నేలమీద పడివుండేవి. ఆ చెట్ల మీదుగా వీచే చల్లని గాలి సువాసనలు వెదజల్లుతూ స్టేషను వైపు వచ్చేది. అందువల్ల స్టేషన్ వరండాలో గాలి వీచే వైపున ఒక బెంచీ మీద కూర్చుని, పుస్తకం తెరిచి చదువుకోవడం మొదలు పెట్టాడు.

కొంచెం సేపయిన తర్వాత దక్షిణాది నుంచి వచ్చిన ఒక ఎక్స్‌ప్రెస్ బండి మామూలు ప్రకారం ఆగకుండా వెళ్ళిపోయింది. ఇక సాయంకాలం ఆరు దాటిన

తర్వాతే, అక్కడికి రైళ్లు వస్తాయి. కనక స్టేషన్‌మాస్టరు మిత్రుడి వద్దకు వచ్చి, ఆయన పక్కనే కూర్చున్నాడు. పుస్తకం మూసివేసి, కింద పెట్టి, సుబ్బరామ అయ్యరు 'ఈ స్టేషనుకి ప్రయాణీకులు వస్తూ పోతూ వుంటారు గదా!' అని నవ్వుతూ అడిగాడు.

'రాకేం ! నిన్న కూడా ఒక ప్రయాణీకుడు యీ స్టేషన్లో దిగాడు గదా!' అన్నాడు స్టేషన్ మాస్టరు.

సుబ్బరామ అయ్యరు బిగ్గరగా నవ్వాడు. నిన్న దిగిన ప్రయాణీకుడు ఆయనే.

'ఇలా కనక యింకా పది స్టేషన్లుంటే చాలు, రైల్వే బడ్జెట్టులో లోటు లేకుండా ఎలా వుంటుంది?. ..' అంటూ అవహేళనపూర్వకంగా నవ్వడం, మాట్లాడడం ఏకకాలంలో ఆపివేశాడు సుబ్బరామ అయ్యరు.

'అలా అనడానికి వీల్లేదు. రేపు సోమవారం. కోవిల్‌పట్టిలో సంత జరుగుతుంది. పది టికెట్లకైనా మనుషులు వస్తారు.'

'అలా అయితే స్టేషనుకి రెండు రూపాయల రాబడి వస్తుందని చెప్పండి.'

ఇద్దరూ నవ్వారు. అప్పుడు పోర్టరు కరుప్పయ్య అక్కడికి వచ్చాడు. వాళ్ల మాటలు వింటూ అతను ఒక మూల నిలబడ్డాడు.

'ఎందుకని యీ స్టేషను కట్టారు? ఇది లేకపోతే, ఎవరు అఘోరించారని?'

'ఈ స్టేషను యీ చుట్టుపక్కల గ్రామస్థులకి మరోవిధంగా సహాయపడుతోంది. ఇలాగైనా యిందువల్ల లాభం వుందనే విషయం యిక్కడికిబదిలీ అయిన తర్వాతే తెలుసుకోగలిగాను.'

సుబ్బరామ అయ్యరు ఏమీ మాట్లాడకుండా, మిత్రుడు చెపుతున్న మాటలు వింటూ కూర్చున్నాడు. స్టేషన్‌మాస్టరు చెప్పడం మొదలు పెట్టాడు.

'ఇది వేసవికాలం కావడంవల్ల చుట్టుపక్కల వుండే గ్రామాలు మాగాణి భూము–లవడంచేత పచ్చపచ్చగా లేవు. కాని ఎప్పుడూ యిలా వుండవు. నవధాన్యాలు పండే సారవంక భూమి. పొలం పనులు చేసేవారు తాగే నీటి కోసం కుండలతో యిక్కడికి వస్తారు. ఇరవై కుండల నీళ్లయినా కావలసి వస్తుంది రోజూ. కనక యీ విధంగానైనా యీ స్టేషనువల్ల లాభం వుంది.'

'అలా అయితే చలివేంద్రం కట్టవలసిన చోట స్టేషన్ కట్టారన్న మాట!'

స్టేషను మాస్టరు పరిహాసధోరణిని కట్టిపెట్టి, మనఃపూర్వకంగా మాట్లాడసాగాడు.

'ఇలాగే ఒకటి వుండవలసిన చోట మరొకటి కడతాడు మానవుడు. ఒక పనికని వుద్దేశించబడింది మరొకందుకు వుపయోగపడుతోంది. అప్పుడు సవ్యంగా జరిగిన ఖర్చు కూడా అనవసరమైన ఖర్చుగా మారిపోతుంది. ప్రపంచమే అలా వున్నప్పుడు ఈ కుమారపురం స్టేషన్ని విమర్శించడమెందుకు?'

హేళనగా నవ్వుతూ సుబ్బరామ అయ్యరు 'ప్రపంచాన్ని మీ స్టేషను కిటికీ గుండా చూస్తున్నట్టున్నారు? ఆరు నెలల్లో యీ రాతి కట్టడం మీద మీ కింత మమకారం ఎలా కలిగిందో నాకు ఆశ్చర్యంగా వుంది' అన్నాడు.

స్టేషన్‌మాస్టరు కొంచెం ఉద్రేకం తెచ్చుకుని మాట్లాడసాగాడు.

'కోవిల్‌పట్టిలో పాఠశాల కట్టారు? ఎందుకోసం కట్టారో చెప్పండి చూద్దాం.'

'ఎందుకు కడతారు బడి! వందమంది విద్యార్థులు చదువుకునేందుకే కడతారు బడి. ..'

'అలాగే అనుకుందాం. వందమంది విద్యార్థులూ ఎందుకోసం చదువుతారు?' అడిగాడు స్టేషన్‌మాస్టరు.

'ఏమిటి! ఇలా అడుగుతున్నారు?'

'కారణం వుండబట్టే అడుగుతున్నాను. బదులు చెప్పండి.'

'. ..'

'జ్ఞానం వృద్ధి చేసుకునేందుకు పిల్లలు చదువుతారనేగా మీరు చెప్పే సమాధానం!'

'మీరు మరో కారణమేదైనా చెపుతారా?'

'పిచ్చివాడు కూడా కేవలం జ్ఞానం కోసమని పిల్లల్ని బడికి పంపడు. మీరూ నేనూ జ్ఞానం కోసం బడికి వెళ్లామా? చదువుకోనివాడికి కూడా ఉద్యోగం యిస్తామని

చెప్పండి. వానాకాలమని కూడా చూడకుండా ఎవరైనా బడికి వెడతారేమో చూద్దాం' అని సవాలు చేశాడు స్టేషన్ మాస్టరు.

సుబ్బరామ అయ్యరు నవ్వాడు. అప్పుడు పోర్టరు కూడా నవ్వాడు. పోర్టరు ఎదట యిలా మాట్లాడడం మర్యాద కాదనుకునో యేమో, అయ్యరు ఆ తర్వాత మరేమీ మాట్లాడకుండా పుస్తకం చేత పుచ్చుకున్నాడు.

'ఏమిటి! మౌనం వహించారు!' అని స్టేషన్‌మాస్టరు ఆయన్ని ఎగదోశాడు.

'మీతో మాట్లాడి జయించడమే? సూర్యచంద్రులున్నంత దాకా కుమారపురం స్టేషను శాశ్వతంగా వుండనివ్వండి. ఇందువల్ల నాకేమీ నష్టం లేదు' అని అయ్యరు ఏదో ఒక పుట కోసం గాలిస్తున్నట్టుగా పుస్తకం తిరగేశాడు.

స్టేషన్ మాస్టరు పోర్టర్ని పిలిచి 'ఇంటికి వెళ్లి కాఫీ చెయ్యమని చెప్పు' అని అతన్ని పంపించాడు.

'మనమూ వెడదాం' అన్నాడు అయ్యరు.

ఆ తర్వాత కొంచెంసేపటికి యిద్దరూ బయలుదేరారు, స్టేషన్ నుంచి ఇంటికి.

మూడోరోజు పొద్దున, ఎనిమిదింటికల్లా ఉత్తరాది వెళ్లే ప్యాసెంజరు ఒకటి రావాలి. ఆ రోజు సోమవారం. కోవిల్‌పట్టి సంతకు వెళ్లే ప్రయాణీకులు నలుగురైదుగురు ఏడింటికి ముందే గోనిసంచులతో సహా స్టేషనుకి వచ్చారు. తమలపాకులు వేసుకుంటూ వాళు మాటల్లో మునిగిపోయారు. ఏడుంబావుకి సుబ్బరామ అయ్యరు ఫలహారం పూర్తి చేసుకుని, ప్లాట్‌ఫారం మీద వేపచెట్ల కింద వున్న ఒక బెంచీ మీద కూర్చుని, పుస్తకం చదవడం మొదలు పెట్టాడు, నిన్న ఆపిన చోటునుంచి. పల్లెటూరి వాళ్లు సాధారణంగా బిగ్గరగా మాట్లాడతారు. అందువల్ల, ఆయన దీక్షగా చదవలేక పోయాడు. కమ్మని వేపచెట్ల గాలి కూడా ఆయన్ని దీక్షగా చదవనివ్వడం లేదు.

ఈ యెడారిలో కూడా యిటువంటి కమ్మని వాసన, ఇటువంటి చక్కని గాలి. చూడడానికి ఇదంతా నల్లమట్టి. అయినా యిక్కడ చెట్లు ఏపుగా పెరిగి, కమ్మని వాసనతో చక్కని గాలి వీస్తోంది. ఈ సువాసన కూడా ఈ మట్టిలోనే పుట్టింది కాబోలు!

ఆయన చూపులు దూరాన వున్న గ్రామాల మీదికి వెళ్లాయి. 'ఈ గ్రామాల్లో నివసించే నూర్లకొద్ది స్త్రీలూ పురుషులూ ఈ మట్టినే నమ్మి జీవిస్తున్నారు. ఈ నల్లమట్టి లోంచే యింత కమ్మని వాసనా వస్తోంది. .. ప్రాణమూ లభిస్తోంది. ..' అనుకున్నాడు.

ఆయన ఆలోచనలన్నీ చదువుకున్న పుస్తకంలోని సూక్తులవలె మధురంగా ఉన్నాయి. ఆయన మనస్సులో ఆలోచనలెన్నో మెదులుతున్నాయి. అప్పుడు పడమరగా సుమారు అరమైలు దూరాన నలుగురైదుగురు త్వరత్వరగా స్టేషను వైపుగా నడిచి రావడం చూశాడు.

'బండి కింకా టైముంది. ఇలా చెమటలు పట్టేలా ఎందుకు వస్తున్నారు వీళ్లు!' అని అయ్యరు అనుకున్నాడు. కొందరేమో ఒక గంట ముందుగానే స్టేషను చేరుకున్నారు. ఆయనకిది వెర్రితనమనిపించింది.

'కల్లాకపటం తెలియని మనుషులు' అనుకున్నాడు అయ్యరు తనలో తాను.

వేపచెట్ల గాలి ఎంతో హాయిగా వుంది. ఆ కమ్మని గాలి కోసమే వేసవి అంతా యిక్కడే గడపాలన్న వుద్దేశం కలిగింది అయ్యరుకి. అంతే. చుట్టూ వున్న మట్టి మీదా పచ్చిక మీదా, పచ్చిక మధ్య వికసించిన అడవి పూల మీదా ఆయనకు అభిమానం పుట్టుకు వచ్చింది. ఇంకా కొద్ది సేపట్లో రైలెక్క బోతున్నందువల్ల ఆ అభిమానం మరింత బలపడింది. 'ఏ ప్రాంతాలలో నివసించినా, మనుషులు మనుషులుగానే నివసిస్తున్నారు' అనుకున్నాడు.

ఇంతలో ఇద్దరు ముగ్గురు వ్యక్తులు ప్లాట్‌ఫారం మీదికి వచ్చి, రెక్కను ఒక్కసారి ఎగాదిగా చూసి అక్కడే నిలబడ్డారు. ఎప్పుడో ఒక ఆవుని కొన్న విషయాన్ని ఒక అసామి కథలా చెప్పుకుపోతుంటే మిగిలిన వాళ్లు ఊఁ కొడుతూ వింటున్నారు.

సుబ్బరామ అయ్యరు వాళ్ల మాటల్ని శ్రద్ధగా విన్నాడు. ఆ మాటల్లో నిజమే కాదు, అర్థమూ స్వారస్యమూ ఉన్నట్లు ఆయనకి తోచింది. వాళ్ల నడిగి, వాళ్ల జీవిత చరిత్రల్ని కూడా తెలుసుకోవాలనే ఆశ కూడా కలిగింది.

అరమైలు దూరాన తెల్లని గుడ్డ ముక్కలవలె కనిపించి, పరిగెత్తుకు వచ్చిన వాళ్లల్లో ఒకాయన వృద్ధుడూ, నలుగురు బాలురూను. ప్లాట్‌ఫారం చేరుకోగానే 'టికెట్లు యిచ్చారా?' అని అడిగాడు పరిగెత్తుకు వచ్చిన వృద్ధుడు.

మాట్లాడుతున్న వాళ్లల్లో ఒకతను 'ఇవ్వలేదు' అని బదులు చెప్పాడు. అంతా అమ్మయ్యా అనుకున్నారు. ఆ నలుగురు పిల్లల చూపులూ ఒక్కసారిగా వేపచెట్ల నీడను బెంచి మీద కూర్చున్న సుబ్బరామ అయ్యరు మీద పడ్డాయి. చూచీ చూడడంతోనే వాళ్లకు ఆయన మీద ఆదర భావం కలిగింది. అటువంటి వ్యక్తిని వాళ్లు సంవత్సరాని కొకసారయినా చూడడం అపూర్వమే. వాళ్ల బడికి ఎప్పుడైనా విజయం చేసే పెద్ద యినస్పెక్టరులా కాళ్లకు బూట్లు, క్లోను కోటు, జరీయంచు ఉత్తరీయం మొదలైన వాటిలో కనిపించాడు ఆయన. బట్టతల కూడా ఆయన మీది గౌరవాన్ని యినుమడింపజేసింది. తనవైపు కన్నార్పకుండా చూస్తున్న పిల్లల్ని గమనించాడు అయ్యరు. నలుగురు పిల్లలూ ఇంచు మించు సమవయస్కులు. పన్నెండు నుంచీ పదిహేను దాకా వుండవచ్చు వాళ్ల వయస్సు. ఒక్కొక్కని చేతిలోనూ ఒకటి రెండు పుస్తకాలూ కొన్ని తెల్ల కాగితాలూ ఉన్నాయి. చొక్కా జేబుల్లో చెక్కి సిద్ధంగా వున్న పెన్సిళ్లు. వాళ్లను చూస్తే విద్యార్థులని స్పష్టమవుతుంది.

పిల్లలూ అయ్యరూ ఒకరి నొకరు చూసుకుంటూనే వున్నా, పలకరించేందుకు మాత్రం ఎవ్వరూ ప్రయత్నించలేదు. ఇంతలో రెక్క వంగింది. స్టేషనుమాస్టరు టికెట్టుతో అయ్యరు వద్దకు వచ్చాడు.

'ఈ చోటు మీకు బాగా నచ్చినట్టుంది. ఇక్కడే కూర్చున్నారు.'

'మంచి గాలి' అన్నాడు అయ్యరు. టికెట్టు తీసుకున్నాడు.

'అలా అయితే యీసారి సెలవలికి యిక్కడికే రండి. ఇలా మూడు రోజుల్లోనే బయలుదేరి వెళ్ళిపోకుండా, ఒక్క పది రోజులైనా వుండేట్టు రండి. ..'

'అలాగే కానీండి. .. పది రోజులే గదా! రాముడు పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చేసినప్పుడు, మనం యిక్కడ ఒక్క పదిరోజులపాటు వుండలేమా?'

'ఆ వనవాసకాలంలోనే రాముడు ఆత్మసఖుల్ని సంపాదించుకోగలిగాడు. రాముణ్ణి రాముడిగా చేసింది ఆ వనవాసమే గదా!" అన్నాడు స్టేషన్‌మాస్టరు.

'బడి విడిచి పెట్టిన తర్వాత పురాణాలన్నిటినీ మీరు బాగా పరిశీలించినట్టున్నారు' అని సుబ్బరామ అయ్యరు నవ్వుతూ అన్నాడు. అయినా మిత్రుని మాటలలో ఏదో ఒక హాయీ, సత్యమూ అంతర్లీనమై వున్నట్లు ఆయనకు స్ఫురించింది.

ఆ తర్వాత సావకాశంగా మాట్లాడే వీలు లేకపోయింది. బండి వచ్చే వేళయింది. అందువల్ల స్టేషనులోకి వెళ్ళిపోయాడు స్టేషనుమాస్టరు. ఆ చిన్న పిల్లల్ని అక్కడే వుండమని చెప్పి, వృద్ధుడు వెళ్ళి టికెట్లు తెచ్చాడు. ప్రయాణీకులంతా ప్లాట్‌ఫారం మీద సిద్ధంగా వున్నారు.

సకాలంలో బండి వచ్చింది. అయ్యరు ఎక్కిన పెట్టెలోనే ఆ వృద్ధుడూ పిల్లలూ ఒకరి వెనక మరొకరు ఎక్కారు. పెట్టెలో చోటుంది. ఒక కిటికీ వద్ద కూర్చున్నాడు అయ్యరు. ఆయనకు ఎదురు వరుసలో చాలా చోటుండడం వల్ల, అక్కడ కూర్చున్నాడు పిల్లలు. వృద్ధుడు అయ్యరు కుడిచేతి వైపు పక్కగా కూర్చున్నాడు. వృద్ధుడికి కుడివైపు భూతం వంటి ఒక వ్యక్తి బోలెడు సామాన్లతో కూర్చున్నాడు. అతనికభిముఖంగా అతనిలో బోలెడు మూడువంతులైనా లావుగల ఒకామె కూర్చుంది. ఆమె పక్కన కూడా ఏమిటో వున్నాయి మూటాముడులూనూ, బిందెలూ. ..

కుమారపురం స్టేషన్ నుంచి రైలు కదిలింది.

పిల్లలు రెండు వైపులా కిటికీల గుండా చెట్టుచేమలు పరుగెత్తుకు పోవడం చూస్తూ మురిసిపోయారు. వాళ్ల ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ చూసిన సుబ్బరామ అయ్యరు వాళ్లు రైలుప్రయాణం చేయడం యిదే మొదటిసారి కాబోలు అనుకున్నాడు. వాళ్లతో మాట్లాడాలని ఆశ, కాని అటువంటి వ్యక్తులు సులభంగా మాట్లాడతారా మరి!

ఆయనకది కొంచెం కష్టంగానే తోచింది.

కొన్ని నిమిషాలు గడిచాయి. పిల్లలతో మాట్లాడడం మొదలు పెట్టాడు, పడమటి వైపుగా కిటికీ పక్క కూర్చున్న భూతాకారం మనిషి. ఎత్తుగడలోనే ఎంతో మంచితనం ప్రదర్శించాడు ఆయన.

'ఎక్కడికిరా ప్రయాణం?' అని అడిగాడు. ఆయన గొంతు ఆయన కంటె బరువుగా వుంది. ఏం బదులు చెప్పాలో పిల్లలకి తెలియలేదు. వాళ్ల తరఫున వృద్ధుడు సమాధానం చెప్పాడు.

'కోవిల్‌పట్టికి వెడుతున్నారు. పెద్ద బడిలో చేరాలి'. పిల్లలు భూతాకార వ్యక్తిని ఎగాదిగా చూశారు. ఆయన వజ్రాల దుద్దులు, వజ్రపుటుంగరం, బంగారు గుండీలు, వెడల్పయిన చేతి గడియారం– వీటిని చూడసాగారు మాటిమాటికి.

'ఏ క్లాసులో చేరతారు?'

'మా వూళ్ళో ఆరోక్లాసు ప్యాసయ్యారు. అక్కడ ఏడో క్లాసులో చేరాలి.'

'ఏ వూరు పిల్లలు?'

'ఇడైసేవల్ . ..'

'ఇడైసేవలా! అక్కడ ఏడో క్లాసు లేదూ?'

'లేదు, సర్కారువారి శాంక్షనుకి దరఖాస్తు పెట్టారు.'

'ప్యాసయినట్టు సర్టిఫికెట్టు వుందా?'

'ఉంది.'

'ఉన్నా సరే, పరీక్ష పెట్టే చేర్చుకుంటారు.'

'అందుకనే ఒక పంతులుగారిచేత యింట్లో ఒక నెల రోజులు ట్యూషన్ చెప్పించాడు' అన్నాడు వృద్ధుడు.

భూతాకారం మనిషి ఒక పిల్లవాణ్ణి చూచి 'ఒరేయ్! నేను మూడు ప్రశ్నలు వేస్తాను. నువ్వు వాటికి బదులు చెప్పాలి. నిన్ను ఏడో క్లాసులో చేర్చుకుంటారు' అన్నాడు. వెంటనే 'వాటిజ్ యువర్ నేమ్?' అని అడిగాడు.

'మై నేమీజ్ శ్రీనివాసన్' అన్నాడు ఒక పిల్లవాడు.

'వాటీజ్ యువర్ ఫాదర్స్ నేమ్?' ఇది ఆయన అడిగిన రెండో ప్రశ్న.

'మై ఫాదర్స్ నేమీజ్ రామస్వామి నాయుడు.'

'వాట్ క్లాస్ యు పాస్?' ఇది మూడవ ప్రశ్న.

ఆయన వచ్చీ రాని ఇంగ్లీషుని చూసి సుబ్బరామ అయ్యరు లోలోపల నవ్వు-కున్నాడు.

'సిక్స్త్ క్లాస్' అని వినయంగా సమాధానం చెప్పాడు శ్రీనివాసన్.

'ఇంక చాలా, అబ్బాయ్! చూస్తే తెలివిగలవాడివిలా వున్నావ్. .. ఇలా చకచకా బదులు చెప్పాలి. నువ్వు తప్పకుండా ఏడో తరగతే. ..'

కుర్రవాడికి అంతులేని సంతోషం.

వృద్ధుడు ఆయన్ని చూసి 'మిగిలిన కుర్రాళ్లను కూడా అడగండి ఏవన్నా' అన్నాడు.

'మన ఇంగ్లీషు యింతవరకే. ఇంతకు మించి మా మేష్టారు చెప్పలేదు' అని బొజ్జ కదిలేటట్లు నవ్వాడు.

ఆయన కెదురుగా కూర్చున్న ఆయన భార్యా, సుబ్బరామ అయ్యరూ మందహాసం చేశారు.

'మందేవూరు?' ఆయన్ని అడిగాడు వృద్ధుడు.

'తిరునెల్వేలి జంక్షన్‌లో పంకజవిలాస్ కాఫీ క్లబ్బు వుంది చూశారూ అదే మన దుకాణం. చూసేవుంటారు.'

'తిరునెల్వేలికి చిన్నప్పుడు ఎప్పుడో వెళ్లాను.'

'ఆ క్లబ్బు మందే. ఇటువంటి కుర్రాళ్లు వెయ్యిమంది మన హొటల్లో తింటూ చదువుకుంటున్నారు. జంక్షన్లో మన హొటలు విడిచి పెట్టి కాలేజీ కుర్రాళ్లు మరెక్కడికి వెళ్లరు. ఇరవైయైదేళ్లుగా నడుపుతున్నాను హొటలు.'

'ఎవరైనా మంచి హొటల్ని విడిచి పెడతారా?'

ఆయన కుర్రవాళ్ళ వైపు తిరిగి 'ఒరేయ్ మీరూ కాలేజీకి వచ్చారంటే, భోజనానికి మన హొటలుకే వస్తారు. ..' అన్నాడు.

కుర్రవాళ్ళ సంతోషానికి మేరలేదు. పట్టణం ఆసామి ఇంత ఆదరంగా మాట్లాడడం, వాళ్ళకెంతో సంతోషం కలిగించింది.

'ఎంతమంది పిల్లలు మీకు?' అని వృద్ధుడు అడిగాడు.

'మన హొటల్లో భోజనం చేసేవాళ్ళూ, చెయ్యబొయ్యేవాళ్లూ అంతా మన పిల్లలే!' అన్నాడు.

వృద్ధుడికా సమాధానం సరిగా బోధపడలేదు. అది గ్రహించాడు ఆ హొటలు యజమాని. అయినా ఆ విషయాన్ని వివరించేందుకు ప్రయత్నించకుండా 'డబ్బు తీసుకుని సొంత పిల్లలకి భోజనం పెడుతున్నాడా? అని మీరనుకోవచ్చు. కాని ఏం చేయడం? హొటలు యజమాని ధర్మం యిది. అయినా నాకు వీలయినంతవరకు ధర్మకార్యాలు చేస్తూనే వున్నాను. చాలామందికి స్కూలు జీతం కట్టడానికి డబ్బు సహాయం చేశాను. వాళ్ళ వద్దనుంచి మళ్ళీ తీసుకోవడమూ వుంది, తీసుకోకపోవడమూ జరుగు తుంది' అన్నాడు తృప్తిగా. మరుక్షణం భార్యను చూసి ఫలహారాలు సిద్ధం చేయమన్నాడు– ఆయన కోసమే.

'చాలా దూరమా ప్రయాణం?' వృద్ధుడు అడిగాడు.

'మధుర దాకా వెడుతున్నాం. అక్కడొక పెళ్లి.'

మళ్లీ వృద్ధుడు 'ఎంత మంది పిల్లలు మీకు?' అని అదే ప్రశ్న వేశాడు.

'చెప్పాను గదా! అందరు పిల్లలూ నా పిల్లలే అని. కంటేనే పిల్లలవుతారా? ఈ నలుగురూ నా పిల్లలే. ఏమంటారు?'

అప్పుడు వృద్ధుడికి అర్థమయింది. ఆ విషయాన్నే మళ్లీ ప్రస్తావిస్తూ 'పిల్లలు లేరు కాబోలు. దానికేం లెండి. మీరన్నట్టు లోకంలో వున్న పిల్లలంతా మన పిల్లలే. ఇప్పుడు చూడండి. వీళ్లలో ఒక్కడే నా మనమడు. మిగిలిన ముగ్గురూ వాడితోపాటు చదువుకునే వాళ్లు. వీళ్లందర్ని సొంత పిల్లల మాదిరి కోవిల్‌పట్టికి తీసుకు వెడుతున్నాను. చివర కూర్చున్నాడే, ఆ అబ్బాయి వాళ్లు కొంచెం పేదవాళ్లు. వాణ్ణి ఎలా చదివించడమా అని వాళ్ల నాన్న నన్ను సలహా అడిగాడు. పిల్లలతో పాటు మీ వాడూ చదువుకుంటాడు, యిప్పుడు వాడికయ్యే ఖర్చు నేను భరిస్తానని ధైర్యం చెప్పాను. తరువాతి విషయం తరవాత చూసుకోవచ్చునన్నాను. వాడికా చదువుకోవాలని ఎంతో ఆశ. తనను చదివిం–చమని వాడు మూడు రోజులు తిండీతిప్పలూ లేకుండా యేడుస్తూ కూర్చున్నాడు..' అని చెప్పుకు పోతున్నాడు.

హొటలు యజమాని భార్య ఫలహారాల పాత్ర తెరిచింది. అందులోవున్న పిండివంటలు ఒక పెళ్లికి సరిపోయేవన్ని వున్నాయి. ఆయన చెప్పకుండానే ఒక పెద్ద ఆకుని అయిదారు ముక్కలు చేసి, వాటినిండా రకరకాల పిండివంటలు వుంచి, ఆ

పిల్లలకూ వృద్ధుడికి ఆమె యివ్వబోయింది. పిల్లలు వాటిని తీసుకోడానికి కొంచెం వెనకా ముందూ చూశారు.

'ఒరేయ్ పిల్లలూ! తిండి విషయంలో మొహమాటం చూడకూడదు. .. తినండి' అన్నాడు హొూటలు యజమాని.

'తీసుకోండి' అన్నాడు వృద్ధుడు కూడా.

అప్పుడు తీసుకున్నారు పిల్లలు.

హొూటలు యజమాని ఒక ఆకుని సుబ్బరామ అయ్యరు ముందుంచాడు. ఆయన నాజూకుగా 'యిప్పుడే కాఫీ తాగాను. వద్దులెండి. మీరు పుచ్చుకోండి' అన్నాడు. కోటు జేబులోంచి పుస్తకం బయటికి తీశాడు.

అయినా హొూటలు యజమాని విడిచి పెట్టలేదు. బలవంతం చేసి, ఆయన చేత ఒక గ్లాసు కాఫీ తాగేటట్లు చేశాడు.

వాళ్లంతా ఫలహారం చేసేటప్పుడు రైలు నాలాక్టిన్ పుత్తూర్ అనే స్టేషన్లో ఆగి, మళ్లీ బయలుదేరింది.

సుబ్బరామ అయ్యరు పుస్తకం తెరిచి చదవడం మొదలు పెట్టాడు. పిల్లలేమో చేతులు కడుక్కుని కూర్చున్నారు. అయ్యరు చేతిలో వున్న పుస్తకం పేరులోని అక్షరాలు కూడ బలుక్కుని 'అనాకెరీనా, లియో టోల్స్టోయ్' అని మెల్లగా చదివాడు ఒక కుర్రవాడు. అది అయ్యరు చెవిలో పడింది.

'టోల్స్టోయ్! ఇదీ సరిగ్గానే వుంది. చెప్పనంత వరకూ టోల్స్టోయ్ అనేగాని టాల్స్టాయ్ అని ఎలా తెలుస్తుంది' అని అనుకున్నాడు.

కొంచెంసేపయిన తర్వాత, ఆ పిల్లలు తమ చేతుల్లోవున్న కాగితాలు విప్పి చదవసాగారు.

'ఏవింట్రా అవి!' అడిగాడు హొూటల్ యజమాని.

'మా హెడ్ మాస్టరుగారు రాసిచ్చినవి.'

'ఏం రాసిచ్చారేవింటి?'

ఒక కుర్రవాడు బదులు చెప్పాడు. 'ఆవుని గురించి ఇంగ్లీషులో ఒక వ్యాసం. నక్క-ద్రాక్షపళ్ల కథ, తోడేలూ మేకపిల్ల కథ, స్నేహితునికి ఒక ఉత్తరం. ..'

'అన్నీ ఇంగ్లీషులోనే- హెడ్మాస్టరుగారు బాగా చదువుకున్నవాడు. బంగారంలాంటి వాడు. కన్నతండ్రిలా పిల్లలకి పాఠాలు చెప్పి, యివన్నీ రాసిచ్చారు' అన్నాడు వృద్ధుడు.

'బాగా చదవండర్రా. .. వీటిలోంచి ఏదో ఒకటి పరీక్షలో యిస్తారు రాయమని,' అన్నాడు హొటలు యజమాని.

పుస్తకం చదువుతున్నట్టు పైకి నటిస్తూ, వాళ్ల సంభాషణంతా వింటున్నాడు సుబ్బరామ అయ్యరు.

కాఫీ సేవించిన తర్వాత హొటలు యజమాని 'పిల్లలు బాగా చదివేవారిలా కనిపిస్తున్నారు' అన్నాడు వృద్ధుడితో.

'పల్లెటూరి పిల్లలైనా, చదువు మాత్రం గట్టిదే. ఇంతకూ పంతులుగారలాంటి వారు. ఆయనలా కన్నతండ్రి కూడా పిల్లల పట్ల అంత ప్రేమగా వుండదని నా అభిప్రాయం' అన్నాడు వృద్ధుడు.

'అది సరేగానీండి- పంతులుగారు కూడా తండ్రే గదా!' అన్నాడు హొటలు యజమాని.

అది వినేసరికి సుబ్బరామ అయ్యరు ఒళ్ళు గగుర్పొడిచింది.

'అందులో సందేహమేముందండి? ఈ కుర్రాళ్ళు చదువులోనే కాదు, పనిపాటుల్లోనూ సిసింద్రీలే' అన్నాడు వృద్ధుడు.

'పనిపాటులా?'

'అవును. పని చెయ్యకపోతే ఎలా? బడికి వెళ్ళేముందు ఆవుల్ని మేపుతారు. పత్తిగింజలు రుబ్బుతారు. ఇలా ఇంటి పనులు చేసిన తర్వాతే బడికి వెళతారు. ..'

'భేష్! అలా వుండాలి. బతకనేర్చిన వాడి లక్షణం అది. పనిపాటులు తెలీని చదువు చదువవుతుందా అసలు? పైగా అటువంటి వాడివల్ల ఊరి కేవఁన్నా లాభం వుందా? పోనీ వాడికి మాత్రం లాభం వుందా?. .. నా విషయం తీసుకోండి. .. నేను

రెండో క్లాసు దాటలేదు. బి.యే., యం.యేలు చదివుంటే ఉద్యోగం చేసేవాణ్ణి. అలా వుద్యోగం చేస్తే, యిన్నేళ్లుగా నా వల్ల విద్యార్థులకు వుపకారం జరిగి వుండేదా? నలుగురికి సహాయపడడమే చదువవుతుంది. అంతే కాని వూరివాళ్లని బెదరగొట్టే చదువు మాత్రం వద్దనే వద్దు. .. మీ రేమంటారు?' 'ఇందులో సందేహమేముందండి' అన్నాడు వృద్ధుడు. వాళ్లిలా మాట్లాడుకుంటూనే వున్నారు. కోవిల్‌పట్టి స్టేషను వచ్చింది. చదువుతున్నట్టుగా నటిస్తున్న సుబ్బరామ అయ్యరు పుస్తకం మూసివేసి, కోటు జేబులో వుంచాడు. అందరూ దిగే సన్నాహంలో ఉన్నారు.

'ధైర్యంగా పరీక్ష రాయండర్రా. నేను పెద్దవాణ్ణి. మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను. మీరంతా ప్యాస్. .. వెళ్లిరండి. చదువుకోసం తిరునెల్వేలి వస్తే, పంకజవిలాన్ మర్చిపోకండి! గుర్తుంటుంది గదా!' అన్నాడు హొటలు యజమాని.

సుబ్బరామ అయ్యరూ, ఆ కుర్రవాళ్లూ వృద్ధుడూ అంతా బండి దిగారు. వెళ్లేటప్పుడు హొటలు యజమాని వైపు తిరిగి మందహాసం చేస్తూ నమస్కరించి సెలవు తీసుకున్నాడు సుబ్బరామ అయ్యరు. ఆయన వెనకాలే నడిచారు కుర్రవాళ్లు. ఆయనకు ముందు నడవడానికి సందేహించారు. ఆయనంటే పిల్లలకి అంత గౌరవం కలిగింది.

స్టేషను నుంచి బయటికి రాగానే, గుర్రపుబండి కోసం ఎదురుచూస్తూ నుంచున్నాడు అయ్యరు. కోవిల్‌పట్టి స్టేషన్లో పోర్టరుగా పనిచేస్తున్న ఒకతను ఆ దగ్గర్లో ఒక మూల నుంచున్నాడు. ఆ రోజు అతనికి రాత్రి డ్యూటీ. పిల్లల్నీ వృద్ధుణ్ణీ చూసి 'రండి, రండి' అంటూ అతను వాళ్ల వద్దకు వచ్చాడు. వాళ్లెందుకు వచ్చారో తెలుసుకున్నాడు. అతనూ ఇడైసేవల్ గ్రామస్థుడని వాళ్ల మాటలను బట్టి అయ్యరు గ్రహించాడు.

వాళ్లను తన యింటికి ఆహ్వానించాడు పోర్టరు. టిఫిన్ వగైరాలు అక్కడే. ఆ రాత్రి అక్కడే వుండి, మరునాడు గ్రామానికి వెళ్లవచ్చునని అతనన్నాడు.

సుబ్బరామ అయ్యరుకి గుర్రపుబండి దొరికింది. అది ఎక్కాడు. బండి మలుపు తిరిగేంతవరకూ ఆయన దృష్టి ఆ పిల్లలమీదే వుంది. కుమారపురం స్టేషనూ, స్టేషను మాస్టరుతో జరిగిన సంభాషణా, వేపచెట్ల కమ్మని గాలీ, నల్లమట్టిలోంచి వచ్చిన సువాసనా, హొటలు యజమాని సౌజన్యం, చదువంటే యేమిటో ఆయనా, స్టేషన్ మాస్టరూ చేసిన నిర్వచనాలూ, పల్లెటూరి ప్రధానోపాధ్యాయుడు పిల్లల్ని తండ్రిలా

చూసిన తీరూ, టాల్‌స్టాయిని టోల్‌స్టోయ్‌గా చదివిన పిల్లల అక్షరజ్ఞానం, పేద పోర్టరు విందు పిలుపూ– ఇవన్నీ ఆయన స్ఫురణకు వచ్చాయి. ఇరవై నిమిషాల రైలు ప్రయాణంలో ఇరవై సంవత్సరాలు చదివినా తెలుసుకోలేని విషయాలు తెలిసిన ఒక సంతోషం.. పల్లెటూరి ప్రధానోపాధ్యాయుడు, హొటలు యజమాని, పోర్టరు– వీళ్లకంటే మంచి ఉపాధ్యాయులు ఈ లోకంలో మరెవరైనా వుంటారా? అని కూడా అనుకున్నాడు. వాళ్ల వద్ద చదవని చదువును ఈ కుర్రవాళ్లు యిక్కడ చదువుతారు! అని తనలో తాననుకున్నాడు. కుమారపురం స్టేషనుకి ప్రయాణీకులు రాకపోవడం కంటే, పై చదువుకని వాళ్లు యిక్కడి బడికి రావడమే హాస్యాస్పదం.. ఆ స్టేషనుకి చలివేంద్రం అనే పేరన్నా ఉంది. .. కాని. ..

సుబ్బరామ అయ్యరు ఇల్లు చేరుకున్నాడు.

వృద్ధుణ్ణి పిల్లల్ని పోర్టరు తన యింటికి తీసుకు వెళ్ళాడు. గ్రామంలో భోజనం చేసి రావడంవల్ల, వాళ్లేమీ తినలేదు. కాని పోర్టరు చేసిన బలవంతం వల్ల కాఫీ మాత్రం తాగారు. మధ్యాహ్నం భోజనం చేస్తామన్నారు. అ తర్వాత అంతా– పోర్టరు కూడా బడికి వెళ్ళారు. బడి వరండాలో వాళ్ళను వుండమని చెప్పి, పోర్టరు ప్రధానోపాధ్యాయుని గది ఎక్కడుందో తెలుసుకుని అక్కడికి వెళ్ళాడు. ఇడైసేవల్ గ్రామం నుంచి ఆరో క్లాసు ప్యాసయి ఏడో తరగతిలో చేరాలని నలుగురు పిల్లలు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడికి తెలియజేశాడు. ఆయన వెంటనే ఒక ఉపాధ్యాయుణ్ణి పిలిచి రెండు మూడు ప్రశ్న పత్రాలు ఆయనకు యిచ్చి, ఆ విద్యార్థుల్ని పరీక్షించవలసిందిగా చెప్పాడు.

ఒక గదిలో ఆ నలుగురు పిల్లల్నీ విడివిడిగా కూర్చో పెట్టారు. ప్రశ్నపత్రంలోని ప్రశ్నల్ని వ్రాసుకోండని, ఆ ఉపాధ్యాయుడు ప్రశ్నలు చదివాడు. అన్నీ ఇంగ్లీషులోనే ఉన్నాయి. పిల్లలు వాటిని వ్రాసుకున్నారు. ఒక్క గంటలో జవాబులు వ్రాయాలని ఉపాధ్యాయుడు చెప్పాడు. పిల్లలు వ్రాయడం మొదలు పెట్టారు.

పోర్టరూ వృద్ధుడూ బయటికి వచ్చి, ఒక చింతచెట్టు కింద కూర్చుని, ఊరి విషయాలు ముచ్చటించుకోసాగారు.

వదిన్నరకల్లా ఇంగ్లీషు పరీక్ష అయిపోయింది. తర్వాత లెక్కలు, తమిళం, సామాన్య విజ్ఞానశాస్త్రం మొదలైనవాటిలో జరిగాయి పరీక్షలు. అన్నీ పన్నెండుకల్లా

అయిపోయినాయి. విద్యార్థులంతా మధ్యాహ్నం భోజనానికి యిళ్ళకు వెళ్ళారు. వాళ్ళను ఆ నలుగురు పిల్లలూ ఎగాదిగా చూస్తూ నిలబడ్డారు. పరీక్షలు పెట్టిన ఉపాధ్యాయుడు వాళ్ళను గదిలోనే కూర్చోబెట్టి, సమాధాన పత్రాలు త్వరత్వరగా దిద్ది, మార్కులు వేశాడు. తర్వాత ప్రధానోపాధ్యాయుని గదికి వెళ్ళాడు. అప్పుడు పోర్టరూ వృద్ధుడూ అక్కడికి వచ్చారు.

'పరీక్షలు బాగా రాశారా?' అడిగాడు పోర్టరు.

'లెక్కలే కష్టంగా వున్నాయి.'

'?'

'చాలా తేలిక.'

'హెడ్ మాస్టరుగారు చెప్పిన ప్రశ్నలే వచ్చాయి. ఒక్క క్షణంలో రాశాను' అన్నాడు ఒకడు. మిగిలినవాళ్ళూ అలాగే అన్నారు.

'ఇంగ్లీషు కనక బాగా రాస్తే, ప్యాసయినట్టే" అని పోర్టరు చెపుతూవుండగా వృద్ధుడు 'మా ఊరి పంతులుగారు– ఎలాంటివాడని! ఇక్కడేం అడుగుతారో తెలుసుకుని, అక్కడే అన్నీ చెప్పేశాడు. అదీ తెలివంటే తెలివి' అని ఇదైసేవల్ ప్రధానోపాధ్యాయుణ్ణి నోరారా ప్రశంసించాడు.

'అయితే ఆయన ఘటికుడన్నమాట!'

'మరేమనుకున్నావ్! అందుకు తగ్గట్టుగా ఆయన గుణం కూడా బంగారం. ఇలాంటి పంతులుగారు మన వూరికి ఇంతవరకూ రాలేదనుకో. పిల్లలంటే ఆయనకి మహా ప్రేమ! ఆ తర్వాత నువ్వే ఆలోచించుకో' అన్నాడు వృద్ధుడు సగర్వంగా.

అంతా ఫలితం కోసం ఎదురుచూస్తూ మాటల్లో మునిగిపోయారు.

కొంచెం సేపయింది. పరీక్ష పెట్టిన ఉపాధ్యాయుడు అక్కడికి వచ్చి, వృద్ధుణ్ణీ, పోర్టర్నీ ఆ నలుగురు పిల్లల్నీ ప్రధానోపాధ్యాయుని గదికి తీసుకు వెళ్ళాడు. అప్పుడు వాళ్ళ సంతోషం మాయమయింది. భయం అవరించింది వాళ్లని.

'ఇలా రండి' అంటూ ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు. అంతా లోపలికి వెళ్ళారు. ప్రధానోపాధ్యాయుణ్ణి చూడగానే పోర్టరు నమస్కరించాడు. వృద్ధుడు చేతులు జోడించాడు. కాని చేతులు వణికాయి. పిల్లలు అలాగే నిలబడిపోయారు. ఆశ్చర్యంలో మునిగిపోయిన వాళ్ల కళ్లు పెద్దవైనాయి. తమంతట తామే తెరుచుకున్నాయి నోళ్లు.

కుమారపురం స్టేషన్ నుంచి టాల్‌స్టాయ్ పుస్తకం చేత పుచ్చుకుని తమతోపాటు ప్రయాణం చేసిన ఆయనే యిక్కడ ప్రధానోపాధ్యాయుడుగా ఆసీనుడై వున్నాడు. ఇలా జరుగుతుందని పిల్లలు ఎలా అనుకోగలరు? 'రండి' అని నవ్వుతూ ఆయన వాళ్లని ఆహ్వానించాడు. 'పెద్ద పంతులుగారికి దణ్ణం పెట్టండి' అని పోర్టరు చెప్పిన తర్వాత, వాళ్లు నమస్కరించారు.

'ప్రశ్నలన్నీ కష్టంగా వున్నాయా?' అని అడిగి, నవ్వాడు సుబ్బరామ అయ్యరు. ఆ నవ్వులోని అందమూ ఆకర్షణా ప్రేమా చూసి ఒక కుర్రవాడి కళ్లు చెమ్మగిల్లాయి.

ఆయన అడిగిన ప్రశ్నకు బదులు చెప్పకుండా అలాగే నిలబడిపోయారు.

తర్వాత 'మీ పేర్లు చెప్పండి?' అడిగాడు.

'నారాయణస్వామి, శ్రీనివాసన్, సుబ్బయ్య, తిరుపతి.'

'అంతా ప్యాస్ ' అన్నాడు సుబ్బరామ అయ్యరు. ఆ నలుగురు పిల్లల కళ్లనుంచి ఆనందాశ్రువులు రాలాయి.

'అంతా ఏడోక్లాసులో చేరండి. బాగా చదువుకోండి. ప్రతి పరీక్షలోనూ మంచి మార్కులు తెచ్చుకోవాలి' అని, వృద్ధుణ్ణి వుద్దేశించి 'మీ వూరి పంతులుగారే కాదండి, యీ వూరి ఉపాధ్యాయులు కూడా తండ్రివంటి వాళ్లే. అంతేనా!' అని నవ్వుతూ అయ్యరు అడిగాడు.

'అందులో సందేహం ఏముందండీ!' అన్నాడు వృద్ధుడు తన సహజధోరణిలో. మళ్లీ నమస్కరించాడు.

సుబ్బరామ అయ్యరు మందహాసం చేశాడు.

‘వెళ్లిరండి’ అని వాళ్లను పంపించిన తర్వాత కూడా, ఆయన మనస్సులో కుమారపురం స్టేషను మెదలసాగింది.

తనలో తాను ‘అది పెద్ద బడి’ అనుకున్నాడు సుబ్బరామ అయ్యరు.

◆

10

సుప్రసిద్ధ మరాఠీ రచయిత వ్యంకటేశ మాడ్గూళ్కర్ (1927-2001) రాసిన సాహిత్యంలో నేను చదివినవి రెండే. ఒకటి, బనగర్ వాడి నవల. ఆ నవల నామీద చూపించిన ప్రభావం గురించి నేను గత నలభయ్యేళ్ళుగా పదేపదే చెప్తూనే ఉన్నాను. నేను ఆరో తరగతిలోనో, ఏడో తరగతిలోనో ఉండగా, మా తాడికొండ గురుకులపాఠశాల లైబ్రరీలో చదివాను ఆ పుస్తకం. ఆ పుస్తకం నా మనసుమీద వదిలిపెట్టిన ముద్రలు ఇప్పటికీ అంతే కొత్తగా ఉన్నాయి.

ఎవరేనా సామాజిక శాస్త్ర విద్యార్థులు భారతదేశాన్ని అధ్యయనం చెయ్యడానికి వస్తుంటే వారికి బనగర్ వాడి నవల చదవమని చెప్తారని విన్నాను. ప్రేమ్‌చంద్‌నో, శరత్‌నో, టాగోరునో చదవమని చెప్పకుండా బనగర్‌వాడి గురించే ఎందుకు చెప్తారు? శివరామ కారంత, గోపీనాథ మొహంతి కూడా తాము చూసిన భారతదేశాన్ని అత్యంత సమగ్రంగా, ఎంతో లోతుగా చిత్రించారే! బిభూతిభూషణుడి 'పథేర్ పాంచాలి' కన్నా భారతీయ గ్రామసీమల గురించి మరింత హృద్యంగా ఎవరు చెప్పగలరు? కానీ, వీటన్నిటినీ మించిన దేదో బనగర్ వాడిలో ఉంది. అది కొంత ఆత్మకథనాత్మక కథ అని కూడా విన్నాను. అందులో అపారమైన విషాదం పరుచుకుని ఉండటం కూడా నాకు గుర్తే.

రెండోది, ఆయన రాసిన కథ 'ఆంజనేయస్వామి వారు.' మరాఠీ కథాసంగ్రహం లోని ఈ కథ నలభయ్యేళ్ళ కిందట మొదటిసారి చదివినప్పుడు నాకు ఎంత కొత్తగా అనిపించిందో, ఇప్పుడూ, అంతే తాజాగా ఉంది.

ఈ కథని వ్యాఖ్యానించే పొరపాటు చెయ్యను. ఇది చదువుతున్నంతసేపూ, చదివేకా కూడా మనలో ఎన్నో తలపులు చెలరేగుతూనే ఉంటాయి. కాకపోతే ఒక్కమాట చెప్పగలను. ఒకప్పుడు, అంటే దాదాపు ఎనభై ఏళ్ళ కింద, ఒక గ్రామానికి మాత్రమే పరిమితమైన ఈ మనఃస్థితి ఇప్పుడు దేశమంతా కూడా కనిపిస్తుండటం మనం గమనిస్తున్నాం.

ఒక గ్రామానికి చెందిన మౌఢ్యం మీద గురజాడ అప్పారావు రాసిన 'మీపేరేమిటి' తెలుగులో వచ్చిన గొప్ప కథల్లో ఒకటి. కాని ఆ కథలో ఆద్యంతం రచయిత కంఠస్వరం, ఆ authorial voice ఒక వ్యాఖ్యానంలాగా మనకి వినబడుతూనే ఉంటుంది. ఆ రకంగా, శిల్ప-పరంగా, ఆ కథ కూడా ఒకింత పరిమితికి లోనైనట్టే.

కాని ఈ కథలో author తనని తాను పూర్తిగా దిగమింగుకున్నాడు. 'ఇది ఇలా జరిగింది' అని మాత్రమే చెప్తాడు, ఎక్కడా తన అభిప్రాయాలు ఏమీ చెప్పకుండా. గొప్ప ఇతిహాసకారుల లక్షణం ఇది. కాబట్టి నేను చదివిన గొప్ప కథల్లో శిల్పరీత్యా కూడా దీన్నొక అగ్రశ్రేణికథగా లెక్క పెట్టుకుంటున్నాను.

వ్యంకటేశ మాడ్గూళ్కర్

ఆంజనేయస్వామివారు

సోమంచి యజ్ఞన్నశాస్త్రి

జూను నెలలో ఓనాటి ఉదయం తడితడిగా వుంది. ఆ గ్రామంలోకి ఓ పెద్ద వానరమొచ్చింది ఒంటరిగా. దానితో మరో కోతిగాని, పిల్లలుగాని, మూక ఏమీలేదు. మా ప్రదేశంలో కోతులు అరుదు. అందుచేత, వానరం కనిపిస్తే ఆదరంతోనూ, గౌరవం గానూ చూసేవారు. పది పన్నెండేళ్ళ తరవాత కనిపించింది, ఈ వానరం. ఎక్కడినించి వొచ్చిందో, ఎలావచ్చిందో, ఎవరికి తెలుసు, కాని గ్రామంలోకి రాగానే, తోక ఫించెములా ఎత్తి చూపిస్తూ, వూరి మారుతీ దేవాలయంలో జొరబడింది. గర్భగుడిలోకి వెళ్ళిపోయింది. కొంచెంసేపయిన తరవాత బయటికొచ్చి, దేవాలయశిఖరంమీద కూర్చుంది, తోక ఆడిస్తూ, ఎండ కాచుకుంటూ కూర్చుంది. ఈ విలక్షణమైన ప్రవర్తన, పూజారి పాండు భార్య కనిపెట్టింది. పిల్లని చంకనెత్తుకుని బయలు దేరింది. గుర్రాన్ని గడ్డి మేపడానికి పొలానికి తీసుకు వెళ్ళిన మొగుడితో ఈవిషయం చెప్పడం చాలా అవసరమని తోచింది, ఆవిడకి. ఆంజనేయస్వామివారు గ్రామానికొచ్చారు! దేవాలయంలోకి వెళ్లి వొచ్చారు స్వామివారు!

దేవాలయందగ్గిర స్కూలుంది. ఆ స్కూలుకి పిల్లలొచ్చారు, పుస్తకాలు, పలకా బలపం పెట్టుకున్న సంచులతోవొచ్చి, స్కూలు తలుపులు తెరవలేదు కనక వరండామీద

కూర్చున్నారు. మాస్టరుగారు ఇంకా టీ తాగడం పూర్తి కాలేదు కాబట్టి, స్కూలు తలుపులు తెరవలేదు.

టెలిగ్రాఫు వైరుమీద పిచుకలు కూర్చున్నట్టు, ఆ వరండా మీద పిల్లలు, దగ్గిర దగ్గిరగా కిక్కిరిసి కూర్చున్నారు. కళ్లు చికిలిస్తూ, ఉదయిస్తున్న సూర్యుడి కాంతి చూస్తున్నారు. అప్పుడు వాళ్లకి కనిపించింది ఆ మారుతి దేవాలయం శిఖరం మీద కూర్చున్న ఆ జంతువు ఆనందంతో, ఆశ్చర్యంతో, భయంతో, వాళ్ల మనసులు ఉప్పొంగసాగాయి. అందులో ఓ ముసల్మాను కుర్రాడు ముందుకొచ్చి, తన సొట్టముక్కు గోక్కుంటూ, 'కోతి కోతి, గోక్కో నీ ముక్కు, వీ తోక వంకరోయ్' అన్నాడు. పిల్లలందరూ వంత పాడారు. అప్పుడు ఆ వానరం, తన నల్లమూతి తెరిచి, పళ్ళు కనిపించేలా ఇకిలించి, అందరినీ వెక్కిరించింది. దేవాలయశిఖరంమీద నాట్యం చెయ్యడం ప్రారంభించింది.

ముసల్మాన్ కుర్రాడు, ఓ రాయితీసి, గురిచూసి వీపుకి తగిలేలా, విసిరాడు. దెబ్బ తగలగానే, ఆ వానరం ఓ గజం పైకి ఎగిరింది. బాధతో గిలగిల కొట్టుకుంది. కిచకిచమంటూ, ఎగురుకుంటూ, పరుగెడుతూ, రావిచెట్టు ఎక్కిపోయి, పై కొమ్మమీద, ఆకుల మధ్య కనిపించకుండా కూర్చుంది. పిల్లలు చెట్టుకిందజేరి, పైనున్న కోతిని ఝుడిపించడం మొదలెట్టారు. ఆ పైన ఉత్సాహం పుట్టుకొచ్చి, అల్లరిగా కేకలేస్తూ, రాళ్ళు రువ్వడం ప్రారంభించారు. రువ్వినరాళ్ళు కోతిదాకా వెళ్లలేదు. జిత్తులమారికోతి, ఈ సంగతి కనిపెట్టింది. రావిచిగుళ్లు తింటూ, హాయిగా కూర్చుంది.

ఈలోగా ఈవార్త పూజారి పాండుకి తెలిసింది. ఆయన గబగబ ఇంటికొచ్చాడు. గిన్నెలో ఓ పూరీముక్క పెట్టుకుని ఆ చెట్టుకింద కొచ్చాడు. పిల్లల్ని తరిమేశాడు. అరిచాడు. 'ఈ పాపానికి ఎలా పరిహారం చేసుకుంటాను? నాలుగుమూలలనించి నలుగురూ వొచ్చి, ఆంజనేయస్వామి వారిని అల్లరిపెడుతున్నారు. ఆయన మీకేం చేశాడురా!'

పూజారి పిల్లల్ని తరిమినప్పుడు. ఆ తుంటరిపిల్లలు తిట్టుకుంటూ ఆ పూజారి ఆ వూళ్లో ఏయే ఆడపిల్లలతో సరసాలాడాడో, ఎవరెవరితో సంబంధం పెట్టుకున్నాడో ఏకరువు పెట్టడం మొదలెట్టారు.

చేతులోవున్న పూరీ చూపిస్తూ, 'రావయ్యా! రా, హనుమంతా, తీసుకో దీన్ని' అని ఆహ్వానించాడు. కాని ఆ కోతి చిగురుటాకులు తింటూ పూజారికేసి చూడనన్నా

చూడలేదు. పొలానికి వెళుతున్న ముసలి నానా ఈ సంగతి చూసి, పూజారి 'పిచ్చాడని' ఎక్కిరించాడు. గడ్డం ఆడిస్తూ, అన్నాడు. 'పాండూ, ఇవాళ ఏం వారం?'

'శనివారం, నానా !'

"అయితే పూరీ ఎలా తింటారురా, ఆంజనేయస్వామివారు."

'మరి.'

'ఇవాళ ఉపవాసదినంకదా! ఉప్పుడు పిండో, చలిమిడో పెట్టు, స్వామివారికి.'

నానా విఠలభక్తుడు. ప్రతిసంవత్సరమూ కాలినడకన పండరిపురం వెళ్ళి, విఠోబాదర్శనం చేసుకొచ్చే వార్కరీ బృందంలోవాడు. సాధుపురుషుడు. గ్రామంలో నలుగురినీ పోగుచేసుకుని భజన చేసేవాడు. భజనకి అవసరమైన తాళాలూ, హార్మోనియం, మద్దెల, అన్నీ ఆయనింట్లో వున్నాయి. రామజన్మ, మారుతీజన్మ మొదలయిన పండుగలు చాలా గొప్పగా జరిపేవాడు. ఆ ముసలాయన చెప్పినది, గ్రామంలో అందరూ మన్నించేవారు.

నానా చెప్పినమాట పూజారికి నచ్చింది. గబగబ ఇంట్లోకి వెళ్ళి ఓ గుప్పెడు వేరుసెనగకాయలు తీసుకొచ్చాడు. ఉపవాసంనాడు వేరుసెనగ తినొచ్చు. అది చూపించి ఆంజనేయుడిని బతిమాలడం మొదలెట్టాడు. 'దేవా, రా! ఇది తీసుకో! కిందకి దిగు!'

కాని ఆ వానరం కేవలం నాలుగడుగులు కిందకి దిగి తొంగి చూపింది. తెల్లగుడ్లు చమత్కారంగా తెరిచి, మూసింది. పొడుగువేళ్లతో చంకలు గోక్కుంది. చిగురుటాకులు పీక్కుతింది. కోతి తన విన్నపం మన్నించకుండా అక్కడే కూర్చునివుండిపోతే, పూజారి, నానాని పిలిచాడు. 'నానా ! నా పాపపుచేతులతో ఇచ్చిన తిండి తినడం ఆంజనేయస్వామి వారికి ఇష్టం లేనట్టుంది. నువ్వు పెట్టిచూడు'. అప్పుడు నానా ముందుకొచ్చి, వేరుసెనగ కాయలు పుచ్చుకుని బతిమాలాడు, కిందికి దిగిరమ్మని. 'దేవా నే తమ దాసానుదాసుడిని. నా నైవేద్యం స్వీకరించు. నా సత్యసంధత పరీక్షించకు.'

నానా విధాల ప్రార్థించాడు. పుస్తకంలో చదివిన రకరకాల పేర్లు పెట్టి పిలిచాడు. అప్పుడు వానరం కిందకి దిగడం మొదలెట్టింది. అప్పటికి చాలామంది గ్రామస్తులు

అక్కడ గుమిగూడారు. మారుతి కిందకి దిగుతూవుంటే, ఆ గ్రామస్తుల మనసు చాలా ఆతురపడింది. వానరం చెట్టు మొదటికొచ్చింది. ఓ కిందికొమ్మమీద కూర్చుంది.

నానా, దగ్గిరకి వెళ్ళి, చెయ్యి తెరిచాడు. వానరం ముందుకి వొంగింది. నానాకి చాలాదగ్గిరగా వొచ్చింది. తన నల్ల చేతులతో ముసిలి నానాచెయ్యి పట్టుకుంది. గమ్మత్తుగా అటూ యిటూ చూసింది. నానా అన్నాడు. 'తీసుకోవయ్యా, ఎందుకీ సంకోచం?' ఆ మాట అనగానే, ఆ వానరం నానా చేతిని, మొక్కజొన్నపొత్తు, పళ్ళతో పీకినట్టు పీకింది. గాట్లు పడిపోయాయి, తోక ఆడించుకుంటూ మళ్ళీ చెట్టు పైకొమ్మ మీదికి వెళ్లిపోయింది.

ఆ వానరం కొరకగా, నానా, బాధతో గిలగిలలాడిపోయాడు. దిమ్మెరపోయి, కూలబడిపోయాడు. గ్రామస్తులు అతని దగ్గిరకి పరుగెట్టుకుంటూ వొచ్చారు. చేతికి నాటువైద్యం చేశారు. ఆయన్ని చేతుల్లో జాగర్తగా ఎత్తుకొచ్చి, ఇంట్లో పడుకోపెట్టారు. తండ్రిచెయ్యి గాట్లుపడడం చూసి, నానా పెద్దకొడుకుకి ఒళ్ళు మండింది. విత్తులు జల్లే సమయంలో, నానా, ఉపయోగంలేకుండా అయిపోయాడు. ఇప్పుడు రోజుకూలీని చూసుకోవాలి.

ఈ ఆలోచనతో నానా కొడుక్కి చాలా కోపమొచ్చింది. గ్రామస్తులు గుసగుస–లాడడం ప్రారంభించారు. నానాకీ, ఆయన కోడలికి ఏదో అక్రమసంబంధముందన్న అనుమానం నిజమే వుండాలి. లేకపోతే ఆ వానరం అలా కరిచివుండదు ! ఆ తరవాత మారుతికి వేరుసెనగకాయలు పెట్టడానికి ఎవరూ ముందుకి రాలేదు. ఎవరికీ ధైర్యం లేకపోయింది. అగ్నిపరీక్షకి ఒప్పుకునేవారెవరు?

కాని గ్రామంలోకి ఒచ్చిన స్వామివారిని, ఆకలితో వుండిపొమ్మనడమెలా?

పూజారికి వూరుకోడం నచ్చలేదు. తన ఎనిమిది సంవత్సరాల చిన్నపిల్లకి వేరు–సెనగకాయలిచ్చి వానరంతో అన్నాడు. 'దేవా ! ఈపిల్ల ఏ పాపమెరగని చిన్నపిల్ల. దీని దగ్గిరనించయినా తీసుకుతిను.' ఆ అమాయకపు పిల్ల చేతిలో వేరుసెనగకాయలు పెట్టుకుని, చెయ్యి జాచినప్పుడు, ఆ మర్కటం మళ్ళీ కిందికి దిగింది. దిగి, ఆ పిల్ల పిక్క పట్టుకుని గాట్లుపడి రక్తమొచ్చేలా కరిచేసింది. ఆతరవాత కంసాలి ఇంటిపక్కనున్న నిమ్మచెట్టు ఎక్కి కూర్చుంది.

పూజారి పెళ్ళాం, గుండె బాదుకుంటూ, కోతిని తిడుతూ, వేళ్లు విరిచింది. తాలూకాపట్టణంలో డాక్టరుగారికి చూపించడానికి, పిల్లని భుజంమీద వేసుకుని పూజారి

బయలుదేరాడు. దీనిమీద ప్రజలు గుసగుసలాడారు. 'పూజారి పెళ్ళాం ప్రవర్తనకూడా మంచిదికాదు. అందుకే, ఆ పిల్ల అమాయకురాలైనా, మర్కటరాజు కరిచేశాడు.'

వానరం ఎవరిచేతినించీ తీసుకు తినడానికి నిరాకరించినప్పుడు, అందరికీ ఆందోళన కలిగింది. తమలపాకులు నములుకుంటూ, చిన్నచిన్న గుంపులుగా ప్రజలు గుమిగూడి, ఈ విషయమే చర్చించడం ప్రారంభించారు.

కంసాలి యింటి నిమ్మచెట్టునించి, కమ్మరి నేరేడుచెట్టు మీదికి వెళ్ళింది వానరం. అప్పుడు బావిమోటని బాగుచేస్తున్న కమ్మరి, నోట్లో నములుతూ వున్న పొగాకు వుమ్మేసి, ఆ సమీపంలో పిల్లకి పాలిస్తున్న పెళ్ళాంతో అన్నాడు. 'మనయింటికి వానరమొచ్చింది. వేరుసెనగకాయలు తీసుకురా !

పెళ్ళాం. 'పిచ్చాడివా ! చావనీ ఆ కోతిని! నీ పని నువ్వు చూసుకో' అంది,పెళ్ళాం.

'సొంతంగా, పిలవకుండా, మనింటికొచ్చాడే. ఏదన్నా పెట్టితీరాలి.'

పెళ్ళాం కోసం వేచిచూడకుండా, దోసెడు వేరుసెనగకాయలు తీసుకొని, వానరానికి చూపించి, కిందకి రమ్మని పిలిచాడు దానిని. చుట్టుపక్కల ఎవరూ లేరని చూసి, ఆ వానరం కిందికి దిగింది. కమ్మరితొడ కొరికి పారిపోయింది. ఆ గ్రామంలో వున్న ఒక్క కమ్మరి, గాయపడి, పనికిరాకుండా పోయాడు. ఇంక సేద్యానికి కావలసిన పనిముట్లు చేసేదెవడు. పనిముట్లు పాడయితే, బాగుచేసేదెవడు?

ఆ లావుమర్కటం, పొద్దుటినించి మూడోఝాముదాకా గ్రామంలో ధూం ధాం చేస్తూ తిరిగింది. పిచ్చిఎక్కిన కుక్కలాగ, కనిపించిన ప్రతి మనిషినీ కరవడం ప్రారంభించింది.

అప్పుడు నానా పెద్దకొడుకుకి ఒళ్ళు మండిపోయింది. ఆపుకోలేనంత కోపమొచ్చింది. చేతినిండా రాళ్ళు పుచ్చుకుని, కోతి ఎక్కిన నేరేడుచెట్టు కిందికి వెళ్ళాడు. కోపంతో కోతిని వుద్దేశించి అన్నాడు. 'స్వామీ, తాము చాలా గడబిడ చేశారు'. తరవాత ఓ రాయి తీసి, గురిచూసి కొట్టాడు. కాని, కోతి ఆ దెబ్బ చాలా నేర్పుగా తప్పించుకుంది, ఓ పక్కకి జరిగి, పళ్ళు ఇకిలిస్తూ, ఆతని మీదికి ఉరకబోయింది. అతను కూడా మరోరాయి పుచ్చుకుని దాన్ని బాదడానికి సిద్ధంగా ఉన్నాడు. కాని వానరం పరుగెత్తుకుంటూపోయి, ఓ తోటలో ప్రవేశించింది. రాయి పుచ్చుకుని కాలరుద్రుడై వెనకపడ్డాడు నానా పెద్దకొడుకు.

అతని ఆవేశంచూసి, గ్రామంలో మరికొంతమంది యువకులు, అతనివెంట వెళ్లారు. కర్రలు, రాళ్లు పుచ్చుకునివెళ్ళారు, రెండు మూడు మైళ్లు పరుగెత్తి తరవాత వానరం అలిసిపోయింది. వొచ్చి మీదపడుతున్న రాళ్ల నించి తప్పించుకోడానికి, ఆ వానరానికి శక్యం కాకపోయింది. పది పన్నెండు రాళ్లు తగిలి, ఆ వానరం కింద పడి పోయింది. అది కిందపడగానే యువకులందరూ దాన్ని చుట్టు ముట్టేశారు. ఆ వానరం, ఇక లాభం లేదన్నట్టు, చేతులు ఆడించుకుంటూ, దయచూపించమన్నట్టుగా, చుట్టూ తిరగడం మొదలెట్టింది.

అప్పుడు ఆ వూరివర్తకుడి కొడుకు సదా అన్నాడు. నానా కొడుకుతో, 'ఆ వానరం చూడు. చేతులు జోడించి నన్ను కొట్టొద్దు అంటోంది. మన పాదాలు పట్టుకుంటా-నంటోంది.'

కావి నానా కొడుకు క్రోధం ఆపుకోలేకపోయాడు. ఆవేశంతో ముందుకెళ్ళి, కోతిని కర్రతో కొట్టాడు. మిగిలిన యువకులు కూడా నిర్దయతో రాళ్ళు రువ్వారు. ముక్కు నించీ, నోటినించీ రక్తం కారుస్తూ, కాళ్ళూ చేతులు ఆడిస్తూ, ఆ కోతి చచ్చి-పోయింది. అప్పుడు వానరం రెండుచేతులూ జోడించివున్నాడు. మొహం నిండా మట్టి పట్టుకుపోయింది.

దాని ఈ దయనీయదశ చూడగా, నానా కొడుక్కి జాలివేసింది. అతను విచారంలో అన్నాడు. 'మీలో ఎవరైనా ఒక్కరు ఇక్కడుండండి. మేం వెళ్ళి తాళాలు, మద్దెలలు తీసుకొస్తాము. వాయిద్యాలతో వానరాన్ని పూడ్చిపెడదాము' అతని గొంతుక విలక్షణంగా, మృదువుగా వినిపించింది.

చచ్చిపోయిన వానరాన్ని కరుణతో చూస్తూ సదా అన్నాడు. 'పాపం. మనచేతుల్లో చచ్చింది. జరగకూడని పని జరిగిపోయింది. అందరి సలహా మీదా, సదా అక్కడే దిగబడిపోయాడు, గద్దలూ అవీ రాకుండా కాయడానికి.

మిగిలిన యువకులు గ్రామంలోకి వొచ్చారు. వానరాన్ని చంపిన విషయం వూళ్లో తెలిసినప్పుడు, అందరూ నమస్కారం పెట్టి, ఈ గ్రామంలో జరిగిన అపరాధానికి క్షమించమని ఆంజనేయస్వామివారిని వేడుకున్నారు. భజనచేసుకుంటూ బృందం పొలానికి వెళ్ళింది. గౌరవపురస్కరంగా, మానసన్మానాలతో ఆ వానరాన్ని, శ్మశానానికి తెచ్చి, మనిషిని దహనం చేసినట్టు తగలబెట్టారు.

నానాకి ఈ సంఘటన చాలా ఆందోళన కలిగించింది. ఆయన ఏ ప్రదేశంలో వానరం మరణించిందో, అక్కడ ఓ సమాధి కట్టించాడు, ఇప్పుడు భక్తిపరులు, ఆ దారినవొస్తూ, వెళుతున్నప్పుడు, సాష్టాంగనమస్కారంచేసి కదులుతూ వుంటారు.

◆



చూడు, యెలా నిద్రపోతున్నాడో!

11

ఇప్పటి యువతీయువకులూ, కవులూ, కథకులూ ఎంతమంది గోర్కీని చదువుతున్నారో తెలియదుగానీ, మా తరందాకా గోర్కీని చదవడం తప్పనిసరిగా ఉండేది. ఇంకా చెప్పాలంటే అప్పట్లో నువ్వొక సాహిత్యబృందంతో కలిసి తిరగాలంటే గోర్కీని చదివి ఉండటం ఒక అలిఖిత సభ్యత్వ నిబంధనలాగా ఉండేది.

నలభయ్యేళ్ళ కిందట నేనెవరి ఇంటికి వెళ్ళినా అక్కడ గోర్కీ 'అమ్మ' తప్పనిసరిగా కనిపించేది. ఇక మరెవరిదగ్గరైనా 'నా బాల్యము', 'నా బాల్యసేవ', 'నా విశ్వ విద్యాలయాలు'– మూడు పుస్తకాలూ కూడా కనిపించాయంటే వారి సాహిత్యాభిలాష అత్యున్నతస్థాయికి చెందింది అనుకునేలాంటి రోజులవి. సాహిత్యాభిలాష మాత్రమే కాదు, వారికి సమాజం పట్లా, మనిషి పట్లా, శ్రామికుల భవితవ్యం పట్లా, ప్రజల పట్ల రచయితకి ఉండవలసిన కర్తవ్యం పట్లా ఉండే నమ్మకం ముందు శిరసొగ్గాలనిపించేది.

'స్వర్ణపిశాచి నగరం' నాకు చాలా నచ్చిన పుస్తకాలలో ఒకటి. 'గోర్కీ సాహిత్య వ్యాసాలు' చదివే నేను పుస్తకాల గురించీ, రచయితల గురించీ ఎలా తలుచుకోవాలో, ఎలా రాయాలో నేర్చుకున్నాను. ఇక మరెవరి దగ్గరైనా గోర్కీ కథల తెలుగు అనువాదం లేదా నాటకాల ఇంగ్లిషు సంపుటీ ఉన్నాయంటే వారు మా దృష్టిలో తేరిపారచూడలేనంత ఎత్తులో కనిపించేవారు.

గోర్కీ రాసిన కథల్లో మూడు కథలు నన్నిప్పటికీ వెన్నాడుతున్నాయి. మొదటిది, 'ఇరవై ఆరుగురు పనివాళ్ళూ, ఒక స్త్రీ'. Critical realism కి ఉదాహరణగా ఆ కథని పరిచయం చెయ్యవలసి ఉంది కాబట్టి, ఇక్కడ ఎత్తుకోవడం లేదు. ఇక మిగిలిన రెండు కథల్లో , 'డాలర్ భూతం' గోర్కీ లోని ఊహాశక్తికీ, ఆయన వ్యంగ్యదృష్టికీ గొప్ప ఉదాహరణ. కానీ, ఇక్కడ మీకు పరిచయం చెయ్యడానికి, ఆ కథని కూడా పక్కన పెట్టి, 'మానవుని జననం' (1912) కథని ఎంచుకున్నాను. ఇది 'మాక్సిం గోర్కీ కథలు' ప్రగతి ప్రచురణాలయం వారు ప్రచురించిన రాచమల్లు రామచంద్రారెడ్డి అనువాదం నుంచి ఎంపిక చేసిన కథ.

1892 అంత్యకాలంలో గోర్కీ కాకసస్‌లో సుహూం-నొవొరొస్సీయస్క్ రోడ్డు నిర్మాణంలో పనిచేసే రోజుల్లో ఒక నిర్మానుష్యమైన దారిలో నొప్పులు పడుతున్న స్త్రీ ఒకామె ఆయనకు తటస్థపడిందనీ, ఆమె కాన్పుకి ఆయన మంత్రసాని పని చేసాడనీ విన్నాం.



ఈ కథ మొదటిసారి చదివేక, మళ్ళా నలభై ఏళ్ళ తరువాత ఇదే చదవడం. చదివినంతసేపూ నా హృదయం ద్రవీభూతమై పోతూ ఉంది. నువ్వు కథకుడివే అయితే నీ జీవితానికి ఇలాంటి కథ ఒక్కటి రాస్తే చాలనిపిస్తుంది. నువ్వు మనిషివే అయితే నీ తోటిమనిషి పట్ల ఇటువంటి సౌభ్రాతృత్వాన్ని ప్రకటించగలిగే ఒక్క రోజు దొరికినా చాలనిపిస్తుంది.

మక్సిం గోర్కీ

ఒక మానవుని జననం

రాచమల్లు రామచంద్రా రెడ్డి

1892 కరువు సంవత్సరం సుహూంకూ, ఒచెమ్ చీరీకి మధ్య కొదోర్ నదిఒడ్డున సముద్రానికి చేతివేటు దూరంలో– తళతళ మెరిసే కొండ సెలయేటి ఉల్లాసపు కలకల నాదాన్ని మించి, తీరాన్ని ఒరుసుకునే సముద్రపు అలల గలగల స్పష్టంగా వినవచ్చు.

శరదృతువు. చెర్రీ లారెల్ చెట్ల సందుటాకులు కొదోర్నది తెల్లని నురుగులో, చాకచక్యం గల చేపల్లాగ, సుడిదిరుగుతూ, వురకలువేస్తూ వున్నాయి. నేను నది ఒడ్డునరాళ్లలో కూర్చొని, కొంగలూ, కార్మొరంతులూ కూడా బహుశా ఆకులను చేపలుగా భ్రమించి, ఆశాభంగం పొందుతున్నాయని అనుకుంటూ వున్నాను– అందుకే అవి అక్కడ, కుడి వైపున, చెట్ల కవతల, ఒడ్డును సముద్రం ఒరుసుకునే చోట, అంత బాధగా అరుస్తున్నాయి.

తలమీద చెస్ట్‌నట్ చెట్లు బంగారు సొమ్ములు పెట్టుకున్నాయి, నా కాళ్లవద్ద యెన్నో ఆకులు పడి వున్నాయి, మనుషుల ముంజేతులనుండి ఖండింపబడిన హస్తాలలాగ కనిపిస్తూ, అవతలి వొడ్డున హార్న్ బీమ్ కొమ్మలు అప్పుడే బోడివై, చినిగిన వలలాగ గాలిలో వ్రేలాడుతున్నాయి. ఆ వలలోపల, అందులో చిక్కుకున్నట్లు, ఒక పసుపు యెరుపురంగుల కొండవడ్రంగి పిట్ట యెగురుతూ, తన నల్లని ముక్కుతో చెట్టు బోదె బెరడును పొడుస్తున్నది, పురుగులను బయటికి తరమడానికి. ఆ పురుగులను వెంటనే

దిగమింగుతున్నాయి సుదూర ఉత్తరంనుండి వచ్చిన అతిథులు హుషారైన చిన్నటామ్ట్ లూ, బూడిదరంగు నట్‌హాచ్‌లూ.

నా యెడమ వైపు, కొండ పేటులకు ఆనుకొని నల్లని మేఘాలు వేలాడుతున్నాయి, వర్షం కురవబోయేటట్లు, వాటి నీడలు పచ్చని కొండదరులమీద ప్రాకుతున్నాయి. ఆ దరులలో యెండిపోయినట్లు కనిపించే బాకుడ్ చెట్లు పెరిగినాయి, పురాతనమైన బీచ్, లిండెన్ చెట్ల తొర్రలలో అడవి తేనె దొరుకుతుంది– రోమ్ కాలంలో ఆ తేనె పాంపే సైనికులను దాదాపు తలకిందులు చేసింది, దాని తీయని కైపుతో మొత్తం ఒక లీజియన్ అంతా పడిపోయినారు. తేనెటీగలు లారెల్, అజాలియా పూలనుండి తయారు చేస్తాయి ఆ తేనెను, బాటసారులు చెట్ల తొర్రలలోనుండి దాన్ని తీసుకొని, గోధుమతో చేసే పల్చని లావాష్ రొట్టెలకు పూసుకొని తింటారు.

నేను చేస్తూ వుండిన పని సరిగ్గా అదే, చెస్ట్‌నట్ చెట్లకింద రాళ్లమీద కూర్చొని, ఒక కోపిష్టి తేనెటీగ వేసిన కాట్లను రుద్దుకుంటూ. తేనె నింపిన టీ పావులో బ్రెడ్డుముక్కలు ముంచి తింటున్నాను, అలసట చెందిన శరత్కాలపు సూర్యుని విలాసక్రీడలనుచూసి ఆనందిస్తూ.

శరదృతువులో కాకసస్ ఒక గొప్ప వైభవోపేతమైన చర్చిలా గుంటుంది, గొప్ప జ్ఞానులు– వాళ్లు విధిగా గొప్ప పాతకులు కూడా– తమ గతాన్ని అంతరాత్మ నిశితదృక్కులనుండి దాచుకోడానికి కట్టిన చర్చిలాగుంటుంది. బంగారూ, పచ్చలూ, నీలాలూ పొదిగిన విస్తారమైన దేవళంలాగుంటుంది. సమర్కాండ్, షెమాహాలలోని తుర్కీయులుపట్టుతో నేసిన మహా నాజూకైన రత్నకంబళాలు పరిచిన పర్వతసానువులతో. వాళ్లు ప్రపంచాన్నంతా దోచుకొని తెచ్చిన కొల్లసొమ్ము సూర్యుని ముందర వుంచినారు, సూర్యునికి అర్పణ చేస్తూ:

'భవదీయం– భవజ్జనితం–భవదర్పితం!'

. .. పెద్ద గడ్డాల, తెల్ల జుట్టు బృహత్కాయులు చురుకైన చిన్నపిల్లలలాగ వికసించిన నేత్రాలతో పర్వతాలమీదనుండి కిందికి దిగిరావడం నాకు కనిపించింది. వాళ్లు భూమిని అలంకరిస్తూ, రంగురంగుల సంపదలను తమ దండి చేతులతో వెదజల్లుతూ, పర్వతాగ్రాలను మందమైన వెండిపొరలతో కప్పుతూ, వివిధవృక్షాల జీవద్వస్త్రాలను కొండచరియలకు కట్టబెట్టుతూ వస్తున్నారు– వాళ్ల చేతికింద యీ పుణ్యభూఖండం అనిర్వచనీయసౌందర్యం సంపాయించుకుంది.

యెంత అద్భుతమైన పదవి– యీ ప్రపంచంలో మానవునిది! యెంత అద్భుతమైన వస్తుసంపద కనపడుతుంది, హృదయాన్ని చలింపజేసే సౌందర్యం కలిగించే నిశ్చలానందం యెంత తీయగా గుండెను పిండుతుంది!

నిజమే, ఒకోసారి కష్టంగా వుంటుంది. గుండెలో ద్వేషజ్వాలలు చెలరేగుతాయి, దుఃఖం తీరని ఆశతో హృదయరక్తం పీలుస్తుంది, కానీ యిది శాశ్వతంగా వుండదు. తరుచుగా సూర్యుడు కూడా యెంతో విషాదదృక్కులు బరపుతాడు మానవులమీద. తాను వాళ్ల కోసం యెంతో శ్రమపడినాడు, కానీ యెంత దౌర్భాగ్యపు మూకగా తయారైనారు వాళ్ళు.

కొంతమంది మంచివాళ్లు వున్నారు, సహజమే అది, కానీ వాళ్లను బాగుచెయ్యాలి, లేదా పునర్నిర్మాణం చెయ్యాలి.

. ..యెడమపక్క పొదలపైన అటూ యిటూ కదిలే నల్లని తలలు కనపడు–తున్నాయి. సముద్రతీరపు గుసగుసలమధ్య, నది గళగరింపుల మధ్య మానవ కంఠాలు సవసవగా వినపడుతున్నాయి. అవి 'కరువు పీడితు'లవి, వాళ్లు సుహూంలో రోడ్డు నిర్మిస్తూ వుండినారు, యిప్పుడు ఒచెమ్‌చీరీకి పోతున్నారు, అక్కడ మళ్లీ పని దొరుకు–తుందనే ఆశతో.

వాళ్లు నాకు తెలుసు– వాళ్లది ఒరేల్. వాళ్లతో కలిసి నేను పనిచేసినాను. మొన్న మాకు డబ్బు యిచ్చేసి పొమ్మన్నారు. నేను వాళ్లకంటె ముందు, రాత్రిపూట బయలు–దేరినాను, సూర్యోదయం చూడడానికి సముద్రతీరం చేరుకునేటట్లు.

వాళ్లు అయిదుమంది వుండినారు– నలుగురు రైతులూ, యెత్తు బోటెముకలుగల ఒక రైతు యువతీ. ఆమె గర్భిణి. పెద్ద కడుపు పైకి తోసుకొనివచ్చింది, రెప్పవేయక చూసే ఆమె లేత నీలికన్నుల్లో భయం కనిపించేది. పసుపురంగు కర్చీఫ్ ఆమె తలపొదల పైన వూగుతూ నాకు కనిపిస్తున్నది, వికసించే పొద్దుతిరుగుడుపూవు గాలిలోవూగినట్లు. ఆమె మగడు సుహూంలో మరణించినాడు– పండ్లు మితిమీరి తిని. నేను వీళ్లతో కలసి ఒకే గుడిసెలో వుండినాను. పాత రష్యన్ సంప్రదాయానికి అనుగుణంగా వాళ్లు తమ కష్టాలను యెంతగానో, యెంతో బిగ్గరగా చెప్పుకునేవాళ్లు, వాళ్ల మొత్తు కోళ్లు మూడుమైళ్ల దూరం వినిపించివుంటాయి.

వీళ్లు మొద్దు మనుషులు, శనిదేవత కాలి కింద నలిగి, కృశించి నీరసించిపోయిన తమ పుట్టిన గడ్డనుండి పెకలింపబడి, గాలికాలపు పండుటాకుల్లాగ యిక్కడికి కొట్టుక వచ్చినవాళ్లు. యీ వింత సంపన్మయవాతావరణానికి వాళ్లు కండ్లు చెదిరి, నివ్వెర పోయినారు, యిక్కడి కష్టమైన పనితో పూర్తిగా కొయ్యబారిపోయినారు. వాళ్లు తమ మసకబారిన దిగులు కన్నులు పులపొడుస్తూ ప్రతిదాన్నీ దిగ్భ్రాంతితో చూసేవాళ్లు, ఒకరివైపు ఒకరు జాలిగా చిరునవ్వు నవ్వుతూ, నీరసకంఠాలతో మాట్లాడుకునేవాళ్లు.

‘ఓ, యేమి భూమి!’

‘బంగారు పండే భూమి!’

‘అయినా, కాస్త గరువు నేల. ..’

‘సుఖం లేని భూమి, మొత్తానికి. ..’

వాళ్లకు తమ సొంత వూర్లు జ్ఞాపకం వచ్చేవి–కొబిలీ లోగ్, సుహోయ్ గోన్, మోకెంకొయె– ప్రతి పిడికెడుమట్టిలోనూ తమ తాతముత్తాతల బూడిద కలిసిన వూర్లు– ప్రతిదీ మనసులో నాటుకొని, తమకు పరిచితమై, ప్రీతిపాత్రమై, ప్రతిదీ తమ చెమటతో తడిసిన వూర్లు.

వాళ్లతో కలిసి అక్కడ మరొక స్త్రీ వుండేది– యెత్తుగా, నిటారుగా, పెద్దదవడలతో, కొయ్యపలక లాగ చదునైన రొమ్ముతో, బొగ్గులాగ నల్లగా వున్న, కాంతిలేని మెల్లకండ్లతో.

సాయంత్రం పూట ఆమె, పసుపు కర్చీఫ్ స్త్రీతో కలిసి, గుడిసె వెనుక కొంత దూరంపోయి, రాళ్ల కుప్పమీద కూర్చొని, చేతిమీద చెంప మోపి, తల ఒక పక్కకు వాల్చి, కోపిష్టి గొంతు యెత్తి పాడేది:

వూరి శ్మశానం ఆవలనూ
పచ్చపచ్చని పొదల మాటునా
బంగరు కాంతుల యిసుక తిన్నెపై
నా తెల్లని శాలువ పరిచెదనూ.
అక్కడ కూర్చుంటాను
నా ప్రియతముడొచ్చిందాకా

ఆతడు అచటికి రాగానే
ఆహ్వానిస్తా హృదయంతో. ..

పసుపు కర్చీఫ్ మనిషి సాధారణంగా మౌనంగా వుండేది, మెడ వంచి తన కడుపు వైపు చూసుకుంటూ, ఒకోసారి ఆమె కూడా కలిసేది, పాటలోని విషాద పూరితమైన మాటలను బొంగురు, యీడుపు, మగగొంతుతో పాడుతూ:

ఓ ప్రియతమా,
నా హృదయమా,
నాకిక లేనే లేదా
మళ్లీ నిను గను రాతా. ..

దక్షిణాది రాత్రుల వూపిరాడనీని నల్లని చీకటిలో యీ శోకకంతాలు వింటుంటే ఉత్తరాది మంచుయెడారులూ, హుంకరించే మంచుతుఫానులూ, తోడేళ్ల దూరపు కూతలూ జ్ఞాపకం వస్తాయి. ..

తరువాత మెల్లకంటి స్త్రీ జ్వరంతో పడిపోయింది. ఆమెను స్ట్రెచర్ మీద పట్టణానికి తీసుకుపోయినారు. దానిమీద ఆమె వణుకుతూ యేడ్చింది, వూరి శ్మశానం గురించీ, బంగరు కాంతుల యిసుకతిన్నె గురించీ పాట పాడుతూనే వుందా అన్నట్లు.

.. .కర్చీఫ్ తల వంగి అదృశ్యమైంది.

నేను తిండి ముగించి, పావులోని తేనెను ఆకులతో కప్పి, సంచి భుజానికి తగిలించుకొని, వాళ్లు పోయే దారిలోనే తీరికగా బయలుదేరినాను, కార్నెల్ చేతికర్ర గట్టినేలమీద టకటకలాడిస్తూ.

నేను ఆ యిరుకు బూడిదరంగు రోడ్డుమీద పోతూవుండినాను. నా కుడివైపు ముదురునీలపు సముద్రం పైకీ కిందికీ యెగుర్లాడుతున్నది. అదృశ్యంగా వున్న వడ్రంగులు వేలకొలది తోపడాలతో సముద్రంమీద పనిచేస్తున్నట్లువుంది ఆ దృశ్యం. తోపడా పొట్టు గాలికి కొట్టుకొనిపోతున్నది బీచివైపు, గలగలమంటూ. ఆ గాలి తడిగా, వెచ్చగా, సువాసనగా వుంది, ఆరోగ్యంగల స్త్రీ ఊరుపులాగ, ఒక టర్కిష్ ఫెలుకా, రేవువైపు వంగి, నీళ్లలో సరసరపోతున్నది, సుహూం చేరుకోడానికి. దాని తెరచాపలు సుహూం

లోని ఆర్భాటపుఇంజనీరు వూదుచెక్కిళ్లలాగ ఉబ్బుకొని వున్నాయి- అతను చాలా ముఖ్యమైనవాడు. యెందుకనో అతను అక్షరాలు తేలబలికేవాడు.

'నోరు మూసుకో! తెలివిపరుణ్నని హనుకున్నావేమో, చిటికెలో పోలీస్ స్టేషన్‌కు పంపించేస్తాను!'

మనుషలను పోలీస్‌స్టేషన్‌కు పంపించడం అతనికి యిష్టం. యిప్పటికల్లా గోరీలోని పురుగులు అతన్ని యెముకల దాకా శుభ్రం చేసి వుంటాయనే ఆలోచన హాయిగా వుంది.

. ..నడక సుఖంగా వుంది, గాలిలో తేలిపోతున్నట్లుంది. ఆహ్లాదకరమైన ఆలోచనలూ, రంగురంగుల స్మృతులూ మనసులో మెల్లగా నృత్యం చేస్తున్నాయి. నాలోపల నృత్యంచేసే ఆకారాలు సముద్రంలోని అలల్లాగ వున్నాయి- పైన తెల్లని శిఖరాలతో, లోపలలోతుల్లో ప్రశాంతంగా. అక్కడ యవ్వనపు ఉజ్వల ఉల్లాసపూరిత ఆశలు నిబ్బరంగా యీదుతున్నాయి, ఉప్పునీటి లోతుల్లో తళతళ మెరిసే చేపల్లాగ.

రోడ్డు సముద్రతీరం వైపు పోతున్నది, అలలు ఒరుసుకునే యిసుక పీకకు అంత కంతకూ దగ్గరౌతూ. పొదలు కూడా సముద్రాన్ని చూడాలని ఉబలాట పడుతున్నట్లుంది, రిబ్బన్‌లాంటి రోడ్డుమీదికి వంగి, అపార నీలజలార్ణవంవైపు మెడలు సాచుతున్నాయి.

పర్వతాలమీదనుండి గాలి వీస్తూ వుండింది- వర్షం వచ్చే సూచన.

. ..పొదలలోనుండి మెల్లని మూలుగు వినిపించింది- మనిషి మూలుగు, యెప్పుడైనా మనుషుల గుండెలను కదిలించేది.

నేను పొదలు పక్కకు తొలగించి చూసినాను, పసుపు కర్చీఫ్ స్త్రీ కనిపించింది. ఆమె వాల్నట్ చెట్టు బోదెకు ఆనుకొని వుంది, తల భుజంమీదికి వాలి వుంది, నోరు వికృతంగా వుంది, కండ్లు ఉబికి పిచ్చిగా వున్నాయి. తన పెద్ద పొట్టమీద చేతులు పెట్టుకొని, పొట్ట యెగిరెగిరి పడేటంత మహా అసహజంగా ఆమె వూపిరి యెగపోసు కొంటున్నది, పొట్ట చేతులతో పట్టుకొని, తోడేలుపసుపురంగు పండ్లు వెళ్లబెట్టి, మూలుగు–తున్నది.

'యేమిటిది? యెవరైనా కొట్టినారా నిన్ను?' నేను అడిగినాను, ఆమెమీదికి వంగుతూ.

ఆమె ఆ బూడిదరంగు దుమ్ములో తన వుత్త కాళ్లు వూకించినట్లు కదిలించి, తన బరువైనతల తిప్పుతూ గసపెట్టింది:

'వెళ్ళిపో. .. సిగ్గులేదూ, వెళ్ళిపో. ..'

అప్పుడు అర్థమైంది నాకు అదేమైందీ– అంతకు ముందొకసారి చూసినాను అది. సహజంగానే నేను భయపడి వెనక్కి వురికినాను. కానీ ఆమె బిగ్గరగా, దీర్ఘంగా కేకలువేయసాగింది. ఆమె కండ్లు తలకాయలోనుండి బయటికి వెళ్లబొడుచుకొని వచ్చినట్లున్నాయి. ఆ కండ్లలో కన్నీరు పొంగి, ఉబ్బి బిగిసిన ముఖంమీద కారుతున్నది.

యిది చూసి నేను మళ్లీ ఆమె దగ్గరికి పోయినాను. నా సంచీ, కెటిలూ, టీ పావూ నేలమీద పడవేసి, ఆమెను నేలమీద సాచి వెలకిల పండబెట్టి, ఆమె మోకాళు వంచబోతుండగా, ఆమె నన్ను పక్కకు తోసి, నా ముఖంమీదా, రొమ్ముమీదా కొట్టి, అటుతిరిగి దోగాడుతూ పొదల్లోకి పోయింది, ఆడ యెలుగులాగ గురగురమంటూ, గర్జిస్తూ:

'సైతాన్! పశువు!'

ఆమె చేతులు సచ్చుబడి బోర్లపడింది, ముఖం నేలకు కొట్టుకుంది. ఆమె మళ్లీకేకలు ప్రారంభించింది, కాళ్లు వూకించి సాచుతూ.

ఆ ఉద్వేగపు అలజడిలో ఆ వ్యవహారం గురించి నాకు తెలిసిందంతా వేగంగా జ్ఞాపకం చేసుకున్నాను. ఆమెను వెలకిల దిప్పి, ఆమెకాళ్లు మడిచినాను– పిండం పై సార అప్పటికే వెలుపలికి వచ్చింది.

'కదలకుండా వుండు, వచ్చేస్తున్నది.'

నేను బీచికి పరుగెత్తుకుంటూ పోయి, చొక్కా చేతులు పైకి మడిచి, చేతులు కడుక్కొని, మంత్రసాని పని చేయడానికి తిరిగి వచ్చినాను.

మంటలో బేర్చ్ తాటలాగ ఆమె విలవిలలాడుతున్నది. ఆమె తన చుట్టూనేలమీద చేతులతో కొట్టుతూ, వాడిపోయిన గడ్డి గంటలు పెరికి, నోట్లో దురుక్కోడానికి ప్రయత్నిస్తున్నది. ఆ ప్రయత్నంలో ఆమె యెరుపెక్కిన పిచ్చికండ్లు గల తన వికృత భయంకరమైన ముఖంమీద మట్టి పోసుకుంది. యింతలో పై పొర పగిలి శిశువు తల

కనిపించింది. నేను ఆమె కాళ్ళు విలవిల తన్నుకోకుండా పట్టుకోవలసివచ్చింది, శిశువు బయటికి రావడానికి తోడ్పడవలసివచ్చింది, యేడ్చే వంకర నోట్లో ఆమె గడ్డి దురుక్కోకుండా చూడవలసివచ్చింది.

మేము ఒకరినొకరం కాస్త తిట్టుకున్నాం– ఆమె పండ్లు, యీలకరిచి తిట్టింది, నేను మెల్లగా తిట్టినాను. ఆమె బాధతోనూ, బహుశా సిగ్గుతోనూ తిట్టింది, నేను దిక్కు తెలియకపోవడంతోనూ, అపారమైన సానుభూతితోనూ తిట్టినాను.

'తండ్రీ!' ఆమె గసపోసుకుంది, నల్లబడిన, నురుగు నిండిన పెదవులు కొరుక్కుంటూ. యెండలో హఠాత్తుగా రంగు వెలిసినట్లున్న ఆమె కన్నుల నుండి నీళ్లు దుమికినాయి, దుర్భరమైన ప్రసూతివేదనలో తల్లి కడవలతో కార్చే కన్నీళ్లు. ఆమె దేహమంతా ముక్కలు ముక్కలుగా చీలుస్తున్నట్లు, బిగుసుకొనిపోయింది.

'పో, వెళ్ళిపో, సైతాన్'

వడ దిరిగిన చేతులతో ఆమె నన్ను తోస్తూ వుండింది. నేను నిండు మనస్సుతో అన్నాను.

'మతి పోగొట్టుకోవద్దు! త్వరగా కానీ, ఐపోతుంది.'

నాకు ఆమెపట్ల యెనలేని పరితాపం కలిగింది, ఆమె కన్నీళ్లు నా కన్నులలోనుండే దుముకుతున్నట్లున్నాయి. ఆవేదనతో నాగుండె వ్రీలిపోయింది. నాకు యేడుపు వచ్చేటట్లుంది. నిజానికి యేడుస్తూ కేకవేసినాను.

'ఊ! కానీ!'

అంతే– నా చేతుల్లో ఒక మానవుడు వున్నాడు– యెర్రని బుల్లి మానవుడు. కన్నీళ్లతో నా కండ్లు మసకలు గమ్మినా, వాణ్ని చూడగలిగినాను– ఒళ్లంతా యెర్రగా, ప్రపంచంపట్ల అప్పుడే అసంతృప్తి చెంది, తన్నుకుంటూ, కొట్టుకుంటూ, గొంతెత్తి అరుస్తున్నాడు, యింకా తల్లికి బంధింపబడివున్నప్పటికీ. వానికి నీలికండ్లు వున్నాయి, నలిగిపోయిన యెర్రని ముఖంమీద తమాషా అయిన చిన్న ముక్కు అణగదోసినట్లుంది, వాడు వేసే కేకలకు పెదవులు కదలుతున్నాయి.

'యా– ఆ–ఆ యా– ఆ–ఆ'

వాడు బంక బంకగా వున్నాడు, నా చేతుల్లోనుండి జారిపోతాడేమో అని నాకు భయమైంది. నేను మోకాళ్ల మీద కూర్చొని వాణ్ని చూస్తూ నవ్వుతున్నాను– వాణ్ని చూడడం అంత సంతోషంగా వుంది నాకు, ఆ సంతోషంలో తరువాత చేయవలసిన పని పూర్తిగా మరిచిపోయినాను.

'తాడు కోసెయ్. ..' తల్లి గుసగుస చెప్పింది. ఆమె కండ్లు మూసుకొనివుంది, ముఖం వాడిపోయి, తెల్లగా వుంది శవంలాగ. నల్లబడిన పెదవులు కదిలీ కదలనట్లుగా ఆమె మళ్లీ అన్నది:

'కోసెయ్. ..కత్తితో. ..!'

నా కత్తి ఆ గుడిసెలో యెవరో దొంగిలించినారు. కనుక బొడ్డు తాడును పండ్లతో కొరికినాను. పసివాడు బూరగ మేళంలాగ అరిచినాడు. తల్లి చిరునవ్వు నవ్వింది. ఆమె కన్నుల చీకటిలోతుల్లో అపూర్వంగా నీలిదీపాలు వెలగడం కనిపించింది నాకు, నల్లబారిన ఆమె చెయి స్కర్టులో జేబు కోసం తారాడింది. కాట్లు పడి రక్తం చిమ్మిన పెదవుల సందున ఆయాసంగా మాటలు వెలువడినాయి:

'నాకు. ..శక్తి లేదు. ..నా జేబులో. ..టేపుముక్క వుంది. ..బొడ్డు. ..ముడెయ్.'

నేనా టేపుముక్క వెదకి పసివాని బొడ్డు ముడివేసినాను. ఆమె మరింత చిక్కగా చిరునవ్వు నవ్వింది, ఆ ముఖంలోని ఆనందమూ, వెలుగూ దాదాపు నా కండ్లకు మిరుమిట్లుగొలిపినాయి.

'నీవు సర్దుకో, యింతలో నేను వీణ్ని తుడుచుకొని వస్తాను.'

ఆమె ఆందోళనతో గుసగుస చెప్పింది.

'జాగ్రత్త. మెల్లగా తుడువు. జాగ్రత్తగా.'

ఆ యెర్రని బుల్లి మానవశకలంతో మెల్లగా వ్యవహరించవలసిన అవసరం లేక పోయింది. వాడు పిడికిళ్లు బిగించి అరవసాగినాడు, నన్ను యుద్ధానికి రమ్మని సవాల్చేస్తున్నట్లు.

'యా–ఆ–ఆ'

'అదీ, అలా వుండాలి! నీ హక్కులు నీవు స్థాపించుకోవాలి భయ్యా. లేకపోతే నీ చుట్టూ వున్న జనం నీ పీక నులిమేస్తారు.'

ఒక అల వచ్చి మా యిద్దరిమీదా యెగిరి పడింది. దాని తుంపురులు తాకినప్పుడు వాడు మరీ బిగ్గరగా, అత్యంత మనస్ఫూర్తిగా కేకలు వేసినాడు. తరువాత, నేను వాని రొమ్మూ, వీపూ తట్టసాగినప్పుడు వాడు కనుబొమలు ముడివేసి, అలలు ఒకటొకటే వానిమీద పొర్లినప్పుడు తన్నుకుంటూ అరవసాగినాడు.

'అరువు భయ్యా, అరువు! దిక్కులు దద్దరిల్లేటట్లు అరువు!'

మేము అతని తల్లివద్దకు చేరుకునేటప్పటికి ఆమె కండ్లు మూసుకొని నేలమీద పండుకొని వుంది. ప్రసవానంతరపు నొప్పులతో ఆమె పెదవులు కొరుక్కుంటూ వుంది. మూల్గుల, నిట్టూర్పుల మధ్య ఆమె నీరసపు గుసగుస వినపడింది:

'పిల్లవాణ్ని. .. యిలా యివ్వు. ..'

'పిల్లవాని కేం తొందరలేదులే.'

'యిలా యివ్వు!'

వణికే చేతులతో ఆమె తారాడుతూ జాకెట్ విప్పుకోసాగింది. ఆమె రొమ్ముమీది బట్టలు తొలగించడంలో నేను తోడ్పడినాను. ఆ రొమ్ము యిరవైమంది పసిబిడ్డలను సాకడానికి తగినంతగా ప్రకృతి తయారుచేసింది. కేకలు వేసే ఆ ఒరేల్ వాస్తవ్యుని నేను ఆమె వెచ్చనిదేహానికి ఆనించినాను. వాడు వెంటనే గ్రహించి, యేడుపు మానినాడు.

'తల్లీ, మేరీమాతా,' మెత్తగా అన్నది ఆమె, వణుకుతూ, సంచిమీద వున్న చింపిరి తలను అటూ యిటూ తిప్పుతూ.

హఠాత్తుగా ఆమె మెల్లగా కేకవేసి, మళ్లీ కండ్లు తెరిచింది, పవిత్రమైన, అనిర్వచనీయ సౌందర్యవిలసితమైన మాతృత్వపు కండ్లు. ఆ నీలికండ్లు పైకి నీలిఆకాశం లోకి చూసినాయి. సంతోషభరమైన, కృతజ్ఞతాభరమైన చిరునవ్వు ఆ కండ్లలో మెరిసి లీనమైపోయింది. బరువుగా చేయి యెత్తి ఆమె శిలువ గుర్తు వేసుకుంది, తనకూ బిడ్డకూ వేసింది.

'భగవంతుని గన్న తల్లి. ..మేరీమాతా. ..'

ఆమె కండ్లు కాంతి తగ్గినాయి, ఆమె చాలా సేపు మౌనంగా వుండిపోయింది, దాదాపు వూపిరి కూడా పీల్చకుండా. తరువాత వ్యవహారధోరణిలో, దృఢమైన కంఠంతో ఆమె అన్నది:

'నా సంచి విప్పు, బాబూ.'

నేను సంచి ముడి విప్పినాను. ఆమె లీలగా చిరునవ్వు నవ్వుతూ, నావైపు నిశ్చలంగా చూసింది. ఆమె గుంత చెక్కిళ్లూ, చెమటపట్టిన నొసలూ యెర్రబారినట్లు తోచింది నాకు.

'ఒక నిముషం పక్కకు పో.'

'శ్రమ పడవద్దు.'

'సరేలే. పక్కకు పో.'

నేను పొదలమాటుకు పోయినాను. నా గుండె అలసిపోయింది, నా రొమ్ములో చిలిపి పక్షులు పాడుతున్నట్లుంది. యిదీ, సముద్రపు నిరంతర మర్మరధ్వనీ యెంతో హాయిగావున్నాయి, ఒక సంవత్సరమంతా అలాగే వింటూ వుండవచ్చుననిపించింది.

దగ్గరలోనే యెక్కడో సెలయేటి గలగల వినిపించింది. ఆడపిల్ల తన ప్రియుణ్ని గురించి చెలికత్తెతో చెప్పుతున్నట్లుంది అది.

పొదలపైన తల లేచింది, పసుపు కర్చీఫ్ మట్టసంగా కట్టుకొని.

'అదేమిటి? యింత తొందరగా లేచినావు?'

ఒక పొద కొమ్మలు పట్టుకొని ఆమె కూర్చుంది. ఆమె ముఖమంతా పాలిపోయింది,

ఆమె ప్రాణమంతా తోడేసినట్లు. కండ్లకు బదులు రెండు పెద్ద నీలిసరస్సులు వున్నాయి అక్కడ. చిరునవ్వు నవ్వుతూ, సుకుమారమైన అనుభూతి నిండిన కంఠంతో ఆమె అన్నది.

'చూడు, యెలా నిద్రపోతున్నాడో.'

వాడు బాగానే నిద్రపోతున్నాడు. కానీ, నాకు తెలిసినంతవరకు, పసిబిడ్డలందరి లాగే. భేదమేమైనా వుంటే పరిసరాలలో వుంది. వాడు తళతళ మెరిసే శరత్కాలపు ఆకులకుప్పమీద, ఒక పొదకింద పండుకున్నాడు, అలాంటి పొదలు ఒరేల్ ప్రాంతంలో పెరగవు.

'నీవు పండుకుంటే మంచిది, అమ్మా,' అన్నాను.

'లేదు,' అన్న దామె నీరసంగా తల ఆడిస్తూ. 'సర్దుకొని బయలుదేరాలి ఆ వూరు– అదేదీ?'

'ఒచెంచీరీ?'

'ఆc. మావాళ్లు యిప్పటికే కొన్ని మైళ్లు ముందు పోయివుంటారు.'

'నడిచి పోతానంటావేమిటి?'

'మేరీమాత లేదూ? ఆమె తోడ్పడుతుంది.'

సరే, మేరీమాత ఆమెకు తోడు వుంది గనుక, నేను నోరు మూసుకున్నాను!

ఆమె ఆ ముడుచుకున్న చిన్నముఖం వైపు నిశ్చలంగా చూసింది, కండ్లలో హార్దికమైన మెత్తని కాంతిపుంజాలు కళకళలాడుతూ. ఆమె పెదవులు నాక్కుంది, చేత్తో మెల్లగా తన రొమ్ము నిమురుకుంది.

నేను ఒక మంట ముట్టించి, చుట్టూ రాళ్లు అమర్చినాను, వాటిమీద కెటిల్ పెట్టడానికి.

'నిముషంలో నీకు కాస్త టీ తయారుచేస్తాను, అమ్మా.'

'ఓ, చెయ్! నా రొమ్ములో అంతా యెండిపోయింది.'

'మీ వాళ్లు నిన్ను యెందుకు వదిలేసినారు?'

'లేదు, వదిలేయలేదు. నేను వెనుకబడిపోయినాను. వాళ్లు కాస్త తాగినారు. .. అది మంచిదే అయింది. వాళ్లు నా వెంటవున్నప్పుడు యిది జరిగివుంటే యెలా వుండేదో.'

ఆమె నా వైపు చూసి, ముఖానికి మోచేయి అడ్డం పెట్టుకుంది. తరువాత రక్తంతో సహా యెంగిలి ఉమ్మేసి, సిగ్గుపడుతూ చిరునవ్వు నవ్వింది.

'యిది మొదటి కాన్పా?'

'ఔను. నీ వెవరు?'

'మనిషిని, యేదో ఒక విధంగా. ..'

'అది కనపడుతున్నదిలే. నీకు పెండ్లైందా?'

'అంత గౌరవం కలగలేదు.'

'బొంకుతున్నావు!'

'లేదు.'

ఆమె రెప్పలు వాల్చింది. తరువాత అన్నది:

'యీ ఆడవాళ్ల పని నీకెలా తెలుసు?'

అప్పుడు బొంకినాను.

'నేర్చుకున్నాను. నేను విద్యార్థిని– అంటే తెలుసా?'

'బాగా తెలుసు. మా గురువుగారి పెద్ద కొడుకు విద్యార్థి. గురువు కావడానికి నేర్చుకుంటున్నాడు.'

'అదే, నేనూ ఒక విద్యార్థిని. పోయి నీళ్లు తెస్తాను.'

ఆమె పసిబిడ్డమీదికి వంగింది, వానికి వూపిరి ఆడుతున్నదో లేదో వినడానికి. తరువాత సముద్రంవైపు చూసింది.

'స్నానం చేస్తే బాగుండు, కానీ యిక్కడి నీళ్లు వింతగా వున్నాయి. యేమి నీళ్లు యివి? ఉప్పగా, చేదుగా వుంటాయి.'

'స్నానం చేసిరా పో– యివి ఆరోగ్యకరమైన నీళ్లు.'

'నిజంగా?'

'ఔను. సెలయేట్లోకంటె వెచ్చగా వున్నాయి కూడా, అవి మంచులాగున్నాయి.'

'నీవు చెప్తే సరే. ..'

ఒక అబ్‌హాజియన్ గుర్రంమీద తూగుతూ, నడక వేగంతో పోతూవుండినాడు, అతని తల రొమ్ముమీదికి వాలి వుంది. ఆ బిగువైన చిన్నగుర్రం, చెవులు అల్లాడిస్తూ, పెద్ద నల్లని కండ్లతో మా వైపు సందేహంతో చూసి సకిలించింది. రౌతు, బొచ్చు టోపీ పెట్టుకున్న తన తల పూకించి యెత్తి, మా దిశగా చూసి, మళ్లీ తల వాల్చినాడు.

'తమాషా అయినవాళ్లు, యిక్కడి మనుషులు, అంత భయంకరంగా కనిపిస్తారు కూడా,' అన్నది ఒరేల్ యువతి మెల్లగా.

నేను నీళ్లు తేవడానికి పోయినాను. సెలయేరు స్వచ్ఛంగా, పాదరసంలాగ రాళ్ల మీదనుండి దుముకుతున్నది. శరత్కాలపు ఆకులు ఉల్లాసంగా నీళ్లలో పల్టీలు కొడుతున్నాయి.

అద్భుతం! నేను చేతులూ, ముఖమూ కడుక్కొని, కెటిల్నిండా నీళ్లు పట్టుకొని, తిరిగిపోయినాను. పొదల సందున ఆమె కనిపించింది, మోకాళ్ల మీద ప్రాకుతూ, ఆందోళనగా వెనక్కిచూస్తూ. 'యేమిటి సంగతి?'

ఆమె ఉలిక్కిపడింది, ముఖం తెల్లబడింది. ఆమె తన శరీరం కింద యేదోదాచి పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. అది యేమయిందీ నేను ఊహించుకున్నాను.

'అది యిలా యివ్వు, పాతిపెడతాను.'

'ఓ! దీన్ని స్నానాలగదిలో పాతిపెట్టాలి, భూమిలో. ..'

'యిక్కడ త్వరలో స్నానాలగది కట్టబోతున్నారా?'

'నీవు హాస్యమాడుతున్నావు, నాకేమో భయంగా వుంది! యే జంతువైనా తినిపోతే యెలా? దీన్ని భూమిలో పాతిపెట్టాలి.'

ఆమె ముఖం పక్కకు తిప్పుకొని, తడిగా వున్న బరువైన మూట నా చేతికిచ్చి, మెల్లగా, సిగ్గు పడుతూ అంది:

'సరిగా చేస్తావు కదూ, లోతుగా? యేసుక్రీస్తు కోసమని. ..యీ పసివాని కోసమని, సరిగా చెయ్, నీకు పుణ్యముంటుంది. ..'

నేను తిరిగి వచ్చేటప్పటికి ఆమె బీచినుంచి వస్తున్నది, తడబడే అడుగులతో, చేయి పారజాపుకొని. ఆమె స్కర్టు నడుముదాకా తడిసింది, ముఖం కొద్దిగా యెర్ర బారింది, లోపలి కాంతితో వెలుగుతున్నట్లు. నేను ఆమెను మంట దగ్గరికి తీసుకువచ్చి, ఆశ్చర్యంతో అనుకున్నాను:

'యేమి శరీరబలం!'

తరువాత మేము తేనెతో టీ తాగినాం. ఆమె మెల్లగా అన్నది:

'అయితే చదువు మానేసినావన్నమాట?'

'ఔను.'

'తాగుడు– కదూ?'

'ఔను. తాగుడుతో నాశనమైనానమ్మా!'

'సిగ్గు చేటు! యిలా చూడు, నీవు సుహూంలో తిండిని గురించి మేనేజర్‌తో రగడ పెట్టుకున్నప్పుడు నిన్ను చూసినాను. అప్పుడనుకున్నాను. యితను తాగుబోతై వుండాలి, యెవరన్నా యితనికి భయం లేదు.'

ఆమె తన వాచిన పెదవులమీది తేనె నాక్కుంది. సరికొత్త ఒరేల్ మనిషి ప్రశాంతంగా నిద్రిస్తున్న పొదవైపు ఆమె తన నీలికన్నులు తిప్పుతూనే వుంది.

'వీడు యెలా బతుకుతాడో?' అన్నది ఆమె నిట్టూరుస్తూ, నావైపు పరిశీలనగా చూస్తూ. 'నీవు మంచి సాయం చేసినావు– కృతజ్ఞురాలిని. కానీ వీనికిది మంచిదేనా, యేమో. ..'

తినడం, తాగడం అయిన తర్వాత ఆమె సిలువ గుర్తు వేసుకుంది. నేను నా సంసారం సర్దుకుంటూ వుండగా ఆమె మత్తుగా వూగుతూ కూర్చుంది, మళ్ళీ రంగు వెలిసినట్లున్న కన్నులతో నేలకేసి నిలజూస్తూ. తరువాత ఆమె లేచి నిలబడింది.

'నిజంగా బయలుదేరుతున్నావా?' అన్నాను.

'ఔను'

'నడిచే శక్తి వుందంటావా?'

'మేరీమాత లేదూ? వాణ్ని యిలా యివ్వు!'

'వీణ్ని నేను తెస్తాను.'

కొంత వాదులాట తర్వాత ఆమె లొంగింది. మేము బయలుదేరినాం, పక్కపక్కన, భుజం భుజం రాచుకుంటూ. 'తొట్రుకొనిపడనుగదా,' అన్నదామె, క్షమార్పణగా చిరునవ్వు నవ్వుతూ, నా భుజంమీద చెయ్యి పెట్టి.

రష్యాదేశపు కొత్త పౌరుడు, అజ్ఞాత భవితవ్యం గల మానవుడు, నా చేతుల్లో పండుకొని వున్నాడు, ముక్కుతో పెద్దవాళ్ల చప్పుళ్లు చేస్తూ, సముద్రం, తెల్లని తోపడా పొట్టుతో నగిషీ చేయబడి, ఒడ్డుకు కొట్టుకుంటూ, మర్మరిస్తున్నది పొదలు ఒక దానితో ఒకటి గుసగుసలాడుతున్నాయి, సూర్యుడు మధ్యాహ్నరేఖమీద ప్రకాశిస్తున్నాడు.

మేము మెల్లగా నడుస్తూ పోయినాం, తల్లి అప్పుడప్పుడూ నిలబడి దీర్ఘంగా నిట్టూరుస్తూ, తల వెనక్కి యెగిరేస్తూ, సముద్రంవైపూ, అడవులవైపూ, పర్వతాలవైపూ నిలజూస్తూ, తరువాత తన కొడుకు ముఖంలోకి తొంగిచూస్తూ. ఆమె కండ్లు వేదనాశ్రు వులచేత క్షాళితమై మళ్లీ ఆశ్చర్యకరమైనంత స్వచ్ఛంగా వున్నాయి, అనంత ప్రేమజ్యోతి యొక్క నీలికాంతితో వెలిగిపోతూ.

ఒకసారి ఆమె నిలబడి అన్నది: "తండ్రీ, భగవంతుడా! యెంత అద్భుతంగా వుంది! నేను యిలాగే పోగలను, ప్రపంచం చివరకు యిలాగే యిలాగే, వీనితో, యీ నా పసివాడు పెరుగుతూ, తల్లిరొమ్మున స్వేచ్ఛగా పెరుగుతూ, నా ముద్దుల చిన్నారిబాబు.'

సముద్రం మర్మరిస్తూనే వుంది.

◆

12

నలభయ్యేళ్ళ కిందట చదివిన కథల్లో నన్ను అంటిపెట్టుకున్నవేమిటని ఆలోచిస్తూ ఉంటే, రెండు రకాల కథలు కనిపిస్తున్నాయి. ఒకటి: గొప్ప భావుకులూ, కవులూ, స్వాప్నికులూ– టాగోరూ, విభూతిభూషణ్‌లాంటి వాళ్ళు–రాసినవి. మరొక తరహా కథలు– సామాజిక న్యాయంకోసం తపించిన ప్రేమ్‌చంద్, గోర్కీ, లూ–సన్, ఓ హెన్రీ లాంటి వాళ్ళు– రాసిన కథలు.

ఆధునిక చీనా సాహిత్య వైతాళికుడు లూ–సన్ (1881-1936) రాసిన కథలు అప్పటికే తెలుగులోకి రాకపోలేదు. నిర్మలానంద వంటి అభ్యుదయవాది చేసిన అనువాదం కూడా నేను చదవకపోలేదు. కాని లూ–సన్ కథల సంపుటాలు Wild Grass (1975), Dawn Blossoms Plucked at Dusk (1976) ఆ రోజుల్లోనే నా చేతుల్లోకి ఎలానో వచ్చాయి. వాటిల్లో ఒక కథ, మనుష్యకుమారుడి గురించీ, దైవకుమారుడి గురించీ లూ–సన్ రాసింది చదివాను. ఆ కథ నా రక్తంలోకీ ఇంకి పోయింది.

ఆ తర్వాత రోజుల్లో, పదిపదిహేనేళ్ళ కిందట, లూ–సన్ కథలు దాదాపుగా మొత్తం చదివేను. ముఖ్యంగా, చీనా ఫారిను లాంగ్వేజెస్ ప్రెస్సు ప్రచురించిన Se-

lected Stories of Lu Hsun (1960), పెంగ్విన్ సంస్థ ప్రచురించిన The Real Story of Ah-Q and Other Tales of China: The Complete Fiction of Lu Xun (2009) నా చేతుల్లోకి వచ్చాక ఆ కథలు సాకల్యంగా చదివేక లూ-సన్‌ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోగలిగేను.

కానీ ఈ రోజు లూ-సన్ అనగానే నాకు గుర్తొస్తున్నది, నలభయ్యేళ్ళ కిందట, రాజమండ్రిలో చదివిన, ఆ దైవకుమారుడి కథనే. Wild Grass లోని Revenge II (1924). ఆ కథని నేను చదివిందే ఇంగ్లిషులో కాబట్టి, ఇప్పుడు మీకోసం నేనే తెలుగు చేయక తప్పింది కాదు.



నిజానికి ఇది కథకీ, వచనకవితకీ మధ్యస్థంగా ఉన్న రూపం. నిజానికి కథలో ఇస్రాయేలీలులు తాము ఆ మనిషి దైవకుమారుడని నమ్మినందు వల్ల శిలువవేయలేదు. నిరపరాధి అయిన ఒక మనుష్యకుమారుడు తనలోని దైవత్వాన్ని గుర్తు పట్టాడన్న అసహనంతోనే ఆయన్ని శిలువ వేసారు. దైవకుమారుణ్ణి శిలువ వెయ్యడంలోని ఘాతుకం కన్నా కూడా ముందు మనుషులు తమ లాంటి మరొక మనుష్యకుమారుణ్ణి శిలువ వెయ్యడంలోని ఘాతుకాన్ని ఇక్కడ కథకుడు మనకు గుర్తుచేస్తున్నాడు. కాబట్టి, ఇప్పుడు, గాజాలో జరుగుతున్న నరమేధం నేపథ్యంలో ఈ కథ మరోసారి కొత్తగా కనిపిస్తూ నన్ను మరింత ఆశ్చర్యపరుస్తున్నది.

లూ-సన్

ప్రతీకారం

వాడ్రేవు చినవీరభద్రుడు

ఇస్రాయేలీల రాజు తనని తాను దైవకుమారుడిగా భావిస్తున్నాడు కాబట్టి ఆయన్ని శిలువ వెయ్యక తప్పదు.

సైనికులు ఆయనతో ఒక ఊదారంగు అంగీ తొడిగించారు. నెత్తిన ముళ్ళకిరీటం పెట్టి ఆయన్ని చిరునవ్వమన్నారు. అప్పుడు వాళ్ళు ఆయన్ని పేముబెత్తంతో బాది, మీద కసిదీరా ఊసి, ఆయన ముందు తాము మోకరిల్లారు. ఆయన్నట్లా హేళనచేసినంత సేపు చేసాక ఆ ఊదారంగు అంగీ చించేసి అప్పుడు మళ్ళా ఆయన్ని తన మొదటి గుడ్డలే తొడుక్కోమన్నారు.

చూడండి వాళ్ళాయన్ని ఎట్లా చితకబాదారో, ఆయన ముఖం మీద ఎట్లా ఊసారో ఆయన ముందెట్లా మోకరిల్లారో. ..

కాని ఆయన సుగంధభరిత పానీయం స్వీకరించబోవడం లేదు. ఇస్రాయేలీలు తమ దైవకుమారుడిపట్ల చూపిస్తున్న ప్రవర్తన పట్ల కించిత్తు కూడా చలించకుండా ఉండాలనుకున్నాడు. వాళ్ళ భవిష్యత్తును చూసి జాలీ, వారి ప్రస్తుతాన్ని చూసి ఏవగింపూ కలిగేయి ఆయనకి.

చుట్టూ ఎటు చూసినా ద్వేషం, దయనీయం, అభిశప్తం.

ఇంతలో సుత్తుల చప్పుళ్ళు వినవచ్చాయి. ఆయన అరచేతుల్లోకి మేకులు దిగుతున్నాయి. కాని ఈ దురదృష్టకరమానవులు తమ దైవకుమారుణ్ణి శిలువ వేస్తున్నారన్న వాస్తవం ఆయన బాధను ఉపశమింపచేస్తూ ఉంది. సుత్తుల చప్పుళ్ళు వినవస్తున్నాయి, మేకులు ఆయన అరికాళ్ళని చీల్చుకుపోతున్నప్పుడు ఎముకలు విరుగుతున్న నొప్పి ఆయన హృదయంలో, ఎముకల మజ్జలోకీ చొచ్చుకుపోయింది. కాని ఈ శాపగ్రస్త–మానవులు తమ దైవకుమారుణ్ణి శిలువ వేస్తున్నారన్న వాస్తవం ఆయన బాధను అణచి–వేస్తూ ఉన్నది.

ఇప్పుడు శిలువ నిటారుగా పైకెత్తారు. ఆయన గాల్లో వేలాడుతున్నాడు.

పరిమళభరిత పానీయాలేమీ ఆయన ఆస్వాదించలేదు. ఇస్రాయేలీలు తమ దైవ కుమారుడితో ఏ విధంగా మసలుకుంటున్నారో చూస్తూ కూడా నిబ్బరంగా ఉండటానికి ప్రయత్నించాడు. వాళ్ళ భవిష్యత్తుని తలుచుకుని జాలీ, వాళ్ళ వర్తమానాన్ని చూసి అసహ్యామూ కలిగేయి ఆయనకి.

దారినపోయేవాళ్ళందరూ ఆయన్ని తూలనాడేరు, శపించేరు, ప్రధాన పురోహితుడూ, లేఖకులూ ఆయన్ని అవహేళన చేసారు, ఆయన పక్కనే శిలువకెక్కిన ఇద్దరు దొంగలు కూడా ఆయన్ని పరిహసించారు.

ఆయనతో పాటు శిలువకు గురైనవాళ్ళు కూడా . ..

చుట్టూ ఎటు చూసినా ద్వేషం, దయనీయం, అభిశప్తం.

తన అరచేతుల్లో, అరికాళ్ళల్లో పొడుచుకొస్తున్న బాధలో ఆయన, దైవకుమారుడు మరణించబోతున్నాడని తెలిసి కూడా దైవకుమారుణ్ణి శిలువ వేస్తున్న ఆ అభిశప్తుల సంతోషాన్ని చూసి, తన విషాదాన్ని దిగమింగుకుంటున్నాడు. విరిగిన ఎముకల్లోంచి హటాత్తుగా భరించలేని నొప్పి ఆయన హృదయంలోంచీ, ఎముకల మూలుగలోంచీ పొంగుకొచ్చి ఆయన్ని తన్మయత్వంలోనూ, పరితాపంలోనూ ముంచెత్తివేసింది.

అపారమైన అనుతాపంతోనూ, పట్టలేని ఏహ్యతతోనూ ఆయన పొట్ట ఉబ్బిపోతూ, నొక్కుకుపోతూ ఉంది.

భూమ్మీద ఎటు చూసినా అంధకారం.

'ఏలోయి, ఏలోయి, లామా సబ్బాచేతాని?' (నా దేవా, నా దేవా, నా చేతిని ఎందుకు విడిచావు?)

భగవంతుడు ఆయన చేతిని విడిచిపెట్టాడు. చివరికి అతడు మనుష్యకుమారుడిగానే మిగిలాడు. కానీ ఇస్రాయేలీలు చివరికి మనుష్యకుమారుణ్ణి కూడా శిలువ వేస్తున్నారు.

నెత్తుటితోటీ మురికితోటీ కంపుకొట్టేవాళ్ళెవరంటే, దైవకుమారుణ్ణి శిలువవేసే వాళ్ళు కాదు, చివరికి మనుష్యకుమారుణ్ణి కూడా శిలువవేసే వాళ్ళే.

◆

ఆ బస్తానిండా ఉప్పురాళ్ళ ముద్దలు.

13

ఆధునిక భారతీయ రచయితల్లో ప్రేమ్‌చంద్ అగ్రేసరుల పంక్తిలో మరీ అగ్రేసరుడిగా నిలబడే రచయిత. ఆయన రచనలన్నీ దాదాపుగా తెలుగులోకి అనువాదమయ్యాయి. దాదాపు ప్రతి గ్రంథాలయంలోనూ ఆయన పుస్తకాలు ఒకటో రెండో చేతికందుతూనే ఉంటాయి. నిజానికి భారతదేశంలో ప్రగతివాద సాహిత్యం మొదటి అడుగు వేసింది ఆయన అధ్యక్షతనే.

కాని ఎందుకనో, తెలుగు సాహిత్యచర్చల్లో, ప్రేమ్‌చంద్ పేరు వినబడదు. ఈ పది పదిహేనేళ్ళుగా ఫేస్ బుక్కు మాధ్యమంలో, ఆయన రచనల గురించీ ఎవరూ రాయగా, కొత్తగా ఏదన్నా మాట్లాడగా వినలేదు, చదవలేదు. పెంగ్విన్ బుక్సు వారు Premchand, the Complete Short Stories (2017) నాలుగు సంపుటాలు తెచ్చి ఏడెనిమిదేళ్ళు కావొస్తున్నప్పటికీ, కనీసం ఆ పుస్తకాల అట్టలు కూడా నేను ఈ మధ్యకాలంలో ఏ తెలుగు మీడియాలోగాని, సోషలు మీడియాలోగాని, ఎవరూ పంచుకోగా చూడలేదు.

ఇందుకు కారణాలేవై ఉండవచ్చు అని ప్రశ్నించుకుంటే, నాకు కనిపిస్తున్న సమాధానం ఒక్కటే. ప్రేమ్‌చంద్ రచనలు మన ఉద్రేకాల్ని ఉద్రేకించవు. అవి మనలోని సాత్త్విక మానవుణ్ణి సున్నితంగా తట్టిలేపుతాయి. మనిషిని బాధిస్తున్న, నిర్బంధిస్తున్న, అణచివేస్తున్న శక్తుల్ని గుర్తుపట్టడంలో ఆయనకన్నా మించిన realist ఇప్పటిదాకా భారతీయ భాషల్లో

మరొక రచయిత పుట్టలేదు. కాని అతడు ఆ శక్తుల్ని తన అపారమైన ఆదర్శదృక్పథంతో నిలవరించడానికి ప్రయత్నిస్తాడు. మనం రాజకీయాల్లో భరించలేని ఈ గాంధేయ వైఖరిని సాహిత్యంలో మాత్రం ఎలా భరించగలుగుతాం? అందుకనే ఆయన పట్ల మౌనం వహిస్తాం. మన జీవితంలో, సమాజంలో ఆదర్శదృక్పథం కనుమరుగవుతున్నకొద్దీ ప్రేమ్‌చంద్‌ని తలుచుకోవడం కూడా కనుమరుగవుతున్నది.

ఉదాహరణకి ఈ 'సాల్టు యినస్పెక్టరు' (నమక్ కా దరోగా, 1907) కథనే చూడండి. నేను ప్రభుత్వోద్యోగంలో చేరకముందు చదివిన కథ ఇది. ఒక సంపన్నుడు తన సమస్తశక్తుల్తో, చాకచక్యంతో, స్తుతి పాఠాలతో ప్రలోభపరుస్తున్నప్పటికీ, నిశ్చలంగా నిలబడ్డ ఆ యువప్రభుత్వ సేవకుడే నా హృదయంలో స్థిరపడిపోయాడు. మూడున్నర దశాబ్దాల నా ఉద్యోగ జీవితంలో ఆ యువకుడు ఎన్నిసార్లు నాకు గుర్తొస్తూనే ఉన్నాడో చెప్పలేను.



ఉప్పు సత్యాగ్రహం కన్నా పాతికేళ్ల ముందే వచ్చిన ఈ కథ వలసకాలపు పాలనా వ్యవస్థ పైన ఒక రచయిత ప్రకటించిన అసమ్మతి. ఒక శతాబ్దం పైనే గడిచిన తర్వాత కూడా ఈ కథ పాతబడక పోగా, మరింత ప్రాసంగికంగా కనిపిస్తున్నది.

నన్ను వెన్నాడే కథల్లో ముందు ఈ కథనే పరిచయం చేద్దామనుకున్నాను. కాని నేను ఏ తెలుగు అనువాదంలో చదివానో, ఆ పుస్తకం నాకు ఎంత గాలించినా దొరకలేదు. అందుకని ఈ కథ నేనే అనువదించక తప్పింది కాదు.

మున్షీ ప్రేమ్‌చంద్

సాల్టు యినస్పెక్టరు

వాడ్రేవు చినవీరభద్రుడు

దేవుడు పుష్కళంగానూ, ఉచితంగానూ ఇస్తున్న ఉప్పుకంటూ ఒక శాఖని ఏర్పాటు చేయగానే ప్రజలు ఉప్పుని ఉచితంగా వాడటం నిషేధమైపోయింది. దాంతో ప్రజలు రహస్యంగా ఉప్పు కొనడం, అమ్మడం మొదలుపెట్టారు. మోసమూ, కుయుక్తీ, కుతంత్రాలూ స్వాభావికమైపోయాయి. పట్వారీపనిలాంటి మర్యాదా, మన్ననా ఉన్న ఉద్యోగాలు వదులుకోడానికి కూడా కొందరు సిద్ధపడ్డారు. చివరికి లాయర్లు కూడా ఈ ఉద్యోగాన్ని చూసి అసూయపడ్డారు. ఇంగ్లిషు విద్యా, క్రైస్తవ మతమూ పర్యాయ-పదాలుగా చలామణి అయిన రోజులవి. పారశీకంలో ఏ మాత్రం పరిజ్ఞానం ఉన్నా గర్వకారణంగా భావించిన కాలం అది. పారశీక ప్రేమకావ్యాలు చదవి సంతోషించ-గలిగేవాళ్ళు సులువుగా ఉన్నతస్థానాల్లో కుదురుకోగలిగేవారు.

మున్షి వంశీధరుడు జులేఖా కథా, మజ్నూ, ఫర్హాదుల ప్రేమకథ చదివి ఉన్నాడు. అమెరికా ఖండాన్ని కనుగొనడంకన్నా, నైలునది యుద్ధం కన్నా కూడా ఆ ప్రేమకథని మరింత ముఖ్యంగా భావిస్తూ ఉద్యోగాన్వేషణ మొదలుపెట్టాడు.

అతడి తండ్రి లోకం చూసిన వాడు. అతడు తన కొడుక్కి సలహా చెప్పాడు: 'నాన్నా, మన పరిస్థితి నీకు తెలుసు. మనం అప్పుల్లో పీకలదాకా కూరుకుపోయి ఉన్నాం. నీ అక్కచెల్లెళ్ళా శరవేగంగా ఎదుగుతున్నారు. నేనా ముసలివాణ్ణైపోయాను.

ఈ లోకం నుంచి ఎప్పుడు వెళ్ళిపోతానో నాకే తెలీదు. ఇప్పుడు నువ్వే ఈ యింటికి పెద్దదిక్కు కింద లెక్క. ఉద్యోగం వెతుక్కునేప్పుడు దాని హెూదా ఏమిటి, నెలకి జీతం ఎంతొస్తుంది లాంటివి చూడకు. ఉద్యోగమంటేనే ఒక పూజామందిరం లాంటిది. అక్కడ నైవేద్యాలూ, కానుకలూ ఏ మాత్రం రాగలవన్నదే నువ్వు చూసుకోవాలి. కాబట్టి జీతాన్ని మించి ఆదాయం రాగల ఉద్యోగం కోసం వెతుక్కో. నెలజీతం పున్నమి చంద్రుడిలాంటిది. ఒకరోజు బాగా కనిపిస్తుంది. మర్నాటినుంచీ సన్నగిల్లడం మొదలుపెట్టి, చివరికి అదృశ్యమైపోతుంది. కాని పైసంపాదన అలా కాదు. అది ఎప్పుడూ ఎడతెగక పారే ఏరులాంటిది. ఎప్పటికప్పుడు నీ దప్పిక తీర్చడానికి సిద్ధంగా ఉంటుంది. నెలజీతం మనుషులు పంచేది, కాబట్టి, దానిలో ఎదుగుబొదుగూ ఉండవు. పైసంపాదన ఒక దైవానుగ్రహం, కాబట్టి దానికి తరుగుండదు. నువ్వు చదువుకున్నవాడివి. నీకు ఇంతకన్నా వివరించి చెప్పాల్సిన పనిలేదు. అదంతా నీ మనస్సాక్షి మీదా, మంచిచెడ్డల విచక్షణమీదా ఆధారపడి ఉంటుంది. మనుషుల్ని చూడు, వాళ్ళ అవసరాల్ని గమనించు. అప్పుడు సరైన సమయంకోసం ఎదురుచూసి, ఆ క్షణం రాగానే సరైన నిర్ణయం తీసుకో. నీ సహాయం కావలసిన మనిషిపట్ల నువ్వు కనికరం చూపించవలసిన పనిలేదు. కానీ నీతో పని పడని మనిషితో ఎలా నడుచుకోవాలన్నది అంత తేలికైన విషయం కాదు. నా మాటలు గుర్తుపెట్టుకో. వాటిల్లో ఒక జీవితకాలపు అనుభవం ఉంది. ..'

ఈ మాటలు చెప్పి వంశీధరుడి తండ్రి అతణ్ణి పరిపూర్ణంగా ఆశీర్వదించాడు. విధేయుడైన కొడుకులానే అతడు కూడా తన తండ్రిమాటలు శ్రద్ధగా ఆలకించాడు. అప్పుడు తన అదృష్టం వెతుక్కుంటూ, సహనం తోడుగా, సాహసం బలంగా, పట్టుదల మార్గదర్శకురాలిగా విశాలప్రపంచంలో అడుగుపెట్టాడు. అతడు బయలుదేరిన వేళా విశేషం మంచిది కావడంతో అతడికి ఉప్పుశాఖలో ఉద్యోగం దొరికింది. జీతం తగ్గట్టే ఉంది. పై సంపాదనకు పరిమితి లేదు. ఈ శుభవార్త తెలియగానే వృద్ధమున్షీ ఆనందం పట్టలేకపోయాడు. ఇప్పుడు కిరాణాదుకాణం వాడికి వాళ్ళపట్ల నమ్మకం కుదిరింది. అప్పులవాళ్ళు మెత్తబడ్డారు. ఇరుగూపొరుగూ అసూయాగ్రస్తులయ్యారు.

2

శీతాకాలపు రాత్రి. పోలీసు కానిస్టేబుళ్ళూ, పహరావాళ్ళూ చిత్తుగా తాగిపడివున్నారు. వంశీధరుడు ఇక్కడ పనిచేయడం మొదలుపెట్టి ఆరునెలలే అయ్యింది. ఈ కొద్దికాలంలోనే

అతడు తన విధి నిర్వహణవల్లా, నిజాయితీ వల్లా పై అధికారుల విశ్వాసాన్ని చూరగొన్నాడు, కొంతమంది ప్రజల అయిష్టాన్ని కూడా మూటగట్టుకున్నాడు. ఉప్పుశాఖ కార్యాలయానికి తూర్పుదిక్కున సుమారు మైలు దూరంలో యమున ప్రవహిస్తూ ఉంది. దానిమీద ఒక పడవలవంతెన కూడా ఉంది. యినస్పెక్టరు తన శిబిరంలో ప్రశాంతంగా నిద్రపోతూ ఉన్నాడు. అతడు అకస్మాత్తుగా కళ్లు తెరిచి చూసేటప్పటికి నదీప్రవాహపు సంగీతానికి బదులు బండ్ల చప్పుడూ, పడవవాళ్ళ అరుపులూ వినబడు-తున్నాయి. అతడు లేచి కూచున్నాడు. ఇంత నట్టనడిరాత్రి పడవలకి నదిదాటవలసిన అగత్యం ఏమొచ్చుంటుందని ఆలోచించాడు. అందులో ఏదో తేడాలేకపోతే అవి చీకట్లో ఎందుకు ప్రయాణమవుతున్నట్టు? అతడు యూనిఫాము తొడుక్కున్నాడు. పిస్టలు జేబులో పెట్టుకున్నాడు. గుర్రం ఎక్కి నదివైపు బయలుదేరాడు. పొడుగ్గా ఒక బండ్ల వరస వంతెనదాటుతూ కనిపించింది.

అతడు ఉరుములాగా గర్జించాడు: 'ఎవరి బండ్లవి?'

క్షణకాలం నిశ్శబ్దం రాజ్యం చేసింది.

కొంతసేపు లోగొంతులో గుసగుసలునడిచాక అందరికన్నా ముందున్న బండివాడు జవాబిచ్చాడు: 'ఇవి పండిత అలోపీదీనువి.'

'ఎక్కడి పండిత అలోపీదీను?'

'దాతాగంజు వాస్తవ్యుడు.'

మున్షీ వంశీధరుడు క్షణకాలం మౌనంగా ఉండిపోయాడు. అలోపీదీను ఆ ప్రాంతంలో సుసంపన్నుడైన, సువిఖ్యాతుడైన జమీందారు. లక్షల రూపాయల మేరకు ప్రామిసరీనోట్లతో వ్యాపారం చేస్తాడు. అదికాక, ధాన్యం వ్యాపారం కూడా ఉంది. ఆ ప్రాంతంలో చాలా పలుకుబడి కలిగినవాడు. ఆ ప్రాంతంలో వేటాడానికొచ్చే ఇంగ్లిషు అధికారులూ, మాజిస్ట్రేటులూ అతడి ఆతిథ్యం స్వీకరిస్తూ ఉంటారు. ఏడాది పొడుగునా అతడి ఇంటిదగ్గర సంతర్పణ నడుస్తూనే ఉంటుంది.

ఆ బండ్లు ఎక్కడికి పోతున్నాయంటే కాన్పూరుకి అని చెప్పారు వాళ్ళు వంశీధరుడికి. కాని ఆ బండ్లల్లో ఉన్న సరుకేమిటని అడిగితే మాత్రం జవాబు లేదు. యినస్పెక్టరుకి అనుమానం బలపడింది.

అతడు గద్దించి మరీ అడిగాడు ‘ఏం నోట్లో మాటపడిపోయిందా మీకు? చెప్పండి, బండ్లల్లో ఉన్న సరుకేమిటి?’

అయినా కూడా జవాబు రాకపోవడంతో అతడు తనే గుర్రం మీద ఒక బండిదగ్గరకి వెళ్ళి ఆ బండిలో ఉన్న ఒక బస్తా పరీక్షించి చూసాడు. అతడి అనుమానాలు నిజమయ్యాయి. ఆ బస్తానిండా ఉప్పురాళ్ళ ముద్దలు.

3

పండిత అలోపిదీన్ తన అందమైన రథంలో సగం నిద్రలో, సగం మెలకువగా ప్రయాణిస్తూ ఉన్నాడు.

భయంతో బెంబేలెత్తిన బండ్లవాళ్ళు చాలామంది వచ్చి అతణ్ణి నిద్రలేపి ‘మహారాజా, యినస్పెక్టరు మన బండ్లు ఆపేసాడు. నది ఒడ్డున నిలబడి మిమ్మల్ని రమ్మంటున్నాడు’ అని చెప్పారు.

లక్ష్మీదేవి చేతుల్లో ఉన్న అపారమైన శక్తిగురించి అలోపిదీనుకి అనుభవపూర్వకంగా తెలుసు. డబ్బుకి స్వర్గలోకంలో కూడా పలుకుబడి ఉందంటూ ఉంటాడు. అతడి అభిప్రాయం నిజమే. సత్యం, న్యాయం లక్ష్మీదేవి చేతుల్లో కీలుబొమ్మల్లాంటివి, వాటిని కోరుకున్నట్టు ఆడించొచ్చు.

అతడు తన రథంలో సుఖంగా వాలిఉన్నవాడు కించిత్తు కూడా చలించకుండా ‘మీరు పదండి. నేను వస్తున్నాను’ అన్నాడు.

తీరిగ్గా ఒక కిళ్ళీతీసుకుని బుగ్గన పెట్టుకున్నాడు.

అప్పుడు తన వంటిమీదున్న బొంత పక్కన పడేసి లేచి యినస్పెక్టరు దగ్గరకొచ్చి, యాథాలాపంగా, ‘బాబూజీ, మీకు నా ప్రణామాలు. నేనేమి అపరాధం చేసానని నా బండ్లన్నీ ఇలా ఆపేసారు? మాలాంటి బ్రాహ్మల పట్ల మీరొకింత గౌరవం చూపించి ఉండాల్సింది’ అని అన్నాడు.

వంశీధరుడు అలోపిదీనుని గుర్తుపట్టాడు. ‘ప్రభుత్వ ఉత్తర్వులు’ అన్నాడు ఒక్కముక్కలో.

అలోపిదీను నవ్వేసి అన్నాడు కదా 'నాకు ప్రభుత్వమంటే ఏమిటో, ఆ ఉత్తర్వు లేమిటో తెలీదు. నా వరకు నాకు మీరే ప్రభుత్వం. మన మధ్య ఇదొక కుటుంబ వ్యవహారం లాంటిది. మీరు నేనూ పరాయివాళ్ళమా? మీరు అనవసరంగా శ్రమపడ్డారు. ఈ రేవుదగ్గర వెలసిన దేవుడికి నైవేద్యాలు సమర్పించుకోకుండా ఈదారిన ఎలా పోగలను? స్వయంగా నేనే మీదగ్గరికి రాబోతున్నాను కదా.'

సంపన్నుడైన ఆ జమీందారు చేసిన ఈ స్తోత్రపాఠాలు వంశీధరుడి మీద ఎటువంటి ప్రభావాన్నీ చూపించలేకపోయాయి. 'అణాకానీకోసం ఆత్మనమ్ముకునే దుర్మార్గుల్లో ఒకణ్ణి కాను నేను. ఈ క్షణాన్నే మిమ్మల్ని అరెస్టుచేస్తున్నాను. తెల్లవారగానే మీకు జరిమానా విధిస్తాను. ఇంతకన్నా చెప్పేదేమీ లేదు. జమేదారు బద్ధూసింగ్, ఈయన్ని అదుపులోకి తీసుకో. ఇది నా ఆజ్ఞ' అని అన్నాడు.

ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. పండిత అలోపిదీనూ, ఆయన దగ్గరి మనుషులూ, బండివాళ్ళూ అంతా నిర్ఘాంతపోయారు. ఇటువంటి అప్రియమైన మాటలు వినవలసి రావడం పండిట్జీకి తన జీవితకాలంలో బహుశా ఇదే మొదటిసారి. బద్ధూ-సింగు అడుగుముందుకేసాడుగానీ అతణ్ణి పట్టుకోడానికి సాహసించలేకపోయాడు. నీతిసూత్రాల్ని నమ్ముకుని, సంపదపట్ల అంత తృణీకారం చూపించగల ఒక అధికారిని, అలోపిదీను ఇప్పటిదాకా చూసి ఉండలేదు. అతడు కలవరపడిపోయాడు.

'అతడు ఇంకా లేతగా ఉన్నాడు' అనుకున్నాడు పండిట్జీ. 'డబ్బు ఎటువంటి సుఖసంతోషాల్ని తేగలదో అతడింకా తెలుసుకోవలసే ఉంది. బహుశా నోరు తెరిచి అడగడానికి మొహమాటపడుతూ ఉండవచ్చు. కొద్దిగా లాలించాలి, బుజ్జగించాలి.'

అతడు వినయంగా 'బాబూ సాబ్, నాపట్ల మరీ అంత ఆగ్రహం చూపించకండి. నా పరువుప్రతిష్ఠలు భంగపడతాయి. నేను సర్వనాశనమైపోతాను. అదీకాక, ఇంతాచేసి మీరు బావుకునేదేమిటి? బహుశా మీకేమన్నా అవార్డులు రావొచ్చు. కాని మేము మీకు శత్రువులం కాదుకదా. ..'

'మీరేం చెప్పదలుచుకున్నా వినడానికి సిద్ధంగా లేను' అన్నాడు వంశీధర్ ఆ సంభాషణ తుంచేస్తూ.

అంతవరకూ తనకేమీకాదన్న భరోసాతో నిలబడ్డ అలోపిదీనుకి కాళ్ళ కింద నేల జారిపోతున్నట్టుగా అనిపించింది. అతడి ఆత్మవిశ్వాసానికీ, ఐశ్వర్యమదానికీ దెబ్బ

తగిలింది. అయినా డబ్బుకుండే మహిమ పట్ల అతడు తన విశ్వాసాన్ని పట్టుకుని ఇంకా వేలాడుతూనే ఉన్నాడు. తన మానేజరువైపు తిరిగి 'లాలాజీ, బాబుగారికి వెయ్యి రూపాయలు సమర్పించు. ఇప్పుడాయన ఆకలిగొన్న సింహంలాగా ఉన్నారు' అన్నాడు.

వంశీధరుడి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 'వెయ్యి రూపాయలు కాదు సరికదా లక్షరూపాయలైనా నా విధ్యుక్తధర్మం నుంచి నన్ను పక్కకు తప్పించలేవు' అన్నాడు.

నిజాయితీ చూపిస్తున్న ఆత్మనిర్భరత్వపు ఈ మూర్రపదర్శన చూసి ఐశ్వర్యదేవతకి కోపమొచ్చింది. సిరిసంపదలకీ, నీతినిజాయితీలకీ మధ్య పూర్తిబలప్రదర్శన మొదలయ్యింది. అయినా డీలా పడిపోకుండా సంపద ఒకదానివెనక ఒకటిగా తన ప్రయత్నాలు చేస్తూనే ఉండింది– వెయ్యి రూపాయలనుంచి అయిదువేల రూపాయలకు, అయిదు నుంచి పది, పదినుంచి పదిహేను, చివరికి ఇరవైవేలదాకా పలికింది. కానీ విధినిర్వహణ మాత్రం తనమీద పడుతున్న ఈ చావుదెబ్బలకి కూలిపోకుండా, మొక్కవోని ధైర్యంతో ఒక పర్వతంలాగా ఎదురొడ్డి నిలబడింది.

ఇక చివరికి పట్టలేని నిస్పృహతో 'ఇంతకుమించి నేను చెయ్యగలిగిందేమీ లేదు, ఇంక మీ యిష్టం' అని అన్నాడు అలోపిదీను.

వంశీధరుడు జమేదారుకోసం గట్టిగా కేకపెట్టాడు. యినస్పెక్టరును లోపల్లోపలే కసిదీరా శపించుకుంటూ బద్దూసింగు ఆలోపిదీను వైపు అడుగేసాడు.

భయంతో అలోపిదీను రెండడుగులు వెనక్కి వేసి 'బద్దూ సాహెబ్, దేవుడి ముఖం చూసి నన్ను జాలిదలుచు. నేను ఇరవై అయిదు వేలయినా సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాను' అన్నాడు.

'అసాధ్యం.'

'ముప్పై వేలు.'

'అసంభవం.'

'నలభై లక్షలయినా కూడా ఉపయోగం లేదంటూ ఉంటే నలభై వేలెక్కడ? బద్దూ సింగ్. ఇతణ్ణి అరెస్టు చెయ్యి. ఇతణ్ణుంచి మరొక్క మాట వినడానికి కూడా సిద్ధంగా లేను.'

విధినిర్వహణ ఐశ్వర్యాన్ని కాళ్ళకింద తొక్కిపడేసింది. బలిష్ఠుడైన ఒక యువకుడు బేడీలు పట్టుకుని తన దగ్గరకు వస్తూండటం అలోపిదీను చూసాడు. అతడు నిస్సహాయంగా నలువైపులా చూసి అకస్మాత్తుగా స్పృహతప్పి నేలకూలిపొయ్యాడు.

4

ప్రపంచమైతే నిద్రపోతూ ఉందిగాని ప్రజల నాలుకలకి నిద్రలేదు. అవి రాత్రంతా ఆడుతూనే ఉన్నాయి. తెల్లవారేటప్పటికల్లా ప్రతి ఒక్కరి నోట్లోనూ ఈ కథనే ఆడుతూ ఉంది. ఇప్పటికి ప్రపంచం నేరవిముక్తం అయినట్లుగా ప్రతి ఒక్కచోటా ఖండనవాక్యాలు, అభిశంసన వాక్యాలు వినిపించడం మొదలుపెట్టాయి. ప్రతి ఒక్కరూ తామే మరింత నిజాయితీపరులమన్నట్టుగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. పాలల్లో నీళ్ళు కలిపే పాలవాడూ, టికెట్టుకొనకుండానే రోజూ రైల్లో ప్రయాణించే గుమాస్తాలూ, తప్పుడు పత్రాలు సృష్టించే వడ్డీవ్యాపారస్థులూ, జిత్తులమారి వ్యాపారులూ ప్రతి ఒక్కరూ జరిగిన దానికి అనంగీకారంగా తలపంకించడం మొదలుపెట్టారు.

ఆ మర్నాడు తన చేతులకి బేడీలు తగిలించి కానిస్టేబులు కోర్టుకి నడిపిస్తుండగా అలోపిదీను సిగ్గుతో తలవంచుకుని లోపల్లోపల ఆగ్రహంతో, దుఃఖంతో రగిలిపోతూ ఉండగా, మొత్తం పట్టణమంతా తల్లడిల్లిపోయింది. అంతమంది జనాలు అంత ఆతృతగా గుమికూడటం తిరుణాలల్లో కూడా కనబడదు. జనం ఎంత పెద్ద ఎత్తున గుమి-కూడారంటే కోర్టుహాలు ఎక్కడ మొదలవుతున్నదో, వీధి ఎక్కడ ముగుస్తున్నదో చెప్పడం కష్టమయింది.

కాని కోర్టురూములో పరిస్థితి భిన్నంగా ఉంది. ఆ ప్రాంతానికి పండిత అలోపిదీను మకుటం లేని మహారాజు. మాజిస్ట్రేట్లు అతడి ఆరాధకులు. అధికారులు అతడి మెహర్బానీ కోసం పడిగాపులు పడేవాళ్ళు. అటార్నీలు, లాయర్లూ అతడెప్పుడు పిలిస్తే అప్పుడొచ్చి వాలడానికి సిద్ధంగా ఉంటారు. ప్యూన్లు, అటెండర్లు, వాచ్మేన్లు అతడికి బానిసలు. అతణ్ణి చూడటానికి జనం నలుదిక్కులనుంచీ పరుగెత్తుకొచ్చారు. ప్రతి ఒక్కరి ముఖంలోనూ ఆశ్చర్యమే- అతడు చేసిందానిపట్ల కాదు, అతడలా ఎలా పట్టు-బడ్డాడన్నదానిపట్లనే. అంత ఐశ్వర్యవంతుడు, తన వాక్చాతుర్యంతో దేవుళ్ళని కూడా మభ్యపెట్టగలవాడు, ఇప్పుడిలా చట్టం ముందు నేరస్థుడిగా నిలబడటమనే అసంభవం ఎలా సంభవమైంది? ముందు ఆశ్చర్యపోయాక, నెమ్మదిగా, సానుభూతి ప్రకటించడం

మొదలుపెట్టారు. అతడి తరఫున వాదించడానికి ఏకంగా ఒక లాయర్ల దళమే మోహరించింది. న్యాయదేవత ప్రాంగణంలో సంపదకీ, విధినిర్వహణకీ మధ్య పోరు సన్నాహం మొదలయ్యింది. వంశీధరుడు మౌనంగా నిలబడి ఉన్నాడు. తనకి మద్దతుగా అతడికి సత్యం తప్ప మరొక బలం లేదు, నిజం తప్ప మరొక ఆయుధం లేదు. సాక్షులు లేకపోలేదు, నిజమేగాని, వారు దురాశ నీడ కింద ఊగిసలాడుతున్నారు.

న్యాయదేవత త్రాసు తనకి వ్యతిరేకంగా మొగ్గబోతున్నట్లు వంశీధరుడికెలానో స్ఫురించింది. న్యాయానికి సిరిసంపదలు పట్టనిమాట నిజమేగాని ప్రజల కన్నుగప్పి నర్తించే రహస్య ఆకాంక్షలు లేకపోలేదు. మనుషులకి రకరకాల ఆహ్వానాలు పంపడం ద్వారా, కానుకలు కురిపించడం ద్వారా సంపద ఎన్నో కుయుక్తులు పన్నగలదు. నిజమే, అది న్యాయదేవత ఆలయమేగాని, అక్కడున్న అధికారులు మాత్రం దురాశతో మత్తెక్కినవాళ్ళు. కేసు విచారణ తొందరగానే ముగిసింది.

డిప్యూటీ మాజిస్ట్రేటు తన తీర్పు వినిపించాడు: 'పండిత అలోపిదీనుకి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన సాక్ష్యం బలహీనంగానూ, నిరాధారంగానూ ఉంది. అతడు అటువంటి హీనచర్యకు, అది కూడా ఏదో నాలుగుడబ్బుల కోసం, ఒడిగడతాడనడం అసంభవం అనేది నిర్వివాదాంశం. ఏదో తక్షణ ఉద్రేకంలో, యినస్పెక్టర్ మున్షీ వంశీధర్, చేయకూడని పొరపాటు చేసాడు. ఇది అత్యుత్సాహం తప్ప మరోటి కాదు. విధి నిర్వహణకు అంకితమైన ఇటువంటి యువకుణ్ణి చూసి మాకు సంతోషంగా ఉంది. అయితే ఉప్పుశాఖలో నీతినిజాయితీలపట్ల మక్కువ మరీ మితిమీరినందువల్ల అతడు తన విచక్షణ కోల్పోయి సరైన నిర్ణయం తీసుకోలేకపోయాడు. ఇకమీదట మరింత జాగ్రత్తగా వ్యవహరించవలసిందిగా అతణ్ణి హెచ్చరిస్తున్నాం.'

ఆ తీర్పు వినగానే లాయర్లు సంతోషంతో ఎగిరి గంతేసారు. పండిత అలోపిదీను మందహాసంతో కోర్టురూమునుంచి బయటికొచ్చాడు. అతడి శ్రేయోభిలాషులు అతడిమీద డబ్బు కురిపించారు. అక్కడ ఔదార్యతరంగం, ఉత్సాహపు కెరటం ఎంతలా వెల్లువెత్తాయంటే కోర్టు పునాదులే కదిలిపోతాయా అనిపించింది. వంశీధరుడు కూడా కోర్టురూము నుంచి బయటికొచ్చినప్పుడు, అతడి గౌరవం దెబ్బతిన్నట్టు కనిపించకపోయినప్పటికీ, ఎత్తి పొడుపులూ, వెక్కిరింతలూ నలుదిక్కులనుండీ అతడిమీద వర్షించాయి. ప్యూన్లూ, కానిస్టేబుళ్ళూ వంగి నమస్కరించారు. కాని సరిగ్గా ఆ క్షణాన్నే ప్రతి ఒక్కటీ అతడిలోపల రగులుతున్న స్వాభిమానాన్ని బలపరుస్తూనే ఉంది. తాను ఈ కేసులో గెలిచి ఉంటే,

అతడిటువంటి గర్వంతో బయటకు అడుగుపెట్టగలిగి ఉండేవాడు కాడు. ప్రపంచం అతడికి మొదటి పాఠం నేర్పింది. న్యాయం, చదువు, గొప్ప గొప్ప బిరుదులు, పొడవాటి గెడ్డాలు, రెపరెపలాడే అంగరఖాలు–ఏ ఒక్కటీ నిజంగా గౌరవనీయాలు కావు.

5

వంశీధరుడు సంపదతోటీ, పలుకుబడితోటీ శత్రుత్వం కొనితెచ్చుకున్నాడు. కాబట్టి దానికి అతడు మూల్యం చెల్లించవలసి వచ్చింది. వారం రోజులు తిరక్కుండానే అతడు సస్పెన్షను ఉత్తర్వులు అందుకున్నాడు. అంతరాత్మ ప్రబోధానికి అనుగుణంగా నడుచు–కున్నందుకు లభించిన శిక్ష ఇది. అధైర్యంతోనూ, నిరుత్సాహంతోనూ కుంగిపోయి అతడు ఇంటిబాట పట్టాడు. అతడి తండ్రి పెద్ద మున్షీ అతడి వైఖరి చూసి మండిపడ్డాడు. 'వాడు ఇంటినుంచి బయట అడుగుపెట్టేటప్పుడే నేను వాడికి హితబోధ చేసాను. కాని వాడు నా మాటలు వినిపించుకోలేదు. వాడు కేవలం తన జీతపురాళ్ళనే నమ్ముకున్నందు వల్ల, ఈ వయసులో ఇప్పుడు నేను కిరాణా దుకాణాలవాళ్లవీ, అప్పులిచ్చినవాళ్ళవీ ఫిర్యాదులు వినవలసి వస్తోంది. నేను కూడా ప్రభుత్వంలో ఉద్యోగం చేసాను. నాకేమంత అధికారంలేకపోయినా, ఏదో ఉన్నంతలో నాకు చేతనైన విధంగా నడుపుకున్నాను. చూడు, నువ్వేదో నిజాయితీపరుడైన అధికారిగా ఉండాలని తాపత్రయపడ్డావు. అదెలా–గుందంటే ఒకవైపు నీ ఇల్లు చీకట్లో పడి ఉంటే, పోయి మసీదులో దీపం పెట్టినట్టుంది. నిన్ను చూసి నాకు జాలేస్తోంది. నీకు చెప్పించిన చదువంతా వృథా.'

రెండుమూడు రోజుల తర్వాత దయనీయ పరిస్థితిలో వంశీధరుడు ఇంటికి చేరి జరిగిందంతా తండ్రికి చెప్పినప్పుడు ఆయన కోపానికి పట్టపగ్గాల్లేవు.

'నాకు దేంతోనైనా నీ తలబాది నా తలబాదుకోవాలని ఉంది.'

చాలాసేపటిదాకా ఆయనట్లా అరుస్తూ, పెడబొబ్బలు పెడుతూ కోపంలో నోటి కొచ్చినట్టు మాటాడుతూనే ఉన్నాడు. వంశీధరుడు అక్కణ్ణుంచి వెళ్ళిపోకపోయి ఉంటే ఆయన తన కోపంలో ఏమన్నా చేసి ఉండేవాడు. వంశీధరుడితల్లి కూడా చాలా దిగులుపడింది. పూరీజగన్నాథానికీ, రామేశ్వరానికీ వెళ్ళాలన్న ఆమె కన్నకలలు ఆవిరై పోయాయి. చివరికి వంశీధరుడి భార్యకూడా చాలారోజుల పాటు అతడితో సరిగ్గా మాట్లాడనే లేదు.

వారం రోజులిట్లా గడిచాయి– బంధుమిత్రుల వెక్కిరింపులూ, అపరిచితుల సానుభూతి వాక్యాలూ వినవలసి రావడం దుర్భరంగా ఉండింది. ఒక సాయంకాలం, పెద్ద మున్షీ రామనామం జపించుకుంటూ ఉండగా, ఒక పెద్ద రథం వచ్చి, ఆయన గుమ్మం దగ్గర ఆగింది. ఆ బండి ఆకుపచ్చరంగులోనూ, దాని తెరలు గులాబిరంగు లోనూ ఉన్నాయి. చక్కటి మేలుజాతి ఎడ్లు ఆ బండికి పూన్చి ఉన్నాయి. వాటి కొమ్ములకి ఇత్తడి తొడుగులున్నాయి, వాటి మెడలో నీలపురంగు పట్టీలు వేలాడుతున్నాయి. వచ్చిన అతిథుల్ని స్వాగతించడానికి మున్షీ ముందుకు దూకాడు. దగ్గరకు వెళ్ళి చూస్తే, ఆ వచ్చినతడు, పండిత అలోపిదీను. మున్షీ అతణ్ణి స్వాగతిస్తూ, అతడి ముందు మోకరిల్లి, వంశీధరుడు చేసిన పనికి క్షమాపణలు చెప్పుకోడం మొదలుపెట్టాడు.

'మీకు నేను నా ముఖమెలా చూపించేది? నా కొడుకు నా ముఖానికి మసి పూసేసాడు. కాని నేనేం చెయ్యగలను? వాడు పనికిమాలినవాడో మరొకటో కాని మేము మీనుంచి ఎందుకు తప్పించుకు తిరగాలి? అటువంటి కొడుకుని కనేకన్నా నిస్సంతుగా ఉండిపోయుంటే ఎంతో బాగుండేది.'

అలోపిదీను తనతో కరచాలనం చేస్తున్నప్పుడు వంశీధరుడు తన హుందా కోల్పో-కుండానే ఉన్నాడు. పండిత అలోపిదీను తనని అవహేళన చెయ్యడానికే వచ్చాడని అతడు అనుమానించాడు. కాని ఎటువంటి పశ్చాత్తాపాన్నీ ప్రకటించలేదు. తన తండ్రి చేస్తున్న ముఖస్తుతి అతడికి సహించరానిదిగా తోచింది.

పండిట్జీ సంభాషణ మొదలుపెట్టాడు 'లేదన్నా, మీరలా అనకండి' అన్నాడు.

గాలి ఇప్పుడేదిక్కుకి వీస్తున్నదో పెద్ద మున్షీకి కొరుకుడుపడలేదు. అయోమయంగా చూస్తూ 'మరి అటువంటి కొడుకు గురించి ఇంకేమనగలను' అన్నాడు.

'మీ వంశానికే గర్వకారణమైన అటువంటి కొడుకునిచ్చినందుకు మీరు దేవుడికి ధన్యవాదాలు చెప్పుకోవాలి. తాను నమ్మిన విలువలకోసం సమస్తం త్యాగం చెయ్యడానికి అతడిలాగా వెనుకాడనివాళ్ళు ఈ లోకంలో ఎందరుంటారు?' అన్నాడు అలోపిదీను ఉత్సాహంగా.

అప్పుడతడు వంశీధరుడికేసి తిరిగి 'యినస్పెక్టరు సాబ్, నేను మిమ్మల్ని పొగుడు-తున్నానని అనుకోకండి. కేవలం పొగడటానికే నేను ఇంతదూరం వచ్చిఉండేవాణ్ణి

కాను. మీరు ఒక ప్రభుత్వాధికారిగా మీకున్న అధికారాల్ని వినియోగించి ఆ రాత్రి నన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజు నేను నా అంతట నేనే మీ ముందు లొంగి పోడానికి వచ్చాను. డబ్బూ, పలుకుబడీ ఉన్నవాళ్ళని వేలాదిమందిని చూసాను. ఉన్నతపదవుల్లో ఉన్నవాళ్ళతో ఎందరితోనో వ్యవహారం నడిపేను. నా సంపదతో వాళ్ళందరినీ నా బానిసల్ని చేసుకోగలిగేను. కాని మీరు నా మీద గెలిచారు. మీరనుమతిస్తే మిమ్మలనొక్క మాట అడగాలని ఉంది' అని అన్నాడు.

పండిట్జీ తన హృదయంలోంచీ మాట్లాడుతున్నాడని వంశీధరుడు గ్రహించాడు. అతడు ఆమోదపూర్వకంగా పండిట్జీ వైపు చూసాడు. అతడి స్వాభిమానం స్థానంలో నెలకొన్న ఒకింత సిగ్గుతో, అతడు మొహమాటంగానే 'మీ పెద్దమనసు మిమ్మల్నిక్కడిదాకా తీసుకొచ్చింది. నేను నా బాధ్యతల నిర్వహణకోసమే మీతో కటువుగా ప్రవర్తించవలసి వచ్చింది. ఇప్పుడు నేను మీ సేవకు సిద్ధంగా ఉన్నాను. మీరు ఏమి ఆదేశిస్తే నాకు చాతనైనంతమేరకు దాన్ని నెరవేరుస్తాను' అని అన్నాడు.

అలోపిదీను సానుకూల దృక్కుల్తో అతణ్ణి చూస్తూ, ఆ రాత్రి నది ఒడ్డున మీరు నా ప్రతిపాదన తిరస్కరించారు. కాని ఇప్పుడు నేను చెయ్యబోయే ప్రతిపాదనని మీరు అంగీకరించక తప్పదు' అన్నాడు.

'నేను మీకేమి చెయ్యగలనో తెలీదు. కాని నేనేది చెయ్యగలిగితే అది తప్పకుండా చేస్తానని మాత్రం చెప్పగలను.'

అలోపిదీను ఒక దస్తావేజు తీసి వంశీధరుడి ముందు పెట్టాడు. 'ఈ పవరాఫ్ అటార్నీ శ్రద్ధగా చదివి సంతకం పెట్టండి. నేను బ్రాహ్మణుణ్ణి. మీరు నా విన్నపం అంగీకరించేదాకా నేనిక్కడనుంచి కదలబోవడం లేదు.'

వంశీధరు ఆ కాగితం చదువుతూనే, కృతజ్ఞతాపూర్వకంగా, అతడి కళ్ళల్లో అశ్రువులు పొంగిపొర్లాయి. సాలీనా ఆరువేలరూపాయల జీతం మీద అతణ్ణి తన ఆస్తిపాస్తులు మొత్తానికి అటార్నీగా నియమిస్తూ అలోపిదీను రాసిన పత్రం అది. జీతం కాక, రోజువారీ ఖర్చులకోసం ప్రత్యేకభత్యం, తిరగడానికి గుర్రం, అపరిమిత అధికారాలూ అతడికి దఖలు పరుస్తున్నట్లుగా ఉందందులో. వంశీధరుడు కష్టం మీద గొంతు పెగుల్చుకుంటూ 'పండిట్జీ, మీరు చూపిస్తున్న ఈ ఔదార్యానికి కృతజ్ఞతలు చెప్పడానికి నా దగ్గర మాటల్లేవు. కాని నిజం చెప్పాలంటే, నేనింత గౌరవానికి తగను.'

'మీరు మిమ్మల్ని ప్రశంసించుకోనక్కర్లేదు' అన్నాడు అలోపిదీను.

వంశీధరుడు గంభీరస్వరంతో 'నేను మీ బానిసని. మీవంటి గౌరవనీయులకోసం నేనేమి చెయ్యడానికేనా సిద్ధమే. కాని మీరు చూపిస్తున్న ఉద్యోగం చెయ్యడానికి తగిన అనుభవం, జ్ఞానం, విశాలదృష్టీ నాకులేవు. ఈ పనులు చెయ్యడానికి మీకు చాలా అనుభవజ్ఞుడూ, సమర్థుడూ అయిన మనిషి కావాలి' అన్నాడు.

అలోపిదీను కలం చేతుల్లోకి తీసుకుని 'నేను అనుభవంకోసం, జ్ఞానం కోసం, సమర్థతా, విశాల దృష్టి కోసం చూడటం లేదు. చాలాకాలంగా నేను రాళ్ళల్లో ముత్యాల కోసం వెతుక్కుంటున్నాను. నా భాగ్యవశాత్తూ జ్ఞానం కన్నా, విశాలదృష్టికన్నా మించిన వజ్రాన్ని కనుక్కోగలిగాను. ఇదుగో, కలం తీసుకుని మరేమీ ఆలోచించకుండా సంతకం పెట్టండి. మీరెప్పటికీ ఇలానే కటువువైన, కనికరంలేని, కాని విధ్యుక్తధర్మాన్ని నిర్వహించ–డంలో ఏమరుపాటులేని యినస్పెక్టరుగానే ఉండాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని అన్నాడు.

వంశీధరుడి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ఆ ఔదార్యం అతణ్ణి ముంచెత్తింది. అతడు కృతజ్ఞతాపూర్వకంగా ఆలోపిదీనుకేసి చూసి, వణుకుతున్న చేతుల్తో, ఆ పత్రం మీద చేవ్రాలు చేసాడు.

అలోపిదీను సంతోషంతో ఎగిరి గంతేసి వంశీధరుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు.

◆

14

నలభయ్యేళ్ళ కింద నేను చదివిన కథల్లో బహుశా అత్యంత విషాదాత్మకమైన కథ లేదా మరోలా చెప్పాలంటే అత్యంత fatal short story కాఫ్కా రాసిన The Judgement (1912). ఎందుకంటే ఈ కథ చదివాకనే నా మిత్రుడు కవులూరి గోపీచంద్ మా అందరికీ మానసికంగానే కాక, భౌతికంగా కూడా, దూరమైపోయాడు.

ఈ కథకి సంబంధించిన ప్రతి ఒక్క వివరం, అంటే ఈ కథ మా జీవితాల్లోకి ఎలా ప్రవేశించిందీ. ఆ తర్వాత ఏమి జరిగిందీ, అవన్నీ నాకు గుర్తే. ఎవరో ఆ సంఘటనల క్రమాన్ని ఒక చీటీమీద ఎర్రటి ఇంకులో రాసి, ఆ చీటీని నా స్మృతిపేటికలో కుట్టిపెట్టేసినట్టు.

1982-83 నాటి మాట. ఒకరోజు భమిడిపాటి జగన్నాథరావుగారు 'నువ్వు కాఫ్కాగారి దుర్గం చదివేవా?' అనడిగారు. కాఫ్కా పేరు నేను వినడం అదే మొదటిసారి కాఫ్కాగారి దుర్గం అంటే ఏమిటో నా ఊహకి కూడా అందలేదు. ఆ తర్వాత మళ్ళా మేం కలుసుకున్నప్పుడు, ఆయన, 'అభ్యుదయ' పత్రిక పాతసంచిక, ఒకటి నా చేతుల్లో పెడుతూ, 'ఇదుగో, ఇందులో పాలగుమ్మి పద్మరాజు గారు రాసిన వ్యాసం ఉంది, చదువు' అన్నారు.

ఆ వ్యాసంలో పద్మరాజుగారు కాఫ్కా నవల The Castle (1926) గురించి రాసేరు. నాకు తెలిసి, తెలుగులో కాఫ్కా గురించిన మొదటి వ్యాసం అదేననుకుంటాను. మొదటి ప్రస్తావన కూడా అదే అయి ఉండవచ్చు. శ్రీశ్రీ తన 'అనంతం'లో ఒకచోట కాఫ్కా మూడు నవలల గురించీ రాసాడు. కాని ఆయన రాసింది పద్మరాజుగారి వ్యాసానికి చాలాకాలం తర్వాత.

ఆ వ్యాసం నాకేమీ అర్థం కాలేదు. కాని కొన్ని రోజులకే నా చేతుల్లోకి 'జర్మన్ సంప్రదాయ సాహిత్య దర్పణం' (1971) వచ్చింది. అది దక్షిణభాషా పుస్తకసంస్థ వారు ఒక జర్మను పుస్తక సంస్థతో కలిసి వెలువరించిన అనువాదం. పాలగుమ్మి పద్మరాజు, కొడవటిగంటి కుటుంబ–రావు, బి. శ్రీనివాసాచార్యులు అనువాదకులు. అందులో కాఫ్కా రాసిన 'తీర్పు' కథతో పాటు, 'విచారణ' నుంచి కూడా చిన్న భాగం ఉంది. నేను అప్పటికే కాఫ్కా గురించి విని ఉండటం చేత ఆ కథ ఆసక్తిగా చదివాను. కాని అది నాకేమీ అర్థం కాలేదు. ఆ పుస్తకం తీసుకువెళ్ళి గోపీచంద్‌కి ఇచ్చి ఆ కథ చదవమని చెప్పాను. ఆశ్చర్యం! ఆ కథ అతనికి అర్థం కావడమే కాదు, అది అతడి మనసుమీద అనూహ్యమైన ప్రభావం చూపించింది.

ఆ కథ చదివిన రెండుమూడు రోజుల తర్వాత అతడు ఒక సాయంకాలం నా దగ్గరకొచ్చి 'బాస్! ఇంతకీ రష్యాలో ఆ స్నేహితుడు లేడు తెలుసా!' అన్నాడు. ఆ మాట చెప్తున్నప్పుడు అతడికి కాఫ్కా

రహస్యం మొత్తం తెలిసిపోయినట్టుగా, నాకు తప్ప మరెవరికీ చెప్పబోవడం లేదన్నట్టుగా, చెప్పాడు. ఆ స్నేహితుడు రష్యాలో నిజంగా లేకపోతే దాని అర్థమేమిటో నాకు ఆ రోజైతే అర్థం కాలేదు.

ఆ తర్వాత అతడు కాఫ్కా నవలలు ఒకటొకటీ తెప్పించుకున్నాడు. ఒకదానివెనక ఒకటి చదివేసాడు. కాఫ్కా డైరీలూ, మిలేనాకు రాసిన ఉత్తరాలు కూడా తెప్పించుకున్నాడు. ఆ నవలలు నేను కూడా చదువుదామని చూసాను. నాకు ఆ ఇంగ్లిషు అర్థమవుతూ ఉండిందిగాని, రచయిత ఏమి చెప్తున్నాడో బోధపడేదికాదు. కాని గోపీచంద్ మాత్రం మేం కలుసుకున్నప్పుడల్లా కాఫ్కా గురించి ఏదో ఒకటి చెప్తూనే ఉండేవాడు.

రాజమండ్రిలో పనిచేసిన తర్వాత గోపీచంద్ ఉద్యోగరీత్యా రాయగడ వెళ్ళడం, అక్కడ పని చేస్తుండగానే ఒక రోజు భార్యాపిల్లలకి చెప్పకుండా ఇల్లు వదిలిపెట్టి వెళ్ళిపోవడం జరిగాయి. ఇంకా చెప్పాలంటే, ఒక రైలు ప్రయాణంలో, భార్యాపిల్లల్ని బోగీలో వదిలిపెట్టి వెళ్ళిపోయినవాడు ఇప్పటిదాకా మళ్ళా కనబడ లేదు. కానీ అతడి అదృశ్యం వెనక కాఫ్కా ప్రభావం ఉందని మాత్రం నాలాగా ఒకరిద్దరు మిత్రులు నమ్ముతూనే ఉంటారు.

అన్నట్టు, గోపీచంద్ కాఫ్కామీద ఒక కవిత కూడా రాసేడు. 1983 డిసెంబరులో మా సాహితీవేదిక వెలువరించిన 'కవితావేదిక'లో ఆ కవిత పొందుపరిచాం. ఇదుగో, ఆ కవిత.

క్షమించు కాఫ్కా

శక్తిమంతుడవు నువ్వు–అయినా క్షమిస్తావు.
కాలాన్ని కాన్‌స్టెంట్‌గా చేసుకున్నావు,
నీ వాటాకు క్షయపాత్ర వచ్చింది–క్షమించు.

రైలొచ్చినప్పుడు ప్లాట్‌ఫారాలు
వానలకింద మునిసిపాలిటీ కుండీలు
నీకు తెలియనివి కావు–క్షమించు.

ఊరి మధ్య ఉరికంబాలకు వింత ఆకారాలు తగిలించి ఉంటాయి–క్షమించు.

దూరంగా పుట్టలుకట్టిన మనుషులు దిబ్బల మీద కాపలా ఉంటారు
సన్యసించిన జీవితం గురించి అందరూ అప్రమత్తులై ఉంటారు
నీడలమాటున నిజాలు పొంచి ఉంటాయి
చంద్రుడు జారి పగిలినట్లు కొంచెం అలజడి– ఆధారం
ఎండిన బోలుకర్రల్లోంచి రెండు గొంతులు మాట్లాడుకుంటాయి
యుగాల అగాధాల అంచుల్ని కలుపుతూ పడుకొంటావు నువ్వు
చీమలు పాకినట్లుంటే వాటి స్థానాన్ని నిర్ణయించకు– క్షమించు.

వాట్సన్, క్రిక్‌ల చిత్రాలు మరింత వంగి అరసున్నాలై వేలాడుతుంటాయి
ఆ చివరొకడు ఈ చివరొకడు తగులుకొని ఉంటారు
నీ కళ్ళల్లో చుట్టచుట్టుకుని పడుకున్న సముద్రాలున్నాయి
నీ కన్నీటికణాల్ని ఇక్కడ పాతాలనుకొంటావు.

మోటారు వాహనాల కింద నలిగిన ఆధారం ఉంటుంది
చిరిగిన గుడ్డలు కాలుతూ మైదానాల మీద ఆడుతూ ఉంటాయి
ఊరు చివర దొప్పల్తో కండలున్నవాళ్ళు నిత్యం తోడుతూ ఉంటారు
చెరువుగట్లమీద మేస్తూ అనేకులుంటారు
దూకుతామని ప్రకటనలు చేస్తూంటారు.

ఇప్పటికైనా నమ్ము కాఫ్కా
మిత్రుడి సంగతేమోగానీ– జార్జి మాత్రం అమరుడు

(మిత్రుడు కాఫ్కాకి)

ఫ్రాంజ్ కాఫ్కా

తీర్పు

పాలగుమ్మి పద్మరాజు, కొడవటిగంటి కుటుంబరావు,

బి. శ్రీనివాసాచార్యులు

నడివసంతంలో ఒక ఆదివారం ఉదయం జార్జిబెండెమన్, ఒక యువక వర్తకుడు– నది ఒడ్డున ఎత్తునూ, రంగునూ బట్టి తప్ప వేరు వేరుగా గుర్తించడానికి వీలు లేని చపుకరకం ఇళ్ళుగల పొడుగైన వీథిలోని తన ఇంట్లో మొదటి అంతస్తులో తన గదిలో కూచుని ఉన్నాడు. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న తన పాత స్నేహితుడికి ఉత్తరం వ్రాయడం అప్పుడే పూర్తిచేశాడు. నిదానంగా, స్వాప్నికంగా ఆ ఉత్తరాన్ని కవర్లో పెట్టి రెండు మోచేతులూ బల్లమీద ఆనించి, కిటికీగుండా నదివేపు, నదిమీది వంతెన వేపు, నది ఆవలిగట్టున పచ్చపచ్చగా కనిపించే కొండల వేపూ చూస్తున్నాడు.

స్వదేశంలో తను బాగుపడేందుకుగల అవకాశాలపట్ల అసంతృప్తితో కొన్నేళ్ళ క్రితం రష్యా పారిపోయిన స్నేహితుణ్ణి గురించి అతడు ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో వ్యాపారం చేస్తున్నాడు అతను. ఆరంభంలో లాభసాటి గానే సాగినా, చాలానాళ్ళుగా వ్యాపారం దిగనాసిలిపోతున్నట్టు, ఇటీవల మరీ అపురూప–మవుతున్న అతని స్వదేశాగమన సందర్భాలలో అతడు చెబుతూవచ్చాడు. అంటే, ఒక విదేశంలో ఏమీ ప్రయోజనం లేకుండా తనని తను అలా హరింప చేసుకుంటున్నా–డన్నమాట! ఇప్పుడు పొడుగ్గా పెరిగిన అతని గడ్డం బాల్యం నుంచీ జార్జి బాగా ఎరిగిఉన్న ఆ ముఖాన్ని పూర్తిగా మరుగుపరచలేకపోతూంది. అంతర్గతంగా ఉన్న

వ్యాధిని సూచిస్తూ అతని చర్మం క్రమంగా పసుపువన్నెకు తిరుగుతూంది. అతను చెప్పినదాన్నిబట్టి చూస్తే, ఆ నగరంలో తన దేశీయులు నివసించే కాలనీతో అతనికెలాంటి సంబంధం లేదు. రష్యన్ కుటుంబాలతోనూ రాకపోకలు లేవు. అంటే శాశ్వతంగా బ్రహ్మచారిగా ఉండిపోయే పరిస్థితికి అతని మనస్సును సన్నద్ధపరుచుకుంటున్నాడన్న మాట!

స్పష్టంగా పట్టాలు తప్పిపోయిన ఆ మనిషికి ఎవరు మాత్రం ఏమి వ్రాయగలరు? అతణ్ణి చూసి ఎవరైనా జాలిపడగలరు. ఏమీ సాయం చేయలేరు. స్వదేశానికి తిరిగివచ్చి మళ్ళీ ఇక్కడ నిలదొక్కుకుని పాత స్నేహాలన్నిటినీ పునరుద్ధరించుకొని (అలా చేయడానికి అతనికి అడ్డంకి ఏమీలేదు) స్నేహితుల సాయం మీద ఆధారపడమని అతనికి సలహా చెప్పడం మంచిదా? కాని, అలా అంటే అంతవరకూ అతను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయనీ, ఇంక వాటికి స్వస్తి చెప్పి ఇంటికి తిరిగివచ్చి కొంపచేరిన దుబారావ్యక్తిగా అందరిచేతా తేరిపార చూడబడుతూ ఉండమనీ, వాస్తవపరిస్థితి తన స్నేహితులకే తెలుసుననీ, ఇంటివద్ద కుదురుగా ఉండి పైకివచ్చిన తన స్నేహితులు తనకు ఏమి నిర్దేశిస్తే తాను ఆది చేయవలసి ఉన్న ఒక మొద్దబ్బాయిగా ఉండమనీ అతనికి చెప్పినట్టు అవుతుంది. ఆ మాట అతనికి ఎంత ప్రేమగా చెబితే అతనికి అంత ఎక్కువ కోపం వస్తుంది. పైగా, అతని మనస్సును నొప్పించడానికి మనం సిద్ధపడినా దానివలన లక్ష్యం సిద్ధిస్తుందని నమ్మకంగా చెప్పగలమా? బహుశః, అతణ్ణి స్వదేశానికి తీసుకు రావడం సాధ్యపడకపోవచ్చును. అతడే అన్నాడు ఒకసారి స్వదేశంలోని వ్యాపారంతో తనకు బొత్తుగా పరిచయం పోయిందని. ఆ పక్షంలో ఇక్కడికి వచ్చినా స్నేహితుల సలహా వలన క్రుంగిపోతూ క్రమంగా వారికి మరింత దూరమవుతూ ఇక్కడా విదేశంలో ఉన్నట్టే ఉండవలసి వస్తుంది, కాని, వాళ్ళ సలహా పాటించి ద్వేషంవలన కాకపోయినా పరిస్థితుల ప్రభావంవలన స్వదేశంలో ఇమడలేక ఇక్కడ స్నేహితులతోగాని, ఇతరులతో గాని సరిపుచ్చుకోలేక అవమానింపబడినట్టు బాధపడుతూ 'తనకు స్నేహితులూ లేరు. తనది అని చెప్పుకోదగ్గ దేశమూ లేదు' అనుకుంటూ ఉండేపక్షంలో ఇప్పుడున్నట్టు అతడు విదేశాల్లోనే ఉండిపోవడం మంచిదికాదా? ఈ సంగతులన్నీ ఆలోచించి చూస్తే స్వదేశంలో అతడు పైకి రాగలడని ఎవడైనా నమ్మకంగా ఎలా చెప్పగలడు?

ఈ కారణాల వలన ఎవరికైనా అతనితో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించాలని ఉన్నా సుదూరప్రాంతంలో ఉన్న పరిచితుడికి నిర్మొహమాటంగా చెప్పవలసిఉన్న నిజమైన

సంగతులు యథాతథంగా అతడు వ్రాయలేదు. ఆఖరుసారి అతడు వచ్చి మూడేళ్ళ పైగా అయింది. అందుకు రష్యాలో రాజకీయపరిస్థితులు ఆనిశ్చితంగా ఉండడం కారణమని అతడు కుంటిసాకు చెబుతాడు. వేలకొద్దిమంది రష్యన్లను సుఖంగా విదేశాలలో పర్యటించడానికి ఆ పరిస్థితులు అనుమతిస్తున్నాయిగాని, ఒక చిన్న వ్యాపారస్థుడు కొద్దికాలంపాటు దేశం వదలిపోవడానికి మాత్రం ఒప్పుకోడంలేదు. అయితే ఈ మూడేళ్ళలోనూ జార్జి స్వంతజీవిత పరిస్థితులు కూడా బోలెడంత మారినయి. రెండేళ్ళక్రితం అతని తల్లి చనిపోయింది. అప్పట్నించీ ఇంట్లో తనూ, తన తండ్రీ భాగస్వాములుగా గడుపుతున్నారు. ఆ సంగతి అతని స్నేహితునికి తెలియచేయడం, అతడు అలాంటి సంఘటన ఎంత దుఃఖాన్ని కలిగిస్తుందో దూరప్రాంతంలో ఉన్నవాడికి అర్థం కాదేమో అనిపించేటంత పొడిమాటలతో సానుభూతి తెలుపుతూ జవాబు వ్రాయడం జరగకపోలేదు. కాని, అప్పట్నుంచీ జార్జి వ్యాపారం, ఇతర విషయాలూ కూడా మరింత దృఢదీక్షతో చూసుకోవడం మొదలుపెట్టాడు.

బహుశః తన తల్లి బ్రతికి ఉండగా వ్యాపారంలో ప్రతి సంగతీ తన ఇష్టం ప్రకారమే జరగాలనీ తండ్రి పట్టుబడుతూ ఉండడంవలన తనకు తానుగా నిజమైన ఏ కార్యక్రమమూ కొనసాగించడానికి వీలులేకపోయింది.

ఆమె చనిపోయిన తరువాత తండ్రి వ్యాపారంలో ఇప్పటికీ ఉత్సాహంగానే పాల్గొంటూ ఉన్నా, వెనుకటి దూకుడు కొంత తగ్గిపోయింది. కేవలం యాదృచ్ఛికంగా అదృష్టం కలిసిరావడంవలన (అదీ నిజానికి సంభవమే!) ఎలాగో ఈ రెండేళ్ళలోనూ అనుకోని విధంగా వ్యాపారం పెరిగింది. ఉద్యోగస్థుల్ని అదనంగా రెట్టింపుమందిని వేసుకోవలసివచ్చింది. సాలుసరి వ్యాపారపు విలువ నిస్సందేహంగా అయిదింతలకు పెరిగింది. ఇంకా త్వరలో మరింత అభివృద్ధికి అవకాశం కనిపిస్తుంది.

కాని, జార్జి స్నేహితుడికి ఈ అభివృద్ధిని గురించి ఏమీ తెలియదు. తొలి సంవత్సరాలలో బహుశః సానుభూతి తెలుపుతూ వ్రాసిన ఉత్తరంలోనే ఆఖరుసారిగా జార్జిని రష్యా వలస వచ్చేయమనీ, జార్జి వ్యాపారశాఖవంటిదానికి అక్కడ మంచి విజయావకాశాలు ఉన్నాయనీ ప్రోత్సహించడానికి అతడు ప్రయత్నించాడు. అతను ఉదహరించిన మొత్తాలు ప్రస్తుతం జార్జి వ్యాపారపు మొత్తాలలో పోల్చిచూస్తే అత్యల్పాలు. అయినా, తాను వ్యాపారంలో సాధించిన విజయాన్ని గురించి మిత్రుడికి తెలియ-జేయడానికి అతడు వెనుకాడాడు. ఇక ఇప్పుడు ఆ వెనుకటి సంగతులు తెలియజేయడం

అసందర్భంగా ఉంటుందిగద! అందుచేత, జార్జి [ప్రశాంతమైన ఆదివారంపూట తీరిగ్గా ఆలోచిస్తూంటే మనస్సులోకి యథాలాపంగా వచ్చే అ[ప్రధానమైన సాధారణ విషయాలను గురించి మా[త్రమే తన లేఖలో [వ్రాశాడు. తన స్నేహితుడు ఈ దీర్ఘ వ్యవధానంలో స్వదేశంలోని తన పట్టణాన్ని గురించి ఏర్పరచుకొని ఉండే భావాన్ని తను చెదరగొట్ట-కూడదని అతను [ప్రధానంగా ఆశించాడు. ఆ [ప్రకారం- దీర్ఘ వ్యవధానాల మధ్య జార్జి [వ్రాసిన మూడు ఉత్తరాలలోను మూడుసార్లు ఒక అ[ప్రధానమైన వరుడికి అంతగానూ అ[ప్రధానమైన వధువుతో సంబంధం నిశ్చయమైనట్లు తన స్నేహితుడికి [వ్రాయడం, తను ఆశించినదానికి విరుద్ధంగా తన స్నేహితుడు ఆ [ప్రముఖసంఘటనలో ఆసక్తి చూపనారంభించడం జరిగింది.

అయినా, జార్జి ఒక నెలరోజులక్రితం ఒక గొప్ప కుటుంబంలోని పిల్ల [ఫ్రాలీవ్ [ఫ్రైడా [బ్రాండెన్‌ఫెల్డ్‌తో తనకు సంబంధం నిశ్చయమైన సంగతి కాక ఇలా తెలియజేశాడు: 'నేను చెప్పవలసిఉన్న ముఖ్యమైన వార్త చిట్టచివరికి అట్టేపెట్టాను. కలవారి ఇంటిపడుచు [ఫ్రైడా [బ్రాండెన్‌ఫెల్డ్‌తో నా వివాహం నిశ్చయమైంది. నీవు వెళ్ళిపోయిన తరువాత చాలాకాలానికి ఆమె ఈ [ప్రాంతాలకు వచ్చింది గనుక నీవు ఆమెను ఎరిగుండే అవకాశం లేదు. ఆమెను గురించిన ఇతర విశేషాలు ముందుముందు చెబుతాను. ఇవాళ ఒక్క మాట మా[త్రం చెబుతున్నాను. నేను చాలా సంతోషంగా ఉన్నాను. నీ నా మధ్య ఉన్న అనుబంధంలో వచ్చిన మార్పల్లా ఇదివరకు నీ స్నేహితుడు సర్వసాధారణమైన వ్యక్తి. ఇప్పుడు అతడు సంతోషపరవశుడు. అంతేకాకుండా నా కాబోయే వధువులో నీ కొక నమ్మకమైన స్నేహితురాలు లభించగలదు. ఒక [బ్రహ్మచారికి అది అంత అ[ప్రధానమైన సంగతి కాదుగదా! నా కాబోయే వధువు నీకు హార్దిక అభినందనలు పంపుతున్నది. త్వరలో స్వయంగానే నీకు [వ్రాస్తుంది. మమ్మల్ని చూడడానికి నీవు రాలేకపోవడానికి అనేక కారణాలుంటాయని నాకు తెలుసు, కాని, అన్ని అడ్డంకులను [త్రోసిపుచ్చడానికి నా వివాహం సరియైన అవకాశం కాదా? అయినా నీ సొంత పరిస్థితులు జా[గత్తగా ఆలోచించుకుని నీకు ఏది మంచిదని తోస్తే అలా చెయ్యి!'

ఆ ఉత్తరం చేత్తోపట్టుకొని కిటికీలోనుంచి బయటికి చూస్తూ [వ్రాతబల్ల ముందు చాలాసేపు జార్జి అలాగే కూచున్నాడు. వీధిలో పోతూ ఉన్న ఒక పరిచితుడు చేసిన అభినందనను పరధ్యానపు మందహాసంతో అందుకొన్నాడు.

చివరికి ఉత్తరం జేబులో పెట్టుకుని ఒక చిన్న హాలుగుండా నడిచి తండ్రి గదిలోకి వెళ్ళాడు. కొన్ని మాసాలుగా తను ఆ గదిలో ప్రవేశించి ఉండలేదు. నిజానికి ఇప్పుడు ఇలా ఆ గదిలోకి వెళ్ళవలసిన అవసరం లేదు. వ్యాపారరీత్యా రోజూ తండ్రిని చూస్తూనే ఉన్నాడు. ఇద్దరూ కలిసి భోజనశాలలో మధ్యాహ్నభోజనం చేస్తూనే ఉన్నారు. అయితే, సాయంత్రంపూట మాత్రం ఎవరి ఇష్టానుసారం వాళ్ళు గడుపుతున్న మాట వాస్తవమే! అప్పటికీ, జార్జి స్నేహితులతో కలిసి బయటకు వెళ్ళడమో, లేక ఇటీవల తన కాబోయే వధువును చూడడానికి వెళ్ళడమో జరిగితే తప్ప, వారిద్దరూ కలిసి ఉమ్మడి హాలులో చెరొక వార్తాపత్రికా ముందు వేసుకుని కూచోడం జరుగుతూనే ఉంది.

చక్కగా ఎండ కాస్తున్న ఈ ఉదయం పూట కూడా తండ్రి గది అంత చీకటిగా ఉండడం జార్జికి ఆశ్చర్యమనిపించింది. అంటే ప్రక్కన ఉన్న ఇరుకు సందుకు అవతలి ఎత్తైన గోడ తాలూకు నీడ అంత ఎక్కువగా పడుతూందన్న మాట. ఒక మూల కిటికీ పక్కగా జార్జి చనిపోయిన తన తల్లి తాలూకు జ్ఞాపకచిహ్నాలు ఒక కంటికి మరీ వేలాడుతున్న చోట ఒక వార్తాపత్రికను చూపు సరిగా ఆనక దగ్గరగా పెట్టుకొని చదువుతూ తండ్రి కూచుని ఉన్నాడు. బల్ల మీద ఆయన ఉదయపు భోజనం తాలూకు అవశేషాలు ఉన్నాయి. ఆయన ఏమంత ఎక్కువగా భోజనం చేసినట్టు కనిపించదు.

'ఓ! జార్జ్!' అన్నాడు తండ్రి. లేచి అతనికెదురుగా నాలుగడుగులు వేస్తూ.

ఆయన బరువైన డ్రస్సింగుగౌను విప్పారి నడుస్తూ ఉంటే ఆయన చుట్టూ రెపరెప కొట్టుకుంది. 'మా నాన్న ఇప్పటికీ రాక్షసుడిలాంటి మనిషే!' అనుకున్నాడు జార్జి తనలో తాను, 'ఇక్కడ మరీ చీకటిగా ఉంది,' అన్నాడు పైకి.

'ఔను! తగినంత చీకటిగానే ఉంది' అన్నాడు తండ్రి.

'పై పెచ్చు మీరు కిటికీ కూడా మూసేసినట్టున్నారు.'

'అలా ఉండడమే నా కిష్టం.'

'బావుంది! బయట ఎంత వెచ్చగా ఉందో చూడండి!' అన్నాడు జార్జి తన వెనుకటి మాటను కొనసాగిస్తూ. అని కూచున్నాడు. తండ్రి తన ఉదయ భోజనపు పళ్ళాలు సద్ది బీరువాలో పెట్టాడు.

శూన్యంగా తండ్రి కదలికలను గమనిస్తూ కూచుని ఉన్న జార్జి అన్నాడు: 'ఏం లేదు! మీతో చెబుదామని వచ్చాను. నా వివాహసంబంధాన్ని గురించిన వార్త పీటర్స్ బర్గ్‌కి తెలుపుతున్నాను,' జేబులోనుంచి ఉత్తరం కొంచెం పైకిలాగి మళ్ళీ లోపలికి నెట్టేశాడు.

'పీటర్స్‌బర్గ్‌కా?' అన్నాడు తండ్రి.

'అక్కడ ఉన్న నా స్నేహితుడికి,' తండ్రి కళ్ళలోకి చూడాలని ప్రయత్నిస్తూ బదులు చెప్పాడు జార్జి. 'వ్యాపార సమయంలో ఆయన మరో విధంగా ఉంటాడు. ఇక్కడ చేతి మీద చేయి వేసుకుని ఎంత గంభీరంగా కూచున్నాడు!' అనుకొన్నాడు.

'ఔనౌను! నీ స్నేహితుడికి!' అని విచిత్రంగా ఒత్తి పలికాడు తండ్రి.

"ఔను నాన్నా! మొదట నా వివాహ సంబంధం సంగతి అతనికి తెలియజేయ–వద్దనుకున్నాను. అతని మీద దయ తలచి. అదొక్కటే కారణం. మీకూ తెలుసు గదా, అతను చిత్రమైన మనిషి. ఇతరులెవరైనా నా పెళ్ళి సంబంధం సంగతి చెబితే చెప్పనీ! అతను ఒంటరిగాడు అవడం వలన అదీ అంత సంభావ్యం కాదు. అలాంటి దానిని నేను అడ్డగించలేను. కాని నా అంతట నేను మాత్రం అతనికీ విషయం చెప్పకూడదు, అనుకున్నాను.'

'అయితే ఇప్పుడు నువ్వు నీ మనసు మార్చుకున్నావు?' అడిగాడు తండ్రి పెద్ద సైజు వార్తాపత్రిక కిటికీ అంచున పెట్టి దానిమీద తన కళ్ళజోడు ఉంచి దానిని ఒక చేత్తో కప్పుతూ.

'ఔను! ఆ సంగతి బాగా ఆలోచించాను. అతను నాకు మంచి మిత్రుడయితే నాకు సంతోషంగా వివాహసంబంధం కుదిరినందుకు అతనూ సంతోషపడాలి అనుకున్నాను. అందుకని ఈ మాట అతనికి చెప్పడం ఇంక వాయిదా వేయదలుచుకో లేదు. కాని, ఉత్తరం పోస్టులో వేసేముందు మీకు తెలియజేద్దామని వచ్చాను.'

'జార్జ్!' పళ్ళులేని బోసినోరు ముందుకి పెట్టి అన్నాడు తండ్రి, 'జాగ్రత్తగా విను! ఈ విషయం నాతో మాట్లాడడానికని నువ్వు వచ్చావు. నిస్సందేహంగా అది నీకు గౌరవాపాదకమే! కాని, నువ్వు పూర్తి నిజం నాకు చెప్పకపోతే ఇదంతా వట్టి మాయ! అంతకంటే నికృష్టం! నేను ఇక్కడ ఉదాహరించడానికి వీలులేని విషయాలు ఇప్పుడు

కదలించదలచుకోలేదు. మీ అమ్మ చనిపోయినప్పటి నుంచీ కొన్ని సంగతులు జరిగినయి. అవి సరి అయినవి కావు. వాటిని గురించి చెప్పే రోజు వస్తుంది, మనం అనుకుంటున్న దానికంటె త్వరలోనే రావచ్చు. వ్యాపారంలో నాకు తెలియకుండా చాలా పనులు జరుగుతున్నయి. పూర్తిగా నాకు పరోక్షంగా జరుగుతున్నాయని నేననటం లేదు. నేనింక పనులు చూడలేక పోతున్నాను. నా జ్ఞాపకశక్తి తగ్గుతూంది. చాలా విషయాల్ని గురించి ఇప్పుడు నేను పట్టించుకోవడం లేదు. మొదటి సంగతి, ఇది ప్రకృతి శాపం. రెండవది మీ అమ్మ చావు నీకంటే నాకు తీరని ఆఘాతమైంది. ఇప్పుడెలాగూ ఆ సంగతి మాట్లాడు–తున్నాం గనక, ఈ ఉత్తరం విషయంలో జార్జ్! నిన్ను బ్రతిమిలాడుకుంటున్నాను. నన్ను మోసం చెయ్యకు! ఇది స్వల్పవిషయం. నాతో చెప్పవలసినంత అవసరం లేదు. నన్ను మోసం చెయ్యకు! నిజంగా నీ ఈ స్నేహితుడు సెయింట్ పీటర్‌బర్గ్‌లో?'

గాభరాపడుతూ జార్జి లేచి నుంచున్నాడు. 'నా స్నేహితుల సంగతి మీకెందుకు లెండి! వెయ్యిమంది స్నేహితులైనా నాకు మా నాన్నంత కారు. నేనేమనుకుంటున్నానో తెలుసా? మీ విషయంలో మీరు తగినంత శ్రద్ధ తీసుకోవడం లేదు. పెద్దతనంలో జాగ్రత్తగా ఉండాలి. మీరు లేకుండా వ్యాపారంలో నేనేమీ చెయ్యలేను ఆ సంగతి మీకు బాగా తెలుసు. వ్యాపారం మీ ఆరోగ్యానికి ముప్పుతెచ్చే పక్షంలో రేపే ఆ వ్యాపారాన్ని శాశ్వతంగా మూసివేయడానికి నేను సిద్ధం. కాని, అది చాలదు. మీ జీవిత విధానం మారాలి. మౌలికమైన మార్పు తెచ్చుకోవాలి. అక్కడ ఆ హాల్లో బోలెడంత వెలుతురు ఉంటే మీరీ చీకట్లో కూచుంటారు. ఉదయ భోజనం ఏదో కతికి బలం పట్టకుండా చేసుకుంటున్నారు. కిటికీ మూసుకుని కూచుంటారు. గాలి మీకు చాలా మంచిది. ఇలా కాదు నాన్నా! డాక్టరుని తీసుకువస్తాను. ఆయన ఆదేశాలు పాటిద్దాం! ఈ గది మారుద్దాం. మీరు ముందు గదిలోకి మారవచ్చు. నేను ఇక్కడికి వస్తాను. మీకేమీ మార్పు కనిపించదు. మీ సామాన్లన్నీ మీతో వస్తాయి. కాని, అవన్నీ తరువాత చూసుకోవచ్చు. ఇప్పుడు ముందు మిమ్మల్ని పడుకోపెడతాను రండి. మీకు విశ్రాంతి చాలా అవసరం. రండి మీ దుస్తులు తీసివేయడానికి నేను సాయం చేస్తాను. నాకు చేతనవును. మీకే తెలుస్తుంది. లేక ఇప్పుడే మీరు ముందుగదికి వెళతానంటే ప్రస్తుతానికి నా పరుపు మీద మీరు పడుకోవచ్చు. అదే చాలా మంచిపని!'

జార్జి తండ్రికి దగ్గరగా ఆనుకుని నిల్చున్నాడు. తండ్రి నెరిసిపోయిన చింపిరి జుట్టు అతని రొమ్ముమీద ఆనేటట్టు వంగాడు.

'జార్జ్!' కదలకుండా హీనస్వరంతో అన్నాడు తండ్రి.

వెంటనే తండ్రి ప్రక్కన మోకరిల్లాడు జార్జి. ముసలివాని అలసిపోయిన ముఖంలో ప్రక్కలగుండా నిదానంగా తన వైపే చూస్తున్న రెండు పెద్ద కనుగ్రుడ్లు అతడు చూశాడు.

'సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నీకు స్నేహితుడు లేడు, నువ్వెప్పుడూ నాకు టోకరా ఇస్తూనే ఉన్నావు. నా కాలు పుచ్చుకుని లాగడానికి నీకు సంకోచంలేదు. నీకంత దూరాన ఎలా స్నేహితుడుంటాడు? నేను నమ్మలేను.'

'వెనుకటి సంగతులు జ్ఞాపకం తెచ్చుకోండి నాన్నా!' అన్నాడు జార్జి. తండ్రిని కుర్చీలోనుంచి పైకి లేవనెత్తుతూ. ఆయన దుర్బలంగా నిలబడగా డ్రస్సింగ్ గౌను ఊడబీకుతూ, 'ఆఖరుసారి అతడు మనల్ని చూడడానికి వచ్చి మూడేళ్ళు కావస్తుంది. మీకతనంటే ఎక్కువ ఇష్టం లేదని నాకు జ్ఞాపకం ఉంది. కనీసం రెండు సార్లు అయినా అతడు నాతోకూడా నా గదిలో కూచుని ఉన్నా అతణ్ణి మీరు కలుసుకోకుండా నేను నివారించాను. మీ కతనంటే అనిష్టత ఉండడాన్ని నేనర్థం చేసుకోగలను. అతడి విచిత్ర లక్షణాలు అతని కున్నాయి. కాని, తరువాత తరువాత మీరు అతనితో సరిపుచ్చుకున్నారు. అతని మాటలు వింటూ తల ఊపుతూ, అతన్ని ప్రశ్నలడుగుతూ ఉండడం చూసి నేను గర్వపడ్డాను. మీరు గతంలోకి చూస్తే మీకు తప్పకుండా జ్ఞాపకం వస్తుంది, రష్యన్ విప్లవాన్ని గురించి ఏమాత్రం నమ్మడానికి వీలులేని చిత్రమైన కథలు అతను చెబుతూండేవాడు. ఉదాహరణకి అతడు వ్యాపారపుపని మీద 'కీవ్' నగరానికి వెళ్తూ ఓ గుంపుమధ్య చిక్కుకుని, ఒక మేడమీదికి వరండాలో తన అరచేతిలో సిలువగుర్తు కోసుకుని ఆ అరచేతిని పైకెత్తి జనాన్ని ఉద్బోధిస్తున్న మతాచార్యుణ్ణి చూసినట్టు చెప్పాడు. అటు తర్వాత ఆ కథను ఒకటి రెండుసార్లు మీరే స్వయంగా చెప్పారు కూడాను!'

ఈలోగా జార్జి తండ్రిని తిరిగి కూచోపెట్టి, జాగ్రత్తగా ఆయన ఉలెన్ డ్రాయర్లూ మేజోళ్లూ ఊడదీశాడు. తండ్రితాలూకు ఆ లోపలిదుస్తులు అపరిశుభ్రంగా ఉండడం చూసి తను అశ్రద్ధ వహించినందుకు తనని తాను నిందించుకున్నాడు. తన తండ్రి లోపలి దుస్తుల్ని ఎప్పటికప్పుడు మార్పిస్తూ ఉండడం నిశ్చయంగా అతని బాధ్యత. తన కాబోయే వధువుతో భవిష్యత్తులో తన తండ్రి విషయమై ఏమి ఏర్పాట్లుచేయాలో అతడింకా సూటిగా గుర్తించలేదు. ఏమంటే పైకి అనుకోకపోయినా వివాహం అయిన తరవాత పాత ఇంట్లో తండ్రి ఒక్కడే ఉండడం ఖాయమన్నట్టే తాము వర్తిస్తున్నారు.

కాని, ఇప్పుడు తన నూతనగృహానికి తండ్రిని తమవెంట తీసుకు వెళ్ళాలని వెంటనే దృఢంగా నిశ్చయం చేసుకున్నాడు. నిదానించి చూస్తే తన తండ్రి విషయంలో తీసుకో–దలచిన శ్రద్ధ కాలం మించిపోయిన తరవాత తీసుకోవడం కాగలదని అనిపించింది.

తండ్రిని రెండు చేతులతో ఎత్తి పరుపుమీద పడుకోపెట్టాడు. ప్రక్కవైపు ఆ నాలుగడుగులూ నడుస్తూ ఉండగా ఆ వృద్ధుడు రొమ్ముమీది తన గడియారపు గొలుసుతో ఆడుకుంటూ ఉండడం చూసి అతనికి చాలా భయమైంది. ఆయన గట్టిగా గడియారపు గొలుసు పట్టుకొని ఉన్నందువలన ఒక నిమిషంపాటు ఆయనను పక్కమీద పడుకో పెట్టలేకపోయాడు.

ఆయన్ని పక్కమీద పడుకోపెట్టగానే, అంతా సవ్యంగా ఉన్నట్టు కనిపించింది. రగ్గు ఆయన భుజాలదాకా కప్పుకున్నాడు. కళ్ళెత్తి జార్జివంక బొత్తిగా ప్రేమ లేని ఒక చూపు చూశాడు.

'నా స్నేహితుడు ఇప్పుడు మీకు జ్ఞాపకంవస్తున్నాడు కదండీ?' ఉత్సాహంగా తల ఊపుతూ అడిగాడు జార్జి.

'నాకు రగ్గు పూర్తిగా కప్పినట్టేనా?' పాదాలకు రగ్గు కప్పిఉందో లేదో తను చూసుకోలేనట్టు అడిగాడు తండ్రి.

'అప్పుడే మీకు పడకలో వెచ్చదనం తెలుస్తోందన్నమాట!' అని జార్జి రగ్గు ఒంటికి మరింత అంటిపెట్టుకుని ఉండేటట్టు లోపలికి దోపాడు.

'నాకు పూర్తిగా రగ్గు కప్పేసినట్టేనా?' మళ్ళీ అడిగాడు తండ్రి, చిత్రంగా కొడుకు నుంచి జవాబు ఆశిస్తున్నట్లు కనిపిస్తూ.

'ఆదుర్దాపడకండి. పూర్తిగా కప్పినట్టే'

'లేదు' అరిచాడు తండ్రి, కొడుకు జవాబును మధ్యలో త్రుంచివేస్తూ, రగ్గు పైకి ఎగిరిపోయేటంత విసురుగా విదిలించివేస్తూ నిటారుగా ప్రక్కమీద లేచి కూచున్నాడు. మనిషి తూలిపోకుండా ఒక చేత్తో తేలికగా పైన పట్టుకున్నాడు.

'నువ్వు పూర్తిగా నా కళ్ళు కప్పాలనే చూస్తున్నావు. నాకు తెలుసురా! నా చిన్నారి పాపా! కాని, నాకింకా పూర్తిగా కళ్ళు మూసుకుపోలేదు. ఇదే నా కడపటి బలమైనా

నీకు ఇది చాలు. ఎక్కీతక్కీగా చాలు. అవును! నాకు నీ స్నేహితుడు తెలుసు. వాడు నా మనస్సుకి నచ్చిన కొడుకులాంటివాడు నాకు. అందుకనే ఇన్నేళ్ళుగానూ వాణ్ణి నువ్వు మోసం చేస్తున్నావు. అతని పరిస్థితికి నేను విచారించడం లేదనుకుంటున్నావు కదూ! అందుకే నువ్వు నీ ఆఫీసు గదిలో కూచుని తలుపులు బిడాయించుకుంటున్నావు– యజమానిగారికి తీరిక లేదు. ఆయనను డిస్టర్బ్ చేయకూడదు. నువ్వు రష్యాకి నీ అబద్ధాలకోరు ఉత్తరాలు వ్రాసుకుంటూ ఉండడానికి వీలుగా. కాని, దేవుడి దయవల్ల కొడుకునెలా అర్థం చేసుకోవాలో తండ్రికి నేర్పనక్కరలేదు. ఇప్పుడు ఆ మిత్రుణ్ణి పూర్తిగా అధఃపాతాళంలోకి తొక్కేసి, వాడు మళ్ళీ కదలకుండా వాడి మీద బైఠాయించానని నమ్ముతూన్నందువల్ల ఇప్పుడు నా సుపుత్రుడు వివాహం చేసుకోడానికి నిశ్చయించు–కున్నాడు.'

తండ్రి కల్పించిన ఈ అభాండానికి తెల్లబోయి చూశాడు జార్జి. ఒక్క సారిగా తన తండ్రి అంత పరిచితుడుగా కనిపిస్తున్న సెయింట్ పీటర్స్‌బర్గ్ లోని తన స్నేహితుడు లోగడ ఎప్పుడూ లేనంత స్పష్టంగా అతని భావనాపథంలో మెరిశాడు. విస్తృతమైన రష్యాలో కనపడకుండా కలిసిపోయిన అతనిని జార్జి చూశాడు. దోపిడీకి గురి అయి ఖాళీ అయిపోయిన ఒక గిడ్డంగి గుమ్మం దగ్గర అతనిని చూశాడు. ఛిన్నాభిన్నమైన షోకేసుల మధ్య, చెల్లా చెదరుగా పడి ఉన్న సరుకు తాలూకు అవశేషాల మధ్య, క్రింద పడబోతున్న గాస్ బ్రాకెట్ల మధ్య అప్పుడే అతడు లేచినుంచుంటున్నాడు. అంత దూరదేశం అతడు ఎందుకు వెళ్ళవలసివచ్చింది?–

'నా మాటలు శ్రద్ధగా విను!' అరిచాడు తండ్రి. జార్జి ఉలిక్కిపడి సంగతంతా శ్రద్ధగా ఆకళింపు చేసుకునేందుకు మంచంవైపు పరుగెత్తాడు. కాని, సగం దారిలోనే నిలిచిపోయాడు.

'ఆమె తన గౌను పైకెత్తిందని!' తండ్రి సాగదీస్తూ అన్నాడు. 'ఆ దౌర్భాగ్యురాలు ఇలా తన గౌను పైకెత్తిందని,' ఆమెను అనుకరిస్తూ తన చొక్కా పైకి ఎత్తాడు. యుద్ధంలో తగిలిన గాయంవలన తొడమీద ఏర్పడిన మచ్చ కనిపించేటంతగా చొక్కా పైకి ఎత్తాడు. 'ఆమె ఇలా తన గౌను పైకి ఎత్తిందని, అయినా అమెతో నువ్వు రాజీపడ్డావు. ఏ పోరూ పొక్కూ లేకుండా ఆమెతో నువ్వు స్వేచ్ఛగా కులకడం కోసం నీ తల్లి స్మృతిని నువ్వు కళంకితం చేశావు. స్నేహితుణ్ణి వంచించావు. కాని, నీ తండ్రి కదలగలడు. కదలలేడనుకుంటున్నావా?"

ఆయన లేచి, ఏమీ పట్టుకోకుండా నిల్చుని కాళ్ళు విదిలించాడు. ఆయన అంతర్ దృష్టి ఆయనను ప్రకాశవంతంగా చేసింది.

తండ్రికి సాధ్యమైంత దూరంగా ఒక మూల ఒదిగి నిల్చున్నాడు జార్జి. చాలా కాలం క్రితం అతని మనస్సులో దృఢనిశ్చయం చేసుకున్నాడు. తండ్రి ప్రతి కదలికా శ్రద్ధతో గమనించాలనీ, పరోక్షమైన దాడిలో వెనుకనించో, మీదనుంచో తన మీదికి లంఘించి తనని ఆశ్చర్యపరిచే అవకాశం ఆయనకు ఈయకూడదనీ, చాలా రోజులుగా మరచిపోయిన ఆ నిశ్చయం ఆ క్షణంలో అతనికి జ్ఞాపకం వచ్చింది. పొట్టి దారపు ముక్కను సూదిబెజ్జంలో ఎక్కిస్తున్నవాడిలాగా, అంతలో మళ్ళీ అతను ఆ మాట మరచి-పోయాడు.

'ఇంత చేసినా నీ స్నేహితుడు వంచింపబడలేదు,' చూపుడువేలు ఆడిస్తూ గట్టిగా అన్నాడు తండ్రి. 'అతని ప్రతినిధిగా ఇక్కడ నేనున్నాను.'

'ఏమిటి ప్రహసనంలో విదూషకుడిలాగా!' పట్టలేక జార్జి ఆ జవాబు పైకి అనేశాడు. వెంటనే దానివలన జరిగిన హానిని అతడు గుర్తించి కళ్ళు తిరగ్గా నాలిక కొరుక్కుని ఆ బాధతో క్రింద చతికిలబడ్డాడు.

'ఔను! నేను ఇన్నాళ్ళూ ప్రహసనమే ఆడుతున్నాను. ప్రహసనం! చాలా మంచిమాట! నిర్భాగ్యుడైన ఒక వృద్ధ భార్యావియోగికి మిగిలిన సుఖం ఇంకేముంది? చెప్పరా! జవాబు చెప్పేటప్పుడు నా బ్రతికి ఉన్న నిజమైన కొడుకుగా జవాబుగా చెప్పు! నాకింక మిగిలి ఉన్నదేమిటీ అని. ఈ మారుమూల గదిలో, విధేయత చూపని ఉద్యోగులతో, ఎముకలదాకా వ్యాపించిన వార్ధక్యంతో ఏం మిగిలింది నాకు? కొడుకు లోకంలో కులుకుతూ తిరుగుతూ ఉంటే, తను అమర్చిపెట్టిన బేరాలు పైసలు చేస్తూఉంటే, విజయానందంతో ఉప్పొంగిపోతూ గౌరవనీయుడైన వ్యాపారస్థుడిలాగ తండ్రినుంచి దూరమవుతూ ఉంటే ఇంక నాకు మిగిలిందేమిటి? నేను నిన్ను ప్రేమించలేదను-కుంటున్నావా నువ్వు ఎంతగా నన్ను తిరస్కరిస్తున్నా?'

ఇప్పుడింక ముందుకు వంగుతాడు అనుకున్నాడు జార్జి. ఒకవేళ తూలి కింద పడిపోతే? అతని మనస్సులో గుసగుస ధ్వని చేస్తూ ఈ మాటలు కదలిపోయినయి.

తండ్రి ముందుకు వంగాడు. కాని, పడిపోలేదు తను అనుకున్నట్టుగా జార్జి తన దగ్గరకు రాకపోవడం వల్ల మళ్ళీ నిటారుగా నిలబడ్డాడు.

'ఉన్నచోటే నిలబడు! నీ అవసరం నాకు లేదు. నా దగ్గరకు వచ్చే శక్తి నీకు ఉందనీ, నువ్వు కావాలనే దూరంగా నిలబడ్డాననీ అనుకుంటున్నావా? అంత గట్టి నమ్మకం పెట్టుకోకు! ఇప్పటికీ మనిద్దరిలో నేనే బలమైనవాణ్ణి, నా మట్టుకు నేనే అయితే ఈ పాటికి నా బలం తగ్గి ఉండేది. కాని, మీ అమ్మ తన బలం కూడా నాకు ఇచ్చిపోయింది. అందువల్లనే నీ స్నేహితుడితో నేను చక్కని సంబంధం పెట్టుకోగలిగాను. నీ కాతాదార్లందరూ ఇదిగో ఈ జేబులో ఉన్నారు.'

'ఈయన చొక్కాకి కూడా జేబులున్నాయే!' అనుకున్నాడు జార్జి తనలో తను. ఆ మాటతో లోకంలో ఆయనను సాధించగలవారెవ్వరూ లేరనే నమ్మకం అతనికి కుదిరి పోయింది. కేవలం ఒక్క క్షణం పాటే అలా అనుకున్నాడు. ఏమంటే అన్నీ క్రమంగా అతను మరిచిపోతూ వస్తున్నాడు.

'నీ కాబోయే వధువును కూడా వెంట పెట్టుకొని నా దారిని అడ్డగించడానికి ప్రయత్నించి చూడు! నీ ప్రక్కన నిలిచి ఉండగానే ఆమెను విసిరివేస్తాను. ఆ పని ఎలా చేస్తానో నీకు తెలియదు.'

ముడుచుకున్న ముఖంతో జార్జి తన అపనమ్మకం ప్రదర్శించాడు. తండ్రి తన మాటల నిజాన్ని దృఢవరుస్తూ, జార్జి ఉన్న మూల వైపు తల పంకించాడు.

'వివాహసంబంధం సంగతి స్నేహితుడికి తెలియచేయాలా?' అని నన్ను ఆడగడానికి వచ్చి ఇవాళ నాకు ఎంత వినోదం కలిగించావు! ఒరే మూర్ఖుడా! నీ సంగతి ఇదివరకే తెలుసురా నాకు! అంతా పూర్తిగా తెలుసు. వ్రాత పరికరాలు నా నుంచి దూరం చేయడం నువ్వు మరచిపోయినందువల్ల అతనికి నేను వ్రాస్తూనే ఉన్నాను. అందుకే, ఇన్నేళ్ళుగా అతనిక్కడికి రాలేదు. నీ కంటె వందరెట్లు ఎక్కువ బాగా అతనికి అన్ని సంగతులూ తెలుసు. నీ ఉత్తరాలు తెరవనైనా తెరవకుండా ఎడమ చేత్తో నలిపి పారవేస్తూ ఉంటాడు. కుడి చేత్తో నా ఉత్తరాలు పట్టుకుని ఆద్యంతం శ్రద్ధగా చదువుతూ.'

తన ఉత్సాహంలో ఆయన తల మీదుగ తన చేయి విసురుకున్నాడు.

'అన్ని సంగతులూ వెయ్యిరెట్లు ఎక్కువ బాగా అతనికి తెలుసు,' గట్టిగా అన్నాడు.

'పదివేల రెట్లు!' అన్నాడు జార్జి, తండ్రిని వేళాకోళం చేయడానికి. కాని, అతని నోట్లో ఆ మాటలు చాలా నిజంగా అన్నట్టు ధ్వనించాయి.

'ఇలాంటి ఏదో ఒక ప్రశ్నతో నువ్వు వస్తావని సంవత్సరాల తరబడి నేను ఎదురు చూస్తున్నాను. ఇంతకంటె నేను మరో విషయం పట్టించుకుంటున్నానని నువ్వు అనుకుంటున్నావా? ఇదిగో చూడు!' అని ఎలాగో ఆయన మంచంమీద వచ్చిపడిన ఒక వార్తాపత్రిక కాగితం జార్జివైపుకి విసిరాడు. పాత వార్తాపత్రిక! పేరు జార్జికి పూర్తిగా అపరిచితం!

'ఎంతకాలం పట్టిందిరా నువ్వు పెద్దవాడివవడానికి! నీ తల్లి చచ్చిపోవలసి వచ్చింది. ఈ శుభదినం చూడడానికి ఆమె నోచుకోలేదు. రష్యాలో నీస్నేహితుడు సర్వనాశనం అయిపోతున్నాడు. మూడేళ్ళ క్రితమే తగినంతగా పచ్చబడిపోయాడు. ఇక నా సంగతి అంటావా? నేను ఏ స్థితిలో ఉన్నానో నువ్వు చూస్తూనే ఉన్నావు. అందుకు నీ తలలో ఇంకా కళ్ళు మిగిలి ఉన్నాయి.'

'అంటే, నా కోసం ఇన్నాళ్ళూ పొంచి ఉన్నారన్న మాట!' అన్నాడు జార్జి.

జాలి పడుతున్నట్టు, అతి తేలికగా తండ్రి అన్నాడు. 'ఆ మాట నువ్వు ఇంకా కొంచెం ముందరే అంటావనుకున్నాను. కాని, నువ్వు ఇప్పుడు అన్నా ఏమీ ఫరవాలేదు,' మరింత గొంతుకతో– 'ఇప్పుడు నువ్వుగాక ఈ ప్రపంచంలో ఇంకా ఎంత ఉందో నీకు తెలిసి ఉంటుంది. ఇంతవరకూ నిన్ను గురించి మాత్రమే నీకు తెలుసు. అమాయికపు పసిపాపవి! అవును. నిజం. కాని, అంతకంటె నిజం. నరరూపరాక్షసుడివి! అందుచేత ఇదిగో స్వీకరించు. నీళ్ళలోపడి చావాలని నీకు నేను శిక్ష విధిస్తున్నాను.'

జార్జికి ఆ గదిలోనుంచి బయటపడేట్టు ఏదో శక్తి తొందర చేసినట్టనిపించింది. అతడు పరుగెత్తి పోతూవుంటే తండ్రి దభీమని మంచంమీద పడిన చప్పుడు ఇంకా అతని చెవులలో మ్రోగుతూనే ఉంది. మెట్లమీద వాలు బల్లనుంచి జారినట్టు శరవేగంతో దిగుతూ ఉదయం గది ఊడవడానికి మేడమీదికి వస్తున్న పనిమనిషితో ఢీ కొన్నాడు. 'హాయ్ జీసెస్!' అంటూ ఆమె తన చేతి గుడ్డతో ముఖం కప్పుకుంది.

కాని, అప్పటికే అతడు వెళ్ళిపోయాడు. వీధి గుమ్మందాటి, రోడ్డుదాటి, నీళ్ళవైపు. ఎవరో తరుముతున్నట్టు పరుగెత్తాడు. నది ఒడ్డున ఉన్న ఇనుప బద్దీలు చేరుకునేసరికి,

పస్తులున్న మనిషి అన్నం మీదికి ఎగబడినట్టు అతను రొప్పుతున్నాడు. చిన్నప్పుడు తల్లితండ్రులు గర్వంతో పొంగిపోయేందుకు కారణమైన పేరు పొందిన వస్తాదు తను. అలాంటి వస్తాదులాగ ఇనుప బద్దీ పట్టుకుని వ్రేలాడుతూ ఒకసారి ఊగాడు. దూరంగా మోటారు బస్సు వస్తూ ఉండడం చూశాడు. తాను నీళ్ళలో పడే చప్పుడును ఆ బస్సు ధ్వని కప్పివేస్తుంది కదా అనుకుని ఒక్కసారి మెల్లగా 'ప్రియమైన తల్లితండ్రులారా! ఎన్ని చెప్పినా నే నెప్పుడూ మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉన్నాను,' అని పట్టువదలి నీళ్ళలోకి జారిపోయాడు.

అదే క్షణంలో నిరంతరాయమైన ప్రవాహంగా బ్రిడ్జిమీద ట్రాఫిక్ సాగిపోతూంది.

◆

15

‘**జర్మన్** సంప్రదాయ సాహిత్య దర్పణం’ (1971) తెలుగులోకి తీసుకురావడం కన్నా ముందే ఆ సంస్థ ‘ప్రశస్త ఆధునిక జర్మన్‌కథానికలు’ (1967) అనే పుస్తకం వెలువరించింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తాము అంతదాకా నమ్మిన పదాలన్నీ అర్థం పోగొట్టుకున్న దశలో జర్మన్ కథకులు రాసిన కథలవి. మొత్తం పదమూడు కథలు. అందులో ఏడు కథలు పద్మరాజుగారూ, ఆరు కథలు కుటుంబరావుగారూ అనువాదం చేసారు.

నలభయ్యేళ్ళ కింద నేను కొనుక్కుని చదివి దాచుకున్న పుస్తకాల్లో అది కూడా ఒకటి. ఆ రోజుల్లోనే, అంటే అరవైల్లోనే, ఆ పుస్తకం 3500 ప్రతులు ప్రచురించారు, కాని ఇప్పుడు ఆ పుస్తకం ఆర్కైవులో కూడా లభ్యంగా లేదు. నన్ను వెన్నాడే కథల్లో ఆ పుస్తకంలో కథ కూడా ఒకటి ఉంది. అందుకని ఆ పుస్తకం కోసం తెలిసినవాళ్ళందరినీ అడిగాను. కానీ ఈ లోపు బంగారు రామాచారికి ఎలా తెలిసిందో ఒక పిడిఎఫ్ నాకు పంపించారు. అట్ట సగం చిరిగిపోయిన ఆ పుస్తకం అలానే స్కాను చేసి ఉంది. కాని నా భాగ్యం ఆ పుస్తకమే నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

ఏ కథ అందులో నన్ను వెంటాడింది? పేరు గుర్తులేదు, రచయిత పేరు ఎలానూ గుర్తుండదు. కాని ఒక సరస్సు, మంచు, ఎవరో స్కేటింగు చేస్తుంటారు, మంచుపొరల్లాగా

ఏవో జ్ఞాపకాల పొరలుపొరలుగా ఉంటాయి, ఇలా ఏదో నీలమూ, ఆకుపచ్చా కలగలసిన ఒక మరకగా ఆ కథ నాకు గుర్తుండిపోయింది. ఆతృతగా పుస్తకం ముందుకీ వెనక్కీ స్క్రోలు చేస్తూ ఉన్నాను. కానీ మొత్తం కథలన్నీ మరోసారి చదవనక్కర్లేకుండానే ఆ కథ దొరికింది.

'దుక్కపిల్ల' అదీ ఆ కథపేరు. కథ రాసినామె Marie Luise Kaschnitz (1901-74). జర్మను రచయిత్రి. అదృష్టవశాత్తూ ఇప్పుడు ఆమె గురించి ఇంటర్నెట్టులో చాలా సమాచారం లభ్యమవుతూ ఉన్నది. ఆమె కథల సంపుటి Long Shadows (1995) కూడా దొరికింది. అందులో ఈ కథ The Fat Girl కూడా ఉంది. ఆ కథల్ని అనువదించిన Anni Whissen పుస్తకానికి రాసిన ముందుమాటలో ఈ కథ కాస్నిట్జ్‌కి చాలా ఇష్టమయిన కథ అని చెప్పడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. అంతే కాదు, కాస్నిట్జ్ కథకురాలికన్నా కూడా కవిగా ఎక్కువ ప్రఖ్యాతి పొందిందనీ, రెండు సార్లు నోబెలు పురస్కారానికి నామినేటు అయ్యిందనీ కూడా తెలిసింది. ఇవేమీ తెలియని ఆ నా పసి వయసులో నేనామె కథ చదివి విభ్రాంతికి గురయ్యానని నాకు కించిత్ గర్వంగా కూడా అనిపించింది.

ఈ కథ గురించి ఏమి చెప్పినా మీరు పాఠకులుగా ఈ కథ చదివి మీకై మీరు చేరుకో–వలసిన అనుభూతికి నేను అడ్డం పడినట్టు అవుతుంది. అందుకని ఈ కథకీ, మీకూ మధ్య అడ్డుగా ఉండకుండా పక్కకు తప్పుకుంటున్నాను.

మేరీ లూసీ కాస్నిట్జ్

దుక్కపిల్ల

కొడవటిగంటి కుటుంబరావు

క్రిస్మస్ శలవులయిపోయిన కొద్దిరోజులకు, జనవరి ఆఖరున ఆ దుక్కపిల్ల నా దగ్గిరికి వచ్చింది. ఆ శీతాకాలం నేను ఇరుగుపొరుగుల ఉండే పిల్లలకు పుస్తకాలు అరువివ్వ–నారంభించాను. వాళ్ళు పుస్తకాలు తీసుకుపోయి మళ్ళీ తిరిగి ఇవ్వడానికి వారంలో ఒకరోజు ఏర్పాటు చేశాను. పిల్లలందరూ నాకు తెలిసినవాళ్ళే అనుకోండి, కాని ఒక్కొక్కప్పుడు మా వీథికి చెందని కొత్త కొత్త పిల్లలుకూడా వచ్చేవారు. చాలామంది పుస్తకాలిచ్చి కొత్తవి తీసుకుని వెంటనే వెళ్ళిపోయేవారు, మరికొందరు అక్కడే కూర్చుని చదవడం మొదలుపెట్టేవారు.

అప్పుడు నేను డెస్కుదగ్గిర కూచుని పని చూసుకునేదాన్ని. వాళ్ళు గోడబీరువాల పక్కన ఉండే చిన్న బల్లవద్ద కూర్చునేవాళ్ళు. వాళ్ళు నా పనికి ఏమీ భంగం కలిగించేవారు కారు, నాకు సరదాగా కూడా వుండేది.

ఈ దుక్కపిల్ల శుక్రవారంనాడో, శనివారంనాడో వచ్చింది. అది పుస్తకాలిచ్చే రోజు మటుకు కాదు. నేను బయటికి పోదామని నిర్ణయించుకుని, నేను సిద్ధం చేసుకున్న అల్పాహారం తీసుకుని గదిలోకి వచ్చాను. అంతకు ముందే ఎవరో వచ్చి వెళ్ళారు, వాళ్ళు బయటివాకిలి మూయడం మరిచి ఉండాలి. అందుచేతనే ఆ దుక్కపిల్ల నా

ఎదట అకస్మాత్తుగా ప్రత్యక్షమైంది. నేను నా ఫలహారం పళ్ళెం డెస్కు మీద పెట్టి, వంటింటినుంచి ఇంకేదో తీసుకురావడానికి వెనక్కు తిరిగి ఆ పిల్లను చూశాను. ఆ పిల్లకు సుమారు పన్నెండేళ్ళుండవచ్చు. పాతకాలపు వూలు కోటూ, అల్లిన నల్లని కాలి తొడుగులూ ధరించింది, తాడు కట్టిన స్కేట్లు రెండు పట్టుకుని ఉన్నది. ఆమె నాకు తెలిసినట్టుండి కూడా తెలియరాలేదు. ఆమె చడీ చప్పుడూ కాకుండా వచ్చి నన్ను భయపెట్టింది.

'నేను నిన్నెరుగుదునా?' అని ఆశ్చర్యంగా అడిగాను.

దుక్కపిల్ల జవాబు చెప్పలేదు. చేతులు కలిపి బొజ్జమీద పెట్టుకుని, నీటిలాగా స్వచ్ఛంగా ఉన్న కళ్ళతో చూస్తూ నిలబడింది.

'పుస్తకమేమన్నా కావాలా?' అని అడిగాను.

దుక్కపిల్ల ఈసారికూడా జవాబు చెప్పలేదు. నాకేమంత ఆశ్చర్యంకూడా కలగలేదు. పిల్లలు సిగ్గుపడడమూ, వాళ్ళకు నేను సహాయపడడమూ నాకు అలవాటే. కనక కొన్ని పుస్తకాలు తెచ్చి ఆ పిల్లముందు పెట్టి, పుస్తకాలిచ్చేటప్పుడు నించే కార్డుమీద రాయడానికి ఉపక్రమించాను.

'నీ పేరేమిటి?' అని అడిగాను.

'దుక్కగుంట' అని పిలుస్తారు, అన్నదా పిల్ల.

'నన్నుకూడా అలాగే పిలవమంటావా?' అని అడిగాను.

ఆ పిల్ల నాతోబాటు చిరునవ్వు నవ్వక, తనకు ఎలాగైనా ఒకటేనన్నది. ఆ క్షణంలో ఆమె ముఖాన ఏదో వేదన కనబడినట్టు జ్ఞాపకం. కాని నేనప్పుడు పట్టించుకోలేదు.

'ఎప్పుడు పుట్టావు?' అని ఇంకా ప్రశ్నించాను.

'కుంభరాశిలో', అన్నదా పిల్ల తొణకకుండా.

ఆ సమాధానం వింటే నాకు నవ్వొచ్చి, వేళాకోళానికామాట కార్డులో కెక్కించాను. ఆ తరవాత పుస్తకాలకు వచ్చాను.

'నీకు ప్రత్యేకించి కావలసినదేమన్నా ఉందా?' అని అడిగాను.

కాని ఆ పిల్ల పుస్తకాలకేసి చూడడంలేదు. ఆమెకళ్ళు నా టీ, శాండ్విచ్‌లూ ఉన్న పళ్ళెంమీద ఉండడం నా కంటపడింది.

'తినడానికేమన్నా కావాలా ఏమిటి?' అని చప్పున అడిగాను.

ఆమె తల ఆడించింది. ఈ సంగతి నాకు ముందే తట్టనందుకు బాధతో కూడిన ఆశ్చర్యంలాటి భావం ఒకటి ఆమె ముఖాన కనబడింది. ఆమె శాండ్విచ్‌లు ఒక్కొక్కటే తినసాగింది. ఆమె తినే వైనం నాకు తరవాతగాని అర్థం కాలేదు. ఆ తరవాత ఆమె అలాగే కూర్చుని, అలుపుతోనూ, నిర్లిప్తతతోనూ కూడిన చూపులతో గది చుట్టూ కలయ జూసింది. ఆమెను చూస్తుంటే ఎందుకో నాకు చిరాకూ, విముఖత్వమూ కలిగింది. మొదటినుంచీ ఆ పిల్లపట్ల నాకు ద్వేషం ఏర్పడిన మాట నిజం ఆ పిల్లలో కనిపించే చురుకులేనిదనమూ, కొవ్విన, కుదురైన ముఖమూ, నిద్రమత్తుగానూ, ఒళ్లు బరువుగానూ మాట్లాడే తీరూ– ప్రతిదీ నాకు ఏవగింపుగానే ఉన్నది. ఆమె మూలాన బయటికి వెళ్ళే ఆలోచన మానుకున్నప్పటికీ, ఆమె అంటే నాలో కొంచెంకూడా స్నేహభావం కలగక క్రూరంగానూ, ఉత్సాహరహితంగానూ ఉండిపోయాను.

డెస్కు దగ్గిర కూర్చుని, పనికి ఉపక్రమించుతూ ఆ పిల్లకు చదవాలని ఎంత మాత్రమూ లేదని తెలిసికూడా, ఊఁ చదువు. అనడంలో స్నేహభావం ఏముంటుంది గనక? నేనలా కూర్చుని రాసుకుందామనుకున్నాను, లేకపోతే ఇంకేదైనా చేద్దామను–కున్నాను. ఏమంటే, ఏదో ఊహించాలనీ ఊహించగలిగితేగాని ప్రాణం కుదటబడదనీ అనిపించేటప్పుడు ఆ ఊహ తట్టకపోతే కలిగే మానసికాందోళనలాటిది నన్నావ–హించింది. ఈ ఆందోళనను కొద్దిసేపు భరించాను.

ఆ తరవాత నావల్ల కాక వెనక్కు తిరిగి అతికీఅతకని ప్రశ్నలతో సంభాషణ సాగించాను,

'నీ కెవరన్నా అన్నదమ్ములూ, అప్పచెల్లెళ్ళూ ఉన్నారా?' అని అడిగాను.

'ఉన్నారు,' అన్నదా పిల్ల.

'నీకు బడంటే ఇష్టమేనా?' అని అడిగాను.

'ఇష్టమే' అన్నదా పిల్ల.

'నీ కెక్కువ ఏమిటిష్టం?'

'అంటే?' అని ఆ పిల్ల అడిగింది.

'ఏ విషయం?' అన్నాను నిస్సహాయంగా,

'నాకు తెలీదు' అన్నదా పిల్ల.

'జర్మను భాష ఇష్టమేమో?' అని అడిగాను.

'నాకు తెలీదు' అన్నదా పిల్ల.

పెన్సిలు వేళ్ళసందున వుంచి తిప్పాను. నాకు భయంలాటిదేదో పుట్టుకు రాసాగింది. దానికీ ఆ పిల్ల ఆకారానికీ ఎలాటి సంబంధమూ లేదు.

నేను వణికిపోతూ, 'నీకెవరైనా స్నేహితురాళ్ళున్నారా?' అని అడిగాను.

'లేకేం? ఉన్నారు', అన్నదా పిల్ల.

'నీకు మరీ ఇష్టమైనవాళ్ళుండాలి కాదూ?' అని అడిగాను.

'ఏమో', అన్నదా పిల్ల. ఆమె ఆ ముతక వూలుకోటు వేసుకుని అలా కూచుని ఉంటే బలిసిన గొంగళిపురుగులాగా కనబడింది. తినడంకూడా గొంగళి పురుగులాగే తిన్నది, ఇప్పుడు దారి తడువుకుంటున్న గొంగళిపురుగులాగున్నది.

పగసాధించాలన్న వింతకోరిక లోపల ఉండి, నీ కింక తిండి పెట్టేది లేదు, అని లోపల అనుకున్నాను. అయినప్పటికీ లేచి వెళ్ళి రొట్టే సాసేజి మాంసమూ తెచ్చి పెట్టాను. ఆ పిల్ల వాటికేసి నిర్వికారంగా తేరిపారజూసి గొంగళిపురుగు తిన్నట్టుగా, నింపాదిగానూ, విడవకుండానూ లోపలినుంచి ఏదో తినమని ప్రేరేపిస్తున్నట్టుగా తినసాగింది. నేనా పిల్లను శత్రుభావంతో మౌనంగా గమనించాను.

నేనిప్పుడేస్థితికి వచ్చానంటే, ఆ పిల్లంటే నాకు అన్నివిధాలా ఆందోళనా, చిరాకూ పుట్టుకొస్తున్నది. ఆ తెల్లదుస్తులేమిటి ఆ ఎత్తుకాలరేమిటి అసహ్యంగా, అనుకున్నాను. ఆ పిల్ల తినడం ముగించి కోటు గుండీలు పెట్టుకుంటూంటే, నేను మళ్ళీ కూర్చుని

పని చూడసాగాను, కాని అంతలో ఆ పిల్ల నా వెనకనుంచి పెదిమలతో చప్పుడు చేసింది. ఎక్కడో అడవి మధ్య ఉండే బురదనీటి గుంటలో బుడగ బద్దలైతే వచ్చే చప్పుడు లాగుందా చప్పుడు. అందులో నాకు మానవస్వభావంలో గల నీరసమూ, మందకొడితనమూ, భారమూ, నైరాశ్యమూ స్ఫురించి నన్ను చాలా కుంగదీసింది. నాతో నీకేం పని? వెళ్ళిపో, వెళ్ళిపో, అనుకున్నాను. నా చేతులతోనే ఆ పిల్లను గదిలోనుంచి అవతలికి గెంటెయ్యాలనిపించింది, ఏదో స్తబ్ధమృగాన్ని తోసేసినట్టు. కాని నే నామెను గదిలోనుంచి బయటికి గెంటటానికి మారుగా, ఆమెతో, వెనకటిలాగే దయారహితంగా సంభాషణ పెట్టుకున్నాను.

'మంచుమీదికి పోతున్నావా?' అని అడిగాను.

'అవును', అన్నది దుక్కపిల్ల,

'నీకు స్కేటింగ్ బాగా వచ్చునా?' అని అడుగుతూ, ఆమె చేతినుంచి ఇంకా వేళ్ళాడుతున్న స్కేట్లకేసి చూపించాను.

'మా అక్కకు బాగా వచ్చు', అన్నదా పిల్ల. మళ్ళీ ఆమె ముఖంలో బాధా, విచారమూ కనిపించాయి. ఈసారికూడా నేను పట్టించుకోలేదు.

'మీ అక్క ఎలా ఉంటుంది? నీలాగే వుంటుందా?' అని అడిగాను.

'లేదు, లేదు. మా అక్క చాలా సన్నగా వుంటుంది, అక్క జుట్టు నల్లగా, నొక్కులు నొక్కులుగా ఉంటుంది. వేసంకాలం మేము పల్లెపట్టుకు పోయినప్పుడు రాత్రివేళ గాలివానవస్తే అక్క లేచి వెళ్ళి, పైఅంతస్థు బాల్కనీలో కూర్చుని పాడుతుంది', అన్నదా పిల్ల.

'మరి నువో?' అని అడిగాను.

'నేను పక్క వదలను. నాకు భయం', అన్నదా పిల్ల.

'మీ అక్కకు భయం లేదు, కాదూ?' అని అడిగాను.

'లేదు. అక్క ఎన్నడూ భయపడదు. అన్నిటి కన్నా ఎత్తుగా ఉండే స్ప్రింగ్ బోర్డు మీదినుంచి నీటిలోకి దూకేస్తుంది. తలకిందులుగా దూకి, చాలా దూరం ఈదుకుంటూ పోతుంది. ..'

'మీ అక్క ఏం పాడుతుంది?' అని అడిగాను ఉబలాటంగా.

'తన యిష్టం వచ్చినది పాడుతుంది. పాటలు కడుతుంది', అన్నదా పిల్ల విచారంగా.

'మరి నువో?' అని అడిగాను.

'నేనేమీ చెయ్యను', అన్నదా పిల్ల. తరువాత లేచి నిలబడి, 'నేనిక వెళ్లాలి', అన్నది. నేను చెయ్యి చాచాను. దుక్కల్లాంటి వేళ్ళు నా చేతిలో పెట్టింది. నాలో ఏం పుట్టిందో సరిగా చెప్పలేను ఆమెను వెంబడించాలనిపించింది. ఆ ప్రేరణ మౌనంగాచేసిన బలమైన పిలుపు. 'మళ్ళీ ఎప్పుడైనా రా', అన్నాను. మనస్ఫూర్తిగా అన్నమాట కాదు. ఆ పిల్ల ఏమీ అనక ప్రశాంతమైన కళ్ళతో నాకేసి చూసింది. తరవాత ఆమె వెళ్ళిపోయింది. నాకు న్యాయంగా బరువుదిగినట్టయి ఉండవలిసింది. కాని బయటి తలుపు మూసిన చప్పుడయిందో లేదో, నేను చప్పున నడవలోకి పరిగెత్తి, కోటు వేసుకున్నాను. గబగబా మెట్టు దిగి నేను వీధిలోకి వచ్చేసరికి ఆ పిల్ల మలుపు తిరగడం కనిపించింది.

ఈ గొంగళిపురుగు స్కేటింగు చేస్తుంటే చూడాలి. ఈ బలిసిన బొండాం మంచు మీద ఎలా కదులుతుందో గమనించాలి, అనుకుని, ఆ పిల్లను చూపు మేరలో ఉంచడానికని చురుకుగా నడవసాగాను.

ఆ పిల్ల నా గదిలోకి వచ్చినప్పుడు అపరాహ్ణమై ఎంతోసేపు కాలేదు, ఇప్పుడు చీకటి పడబోతున్నది. నేనా నగరంలో కొన్నిసంవత్సరాలున్నప్పటికీ, ఇప్పుడు నాకు దారి సరిగా తెలీదు. నేనా పిల్లను వెంబడించే దృష్టితో ఉండడంలో మేమే ప్రాంతంలో ఉన్నదీ కూడా తెలియకుండాపోయింది. నాకు అన్ని వీధులూ, చౌకులూ కొత్తగా కనపడ సాగాయి. అకస్మాత్తుగా వాతావరణమంతా మారినట్టు నాకు అనిపించింది. ఎంతో చలి అనిపిస్తూ ఉండినది కాస్తా, మంచు కరిగే స్థితిగా మారినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ మార్పు ఎంత తీవ్రంగా ఉన్నదంటే, చెట్లమీదినుంచీ, ఇళ్ళకప్పుల మీదినుంచీ మంచు కరిగి కారనారంభించింది. ఆకాశాన వడమబ్బులు తిరుగుతున్నాయి. మేము నగరం శివార్లకు వచ్చేశాం. అక్కడ ప్రతి ఇంటిచుట్టూ పెద్ద పెద్ద తోటలున్నాయి. చివరకు ఇళ్ళు అయిపోయాక ఆ పిల్ల చప్పున పల్లంలోకి పరుగెత్తి కనబడకుండా పోయింది. అక్కడికి వెళ్ళిచూస్తే స్కేటింగు చేసే స్థలమూ దీపాలతో వెలిగి పోయే కొట్లూ, ఆర్క్ లైట్లూ, మిలమిలా మెరిసే స్కేటింగు రంగంలో సంగీతమూ, సందడీ ఉంటాయనుకున్నాను, కాని నేను చూసిన దృశ్యం అది కానేకాదు. ఆ పల్లంలో వున్నది

సరస్సు. దాని చుట్టూ ఈసరికి ఇళ్ళు లేచి ఉంటాయనుకున్నాను. కాని అది నిర్జనంగా ఉన్నది. నా చిన్నతనంలోలాగే ఉన్నది, దాని చుట్టూ నల్లని చెట్ల గుంపులున్నాయి.

తలవని తలంపుగా ఇలాటి దృశ్యం కళ్ళబడడంతో నే నా పిల్లజాడ పోగొట్టు కున్నంత పని చేశాను. కాని నాకామె సరస్సు ప్రక్కన చతికిలబడి కూర్చుని కనబడింది. కాలిమీద కాలువేసుకోవడానికీ, ఒక చేత్తో స్కేటు పాదానికి ఆనించి పట్టుకుని, రెండోచేత్తో శీల బిగించడానికీ యత్నిస్తున్నది. ఒకటి రెండు సార్లు శీల పడిపోయింది. దానికోసం వెతుకుతూ ఆమె మంచుమీద పాకుతుంటే ఏదో వింతరకం గోదురుకప్పలాగా కనబడింది అంతకంతకూ చీకటి ముదురుతున్నది. సరస్సులోకి చొచ్చుకుపోయిన రేవుగట్టు ఆ పిల్లకు కొద్ది గజాల దూరంలోనే వున్నది. సరస్సు పైభాగం వెండిలాగా తెల్లగా మెరుస్తుంటే ఈ గట్టు చీకటి నలుపులో కనబడింది. సరస్సు పైభాగమైనా అంతటా ఒకేరకంగా మెరవక, అక్కడక్కడా నల్లనికరలు కనిపిస్తున్నాయి. మంచు కరగడం సాగుతున్నట్టు ఈ కరలే గుర్తు. 'వేగిరం', అని తొందరపడుతూ కేక పెట్టాను. ఆ పిల్లకూడా త్వరగా కదిలింది. అయితే నేను తొందర పెట్టడంవల్ల కాదు, దూరాన ఎవరో 'రావే, దుక్క గుంటా', అని కేక పెట్టడంచేత. అలా కేక పెట్టిన ఆకారం కాంతిమంతంగా ఉండి, మంచుమీద వలయాలు చుట్టుతూ తిరుగుతున్నది. నృత్యాలు చేసి, గాలివానల్లో పాటలుపాడే 'అక్క' ఈ మనిషే అయి వుంటుందని నాకు తట్టింది. ఈమె నాకు నచ్చిన పిల్ల. ఆ సమయంలో నే నక్కడికి వచ్చినది ఈ నాజూకైన పిల్లను చూడడానికేనని ఆ క్షణంలో నేను నమ్మాను కూడా. అయితే, ఆ ఇద్దరుపిల్లలూ ఎలాటి ప్రమాదస్థితిలో వున్నదీ నేను గుర్తించకపోలేదు. ఎందుకంటే, అదే సమయంలో ఆకస్మికంగా ఒక విధమైన మూలుగూ నిట్టూర్పులాటి ధ్వనులు-సరస్సుమీద పేరుకున్న మంచు విచ్చే- టప్పుడయే ధ్వనులు- ఆరంభమయాయి. నిట్టూర్పులు దయ్యపు దుఃఖంలాగున్నాయి. అవి నాకు వినిపించాయి గాని, ఆ పిల్లలకు వినిపించలేదు.

వాళ్ళా ధ్వనులు వినలేదనడానికి సందేహంలేదు. ఎందుచేతనంటే, అసలే పిరికిదైన ఆ దుక్కపిల్ల వాటిని వింటే మంచుమీదికి బయలుదేరకపోను, కదలలేకుండా కదులుతూ ఇంకా ముందుకు పోవడానికి ప్రయత్నించకపోను. ఆమె అక్కకూడా దూరంనుంచి నవ్వుతూ, చెయ్యి ఊపి, స్కేట్ల మొనలమీద నిలిచి బొంగరంలాగా చక్కర్లు కొట్టకపోను, తరవాత ఎనిమిది అంకె ఆకారంలో అందంగా చుట్టకపోను. దుక్క పిల్ల నల్లటి ప్రదేశాల మీదుగా స్కేట్ చేస్తూ వెళ్ళి, వాటిని చూసి దడుచుకున్నది. ఆమె అక్క చప్పున తిరగడం మానేసి, దూరంగా, మంచుమీద జారుతూ వెళ్ళిపోయింది.

నేను రేవుగట్టు వెంబడి ఒక్కొక్క అడుగే వేసుకుంటూ ముందుకు సాగడంచేత నాకు అంతా స్పష్టంగా కనిపించింది. కొయ్యపలకల మీద మంచు పేరుకుని ఉన్నప్పటికీ, దిగువన దుక్కపిల్ల కదిలినదానికన్న నేనే హెచ్చువేగంతో కదిలాను. నేను వెనక్కు తిరిగి చూసినప్పుడా పిల్లముఖం కనిపించింది. అది నిర్వికారంగా కనిపించి–నప్పటికీ అందులో గాఢమైన ఆకాంక్ష ఉండనేఉన్నది. అంతటా మంచు నెర్రెలు వచ్చి ఆ నెర్రెలకుండా నురుగు, వెర్రివాడి నోటినుంచి వెలువడినట్టుగా, పైకిరావడం చూశాను. అప్పుడే ఆ దుక్కపిల్ల కాళ్ళకింది మంచు విరిగి పోవడంకూడా నాకు కనబడింది. ఇది జరిగినచోటు రేవుగట్టుకు కొద్దిబారల దూరంలోనే ఉన్నది, అక్కడే ఈ పిల్ల అక్క మంచునృత్యాలు చేస్తూవుండింది కూడానూ.

నిజానికి ఆ పిల్ల మంచుకుండా నీటిలో పడిపోవడంలో ప్రాణాపాయ పరిస్థితి ఏమీ లేదని చెప్పాలి.

సరస్సు కరుడుకట్టేటప్పుడు పొరలు పొరలుగా మంచు ఏర్పడుతుంది. పైపొరకు మూడడుగుల దిగువనున్న పొర దృఢంగానే ఉన్నది. అందుచేత ఆ దుక్కపిల్ల మూడడుగుల లోతు నీటిలో దిగబడింది. ఆ పిల్ల ఉన్నది మంచునీటిలోనన్నమాటా, ఆమెకు అన్ని వేపులా మంచుగడ్డలు విచ్చుతున్న మాటా యథార్థమే, కాని ఆమె కొద్ది అడుగులు నీటిలో నడుస్తూ వస్తే రేవుగట్టు చేరుకుని, పైకి రావచ్చు, నేను సహాయం చెయ్యగలుగుతాను. కాని ఆమె ఆ మాత్రం ప్రయత్నంకూడా చెయ్యలేదని నాకు అకస్మాత్తుగా తోచింది. ఆమె భయంతో చచ్చిపోతూ, అలాగే నిలబడిపోయి, వ్యర్థంగా తడువులాడుకున్నది గాని, గట్టును సమీపించే ప్రయత్నం ఏమీ చెయ్యనుకూడా లేదు. ఆమెచుట్టూ నీరు సుడులు తిరుగుతున్నది, మంచు విరిగిపోతున్నది. కుంభరాశి అధిదేవత ఆమెను దిగువకు ఈడ్చేస్తున్నాడు. అయితే నాలో చలనం లేదు, పిసరంత జాలి కలగ లేదు. నిశ్చలంగా వుండిపోయాను.

కాని అంతలోనే దుక్కపిల్ల చప్పున తల ఎత్తింది. ఇప్పటికి రాత్రి అయి, మబ్బుల మాటునుండి చంద్రుడు పైకివచ్చి వుండడాన ఆ పిల్లముఖంలో ఏదో మార్పు వచ్చినట్టు నేను చూడగలిగాను. ముఖలక్షణాలు పూర్వంలాగే ఉన్నట్టుండికూడా మార్పుచెందాయి. మృత్యుముఖంలో ఉండి, జీవితసౌరభాన్నంతనూ ఆస్వాదించిన విధంగా, ఆమె ముఖం సత్త్వంతో కూడిన ఉద్రేకంతో విప్పారింది. అవే ఆఖరుక్షణాలనీ, మృత్యువు సమీపంలోనే ఉన్నదనీ నే ననుకున్నమాట నిజమే. నేను అలవ కమ్మీలమీదికి వంగి దిగువనవున్న

పాలిపోయిన ముఖంలోకి చూశాను. అది నల్లని నీటిలోని ప్రతిబింబంలాగా కనబడింది. అయితే ఇప్పుడా పిల్ల రేవుగట్టును సమీపించింది. చేతులుచాచి, చెక్కకూర్పులో అమర్చిన శీలలనూ, కొక్కాలనూ పట్టుకుని పైకి లేవడానికి చురుకుగా ప్రయత్నించింది.

అయితే ఆమె శరీరం మరీ బరువైపోయింది. చేతులు కోసుకుపోయి రక్తం చిమ్మాయి. ఆమె వెనక్కు పడిపోయి, మళ్ళా ప్రయత్నం ప్రారంభించింది. నేనా దీర్ఘమైన పోరాటాన్ని కళ్ళారా చూశాను. గుడ్డును పగలదీసుకొనీ, పిసినికాయను చీలదీసుకునీ బయటికి రావడంలాగా, విముక్తికోసం చేసే భయంకర సంఘర్షణ లాటిదది. ఇప్పుడు నేనామెకు సహాయం చెయ్యగల స్థితిలో వున్నాను. కాని ఆమెకు నా సహాయం అవసరం లేదని నాకు తెలిసిపోయింది. నే నామెను పోల్చుకున్నాను.

ఆ సాయంకాలం నేనింటికి తిరిగి రావడం నాకు జ్ఞాపకంలేదు. నాకు జ్ఞాపకం ఉన్నదల్లా మెట్లమీద పక్కనుండే ఆవిడ ఎదురైతే, సరస్సుచుట్టూ ఇంకా కొన్ని పొలాలూ చీకటిచెట్లతోపులూ ఉన్నాయనడమూ, ఆమె, లేదు, ఏమీ లేవు అనడమునూ. ఆ తరవాత నేను నా డెస్కుమీది కాగితాలు చిందర వందరగా ఉండడం గమనించాను. వాటిమధ్య ఒక పాత ఫోటో, నాదే, ఉన్నది. అందులో నేను ఎత్తుకాలరుగల తెల్లని వూలుకోటు తొడుక్కున్నాను, చాలా లావుగా ఉన్నాను. నా కళ్లు స్వచ్ఛంగానూ, తడిగానూ ఉన్నాయి.

◆



మరుక్షణంలో పన్నా బోటు మీద ఉన్నది

16

సాహిత్యం చదవడం మొదలుపెట్టినరోజుల్లో నేను చారిత్రిక కథలు, నవలలు అంటే చెవికోసుకునేవాణ్ణి. మా అన్నయ్య సుందర్రావు ద్వారా అడవి బాపిరాజు, నోరినరసింహ శాస్త్రి, తెన్నేటి సూరి వంటి రచయితల నవలలు పరిచయమయ్యాయి. ఆ తర్వాత తాడికొండ లైబ్రరీలో విశ్వనాథ సత్యనారాయణ 'పురాణవైర గ్రంథమాల' నవలలు నన్ను ఆకట్టుకున్నాయి. 1857 తిరుగుబాటుమీద పురిపండా అప్పలస్వామి రాసిన 'వీరభారతం', నవల కాకపోయినప్పటికీ, నాకు పారాయణ గ్రంథంగా ఉండేది.

కాని తాడికొండలోనే మొదటిసారి నేను మాస్తి 'చిక్కవీర రాజేంద్ర', కురతులైన్ హైదర్ 'అగ్నిధార' నవలలు చదివేను. ఆ నవలలకీ తెలుగు రచయితలు రాసిన చారిత్రక నవలలకీ మధ్య ఏదో ప్రధానమైన వ్యత్యాసం ఉందని ఆ పసితనంలోనే నాకు తెలిసిందిగాని, అదేమిటో నాకై నేను స్పష్టంగా పోల్చుకోలేకపోయాను. ఆ తర్వాత రాజమండ్రి రోజుల్లో, ప్రేమ్‌చంద్ 'చదరంగపు ఆటగాళ్ళు' చదివినప్పుడు, ఒక కథకుడు చరిత్రని ఎలా చిత్రించాలో నాకు లీలగా బోధపడింది. కాని నిజమైన చారిత్రక కథ ఎలా ఉండాలో జయశంకర ప్రసాద్ రాసిన 'గూండా' (1934-35) చదివినదాకా నాకు తెలియనే లేదు. మా హీరాలాల్ మాష్టారి పుణ్యమా అని జయశంకర ప్రసాద్ నాకు తాడికొండ రోజుల్లోనే పరిచయమయ్యాడు. 'సమస్త హిందీ సాహిత్యం ధ్వంసమై

పోయినా పర్వాలేదు, 'రామచరిత మానస్', 'కామాయని' మిగిల్తే చాలు!' ఇదీ మా మాష్టారి నోటమ్మట నేను పదేపదే విన్నమాట. ఆయన ప్రోద్బలంతోనే 'కామాయని', 'ఆసూ౦' చదవడం మొదలుపెట్టాను కూడా. కాని, ఇదుగో, ఈ 'గూండా' కథ చదివాకనే నాకు ప్రసాద్ అంటే ఏమిటో తెలిసొచ్చింది

నేషనల్ బుక్‌ట్రస్టు వారు వేసిన 'కథాభారతి: హిందీ కథలు' (1971), సాహిత్య అకాడెమీ వారు వేసిన '23 హిందీ కథలు' (1974)– రెండు సంపుటాల్లోనూ ఈ కథ ఉంది. ఈ కథని అప్పట్లో, ఆ రెండు సంపుటాల్లోనూ కూడా, నేను మళ్ళీ మళ్ళీ చదివాను.

ఒక చారిత్రిక సంఘటనని కథగా రాయాలంటే ఈ కథ ఒక నమూనా అని నాకు గుర్తుండి పోయింది. ఇప్పుడు నలభయ్యేళ్ళ తర్వాత, బంగారు రామాచారి పుణ్యమా అని, '23 హిందీ కథలు' మళ్ళా నా చేతుల్లోకి వచ్చాక, మళ్ళా ఈ కథ చదివాను. సందేహం లేదు, ఇది మణిపూస.

1781 జూలై–ఆగస్టు నెలల్లో, వారన్ హేస్టింగ్సు బనారస్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడం, ఈస్టిండియా కంపెనీ తొలిరోజుల్లో ఒక ముఖ్య ఘట్టం. ఆ సంఘటనలో బనారస్ ప్రజలు కూడా కంపెనీని ఎదిరించి రాజా చేత్‌సింగ్‌కి మద్దతుగా నిలబడ్డారని చరిత్ర చెప్తున్నది. అటువంటి ఒక ముఖ్యఘట్టాన్ని ప్రసాద్ కథగా మలిచిన తీరు నిజంగా సమ్మోహనీయం.

జయశంకర ప్రసాద్

గూండా

వేమూరి రాధాకృష్ణమూర్తి

ఏభై సంవత్సరాలకు పైబడి వుంటుంది అతని వయస్సు. అయినా యువకుల కంటె బలంగాను దృఢంగాను వున్నాడు. అతని చర్మంలో ఎక్కడా ముడతలు పడలేదు. జోరున కురుస్తున్న వర్షంలోను, పుష్యమాసపు రాత్రుల్లోను, మిటమిటలాడే జ్యేష్ఠ మాసపు ఎండలోను, అంగీ అయినా తొడుక్కోకుండా తిరగడమంటే అతనికి సర్దా. మెలికలు తిరిగిన అతని కోరమీసాలు తేలుకొండిలా, చూచేవాళ్ల కళ్లల్లోకి గుచ్చుకుంటూ వుంటాయి. అతని శరీరం శ్యామలవర్ణంతో పాములా నిగనిగలాడుతూ నున్నగ వుంటుంది. అతడు కట్టుకొనే నాగపూరు ధోవతికి గల ఎర్రని పట్టుఅంచు ఎంతో దూరాన్నుంచి కొట్టవచ్చినట్లు కనబడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ వుంటుంది. నడుముకు బిగించిన బనారస్ పట్టు పైపంచలో ఒక వైపున ముత్యపుచిప్పలాంటి పిడిగల చురకత్తి దాగివుంటుంది. అతని ఉంగరాల జుట్టును బంధించి వుంచే బంగారు వన్నె అంచుగల తలపాగాకొస ఒకటి అతని వెడల్పాటి వీపుమీద, మరో కొన తలమీద ఠీవిగా విహరిస్తూవుంటాయి. ఎత్తయిన అతని భుజం మీద పదునైన కసాయికత్తి ఎప్పుడు చూచినా వుండవలసిందే. కిర్రు చెప్పులు తొడుక్కొని బజారున నడుస్తుంటే అతడు వస్తున్నాడని అందరికి గుర్తే. అతడు పెద్ద గూండా.

అజాతశత్రువు పరిపాలిస్తున్నప్పుడు ఉపనిషత్కాలాల పరిషత్తులో చేరి బ్రహ్మవిద్య నేర్చుకొనేందుకై దూర దూరాలనుండి పండిత ప్రకాండులగు బ్రహ్మచారులు కాశీపట్టణం వస్తూవుండేవారు. అట్టి కాశీపట్టణ స్వరూపం క్రీస్తుశకం పదునెనిమిదవ శతాబ్దపు చివరిభాగంలో చాలావరకు మారిపోయింది. గౌతమబుద్ధుడు, శంకరాచార్యుల ధర్మ సిద్ధాంతాల చర్చలు, వాదప్రతివాదాలు శతాబ్దాల తరబడిగ ప్రతిధ్వనిస్తుండే దేవాలయాలు, మఠాలు ధ్వంసమైపోయినందున, బ్రహ్మచారులు హతమార్చబడినందున అట్టి చర్చలు పూర్తిగా లోపించిపోయాయి. అస్పృశ్యతను గట్టిగా పాటించే పరమ పవిత్రమైన వైష్ణవమతం కూడా విచ్చలవిడిగా విహరించే క్రొత్తగా అవతరించిన మతోన్మాదాన్ని ఎదుర్కొనలేక కాశీపట్టణంలో అధైర్యపడి పిరికిపందరూపం దాల్చింది. న్యాయశాస్త్రం, బుద్ధిబలం అంతా ఆయుధశక్తి ముందు తలవంచడం గమనించి ఛిన్నా-భిన్నమై నిరాశ పడి పోయిన కాశీపట్టణ పౌరజీవితం ఒక క్రొత్త సంప్రదాయాన్ని సృష్టించింది. శౌర్యం ఆ సంప్రదాయ లక్షణం. మాట కోసం ప్రాణాలను సైతం వదలడం, సింహప్రవృత్తి గల జీవికోపార్జన, ప్రాణభిక్ష కోరిన పిరికివాళ్ల మీద, దెబ్బ తిని పడిపోయిన శత్రువుల మీద దెబ్బ తీయకపోవడం, పీడితులకు, నిర్బలులకు సహాయం చేయడం, ప్రతి క్షణం ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని తిరగడం ఆ సంప్రదాయ లక్షణం. అట్టివాళ్లను కాశీపట్టణ ప్రజలు గూండాలని పిలిచేవాళ్లు.

జీవితంలో అలభ్యమైన కోరికలు నెరవేరనందున జనం విరక్తి చెందుతూ వుంటారు. అదేవిధంగా ఏదో ఒక మానసికమైన దెబ్బ తగిలి గాయపడి పేరు ప్రతిష్ఠలు గడించిన జమీందారు బిడ్డడు నన్హాక్ సింగ్ గూండాగా మారిపోయాడు. ఆస్తినంతటినీ రెండు చేతులతో నాశనం చేసివేశాడు. విపరీతంగా డబ్బు ఖర్చు పెట్టి అతడు ఏర్పాటు చేయించిన వేడుకలను వినోదాలను కాశీపట్టణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరు. వసంత ఋతువునందు అతడు జరిపించిన ప్రహసనాలతో కూడిన నాటకప్రదర్శనాలకు ధనం, బలం, ధైర్యం, సాహసం, తెగింపు ఎంతో అవసరం. ఒక పర్యాయం, నన్హాక్ సింగు కూడా కాలికి గజ్జెలు కట్టి, చేతికి తోడా తొడిగి, కండ్లకు కాటుక పెట్టుకొని ఒక చెవికి వేలాది రూపాయల విలువ గల ముత్యాల ఆభరణం పెట్టుకొని, మరో చెవికి తెగిపోయిన చెప్పుముక్క కట్టుకొని ఒక వజ్రాలు పొదిగిన పిడిగల కత్తి పట్టుకొని మరో చేతిని ఆభరణాల బరువుతో క్రుంగిపోతున్న వేషం వేసికొని తన ప్రక్కన నటిస్తున్న ప్రియురాలి భుజం మీద ఆనించి 'గుత్తి వంకాయలమ్మే అమ్మీ, ఒక్కసారి యిటు రావేమే. ..' అంటూ పాటలు పాడాడు.

బనారస్ నగరానికి బయట గల పచ్చిక బయళ్లలోను, మంచినీటి బావుల దగ్గర, గంగానదిలో బోటుమీద అతడు తరచు కనబడుతూ వుంటాడు. జూదగృహాన్నుండి బయటికి వచ్చి బోగంవాళ్ల పేటలో నాలుగురోడ్ల కూడలి వద్దకు అతడు వచ్చేసరికి ప్రఖ్యాతి వహించిన కాశీనగరపు అందమైన, చురుకైన వేశ్యాంగనలు చిరునవ్వులతో అతనికి స్వాగతం చెప్పి, కండలు తేరిన అతని శరీరాన్ని రెప్ప వాల్చని కండ్లతో నమిలి మ్రింగుతూ వుండేవారు. అతడు తమలపాకులు అమ్ముకొనేవాడి దుకాణం ముందు కూర్చొని వేశ్యాంగనలు పాడే పాటలు వింటూ వుంటాడేగాని ఎన్నడూ వాళ్ల గడపమీద కాలు పెట్టడు. జూదంలో గెలుచుకొన్న రూపాయల్ని రెండు చేతులతో పట్టుకొని వేశ్యల కిటికీల ముందు నిలబడి ఎగుర వేస్తుంటే కొమ్ములు తిరిగిన మొనగాళ్లంతా నివ్వెరబోయి తల తడుముకునేవారు. అప్పుడు అతడు విరగబడి నవ్వుతూ వుండేవాడు. వేశ్యల యింటికి పదమని కొందరు బలవంతం చేసినప్పుడు నిట్టూర్పు విడిచి మౌనం వహించేవాడు. అప్పుడు అతని ముఖంమీద విషాదరేఖలు అలుము కొంటూ వుండేవి.

ఇప్పుడే అతడు బంసీ జూదగృహాన్నుండి బైటకు వచ్చాడు. ఇవాళ అతణ్ణి అదృష్టం వరించలేదు. పదహారుమంది అప్సరసల నృత్యం కూడా అతణ్ణి ఇవాళ ఆకర్షించలేక పోయింది. పాన్‌షాపు యజమాని పేరు మన్నూ. తిన్నగా వెళ్ళి అతడి కొట్టుముందు కూర్చొన్ని 'ఇవాళ శకునం కలిసిరాలేదోయ్ మన్నూ' అని అంటూ నిట్టూర్పు విడిచాడు.

'అదేమిటి దొరా, ఇందులో బాధపడటం దేనికి ? మేమంతా లేమా. నా సంపదంతా మీదేగదా దొరా.'

'అరే, బడ్డూ, ఒకరిని అడిగి డబ్బు తీసికొని జూదం ఆడడం నన్హాక్ సింగు జన్మలో ఎరుగడు. అలా జరిగిననాడు యీ సింగు చచ్చిపోయినట్లే. నేను జూదం ఎప్పుడు ఆడతానో తెలుసా? చేతిలో ఒక దమ్మిడీ అయినా లేనప్పుడు జూదగృహంలో అడుగు పెడతాను. పెద్ద కుప్ప వున్నచోట తిష్ఠవేస్తాను. పందెం కాస్తాను. అక్కడ పందెం మనల్ని వరించి తీరాలిసిందే. అంతే. కీనారాం బాబా యిచ్చిన వరమహిమోయ్ యిది.'

'ఇవాళ అలా జరగలేదేం దొరా?'

'మొదటి పందెం మనమే గెలిచాం. కాని తరువాత రెండు మూడు పందాలు ఎదురు తిరిగాయి. వచ్చిందంతా వెళ్ళిపోయింది. అయినా యిదిగో అయిదు రూపాయలు మిగిలాయి. తీసికో. ఒక రూపాయి పాన్ బీడాకు తీసికో. మిగతా నాలుగూ మలూకీ దాసుకు యివ్వు. వాణ్ణి వెంటనే దులారీ వేశ్య దగ్గరకు పంపు. పాట ప్రారంభించమని చెప్పమను. ఏ పాటో తెలుసా. అదే . ..'చెలీ ప్రియుడు యిట లేడాయెనే' అనే పాట.

గంజాయి దమ్ముకోసం నిప్పు ముట్టిస్తున్న మలూకీదాసు నన్హక్ సింగ్ మాట వినేసరికి అదిరిపడ్డాడు. రెండు అంగల్లో దులారీయిల్లు చేరుకొని మెట్లు ఎక్కాడు. ఆ హడావుడిలో అతని మోకాలి చిప్పకు గట్టిదెబ్బ కూడా తగిలింది. నన్హక్ సింగ్ కనుబొమల దెబ్బ ముందు, యీ దెబ్బ అతనికి బాధనిపించలేదు. మలూకీదాసుకు నన్హక్ సింగ్ దెబ్బ ఎలా వుంటుందో బాగా తెలుసు. కండ్లారా చూచిన ఒక ఘట్టం అతడు ఎన్నటికీ మరిచిపోలేదు. ఒక పర్యాయం జూదంలో గెలిచి బరువైన రూపాయల సంచి పుచ్చుకొని పాన్‌షాపు ముందు కూర్చున్నాడు. ఇంతలో పెండ్లి ఊరేగింపు వారి బాజాలు వినబడ్డాయి. నన్హక్ అడిగాడు– 'ఎవరిదిరా యీ పెండ్లి ఊరేగింపు?'

'ఠాకూర్ బోధీసింగ్ కొడుకుది దొరా' అని అన్నాడు మన్నూ. నన్హక్ పండ్లు పట పటమన్నాయి 'మన్నూ, ఇటు బోధీసింగ్ పెండ్లివాళ్లు వెళ్లడానికి వీలులేదు. అరే, మలూకీ, వెళ్లు పోరులో మమ్మల్ని గెలిచి ముందుకు అడుగు వేయమని చెప్పు బోధీసింగుకు' అని గద్దించాడు నన్హక్ సింగ్. ఇప్పటివరకు అతని భుజంమీద నిద్రిస్తున్న కసాయికత్తి అతని చేతుల్లోకి వచ్చేసింది. తళతళ మెరుస్తూ మీసం మెలివేస్తూ నిలబడ్డాడు. వీరావేశంతో నన్హక్ సింగ్.

భయంకరమైన నన్హక్ సింగ్ స్వరూపం చూచి మలూకీ గజ గజ వణికిపోయాడు. పరుగెత్తుకొని బోధీసింగు దగ్గరకు వెళ్లాడు. బోధీసింగు, నన్హక్ సింగ్ ఎదురుపడి అయిదు సంవత్సరాలయింది. ఒక రోజున నడిరోడ్డుమీద ఇద్దరూ మాటమీద మాట అనుకొన్నారు. మధ్యలో జనం కల్పించుకొన్నందున అనాడు యిద్దరికీ ఘర్షణ జరగలేదు. ఆ తరువాత మళ్లీ యిద్దరూ ఒక చోట తటస్థపడలేదు. ఈనాడు నన్హక్ సింగ్‌కి అవకాశం దొరికింది. ప్రాణాలకు తెగించి ఒంటరిగా నిలబడ్డాడు నన్హక్ సింగ్. బోధీసింగుకు నన్హక్ వ్యవహారం ఏమిటో బాగా తెలుసు. అందులో కడుపున కన్నబిడ్డడి వివాహం. తానే తగ్గి మూకీతో 'పోరా పో, బాబుగారు ఇక్కడ వున్నారని మాకు తెలియక వచ్చామని, అతడే నిలబడితే యిక ఊరేగింపు వెంట నేను వుండనని, యిద్దరు వియ్యంకుళ్లు

ఊరేగింపు వెంట వుండనవసరం లేదన్నానని చెప్పు పో' అని బోధీసింగు అక్కడి నుండి తిరిగి వెళ్లిపోయాడు.

నన్హాక్ సింగ్ ముందుకు అడుగువేశాడు. మలూకీ భుజంమీద రూపాయల సంచి వుంచి పెండ్లి ఊరేగింపు ముందు తానే నిలబడ్డాడు. ఊరేగింపు దర్జాగా ముందుకు సాగింది. పెండ్లికి అయిన ఖర్చంతా తానే భరించాడు నన్హాక్ సింగ్. పెండ్లి పూర్తి అయిన తరువాత మరుసటి రోజున ఆ పాన్‌షాపు దగ్గరకి పెండ్లి కూతురు, పెండ్లి కొడుకులిరువురినీ ఊరేగింపుగా తీసికొనివచ్చి తిరిగి పంపివేశాడు.

ఆనాడు మలూకీకి పది రూపాయలు బహుమానంగా లభించాయి. అలాంటి నన్హాక్ సింగ్ మాటవిని కదలకుండా కూర్చుంటే తిన్నగా యమధర్మరాజుగారిని దర్శించ వలసి వస్తుందని మలూకీకి బాగా తెలుసు. అందుకనే త్వరత్వరగా వెళ్లి 'నేను శ్రుతి కలుపుతాను. నీవు వెంటనే పాట ప్రారంభించు. బల్లూ,- యింతలో మంచి నీళ్లు త్రాగి వచ్చేస్తాడు' అంటూ దులారీని తొందర పెట్టాడు.

'అమ్మ బాబోయ్. కొంప మునిగిందిరా బాబూ' అంటూ దులారీ లేచి కిటికీలో నుండి తొంగి చూచింది. ఎదురుగా పాన్‌షాపు ముందు నన్హాక్ సింగ్ నిలబడి వున్నాడు. అతని చూపులు తన కిటికీ మీదనే వుండటం దులారీ గ్రహించింది. తలవంచి వినమ్రతతో సలాం చేసింది. నన్హాక్ సింగ్ బదులుగా తిరిగి సలాం చేశాడు. ఇంతలో ఎవరివో మాటలు వినబడి నన్హాక్ సింగ్ చూపులు దులారీ మీదనుండి ప్రక్కకు మళ్లాయి.

చేతిలో సన్నటి పిడిగల చేతికర్ర. కండ్లకు సురమా, నోట్లో పాన్ బీడా, గోరింటాకు వల్ల ఎర్రబడ్డ గడ్డం, తెల్లగా కొట్టవచ్చినట్లు కనబడుతున్న ఎర్రని గడ్డపు వెంట్రుకల మొదళ్లు, కుచ్చులటోపీ, ముళ్లు వేయబడిన అంగరఖా, వెంట అంచులు గల దుస్తులు ధరించిన ఇద్దరు ప్రభుత్వ సిపాయిలు, ఎవరో మౌల్వీ సాహెబు, అతడి వేషం చూచి నన్హాక్ సింగుకు పక్కున నవ్వు వచ్చింది. నన్హాక్ వంక చూడకుండానే మౌల్వీ సాహెబు ఒక సిపాయితో 'ఏయ్ చోబ్దార్, రెసిడెంటుగారి భవంతిలో కచ్చేరీ చేయాలి. వెంటనే బయలుదేరమని దులారీకి చెప్పు. అదుగో జాన్ అలీ కొట్టు. ఇంతలో మేము అక్కడ అత్తరు కొంటాం. త్వరగా రా' అని అంటూ ముందుకు అడుగువేశాడు.

సిపాయి మిద్దెమీదకు ఎక్కబోతున్నాడు. మౌల్వీ సాహెబు జాన్ అలీ కొట్టు దగ్గరకు వెళ్లబోతున్నాడు. నన్హాక్ బిగ్గరగా 'దులారీ, మేము ఇక్కడ యింకా ఎంతసేపు కూర్చోవాలి? సారంగీ వాడు రాలేదా?' అంటూ గద్దించాడు.

దులారీ నాజూకుగా 'మీరు మాకు యజమానులు. మీకోసమే నేను యిక్కడ కూర్చున్నాను. మీరు ఎప్పుడూ నా యింటికి. ..' అన్నదో లేదో మౌల్వీసాహెబుకు వళ్లంతా మండిపోయింది. పెద్దగా అరిచాడు–, అరే చోబ్దార్, ఇంకా ఆ కుక్కబుద్ధి ఛోకరీ మిద్దెనుండి దిగనేలేదా. సరే, వెంటనే కొత్వాల్ దగ్గరకు వెళ్లు. మౌల్వీ అల్లా ఉద్దీన్ కుబరా పిలిచాడని నా పేరు బెట్టి చెప్పు. వెంటనే వచ్చి యీ కుక్కను చితక గొట్టమని చెప్పు. నవాబ్‌గిరీ పోయినప్పటి నుండి యీ కాఫర్ల కండ్లకు కావరం ఎక్కింది. చూపిస్తా నా తడాఖా ఏమిటో.' అతని మాటలు పరిసరాల్లో ప్రతిధ్వనించాయి.

కుబరా మౌల్వీయా! అమ్మ బాబోయ్. కుబరా మౌల్వీయే. మన్నూ గజ గజ వణుకుతూ దుకాణం సర్దుకోసాగాడు. దగ్గరలోనే కూర్చొని కునికిపాట్లు పడుతున్న కోమటివాడు ఉలిక్కిపడి లేచేసరికి నెత్తికి పైకప్పు దూలం గట్టిగా కొట్టుకున్నది. మహారాజా చేత్‌సింగును మూడున్నర సేర్ల చీమలనూనె కావాలని అడిగిన మౌల్వీ యితగాడే. మౌల్వీ అల్లాఉద్దీన్ కుబరా. ఆ బజారంతా గందరగోళమైపోయింది. అంతా భయపడిపోతున్నారు. 'అరే, మన్నూ సింగ్, అరవకుండా కూర్చుంటావా లేదా?' అని అన్నాడు నన్హాక్ సింగ్. మన్నూ మారు మాటాడకుండా కూర్చున్నాడు. 'దులారీ అక్కడినుండి కదలవలసిన అవసరం లేదు. పాట ప్రారంభించు. మేము యిలాంటి అడవారకాన్ని చాలామందిని చూచాం. నిన్నటి దాకా పాచికలు వేసి జ్యోతిషం చెప్పి అర్థణాలు అడుక్కుతినే వీడు యివాళ దర్పం చూపిస్తున్నాడు బోగం వాడలో'– అని అన్నాడు నన్హాక్. ఆ మాటలు మౌల్వీ చెవిన పడ్డాయి. వెనక్కు తిరిగి చూచి 'ఎవడురా యీ లుచ్ఛా' అని అరిచాడు.

'నీ బాబునిరా, నన్హాక్ సింగు' అన్న సమాధానం చెవిలో పడడంతో పాటు మౌల్వీ సాహెబు నెత్తిమీద పేరు మోసిన బనారస్ దెబ్బ కూడా గట్టిగా పడింది. ఆ దెబ్బకు మౌల్వీ సాహెబు నరాలు మొత్తం ఝుల్లుమనడమే గాక కండ్లు కనబడకుండా పోయాయి. కాళ్ళు తడబడిపోయాయి. సిపాయి లిద్దరూ ప్రక్కనే వున్న వీధిలోకి పారిపోయారు. మౌల్వీ సాహెబ్ పడుతూ లేస్తూ అమాంతం వెళ్ళి జాన్ అలీ కొట్లో కూలబడ్డాడు.

జాన్ అలీ కొంచెం మంచినీళ్లు యిచ్చి మౌల్వీ సాహెబుతో 'మౌల్వీ సాహెబ్ ! ఈ గుండాతో పెట్టుకొన్నావా రగడ. తేలికలో పోనిచ్చాడు. అసలు ఈ పాటికి ఆ కసాయికత్తి పడివుండాల్సింది నీ మెడమీద, బతికిపోయావు' అని అన్నాడు. మౌల్వీ సాహెబు నోరు తెరవుడు పడలేదు. మిద్దెమీది నుండి పాట వినబడసాగింది. 'చెలీ,

ప్రియుడు యిట లేడాయనే' పాట పూర్తయింది. అంతసేపూ ఎవరూ ఎటూ కదలలేదు. అప్పుడు నన్హాక్ సింగ్ మెల్లగా లేచి నెమ్మదిగా అడుగులు వేసుకొంటూ వెళ్ళిపోయాడు. కొద్దిసేపటికి పట్టుతెరలతో మూయబడిన ఒక పల్లకీ వచ్చింది. ఆ పల్లకివెంట రాజ భటుడు ఒకడున్నాడు. అతడు రాజమాత ఆజ్ఞ దులారీకి అంద జేశాడు.

దులారీ మౌనంగా వెళ్లి పల్లకిలో కూర్చున్నది. ధూళితోను, సంధ్యాసమయపు పొగతోను నిండిన యిరుకైన బనారస్ సందుల్లోంచి ఆ పల్లకి శివాలయం రేవు వైపుకు సాగిపోయింది.

2

శ్రావణమాసపు చివరి సోమవారం. రాజమాత పన్నా శివాలయంలో కూర్చొని పూజ చేసికొంటూ వున్నది. దులారీ దేవాలయం బయట కూర్చొని యింకా కొంతమంది గాయకురాంద్రతో కలిసి భజన గీతాలు పాడుతూవున్నది. హారతి పట్టిన తరువాత దోసిటితో పూవులు దేవుని పాదాల పైవుంచి పన్నా భక్తితో దేవునికి నమస్కరించింది. ప్రసాదం తీసికొని బయటకు రాగానే దులారీ కనబడింది. మహారాణిని చూడగానే దులారీ చేతులు రెండు జోడించి లేచి నిలబడి 'ముందుగానే వచ్చేదాన్ని. కాని ఏం చేయను? దరిద్రుడు కుబరా మౌల్వీ వచ్చి రెసిడెంటుగారింటికి పదమని కూర్చున్నాడు. గంటలతరబడి వాడితోనే సరిపోయింది మహారాణీ, పిలవగానే రాలేకపోయాను మన్నించండి' అంటూ వంగి నమస్కరించింది.

'కుబరా మౌల్వీ, ఎక్కడ విన్నా అతడి పేరే వినబడుతూంది. ఇక్కడకు కూడా వచ్చి అతడు ఏమేమో అన్నాడట' అంటూ 'ఆఁ ఆ తరువాత ఏమైంది? నీవు ఇక్కడకు ఎలా రాగలిగావు' అని అడిగింది రాణి పన్నా.

'ఇంతలో బాబూ నన్హాక్ సింగ్ అక్కడికి వచ్చాడు. అయ్యా, శివాలయం వెళ్లి భజనగీతాలు పాడాలి. మహారాణిగారి ఆజ్ఞ. కాని యీ సాహెబు పోనీయడంలేదు. నన్ను పోనీయండి' అని వారిని ప్రార్థించాను. దానితో వారు మౌల్వీ సాహెబును గట్టిగా కొట్టారు. ఆ దెబ్బకు మన్ను కరిచాడు సాహెబు. అప్పటికిగాని నేను యిక్కడకు రావడం పడలేదు'.

'బాబూ నన్హాక్ సింగ్ ఎవరు?'

దులారీ తలవంచుకొని అన్నది– 'రాణీగారు వారిని ఎరుగరా ! బాబూ నిరంజన–సింగు కుమారుడు. చిన్నప్పుడు నేను మీ దగ్గరకు వచ్చి ఊయల ఊగుతూ వుండేదాన్ని. ఒక రోజున యిద్దరం కలిసి ఉయ్యాలలూగుతున్నాం. నవాబుగారి ఏనుగు బెదిరి మనమీదకు దూకింది. అప్పుడు మనల్ని రక్షించింది బాబూ నిరంజనసింగ్ కుమారుడు యీ నన్హాక్ సింగే.'

చిన్నప్పటి ఆ ఘట్టాన్ని గురించి విని రాజమాత ముఖం వివర్ణమై పోయింది. తన్నుతాను సంబాళించుకొని 'బాబూ నన్హాక్ సింగ్ ఆ సమయంలో నీ వాడకు ఎందుకు వచ్చారు?' అని అడిగింది మాట మారుస్తూ మహారాణి పన్నా.

దులారీ చిరునవ్వు నవ్వి తలవంచుకొన్నది. రాజమాత పన్నా తండ్రిగారి జమీందారీలో వుండే వేశ్య కూతురు దులారీ. ఆమెతో బాటు తాను చిన్నతనంలో అనేక పర్యాయాలు ఉయ్యాలలూగింది. చిన్నప్పటినుండి దులారీ కమ్మగా పాటలు పాడుతూ వుండేది. అందంతో బాటు చంచలత్వం కూడా ఆ రోజుల్లోనే ఆమెలో ఎక్కువగా వుండేది. కానీ యిప్పుడో, పన్నా కాశీరాజు తల్లి– దులారీ కాశీ పట్టణపు ప్రసిద్ధ గాయకి. రాజమహలులో దులారీ పాట కచ్చేరీలు తరచుగా జరుగుతూ వుండేవి. మహారాజా బలవంతసింగ్ జీవించి వున్నప్పటినుండి సంగీతం పన్నా జీవితంలో అవసరమైన భాగమైపోయింది. అయితే అప్పుడు ప్రేమ, దుఃఖము బాధలతో కూడిన విరహ కల్పనాగీతాలంటే అభిరుచి ఎక్కువగా వుండేది. ఇప్పుడు సాత్విక భావమయమైన భజనగీతాలంటే మక్కువ ఎక్కువైంది. వైధవ్యంతో దీప్తివంతమైన రాజమాత పన్నా యొక్క ప్రశాంతముఖం కొద్దిగా మలినమైపోయింది.

పెద్దరాణి గారి సవతి ఈర్ష్యాజ్వాల బలవంతసింగ్ చనిపోయిన తరువాత కూడా ఆరిపోలేదు. అంతఃపురం కలహాలకు పుట్టినిల్లు అయిపోయింది. అందుకనే పన్నా తరచు కాశీలోనున్న రాజమందిరానికి వచ్చి పూజల్లో మునిగివుండేది. రామనగర్లో ఆమెకు విశ్రాంతి దొరికేది కాదు. చిన్నరాణి కావడమే కాక బలవంతసింగుకు ప్రేయసి కావడంతో బాటు ఒక కుమారుణ్ణి కన్న గౌరవం కూడా పన్నాకు లభించింది. అయినా వేరే కులమనే సామాజికదోషం ఆపాదించబడిందనే బాధ ఆమె మనస్సును వేధిస్తూ వుండేది. ప్రారంభంలో తన పెండ్లి విషయమై జరిగిన చర్చ జ్ఞాపకం వచ్చింది.

పన్నా చిన్ని వేదికమీద కూర్చొని, పొంగిపొర్లుతున్న గంగా ప్రవాహాన్ని అన్య మనస్కురాలై చూస్తూ వున్నది. సామాన్యంగా తెలియకుండానే చేతినుండి జారి క్రింద

పడి చేతికందకుండా పోయే వస్తువులా కాలగర్భంలో కలిసి పోయిన గతజీవిత ఘట్టాలను గురించి యోచించవలసిన అవసరం సామాన్యంగా వుండదు. దానివల్ల వచ్చేదీ పోయేదీ కూడా ఏమీ వుండదు. అయినా మానవస్వభావం విచిత్రమైనది. అప్పుడప్పుడు 'ఆ విషయం జరిగివుంటే' అని అనిపిస్తూ వుంటుంది. అదేవిధంగా పన్నాకూడ తనను రాజా బలవంతసింగు బలవంతాన పెండ్లి చేసికోకపోయివుంటే ఏం జరిగివుండేదో అని బాబూ నన్హాక్ సింగు పేరు విన్నప్పటినుండి ఊహించుకో సాగింది. పన్నా వెంట మరో దాసీమనిషి నిలబడివున్నది. దాని పేరు గేందా. బలవంతసింగు పన్నాను వలచినప్పటి నుండి గేందా ఆమె దగ్గర వుంటూ వున్నది. రాజ్యంలో ఎక్కడ ఏమి జరుగుతున్నదీ వివరాలన్నీ గేందా ప్రతిరోజూ పన్నాకు చెబుతూ వుంటుంది. గేందాకు చాలా విషయాలు తెలుసు. దులారీని కించపరచాలనే ఉద్దేశ్యంతో గేందా నన్హాక్ సింగును గురించి చెప్పడం ప్రారంభించింది.

'మహారాణీ! నన్హాక్ సింగ్ తన జమీందారీనంతటినీ వినోదాలకు, దున్నపోతుల పోటీ పందాలకు, బోగం మేళాలకు వెచ్చించి యిప్పుడు బందిపోటుగా తయారైనాడు. ఎక్కడ ఖూనీ జరిగినా అతని చేయి వుండి తీరుతుంది. ఎంతమంది ఆడవాళ్లు. ..' మధ్యలోనే దులారీ అందుకొని 'నీవు చెప్పింది అబద్ధం. బాబుగారి వంటి ధర్మాత్ముడు మరొకడు ఎవ్వడూ లేడు. ఎంతోమంది వితంతువులు ఆయన యిచ్చిన ధోవతి కట్టుకొని జీవిస్తున్నారు. ఎంతోమంది ఆడపిల్లల వివాహాలు వారి చేతిమీదుగా జరుగుతూ వుంటాయి. బాధితులకు, దుఃఖితులకు వారు గొప్ప అండ' అని చెప్పుకుపోసాగింది.

పన్నారాణి హృదయంలో కొంత తరళత్వం పొంగివచ్చింది. ఆమె నవ్వుతూ అన్నది– 'దులారీ, ఆయన నీ దగ్గరకు వస్తూ వుంటారు కదూ. అందుకనే కాబోలు ఆయన్ని తెగ పొగడుతున్నావు?'

'కాదు మహారాణీ, ఒట్టు పెట్టుకొని చెబుతున్నాను. బాబూ నన్హాక్ సింగ్ యీ నాటివరకు నా గడప త్రొక్కలేదు.' రాజమాతకు ఆ అత్యద్భుతమైన వ్యక్తిని గురించి తెలుసుకొందామని ఆతురత కలిగింది. అయినా యిక ఏమీ చెప్పవద్దన్నట్లుగా ఆమె దులారీవంక తీక్షణంగా చూచింది. దులారీ యిక ఏమీ మాట్లాడలేదు. మొదటి జామును సూచిస్తూ సన్నాయి మోత వినబడింది. దులారీ సెలవు తీసికొని వెళ్లి పాలకీ ఎక్కి కూర్చున్నది. అప్పుడు గేందా యిలా అన్నది.– 'మహారాణీ, నగర పరిస్థితి బాగాలేదు. పట్ట పగలే ప్రజల్ని దోచుకుంటున్నారు. ఎక్కడబడితే అక్కడ విచ్చల

విడిగా జూదాలు సాగుతున్నాయి. జూదాల్లో జనం సర్వము పోగొట్టుకొని ఫకీర్లు అయిపోతున్నారు. పిల్లల్ని సైతం మోసం చేస్తున్నారు. ఎక్కడబడితే అక్కడ కర్రలతోను, కత్తులతోను కొట్లాటలు జరుగుతున్నాయి. అటు రెసిడెంటుతో మహారాజుకు పడటం లేదు' గేందా మాటలు విని కూడా పన్నా ఏమీ మాట్లాడలేదు.

మరునాడు రాజా చేత్ సింగుకు రెసిడెంటు మార్క్ హేమ్ ఒక జాబు పంపించాడు. అందు నగరపరిస్థితిని గురించి హెచ్చరించాడు. అవ్యవస్థను గురించి తీవ్రంగా విమర్శించాడు కూడా. బందిపోట్లను, గూండాలను పట్టుకోమని, వాళ్లమీద గట్టి నిఘా అవసరమని కూడా సలహా యిచ్చాడు. కుబరా మౌల్వీకి జరిగిన శృంగభంగాన్ని గురించి కూడా అందులో పేర్కొన్నాడు. హేస్టింగ్ రానున్నాడనే వార్తకూడా తెలియ జేశాడు. తరువాత శివాలయం రేవు వద్ద, రామనగర్‌లో గొడవలు జరిగాయి. కొత్వాలు హిమ్మత్‌సింగుకు పిచ్చిఎక్కినంత పని అయింది. ఎవరి చేతుల్లోనైనా కత్తులు, కార్లు, లాఠీలు, విచ్చుకత్తులు వగైరాలు వుంటే వాళ్లను వెంటనే పట్టుకోవడం ప్రారంభించాడు.

ఒకనాడు నన్హాక్ సింగ్ సుమ్మావాగు సంగమం దగ్గర గల ఎత్తుగా వున్న దిబ్బమీద పచ్చికబయలులో కొద్దిమంది అనుచరులతో బాటు కూర్చొని భంగు కలుపుతున్నాడు. గంగానదిలో అతడి చిన్ని బోటు మర్రిఊడకు కట్టివేయబడి వున్నది. కొందరు పాటలు పాడు తున్నారు. నాలుగు జట్కాబండ్లు గుర్రాలతో సహా అక్కడే సిద్ధంగా వున్నాయి.

'మలూకీ ! పాట నచ్చటం లేదు. జట్కా ఎక్కి వెళ్ళు. దులారీని పిలుచుకురా' అని అన్నాడు నన్హాక్ సింగ్. మలూకీ వెంటనే జట్కా ఎక్కి వెళ్లిపోయాడు. ఇవాళ నన్హాక్ సింగ్ మనస్సు సరిగా లేదు. భంగు తయారుచేయడానికి పూనుకొన్నారు. కాని నిషా ఎక్కడం లేదు. గంట సేపట్లో దులారీ అక్కడకు చేరుకొన్నది 'బాబుగారూ మీ ఆజ్ఞ ప్రకారం వచ్చేశాను' అని అన్నది.

'దులారీ, యివాళ నీ పాట వినాలని కుతూహలంగా వున్నది.'

'ఈ అడవిలోనా ? ఎందుకో?' అంటూ సందేహంతో నవ్వుతూ అడిగింది దులారీ.

'సందేహించకు. ఏ విధమైన యిబ్బంది నీకు కలుగదు' నవ్వుతూనే సమాధానం చెప్పాడు నన్హాక్.

'ఈ మాటే ఆ రోజున మహారాణీగారితో చెప్పి వచ్చాను'

'ఏమిటి చెప్పావు ? ఎవరితో చెప్పావు?'

'రాజమాత పన్నా దేవిగారితో'– ఇక ఆ రోజున పాట కుదర లేదు. రాగాలాపన జరుగుతూ వున్నప్పుడు నన్హాక్ సింగ్ కండ్లలో కన్నీటి బిందువులు నిండటం దులారీ గమనించింది. పాటలు, నృత్యాలు పూర్తి అయిపోయాయి. వర్షాకాలపు రాత్రి. ఇలకోళ్ల చప్పుడు విపరీతంగా ప్రతిధ్వనిస్తూంది. అక్కడే వున్న దేవాలయపు ఒక చిన్న గదిలో నన్హాక్ సింగ్ చింతాక్రాంతుడై కూర్చున్నాడు. అతని కండ్లు మూతపడటం లేదు. మిగతా వాళ్లందరూ నిద్రపోయారు. కాని దులారీకి కూడా నిద్ర పట్టలేదు. ఆమెకు నన్హాక్ సింగ్ మీద మక్కువ పెరిగిపోతూ వున్నది. తన్నుతాను సంబాళించు కొనేందుకై చాలా ప్రయత్నం చేసింది. చివరకు విఫలురాలై లేచి నన్హాక్ సింగ్ దగ్గరకు మెల్లగా చేరుకొన్నది. చప్పుడు విని ఉలిక్కిపడి నన్హాక్ వెంటనే ప్రక్కనే వున్న కత్తిని తీసికొన్నాడు. 'ఆడవాళ్లమీద కూడా కత్తి ప్రయోగిస్తారా బాబుగారూ' అంటూ ఫక్కున నవ్వింది దులారీ.

కొద్ది దూరాన దీపం సన్నగా వెలుగుతూ వున్నది. ఆ వెలుగులో దులారీ ముఖాన్ని పరిశీలించి చూచాడు సింగ్. ఆమె ముఖంలో కామ ప్రవృత్తి తొణికిసలాడుతూ వుండడం గమనించాడు. 'ఏం దులారీ, అప్పుడే వెళ్లిపోవాలా? మౌల్వీ సాహెబు మళ్లీ కబురు చేశాడా?' అని ప్రశ్నించాడు. దులారీ, సింగు దగ్గరకు వచ్చి కూర్చున్నది. 'ఏం భయంగా వున్నదా?' అని అడిగాడు నన్హాక్.

'లేదు. ఒక్క విషయం అడుగుదామని వచ్చాను'

'ఏమిటది?'

'ఏమీ లేదు. .. అదే మీ హృదయంలో. .. ఎన్నడూ. ..'

ఓహో, అదా. ఆ విషయమై నన్ను అడుగకు. నా హృదయం పనికిరాకుండా పోయింది. అందుకనే దాన్ని ఎప్పుడూ అరచేతుల్లో పెట్టుకొని తిరుగుతున్నాను. ఎవరో ఒకరు ఏదో ఒకటి చేస్తున్నారు, త్రొక్కివేస్తున్నారు– చీల్చివేస్తున్నారు– ఎగురవేస్తున్నారు– చచ్చిపోదామని ప్రయత్నిస్తున్నాను. కాని చావడంలేదు.'

'బాబుగారూ, ఏమిటీ మాటలు? చనిపోయేందుకు కూడా ఎక్కడికైనా వెతుక్కుంటూ పోవాలా? మీకు కాశీపట్టణ పరిస్థితి తెలియదా! ఏ క్షణంలో ఏమవుతుందో చెప్పలేము. చాలా గందరగోళం జరిగేటట్లున్నది. బనారస్‌వీథులు జనాన్ని కరిచేందుకు ఉరుకుతున్నాయా అన్నట్లున్నవి.'

'ఏమైన క్రొత్త విశేషం జరిగిందా?'

'ఎవడో హేస్టింగ్ దొర వచ్చాడట. శివాలయం రేవు దగ్గర తెల్లవాళ్ల పటాలాన్ని కాపలా వుంచాడట. రాజా చేత్‌సింగ్, రాజమాత పన్నా అక్కడే ఉన్నారు. వాళ్లను పట్టుకొని కలకత్తాకు పంపిస్తారని వదంతిగా ఉన్నది.'

'ఏమిటీ!' పన్నాగూడా. ..రాణివాసం కూడా అక్కడే ఉన్నదా?' గాబరాగా అడిగాడు నన్హాక్.

'రాణిగారి పేరు వినగానే మీ కండ్లలో కన్నీరు కారుతుందేం బాబుగారూ?'

నన్హాక్ సింగ్ ముఖం ఎర్రబడింది. 'ఆ విషయమై నన్ను అడుగకు. తెలుసుకొని నీవు ఏమీచేయలేవు' అంటూ నన్హాక్ సింగ్ లేచినిలబడ్డాడు. త్వరత్వరగా ఏమిటో వెతకడం ప్రారంభించాడు. కొద్ది సేపటికి సంబాళించుకొన్నాడు 'దులారీ, రాత్రిపూట ఏకాంతంగా వున్నప్పుడు ఒక ఆడమనిషి వచ్చి నా పక్కమీద కూర్చోవడం నా జీవితంలో యిదే మొదటిసారి. జీవితంలో వివాహం చేసికోనని శపథం పట్టాను. అందునిమిత్తం ఎన్నో అబద్ధాలు ఆడుతూ అపరాధాలు చేస్తూ తిరిగాను. ఎందుకో తెలుసా? ఆడవాళ్లంటే నాకు పరమ అసహ్యం. వాళ్లకు ప్రబలశత్రువును, ఇక పన్నా. ..ఇందులో పన్నా తప్పు ఏమీ లేదు. ..దుర్మార్గుడు బలవంతసింగ్. వాడి గుండెల్లో చురకత్తిని గుచ్చలేక పోయాను. వాడి రక్తం కండ్ల చూడలేకపోయాను. .. అంతా అయిపోయింది. ఏమన్నావు? పన్నాను పట్టుకొని తెల్లవాళ్ళు కలకత్తా పంపుతారా. అక్కడే. .. పన్నాను. ..' నన్హాక్ సింగ్‌కు పిచ్చెక్కినంత పనయింది. దులారీ చూస్తూండగానే సింగ్ త్వర త్వరగా పరుగెత్తుకుంటూ కారుచీకట్లో మర్రిచెట్టు క్రిందకు వెళ్ళాడు. పొంగి ప్రవహిస్తున్న గంగానదిలో బోటును వదిలాడు. నన్హాక్ సింగ్‌తో బాటు బోటు వడివడిగా ముందుకు సాగింది. ఎటు చూచినా కారుచీకటి. కన్ను పొడుచుకొన్నా ఏమీ కనబడటం లేదు. దులారీ హృదయం భయంతో కంపించిపోయింది.

3

క్రీస్తుశకం 1781 ఆగష్టు 16 వ తేదీనాడు కాశీ పట్టణమంతా గందరగోళంగా వున్నది. శివాలయం ఘాట్ దగ్గర రాజా చేత్‌సింగును లెఫ్టినెంట్ ఇస్టాకర్ నిర్బంధించాడు. నగరమంతటా ఆశాంతి చెలరేగింది. దుకాణాలన్నీ మూసివేయబడ్డాయి. ఇండ్లలో

పిల్లలు 'అమ్మా ఇవాళ పాలవాడు రాలేదేం?' అని అడుగుతూంటే తల్లులు అరవవద్దని చెప్పి వాళ్లను మాట్లాడకుండా చేస్తున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. తెల్లవాళ్ల పటాలం కాపలా వున్నచోట కుబరా మౌల్వీ అప్పుడప్పుడు వస్తూ పోతూ కనబడుతున్నాడు. మౌల్వీని చూచి తెరచి వున్న కిటికీలు కూడా మూసుకొనేవి. ప్రజలు భయభ్రాంతులై పోయారు. నాలుగురోడ్ల కూడలి దగ్గర చిథరూసింగ్ భవంతి కాశీ పట్టణపు శౌర్య వీర్య ప్రతాపాదులను తన లోపల దాచుకొని ఠాణా రూపంలో అభినయం చేస్తున్నది. ఇంతలో ఎవరో పిలిచారు– 'హిమ్మత్ సింగ్'

'ఎవరు?' కిటికీలో నుండి తొంగి చూచి హిమ్మత్‌సింగ్ ప్రశ్నించాడు.

'బాబూ నన్హాక్ సింగ్‌ను'

'ఇంకా నీవు బైటనే వున్నావా?"

'పిచ్చివాడా! మహారాజా నిర్బంధించబడ్డారు. కాశీనగరవీరుల్ని విడిపించు. వీళ్లందరినీ తీసికొని ఒక్క పర్యాయం శివాలయం ఘాటుకు వెళ్లి వస్తాం.'

'అయితే కొద్దిసేపు ఆగు' అంటూ హిమ్మత్ సింగు ఏమో ఆజ్ఞాపించాడు. సిపాయిలు బైటకు వచ్చారు. నన్హాక్ సింగ్ కరవాలం తళతళ మెరిసింది. సిపాయిలు లోపలికి పరుగెత్తారు.

'నమ్మకద్రోహుల్లారా, గాజులు తొడుక్కోండి' అంటూ జనం చూస్తుండగానే రివ్వున దూసుకు వెళ్లిపోయాడు నన్హాక్ సింగ్.

నన్హాక్ మహావీరుడు. కొద్దిమంది అనుచరులు అతని మాట మీదప్రాణాలు సైతం అర్పించేందుకు సిద్ధమైనారు. రాజా చేత్‌సింగు చేసిన రాజకీయ అపరాధమేమిటో అతనికి తెలియదు. కొద్దిసేపు ఆలోచన చేసి కొద్దిమంది అనుచరులను సింహద్వారం దగ్గర గొడవ చేయమని చెప్పి పంపించాడు. ఇటు తాను శివాలయం కిటికీ క్రిందకు గంగాప్రవాహంలో ఒక చిన్న బోటును నడుపుకొంటూ చేరుకొన్నాడు. భవంతి గోడకు అమితకష్టం మీద త్రాడు కట్టి బోటును ఆపి కోతిలా ఒక్క ఎగురు ఎగిరి కిటికీలోనుండి లోనికి ప్రవేశించాడు. అక్కడ రాజమాత, రాజా చేత్‌సింగు, బాబూ మనియార్‌సింగ్ నిలబడి వున్నారు. 'మీరు ఇంకా ఇక్కడ ఉంటే మేమేమి చేయగలం ? పూజలు కాగానే మీరు రామనగర్ వెళ్లిపోయి వుంటే ఇదంతా. ..' అంటున్నాడు మనియార్‌సింగ్.

'ఇప్పుడు నేను రామనగర్ ఎలా వెళ్లను' అని వాపోయింది తేజస్విని రాజమాత పన్నా.

'ఏం చెప్పను? నా సైనికులంతా ఖైదీలుగా పట్టుబడ్డారు' అంటూ మనియార్ సింగ్ తన దుఃఖాన్ని ప్రకటించాడు.

ఇంతలో సింహద్వారం దగ్గర గొడవ ప్రారంభమైంది. రాజ కుటుంబం ఆలోచనలో మునిగి వున్నందున నన్హాక్ సింగ్ రాకను వాళ్లు గుర్తించలేదు. ఎదురుగా వున్న ద్వారం మూయబడివున్నది. నన్హాక్ సింగ్ ఒక పర్యాయం గంగా ప్రవాహాన్ని చూచాడు. అందులో ఒక పడవ రేవును చేరుకొనేందుకై కెరటాలతో పోరాడుతూ వున్నది. అతనికి సంతోషం కలిగింది. ఇక ఆలశ్యం చేయకూడదని నిర్ణయించు కొని 'రాజమాత ఎక్కడ?' అని ప్రశ్నించాడు.

అంతా వెనక్కు తిరిగి చూచారు. ఎదురుగా ఆయుధాలతో యుద్ధసన్నద్ధుడైన ఒక అపరిచిత వీరుడు నిలబడివున్నాడు.

'నీవెవరు?' చేత్ సింగ్ ప్రశ్నించాడు.

'విలువ కట్టుటకు వీలులేని రాజకుటుంబ సేవకుణ్ణి'

పన్నా నోటినుండి ఒక నిట్టూర్పు వెలువడింది. ఆమె అతడెవరో గుర్తించింది. ఎన్నో సంవత్సరాల తరువాత అతణ్ణి చూచింది. అతడు నన్హాక్ సింగ్.

'నీవు ఏం చేయగలవు?' మనియార్ సింగ్ ప్రశ్నించాడు.

'ప్రాణాలు అర్పించగలను. ముందు మహారాణిని బోటుమీద కూర్చోపెట్టండి. క్రింద మరో పడవ వున్నది. దానిని నడిపేందుకు సరంగులు వున్నారు. త్వరగా పంపండి.'

మనియార్ సింగ్ బైటకు తొంగి చూచాడు. స్త్రీల ద్వారం దగ్గర వుండే రాజుగారి బోటుమీద నలుగురు సరంగులు నిలబడి ఎదురు చూస్తున్నారు 'మీరు పదండి. మీ వెంట నేను వస్తాను' అని అన్నాడు మనియార్ సింగ్ రాజమాత పన్నాతో.

'మరి. . .' చేత్‌సింగ్‌ను చూచి పుత్రవాత్సల్యంతో ప్రశ్నించింది రాజమాత. అందుకు సమాధానం ఎవ్వరిదగ్గరలేదు. 'అయితే నేను ఇక్కడే వుంటాను' అన్నాడు మనియార్ సింగ్ . ఆ స్థితిలో నవ్వుతూ నన్హాక్ సింగ్ అందుకొని 'మీరు బోటు మీదకు వెళ్లి కూర్చోండి. రాజా కూడా బోటుమీద సురక్షితంగా కూర్చోనంతవరకు యీ నన్హాక్ సింగ్ పదిహేడు తుపాకీ గుండ్లకు గురి అయి కూడా తట్టుకొని నిలబడగలడని ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఇక కదలి వెళ్లండి' అని ధైర్యం చెప్పాడు.

పన్నా నన్హాక్ సింగును చూచింది. ఒక్క క్షణం సేపు ఇరువురి కండ్లు కలిశాయి. ఆ ఉభయుల కండ్లలో జన్మజన్మల విశ్వాసం జ్యోతివలె వెలుగుతూ వున్నది. అటు సింహద్వారం బలవంతాన తెరవబడుతూంది. నన్హాక్ సింగ్ పరిస్థితి తీవ్రతను గుర్తించి 'త్వరగా బయల్దేరండి' అని తొందర పెట్టాడు.

మరుక్షణంలో పన్నా బోటు మీద ఉన్నది. నన్హాక్ సింగ్ సింహద్వారం దగ్గర లెఫ్టినెంట్ ఇష్టాకరుతో వున్నాడు. చేత్‌రాం వచ్చి ఒక జాబును మనియార్ సింగ్ చేతికి అందించాడు.

'మీ జనం గొడవ చేస్తున్నారు. ఇక ఫైరింగు ఆర్డరు ఇవ్వక తప్పదు' అని అన్నాడు ఇష్టాకర్ .

'నా సైనికులు ఇక్కడ ఎవరూ లేరు' అని అన్నాడు నవ్వుతూ మనియార్ సింగ్.

బయట కలవరం ఎక్కువగా వున్నది.

'మొదట చేత్‌సింగును నిర్బంధించండి' అని అన్నాడు చేత్‌రాం.

'అందుకు ధైర్యం ఉన్నవాడెవడో ముందుకు రావచ్చు' అంటూ బాబూ మనియార్ సింగు కత్తి తీసి నిలబడ్డాడు. ఇంతలో కుబరా మౌల్వీ అక్కడకు వచ్చాడు. ఇక్కడ మౌల్వీ సాహెబు బుద్ధి పని చేయలేదు. ఎవ్వరూ బయటకు వెళ్లలేని స్థితి ఏర్పడింది. 'ఇంకా చూస్తావేం చేత్‌రాం' అని హెచ్చరించాడు మౌల్వీ.

చేత్‌రాం రాజాచేత్‌సింగ్ మీద చేయి చేసుకోపోయాడు. ఇంతలో నన్హాక్ సింగ్ చేతిఖడ్గం అతడి భుజాన్ని నరికివేసింది. ఇష్టాకర్ ముందుకు వచ్చాడు. మౌల్వీ సాహెబు అరుపులు ప్రారంభించాడు. కన్ను మూసి కన్ను తెరిచేలోపల నన్హాక్ సింగ్ ఇష్టాకరును,

అతని అనుచరుల్ని చాలామందిని హతమార్చివేశాడు. మౌల్వీ సాహెబు తప్పించుకొందామని చూచాడు.

'ఆ రోజున తగిలినదెబ్బ నీకు గుణపాఠం నేర్పలేదన్న మాట. ఇక చూడు ముక్కలు చేసేస్తాను' అంటూ కసాయి కత్తితో మౌల్వీ సాహెబును నరికివేశాడు. కొద్ది క్షణాల్లో ఎవ్వరూ ఊహించనంతగ పరిస్థితి చేయిదాటిపోయింది.

'చేత్‌సింగ్, ఇంకా చూస్తావేం? త్వరగా వెళ్లి బోటు ఎక్కి వెళ్లిపో' అని అన్నాడు నన్హాక్. సింగు శరీరాన్నుండి రక్తం కారసాగింది. అటు సింహద్వారాన్నుండి తెల్ల వాళ్లు లోనికి రాసాగారు. చేత్‌సింగ్ కిటికీలోనుండి బోటులోకి దిగుతూ ఒక్క పర్యాయం వెనకకు తిరిగి చూచాడు. ఇరవై, ముప్పైమంది తెల్లవాళ్లు తుపాకులు పేలుస్తుంటే ఒక్కడే అందరినీ ఎదుర్కొని కత్తితో పోరు సాగిస్తున్నాడు నన్హాక్ సింగ్. అభేద్యంగా నిలబడియున్న నన్హాక్ సింగ్ శరీరాన్నుండి రక్తం ధారలు కట్టి ప్రవహించసాగింది. గూండా శరీరంలోని అవయవాలన్నీ ఒక్కొక్కటే తెగి అక్కడే క్రిందపడిపోయాయి. కొద్ది సేపటికి అతని మొండెం కూడా క్రింద పడిపోయింది. అతడే కాశీపట్టణపు గూండా నన్హాక్ సింగ్.

◆

17

నన్ను వెన్నాడే కథల గురించి పరిచయం చేద్దామనుకున్నప్పుడు నాకు మొదట గుర్తొచ్చింది 'మోహంలేని సాయంకాలం' కథ. సాహిత్య అకాడెమీ ప్రచురించిన 'మరాఠీ కథాసంగ్రహం' (1981) లో ఈ కథ మొదటిసారి చదివినప్పుడు కథానిక ప్రక్రియనీ, ఆ ప్రక్రియ గురించి నా అవగాహననీ కూడా, అప్పటిదాకా ఇరుగ్గా ఉన్న చట్రం నుంచి ఒక్కసారిగా బయటపడేసినట్టుగా అనిపించింది.

అంటే కథ అనగానే ఒక సంఘటనక్రమంతో కూడుకున్న ఇతివృత్తం ఉండాలనీ, దానికొక ఆద్యంతాల్ని నిర్ణయించడంతో అది కథగా మారుతుందనీ అనుకునే ఆధునిక కథనశిల్పాన్ని దాటిన ప్రయోగశీలత్వం ఇది. తర్వాతి రోజుల్లో పోస్ట్ మాడరన్ కథకులు కథలోంచి form ని తొలగించారంటున్నప్పుడు, వారు చేసిందిదే. దానికోసం కొన్ని సార్లు వారు కథలోంచి సంఘటననో, లేదా ఆద్యంతాల్నో, లేదా ఆద్యంతాలున్నా కూడా వాటిమధ్య కనబడవలసిన కార్యకారణసంబంధాన్నో తొలగించారు. అప్పుడు కూడా ఆ కథలో ఒక సంఘటన ఉంటుంది. ఇందులో కథకుడి హృదయాన్ని ఒక అపరిచితురాలు తొక్కుకుంటూ పోయినట్టు. కాని ఆ సంఘటన మామూలు కథలో కనిపించే సంఘటనలాగా ఉండదు. బైరాగి రాసిన 'ఒక గంట జీవితం', త్రిపుర 'భగవంతం కోసం' చదివినప్పుడు కూడా నాకు ఇటువంటి భావననే కలిగింది.

ఈ కథ చదివినప్పటికి నేను ముంబై ఎలా ఉంటుందో చూడలేదు. కాని అప్పటికే మజ్రూ సుల్తాన్ పురీ రాసిన ‘యే దిల్ హై ముష్కిల్ జీనా యహాఁ, జరా హట్ కే, జరా బచ్ కే, యే హై బాంబే మేరీ జాఁ’ అనే పాట ఎన్నోసార్లు విని ఉన్నాను. ఆ పాటలో కవి వర్ణించిన బాంబేకి ఈ కథలో కనిపించే బాంబే పూర్తిగా సరిపోయింది.

ఆ తర్వాత 1997 లో మొదటి సారి ముంబైలో అడుగుపెట్టినప్పుడు చేసిన ట్రాము ప్రయాణంలో ముంబైని కళ్ళారా చూసాను. మొహంలేని సాయంకాలం ఎలా ఉంటుందో ఆ రోజు నాకు పూర్తిగా బోధ పడింది.

గంగాధర్ గోపాల్ గాడ్గిల్ (1923-2008) మరాఠీ సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. పూర్తి ప్రయోగశీల రచయిత. ‘మరాఠీ కథా సంగ్రహం’ సంపాదకుడు అచ్యుత కేశవ్ భాగవత్ తన ముందుమాటలో ఒక్క గాడ్గిల్ మీదనే నాలుగు పేజీల పరిచయం రాసాడంటే అర్థం చేసుకోవచ్చు.



అప్పట్లో నాకు తెలియలేదు గానీ, ఆస్ట్రియను రచయిత రాబర్ట్ ముసిల్ రాసిన The Man Without Qualities (1930-43) నుంచి ఈ కథకి స్ఫూర్తి లభించి ఉండవచ్చునా అని ఇప్పుడు అనిపిస్తున్నది. ఈ కథ ఇంగ్లిషులోకి కూడా అనువాదమై, A Faceless Evening and Other Stories (2017) పేరిట పుస్తకంగా వెలువడింది కూడా.

గంగాధర్ గాడ్గిల్

మొహంలేని సాయంకాలం

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

మామూలు ప్రకారం ఆ సాయంకాలం విచారంతో కుంగిపోయివుంది. దాని బూడిద రంగు జుట్టుమీద సూర్యకిరణాలధూళి పడింది. ఆ సాయంకాలానికి మొహం లేదు. నిజంగా ఎంత భయంకరమైనవిషయం, మొహం లేని సాయంకాలం.

కాని ఎవరూ ఏమీ పట్టించుకోడంలేదు. మెల్లిగా మెల్లిగా అడుగులేసుకుంటూ, దారి దాటుకుంటూ ఇంటికి వెళుతున్నాను. ఇతర అసంఖ్యాక పాదచారులూ ఆ పనే చేస్తున్నారు. ఎంత తమాషా! వాళ్లలో ఎవరిముఖం మీదా చిరునవ్వైనా లేదు.

విక్టోరియాబండి గుర్రండెక్క రోడ్డుకి తగిలి, నిప్పురవ్వలు పుట్టుకొస్తున్నాయి, ఎర్రఎర్రగా, పచ్చపచ్చగా, నిప్పురవ్వ ఓక్షణం కనిపించి, అదృశ్యమైపోతుంది. నిప్పురవ్వబతుకే ఒక్క సెకండు, కాలప్రవాహంలో అది ఒక రేణువు. ప్రకాశ ప్రవాహంలో కూడా ఒక రేణువే. సకృత్తుగా రెండూ కలుసుకున్నాయి. ఆ రేణువు ఓ క్షణం ప్రవేశించి, కనుమరుగై పోయింది.

కళ్లు మిరుమిట్లుగొలిపే ప్రకాశవంతమైన అక్షరాలు. ఒక్కలైనులో నించున్నాయి. కొన్ని అక్షరాలు ఒంటిపిల్లి రాకాసులు. మరికొన్ని, ఇంకో అక్షరంతో కలిసి పెనవేసుకు పోయాయి. కొన్ని వొట్టి తలకట్టు అక్షరాలు. కొన్ని అక్షరాలకి గుడులు, గుడిలో దీర్ఘాలు

వున్నాయి. అక్షరాలకీ, అక్షరాల అర్థానికీ సమన్వయం కుదిరించడానికి ప్రయత్నం, వీటిని చూడడానికి వొచ్చిన జనసమ్మర్దం. ఓ శిశువు చేతిలో వాళ్లమ్మ ఓ అణాకాసు పెట్టింది. ఆ శిశువు తన బుల్లివేళ్ల మధ్య ఆ అణా పట్టుకుంది. ఆశ్చర్యంతో, అప నమ్మకంతో ఆ అణాకాసుకేసి చూస్తోంది ఆ శిశువు. మెరుస్తున్న అణా తనచేతిలో నిజంగా వుందో లేదో చూసుకోడానికో అన్నట్టు, ఆ ఆణాకాసుని అటూ యిటూ ఆడించి చూసింది. ఆ పైన నోరంతావిప్పి బోసినోటితో నవ్వింది. ఆ నవ్వు బరువువల్ల మెడ వొరిగిపోయింది. కళ్లు, మొహం ముడతలలో చిక్కుకుపోయాయి. కళ్లు వున్నాయా, లేదా, అనిపించింది. పెదవులు చివరనించి చొంగధార. ఆకస్మాత్తుగా అణా కేసి చూడడం మానేసి, ఆ కళ్లు చెదిరే రంగురంగుల పోస్టరుకేసి చూపింది.

పోస్టరుమీద ప్రజల అభిమాననటి శాశ్వతంగా నవ్వుతోంది. కోటి డాలర్ల విలువైన నవ్వు, రోడ్డుమీద పరుగెడుతున్న కార్ల చప్పుడు శాంతతని కొరుకుతోంది. చెవుల్లో గింగురుమంటోంది. యూనిఫారమ్ దుస్తులు ధరించిన డ్రైవరు, వెనకసీటులో చేతనం లేని, ఎర్ర పెదవుల, ప్లాస్టిక్ బొమ్మలాటి ఆడావిడ, వీపులో ఎముకలేని అధికారి. యవ్వనంలో మునిగిపోయిన పొడుగాటి జుట్టుయువకుడు. అన్ని కారులూ అరుస్తు–న్నాయి. 'పక్కకి తప్పుకోండి' హెచ్చరికలకి విరామంలేదు. ఒక హెచ్చరికకీ మరో హెచ్చరికకీ తేడాలేదు!

యూనిఫారమ్ వేసుకున్న డ్రైవరు, ప్లాస్టిక్ యువతి ఒకే రకమైన గొంతుకతో, భాషలో, మాట్లాడుతున్నారు. ఎప్పుడూ నోరెత్తని మైనం మనిషి, ఇప్పుడు మాత్రం జోరుగా ధాటిగా మాట్లాడుతున్నాడు. దానిని చూసి ఎవరికీ ఆశ్చర్యం వెయ్యడంలేదు. ఎవరికీ భీతిపుట్టడంలేదు.

దారి పక్కన దుకాణంనించి లౌడుస్పీకరు ఏదో పాట కక్కుతోంది. ఆ లౌడుస్పీకరు నోరు ఎప్పుడూ తెరుచుకునే వుంటుంది. ఆ లౌడుస్పీకరుకి నోరేకాని మొహంలేదు. నోరు కదపకుండా సంగీతం కక్కేస్తోంది. ఆ పాట వినడానికి గుమిగూడిన ఓ చిన్నగుంపు. ఆ గుంపు పాటని కడుపునిండా మింగుతోంది. మూడు నిమిషాలభక్తి. మూడు నిమిషాల ప్రేమ. మూడు నిమిషాల విరహం. వేలంపాట ప్రతివస్తువూ మూడణాలు మాత్రం. కంపెనీ దివాళ తీసింది. వేలం మూడణాలు. దివాళాకోరు కంపెనీ, ఏమిటి ఈ కంపెనీ. యూనివర్సల్ ఎంటర్ ప్రైజ్ లిమిటెడ్. 'లిమిటెడ్' జ్ఞాపకముంచుకోండి.

ఆ ధ్వని అంతా, ఇంకో ధ్వనిలో మునిగిపోయింది. ఒక మోటారుకి చుట్టూ బోర్డులు. మెల్లిగా వెళుతోంది. 'కొరియాలో శాంతి, శాంతికోసం వినతి' నాలుగు వైపులా ఫిరంగులలా అమర్చిన లౌడ్ స్పీకర్ల లోనించి ఒకటే అరపులు. ఆ యంత్రాల లోంచి బయటపడిన ఆ యాంత్రిక గొంతుక ఒకే విధంగా ఆరుస్తోంది. 'కొరియాలో శాంతి, శాంతి, శాంతి.' ఎదుటనించి వొస్తున్న ఓ మనిషి నన్ను చూసి నవ్వాడు. నేనతన్ని ఎరుగుదును. ఆ నవ్వు చూశాను. కాని వినపడలేదు. 'శాంతి శాంతి' నేనూ నవ్వాను. నా నవ్వు అతనూ వినలేదు. ఆతని పెదవులు కదులుతూ కనిపించాయి. నేనూ నా పెదవులు కదిపాను. అతను మళ్ళీ పెదవులు కదిపాడు. మా మాటలు రణ గొణధ్వనిలో ఎక్కడో అంతర్ధానమయిపోయాయి. మా నోటిమాటలకి, ఆ శబ్ద ప్రపంచంలో చోటులేకపోయింది. ఇక ముందు బహుశా, ఎక్కడా చోటు దొరకదేమో కూడాను. మేము నిశ్శబ్దంగా నవ్వుతూ గుడ్ బై చెప్పుకున్నాము. సదా పూర్తిగా తెరుచుకున్న నోటితో, లౌడ్ స్పీకరు అరుస్తోంది. ఆ ఆరుస్తున్న శాంతత నా దగ్గిరనించి దూరమైపోయింది. ఆ చప్పుడుతో గింగురుమనిపోయిన నా చెవి మళ్ళీ వినడం ప్రారంభించింది. కళ్లు మళ్ళీ చూడడం ప్రారంభించాయి. అడుగులేసుకుంటూ, రోడ్డు దాటుకుంటూ మనుష్యులు ముందుకి సాగిపోతున్నారు. అందరూ ఒక్క విధంగానే కనిపిస్తున్నారు. రోడ్డు మలుపులో ఓ టంకశాల వుండి వుండాలి. ఆ టంకశాలలో ముద్రణ అయి, ఈ మనుష్యులందరూ బయటపడివుండాలి. తమ అభిమాన నటుడిలాగే, జుట్టు దువ్వుకున్నారు. మొహంమీద ఏ భావమూ కనిపించదు. మొహాలు నున్నగా వున్నాయి. భావనలు, ఉద్రేకాలూ అవీ నున్నగానే వుండివుండాలి. అందరి ఆడవాళ్ళ మొహాలమీదా, చిన్నపిల్లల అమాయకత్వం, నెత్తిమీద టోపీలా కూర్చుంది. అందరి మొహాలూ, చిన్నపిల్ల మొహాలే! ఫిల్మీపిల్లలు. ఫిలుములు రూపొందించిన మనుషులు. ఈ 'పిల్లల' నిర్మాతలు, తమ ఫిలుములలో ఉపయోగించిన నటీనటులు ఓ పైన పెట్టిన పోస్టరుమీదనించి, విజయగర్వంతో నవ్వుతున్నారు. మిలియన్ డాలర్ల నవ్వులు, లక్షల రూపాయల కిమ్మతైన నవ్వు. లక్షల మనుష్యుల నవ్వు. ఇరవై ముప్ఫయిమంది నటీనటులకి ఇంతమంది పిల్లలా! కాదు. కాని ఇది శక్యమే. శాస్త్రపరిశోధనలు, ఇంకా చాలా విషయాలు శక్యంచేశాయి. తెలియని మనిషినించి, వారివురు సంయోగమూ కలగకుండానే ఒక స్త్రీకి గర్భం కలగవచ్చును. పురుషుని రేతస్సు కొన్ని సంవత్సరాలు భద్రంగా దాచవొచ్చును. ఇంకో యాభయి సంవత్సరాల తరవాత పుట్టబోయేవాడి

తండ్రి ఎప్పుడోపోయిన హిట్లరయి వుండొచ్చును. శాస్త్రం ఉపయోగించి, ఇప్పుడు పుట్టబోయే పిల్లలస్వభావం మార్చేసెయ్యవొచ్చును.

'కొత్తఢిల్లీ. మే పందొమ్మిదోతారీకు, 1991 శాస్త్రీయపద్ధతిని పిల్లలని పుట్టించే కార్ఖానా ఉద్ఘాటన ప్రైమ్ మినిస్టరుగారి హస్తాలలో, చాలా ధూంధాంగా జరిగింది. కార్ఖానాలో తయారయిన ప్రథమ సంతానాన్ని ప్రైమ్ మినిస్టరుగారికి అర్పణచేశారు. ప్రైమ్ మినిస్టరుగారి కోరిక ననుసరించి, ఆ శిశువు తీవ్ర దేశభక్తి కలిగివుండే శిశువుగా తయారు చెయ్యాలని ప్రణాళిక తయారు చేశారు.

ప్రైమ్ మినిస్టరుగారు ఆ కార్ఖానా, ఉద్ఘాటనచేస్తూ అన్నారు. 'ప్రగతి మార్గంలో ఇది మరో ముందడుగు, అందుచేత దేశజీవనం ప్లాను చేసే విషయంలో ఓ గొప్ప అవరోధం తొలగిపోయిందని విశ్వసిస్తున్నాను.'

మా ప్రత్యేక విలేఖరి ఇలా తెలియజేస్తున్నాడు. కోరినట్టు కలలు కలిగించే మాత్రలు తయారుచెయ్యడంలో ఇప్పుడు పరిశోధకులు ఫలితం సాధించారు. త్వరలోనే ఆ మాత్రలు వ్యాపార పద్ధతిని, ఉత్పత్తిచేసే అవకాశముంది. భీతి పుట్టించే స్వప్నాలు కలిగించగలిగిన నల్లటి మాత్రలకి కూడా చాలా గిరాకీ వుంటుందని, తెలిసినవారు అనుకున్నారు. షేక్స్పియర్ మహాశయుడు అన్నాడు. Life is a tale told by an idiot signifying nothing. ఏం మూర్ఖుడు.

మొహం లేని సాయంకాలం నవ్వింది! ఏడిచిందా! లేదు. మొహం లేని కాదు, మొగపిల్లాడిలాటి మొహంవున్న ఆడపిల్ల నవ్వింది. నవ్వుతూ నాకేసి చూస్తోంది. నేను కూడా, తెలివొచ్చి, ఆ అమ్మాయికేసి చూశాను. ఆ అమ్మాయి అంది. 'ఇస్సు! ఎటు చూస్తున్నారయ్యా!'

ఆటోమాటిక్‌గా పర్సు తెరిచింది. రుమాలు పైకి తీసింది. పర్సు మూసింది. రుమాలుతో మొహం తుడుచుకుంది. మళ్లీ పర్సు తెరిచింది. ..

నే అన్నాను. 'ఏదో ఆలోచనలో నిమగ్నుడనై వున్నాను.' ఆ అమ్మాయి కళ్లు మూసి, తెరుస్తూ అంది. 'ఆలోచనలా! ఎవరిని గురించి' చెంగు సవరించుకుంది. కాళ్ళు కదిపింది. నే నవ్వాను. ఆ అమ్మాయీ నవ్వింది.

ఆ అమ్మాయి అడిగింది. 'ఫలాని పిక్చరు చూశారా!' ఈసమయాన, కళ్లు, కిందకి దింపి చూడ్డానికి ప్రయత్నించింది. ఈ చూపు కొత్తగా నేర్చుకుంటున్నట్టుంది.

నే అడిగాను, 'రేపు మాచ్ చూస్తున్నారా' మేం ఒకరి కొకరం గుడ్‌బై చెప్పుకున్నాము. ఆ మనిషి, తన వ్యక్తిత్వపు మూడునిమిషాల రికార్డు వాయించి, ముందుకి సాగింది. ముందుకి వెళ్ళిన తరవాత మళ్ళీ ఆ రికార్డు మొదటినించీ పెట్టిందో ఏమిటో. పర్సు తెరిచివుంటుంది. రుమాలా తీసివుంటుంది. పర్సు మళ్ళీ మూసేసేవుంటుంది. .. ప్రతియింట్లోనూ, మోగుతున్న రికార్డు, మూడు నిమిషాల రికార్డు. తూతూలమ్మా, తూతూలు. బాకాలమ్మా, బాకాలు, తెస్తాడమ్మా, మాబావ. .. అడ్డుకుపోయింది. అక్కడే ఆ రికార్డు, ఆ పాటలో ఇంకేముందో తెలీదు. అదే అదే అంటోంది ఆ రికార్డు. ఆ మాటలే మళ్ళీ మళ్ళీ వొస్తున్నాయి. మోటారు బ్రేకు కర్కశంగా శబ్దం చేసింది. ఒక భయానకమైన కేక వినిపించింది. మనుష్యులు ఒక పెద్ద గుంపుగా పరుగెత్తారు. మనుష్యులగుంపు చుట్టు ముట్టేసింది. ఓ మనిషి చచ్చిపోయాడు. కుతూహలంతో అందరు మనుష్యులూ చూస్తున్నారు. ప్రతి మనిషి కళ్ళల్లోనూ కనిపిస్తోంది కుతూహలం. తెగిపోయిన కాలు చూడాలని అందరూ ప్రయత్నిస్తున్నారు. అతని మొహాన్నిబట్టి, జేబులోవున్న కాగితాలనిబట్టి, అతనెవరో తెలుసుకోవాలి!

ఆ మనుష్యులు నిర్దయులని కాదు. ఆ మనిషి బతికేవుంటె, అతని నోట్లో, ఎవరైనా కాసిని నీళ్లు పోసేవుందురు. అంబ్యులెన్సు పిలిచివుందురు. కాని ఇప్పుడు. .. అతనెవరో తెలుసుకోవాలన్న కుతూహలం మాత్రమే వుంది. ఆ కుతూహలంలో, దయాదాక్షిణ్యాలు లేవు. క్రూరత్వముంది. నిజానికి రకరకాల, పరస్పర విరుద్ధాలయిన ప్రవృత్తులున్నాయి. భావనలు, ఉద్రేకాలూ వున్నాయి.

సినీమా చూస్తూ, జార్జెట్ చీర కట్టుకున్ననటికి ప్రేమభంగమయినప్పుడు నీళ్ళు కార్చేవుందురు. దేశభక్తుడి ఉపన్యాసం విని ఉద్రేకంతో యుద్ధానికి తయారయివుందురు. పోలీసు చేతిలో దుడ్డుకర్ర చూపి పరుగెత్తుకు పోయివుందురు. తాము చావును, కొంచెంలో ఎలా తప్పించుకున్నారో చెబుతూ, పళ్ళు ఇకిలిస్తూ, నవ్వేవారు కొందరు. సినీమాలో శృంగార ఘట్టాలలో విజిలులు వేసివుందురు. భక్తిభావాలైతే ఇంటికొచ్చి, ఇంట్లో మళ్ళీ మళ్ళీ చెప్పివుందురు.

ఎన్నిరకాలయిన ప్రవృత్తులు! ఈ మనుష్యుల్లో అణిగివుంటాయి!! ఆ ప్రవృత్తి ఎప్పుడు ఏ విధంగా మారిపోతుందో ఎవరూ చెప్పలేరు. ఈ సందర్భంలో వాళ్లకి నిజంగా భీతి కలిగివుండవలసింది. ఆ దృశ్యం భీతి కొలిపించే దృశ్యమే. కాని మనిషిరక్తం కొంత దూరం ప్రవహిస్తోంది. అది ఎక్కడికి ప్రవహిస్తుందో, అందరూ కనిపెట్టి

చూస్తున్నారు. చివరికి ఓదిశగా పారింది. ఆ చుట్టుపక్కలవున్న మనుష్యులపాదాలవైపు ప్రవహించడం మొదలెట్టింది. అరుచుకుంటూ, అటువైపునవున్న మనుష్యులు వెనక్కి తప్పుకున్నారు. తరువాత అందరూ బిగ్గరగా నవ్వారు. ఆ చచ్చిపోయిన మనిషిని చూసినకంటె ఈ బతికున్న మనుష్యులంటె భయమేసింది.

వాళ్ళలో ఏదో అజ్ఞాతంగా వుంది. అది తర్కానికి అతీతం! దాన్ని చూసి భయమెత్తు కొచ్చింది. వాళ్ల నవ్వుచూసి భయమేసింది. చచ్చిపోయిన మనిషివి, ఎగిరి పడిపోయిన చెప్పులు, చాలా గంభీరంగా తీసుకొచ్చి, ఆ శవందగ్గిర పెట్టినవిధం భయమెత్తించింది. ఈ మనుష్యుల జీవనరహస్యాన్ని గురించి తెలిపే శాస్త్రమన్నా, ఆ జీవితాలని మార్చగలిగే ఆ శాస్త్రసామర్థ్యమన్నా, ఇంకా భయమేసింది.

ఎవరైనా శాస్త్రజ్ఞుడువొచ్చి, ఏదో రసాయనం రాసి, ఆ తెగిపోయిన కాలు అతికిస్తాడేమోననిపించింది. ఏదైనా ఇంజక్షనిచ్చి, ఎవరైనా, అతన్ని బతికిస్తాడేమో! ఆ తరవాత లోకులు, తన పాదాలదగ్గిర పెట్టిన చెప్పులు నిజంగా తొడుక్కుని ఉంటాడని పించింది. ఆతరవాత, తనమీద మోటారు నడిపించేసిన డ్రైవరుకి షేకుహాండు చేసి అంటాడు. 'స్నేహితుడా ! ఎంత సుందరంగా భీతికలిగించావు. చావులో చాలా తమాషా వుంది. థాంక్సు.'

ఆ తరవాత తమాషాగా వుంటుందని చాలామంది చచ్చిపోతారు. చంపేసి, బతికించే ఉపాయాలు అమ్మే కంపెనీ స్థాపితమవుతుంది. లోకులు ఆ కంపెనీలో షేర్లు కొనుక్కుంటారు. మరణం విషయమైన అన్ని నియమాలు, దాన్ని గురించిన ఆలోచనలు, మనసులలో పుట్టేభావాలు, ఉద్రేకాలు అన్నీ మారిపోతాయి. శాస్త్రం తీసిన ఒక్కదెబ్బతో మానవజీవితమంతా, తల్లకిందులై పోతుంది. ఆ దెబ్బతో ఆడుతూ నిలదొక్కుకోబోతున్న నడుం మీద మరోదెబ్బ. చివరికి, దెబ్బలు భరించలేక, మానవ జీవితం అదృశ్యమైపోతుందేమో. అందులోనించి, మానవరహితమైన పృథ్విలో. తేనెటీగల సంస్కృతి పుట్టుకురావచ్చు. భయంకరం! ఈ పరిణామ అవకాశం తలుచుకుంటె భయమేస్తోంది, ఈ బతికున్నమనుష్యులు మరీ భయానకంగా వున్నారు. మానవజీవితపు తిరునాళ్ళలో, ముఖ్యమైన ఆకర్షణ, భీతి అనే గిరగిర తిరుగుతున్న రంకులరాట్నం. దేవదర్శనానికి వెళ్ళినప్పుడు, డిబ్బెంలో కొన్నిడబ్బులు అర్పించుకుంటాము. రంకుల రాట్నం ఎక్కడానికికూడా డబ్బు ఇచ్చుకోవాలి. దేవాలయానికి వెళ్ళినప్పుడు శ్రద్ధతో కళ్ళు మూసుకుంటాము. రంగులరాట్నంలో తిరిగినప్పుడు, భీతివల్ల మూసుకుంటాము.

ఇక మిగిలినది, అంధకారంలో తడుముకోడం, బుద్ధిపూర్వకంగా, తెలివి తేటలు అనే డబ్బు చేతపుచ్చుకుని, ఈ జీవితపు తిరునాళ్లకి వొస్తాము. డబ్బుతో 'భీతి' కొనుక్కుంటాము. అంతకంటె చిమ్మిలివుండలుతింటె బాగుండును. కాస్త తియ్యతియ్యగా నమలడానికి వీలుండును.

కావి, చిమ్మిలివుండలు తినే మనుష్యులుకూడా మధ్యలో, రంకులరాట్నం ఎక్కి 'భయం' అనుభవిస్తారు. భయం! పేపర్లలో, నల్లసిరాలో వ్రాసిన హెడ్డింగు. పెద్ద అక్షరాల భయం. లైనులో నించున్న అక్షరాలని గురించి అనేకభీతులు. గుర్తుతెలియని భీతి. కారణం తెలియని భీతి. గొప్పతనాన్ని గురించిన భీతి. హీనతని గురించిన భీతి. జ్ఞానాన్ని గురించి, అజ్ఞానాన్ని గురించి భీతి. బంధనాలని గురించి, స్వాతంత్ర్యాన్ని గురించికూడా భీతి. ఇతరులని గురించి. స్వతహాగా, తనంటె తనకే భీతి. భీతితో విలవిలలాడుతున్న జీవితం ఒక పరమపద సోపానపటం, వైకుంఠపాళీ ఆట. నిచ్చెనెక్కి పైకి వెళ్ళాలి. పామునోట్లోపడి జారిపోవాలి. పెద్ద పెద్దనిచ్చెనల దగ్గిరగా పెద్దపాములు. చాలా పైన. తెరిచిననోరు. చాలాకిందగా తోక, చేతిలో అందమైన పావుల గలగల నిర్ణయించేది అజ్ఞాతభవితవ్యం. నీతి అనే గిరగిర తిరిగే రంకులరాట్నం.

బొంబాయిలో కాంతిహీనమైన ఆ సాయంకాలం, పాదాలమీద రోడ్డుని దాటుకుంటూ నడుస్తున్నాను. ఎక్కడినించో ఓ గాలివిసురు. పైని ఎగురుతున్న గాలిపటం అల్లల్లాడింది. ఎక్కడో ఓచెట్టు చిన్న ఆకుల గల గల. ఒక చిన్నకుర్రాడు 'ఓ' అని అరుస్తూ తన చిన్నచెయ్యి పైకెత్తి, పరుగెత్తాడు. రోడ్డుమీద దుమ్ము ఎగురుతోంది. గాలి ఒకచోటినించి మరో చోటికి విసురుగా ప్రయాణం చేసింది.

నా ఆలోచనలు కలవరపడ్డాయి. మనసులో పేకముక్కలు కలవడం జరిగింది. నాచేతిలో అయిదు పేకముక్కలు పెట్టి, ఎవరో అడిగారు, తురుపు ఏమిటి? నే ఆలోచించి అన్నాను, అన్నిముక్కలు వంచేసి, ఆఖరిముక్క తెరిచివెయ్యి. అదే నా తురుపు. ఎన్ని ముక్కలు పంచినా, పేక అయిపోదు. నా తురుపు బయట పడదు. ఇంతలో ఎవరో తోసినందువల్ల చేతులోంచి ఓముక్క తెరుచుకుపడింది. ఆటీను రాణి.

ఎవరు తోసింది. ఆవిడ. ఆవిడెవరు? నాకేం తెలుసు. నే ఒకటి రెండుమాట్లు చూశాను. నావైపు వీపుపెట్టి నించుంది. పొట్టి, లావు, ఎగు భుజాలు. తల పైకెత్తి ఎవరితోటో మాట్లాడుతోంది. కళ్లు ఎర్రగా కనిపిస్తున్నాయి. జుట్టుమీద కాంతి

అల్లల్లాడుతోంది. పైకి చూస్తూవుండడంవల్ల, జట్టుముడి ఆమె నాజూకు మెడని ఆధారం చేసుకుని పైకి లేచినట్టు వుంది. అది చూస్తూవుంటే, నాహృదయం కూడా ఎవరో చేతితో ఎత్తి పైకి పెట్టినట్టు అనిపించింది.

మాట్లాడుతూ, మాటాడుతూవుండగా, చేత్తో గట్టిగా పట్టుకున్న చీర చెంగు జారి పోయింది, చేతిలోనించి. గాలికి ఎగిరింది. 'వి' కత్తిరింపు బ్లౌజులోనించి, మనుష్యులని ప్రలోభపరిచే దృశ్యం కనిపించింది. నాదృష్టి తరవాత ఒక్క నిమిషం, గుండ్రని పిరుదుల మీద ఆగి, తరువాత గులాబీ పాదాలమీదికి ప్రసరించింది. ఆ జాగానించి కదలలేక పోయాను. ఆవిడమీదనించి దృష్టి మళ్ళించుకోలేకపోయాను, బుర్రలో టకటకమన్న ధ్వని. వొంటిమీద కంట్రోలు పోయింది. ఆవిడంటె నాకు చాలా ఇష్టమయింది.

ఎందుకలా అయిందో నాకు అర్థం కాలేదు. నిజానికి ఆవిడకూడా, మిగతా ఆడవాళ్లలాగే వుంది. బేబీ ఫేస్. ఆవిడ వ్యక్తిత్వపు రికార్డు మూడు నిమిషాల్లో ఆఖరయి పోయే రికార్డే అని తెలిసిపోయింది. నేనెప్పుడూ అదివరకు ఆవిడతో మాట్లాడలేదు. మాట్లాడే అవకాశంకూడా ఆ నిమిషంలో కనిపించలేదు. అయినా, నా హృదయం ఆ జీవితంలో పెనవేసుకుపోయింది.

ప్రేమ, ఎలాంటి ప్రేమ. 'సాహెబ్, మొదటిప్రేమ. గులాబిప్రేమ. ఎదురుతిరిగే ప్రేమ. అన్నిటి ఖరీదు మూడురూపాయలు. సాహెబ్. కానుకగా ఇవ్వడానికి ఇంతకంటె ఖరీదైన పుస్తకాలు పనికిరావు. అన్ని పుస్తకాలు ఖరీదు మూడురూపాయలే! ఎవరో నాచెవిలో గుసగుసలాడారు. నే లక్ష్యపెట్టలేదు.

'దీనికి రసాయనిక కారణం ఏమిటంటే' పిల్లలని తయారుచేసే కార్ఖానాలో శాస్త్రజ్ఞుడు చెప్పడం ప్రారంభించాడు. కాని నే అతనిమాట వినలేదు.

నా హృదయం ఆవిడపాదాలకి అర్పించి, ముందుకి సాగిపోయాను. ఆ హృదయాన్ని కాళ్ళకింద తొక్కేసి, ఆవిడ ఎక్కడికో వెళ్లిపోయింది. ఆ హృదయం దెబ్బతిని, నలిగిపోయి, అలా ధూళితో లేచిపోయింది, ఆ దెబ్బనించి, రక్తం ప్రవహించలేదు. ఆనందం ప్రవహించింది.

నా హృదయాన్ని అక్కడే, అలాగే పారేసి, నడుచుకుంటూ ముందుకి సాగి పోయాను. నిజంగా ఇది జరిగుంటె ఎంత అద్భుతం, భయానకం అయివుండును.

కాని నాకు ఏమీ అనిపించలేదు. ఓ సిగరెట్టు కాలుద్దామని అనిపించింది. బొంబాయిలో ఆ సాయంకాలం, విచారంలో మునిగిపోయింది. దాని జుట్టు రేగిపోయింది.

గుర్తు పట్టగలిగిన మొహంలేదు దానికి.

◆

‘మనం పోయి ఒంటెను కౌగలించుకుందాం!’ అంది అన్నా.

18

ప్రపంచ సాహిత్యాల్లో ఒక్కో భాషకి ఒక్కో కాలమూ, ఒక్కో ప్రక్రియా సొంతమైనట్టు ఉంటాయి. సంస్కృతనాటకం, పారశీక గజలు, గ్రీకు ట్రాజెడీ, జపనీయ హైకూ, ఇటాలియను ఒపేరాల్లాగా పందొమ్మిదో శతాబ్ది రష్యను నవల ఒక అద్వితీయ ప్రక్రియ. రాజకీయంగా జార్ నియంతృత్వంలోనూ, సామాజికంగా అనుల్లంఘ్యనీయమైన అంతరాల్తోనూ, ఆర్థికంగా అపారమైన పేదరికంలోనూ గడిచిన ఆ కాలంలో నవలా-కారులు చీకటిలో వెలుగు కోసం వెతుక్కోడంలోంచి పుట్టిన ప్రక్రియ అది. కాని ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి బాట పట్టిన సోవియెటు కాలంలో, రష్యను రచయితలు కాదు, ప్రపంచం దృష్టిని ఆకర్షించింది, అంతకు ముందు రష్యా అంచుల్లో ఉన్న చిన్ని చిన్ని జాతులు, రాజ్యాలు సోవియెటు రిపబ్లిక్కులుగా మారేక ఆ సంస్కృతుల రచయితలు విశాల సోవియెటు రష్యా సాహిత్యానికి కొత్త జవసత్త్వాల్ని సమకూర్చారు. కిర్గిజ్‌స్తాన్, కజకస్తాన్, అర్మీనియా లాంటి రిపబ్లికుల నుంచి రసూల్ గాంజతోవ్, చింగిజ్ అయిత్-మాతోవ్, కైసన్ కులియెవ్ లాంటి రచయితలు కొత్త సంతోషాల్నీ, కొత్త ఆశల్నీ, కొత్త నమ్మకాన్నీ సాహిత్యంగా మార్చేరు. ఇప్పుడు ఆ రిపబ్లిక్కులు సోవియెటు రష్యానుంచి విడిపోయి స్వతంత్రదేశాలుగా ఏర్పడ్డా, ఆ రోజుల్లో ఆ రచయితలు సృష్టించిన సాహిత్యాలు మాత్రం, మానవజాతి చరిత్రలోని ఒక ఉజ్జ్వల భర్మయుగాన్ని గుర్తుచేస్తూ

శాశ్వతంగా మిగిలిపోయేయి. అటువంటి రచనల్లో, 'కొండగాలీ, కొత్త జీవితం, ఆర్మీనియన్ కథలు' (1979) ఒకటి.

పట్టుమని నూటముప్ఫై పేజీలు కూడా లేని ఈ కథల సంపుటానికి తెలుగులో ప్రాణమిచ్చే అభి–మానులకి తక్కువలేదు. వారిలో నామాడి శ్రీధర్ ఒకరు. ఇప్పుడు అనిల్ బత్తుల ఈ సంపుటాన్ని మళ్ళా పునర్ముద్రించే పనిలో ఉన్నాడు.

ఈ కథల్లో ప్రతి ఒక్క కథా హృదయంలో ఒక ముద్రగా మారిపోయిందనే చెప్పాలి. ఈ మధ్య రష్యన్ కథలు సంపుటి వెలువరించిన అనిల్ బత్తుల ఇందులోని మొదటి కథ 'కడవభుజాన పెట్టి నీటికెళ్ళెను పడతి' ఎంపికచేసాడు. మిగిలిన ఎనిమిది కథల్లోనూ చివరి కథ 'ఒంటెలు వెళ్ళిపోతాయి, పర్వతాలు ఉండిపోతాయి' ఇక్కడ మీతో పంచుకుంటున్నాను.

ఈ కథ రాసిన నొరైర్ ఆదాల్యాన్ (1936–?) ఆర్మీనియను నవలారచయిత, భాషావేత్త, సాహిత్య విమర్శకుడు, నాటకకర్త కూడా. ఆయన రాసిన కొన్ని కథలు సినిమాలుగా కూడా రూపొందాయి.

మూలకథలో ఏ మాధుర్యముందో గాని నిడమర్తి ఉమారాజేశ్వరరావు తెలుగు అనువాదంలో ఆ లాలిత్యం మనకు ఎంతో కొంత భద్రంగా అందుతూ ఉన్నదనే భావన కలుగుతుంది, ఈ కథ చదువుతున్నంతసేపూ. ఒక ఉదాహరణ చెప్పాలంటే 'పురాతనప్రాచ్య దీర్ఘగేయంలాగ ఒంటెలబిడారు'– ఎట్లాంటి వాక్యమది!

నొరైర్ ఆదాల్యాన్ణ్

ఒంటెలు వెళ్లిపోతాయి, పర్వతాలు ఉండిపోతాయి

నిడమర్తి ఉమారాజేశ్వరరావు

అనగా, అనగా, చాలా కాలం క్రితం, ఈ భూమి మీద ఓడలూ, విమానాలూ, మోటారుకార్ల కన్న ఒంటెలు ఎక్కువగా ఉండేవి. పట్నం నుంచి పట్నానికీ, గ్రామం నుంచి గ్రామానికీ, దేశం నుంచి దేశానికీ కూడా ప్రజలు ఆ రోజుల్లో ఒంటెల పైనే ప్రయాణం చేస్తూండేవారు. వాళ్లు తమ ఒంటెల పైన అధిరోహించి తమ శత్రువులతో పోరాటాలు జరిపేవారు, వాళ్ల ఒంటెలు వాళ్ల శత్రువుల్ని నేలనేసి మట్టుతూండేవి.

ఒంటెల వ్యాపారం ఆ రోజుల్లో గౌరవప్రదమైన వృత్తిగా ఉంటూండేది. ఒంటెల అమ్మకాలూ, కొనుగోళ్లూ విరివిగా జరుగుతూండేవి. ఒంటెలు ఒక దానిపై మరొకటి పురికొల్పబడుతూండేవి, అవి ధూళి మేఘాలు లేపుతూ పోట్లాడుతూంటే జనం సరదాగా వేడుక చూస్తుండేవారు.

క్రమంగా కొంతకాలానికి ఒంటెల ధర పడిపోనారంభించింది. ఒంటె గాడిద కంటె కూడా చౌక అయిపోయింది. త్వరలోనే ఓ బస్తా ధాన్యంతో, ఓ గంపెడు యాపిల్సుతో ఒక ఒంటెను కొనగలిగిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఎవరికీ ఆశ్చర్యం కలిగించేది కూడా కాదు.

ఈ రోజుల్లో ఒంటె, దిక్కుమాలిన, చావు మూడిన ఒంటె సర్కసులోనో, జంతు ప్రదర్శనశాలలోనో మాత్రమే కనిపిస్తుంది.

ఆధునిక బాలకునికో, బాలికకో ఒంటె ఎముకను కనక ఎవరైనా చూపిస్తే యిదేదో పూర్వకాలపు మహాగజానికో, లేక దినొసార్‌కో చెందిన ఎముక అనుకుంటారు, అంత అసాధారణంగా, వింతగా, విడ్డూరంగా ఉంటుందది.

ఒకానొక రోజున చాలా కాలంగా విస్మరింపబడి, మానవ స్మృతి పథం నుంచి చెరిపివెయ్యబడిన ఆ ఒంటెలు, పురాతన నైరీ రాజ్యపు తరుణ రాజధానీ నగర వీధుల్లో మరల నడవసాగాయి.

వాటి సాక్షాత్కారం పెద్ద సంచలనాన్ని రేకెత్తించింది. వాటి చుట్టూ ఓ పెద్ద జన సమూహం చేరింది. ఆ గుంపులోని ప్రతి ఒక్క వ్యక్తీ కూడా ఆశ్చర్యోద్వేగాలతో నిండి ఉన్నాడు.

ఆ ఒంటెలు మరి వేటిగానో మారిపోతాయేమోనని భయపడుతున్నట్లు 'అవి ఒంటెలు!' అన్నారు కొందరు.

గూని లేకుండా తిన్నని నడుములున్న ఒంటెలు ఎన్నడైనా ఉన్నాయన్నట్లు 'ఇవి గూని ఒంటెలు!' అన్నాడు మరొక ప్రబుద్ధుడు.

'ఇవి పిచ్చి జంతువులు!' అని గొణిగి, ఆ మాటనే తన స్నేహితులతోను, అపరిచితులతోనూ, తనకు తానూ వల్లించి వల్లించి, తన కల్పనను తానే నిజమని నమ్మే స్థితికి చేరుకున్నాడు యింకొకడు.

తను ప్రత్యక్షంగా చూసినంత ధీమాగా అన్నాడు నాల్గో వాడు: 'ఎవరో గాని యీ ఒంటెల్లో ఒకదాన్ని, నీ మెడ యిలా వంకరగా ఎందుకుందని అడిగాడు. అప్పుడదే-మందో తెలుసా! 'నా ఆకారమే అంత' అంది.'

'ఏమిటేమిటి, నిజంగానే?!' అంటూ ప్రతి ఒక్కడూ అబ్బురపాటు వ్యక్తం చేశాడు. వాళ్ల ఆశ్చర్యవిభ్రమాలకు అంతే లేకపోయింది.

ఈలోగా, ఆ ఒంటెలు, మెచ్చికోలు కోలాహలం తమకేమీ పట్టనట్లు తాపీగా, గంభీరంగా ముందుకు సాగిపోయాయి, వాటి మెడలకున్న గంటలు గణగణ శబ్దం

చేశాయి. ఎండ వేడికి రోడ్డు మీద తారు కరిగి చితచితలాడుతోంది. నిప్పులు చెరిగే ఎండలో పురాతన ప్రాచ్య దీర్ఘగేయంలాగ ఒంటెల బిడారు, దాని కెక్కడా అంతే లేదా అన్నట్లు సాగిపోతోంది.

నగరమధ్యభాగంలో వీథులన్నీ కలిసే చోట ఓ పెద్ద చౌకు ఏర్పడింది. ఈ వీథులను అదుపుచేసే నియమాలు అనుల్లంఘనీయాలు కదా. ఎర్రలైటు మారిపోయిన మరుక్షణమే, కాలి నడకన పోయే జనప్రవాహం వీథిని దాట నారంభించింది.

పచ్చలైటు మారగానే కార్ల బారు జంయ్మంటూ ముందుకు దూసుకుపోయింది.

పసుపు పచ్చవి, ఎర్రనివి, ఆకుపచ్చనివి లైట్లు వెలుగుతూ, ఆరుతూ వున్నాయి. అందరూ ఆ ట్రాఫిక్ లైట్ల మిటకరింపులను పాలించారు.

అటుతర్వాత, తమ గంటలు గణగణ మ్రోగుతూండగా, ఒంటెలు చౌకుకి వచ్చాయి.

తన అయిదో అంతస్తు బాల్కనీలోంచి ఒంటెల బిడారును చూసిన గాయిక్ సంభ్రమాశ్చర్యాలతో ఎగిరి గంతేసి, క్రిందకి పరుగెత్తనారంభించాడు. అప్పటికే వివిధ అంతస్తుల్లోని వాటాల తలుపులు దఢాలున మూసుకోవడం, మనుషులు పరుగిడుతున్న అడుగుల సవ్వడీ అతనికి వినవచ్చాయి.

ఆ దృశ్యమెక్కడ కనుమరుగైపోతుందోనన్న భయంతో ప్రతి ఒక్కడూ హడావిడిగా పరిగెడుతున్నాడు.

పిల్లలైతే, యిళ్లల్లోంచి బయటకు దూసుకెళ్లి ఒకళ్లనొకళ్లు నెట్టుకుంటూ, ఒంటెల బిడారు వెంట పరిగెత్తుతున్నారు.

అవి సెలవు రోజులు. స్కూళ్లు మూతపడటంతో నగరంలో పిల్లలదే రాజ్య-మన్నట్లుగా ఉంది.

బిడారు మధ్య ఓ క్షణకాలం గందరగోళం ఏర్పడింది. బిడారు అగ్రభాగాన నడుస్తున్న నార్ అనే ఒంటెకు ఏం కోపమొచ్చిందో ఏమోగాని, యిప్పుడది ససేమిరా కదలకుండా మొరాయించి నిలబడిపోయింది. బహుశా గత కొద్ది గంటలుగా తన పట్ల తన యజమాని ప్రదర్శించిన నిర్లక్ష్యం దాన్ని కోపఘూర్ణితురాలిని చేసినట్లుంది.

వాళ్ల మధ్య యీ కోపతాపానికి బహుశా మరొకటేదైనా కారణమైయుండవచ్చు, ఏమో ఎవరికెరుక?

దీర్ఘమైన ఒంటెల బారు వలయాకారంగా మోహరించింది. ట్రాఫిక్ బందైంది. వేడి దుర్భరంగా ఉంది.

మనిషీ, ఒంటే నువ్వెంతంటే నువ్వెంత అన్నట్లు ఒకళ్ల కళ్లలోకి మరొకళ్లు చూసుకున్నారు.

వాళ్ల కళ్లలో ఏదో తళుక్కున మెరిసి ఆరిపోయింది.

మనిషే జయించాడు.

గణగణమనే గంటల మ్రోతతో ఒంటెల బిడారు నగరంలోని వీథుల గుండా క్రింది కొస్తోంది. మనుషులనూ, ఆ జంతువులనూ కూడా, అస్పష్టమైన భావాలు వేధించాయి.

ఎత్తైన పలువాటాల భవనంలోని బాలబాలికలు త్వరలోనే గుంపుకు వెనక బడి పోయారు, ఇతర బాలబాలికలు వాళ్ల స్థానాన్ని ఆక్రమించుకున్నారు. గుంపు మాత్రం, ఎప్పుడూ తరక్కుండా, ఎప్పటికప్పుడు మారిపోతూ ఒంటెలబారు వెంట నడుస్తూనే ఉంది. జనం, ఆకురాలుకాలంలో చెట్లనుండి వేరుచెయ్యబడిన ఆకుల్లాగ, ఒకరినొకరు తాకుతూ, విడిపోతూ, వీథుల వెంటా, సందుగొందుల వెంటా అదృశ్యులవుతున్నారు.

వాళ్లందర్లోనూ గులాబి రంగు రిబ్బను కట్టుకున్న ఒక అమ్మాయి మాత్రం ఒంటెల బిడారుకెన్నడూ వెనకపడలేదు. ఆమె పరుగెత్తుతూ పరుగెత్తుతూ ఆగుతోంది. ఆగి, మళ్ళీ పరుగెత్తనారంభిస్తోంది. ఆశ్చర్యంతో విప్పారిన ఆమె కళ్లు సంతోషంగా మెరుస్తున్నాయి.

'నీ పేరేమిటి?' అని అడిగాడు గాయిక్.

అతని వైపు చూడనైనా చూడకుండా 'అన్నా' అని ఆమె జవాబిచ్చి, 'మరి నీ పేరో?' అని ప్రశ్నించింది.

'గాయిక్.'

వాళ్లు కలిసి నడవసాగారు.

'నీ కెన్నేళ్లు?' గాయిక్ అడిగాడు.

'పదమూడు' అందామె తన చూపును ఒంటెలబారు నుంచి మరల్చకుండా.

ఆ కుర్రాడికి పధ్నాలుగేళ్లు, కాని అతను తన వయస్సు పదమూడేళ్లే అని చెప్పాడు. వయస్సులో ఆమెను వెనక దిగవిడిచి తను ముందుకు దూసుకుపోవడం అతనికిష్టం లేకపోయింది.

ఒంటెలూ, కారూ ఒక రోడ్ల కూడలిలో శవయాత్ర సాగిపోయేదాకా నిలిచి పోవాల్సి వచ్చింది. ఇదే కనక శీతకాలమయ్యుంటే మనుషులు తమ టోపీలు పైకెత్తి గతించిన వ్యక్తికి గౌరవాభివందనం చేసేవారే, కాని యిది నడినెత్తి మాడ్చే వేసవి అయిపోయింది.

బిడారు యజమాని తన తెల్ల గొర్రెబొచ్చు టోపీని పైకెత్తడం మరచిపోయాడు. అతగాడు తన మాతృదేశపు ఆచారాలనూ, అలవాట్లనూ, మతాన్నీ చాలకాలంగా మరచి పోవడమే దీనిక్కారణమై యుంటుంది.

బ్యాండు మేళం విషాద గంభీరమైన పాట వాయిస్తోంది. అంతిమయాత్రలో ఉన్న కార్లు విచారసూచకంగా తమ హారన్లు మ్రోగించాయి. పలువురు ఏడ్చారు, శోకన్నాలు పెట్టారు, శోకన్నాలు పెట్టారు, ఏడ్చారు.

ఒక్క క్షణం పాటు ప్రతి ఒక్కడూ తను నిస్సహాయుడన్నట్లూ, తనేదో నేరం చేసినట్లూ భావించాడు. అయితే యీ శ్మశానవైరాగ్యం మరుసటి క్షణానికే మటు మాయమైంది.

'జాగ్రఫీలో నీకెన్ని మార్కులొచ్చాయి?' అని అడిగాడు గాయిక్.

'ఎక్సలెంట్' అని జవాబిచ్చి అన్నా చిరునవ్వు నవ్వింది.

వాళ్లిద్దరూ ఒకరి పట్ల మరొకరు ఎంతగా యిష్టాన్ని పెంచుకున్నారంటే, పరస్పరం మాట్లాడుకోవడానికి తడబడుతున్నారు.

'అన్నింటి కన్న ముందున్న ఒంటె అంటే నాకు బలే యిష్టం' అంది అన్నా.

'ముందున్న ఒంటె అంటే నాకు కూడా ఇష్టమే' అన్నాడు గాయిక్.

వాళ్లిద్దరి యిష్టాలూ ఒక్కటే, కాని అందుకని ఏం చెయ్యాలో వాళ్లకి బోధపడలేదు.

'మనం పోయి ఒంటెను కౌగలించుకుందాం!' అంది అన్నా.

'పోయి దాని కాళ్లముందు సాగిల పడదాం!' అన్నాడు గాయిక్.

కాని వాళ్లు, అదీ చెయ్యలేదు, ఇదీ చెయ్యలేదు, మామూలుగా ఇది మనుషులు చేసేపని కాకపోవడమే యిందుక్కారణం.

'నాకా ఒంటె యజమాని అంటే ఎంత ఈర్ష్య కలుగుతోందో నువ్వూహించలేవు.'

'నాకూను'

'కావాలంటే అతను తన ఒంటెను ముద్దు పెట్టుకోగలడు, లేక దానికి జీను కట్టగలడు, అదీ కాకపోతే దాన్ని ఆకాశపుటంచుదాకా నడిపించుకు పోగలడు.'

'అంతే అన్న మాటేమిటి, తను చెయ్యదలుచుకున్నదేదైనా చేసెయ్యగలడు!'

'ఇంత అందమైన ఒంటెని, యిన్ని చక్కని ఆభరణాలున్నదాన్ని నేనింతకు ముందెన్నడూ చూడలేదు' అంది అన్నా.

'జంతు ప్రదర్శనశాలలోనూ, సర్కస్‌లోనూ కూడా ఇంత అందమైన ఒంటెని చూడలేదు' అన్నాడు గాయిక్.

క్షణకాలం వాళ్లిద్దరూ ఒకళ్ల అస్తిత్వాన్ని మరొకళ్లు మరచిపోయి, తమ తమ సొంత మానసికోద్వేగంలో కొట్టుకుపోయారు.

తర్వాత గాయిక్ నార్ దగ్గర కెళ్లాడు. అతనా ఒంటెని తడిమాడు, బొచ్చు ఒత్తుగా ఉన్న దాని పార్శ్వాన్ని నిమిరాడు, తనకే ఆశ్చర్యం గొలిపే విధంగా ఓ పిడికెడు బొచ్చు అతని చేతిలోకి ఊడివచ్చింది.

అతను చేసిన పనిని ఒంటె యజమాని గమనించి, గాయిక్ వంక నేరస్థుని చూసినట్లు తీక్షమైన దృక్కులు బరపాడు. దానితో ఆ కుర్రాడు నేరస్థునిలా కుంచించుకు పోయి, పాలిపోయాడు.

అంత మూల్యం వెచ్చించి తను సంపాదించిన ఆ సంపదలో సగాన్ని అతనా బాలికకు యిచ్చాడు. తన హృదయంలో సగభాగాన్ని ఆమెకిచ్చేస్తున్నంత బెరుకుగా ఊపిరిబిగపట్టి మరీ ఆ బహూకరణ చేశాడు.

ఆ అమ్మాయి కూడా అమూల్యమైన ఆ బహూకృతిని, అతని హృదయంలో సగభాగమన్నట్లుగానే అంత బెరుకుగానూ, అంతగా ఊపిరి బిగపట్టే స్వీకరించింది.

ముసలీ ముతకా పిల్లా పెద్దా అందరూ వాళ్లని చుట్టుముట్టి మాకివ్వండి మాకివ్వండంటూ, ఆ అర్ధహృదయంలో శతసహస్రాంశం కోసం ఎగబడ్డారు.

అలాగ వాళ్లిద్దరూ తమ భాగాలను వేలకొద్దీ భాగాలు చేసి పంచి యిచ్చారు. చివరికి వాళ్లకి ఒక్కొక్క కేశరాజం మాత్రమే మిగిలింది.

అంతలో అకస్మాత్తుగా యిద్దరు ముసలమ్మలు అక్కడికొచ్చారు. వాళ్లిద్దరూ వంగిపోయి ప్రశ్నార్థకపు గుర్తుల్లా ఉన్నారు. గాయిక్, ఆన్నాల దగ్గర మిగిలిన రెండు వెంద్రుకలనూ ఆ యిద్దరు ముసలమ్మలూ ఊడలాక్కుపోయారు.

ఆ పిల్లలిద్దరూ గాభరాగా ఒకళ్ల వంక మరొకరు చూసుకున్నారు. జరిగినదంతా నిజమూ కలా కూడా అనిపించింది వాళ్లకి.

గంటలు టింగుటింగుమని మోగుతున్నాయి.

ఒంటెలు తరలిపోతున్నాయి.

గుంపు చెదిరిపోతోంది.

సూర్యుడు అస్తమిస్తున్నాడు.

వీధులూ, చౌకులూ ధూళిధూసరిత మయ్యాయి, ఇళ్లల్లోనూ, చెట్ల కిందా గాలి తేమగా తయారైంది. వందలాది యితర సాయంకాలాల్లాగే, ఆ సాయంత్రం కూడా నల్ల ముసుగు కప్పుకుంటోంది.

'ఒంటె వెంద్రుకే దొరికితే దానికి వంద రూబుళ్లైనా యిస్తాను!' అన్నాడు గాయిక్.

'ఒంటె వెంద్రుకే దొరికితే దానికి వెయ్యి రూబుళ్లిస్తాను!' అంది అన్నా.

'దాని కోసం ఏదైనా సరే యిచ్చేందుకు నేను సిద్ధం' అని గాయిక్ నిట్టూర్చాడు.

'నేను మాత్రం యివ్వనా!?' అని ఆన్నా నిట్టూర్చింది.

ఒంటె వెండ్రుకకి బదులుగా యిచ్చేందుకని తమ దగ్గర ఏమీ లేనందుకు వాళ్లిద్దరూ కుమిలిపోయారు.

ఒక సైనికదళం వీథి వెంట కవాతుచేసుకుంటూ పోతుంది.

ఇది కూడా ఆసక్తికరంగానే ఉంది.

ఒంటెలు వెళ్లిపోయాయి. బాలబాలికలిప్పుడు వీథికి అటూ యిటూ నిలబడ్డారు. వాళ్ల మధ్య తాత్కాలికంగా నిషిద్ధప్రాంతమొకటి ఏర్పడింది.

సైనికులు హుషారుగా పాట పాడుకొంటూ, చురుకుగా కవాతుచేస్తూ ముందుకు సాగిపోయారు. ఒక అమ్మాయి పూలగుత్తినొకదాన్ని వాళ్లపైకి విసిరింది. పువ్వులు వాళ్ల దాకా చేరకుండా పేవ్‌మెంటు పక్క పడిపోయాయి.

పూలను చూసి, సైనికులు మందహాసం చేసి, వరుస తర్వాత వరుసగా ముందుకు సాగిపోయారు. ఆ విధంగా వందలాది సైనికులు ముందు కెళ్లారు. చివరివాడు, నీలి కళ్ల యువకుడు వంగి పువ్వులు ఏరుకొని, ముక్కు దగ్గర పెట్టుకొని వాటి సువాసన ఆఘ్రాణిస్తూ, తన కామ్రేడ్సు వెనక పరుగెత్తాడు.

దానితో యిప్పుడిక నిషిద్ధప్రాంతం ఖాళీ అయింది.

'సైనికులు ఎక్కడికి పోయారబ్బా?' అంటూ అబ్బాయి ఆశ్చర్యపోయాడు.

'ఒంటెలెక్కడికి పోయాయబ్బా?' అంటూ అమ్మాయి ఆశ్చర్యపోయింది.

వాళ్లింతకు ముందెన్నడూ యింతగా దిగులు చెందలేదు. వాళ్లు ఒంటెల్ని ప్రేమించారు, ఒంటెలు కూడా తమని ప్రేమించాయని ఊహించుకున్నారు, పైగా అవి ఎప్పుడూ అక్కడే ఉంటాయనుకున్నారు.

కాని, మొత్తంమీద వాళ్ల అంచనా ఎక్కడో తప్పింది.

పిల్లలు బాటసారులను 'ఒంటెలు ఏ పక్కకెళ్లాయి?' అని ప్రశ్నించి, వాళ్లు సూచించిన దిశగా త్వరితగతిని సాగిపోయారు.

ఆ విధంగా వాళ్లు నగరపు పొలిమేర దాటి, నిర్జనంగా వున్న శివార్లలో ప్రవేశించారు. సూర్యాస్తమయమై చాల సేపైంది. తలల పైగా ఆకాశం అల్లంత ఎత్తున కనిపిస్తోంది. నాలుగు పక్కలా నిశ్శబ్దం, శాంతీ తాండవిస్తున్నాయి.

పిల్లలు కొత్తగా దున్నిన పొలం దాటారు. అంత మట్టిని ఒక్క సారిగా, అటువంటి సిసలైన మట్టిని, పూల కుండీల్లోనూ, నగరపు చౌకుల్లోనూ ఉండే మట్టిని కాకుండా, అలాంటి సువాసనలెగజిమ్మే మట్టిని వాళ్లింతకు ముందెన్నడూ చూడలేదు.

రోడ్డు మూడు దిశలుగా చీలిన చోట ఒక ముసిలాడు నేల మీద కూర్చొని వున్నాడు. అత కెంత వయస్సుంటుందో చెప్పడం కష్టమే. గాయిక్ మెల్లగా అతణ్ణి సమీపించి, 'తాతా ఒంటెలెటెళ్లాయో చూశావా?' అని అడిగాడు.

'ఆ.'

'ఎటెళ్లాయవి?' ఆన్నా ఆతృతగా ప్రశ్నించింది.

'మొదటి రోడ్డు వెంట వెళ్తే వాటి దగ్గరికి మీరు మరింత తొందరగా వెళ్తారు. రెండో రోడ్డు మరింత దీర్ఘమైనది. మూడో రోడ్డు ఎక్కడికీ వెళ్లదు' అని చెప్పాడు వృద్ధుడు.

'మొదటి రోడ్డేది?'

కాని, వృద్ధుడు జవాబుచెప్పలేదు. అప్పటికే అతను గుర్రుపట్టి నిద్రపోతున్నాడు.

అందుకని వాళ్లు, అది తమని తమ లక్ష్యానికి తీసుకెళ్లదని తెలియక, ఏదో ఒక రోడ్డు పట్టుకొని బయల్దేరారు. చివరకి వాళ్లు అలసిపోయి, చుట్టూ కలియజూశారు. వాళ్లకొక కొండ, ఒక పొద, ఒక వాగూ కనిపించాయి. అదిగో, దూరాన. ..

'ఒంటెలు!'

వాళ్లు సంతోషంతో ఒళ్లు మరచిపోయి, కేకలేసుకొంటూ, ముందుకి పరుగెత్తారు. కాని వాళ్లు కొన్ని అంగలు వేశారో లేదో అంతలోనే ఠక్కున నిలబడి పోయారు. అబ్బే, అవి ఒంటెలు కావు. పురాతన నైరీ దేశపు పురాతన పర్వతాలవి. ఓ పెద్ద పర్వతాల బారు దిఙ్మండలంలో యీ చివర నుంచి ఆ చివర దాకా పరుచుకొని వుంది.

◆

19

నా చిన్నప్పుడు మా ఇంట్లోనూ, ఊళ్ళోనూ కూడా నా దాహాన్ని తీర్చే పుస్తకాలు చాలా తక్కువగా దొరికేవి. ఉన్న ఆ నాలుగు పుస్తకాల్నే ఎన్నోసార్లు మళ్ళీ మళ్ళీ చదువుతూ ఉండేవాణ్ణి. కాని ఎప్పుడేనా ఏదన్నా పుస్తకం, అదెలాంటిది కానీ, నా చేతుల్లోకి వస్తే పండగలాగా ఉండేది. అలాంటి రోజుల్లో ఒక చిన్న పత్రికలాంటిది, క్రౌను సైజు పుస్తకం, అట్టలు చిరిగిపోయింది నా చేతుల్లోకి వచ్చింది. అందులో ఏం చదివానో గుర్తులేదుగానీ, ఒక కథ మాత్రం నా మనసులో మిగిలిపోయింది.

అదొక యుద్ధకాలం నాటి కథ. కొందరు ఒక పట్టణం నుంచి ఒక బండి మాట్లాడుకుని దేశసరిహద్దులు దాటడానికి రాత్రికి రాత్రి పారిపోతుంటారు. వాళ్ళని సరిహద్దుల్లో సైనికులు అటకాయిస్తారు. ఆ ప్రయాణీకుల్లో ఒక స్త్రీ ఆ రాత్రి వారిని కలిసి, వారిని తృప్తిపరచి, తనూ, తన తోటిప్రయాణీకులూ క్షేమంగా సరిహద్దులు దాటి పోయేలా ఏర్పాటు చేస్తుంది. ఆమె ఆ సైనికశిబిరం నుంచి తిరిగి మళ్ళా తన సహ ప్రయాణీకుల్ని కలుసుకున్నాక, వాళ్ళల్లో ఆమె పట్ల చాలా మార్పు వస్తుంది. వాళ్ళు ఆమె పట్ల కృతజ్ఞులుగా ఉండకపోగా, ఆమెని కించపరిచేట్టు ప్రవర్తిస్తారు. ఇదీ, నాకు గుర్తుండిపోయిన, ఇతివృత్తం. ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకుగానీ, ఆ కథ Boule de Suif అనీ, ఆ కథ రాసినాయన మపాసా అని తెలిసింది కాదు.

మపాసా అనగానే The Necklace (1884) కథనే గుర్తొస్తుంది అందరికీ. నూటా యాభై ఏళ్ళుగా ఎన్నో సంకలనాలకు ఎక్కుతూ వస్తున్న కథ అది. దాన్ని దాటి మపాసా అంటే ఏమిటో తెలుసుకుందామనే కోరికతో, 87 లో The Complete Shortstories of Gue De Maupassant కొనుక్కున్నాను. ఆ కాలంలో ఎప్పుడు సమయం చిక్కితే అప్పుడు ఆ పుస్తకంలో చదివిన చాలా కథల్లో ఒక కథ మాత్రం నాకు జ్ఞాపకం ఉండిపోయింది. అది Bed No.29.

ఆధునిక కథకి జవసత్త్వాలు సమకూర్చిన ముగ్గురు మహాశిల్పుల్లోనూ గై డి మపాసా (1850-1893) ఒకడని నేను కొత్తగా చెప్ప వలసిన పనిలేదు. చెహోవ్, ఓ హెన్రీ, మపాసాలు ఆధునిక కథనికకు రూపురేఖ–లివ్వడంతో పాటు దానికొక ప్రయోజనాన్ని కూడా నిర్దేశించారని చెప్పవచ్చు.

ఈరోజు సాహిత్యచరిత్రకారులు మపాసాను నాచురలిస్టుగానూ, చెకోవ్‌ను ఇంప్రెషనిస్టు గానూ, ఓ హెన్రీని రియలిస్టుగానూ పరిగణి–స్తూండవచ్చు. కాని ఆ ముగ్గురూ కూడా ఆధునిక మానవ సమాజంలోని డొల్లతనాన్నీ, ఆత్మ వంచననీ, విలువల్లోని ద్వంద్వప్రమాణాల్నీ, మానవ సంబంధాల్లోని కాపట్యాన్నీ, ముఖ్యంగా సామాజిక విలువల్లోని అంతర్గత వైరుధ్యాల్నీ, కృత్రిమత్వాన్నీ ఎత్తిచూపినవారుగా నిలబడి పోయారు.

కాని తెలుగులో చలం, శ్రీ శ్రీ వంటి ప్రభావశీల రచయితలకు వారు స్ఫూర్తి ప్రదాతలుగా



నిలబడ్డప్పటికీ, ఆ ముగ్గురు రచయితల గురించిన నిశిత పరిశీలన ఇప్పటి దాకా తెలుగులో రానేలేదు. మానవ ప్రవృత్తిలోని బలమైన వ్యామోహపార్శ్వాల్ని చిత్రించినవాడి గానే మపాసాని అభిమానించారుగానీ, ఆయన అంతకన్నా లోతులకి పోయి, జీవితాన్ని అత్యంత నిశితపరీక్షకు గురి చేసిన రచయిత అని మన వాళ్ళు గుర్తుపట్టలేదు.

ఉదాహరణకి, 1870-71 మధ్య కాలంలో జర్మనీకి, ఫ్రాన్సుకీ మధ్య జరిగిన ఫ్రాంకో–ప్రష్యన్ యుద్ధం చుట్టూ మపాసా కనీసం ముప్ఫై నలభై కథలు రాసాడు. అతడి కథల్లో ప్రసిద్ధి చెందిన Boule de Suif, Bed No.29 ఆ నేపథ్యంలో వచ్చిన కథలే.

ఆ యుద్ధం మొదలయ్యేప్పటికి మపాసా ఇరవ–య్యేళ్ళ యువకుడు. ఆ యుద్ధంలో ఫ్రెంచి సైన్యంలో ఒక ప్రైవేటు సైనికుడిగా పాల్గొన్నాడు. ఆ అనుభవం అతడికి యుద్ధాన్నీ, ప్రభుత్వాల్నీ, మనుషుల ప్రవర్తననీ చాలా దగ్గరగా, చాలా నగ్నంగా చూసే అవకాశా–న్నిచ్చింది. యుద్ధం ముగిసిన పదేళ్ళకి, అంటే 1880 లో అతడు తన మొదటికథ Boule de Suif రాసాడు. ఆ తర్వాత పదేళ్ళ కాలంలో, అంటే 1890 లోపు అతడు దాదాపు మూడు వందల కథలు, ఆరునవలలు, మూడు యాత్రా కథనాలు వెలువరించాడు. ఆ తర్వాత మూడేళ్ళకే, అంటే, నలభై మూడేళ్ళ వయసుకే ఆయన మరణించాడు.

నిజానికి నన్ను వెన్నాడే కథల్లో Boule de Suif1 నే ఇక్కడ మీతో పంచుకోవాలి. కానీ ఆ కథ నిడివి పెద్దది కావడం వల్ల, దానికి సమానమైంది అని చెప్పదగ్గ Bed No.29 (1884) ని, అనువదించి, ఇక్కడ మీతో పంచుకుంటున్నాను.

ఈ కథ ఒక్కటి చాలు, మపాసా ఏమి చూసాడో, దాన్ని బట్టి తన చుట్టూ ఉన్న సమాజం గురించి ఎటువంటి అంచనాకి వచ్చాడో మనకు తెలియడానికి. చలంగారి కథలాగా కనిపించే ఈ కథలో రచయిత ఎంతో కళాత్మకమైన వ్యంగ్యంతో తన కాలం నాటి ఫ్రెంచి సామాజిక విలువల్ని తూర్పారబట్టాడని మనం గమనిస్తాం. కథ మొదట్లో తన కాళ్ళనీ, కాళ్ళల్లోని పటుత్వాన్నీ చూసుకుని గర్విస్తూ ఉండే ఆశ్వికదళాధికారి కథ చివరకు వచ్చేటప్పటికి అవే కాళ్ళని ఈడ్చుకుంటూ ఆస్పత్రినుంచి పారిపోయేదాకా– మొత్తం కథ ఫ్రెంచి సమాజపు డొల్లతనాన్ని ఈ కథ అత్యంత సమగ్రంగా చిత్రించిందని మనం గుర్తుపడతాం.

ఏళ్ళ తరువాత, చెకోవ్ Ward No.6 (1892) రాయడానికి ఈ కథనే ప్రేరణ అని మనం చెప్పవచ్చు. పైకి చూస్తే ఈ రెండు కథలమధ్యా ఉన్న పోలిక చాలా పరిమితమని అనిపించవచ్చు. రెండూ ఆసుపత్రి నేపథ్యంగా చిత్రించిన కథలని మాత్రమే అనుకుంటాం. కాని చెకోవ్ కళాశిల్పి కాబట్టి తనకి స్ఫూర్తినిచ్చిన కథనుంచి తాను ఏది గ్రహించాలో అది మాత్రమే స్వీకరించాడు. రెండు కథల్నీ లోతుగా చదివితే ఆ ప్రభావమేమిటో మనకు తెలుస్తుంది. ఇద్దరూ కూడా తమ కాలం నాటి సామాజిక విలువల్లోని ద్వంద్వప్రమాణాల్ని ఎత్తిచూపారని అర్థమవుతుంది. ఈ కథలో మపాసా ఒక సైనికాధికారి తాను యుద్ధంలో పాల్గొన్నందుకు శౌర్యపతాకాన్ని సంపాదించుకోగా, అదే కాలంలో, ఒక స్త్రీ తనకు చాతనయిన పద్ధతిలో దేశప్రేమ చూపించినప్పటికీ, ఆమెకు అవమానం, రోగం, మృత్యువు మాత్రమే బహుమానాలుగా దక్కుతాయి. ఎవరిని ఫ్రెంచిసమాజం అత్యంత శౌర్యవంతుడని సత్కరించిందో అతణ్ణి చివరికి ఒక పిరికి– పందగా తేల్చివెయ్యడం ఎంతో చేయితిరిగిన కథశిల్పికి మాత్రమే సాధ్యం కాగల కౌశల్యం. అలానే బెడ్ నంబరు.6 లో తక్కిన సమాజం ఎవరిని పిచ్చివాడని ముద్రవేసిందో, అతడొక్కడే అత్యంత ఆరోగ్యప్రదమైన మానవుడిగానూ, చుట్టూ ఉన్న సమాజమే ఉన్మాదశీలంగానూ కనిపిస్తుంది.

తెలుగులో గొప్ప కథలు చాలానే వచ్చాయి. కాని ఇటువంటి కథలు రాయగల కథకులు మాత్రం ఇంకా పుట్టలేదు.

గై డి మపాసా

బెడ్ నంబరు. 29

వాడ్రేవు చినవీరభద్రుడు

కెప్టెన్ ఎపివెంట్ వీథిలో నడిచేటప్పుడు స్త్రీలందరూ అతడి వైపులు చూపులు తిప్పకుండా ఉండలేకపోయేవారు. స్ఫురద్రూపి అయిన ఒక అశ్వికుడు ఎలా ఉంటాడో అతడొక నమూనా. అతడు ఎల్లప్పుడూ కవాతులో ఉండేవాడు, దేనిగురించో వ్యగ్రంగా ఉన్నట్టుగానూ, తన శారీరిక దారుఢ్యాన్నీ, తన పాదాల్లోని శక్తినీ, తన మీసాల్నీ చూసుకుని కొంచెం దర్పంతోనూ కనబడేవాడు. అతడి శరీరం, అతడి కాళ్ళు, ఆ మీసాలు అద్భుతమైనవే, సందేహం లేదు. అతడి మీసాలైతే రాగి రంగులో, ఒత్తుగా, అతని పెదవి మీంచి, పండిన గోధుమ రంగులో, అందమైన వంపుతిరిగి, ఒక సైనిక రాజసంతో, బాగా మెలిపెట్టిన కొసల్తో, అతని నోటికి రెండు వైపులా కుదురుగా కత్తిరించి ఉన్నాయి. అతని నడుమైతే బిగుతైన రవిక ధరించినట్టుగా సన్నగా ఉంది. ముందుకు పొడుచుకొచ్చి, అతడి నడుం మీద అర్ధచంద్రాకారంగా, వంపు తిరిగిన ఆ ఛాతీ మాత్రం పూర్తిగా పురుషుడి వక్షం. నిరంతరం వ్యాయామం వల్ల వన్నెతేలిన అతని పాదసౌష్టవం ఆరాధనీయం. ఒక నర్తకి చరణంలాగా, మాంసపుష్టిగల ఆ పాదం తనని ఆచ్ఛాదించిన ఎర్రని వస్త్రంలోంచి తన ప్రతికదలికనీ ప్రతిఫలిస్తూ ఉంటుంది.

బిగుతైన కండరాలు కనబడేట్టుగానూ, చేతులూ, పాదాలూ వెడల్పుగా చాచినట్టుగానూ, ఒక అశ్వికుడి సమతూకభంగిమలో అతడు నడుస్తుంటాడు. తాను

నడిచినప్పుడు తన దేహాంగాల్ని ఎలా ఉపయోగించుకోవాలో, తన దేహభంగిమను ఎలా ప్రదర్శించుకోవాలో తెలిసినవాడిలా నడుస్తుంటాడు. సైనిక దుస్తుల్లో ఉన్నప్పుడు ఒక విజేతలాగా కనిపిస్తాడు. కాని మామూలు దుస్తుల్లో మాత్రం చాలా మామూలు మనిషిలాగా కనిపిస్తాడు.

తక్కిన చాలామంది అధికారులలానే కెప్టెన్ ఎపివెంట్‌కి కూడా మామూలు దుస్తుల్ని ఎలా ఎంచుకోవాలో తెలీదు. అవి ఏమీ బాగుండేవి కావు. దుకాణాల్లో పనిచేసే గుమాస్తాలు ధరించేలాంటి బూడిదరంగువో లేదా నల్ల రంగు వస్త్రాలో ధరించినప్పుడు అతడి రూపంలో కళాకాంతీ కనిపించదు. కానీ తనకు తగిన దుస్తులు ధరించినప్పుడు మాత్రం అతడికి తిరుగు లేదు. పైగా అతడిది చాలా సొగసైన ముఖం. సన్నని కొనదేలిన ముక్కు, నీలి కళ్ళు, గొప్ప నుదురు. అతడిది బట్టతల. తన జుత్తు ఎందుకు రాలిపోతున్నదో అతడికి ఎప్పటికీ తెలిసినట్టే లేదు. నెత్తిమీద జుత్తు కొద్దిగానే మిగిలినా తన ఒత్తైన మీసాలు ఆ లోటుని భర్తీచేస్తున్నాయని తనకి తాను సర్దిచెప్పుకునేవాడు.

సాధారణంగా అతడు ప్రతి ఒక్కరిపట్లా ఒక తృణీకారభావం ప్రదర్శించేవాడు. అయితే మనుషుల పట్ల చూపించే ఆ తూష్ణీంభావంలో హెచ్చుతగ్గులుండేవి.

అన్నిటికన్నా ముందు, అతడి దృష్టిలో, మధ్యతరగతి అనేది లేనేలేదు. వాళ్ళని జంతువుల్ని చూసినట్టు చూసేవాడు. పిచుకలనో లేదా కోడిపిల్లల్నో చూసేటప్పుడు వాటిమీద ఎంత ధ్యాసపెడతాడో వాళ్ళని చూసినప్పుడూ అంతే. అధికారవర్గాన్ని మాత్రమే తన ప్రపంచంగా అంగీకరించేవాడు. అలాగని అధికారులందరినీ సమానంగా చూసే వాడు కాడు. వాళ్ళల్లో ఎవరు అందగాళ్ళో వాళ్ళనే గౌరవించేవాడు. చూడగానే ఆకట్టుకునే స్ఫురద్రూపుల్నీ, నిజమైన శౌర్యవైభవంతో కనిపించేవారినీ మాత్రమే గౌరవించేవాడు. అతడి దృష్టిలో సైనికుడంటే ఒక ఉల్లాసకరసహచరుడు. దెయ్యంలాంటి సాహసికుడు. మోహంకోసమూ, మోహరం కోసమూ మాత్రమే పుట్టినవాడు. దారుఢ్యమూ, కండరాలూ, జుత్తూ ఉండే మనిషి, అంతే, అంతకుమించి మరేమీ కాదు. వారి వారి దేహసౌష్టవాన్ని బట్టీ, వాళ్ళ పటుత్వాన్ని బట్టీ, వారి ముఖాల్లో కనవచ్చే తీక్ష్ణదృక్కుల్నిబట్టీ అతడు ఫ్రెంచి సైనికాధికారుల్ని వర్గీకరించుకున్నాడు. ఆ విధంగా చూస్తే ఆధునిక కాలాల్లో బోర్బాకి అందరికన్నా గొప్ప సైనికాధికారిగా అతడికి కనిపించాడు.

పొట్టిగా లావుగా ఉండే పదాతిదళ అధికారులు కవాతు చేసేటప్పుడు ఆయాస-పడ్డట్టు కనబడితే వాళ్ళని చూసి పరిహాసంగా నవ్వేవాడు.

పాలిటెక్నిక్ స్కూళ్ళనుంచి రిక్రూటైన బీదసైనికులంటే, బక్కగా, కళ్ళద్దాలతో ఎబ్బెట్టుగానూ, ఎలాంటి నైపుణ్యంలేనట్టుగానూ కనిపించే బీదసైనికులంటే అతడికి మరీ చిన్నచూపుగా ఉండేది. తోడేళ్ళతో సంకీర్తన చేయించినట్టు వాళ్ళు ఆ సైనికదుస్తులకి ఎంతమాత్రం తగరని పదేపదే అంటూండేవాడు. వాళ్ళని కూడా సైన్యంలో ఒకరిగా అంగీకరించవలసి వచ్చినందుకు అసహనంగా ఉండేవాడు. వాళ్ళ పీలదేహాలూ, పీతల్లాగా నడిచే వాళ్ళ నడకా, ఆ మానవాకార వైఫల్యాలు తాగేవారుకారనీ, తిండి కూడా ఏమంత తినేవారు కారనీ, అందమైన ఆడపిల్లలకన్నా లెక్కలపుస్తకాలంటే వాళ్ళకి ఎక్కువ మక్కువనీ వాళ్ళమీద ఎప్పుడూ చిరాకు పడుతుండేవాడు.

స్త్రీల విషయానికొస్తే కెప్టెన్ ఎపివెంట్‌ది నిరంతర విజయాల చరిత్రనే.

ఆ రాత్రి ఒకే శయ్యమీద కలిసి గడపడం నిశ్చయమని ఏ స్త్రీని చూస్తే అనిపిస్తుందో, ఆమెతో కలిసే, అతడు తన రాత్రిభోజనం కానిచ్చేవాడు. ఒకవేళ ఏవైనా మరీ అనివార్య కారణాలవల్ల ఆ రాత్రి గడపలేకపోతే ఆ మర్నాటి రాత్రి మాత్రం తప్పనిసరిగా ఆమెతో గడిపి తీరవలసిందే. అతడి సహోద్యోగులు తమ కుటుంబాలతో అతణ్ణి కలవడానికి ఇష్టపడేవారు కారు. తమ దుకాణాల్లో గల్లాపెట్టెలదగ్గర తమ భార్యల్ని కూచోబెట్టే వర్తకులు అతణ్ణి చూసి భయపడేవారు, తీవ్రంగా ద్వేషించేవారు కూడా. అతడు ఆ దారమ్మట వెళ్తున్నప్పుడు ఆ వర్తకుల భార్యలు దుకాణాల ముందు కిటికీఅద్దాల గుండా అతడివైపు ఒక్కమారేనా ఒక్కసారేనా చూడకుండా ఉండలేకపోయేవారు. ఆ ఒక్కచూపే ఎన్నో సరస సంభాషణలకు పెట్టుగా ఉండేది. ఆ చూపులో ఒక వినతి, ఒక ప్రతిస్పందన, ఒక ఆకాంక్ష, ఒక ఆమోదం కలగలసి ఉండేవి. వాళ్ళ భర్తలు, అతడు ఆ దారిన పోతున్నప్పుడు సహజవైముఖ్యంతో పక్కకు తప్పుకున్నవాళ్ళు, చటుక్కున ముందుకొచ్చి, దూరంగా వెళ్ళిపోతున్న ఆ సైనికదేహాకారాన్ని కటుదృక్కుల్తో పరికించేవారు. చిరునవ్వులు చిందిస్తూ, తాను ఆ మనుషులమీద కనబరుస్తున్న ప్రభావానికి తనే లోపల్లోపల ముగ్ధుడవుతూ, ఆ సైనికాధికారి ఆ దారమ్మట వెళ్ళిపోయాక, ఆ వర్తకులు తడబడుతున్న చేతుల్తో తమముందు పరిచిపెట్టిన వస్తువుల్ని సర్దుతూ ఇలా అనుకునే వారు:

'వీడో పెద్ద పోకిరీ. తమ సామాను ఈడ్చుకుంటూ ఇలా వీథుల్లోంచి పోయే ఈ పనికిమాలిన సజ్జుని మేపడం ఎప్పటికి మానేయగలుగుతాం? నా వరకూ నాకు ఒక సైనికుడిగా బతకడంకన్నా ఒక కసాయివాడిగా బతకడం మెరుగనిపిస్తుంది. అప్పుడు నా బల్లమీద నెత్తుటిమరకలుంటే అవి జంతువుల మాంసం తాలూకు నెత్తుటిమరకలే

అయి ఉంటాయి. నిజానికి ఆ కసాయివల్ల చాలా ఉపయోగముంటుంది. అతడి చేతుల్లో ఉండే కత్తి మనుషుల్ని చంపే కత్తి కాదు కదా. కాని ఇలాంటి హంతకులు, మారణా–యుధాలతో, ఇలా నడిరోడ్డుమీద నడుచుకుంటూపోతుంటే చూస్తూ ఎలా సహించగలుగుతున్నామో నాకు అర్థం కాదు. ఆ ఆయుధాలు అవసరమే, కాదనను, కాని వాటిని దాచుకుకదా తిరగాలి. ఇలా బహిరంగంగా ప్రదర్శించుకుంటూ పోవడానికి కాదు కదా. పైగా ఆ ఎర్రని పంట్లాములూ, ఆ నీలం రంగు కోట్లూనూ. అదే ఒక తలారి ఉన్నాడనుకోండి, అతడిలా వేషం వేసుకుని తిరగడు కదా. అవునా కాదా?'

ఆ దుకాణదారు అలా గొణుక్కుంటున్నప్పుడు, వాళ్ళావిడ, అతడికేమీ జవాబు చెప్పకుండా భుజాలు ఎగరేసి ఊరుకునేది. ఆ దృశ్యం చూడకపోయినా, ఆమె అలా చేసి ఉండగలదని ఊహిస్తూ, ఆ వర్తకుడు 'ఇలాంటి వాళ్ళు ఇలా పైకీ కిందకీ పచార్లు చేస్తుంటే చూస్తుండేవాళ్ళకి బుద్ధిలేదని చెప్పాలి' అని అరిచేవాడు.

ఏమైనప్పటికీ కెప్టెన్ ఎపివెంట్ తాలూకు ఇటువంటి సాహసకృత్యాల గురించిన ఘనత మొత్తం ఫ్రెంచిసైన్యంలో రూఢి అయిపోయింది.

ఇప్పుడు 1868 లో అతడి దళం, నూటరెండవ హుస్సార్ల దళం, రోవెన్ పట్టణం లోని శిబిరానికి వచ్చిచేరుకుంది.

తొందర్లోనే అతడి గురించి మొత్తం పట్టణానికి తెలిసిపోయింది. ప్రతి రోజూ సాయంకాలం అయిదు గంటలకి అతడు బోయెల్డ్యూ మాల్ దగ్గర కనిపించేవాడు. అక్కడ పరిమళాలు కక్కే కాఫీ సేవించేక, ఆ భవనసముదాయంలోకి ప్రవేశించే ముందు, తన దేహాకృతినీ, తన దారుఢ్యాన్నీ, తన మీసాల్నీ నలుగురుచూసేలాగా, ఆ దారమ్మట ఒక మలుపు చుట్టివచ్చేవాడు.

ఆ కూడలిలో జమగూడి, తమ చేతులు వెనక్కి చుట్టుకుని నడుస్తూ బిగ్గరగానో, నెమ్మదిగానో, తమ వ్యాపారవిశేషాలు ముచ్చటించుకోడంలో మునిగి ఉండే రోవెన్ వ్యాపారస్థులు మధ్యలో అతడి వైపు ఒక చూపు సారించి తమలో తాము మెల్లగా గొణుక్కునేవారు:

'దేవుడా! ఎంత అందంగా ఉన్నాడు!'

కానీ అతడెవరో తెలిసాక మళ్ళా ఇలా అనుకునేవారు:

'చూడు. వాడు ఆ దుష్టుడు కెప్టెన్ ఎపివెంటునే!'

అతణ్ణి కలుసుకున్నప్పుడు స్త్రీలు తమ తల కొద్దిగా పంకించేవారు. అది వినయంతో కూడిన చిన్నపాటి గగుర్పాటు లాంటిది. అతణ్ణి చూడగానే తామేదో వివస్త్రలైపోయినట్టో లేదా ఏదో నిస్సత్తువ తమని ఆవహించినట్టో తమలో కలిగే ప్రకంపన అది. తాము ఆకర్షణీయంగా కనిపించాలన్నట్టూ, అతడు తమవైపు ఒకసారి చూపులు ప్రసరించా–లన్నట్టూ వాళ్ళు తమ శిరసులు ఓరగా వాల్చి, పెదాలపైన, చిరుహాసం తెచ్చుకునేవారు. అప్పుడు అతడెవరేనా సహచరుడితో కలిసి నడుస్తున్నట్లయితే, ఆ సహచరుడు, ఆ మొత్తం ప్రక్రియ చూస్తూ, అసూయతో రగిలిపోతూ, 'ఈ దుర్మార్గుడు ఎపివెంట్‌కి ఎన్ని అవకాశాలు' అని తనలో తాను గొణుక్కోకుండా ఉండలేకపోయేవాడు.

నగరంలోని వేశ్యలవిషయానికొస్తే అదంతా వారిలో వారికొక పెద్ద సంఘర్షణ గానూ, అతణ్ణి ఎవరు చేజిక్కించుకుంటారన్న పరుగుపందెంగానూ ఉండేది. వాళ్ళంతా అయిదుగంటలకల్లా బోయెల్యూ మాల్‌కి చేరుకునేవారు. సైనికాధికారులు కూడా అక్కడికి చేరుకునే వేళ అది. తళతళలాడే తమ కృపాణాలు నడుముకు వేలాడుతుండగా ఆ లెఫ్టినెంట్లు, ఆ కెప్టెన్లు, ఆ కమాండర్లు జతలు జతలుగా ఆ నాట్యశాలలోకి ప్రవేశిస్తుండగా, ఆ వేశ్యలు కూడా, తమ వస్త్రాల అంచులు నేలని జీరాడుతుండగా, జతలు జతలుగా ఆ దారమ్మట పచార్లు చేస్తూ ఉండేవారు.

ఒక సాయంకాలం ఎం.టెంప్లియరు పాపోన్ అనే సంపన్న కర్మాగారాధిపతి ఉంపుడుగత్తె, అందమైన ఇర్మా, ఆ నాట్యశాలముందు తన బండి ఆపి, కిందకు దిగి, ఎం.పాలార్డ్ అనే నగిషీకళాకారుడి దుకాణం దగ్గర ఏదో కాగితమో లేదా విజిటింగు కార్డులో కొనే నెపమ్మీద కెప్టెన్ ఎపివెంట్‌ని క్రీగంట చూసింది. 'నీకు ఎప్పుడు వీలవుతుంది' అన్నట్టు ఉంది ఆ చూపు. ఆ భావం ఎంత స్పష్టంగా ఉందంటే, ఆ సమయంలో తన లెఫ్టినెంటు కల్నల్‌తో కలిసి మద్యం సేవిస్తున్న కల్నల్ ప్రూన్ ఆ దృశ్యం చూసి తన మిత్రుడితో 'వాణ్ణి పాతెయ్య! మళ్ళా మరో అవకాశం దక్కించుకునే–ట్టున్నాడు ఆ దుష్టుడు' అని గొణుక్కోకుండా ఉండలేకపోయాడు.

కల్నల్ మాటలు మరోసారి వినబడటంతో కెప్టెన్ తన పై అధికారి నుంచి లభించిన అంగీకారంగా దాన్ని భావిస్తూ ఆ మర్నాడూ, ఆ తర్వాత మరికొన్ని సార్లూ, ఆ సుందరిని ఆకట్టుకోడానికి ప్రయత్నిస్తూ ఆమె హర్మ్యగవాక్షాల కింద మాటువేస్తూ

గడిపాడు.

చివరకు ఒకరోజు ఆమె అతణ్ణి చూసింది. తాను కూడా చిరునవ్వు నవ్వింది.

ఆ సాయంకాలానికల్లా అతడు ఆమె ప్రేమికుడిగా మారిపోయేడు.

ఆ మీదట వారు నలుగురి దృష్టిలోనూ పడ్డారు. తమ అనుబంధాన్ని నలుగురూ చూసేలా ప్రదర్శించుకున్నారు. ఒకరికొకరు వివశులయ్యారు. తమ ప్రేమప్రతాపాన్ని చూసుకుని తామెంతో గర్వించారు.

ఆ సైనికాధికారీ, ఆ అందగత్తె ఇర్మా తప్ప ఆ పట్టణానికి మరో ఊసు లేదు. ఎం. టెంప్లియర్-పాపోన్ ఒక్కడికే ఈ సంగతులేవీ తెలియవు.

కెప్టెన్ ఎపివెంట్ తనకి కొత్తగా పట్టిన ఈ వైభవంతో మెరిసిపోడం మొదలు పెట్టాడు. ప్రతి క్షణం 'ఇర్మా నాతో ఇలా అంది- ఇర్మా ఈ రాత్రి నాతో ఇలా అంది- లేదా, నిన్న రాత్రి భోంచేసేటప్పుడు ఇర్మా ఇలా అంది-' అంటూ ఏదో ఒకటి చెప్తూనే ఉండేవాడు.

శత్రుహస్తాల్లోంచి చేజిక్కుంచుకున్న పతాకలాంటి తమ ప్రేమని ప్రదర్శిస్తూ, వాళ్ళిద్దరూ, అలా ఒక ఏడాది పాటు, రోవెన్ పట్టణమంతా తిరిగేరు. ఈ కొత్త విజయం వల్ల తనకు మరింత ఘనతచేకూరినట్టూ, భవిష్యత్తు మరింత నిశ్చయమవుతున్నట్టూ, తాను కోరుకుంటున్న సత్కారం మరింత ధ్రువపడుతున్నట్టూ , తక్కినవారందరి దృష్టీ తమమీదనే పడుతున్నట్టూ , తానేదో విస్మృతికి గురికాకపోగా మరింత ఆకర్షకకేంద్రంగా మారుతున్నట్టూ అతడు అనుభూతి చెందాడు.

కాని ఇంతలో యుద్ధం మొదలయ్యింది. అన్నిటికన్నా ముందు కెప్టెన్ దళాన్నే యుద్ధంలో ముందు మోహరించారు. ఆ వియోగం విలాపాగ్నిగా మారింది. ఒక రాత్రంతా వాళ్ళు విలపిస్తూనే ఉన్నారు.

ఎర్రటి సైనికదుస్తులు, టోపీ, ఉరస్త్రాణం, కృపాణం మొత్తమన్నీ అప్పటిదాకా పక్కన పెట్టినవన్నీ పైకి తీసారు. దుస్తులు, పావడాలు, పట్టుమేజోళ్ళు, తదితరసామగ్రి మొత్తం నేలపైన తివాసీమీద కలగలిసిపోయాయి. ఆ గదిచూస్తే అక్కడేదో యుద్ధం జరిగినట్టుగా ఉంది. ఇర్మా శోకం పట్టలేనిదిగా ఉంది. ఆమె జుత్తు విరబోసుకుని

ఉంది. తన బాహువులు రెండింటితోనూ ఆ సైనికాధికారి మెడని చుట్టి అతణ్ణి పదేపదే హత్తుకుంటూ ఉన్నది. ఇంతలో అతణ్ణి వదిలిపెట్టి నేలమీద పడి పొర్లాడుతూ అక్కడున్న వస్తుసామగ్రిని అటూ ఇటూ విసిరేస్తూ, ఆ కుర్చీల అంచులు పట్టుకుని వేళ్ళాడుతూ, వాటి కోళ్ళు పట్టుకుని కొరుకుతూ ఉండగా, కెప్టెన్ మరింత చలించిపోయాడు. కాని ఆమెను ఎలా ఓదార్చాలో అతడికి చాతకాక, 'ఇర్మా, నా బుజ్జి ఇర్మా, నా మాట వినవూ, ఏడవకు, మరీ అంతలా ఏడవకు, నేను వెళ్ళక తప్పదు కదా, వెళ్ళడం చాలా అవసరం కదా' అంటూ ఉన్నాడు.

అప్పుడప్పుడు తన చేతిచిటికెనవేలితో తన కంటికొసనుంచి ఒక అశ్రుబిందువుని తుడుచుకుంటూ ఉన్నాడు. తెల్లవారేటప్పటికి వారు ఒకరినుంచి ఒకరు విడిపోయారు. ఆమె వెళ్ళగలిగినంతదాకా తన ప్రేమికుడితో కలిసి బండిలో ప్రయాణించింది. ఇంక సెలవు తీసుకోక తప్పని చోటుకి చేరుకోగానే, ఆ వియోగ క్షణాన, ఆ మొత్తం ఆశ్వికదళం చూస్తూండగా, ఆమె అతణ్ణి ముద్దుపెట్టుకుంది. చూసే వాళ్ళకి అదంతా ఎంతో సభ్యత తోనూ, సంస్కారంతోనూ, ప్రేమతోనూ కూడుకున్నదిగానే అనిపించింది. అతడి సహచర ఉద్యోగులు అతడి చేయిపట్టి నొక్కి 'దుర్మార్గుడా, నిన్ను నిలువునా చీరిపాతెయ్యాలి! ఆమె చూడు ఎంత తల్లడిల్లిపోతోందో. ఎలాంటి హృదయం ఆమెది! పసికూనలాంటి హృదయం' అని అన్నారు.

అసలు ఆ మొత్తం సన్నివేశంలోనే వారికి దేశభక్తిసమానమైందేదో కనిపించింది.

ఆ యుద్ధంలో ఆ ఆశ్వికదళం తీవ్రపరీక్ష తట్టుకుని నిలబడింది. కెప్టెన్ అపారమైన సాహసప్రతాపాలు చూపించి కడకు శౌర్యపతకాన్ని అందుకున్నాడు కూడా. యుద్ధం ముగిసింది. అతడు రోవెన్‌కి మరలివచ్చి తన పటాలాన్ని చేరుకున్నాడు.

తిరిగి వచ్చిన వెంటనే అతడు ఇర్మా గురించి వాకబు చేసాడు. కాని ఆమె గురించి అతడికి ఎవరూ ఏ సంగతీ నిశ్చయంగా చెప్పలేకపోయారు. ఆమె ఒక ప్రష్యన్ మేజరుని పెళ్ళిచేసుకుందని కొందరు చెప్పారు. మరికొందరేమో ఆమె యివుటోలో ఉన్న తన తల్లిదండ్రులదగ్గరికి వెళ్ళిపోయిందని చెప్పారు.

పట్టణంలో సంభవించే మరణాల్ని నమోదుచేసే కార్యాలయానికి అతడు తన దగ్గరుండే పరిచారకుణ్ణి పంపించాడు కూడా. కాని అతడి ప్రియురాలు పేరు అక్కడి జాబితాల్లో కనిపించలేదు.

అతడికి పట్టలేని ఉక్రోషం కలిగింది. ఆ రోషాన్ని అతడు దాచుకోలేదు. దాన్ని ఎక్కడిపడితే అక్కడ వెళ్ళగక్కుతూనే వున్నాడు. తనకు కలిగిన అసంతోషానికి చివరికి తన శత్రువుల్ని కూడా వదిలిపెట్టలేదు. ఆమె కనిపించకుండాపోడానికి రోవెన్ పట్టణాన్ని ఆక్రమించుకున్న ప్రష్యన్లే కారణమని భావిస్తూ 'వచ్చే యుద్ధంలో వాళ్ళు తప్పకుండా మట్టికరుస్తారు, ఆ అడుక్కుతినేవాళ్ళు' అని శాపనార్థాలు పెడుతుండేవాడు.

ఇలా ఉండగా, ఒక రోజు పొద్దున్నే, అతడు అల్పాహారసమయంలో భోజనాల మందిరంలో అడుగుపెట్టినప్పుడు ఒక ముసలి పనివాడు అతడిదగ్గరికొచ్చి ఒక ఉత్తరం అందించాడు. అతడు దాన్ని వెంటనే చదివాడు. అందులో ఇలా ఉంది.

'నా ప్రియాతిప్రియమైన మిత్రుడా! నేను హాస్పటల్లో ఉన్నాను. చాలా చాలా జబ్బుపడి ఉన్నాను. ఒకసారి వచ్చి నన్ను చూడవూ. నువ్వొస్తే నాకు అంతకన్నా సంతోషం మరొకటి ఉండదు.

ఇర్మా.'

అది చదవగానే కెప్టెన్ ముఖం పాలిపోయింది. పట్టలేని జాలితో కరిగిపోయాడు. 'అయ్యో! దారుణం! పాపం పసిది! ఇదుగో ఈ అల్పాహారం ముగించుకుని క్షణంలో అక్కడికొస్తాను' అని అన్నాడు.

అల్పాహారం ఆరగిస్తున్నంతసేపూ అతడు తన తోటి అధికారులతో, ఇర్మా ఆసుపత్రిలో ఉందనీ, తాను ఆ ఉదయం ఆమెని కలుసుకోబోతున్నాననీ చెప్తూనే ఉన్నాడు. అదంతా దుర్మార్గులయిన ఆ ప్రష్యన్ల పని అయి ఉంటుంది. ఆమె చేతిలో చిల్లిగవ్వ లేకుండా చెప్పలేనంత దైన్యంలో ఒక్కర్తీ పడి ఉంటుంది. ఆ ప్రష్యన్లు ఆమె సామగ్రి మొత్తం కాజేసి ఉంటారు.

'ఓహ్! ఆ చెత్త వెధవలు!'

అతడి మాటల్ని ప్రతి ఒక్కరూ ఆసక్తిగా వింటున్నారు. అల్పాహారం ముగించి తన చేతులు ఇలా తుడుచుకున్నాడో లేదో వెంటనే తన కృపాణం చేతుల్లోకి తీసుకుని, తన ఛాతీ ఉబ్బెత్తుగా బిగుసుకుంటూ ఉండగా, తన నడుము బెల్టు బిగించుకుని హుటాహుటిన పట్టణాసుపత్రికి బయల్దేరాడు.

కాని అత్యవసరంగా అడుగుపెట్టవలసిన ఆ ఆసుపత్రిదగ్గర అతణ్ణి లోపలకి అడుగుపెట్టనివ్వకుండా ఆపేసారు. అతడు తన కన్నీలుని వెతికిపట్టుకుని అతడికి తన సంగతి మొత్తం వివరించి ఆ ఆసుపత్రి సంచాలకుడికి తనగురించి ఒక మాట చెప్పవలసిందిగా కోరుకున్నాడు.

ఆ పెద్దమనిషి ఆ సుందరసైనికాధికారిని కొంతసేపు తన కార్యాలయంలో వేచి ఉండేట్టు చేసాక, అప్పుడు చాలా ఉదాసీనభావంతో కూడిన పలకరింపుతో, ఎట్టకేలకు, ఆసుపత్రిలోకి ప్రవేశించడానికి అవసరమైన అనుమతి పత్రం మంజూరు చేసాడు.

ఒకసారి ఆసుపత్రిలోకి అడుగుపెట్టాక ఆ చికిత్సాలయంలో కనవస్తున్న దైన్యం, వేదన, మృత్యుసన్నిధి అతడికి ఊపిరాడకుండా చేసాయి. ఒక కుర్రవాడు అతడికి దారి చూపిస్తూ ఉన్నాడు. తన నడక ఎక్కడ చప్పుడు చేస్తుందో అన్నట్టు బొటనవేళ్ళమీద నడుస్తున్నట్టుగా, అతడు నెమ్మదిగా ఆ కారిడార్ల గుండా, అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళాడు. అక్కడంతా అనారోగ్యం తాలూకు, మందుల తాలూకు తేమగాలితో కూడిన కంపు. ఎవరివో లోగొంతుకలో నడుస్తున్న మాటలు తప్ప ఆ ఆసుపత్రి మొత్తం నిశ్శబ్దం రాజ్యమేలుతూ ఉంది.

మధ్యమధ్యలో ఏదన్నా తెరిచి ఉన్న తలుపు గుండా కెప్టెన్‌కి ఏదో ఒక డార్మిటరీ కనిపించేది. అందులో వరస మంచాల మీద పడుకున్న రోగులదేహాలవల్ల ఆ పడకలమీద వస్త్రాలు ఎత్తుగా పరిచినట్టు కనిపిస్తున్నాయి.

కొందరు రోగులు తమ పడకల దగ్గర కుర్చీల్లో కూచుని ఏదో ఒకటి కుట్టుకుంటూ కనిపిస్తున్నారు. వారంతా ఒకేలాంటి బూడిదరంగు దుస్తుల్లో నెత్తిన తెల్లని టోపీలతో కనిపిస్తున్నారు.

అతడికి దారిచూపిస్తున్న కుర్రవాడు రోగులతో కిక్కిరిసిన ఒక నడవా దగ్గర హటాత్తుగా ఆగాడు. అక్కడ తలుపు మీద 'సిఫిలిస్' అని రాసి ఉన్న అక్షరాలు కెప్టెన్ చూశాడు.

అతడు ఉలిక్కిపడ్డాడు. అతడి ముఖం ఎర్రబడింది. అక్కడ తలుపు పక్క చిన్న చెక్కబల్ల దగ్గర ఒక సహాయకురాలు మందు కలుపుతూ ఉన్నది.

ఆమె అతడితో 'రండి, ఆమెది బెడ్ నంబరు 29' అని అన్నది.

ఆమె ఆ సైనికాధికారికన్నా ముందు నడుస్తూ 'అదిగో, అదే' అని అక్కడొక పడక వైపు చూపించింది.

ఆ పడకమీద దుప్పట్లమూట తప్ప మరేమీ ఉన్నట్టు కనిపించలేదు. చివరికి ఆమె తలకూడా ఆ దుప్పటిలో ముడుచుకుపోయినట్టుంది. ఎటుచూసినా ఎన్నో రోగశయ్యల మీద ఎన్నో ముఖాలు, పాలిపోయిన ముఖాలు, తమ మధ్యకి ఒక సైనికాధికారి రావడం చూసి నిర్ఘాంతపోతున్న స్త్రీల ముఖాలు, యువతుల, వృద్ధురాళ్ళ ముఖాలు, కాని అన్ని ముఖాలూ అక్కడి వాతావరణానికి తగ్గట్టుగానే పాలిపోయి కనిపిస్తున్నాయి.

ఆపాదమస్తకం చలించిపోతూ, ఒకచేత్తో కరవాలం సర్దుకుంటూ, మరొకచేతిలో తన టోపీతో, కెప్టెన్ నెమ్మదిగా గొణుకున్నాడు:

'ఇర్మా'

ఆ పడకమీద అకస్మాత్తుగా ఒక కదలిక కనిపించింది. నెమ్మదిగా అతడి ప్రియురాలి వదనం దర్శనమిచ్చింది. కానీ ఆ ముఖం ఎంతగా మారిపోయి ఉందంటే, ఎంతగా వడిలిపోయి ఉందంటే, ఎంతగా కుంగిపోయి ఉందంటే, అతడు ఆ ముఖాన్ని దాదాపుగా పోల్చుకోలేకపోయాడు.

పట్టలేని భావోద్వేగంతో ఆమె ఊపిరి ఎగబీలుస్తూ 'ఆల్బర్ట్!–ఆల్బర్ట్! నువ్వేనా! ఓహ్! నాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను! చాలా సంతోషంగా ఉంది' అంది. కన్నీళ్ళు ఆమె చెంపలమీంచి ప్రవహించాయి.

ఆసుపత్రి సహాయకురాలు ఒక కుర్చీ తీసుకొచ్చి వేసి 'కూర్చోండి సార్' అని అన్నది.

అతడు కూర్చుని తన ఎదట ఉన్న కళాకాంతిలేని ఆ దీనవదనాన్ని పరికించి చూసాడు. తాను ఆమెని వదిలిపెట్టి వెళ్ళినప్పటి ఆ తరుణయవ్వనికీ ఈమెకీ పోలికనే లేదు. చివరికి అతడు గొంతు పెగుల్చుకుని 'ఏమైంది నీకు?' అని అడిగాడు.

ఆమె ఏడుస్తూ 'నీకు మొత్తం తెలుసు నాకేమైందో, అదిగో, ఆ తలుపు మీద రాసి ఉంది కదా' అని ఆ మంచం మీద పరిచిన దుప్పటి అంచుతో తన నేత్రాల్ని కప్పుకుంది.

నిస్పృహతోనూ, కించపాటుతోనూ అతడు 'నా చిన్నారీ, ఇది నీకెలా తగులు కుంది?' అనడిగాడు.

'అదుగో, ఆ ప్రష్యను మృగాలవల్ల. వాళ్ళు నన్ను నిర్బంధంగా ఎత్తుకుపోయి మరీ నా శరీరాన్ని విషపూరితం చేసేసారు' అందామె.

ఇంక ఆ మాటల్నెలా కొనసాగించాలో అతడికి తెలియళేదు. అతడు ఆమె కేసి చూస్తూ తన చేతుల్లో టోపీని అటూ ఇటూ మెలితిప్పుతూ ఉన్నాడు.

తక్కిన రోగులు అతణ్ణి చూస్తూ ఉన్నారు. రోగంతో చివికిపోతూ, కుళ్ళిపోతున్న దేహాల దుర్గంధం అతడికి తెలుస్తూ ఉంది. అత్యంత హేయప్రదమైన, దారుణమైన రోగానికి చిక్కి విలవిల్లాడుతున్న యువతులతో ఆ నడవా మొత్తం నిండిపోయి ఉంది.

'నేను మళ్ళీ బాగవుతానన్న ఆశ లేదు నాకు. పరిస్థితి మరీ విషమించిందనే వైద్యులు చెప్తున్నారు' అని గొణుక్కుంది ఆమె.

అప్పుడామె ఆ సైనికాధికారి దుస్తులమీద శౌర్యపతకం చూసి 'ఓహ్! నీకు సన్మానం లభించిందన్నమాట! ఇప్పుడు నాకు తృప్తిగా ఉంది. నాకెంత తృప్తిగా ఉందో చెప్పలేను! ఇప్పుడు నేను నిన్నోసారి కావిలించుకోగలిగితే ఎంతబాగుణ్ణు' అని అన్నది.

ఆ మాటలు వినగానే ఆమె తనని నిజంగానే కావిలించుకుని ముద్దుపెట్టుకో-బోతుందేమో అన్న ఊహకి ఆ కెప్టెన్ దేహమంతటా భయంతోనూ, అసహ్యంతోనూ కూడిన ఒక ప్రకంపన చెలరేగింది. ఒక్కసారిగా అక్కణ్ణుంచి ఆరుబయటకి పారిపోయి గుండెనిండా గాలి పీల్చాలనీ, ఇక మళ్ళా జన్మలో ఆమెని చూడకూడదనీ అనిపించింది. కాని ఎలా సెలవు తీసుకోవాలో తెలియక, అతడక్కడే, కొంతసేపు నిలబడి చివరికి 'నీ సంగతి నువ్వు సరిగ్గా చూసుకోలేదన్నమాట' అని నెమ్మదిగా గొణుక్కున్నాడు.

ఇర్మా కళ్ళల్లో ఒక జ్వాల భగ్గుమంది. 'లేదు. నేను వాళ్ళనుంచి బయటపడవలసిన సమయం వచ్చినప్పుడు నాలో ఒక ప్రతీకారేచ్ఛ రగులుకుంది. నేను వాళ్ళని కూడా విషపూరితం చేసేసాను. ఎంతమందిని వీలైతే, అంతమందిని. రోవెన్ పట్టణంలో వాళ్ళెంతమంది ఉంటే అంతమందినీ విషపూరితం చేసేశాను. అప్పుడు నాకు నా గురించిన ఆలోచన ఏ కోశానా లేదు.'

ఆ మాటలు వింటూనే 'అయితే, చెప్పుకోదగ్గ పనే చేసావన్నమాట!'అని అన్నాడు. ఆ స్వరంలో ఒకింత ధీరతా, రాజసం తొణికాడాయి.

ఆ మాటలకు ఆమె నిలువెల్లా కదిలిపోతూ, కపోలాలు ఎర్రబడుతుండగా 'అవును, నా వల్ల ఒక్కడు కాదు, చాలామందే చచ్చిపోయారు. నా ప్రతీకారం తీర్చుకోగలిగానని ఖాయంగా చెప్పగలను' అని అన్నది.

'మరీ మంచిది' అని అన్నాడతడు. అప్పుడు లేచి 'సరే, ఇప్పటికైతే సెలవు తీసుకోక తప్పదు. ఇప్పుడు మా కల్నల్ని కలుసుకోవలసిన పని ఉంది–' అని అన్నాడు.

ఆమె వివశురాలై, 'అప్పుడేనా! అప్పుడే వెళ్ళిపోతావా ! నువ్వు వచ్చిందిప్పుడే కదా, అప్పుడే వెళ్ళిపోతున్నావా' అని ఏడవడం మొదలుపెట్టింది.

కాని అతడు ఎలాగైనా వెళ్ళిపోడానికే సిద్ధపడి, 'చూడు, నువ్వు రమ్మనగానే వచ్చానా లేదా, కల్నలు చెప్పిన సమయానికి ఆయన్ని కలుసుకోక తప్పదు కదా' అని అన్నాడు.

'ఇంకా ఆ కల్నలేనా? కల్నల్ ఫ్రూన్?' అని అడిగిందామె.

'అవును కల్నల్ ఫ్రూన్. యుద్ధంలో రెండుసార్లు గాయపడ్డాడు ఆయన.'

'మరి నీతోటి సైనికాధికారుల మాటేమిటి? వాళ్ళల్లో ఎవరేనా యుద్ధంలో మరణించారా?'

అవును. సేంట్–టిమోన్, సవగ్నాట్, పోలీ, సాప్రివాల్, రాబర్ట్, డి కర్సన్, పసఫిల్, సంతల్, కారవాన్, పోయిప్రిన్ – వాళ్ళంతా యుద్ధంలో మరణించారు. సాహెల్ ఒక చేయి పోగొట్టుకున్నాడు. కోర్వోయిసన్‌కి ఒక కాలు తీసేసారు. పాకెట్‌కి కుడికన్ను పోయింది.'

ఆమె ఆసక్తిగా ఆ మాటలు వింది. అప్పుడు ఉన్నట్టుండి–

'నన్నొక్కసారి ముద్దుపెట్టుకోవూ! వెళ్ళిపోయేముందు ఒక్కసారి ముద్దిచ్చిపోవూ! మేడం లాంగ్లోయిస్ ఇప్పుడిక్కడ లేదు' అని తడబడుతూ అడిగింది.

అపారమైన ఏహ్యత తనని ముంచెత్తుతున్నప్పటికీ, అతడు తన అధరాల్ని, వడిలి–పోతున్న ఆమె నుదుటికి ఆనించాడు. ఆమె తన బాహువుల్తో అతణ్ణి చుట్టి అతడి నీలంరంగు కోటుమీద ఎడాపెడా ముద్దులు వర్షించింది.

అప్పుడు 'నువ్వు మళ్ళీ వస్తావు కదూ. మళ్ళీ వస్తానని చెప్పు. తప్పకుండా వస్తానని మాటివ్వు' అని అన్నది.

'తప్పకుండా. మాటిస్తున్నాను.'

'ఎప్పుడు? ఇప్పుడే చెప్పు. గురువారం వస్తావా?'

'తప్పకుండా. గురువారం–'

'గురువారం రెండింటికి?'

'తప్పకుండా. గురువారం రెండింటికి.'

'ఒట్టు?'

'ఒట్టు.'

'సరే, ప్రియా, సెలవు.'

'సెలవు.'

ఆ డార్మిటరీలో తనని చుట్టుముడుతున్న చూపులకి తత్తరపాటు చెందుతూ, తన స్ఫురద్రూపం మరింత ముడుచుకుని కనిపించేటందుకా అన్నట్టుగా ముందుకు వంగి నడుచుకుంటూ అతడు బయటకి వెళ్ళిపోయాడు. వీథిలో అడుగుపెట్టగానే గుండెనిండా గట్టిగా గాలి పీల్చుకున్నాడు.

ఆ సాయంకాలం అతని సహోద్యోగులు అతణ్ణి 'ఇర్మా ఎలా ఉంది?' అని అడిగారు.

అతడు అదిమిపెట్టుకున్న ఉద్వేగంతో జవాబిచ్చాడు: 'ఆమె ఊపిరితిత్తుల్లో సమస్యగా ఉంది. బాగా జబ్బు చేసింది.'

కాని ఒక చిన్న సైనికాధికారి, అతడు మాట్లాడుతున్న పద్ధతిని బట్టి ఏదో గమనించినవాడిలాగా, కేంద్రకార్యాలయానికి వెళ్ళాడు. ఆ మర్నాడు కెప్టెన్ భోజన మందిరంలోకి వెళ్ళేటప్పటికి నవ్వులూ, పరిహాసోక్తులూ అతణ్ణి ఉప్పెనలాగా ముంచెత్తాయి. ఎలాగైతేనేం, చివరికి, అతడి మీద ప్రతీకారం తీర్చుకోడానికి వాళ్ళకి అవకాశం దొరికింది.

ఆ తర్వాత నెమ్మదిగా తెలిసిందేమంటే, ఎవరిమీదనో కక్ష తీర్చుకోడానికా అన్నట్టు ఇర్మా ఒక ప్రష్యను అధికారిని పెండ్లి కూడా చేసుకుందనీ, నీలి హుస్సార్ల దళానికి చెందిన ఒక అధికారితో గుర్రం మీద గ్రామసీమల్లో తిరుగుతూ కనిపించిందనీ, అలాగే చాలామందితో తిరిగిందనీ, రోవెన్‌లో చివరికి ఆమెని 'ప్రష్యన్ల భార్య' గా తప్ప మరోలా పిలిచేవారు కాదనీ.

దాదాపు ఎనిమిదిరోజులపాటు కెప్టెన్ తన దళం చేతుల్లో బాధితుడిగా గడిపాడు. భూతభవిష్యత్తుల గురించి చెప్పగలరనే వాళ్ళ నుంచి పోస్టుద్వారానో, దూతలద్వారానో అతడికి ఏవేవో సలహాలు అందుతూనే ఉన్నాయి. వాటితో పాటు మందులు కూడా. ఆ మందులు దేనికి వాడాలో కూడా వాటి పెట్టెలమీద స్పష్టంగా రాసి ఉండేది.

అప్పుడు వీస్తున్న గాలి ఏమిటో గుర్తుపట్టి కల్నల్ కూడా 'మంచిది, కెప్టెన్‌కి చెప్పుకోదగ్గ స్నేహమే దొరికింది. అతడికి నా శుభాకాంక్షలు' అని కటువాక్యాలు పలక్కుండా ఉండలేకపోయాడు.

పన్నెండు రోజులు పూర్తయ్యేటప్పటికి కెప్టెన్‌కి ఇర్మానుంచి మరొక విన్నపం చేర వచ్చింది. కానీ అతడు దాన్ని కోపంతో చింపేసి జవాబివ్వకుండా ఉండిపోయాడు.

మరొక వారం గడిచాక మళ్ళా ఆమె అతడికి ఉత్తరం రాసింది. తన ఆరోగ్యం మరింత క్షీణించిందనీ, తనని వచ్చి చూసి కడపడి వీడ్కోలు తీసుకొమ్మనీ.

అతడు జవాబివ్వలేదు.

కొన్ని రోజుల తర్వాత అతడికి ఆసుపత్రి పురోహితుడినుంచి ఒక వర్తమానం అందింది.

'ఇర్మా పావోలిన్ అనే యువతి మృత్యుశయ్యమీద ఉంది. మిమ్మల్ని వచ్చి చూడమని వేడుకుంటోంది' అని.

మతాధికారినుంచి వచ్చిన ఆ వర్తమానాన్ని కెప్టెన్ తృణీకరించలేకపోయాడు. కాని అతడి హృదయంలో ఒక పాపిష్ఠికోపం సుళ్ళుతిరుగూనే ఉంది. గాయపడ్డ స్వాతిశయంతోనూ, అవమానభారంతోనూ అతడు ఆ ఆసుపత్రిలో అడుగుపెట్టాడు.

కాని ఆమె ఇంతకు ముందు చూసినప్పటిలానే ఉంది. పెద్దగా మార్పేమీ కనిపించ లేదు. ఆమె తనని మోసపుచ్చిందని అనుకుంటూ 'ఏం కావాలి నీకు?' అనడిగాడు.

'నువ్వు నాకు కడపటి వీడ్కోలు చెప్పాలని కోరుకుంటున్నాను. నా అంత్యక్షణాలు దగ్గరగా పడ్డట్టుగా తోస్తున్నది' అని అందామె.

కాని అతడు ఆ మాటలు నమ్మలేదు.

'చూడు. నువ్వు నన్ను నా సైనికదళం ముందు నవ్వులపాలుచేసావు. ఈ వ్యవహారం నేనింక పొడిగించదలుచుకోలేదు' అని అన్నాడు.

'నేనేం చేసాను?' అనడిగిందామె.

ఆమెకేమి జవాబివ్వాలో తెలీక అతడికి చికాగ్గా అనిపించింది. కాని 'నేనిక్కడికి తిరిగి వచ్చింది నీ వల్ల నలుగురిలోనూ నవ్వులపాలవడానికేనా?' అనడిగాడు.

ఆమె అతడికేసి చూసింది. ఆ కళ్ళల్లో అలసట కనబడింది. పలచని కోపం తన నేత్రాల్లో మెరుస్తుండగా ఆమె 'నేనేం చేసాను? బహుశా నేను నీతో మరింత పెద్దమనిషి తరహాలో ప్రవర్తించి ఉండవలసిందేమో! నీనుంచి కొన్నిసార్లు ఏదో ఒకటి ఆశించడమేనా నేను చేసిన తప్పు? నీ కోసమే కాకపోతే, నేను ఎం.టెంప్లియర్-పాపోన్ దగ్గరే ఉండి పోయేదాన్ని, ఇప్పుడీ పరిస్థితికి వచ్చి ఉండేదాన్నే కాను. కాని చూడు, నన్నీ పరిస్థితికి ఎవరేనా తప్పు పట్టొచ్చేమోగాని నువ్వు మాత్రం కాదు' అని అన్నది.

'నేను నిన్ను తప్పుపట్టడం లేదు. అలాగని నిన్ను చూడటానికి ఇక్కడకి వస్తూండటం కూడా నాకు సాధ్యం కాదు. ఎందుకంటే ప్రషన్లతో నువ్వు తిరిగిన తీరు మొత్తం పట్టణానికే తలవంపులు తెచ్చింది' అని అన్నాడతడు. అతడి కంఠస్వరం స్పష్టంగా ఉంది.

ఆమె నెమ్మదిగా లేచి మంచం మీద కూచుంది. ఒకింత వణుకుతూనే ఇలా జవాబిచ్చింది:

'ప్రష్యన్లతో నేను తిరిగిన తీరా? వాళ్ళు నన్ను తీసుకుపోయారని నీకెప్పుడు చెప్పాను? నీకు వాళ్ళ గురించి చెప్పానంటే, అది నేను వాళ్ళని విషపూరితం చేసానని చెప్పడానికీ, అలా చేసే క్రమంలో నన్ను నేను ఇసుమంత కూడా పట్టించుకోలేదని చెప్పడానికీను. చికిత్స చేయించుకుని బాగవ్వాలనుకుంటే అదెంత పని నాకు ? కాని వాళ్ళని చంపెయ్యాలనుకున్నాను. అనుకున్నట్టే చంపేసాను. తెలుస్తోందా! వాళ్ళని చంపేసాను!'

కానీ అతడలా నిలబడే 'ఏమైనా కానీ, అదంతా చాలా సిగ్గుచేటుగా ఉంది' అని అన్నాడు.

ఆమెకి ఊపిరాడనట్టయింది. నెమ్మదిగా తేరుకుని ఇలా అంది:

'వాళ్ళు చావడానికి కారణమవడంలోనూ, వాళ్ళని నిర్మూలించడంలోనూ నేను చేసినదానిలో అంత సిగ్గుచేటు పని ఏముంది చెప్పు? జియన్నీ-డి-ఆర్ వీథిలో నువ్వు మా ఇంటికొస్తున్నప్పుడు ఇలా మాట్లాడేవాడివి కావు. ఆహ్! ఎంత సిగ్గుచేటు! అత్యున్నత సైనిక పురస్కారం పొందిన నువ్వు కూడా నాకులాగా ప్రతీకారం తీర్చుకుని ఉండలేదని చెప్పగలను. నిజానికి నీకు లభించినదానికన్నా గొప్ప గౌరవం దొరకాలి నాకు. అర్థమవుతోందా? నీకన్నా మించిన సత్కారం. ఎందుకంటే, నీకన్నా ఎక్కువమంది ప్రష్యన్లని చంపాన్నేను!'

అతడు పట్టలేని ఉక్రోషంతో ఆమెముందు కొయ్యబారిపోయి నిల్చుండిపోయాడు. 'అయినా, కాని- నువ్వు- కాని- కాని అదుగో అలాంటి సంగతుల వల్ల- సమ్మతం కాదు-ఎవరేనా ఈ ప్రసక్తి తేడానికి-' అంటూ గొణుక్కున్నాడు.

కాని ఆమె అతడి మాటలు వినడం లేదు. ఆమె చెప్తూనే ఉంది. 'నువ్వు ప్రష్యన్లని ఏమి చెయ్యగలిగావు? వాళ్ళని రోవెన్ పట్టణానికి రాకుండా నువ్వు నిరోధించి ఉండి ఉంటే ఇదంతా జరిగి ఉండేదా? ఇంక మాట్లాడకు. నీకన్నా ఎక్కువగా ప్రష్యన్లని నేను తుదముట్టించాను. నీకన్నా మిన్నగా వాళ్ళని నిర్మూలించగలిగాను. అలా చేసినందుకు ఇక్కడ నేను మరణించబోతుంటే, నువ్వు మాత్రం పాటలు పాడుకుంటూ, మళ్ళా ఆడవాళ్ళని మోసగించడానికి తగుదునమ్మా అని సిద్ధపడుతున్నావు-'

అక్కడ ప్రతి ఒక్క పడకమీదనుంచీ ఏదో ఒక తల పైకెత్తి వాళ్ళనే చూస్తూ ఉంది. అక్కడి కళ్ళన్నీ, సైనికదుస్తుల్లో ఉన్న, అతణ్ణేచూస్తున్నాయి. అతడు మళ్ళా తడబడుతున్న మాటలతో :

'కాని నువ్వు- మౌనంగా- చూడు- నువ్వు-' అని అంటున్నాడు.

కాని ఆమె మౌనం వహించలేదు. గొంతెత్తి అరిచింది:

'ఆహ్! అవును, నువ్వొక మొనగాడివి! నీ గురించి నాకు బాగా తెలుసు. మళ్ళా చెప్తున్నాను విను. ప్రష్యన్లమీద నీకన్నా నేనెక్కువ ప్రతీకారం తీర్చుకోగలిగాను. వాళ్ళకి నేనే ఎక్కువ హాని కలిగించాను. నీ మొత్తం ఆశ్వికదళమంతా కలిసి కూడా మట్టుపెట్ట-లేనంతమందిని నేనొక్కర్తినే మట్టికరిపించాను. తెలుస్తోందా? పిరికిపందా!'

అతడు అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. అంతకన్నా కూడా పారిపోయాడని చెప్పడం సముచితంగా ఉంటుంది. తమ సంభాషణ వింటూ సంచలిస్తున్న ఆ రోగగ్రస్తుల రెండేసి వరసల ఆ పడకల మధ్యనుంచి అతడు తన పొడవాటి కాళ్ళు ఈడుస్తూ అక్కణ్ణుంచి పారిపోయాడు. అతడి వెనకనే, ఊపిరి ఎగబీలుస్తూ, ఊపిరాడకుండా పోతున్న గొంతుతో ఇర్మా అరుస్తున్న అరుపులు వినిపిస్తున్నాయి:

'నీకన్నా కూడా-నిన్ను మించి-అవును నేనే ఎక్కువమందిని చంపాను-'

నాలుగేసి మెట్లచొప్పున గెంతుకుంటూ అతడు వడివడిగా ఆ గదినుంచి బయటపడి తన ఇంటికి పరుగుపరుగున చేరుకుని తన గదిలో అడుగుపెట్టి తలుపులు బిగించేసు-కున్నాడు.

ఆ మర్నాడే ఆమె మరణించిందని అతడికి వార్త చేరింది.

◆

‘నీకు తినాలని లేకపోతే తినకు’ అంది డల్సి.

20

అత్యంత ప్రాచీన కాలంలో ఎన్నో రూపాల్లో తలెత్తిన కథ కాంస్యయుగం నాటికి పురాణాల రూపంలో, ఇతిహాసాల రూపంలో వికసించింది. మధ్యయుగాల నాటికి అది framed narrative గా మారి తూర్పుదేశాలనుంచి మధ్యాసియా మీదుగా ఆధునికయుగంలో అమెరికాలో, యూరోపులో అడుగుపెట్టింది. పద్ధెనిమిదో శతాబ్ది చివరిభాగంలో, పందొమ్మిదోశతాబ్ది మొదటి భాగంలో, అమెరికాలో, వాషింగ్టన్ ఇర్వింగ్ (1783-1859), నథానియల్ హాథార్న్ (1804-64) తూర్పుదేశాల మౌఖిక కథనరీతిని, జొహాన్ గాట్‌ఫ్రెడ్ హెర్డరు (1744-1803) సేకరించిన జర్మన్ జానపదకథల్తో మేళవించి tale అనే ఒక సరికొత్త ప్రక్రియకు అంకురార్పణ చేసారు.

ఆ tale ని, అంటే కథని, ఎడ్గార్ అలన్ పో (1809-1849) shortstory గా అంటే, చిన్నకథగా, మార్చాడు. 'ఏం జరిగిందో' చెప్పడం మీద కథ దృష్టిపెడితే, అది 'ఎలా జరిగిందో' చిన్న కథ చెప్తుంది. కాని అందుకోసం అది ఆ సంఘటనల్ని మరింత వివరించదు. దానికి బదులు, ఆ సంఘటన లేదా సంఘటనలు పాత్రల మీద ఎటువంటి ప్రభావాన్ని చూపించాయో దాన్ని వివరిస్తుంది. అలా చెప్పడంలోచిన్నకథ unity of effect మీద దృష్టి పెడుతుంది. ఒక సంఘటన లేదా సంఘటన క్రమం అందులోని పాత్రల మీద చూపించే ఆ singlemost effect ని పాఠకుడు కూడా అనుభవించేట్టు

చెయ్యడం చిన్నకథలోని శిల్పరహస్యం. అలా ఆ ప్రభావం తనకి కూడా అనుభవం అవుతున్నప్పుడు పాఠకుడు పొందే అద్వితీయ అనుభూతి, దాదాపు ఆధ్యాత్మిక సంతోషం లాంటిదని భావిస్తూ, తర్వాతి రోజుల్లో జాయిస్ దాన్ని epiphany అని అన్నాడు.

స్థూలంగా, కథ చిన్నకథగా పరిణామం చెందిన, కథ ఇది. కథని చిన్నకథగా మార్చిన ఎడ్గార్ అలన్ పో దారినే నడుస్తూ, చిన్న కథని ఆధునిక కథగా మార్చి, దానికి జవసత్త్వాలిచ్చిన మహా కథకులు పందొమ్మిదో శతాబ్దంలో చాలామందే ఉన్నారు గాని, వారందరిలోనూ, ముగ్గురు ధ్రువ తారలుగా నిలబడిపోయారు.

ఒకరు ఫ్రాన్సుకి చెందిన మపాసా (1850-93), రెండవవారు రష్యాకి చెందిన చెకోవ్ (1860-1904), మూడవవారు అమెరికాకి చెందిన ఓ హెన్రీ (1862-1910). నన్ను వెన్నాడే కథల్లో మపాసా, చెకోవ్ కథల్ని ఇంతకుముందు పరిచయం చేసాను. ఇప్పుడు ఓ హెన్రీని పరిచయం చేయబోతున్నాను.



ఓ హెన్రీ అనే కలం పేరుతో రచనలు చేసిన విలియం సిడ్నీ పోర్టరు మనందరికీ దాదాపుగా హైస్కూలు రోజుల్లోనే పరిచయమై ఉంటాడు. ఇంగ్లిషు నాన్ డిటెయిల్డు రీడింగులో భాగంగా, The Gift of the Magi (1905), The Last Leaf (1907) లాంటి కథల్ని మనం చిన్నప్పుడే చదివి ఉంటాం. అదీకాక, ఇరవయ్యవ శతాబ్దం పొడుగునా, ప్రతి భాషలోనూ, ఎవరో ఒకరు

ఓ హెన్రీ కథల్లోని ఇతివృత్తాల్ని తీసుకుని తాము సొంతంగా కథలు రాస్తూనే ఉన్నారు, చివరకి సినిమాలు కూడా తీస్తూనే ఉన్నారు. After Twenty Years (1906) కథనే తీసుకుంటే, కథకులు, ఓ హెన్రీ పేరు చెప్పకుండా, ఎన్ని రకాలుగా మళ్ళీ మళ్ళీ రాసి ఉంటారో చెప్పలేం. ఆ కథ మూలకథ అని చెప్పకుండా ఎన్ని సినిమాలు తీసి ఉంటారో కూడా చెప్పలేం. ఉదాహరణకి, తెలుగులో వచ్చిన 'మంచిమిత్రులు' (1969) సినిమా. దానికి ఒక తమిళ సినిమా మాతృక అట! ఈ తెలుగు సినిమానే తిరిగి మళ్ళా మలయాళం, హిందీ భాషల్లో కూడా తీసారు.



తెలుగు పాఠకులకి కూడా ఓ హెన్రీ చిర-పరిచితుడు. ఆయన కథలు ఎంతమంది ఎన్ని సార్లు అనువాదం చేసి ఉంటారంటే, అనువాద కథలు ప్రచురించడం కోసమే కొన్నాళ్ళపాటు నడిచిన ఒక పత్రిక, తమకి ఓ హెన్రీ కథల అనువాదాలు మాత్రం పంపొద్దని రచయితలకి విజ్ఞప్తి చేసిందట!

కానీ, కథకుడిగా ఓ హెన్రీ సామాజిక దృక్పథాన్ని గాని, లేదా ఆయన కథనశిల్పాన్ని గాని వివరిస్తూ ఇప్పటిదాకా తెలుగులో ఒక్క సమగ్ర వ్యాసం కూడా నాకంట పడలేదు. మంచి రచయితల్ని తెలుగువారు పట్టుకుంటారు, పైకెత్తుతారుగాని, వారినెందుకు మంచి రచయితలుగా భావిస్తారో ఎప్పటికీ సరిగ్గా చెప్పుకోలేరు. ఓ హెన్రీ విషయమే తీసుకోండి. ఆయన పేరు చెప్పగానే ప్రతి ఒక్కరూ, 'కొసమెరుపు' గురించి

మాట్లాడతారు. అంటే కథ ముగించేటప్పుడు, రచయిత, అంతదాకా తాను చెప్తూ వచ్చిన కథలో మనం ఊహించని ఒక చిన్న మెలిక లేదా మలుపు చూపించి పాఠకుణ్ణి నివ్వెరపరుస్తాడు. ఇది ఓ హెన్రీకే ప్రత్యేకమైన ఒక శిల్పవిశేషం. కానీ ఓ హెన్రీ అద్వితీయత దీనిమీద మాత్రమే ఆధారపడిలేదు.

ఒక శతాబ్దం గడిచిపోయేక, ఇప్పుడు ఓ హెన్రీ కథలు చదువుతుంటే, అతడిలోని సామాజిక విమర్శకుడు చాలా ప్రస్ఫుటంగా దర్శనమిస్తున్నాడు. ముఖ్యంగా, న్యూయార్కు నగరజీవితం మీద, అతడు రాసిన కథలు. ఇరవయ్యవ శతాబ్దపు తొలిరోజుల్లో విస్తరిస్తున్న ఒక మహానగరపు రథచక్రాల కింద నలిగిపోతున్న అధోజగత్సహోదరుల యథార్థగాథల్ని అతడు ఎంతో ప్రతిభావంతంగా చిత్రించాడు. ఒక మహానగరజీవితాన్ని దాని విస్తృతపార్శ్వాలనుంచి ఇంత కథనకౌశల్యంతో పట్టుకున్న కథకుడు మనకి మరొకరు కనిపించరు.

తన కాలంనాటి న్యూయార్కులో నలభైలక్షలమంది జీవిస్తుంటే, అందులో సౌకర్యవంతంగా జీవిస్తున్న నాలుగువందలమంది గురించి మాత్రమే రాయడం సాహిత్యం కర్తవ్యం కాదనీ, చూడగలిగితే, రాయగలిగితే, నలభైలక్షలమందికీ, ప్రతి ఒక్కరికీ చెప్పుకోడానికి ఒక కథ ఉందన్నాడు. అతడు న్యూయార్కులో గడిపింది తన జీవితంలోని చివరి ఎనిమిది సంవత్సరాలే (1902-10) అయినప్పటికీ, మరే రచయితా చూడలేని విధంగా న్యూయార్కును దర్శించాడు. చిత్రించాడు. ఈ విషయంలో ఒక్క వాల్ట్ విట్మన్‌ని మాత్రమే మనం అతనితో పోల్చగలం. కానీ విట్మన్ కవి.

నేను రాజమండ్రి వదిలిపెట్టాక, పార్వతీపురంలో కొత్త ఉద్యోగంలో చేరినప్పుడు, ఓ హెన్రీ కథలు సాకల్యంగా చదవడం మొదలుపెట్టినప్పుడు, ఈ Unfinished Story నన్ను చాలా ఆశ్చర్యపరిచింది. 1905 లో, ఓ హెన్రీ ఈ కథ రాస్తున్నప్పుడు, రష్యాలో టాల్‌స్టాయి నీతికథలు రాస్తూన్నాడు. కానీ నీతికథ రాసినా కూడా దాన్ని ఆధునికకథగా ఎలా రాయాలో ఓ హెన్రీ ఈ కథ రాసి చూపించాడు. వందేళ్ళకు పైగా గడిచింది. ఇప్పుడు ప్రపంచమే ఒక న్యూయార్కుగా మారింది. స్విగ్గీలు, జొమాటోలు, బ్లింకిట్లు, ఆమెజానులు, ఫ్లిప్‌కార్టులు– గ్లోబు మొత్తం ఒక డిపార్టుమెంటు స్టోరుగా మారిపోయింది. కాని ఇప్పుడు లేనిదల్లా, వాటిల్లో పనిచేసే నిర్భాగుల జీవితాల్ని సాధికారికంగా చిత్రించగల, ఓ హెన్రీ లాంటి కథకుడు మాత్రమే.

ఓ హెన్రీ

పూర్తికాని కథ

వాడ్రేవు చినవీరభద్రుడు

ఎవరేనా పవిత్రభస్మాల గురించి ప్రస్తావించగానే మనం పెద్దపెట్టున ఏడుస్తూ ఆ బూడిదేమీ నెత్తిన పోసుకోం. ప్రవచనకారులు కూడా ఈ మధ్య దేవుడు రేడియం లాంటివాడనో, లేదా ఏదో ఒక సేంద్రియ పదార్థమో, లేదా ఏదో ఒక వైజ్ఞానిక మిశ్రమంలాంటివాడనో, లేదా మనలాంటి పాపిష్ఠి వాళ్ళకి అర్థమయ్యేలా చెప్పాలంటే, దేవుడు ఒక రసాయన చర్యలాంటివాడనో చెప్తున్నారు. ఇదంతా వినడానికి ఊరటగానే ఉంటుంది. అలాగని పూర్వకాలపు సనాతనులు నమ్మే పాపభీతి, దైవభీతి లాంటివి పూర్తిగా అదృశ్యమైపోయాయనీ అనడానికి లేదు.

అనవసరమైన వివాదాల్లో చిక్కుకోకుండా మనకి నచ్చినట్టు మాటాడుకోడానికి రెండు విషయాలైతే ఇంకా మిగిలి ఉన్నాయి. ఒకటి, మనకొచ్చే కలల గురించి చెప్పుకోడం. రెండోది, చిలకలు మాట్లాడగా విన్నామని చెప్పుకోడం. పురాణాల్లో వర్ణించిన మన స్వప్నాధిదేవతా, పక్షులూ కూడా సాక్ష్యానికి రమ్మంటే వచ్చేవాళ్ళు కాదు. నువ్వేం చెప్తున్నా, నీ శ్రోత నువ్వు చెప్పేదాన్ని కాదనలేదు. కాబట్టి ఏదో చిలకపలుకులు వల్లించడానికి బదులు ఇటువంటి స్వప్నవృత్తాంతం ఒకటి మీతో పంచుకోబోతున్నాను. అందుకు ముందస్తు క్షమాపణలు కూడా చెప్పుకుంటూనే అనుకోండి.

నాకో కలవచ్చింది. అది ఏదో తీర్పుకి సంబంధించిన కల. అలాగని పూర్వకాలం వాళ్ళు చెప్పే అంతిమతీర్పులాంటి కలగాదు.

కలలో గాబ్రియేలు మా మీద అభియోగాలు వినిపించాడు. వాటినుంచి తప్పించు కోలేనివాళ్ళం మాలాంటివాళ్ళం విచారణకు హాజరయ్యాం. మాకు పూచీకత్తులు ఇవ్వడానికి వచ్చినవాళ్ళు ఒకపక్క గుంపుగా నిలబడ్డారు. వాళ్ళు నల్లటి దుస్తులు ధరించి ఉన్నారు. వాళ్ళ కాలర్లకి బొత్తాలు వెనకవేపు కుట్టి ఉన్నాయి. వాళ్ళు సమర్పించ వలసిన జామీను పత్రాల్లో ఏదో సమస్య తలెత్తినట్టుంది. కాబట్టి వాళ్ళు మమ్మల్ని బయటపడేసేలా కనిపించడం లేదు.

ఇంతలో చురుకైన పోలీసొకడు- దేవదూతల్లో పోలీసన్నమాట- నా మీంచి ఎగురుకుంటూ వచ్చి నన్ను తన ఎడమరెక్కతో పట్టుకున్నాడు. ముందుముందు బాగా వృద్ధిలోకి వచ్చేట్టు కనిపిస్తున్న ఒక భూతాల గుంపు కూడా విచారణకోసం ఆ పక్కనే దగ్గరలో నిలబడి ఉన్నారు.

'నువ్వు కూడా ఈ ముఠాకి చెందినవాడివేనా?' అనడిగాడు ఆ పోలీసు.

'వాళ్ళెవరు?' అనడిగాను.

'వాళ్ళా!' అతను చెప్పబోతున్నాడు 'వాళ్ళు-'

కాని ఇదేమిటి, అసలు కథ పక్కనపెట్టేసి ఈ సొదంతా రాస్తున్నాను.

డల్సి ఒక డిపార్టుమెంటు స్టోరులో పనిచేస్తుంది. ఆ దుకాణాల్లో ఆమె హాంబర్గు లేసు వస్త్రాలో, లేదా కారం తినుబండారాలో లేదా ఆటోమొబైళ్ళో లేదా రోల్డుగోల్డు నగలో ఏవో ఒకటి అమ్ముతుంటుంది. ఆ పనికి గాను ఆమెకి వారానికి ఆరుడాలర్లు వేతనం ముడుతుంది. మిగిలిన సొమ్ము, జి-గారు చూసుకునే చిట్టాల్లో, వేరెవరి ఖాతాలోనో జమవుతూ ఉంటుంది. ఆ ఖాతాల్ని, ఒక మూలశక్తి, మీ మాటల్లో చెప్పాలంటే మతాధి-కారులు చెప్పే మూలశక్తి నిర్వహిస్తూ ఉంటుంది.

ఆ స్టోరులో చేరిన మొదటి ఏడాది డల్సికి వారానికి అయిదు డాలర్లు వేతనం దక్కేది. ఆమె ఆ జీతంతో ఎలా నెట్టుకొస్తోందో నిజంగానే తెలుసుకోవలసిన అంశం. కానీ మీకు తెలుసుకోవాలని లేదా? మంచిది. బహుశా పెద్ద పెద్ద జీతాల గురించి

మాత్రమే మీకు ఆసక్తి ఉంటుందనుకుంటాను. కాని ఆరుడాలర్లు కూడా పెద్దమొత్తమే. ఆ ఆరు డాలర్ల మీదా ఆమె ఆ వారమంతా ఎలా బతికేదో చెప్తాను, వినండి.

ఒక రోజు సాయంకాలం ఆరింటికి, డల్సి తన మెడుల్లా అబ్లాంగేటాలో అంగుళంలో ఆరోవంతు దిగబడేలాగా తన టోపీ పిన్ను గుచ్చుకుంటూ, తనలాగే పనిచేసే అమ్మాయి, తనకి ఎడమపక్కనుండే, తన స్నేహితురాలు సాడీతో అంది కదా–

'సాడీ నీకో సంగతి చెప్పాలి. ఈ రోజు సాయంకాలం నేను పిగీతో డిన్నరుకి వెళ్తున్నాను.'

'నిజ్జంగా!' అరిచినంత పనిచేసింది సాడీ. 'నువ్వెప్పుడూ ఇలా వెళ్ళలేదు కదా! నువ్వెంత అదృష్టవంతురాలివో తెలుసా! పిగీ భలే మనిషి. అతను అమ్మాయిల్ని భలే చోట్లకి తీసుకెళ్తుంటాడు. మొన్నో రోజు బ్లాంచ్‌ని హాఫ్‌మన్ హౌజుకి తీసుకెళ్ళాడు. అక్కడంతా భలే సంగీతం, మొత్తమంతా భలేగా ఉంటుందిలే. నువ్వు భలే మజా చెయ్యబోతున్నావు, తెలుసునా డల్సీ' అని అంది.

డల్సి త్వరత్వరగా ఇంటిబాట పట్టింది. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. తన జీవితంలో– ఇన్నాళ్ళకు యథార్థంగా– ఒక అరుణోదయం ఉదయించబోతున్నట్టుగా ఆమె చెక్కులు ఎర్రబారాయి. ఆ రోజు శుక్రవారం. కిందటి వారం జీతంలో ఆమె దగ్గర యాభై సెంట్లు మిగిలి ఉన్నాయి.

సాధారణంగా ఆ వేళప్పుడు ఉరకలెత్తే జనప్రవాహపు వరదతో వీధులు నిండి ఉన్నాయి. ఎక్కడెక్కడినుంచో, మైళ్ళ దూరం నుంచి, యోజనాల దూరం నుంచి, వందలాది యోజనాల దూరం నుంచి వచ్చి దగ్ధం కావడమెలానో నేర్చుకొమ్మని రెక్కల పురుగులకి చెప్తున్నట్టుగా బ్రాడ్వేలో విద్యుద్దీపాలు ధగధగలాడుతున్నాయి. చక్కగా కత్తిరించి కుట్టిపెట్టిన దుస్తులు తొడుక్కున్న మగవాళ్ళు, పూర్వకాలపు నావికుల ఇళ్ళల్లో కనిపించే నగిషీపనిలాగా చక్కగా తీర్చిదిద్దిన ముఖాల్తో, డల్సీనే తేరిపారచూస్తూ ఉన్నారు. వారిని పట్టించుకోకుండా, ఆమె వడివడిగా, వారిని దాటుకుంటూ ముందుకు పోతున్నది. రాత్రిపూట వికసించే నాగజెముడు పువ్వులాంటి మన్‌హాట్టన్ నగరం అప్పటిదాకా చచ్చుబడ్డట్టు ముడుచుకున్న తన తెల్లని పూలరేకల్ని విప్పారుస్తూ కటువైన పరిమళం వెదజల్లుతున్నది.

చౌకగా సరుకులమ్మే ఒక దుకాణం దగ్గర ఆగి ఆమె తన దగ్గరుండే యాభై సెంట్ల తోటీ ఒక ఇమిటేషను కాలరు కొనుక్కుంది. నిజానికి వేరేవాటిమీద ఖర్చుపెట్ట వలసిన సొమ్ము అది. అందులో పదిహేనుసెంట్లు రాత్రిభోజనానికీ, పదిసెంట్లు మధ్యాహ్నభోజనానికీ పోగా, ఒకటీ అరా పొదుపుచేసుకోవలసి ఉంది కూడా. మామూలుగా అయితే ఇంకో అయిదు సెంట్లతో నోరు తీపి చేసుకోడానికి ఘనమో, ద్రవమో కొనుక్కునేది. ఆ మిఠాయినో లేదా ఆ జీడిపాకమో నముల్తుంటే, పంటినొప్పితో బాధపడుతున్న వాడి బుగ్గల్లాగా, ఆమె బుగ్గలు బాగా ఊరినట్టు, పుష్టిగా కనిపించేవి. అది ఒకరకంగా దుబారాఖర్చునే, ఇంకా చెప్పాలంటే తాగితందనాలాడటం లాంటిదే–కాని అలాంటి చిన్న చిన్న సంతోషాలు కూడా లేకపోతే జీవితానికి అర్థమేముంది?

ఫర్నిచరుతో సహా అద్దెకు దొరికేలాంటి ఒక గదిలో డల్సి నివసిస్తోంది. ఇటువంటి గదుల్లో నివాసానికీ లేదా ఏదన్నా హాస్టల్లో ఉండటానికి మధ్య ఒక తేడా ఉంది. ఇలాంటి గదుల్లో నువ్వు తిండిలేక పస్తుపడుకుంటే ఆ సంగతి మూడో కంటికి తెలీదు.

డల్సి మెట్లెక్కి గదిలో అడుగుపెట్టింది. పడమటి ముఖంగా ఉండే ఇటుకరంగు భవంతిలో మూడో అంతస్థులో ఉండే ఆ గదిలో అడుగుపెట్టి ఆమె గాసు వెలిగించింది. శాస్త్రవేత్తలు వజ్రం అత్యంత దుర్భేద్యమైన పదార్థం అని చెప్తారు. కానీ వాళ్ళకి తెలీదు. ఇలాంటి గదులు అద్దెకిచ్చే యజమానురాళ్ళకి అంతకన్నా దుర్భేద్యమైన పదార్థం గురించి తెలుసు. వాళ్ళు గాసుబర్నర్లలో కుక్కిపెట్టేది దాన్నే. నువ్వు కుర్చీ ఎక్కి మరీ నీ చేతులు ఎర్రబారిపోయి బొబ్బలెక్కేదాకా దాన్ని తవ్వి చూసినా, పొడిచి చూసినా ఆ పదార్థం బయటికి రాదు. జడపిన్నుతో గుచ్చి లాగాలనుకున్నా లాగలేవు. అది నిశ్చలబ్రహ్మ–పదార్థం.

మొత్తానికి, డల్సి గాసు వెలిగించింది. కొవ్వొత్తి వెలుగులో నాలుగోవంతు మాత్రమే ఉన్న ఆ వెలుతురులో మనం ఆమె గదిని పరిశీలనగా చూద్దాం.

ఆ గదిలో, మంచం, పరుపు, డ్రెస్సింగు సామాను పెట్టుకునే చెక్కబీరువా, వాష్ స్టాండు, కుర్చీ– ఈ సామగ్రి వరకూ ఇంటియజమానురాలు మూటకట్టుకున్న పుణ్యం లేదా పాపం. తక్కినవన్నీ డల్సీ సొంతం. ఆ డ్రెస్సింగు బీరువా మీద ఆమె సంపద మొత్తం ఉంది– సాడీ బహుమతిగా ఇచ్చిన ఒక గిల్టు పింగాణి గిన్నె, పచ్చళ్ళ కంపెనీ వాళ్ళ కాలండరు, స్వప్నశాస్త్రాన్ని వివరించే ఒక పుస్తకం, బియ్యప్పిండితో ఉన్న గాజుగిన్నె, గులాబిరంగు రిబ్బనుకు గుచ్చిపెట్టిన నకిలీ చెర్రీలు.

ఆ డ్రెస్సింగు బీరువా మీద గీతలు పడిపోయిన అద్దం పక్కనే జనరల్ కిచ్నరు, మల్లయోధుడు విలియం మల్డూను, దొరసాని మార్ల్‌బరో, ఇటాలియను శిల్పి బెనెవెంటునో చెల్లిని చిత్రపటాలు కూడా ఉన్నాయి. ప్లాస్టరు ఆఫ్ పారిసులో పోతపోసిన బొమ్మ ఒకటి ఒకవేపు గోడకి తగిలించి ఉంది. దానికి రోమను శిరస్త్రాణం కూడా ఉంది. దాని పక్కన ఒక వర్ణచిత్రం. నిమ్మకాయరంగులో ఉన్న పిల్లవాడొకడు ఒక సీతాకోకచిలుకని వేటాడుతున్నట్టున్న హింసాత్మక దృశ్యం అది. చిత్రకళకి సంబంధించి–నంతవరకూ డల్సి అత్యున్నత అభిరుచికి ఆ బొమ్మ నిదర్శనం. ఇప్పటిదాకా ఆ అభిరుచిని ఖండించినవాళ్ళెవరూ లేరు. చోరీకి గురయ్యే శిల్పాల గురించిన వార్తలు ఆమెదాకా రానే రావు. ఇక ఆ పిల్లవాణ్ణి చూసి వాడో పిల్ల కీటకశాస్త్రజ్ఞుడిలా కనిపిస్తున్నాడే అని విమర్శించేవాళ్ళూ ఆమెకి తారసపడలేదు.

ఆమె దగ్గరకి పిగీ ఏడింటికి రానున్నాడు. ఈలోగా ఆమె తయారయ్యేలోపు మనం ఆమె గురించి మరికొంత లోకాభిరామాయణం సాగిద్దాం.

ఈ అద్దె గదికి డల్సి వారానికి రెండేసి డాలర్ల చొప్పున చెల్లిస్తుంది. మామూలు రోజుల్లో పొద్దుటిపూట అల్పాహారానికి రోజుకి పదిసెంట్లు ఖర్చుపెడుతుంది. తాను ఒకవైపు పనిలోకి వెళ్ళడానికి తయారవుతూనే, మరోవైపు గాసులైటుమీద ఒక కోడిగుడ్డు ఉడికించుకుని, కప్పు కాఫీ కాచుకుని తాగుతుంది. ఆదివారం ఉదయాలు బిల్లీస్ రెస్టరెంటులో ఇంత మాంసం కూరా, నాలుగు పండ్లముక్కల్తో మహరాజులాగా విందు ఆరగించి, తనకి హోటల్లో వడ్డించేమనిషికి పదిసెంట్లు టిప్పు కూడా ఇస్తుంది. ఆడంబరంగా జీవించాలనుకుంటే న్యూయార్కు దగ్గర చాలానే ప్రలోభాలున్నాయి. ఆమె మధ్యాహ్నభోజనాలు తన దుకాణం వాళ్ళ రెస్టరెంటులోనే కానిచ్చేస్తుంది. వాటికి వారానికి అరవైసెంట్లు ఖర్చవుతాయి. రాత్రి భోజనాలకి 1.05 డాలర్లు ఖర్చుపెడుతుంది. సాయంకాలం వార్తాపత్రికలకి–అసలు వార్తాపత్రిక చదవకుండా ఉండే న్యూయార్కువాసి ఎవరన్నా ఉంటే చూపించండి!– వాటికి ఆరుసెంట్లు; ఆదివారమొస్తే రెండు పత్రికలు, ఒకటి ఉద్యోగప్రకటనలు చూసుకోడానికీ, రెండోది తీరిగ్గా చదూకోడానికీ, వాటికి పదిసెంట్లు. మొత్తం ఖర్చు 4.76 డాలర్లు. ఇంక అప్పుడప్పుడు కొత్త గుడ్డలు కూడా కొనుక్కోవాలి, కానీ–

ఇంక చెప్పడం నావల్లకాదు. ఆమె కొత్త దుస్తులు కొనుక్కోడానికి బేరసారాలు చేస్తుంటుందనీ, చక్కగా కుట్లూ, అల్లికలూ చేసుకుంటుందనీ విన్నానుగానీ, నాకైతే

నమ్మకం లేదు. సాధారణంగా, స్త్రీలోకం నోచుకునే అలిఖిత, పవిత్ర, సహజ సంతోషాలు డల్సికి కూడా లభ్యమవుతున్నాయని రాయాలని ఉంటుందిగాని, నా కలం మొరా-యిస్తోంది. బహుశా భగవంతుడు ఆ సంతోషాల్ని ఆమె నుదుటిన రాసిపెట్టలేదను కోవాలి. ఆమె జీవితంలో రంగులరాట్నమంటూ ఎక్కింది రెండు సార్లే. ఎవరేనా మామూలుగా ఇన్నేసిగంటలపాటు సంతోషంగా గడిపేరని చెప్పాల్సిన విషయాలు ఎప్పుడో ఒకటీ అరా వేసవికాలాల్లో మాత్రమే గడిపేరని చెప్పాలంటే నీరసమొస్తుంది.

పిగీని వర్ణించడానికి అతని పేరొక్కటీ చాలు. ఆడపిల్లలు అతణ్ణి పిగీ అని పిలుస్తున్నప్పుడు పందులు తమ పవిత్రవంశగౌరవం అప్రతిష్ఠ పాలైనట్టు భావిస్తాయి. నీలం రంగు పాఠ్యపుస్తకాల్లో అక్షరాలూ, పదాలూ నేర్చుకోడం మొదలుపెట్టినప్పుడు, ఆ మూడక్షరాల పదంతోనే పిగీ జీవితకథ మొదలవుతుంది. అతను బాగా కొవ్వుపట్టి ఉంటాడు. ఆత్మమాత్రం ఎలకది. అలవాట్లు గబ్బిలానివి. ఔదార్యం విషయానికొస్తే పిల్లులు గుర్తొస్తాయి. బాగా ఖరీదైన గుడ్డలు తొడుక్కుంటూ ఉంటాడు. తిండిలేక ఆకలితో పస్తులుండే మనుషుల్ని కనిపెట్టడంలో అతడు గొప్ప ప్రావీణ్యం సంపాదించాడు. దుకాణాల్లో పనిచేసే ఏ అమ్మాయినైనా చూసీ చూడగానే ఆమె ఇంత రొట్టే, ఇన్ని టీనీళ్ళూ తాగి ఎన్నాళ్ళయ్యిందో, లేదా ఇంకా చెప్పాలంటే, ఎన్ని గంటలయ్యిందో ఇట్టే చెప్పగలడు. ఎప్పుడూ బజారు వీథులు పట్టుకు వేలాడుతుంటాడు. అక్కడ పనిచేసే ఆడపిల్లల్ని డిన్నరుకి రమ్మని ఊరిస్తూ ఉంటాడు. తమ కుక్కల్తో పాటు వీథుల్లో వాహ్యాళికి పోయే పెద్దమనుషులు అతణ్ణి చూస్తే చాలు ఈసడించుకుంటూ ఉంటారు. మొత్తానికి అతడో రకం. ఇంక అతడి గురించి ఎక్కువ రాయలేను. నా కలం ఉన్నది అటువంటి వాళ్ళ గురించి రాయడానికి కాదు. నేనేమీ వడ్రంగిని కాను.

ఏడుగంటలవడానికి ఇంకో పదినిమిషాలుండగానే డల్సి తయారైపోయింది. గీతలు పడ్డ ఆ మసకటద్దంలోనే ఆమె తనని తాను చూసుకుంది. తన ప్రతిబింబం తనకే సంతృప్తికరంగా కనిపించింది. చిన్నపాటి ముడత కూడా లేకుండా, ఆ ముదురునీలం రంగు డ్రెస్సు, సరిగ్గా పట్టినట్టుంది. నెత్తిమీద టోపీ, దానికొక సొగసైన ఈక, చేతికి తొడుక్కున్న గ్లోవులు కొద్దిగా మాసినట్టున్నాయిగాని-మొత్తం మీద ఆ వేషం చూస్తే, ఆమె ఒక ఆత్మపరిత్యాగిలాగా, ఆమాటకొస్తే, ఆకలిదప్పులు కూడా త్యాగం చెయ్యగలిగే-దానిలానే కనిపిస్తుంది.

తాను అందంగా ఉన్నానన్న ఊహ ముందు డల్సి తక్కినవన్నీ ఒక క్షణం పాటు మర్చిపోయింది. జీవితం తన రహస్యమైన ముసుగుని తనకోసం ఒకింత తొలగించి ఏవో అద్భుతాలు చూపించబోతున్నట్టే ఉంది. తళతళ్ళాడే ఒక వైభవోజ్జ్వల ప్రపంచంలోకి ఆమె ఇప్పుడు కొన్నిక్షణాలేనా అడుగుపెట్టబోతున్నది.

పిగీ డబ్బులు ఖర్చుపెట్టడానికి వెనకాడడనే అమ్మాయిలు చెప్తుంటారు. అతడితో వెళ్తే, ఆ డిన్నరు గొప్పగా ఉంటుందనీ, చక్కటి సంగీతమూ, చూడచక్కగా ఉండే మహిళలూ, అక్కడ దొరికే తిండీ లాంటి వాటి గురించి చెప్తున్నప్పుడు ఆ అమ్మాయిలకి నోరూరిపోతూ, చెప్పడం కష్టమయిపోయేది. సందేహం లేదు, అతడు తనని కూడా మళ్ళీ మళ్ళీ అలాంటి డిన్నర్లకి రమ్మంటూనే ఉంటాడు.

నీలం రంగు సూటు ఒకటి ఆమెకి ఒక దుకాణంలో షోకేసులో కనిపించింది. వారానికి పదిసెంట్లు చొప్పున కాకుండా ఇరవై సెంట్లు చొప్పున ఆదాచేసుకుంటూ పోతే– ఎన్నాళ్ళు పడుతుంది– ఓహ్– కొన్నేళ్ళు పడుతుంది అది కొనాలంటే! కాని ఏడో వీథిలో ఒక సెకండుహేండు దుస్తుల దుకాణం ఉందే, అక్కడైతే–

ఇంతలో ఎవరో తలుపు తట్టారు. డల్సి తలుపు తెరిచింది. కృత్రిమంగా నవ్వుతూ ఇంటియజమానురాలు గుమ్మం దగ్గర ప్రత్యక్షమైంది. డల్సి వంటగాసు మరీ ఎక్కువ వాడేస్తోందా చూద్దాం అన్నట్టు ముక్కు ఎగబీలుస్తూ.

'కింద నీకోసం ఎవరో పెద్దమనిషి ఎదురుచూస్తున్నాడు' అన్నది ఆమె. 'అతడి పేరు విగ్గిన్స్ అంట.'

తన పట్ల గౌరవం చూపించే దురదృష్టవంతులకి అతడు ఆ నామవాచకంతోటే పరిచయమవుతాడు.

తన జేబురుమాలు కోసం డల్సి డ్రెస్సింగు టేబులు వేపు తిరిగి, ఒక క్షణం నిశ్చేష్టురాలిగా నిలబడిపోయి, తన కిందిపెదవి బలంగా కొరుక్కుంది. అద్దంలో చూసినప్పుడు, తాను, సుదీర్ఘనిద్రనుంచి అప్పుడే మేల్కొన్న, ఒక మాంత్రికలోకపు రాకుమారిని చూసింది. ఆ సమయంలో, తన అందమైన, గంభీరమైన, కించిద్విషాద–భరిత నయనాల్తో ఒకే ఒక్కరు తనని చూస్తున్నారని మర్చిపోయింది. ఆమె ఏమి చేసినా దాన్ని అంగీకరించ– డానికో లేదా అభిశంసించడానికో సమర్థులైన ఒకే ఒక్కరు.

ఆ డ్రెస్సరు మీద ఉన్న గిల్టుఫొటో ఫ్రేములోంచి, జనరల్ కిచ్నర్, సన్నగా, పొడుగ్గా, తన సుందర, విచారభరిత వదనం మీద కదలాడుతున్న అద్భుత నేత్రాల్తో నిందాపూర్వకంగా ఆమెనే చూస్తున్నాడు.

తనంతటతనే తిరిగే మరబొమ్మలాగా డల్సి ఇంటియజమానురాలివేపు తిరిగింది

'నేను రాలేనని చెప్పండి' అంది నీరసంగా. 'నాకు ఒంట్లో బాలేదనో, ఏదో ఒకటి చెప్పండి. నేను బయటకు వెళ్ళాలనుకోటం లేదని చెప్పండి.'

తలుపు మూసేసి లోపల గడియ పెట్టేసాక, డల్సి మంచం మీద వాలిపోయి, టోపీ చేతుల్లో నలిపేసుకుంటూ, పదినిమిషాల పాటు భోరున ఏడ్చింది. అక్కడ, అప్పుడు, జనరల్ కిచ్నర్ ఒక్కడే ఆమె స్నేహితుడు. డల్సి కలగనే ఆదర్శసాహసవీరుడు అతడు మాత్రమే. అతడి చూపులు చూస్తుంటే, అతడికి ఎవరితోనూ పంచుకోలేని ఏదో రహస్య దుఃఖం ఉన్నదా అన్నట్టూ, అద్భుతమైన అతడి మీసం ఒక స్వప్నమన్నట్టూ కనిపిస్తున్నాడు. అతడి కళ్ళల్లో కనిపించే ఆ సుకోమలమైన, కానీ గంభీరమైన ఆ దృక్కులంటే ఆమెకి ఒకింత భయం కూడా. అతడు ఎప్పుడో ఒకప్పుడు తన ఇంటి తలుపు తడతాడనీ, అతడి కృపాణం ఎత్తైన అతడి బూట్లకి తగులుకుంటూ చప్పుడు చేస్తుండగా, తనంతట తనే వచ్చి ఆమెని వరిస్తాడనీ, ఆమెకేవో చిన్నపాటి ఊహాగానాలుండేవి. ఒకసారి ఎవరో ఒక పిల్లవాడు దీపస్తంభానికి ఏదో గొలుసు రాపాడిస్తున్న చప్పుడు విని ఆమె కిటికీ తలుపు తెరిచి చూసింది. కాని ఏం లాభం! ఎందుకంటే అప్పుడు జనరల్ కిచ్నర్ ఎక్కడో దూరంలో, జపానులో ఉన్నాడనీ, తన భీకరసైన్యంతో తురుష్కుల మీద దండయాత్ర చేస్తున్నాడనీ, అతడు తన గిల్టు ఫ్రేములోంచి ఎప్పటికీ ఆమెకోసం బయటకి రాడనీ ఆమెకు తెలుసు. అయినప్పటికీ అతడి ఒక్క చూపు ఆ రాత్రికి పిగీని పక్కకు నెట్టిపారేసింది. అవును. ఆ రాత్రికి.

ఏడుపైపోయాక డల్సీ లేచి తాను అంతదాకా తొడుక్కున్న దుస్తులు విప్పి పక్కన పెట్టేసి, తన నీలం రంగు పాత గౌను తొడుక్కుంది. ఆ రాత్రికి ఆమెకింక భోజనం చెయ్యాలనిపించలేదు. తనకిష్టమైన సినిమాపాట రెండు చరణాలు కూనిరాగం తీసింది. తన ముక్కుమీద ఎర్రని దద్దురు కనిపిస్తే దాన్ని పరీక్షగా చూసుకుంది. ఆ పరిశీలన పూర్తయ్యాక, కోళ్ళు సరిగ్గా లేక ఊగుతున్న టేబులుకి దగ్గరగా కుర్చీ లాక్కుని పాత పేకముక్కలు తీసుకుని తన అదృష్టం ఎలా ఉందో చూసుకోబోయింది.

'ఎంత దారుణం? ఎంత అవమానకరం!' అని గట్టిగా అనుకుంది 'అదీకాక నేను తనతో వస్తానని మాటివ్వలేదే, అసలు అలాంటి ఊహలు కలిగేలాగా వాణ్ణెప్పుడూ చూడను కూడా చూడలేదే!'

తొమ్మిదింటికి ఆమె తన ట్రంకుపెట్టెలోంచి కేకులూ, జామూ బయటకి తీసి, వాటితో విందు భోజనం ఆరగించింది. ఒక కేకుకి కొంత జాము రాసి జనరల్ కిచ్నర్‌కి నైవేద్యం సమర్పించింది. కాని జనరల్ చూపులు చూస్తుంటే మటుకు– స్ఫింక్సు మహావిగ్రహం ఒక సీతాకోక చిలుకని చూసినట్టు చూస్తున్నాడు– కాకపోతే ఎడారుల్లో కూడా సీతాకోక చిలుకలుండాలనుకోండి.

'నీకు తినాలని లేకపోతే తినకు' అంది డల్సి. 'అంతే తప్ప మరీ అలా గొప్పలు పోతూ, నీ చూపుల్తో నా మీద విరుచుకుపడకు. నువ్వు కూడా వారానికి ఆరుడాలర్ల మీద బతకాల్సి వస్తే, నువ్వు నిజంగా ఇంత గొప్పలు పోయేవాడివా, ఇంత విసుగ్గా మొహం పెట్టేవాడివా అనిపిస్తుంది నాకు.'

కాని జనరల్ కిచ్నర్ పట్ల మరీ అంత కోపం చూపించడం డల్సీకి సంతోషం కాదు. అందుకని ఆమె బెనువెనుటో చెల్లినీ ముఖాన్ని ఒకింత కినుకతో కిందకు వంచేసింది. ఆ పనిచేసినందుకు ఆమెకేమీ బాధలేదు. ఆమె దృష్టిలో చెల్లినీ ఎనిమిదో హెన్రీ లాంటివాడే. కాబట్టి అతడంటే ఇష్టం లేదు.

తొమ్మిదిన్నరకి డల్సి డ్రెస్సరు మీద ఉన్న చిత్రాలన్నిటినీ చివరగా ఒక సారి చూసి, దీపం ఆర్పేసి, దుప్పటి ముసుగుదన్నింది. జనరల్ క్రిచ్నర్‌కీ, విలియం మల్డూన్‌కీ, దొరసాని మాల్‌బరోకీ, బెనెవెనుటో చెల్లినీకి గుడ్‌నైట్ చెప్తూ నిద్రలోకి జారుకోడం మామూలు విషయం కాదు.

ఈ కథ ఇంతకుమించి ముందుకు నడిచేది కాదు. ఒకవేళ మళ్ళా ముందుకు నడిచినా, అదంతా మళ్ళా మామూలుగా జరిగేదే. పిగీ మళ్ళా డల్సీని తనతో పాటు డిన్నరుకి రమ్మని పిలవడం, ఎప్పట్లానే ఆమెకి తాను ఒంటరినని అనిపించడం, జనరల్ క్రిచ్నర్ మళ్ళా ఆమెని అదోలా చూడడం, అప్పుడు–

ముందుముందు బాగా వృద్ధిలోకి రాబోతున్న భూతాల గుంపు పక్కన నిలబడ్డట్టు కలగన్నానని చెప్తున్నాను కదా, అప్పుడొక పోలీసు నన్ను తన రెక్కతో పట్టుకుని నేను కూడా వాళ్ళల్లో ఒకణ్ణా అనడిగాడు.

'వాళ్ళెవరు' అనడిగాను.

'బతకడానికి వారానికి అయిదో ఆరో డాలర్లు జీతమిచ్చి ఆడపిల్లల్ని పనిలోకి తీసుకునే పెద్దమనుషులు వాళ్ళు. నువ్వు కూడా ఆ బాపతేనా?' అనడిగాడు ఆ పోలీసు.

'కాదు, మహాప్రభో, ఎంత మాత్రం కాదు' అన్నాను. 'నేను కేవలం అనాథ శరణాలయాలకు నిప్పటించే మనిషిని లేదా గుడ్డివాడిదగ్గరుండే చిల్లరనాణేల కోసం వాణ్ణి చంపేసే రకాన్ని మాత్రమే' అని జవాబిచ్చాను.

◆

వాడ్రేవు చినవీరభద్రుడు

నన్ను వెన్నాడే కథలు

దేశవిదేశ సాహిత్యాలనుంచి

◎

పందొమ్మిదో శతాబ్ది మధ్యకాలం నుండీ, ప్రపంచమంతా వికసిస్తూ వస్తున్న ఆధునిక కథ, సాహిత్య ప్రక్రియల్లో, మరీ ఇటీవలిది. కాని, కవిత్వంకన్నా, నవలకన్నా, నాటకంకన్నా కూడా ఎక్కువ జనాదరణ పొందింది. అటువంటి ఆధునిక కథల్లో, ప్రపంచసాహిత్యాల అనువాదాల నుంచి, నలభయ్యేళ్ళ కింద, తాను చదివిన కథల్లో తననిప్పటికీ వెన్నాడుతున్న ఇరవై కథల్ని వాడ్రేవు చినవీరభద్రుడు ఈ పుస్తకం ద్వారా పరిచయం చేస్తున్నారు. ఇందులో నాలుగు కథలు ఈ పుస్తకం కోసం ఆయన ప్రత్యేకంగా అనువదించారు. కథల్ని ఇష్టపడే పాఠకులకి ఇందులో ప్రతి ఒక్క కథా మరపురాని కథగా మిగిలిపోతుందనీ, సిద్ధహస్తులైన కథకులకీ, కొత్తగా కథలు రాసేవాళ్ళకీ కూడా ఇందులో ప్రతి ఒక్క కథా ఒక పాఠంగా ఉపకరిస్తుందని మా నమ్మకం.